# నిశ్శబ్ద విస్ఫోటనం



*Gripping - Compelling - Phenomenal*

## యండమూరి వీరేంద్రనాథ్

# యండమూరి వీరేంద్రనాథ్


# నిశ్శబ్ద విస్ఫోటనం


## నవసాహితి బుక్‌హౌస్

ఏలూరు రోడ్ • విజయవాడ-520 002.

**NISSABDHA VISPOTANAM**

*By :*
**YANDAMOORI VEERENDRANATH**
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
**HYDERABAD - 500 034.**
**Ph : 924 650 2662**
yandamoori@hotmail.com

**SARASWATHI VIDYA PEETAM,**
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G. Dist. (A.P.)

*First Edition* : **January, 2021**

*Publishers :*
**NAVASAHITHI BOOK HOUSE**
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
navasahithiravi@gmail.com

*Printers :*
**Nagendra Enterprises**
Vijayawada-3, Ph : 2435115.

*Price :*
**₹ 150/-**

## మీ అభిమాన రచయిత
# యండమూరి వీరేంద్రనాథ్ రచనలు

### నాన్‌ఫిక్షన్

1. పిల్లల పెంపకం ఒక కళ
2. సమస్యలు - పరిష్కారాలు
3. వెలుగు వెన్నెల దీపాలు
4. ప్రేమ ఒక కళ
5. లోయ నుంచి శిఖరానికి
6. బేతాళ ప్రశ్నలు
7. ఇడ్లి-ఆర్కిడ్-ఆకాశం
8. తప్పు చేద్దాం రండి!
9. విజయానికి ఆరోమెట్టు
10. విజయ రహస్యాలు
11. చదువు - ఏకాగ్రత
12. మైండ్ పవర్ నెం.1 అవడం ఎలా?
13. విజయానికి ఐదు మెట్లు
14. విజయంలో భాగస్వామ్యం
15. విజయంవైపు పయనం
16. మీరు మంచి అమ్మాయి కాదు
17. మిమ్మల్ని మీరు గెలవగలరు
18. మిమ్మల్ని మీ పిల్లలు ప్రేమించాలంటే?
19. గ్రాఫాలజీ
20. పాపులర్ రచనలు చేయడం ఎలా?
21. మంచి ముత్యాలు (Quotations)
22. పిల్లల పేర్ల ప్రపంచం
23. పడమటి కోయిల పల్లవి (Poetry)
24. మంచు పూల వర్షం (సుభాషితాలు)
25. నేనే నీ ఆయుధం

### ఫిక్షన్

26. నిశ్శబ్ద విస్ఫోటనం
27. దిండు క్రింద నల్లత్రాచు
28. డేగ రెక్కల చప్పుడు
29. వీళ్ళని ఏం చేద్దాం?
30. రెండు గుండెల చప్పుడు
31. ఒక వర్షాకాలపు సాయంత్రం
32. సిగ్గేస్తోంది
33. అంకితం
34. మరో హిరోషిమా
35. ప్రేమ
36. అనైతికం
37. ధ్యేయం
38. ది డైరీ ఆఫ్ మిసెస్ శారద
39. ప్రియురాలు పిలిచె
40. వెన్నెల్లో ఆడపిల్ల
41. మంచుపర్వతం
42. భార్యా గుణవతి శత్రు
43. నల్లంచు తెల్లచీర
44. స్వరభేతాళం
45. సంపూర్ణ ప్రేమాయణం
46. కాసనోవా 99
47. అంతర్ముఖం
48. డబ్బు మైనస్ డబ్బు
49. స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్
50. చీకట్లో సూర్యుడు
51. డబ్బు టు ది పవరాఫ్ డబ్బు
52. ఆనందో బ్రహ్మ
53. అష్టావక్ర
54. చెంగల్వ పూదండ
55. దుప్పట్లో మిన్నాగు
56. యుగాంతం
57. ఋషి
58. నిశ్శబ్దం - నీకూ నాకూ మధ్య
59. తులసిదళం
60. తులసి
61. అతడే ఆమె సైన్యం
62. 13-14-15
63. అతడు ఆమె ప్రియుడు
64. లేడీస్ హాస్టల్
65. అగ్ని ప్రవేశం
66. రుద్రనేత
67. రాక్షసుడు
68. ఆఖరిపోరాటం
69. మరణ మృదంగం
70. ప్రార్థన
71. అభిలాష
72. రక్తసిందూరం
73. థ్రిల్లర్
74. వెన్నెల్లో గోదారి
75. పర్ణశాల
76. ఒకరాధ ఇద్దరు కృష్ణులు
77. బెస్ట్ ఆఫ్ వీరేంద్రనాథ్ (కథలు)
78. రాధ-కుంతి "
79. క్షమించు సుప్రియా! "

### ఇంగ్లీషు

80. Developing Right Brain
81. Secret of Success
82. The Art of Studying
83. Five Steps to Success

# SELF DEFENCE

కోట్లు ఖరీదు చేసే కార్లు నాలుగు ఉన్నవాడు బయటకు చూపించుకోడు. కొత్తగా కొనుక్కున్నవాడు పది మందికీ ప్రదర్శిస్తాడు. ఆ విధమైన పాండిత్య ప్రకర్ష... అంటే... అవసరం ఉన్నా లేకపోయినా సంస్కృత పదాలూ, సమాసాలూ ఈ రచనలో ఎక్కువ కనపడతాయి. తెలుగు రాకపోవటం వల్ల వచ్చిన ఆత్మన్యూనతని కప్పిపుచ్చుకునే ప్రయత్నం ఇది. అప్పుడప్పుడు కథలోంచి పక్కకి పోయే వైనం కూడా విశ్వనాథవారిని చూసి వాతలు పెట్టుకున్న నక్క లక్షణమే.

Secondly, I incorporated personality development tips, reasonable arguments, politics, how mafia acts in our country etc to educate our young readers. దీనికి మాత్రం సహేతుకమైన కారణం ఉన్నది. Many students do not know the boundaries of our country. స్టూడెంట్సు ఈ పుస్తకం చదువుతారా అంటే అది వేరే సంగతి. ఇవన్నీ కథా గమనానికి పంటి కింద రాళ్ళలా అడ్డు పడతాయని తెలిసీ అలాగే ఉంచాను. You must bear with me for this.

నా రచనల్లో సాధారణంగా కనపడే హీరోయిన్ తెలివికి మరింత పదును పెట్టి, మామూలు కథకి చెమక్కులు అద్ది ఈ నవల వ్రాయటం జరిగింది. అవన్నీ తీసేస్తే, సాహితీ విలువలు ఏమీ లేని కథ ఇది. కాస్త విలువలున్న పుస్తకాలు కూడా ఒకటి రెండు వ్రాశాను కాబట్టి (కనీసం వాటికి విలువలున్నాయని నా ఉద్దేశ్యం) 'వాటికన్నా ఇలాంటి పాపులరు పుస్తకాలు వ్రాయటమే కష్టం' అని అంటే విమర్శకులు విరుచుకు పడతారు కానీ, మనసుకి నచ్చినట్టూ వ్రాసుకుంటూ పోవటం కాకుండా, చదివేవారికి సంతృప్తిని ఇచ్చేలా (నాటకీయత, పాత్ర పోషణ, రసానుభూతి, గ్రాఫు, క్లైమాక్సు... అన్నీ సరి చూసుకుంటూ) కమర్షియల్‌గా వ్రాయటమే కష్టం అని నా ఉద్దేశ్యం.

గతపు రచనలకి భిన్నంగా 'గోయింగ్ విత్ ట్రెండ్' శ్రుతి మించని కాస్త ద్వంద్వార్థం మాటలూ, శృంగారం కూడా కనిపిస్తాయి.

లాల్ బహదూర్ శాస్త్రి రష్యాలో హృద్రోగంతో మరణించినప్పుడు, పక్కగదిలోనే ఉన్న శాస్త్రి వ్యక్తిగత వైద్యుడు ఆర్.ఎన్. చుగ్ కి సోవియట్ అధికారులు ఆయన

మరణించాక ఆ విషయం చెప్పారు. శాస్త్రి మరణంపై దర్యాప్తుకు నియమించిన కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు డాక్టర్ చుగ్ వెళ్తూండగా ఆయన కారుని ఓ లారీ ఢీ కొట్టి ఆయన అక్కడికక్కడే మరణించారు. ఆయన్తో పాటు తాష్కంద్ వెళ్ళిన వ్యక్తిగత సేవకుడు రామ్‌నాథ్ కూడా, వాంగ్మూలం నమోదుకు వెళ్తూండగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టి, తలకు బలమైన గాయాలై గతాన్ని మర్చిపోయారు. దీనిపై కేంద్రం నియమించిన రాజ్‌నారాయణ్ కమిటీ నివేదికని కావాలనే మరుగున పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి.

తన అణుకార్యక్రమాన్ని నిలిపేయడానికి భారత దేశం అంగీకరించక పోవటం, పాక్‌పై విజయానికి చేరువలో ఉండటం, భారత ప్రధానిపై అమెరికన్ సి.ఐ.ఎ పగ పెంచుకోవడానికి రెండు కారణాలని కొందరి అనుమానం.

ఆ రోజుల్లో సి.ఐ.ఎ. డైరెక్టర్ రాబర్ట్ క్రోలీ (తన మరణానంతరమే ఇంటర్వ్యూను ప్రచురించాలన్న షరతుపై) ఒక జర్నలిస్ట్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, శాస్త్రిగారితో పాటు Father of the Indian nuclear programme డాక్టర్ హోమీబాబా మరణాలకు సి.ఐ.ఎ కారణమని వెల్లడించారు. శాస్త్రి (హృద్రోగం), హోమీబాబా (విమాన ప్రమాదం) మరణాలు ఒకే నెల్లో జరిగాయి. పై రెండు సంఘటనల్లో వాస్తవమెంతో తెలీదు కానీ, నిశ్శబ్ద విస్ఫోటనం కథలో కొన్ని సంఘటనలు దీనికి దగ్గరలో ఉంటాయి.

ఈ నవలకి బొమ్మలు వేసిన మిత్రుడు S.B. శంకర్ కుమార్ (శంకు), తెలుగులో తొలి Paid వెబ్-సీరియల్‌గా ప్రచురించిన మల్లికార్జునరావు, VVR. కిషన్, ఎప్పుడు ఫోన్ చేసినా విసుక్కోకుండా లీగల్ మాటర్స్, సాహితీపరమైన అనుమానాలు క్లారిఫై చేసిన రావులపాటి సీతారామారావు (IPS Retd/ ప్రముఖ రచయిత), S. గోపాల్ సింగ్ (లాయర్/P.P), సాహిత్యానికి సంబంధించినంత వరకూ నడిచే ఎన్-సైక్లోపీడియా శ్రీ కృష్ణమోహన్, ప్రభంధ రచనల విశ్లేషకుడు బాలాంత్రపు రమణ, భారత జానపద కథల ఆచార్య జయదేవ్, స్ఫూర్తిపథం రచయిత బి.యస్. శర్మ, ప్రముఖ రచయిత్రి బలభద్రపాత్రుని రమణి, భమిడిపాటి వైదేహి, సి.వి.ఎల్.... ఇంకా ఎందరో... అందరికీ కృతజ్ఞతలు.

చివరగా... విస్ఫోటనం అన్న పదం తెలుగులో లేదు. విస్ఫోటం. అంతే. కాస్త వ్యావహారికం చేశాం.

**- యండమూరి వీరేంద్రనాథ్**

## సంక్రాంతి

పచ్చచీర కట్టుకున్న ప్రకృతమ్మ హేమంతానికి వీడ్కోలు చెపుతోంటే, తెల్లరైక తొడిగిన మల్లెరెమ్మ గ్రీష్మానికి స్వాగతం పలుకుతోంది. కాలాన్ని కట్టేసి నిదురోయిన సెలయేటిని పల్లె పడుచులు కడవలతో తట్టి లేపుతున్నారు. వెన్నెల్ని పక్కేసి నిదురోయిన ప్రకృతిని, సూరీడు ప్రత్యూష కిరణాలతో కొంటెగా కవ్విస్తున్నాడు.

ప్రొద్దున్న ఆరయింది.

"పండగ పూట ట్యూషను ఏమిటి నాన్నా? అదీ ఇంత ప్రొద్దున్నే" తండ్రికి కండువా అందిస్తూ అన్నది వేదరవళి.

"చదువుకు పండుగ ఏమిటమ్మా? చదువే ఒక పండుగ. 'ప్రొద్దున్నే వస్తాను. తయారుగా ఉండండి' అని నిన్నటి రోజే పిల్లలకి చెప్పాను. ముగ్గుల పండగ రోజు మూడు ముక్కలు చదివితే ఈ ముత్తయిదు పిల్లలకి మంచిదేగా" అన్నాడు యజ్ఞవల్క్యశాస్త్రి.



"ముత్తైదు పిల్లలా... నీకు మరీ... "

"మతిచెడి మాట్లాడుతున్నా అంటున్నావా? ప్రాస కోసం అనుకుంటున్నావా?"

"ప్రొద్దున్నే ఏడిపించకు నాన్నా... ప్లీజ్"

ఆయన నవ్వి, "ముత్త అంటే వృద్ధ అని అర్థం. ముత్తైదువ అంటే పూలు, గాజులు, మట్టెలు, మంగళ సూత్రాలు, పసుపు కుంకుమలనే అయిదు శుభలక్షణాలని కలిగిన వృద్ధ స్త్రీ అని అర్థం. అదే విధంగా చదువు, జ్ఞానమూ, తెలివి, హేతువూ, వినయమూ అనే అయిదు లక్షణాలని విద్యార్థి సుసంపన్నం చేసుకోవాలన్న కాంక్షతో ఆ మాట అన్నానమ్మా" అన్నాడు.

ఎక్కడ అవకాశం దొరికినా ఎప్పుడు సమయం లభించినా, తనకి తెలిసింది కూతురుకి చెప్పటం ఆయన అలవాటు. అప్పుడప్పుడు అది ఆమెని ఇబ్బంది పెట్టే వ్యవహారమే కానీ, ఆ జ్ఞానమే భవిష్యత్తులో ఆమెని కవచంలా కాపాడి, ప్రతిపక్ష రణదక్ష వక్ష విచ్ఛేదనా దక్షతకు తోడ్పడింది

# 1

**"ఈ రోజు** పండగ" అన్నాడు మీసాల్రాజా.

"అవును" అన్నారు మిగతా ముగ్గురూ.

"ఉగాది"

"కాదు గురూ. సంక్రాంతి" సరిదిద్దాడు ప్రభు.

"ఓకే. ఏదైనా పండగ పండగే. పండగ మీద నేనో కవిత చెపుతా" అని గట్టిగా దమ్ము పీల్చి, "చేతిలో సిగరెట్టు ఉండగా – అగ్గిపుల్ల చివర్లో మండగా – పొలాల నిండుగా – సంక్రాంతి పండగ" అన్నాడు.

మిత్రబృందం ముగ్గురూ చప్పట్లు కొట్టారు. "రాజా కవిత. మడత కాజా" అన్నాడు అంజి. గోవిందు విజిల్ వేశాడు.

కార్లో ఉన్న నలుగురుకీ వంటి మీద స్పృహ లేదు. ముందురాత్రి రాజధాని నగరంలోని అయిదు నక్షత్రాల హోటల్లో తెల్లవారే వరకూ తాగారు. ఇంకో కొన్ని గంటల్లో సూర్యుడు ఉదయిస్తాడనగా "బోరు కొడుతోంది. పల్లెకు పోదాం" అన్నాడు మీసాల్రాజా.

మిగతావారికి అర్థం కాలేదు.

"రేపు సంక్రాంతి పండగ... " అంటూ వాచీ చూసుకుని, "సారీ. అర్ధరాత్రి దాటింది కదూ. ఈ రోజే పండగ. ఆదిత్యపురం మనకి ఎనభై కిలోమీటర్లు. అక్కడికి వెళ్లేసరికి తెల్లారుతుంది. ముగ్గులేసే ఆడాళ్ళని చూస్తూ అక్కడ ఆఖరి పెగ్ పూర్తి చేస్తే పండగ వెరైటీగా ఉంటుంది" అన్నాడు.

మీసాల్రాజా ముఖ్యమంత్రికి బావమరిది. అంజి, గోవిందు, ప్రభు... ముగ్గురూ అతడి మీద పడి బ్రతికే కోటరీ. అతడు చెప్తే కాదనేది ఎవరు?

ఆ విధంగా ఆ చతుష్టయం అర్ధరాత్రి పల్లెకి బయల్దేరారు. రాజా చీపురు పుల్లలా సన్నగా ఉంటాడు. రవ్వంత తెలివి ఉన్నోడికి వేపకాయంత వెర్రి కూడా ఉంటుందంటారు. మొదటిది ఉన్నదో లేదో గానీ రెండోది మాత్రం పుష్కలంగా ఉన్నది రాజాకి. సాధారణంగా యువకులందరూ హీరోలా ఉండటానికి ప్రయత్నం చేస్తే, అతడు విలన్లా కనపడాలని అనుకుంటాడు. అందుకోసం మీసాలు పెంచాడు. ఆ విధంగా మీసాల్రాజా అన్న పేరు ఖరారయింది.

ఆదిత్యపురం చేరుకోవటానికి నాలుగు గంటలు పట్టింది.

"కొద్దిసేపట్లో తెల్లారబోతోంది. అరగంటలో మనం పల్లెలోకి ప్రవేశిస్తున్నాం. ఆడాళ్ళు వీధిలో ముగ్గులేస్తూ ఉంటారు. మీలో ఒకడు కారు స్పీడుగా నడపాలి. మరొకడు వెనుక సీట్లోంచి ఇంట్లోకి బాటిల్ విసరాలి. అది ఎవరింటి వసారాలోకైనా వెళ్లి పడి బ్రద్దలైతే, ఈ రాత్రికి అనురాధ వాడిది. పడనివ్వకుండా కారు నడిపితే అలా నడిపినోడిది. ఒక్కోరికీ అయిదు బాటిల్స్ కోటా. అదీ పందెం. ఓకేనా?"

'ఓకే' అన్నారు ముగ్గురూ.

"కొట్టినవాడిది అనూరాధ. కొట్టకపోతే అది నీబాధ" అన్నాడు రాజా. ముగ్గురూ మళ్ళీ చప్పట్లు కొట్టారు.

ఏదైనా ఒక విద్య నరాల్లో జీర్ణించుకుపోవటాన్ని 'వెన్నతో పెట్టిన విద్య' అంటారు. పూర్వపు రోజుల్లో శరీరం మెరుపు కోసం పిల్లలకి వెన్నతో నలుగు పెట్టేవారట. అందుకే దానికి ఆ పేరు వచ్చింది. ఎటువంటి అమ్మాయినైనా అయిదు నిముషాల్లో పడేయటం అంజికి మందుతో పెట్టిన విద్య. చూడటానికి దరిద్రంగా ఉంటాడు కానీ, ఏదో ఒక రకంగా మాట కలిపి గెస్ట్ హవుసుకి తీసుకొస్తాడు. ఆ పై నలుగురూ కలిసి నాలుగు రోజులు అనుభవించి వదిలేస్తారు.

కొందరమ్మాయిలు ప్రతిఘటిస్తారు. రెండ్రోజులు ఆకలితో కడుపు మాడిస్తే వప్పుకుంటారు. లేదా బలవంతంగా మందు తాగించి నగ్నంగా ఫోటోలు తీస్తారు. పరువు పోతుందని చాలామంది రిపోర్టు ఇవ్వరు. ఇచ్చినా, కేసుల నుంచి తప్పించటానికి సి.ఎం. సలహాదారు చాణుక్య ఉన్నాడు.

సినిమా వేషాల కోసం రెండ్రోజుల క్రితం నగరం వచ్చి రైల్వే ప్లాట్-ఫాం మీద బిత్తరచూపుల్తో నిలబడి ఉన్న అనురాధ అనే అమ్మాయిని అలా మాయమాటలు చెప్పి రూముకి తీసుకొచ్చి పడేశాడు అంజి. ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా దార్లో కొస్తోంది. మీసాల్రాజా పందెం కాసింది ఆ అమ్మాయినే. ఆ రాత్రికే అరంగేట్రం. అందుకే అందరూ హుషారుగా ఉన్నారు.

* * *

సంక్రాంతి హడావుడి మొదలైంది.

బుడబుక్కలవారు వృత్తిరీత్యా కాటికాపర్లు. ఉత్తరదిక్కు నుంచి ఊరిలోకి ప్రవేశిస్తున్నారు. దక్షిణం నుంచి జంగం దేవరలు రంగప్రవేశానికి అంగలేస్తున్నారు. కోసెడు దూరం నుంచీ హరిదాసు కీర్తన వినిపిస్తూంది. ప్రాతఃకాల పక్షుల కిలకిలలు మొదలై నాలుగు ఘడియలు దాటింది. ముగ్గుల మధ్యలో ముద్దుగుమ్మలు ముద్దబంతులనీ, పూబంతులు చామంతులనీ అమరుస్తున్నారు. పిల్లలు గొబ్బెమ్మలను గుమ్మడి పూలతో అలంకరిస్తున్నారు.

గొబ్బి అన్న వ్యావహారికం 'గోపి' అనే సంస్కృత పదం నుంచి వచ్చినది. గొబ్బెమ్మ సాక్షాత్తూ గౌరీ స్వరూపం. 'లోకజనని' అని కూడా పిలుస్తారు. గొబ్బిని ఆవుపేడతో మాత్రమే చేయాలి. పసుపు కుంకుమలతో, రంగురంగుల పూరేకులతో అలంకరించిన ఈ గొబ్బెమ్మలను, కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలుగా పరిగణిస్తారు. మధ్యలో ఉంచే గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. పాడుతూ చుట్టూ తిరిగే బాలికలంతా కృష్ణతత్వం అలవడాలని ప్రార్థించే భక్తురాండ్రు.

శాస్త్రి ట్యూషనుకి బయలుదేరుతూ, "వెళ్ళొస్తానమ్మా. చెల్లి ఇంకా లేవలేదు. ఒంట్లో బావోలేదా?" అని అడిగాడు.

"అధర్వణ రాత్రి అసలు నిద్రపోలేదు నాన్నా. అర్ధరాత్రి పెరట్లోకి వెళ్లి కూర్చుంటానని పేచీ. సర్ది చెప్పి తీసుకొచ్చేసరికి తెల్లారిపోయింది. ఇక ఆ తరువాత ముగ్గులు..."

"మెదడు ఎదగని ఆ పిల్లని కన్నతల్లి కూడా నీ అంత బాగా చూసుకుని ఉండేది కాదమ్మా" అంటూ ఏదో చెప్పబోయి మనసు మార్చుకుని "వెళ్లొస్తాను" అంటూ బయల్దేరాడు.

తలుపులు మూయటం కోసం ముఖద్వారం వరకూ తండ్రి వెనుకే వచ్చింది రవళి. మెట్లు దిగుతూన్న యజ్ఞవల్క్యుడు ఇంటి ముందున్న మనోజ్ఞ మనోహరమైన రంగవల్లుల్ని చూసి క్షణం ఆగాడు. వీధికే అందాన్నిస్తోన్న ఆ ముగ్గుల మువ్వన్నె శోభని ఆస్వాదిస్తూ కూతురి వైపు మెచ్చుకోలుగా చూశాడు.

ఆ అభినందనకి రవళి మనసు రంగవల్లి అయింది.

అర్ధరాత్రి లేచి వేసిన ముగ్గులు. పిల్లలతో వీధంతా వేయించిన ముగ్గులు.

ముగ్గుల వల్ల వీధికి శోభ వచ్చిందో, ప్రతి ప్రత్యూషంలోనూ ఆ ఇంటినుంచి వినిపించే వేదధ్వనుల ప్రకంపనుల వలన వచ్చిందో, మెట్లపై నిల్చున్న ఆ వేదజపాగ్నిహోత్రునిపై పరావర్తనం చెందుతూన్న కిరణాల వల్ల వచ్చిందో గానీ, ఒక విధమైన వింత కాంతితో ఆ వీధి వెలిగిపోతోంది.

* * *

పల్లె వీధుల్లోకి కారు ప్రవేశించింది.

"పాట సౌండు పెంచరా అంజి. మందుందా... అయిపోయిందా?" అడిగాడు గోవిందు.

"మీసాల్రాజా కార్లో మందు అయిపోవటం చూశావురా? క్షమాపణ చెప్పు" జోకేశాడు అంజి. గోవిందు ముందుకి వంగి రాజా బెల్టు క్రింద దణ్ణం పెట్టాడు.

"జిప్పుకి లేదురా కన్నం. వద్దురా నీకక్కడ దణ్ణం" అన్నాడు మీసాల్రాజా. మళ్ళీ చప్పట్లు.

"ఏరా... నడిపేది కారా? ఎడ్లబండా?" వెటకరించాడు గోవిందు. దాంతో వేగం పెంచాడు అంజి. మలుపుల్లో కూడా వేగం తగ్గటం లేదు. ముగ్గుల మీద నుంచి కారు రాకెట్లా దూసుకుపోతోంది. ఇరుకు సందు మలుపుల్లోంచి ఉహించని వేగంతో సడన్గా వచ్చిన కారుని చూసి భయంతో చెల్లా చెదురవుతున్న పిల్లల్నీ, పడతుల్నీ చూస్తూంటే నలుగురికీ మరింత హుషారు హెచ్చింది. గొబ్బెమ్మల పై నుంచి టైర్లు వెళ్తూంటే వచ్చే పేడ చెదిరిన శబ్దం, వారి శాడిజాగ్నికి పైశాచికానందపు ఆజ్యం పోసినట్టు ఉంది.

అదే సమయానికి "తొందరగా వచ్చేస్తానమ్మా. ఆలస్యమైనా కంగారుపడకు" అని కూతురికి చెప్పి శాస్త్రిగారు మెట్లు దిగుతూండగా...

అప్పుడు జరిగింది ఊహించని సంఘటన.

వేగంగా వచ్చిన కారు ఆయన్ను 'ఢీ' కొట్టబోయి, ఆయన అప్రమత్తుడై అడుగు వెనక్కి వెయ్యటంతో శరీరాన్ని రాసుకుంటూ అదే వేగంతో ముందుకు వెళ్ళి, వీధి చివర కుక్కను కొట్టి సాగిపోయింది. హృదయం ద్రవించేలా కుక్క ఆర్తనాదం వినిపించింది.

తండ్రి మీదకు కారు వస్తూండగా కెవ్వున అరిచిన రవళి, ఒక్కసారిగా బి.పి పెరగటంతో ఊపిరి ఆగినట్టు ఉక్కిరి బిక్కిరై ముందుకు తూలి ద్వారాన్ని పట్టుకుని నిలదొక్కుకుంది. రెప్పపాటులో ప్రమాదం తప్పింది కానీ లేకపోతే అక్కడ పెద్ద ఆక్సిడెంటు జరిగేదే.

కారు వెళ్ళిన తరువాత కూడా ఆమె గుండె వేగం తగ్గలేదు.

వాహనం నడుపుతున్నవాళ్ళు వేగం తగ్గించలేదు. బ్రేకు వేసే ప్రయత్నం కూడా చెయ్యలేదు. వెనుక సీట్లో కూర్చున్న గోవిందు కారు విండోలోంచి మధ్య వేలు పైకెత్తి అసభ్యంగా ఆమెకు ఒక సంజ్ఞ చేశాడు.

ఆయన మెట్టు పైకొచ్చి కూతురి భుజం తట్టి ధైర్యం చెపుతున్నట్టు "పర్వాలేదమ్మా. ఏమీ జరగలేదు" అన్నాడు.

ఆమెకు ఆ మాటలు వినపడలేదు. సర్వజ్ఞానేంద్రియాలూ స్థబ్దం కాగా సజల నేత్రాలతో అక్కడే అచేతనంగా నిలబడింది.

కుక్క గిలగిలా కొట్టుకుంటోంది.

తెల్లవారక ముందు వేసిన ముగ్గులు వెలుగు రాకముందే చెదిరిపోయాయి. దుశ్శకునానికి సూచనగా గొబ్బెమ్మల మీద అమర్చిన బంతులూ, చామంతులూ టైర్ల వత్తిడికి నలిగిపోయి, రోడ్డు పక్కనే ఉన్న మురికి కాలువ వరకూ వెళ్ళి పడ్డాయి.

కొనప్రాణంతో కొట్టుకుంటూన్న కుక్క చలనం లేక ఆగిపోయింది.

అశ్రుపూరితాలయిన కూతురి కళ్ళు చూసిన తండ్రి హృదయం ఆర్ద్రమైంది. ఆమె మనసు ఎంత సున్నితమైనదో తెలుసు. త్రుటిలో తనని మృత్యువు పలకరించి పోయిందని కూడా తెలుసు. అయినా కారు నడిపిన వారిమీద కోపం రాలేదు. ఆ జ్ఞానసార తపాగ్నిహోత్రుడు రాగద్వేషాలకు అతీతుడు.

"బాధ పడకమ్మా. ఎవరి పొగరు వారినే నాశనం చేస్తుంది" అని అనునయించి మెట్లు దిగి ముందుకు కదిలాడు.

వేదాన్ని నాలుక చివర నిలిపినవాడూ, భవత్పదాంబుజ ధ్యానరతుడూ, ఉపనిషత్తుల్ని ఔపోసన పట్టినవాడూ అయిన ఆ యజ్ఞవల్కుడి మాట, ఒక బృహత్కథకు తొలి వాక్యం వ్రాసింది.

# 2

**ముందు** సీట్లో కూర్చున్న మీసాల్రాజా 'మాక్-డోవెల్' బ్రాందీ తాగుతున్నాడు. ముఖ్యమంత్రి బావమరిదిగా స్టాటస్ పెరిగిన తరువాత కూడా అతడి బ్రాండు మారలేదు. కొంతమంది అంతే. అన్నీ మారినా బ్రాండు మారదు.

వెనుక సీట్లోంచి ఇళ్ళలోకి బాటిల్ విసురుతున్నవాడి పేరు గోవిందు. అతడి పక్కన కూర్చుని, బాటిల్ ఇంట్లో పడిందా లేదా అని చూస్తున్న వాడి పేరు ప్రభు. ఆ రాత్రి అనురాధ గోవిందుకి దొరక్కుండా చేయటానికి స్టీరింగు అడ్డదిడ్డంగా తిప్పుతున్నవాడు అంజి.

కారు మండువా లోగిలి ముందు నుంచి వెళ్తూ ఉండగా తన కోటాలోని ఆఖరి సీసా బలంగా విసిరాడు గోవిందు. అది వెళ్లి ఇంటి లోపల పడినట్టు అనిపించింది.

భళ్ళున పగిలిన శబ్దం రాలేదు.

బదులుగా... లోపల్నుంచి హృదయ విదారకమైన పాప కేక వినిపించింది

వాళ్ళు దాన్ని గుర్తించే స్థితిలో లేరు. వాళ్ళ మధ్య ఎవరు గెలిచారన్న వాదనలు అప్పటికే మొదలయ్యాయి. బాటిల్ బయట పడిందని ఒకరూ, లోపల పడిందని ఇంకొకరూ... పడింది గానీ బ్రద్దలవ్వలేదని మరొకరూ వాదించుకున్నారు. వాదన మరింత తీవ్రరూపం దాల్చేసరికి మీసాల్రాజా కల్పించుకుని, "ఈ రాత్రికి అనురాధ గోవిందుది. కారు నడిపిన అంజి వంతు రేపు మధ్యాహ్నం..." అంటూ తీర్పు చెప్పాడు.

గోవిందుకి అభినందనలు చెపుతున్నట్టు ప్రభు చప్పట్లు కొట్టాడు. మొహం మాడ్చుకున్న అంజి కూడా వెనక్కి తిరిగి గోవిందుకి షేక్ హేండ్ ఇచ్చాడు. మీసాల్రాజా నవ్వాడు. తన మాట అక్కడ ఎవరూ కాదనలేరని తెలుసు.

కోటరీ నుంచి వచ్చే భజన కన్నా మనిషిని సంతృప్తి పరిచేది ఏముంటుంది? *'అవిగో వినరా చప్పట్లు. అవే కదరా ఆకలిగొన్న కళాజీవికి పంచభక్ష్య పరమాన్నాలు'* అంటాడు ఓ

రచయిత. ఆస్కార్ బహుమతి నుంచీ ముఖపుస్తకంలో లైకుల వరకూ ఇచ్చే ఈ 'ఈగో-శాటిస్‌ఫాక్షన్' రెండు రకాలు.

*పాజిటివ్. నెగిటివ్.*

క్లాసులో మార్కులు, గ్రౌండులో ఆటలు, డ్రాయింగ్, మ్యూజిక్, నాట్యం... దేనిలోనో ఒక దానిలో ప్రవేశం ఉంటే, ఇంట్లో మెచ్చుకోళ్ళు, బయటవారి అభినందనలతో పిల్లల ఈగో సంతృప్తి చెందుతుంది. చిన్న వయసులోనే తమ 'ఏకాంతాన్ని' తాము ప్రేమించుకుంటూ, తమని తాము రమించుకుంటూ మరిన్ని మార్కులూ, బహుమతుల కోసం ప్రయత్నం చేస్తారు. ఈ గుర్తింపు దాహం ***పాజిటివ్.***

ఏవిధమైన గెలుపూ లేని పిల్లలకి పన్నెండేళ్ళు వచ్చేసరికి ఏకాంతం బదులు 'ఒంటరితనం' వస్తుంది. ఈ ఐడెంటిటి క్రైసిస్ వల్ల బ్లూ-వేల్, పాస్-అవుట్, స్టిల్ అండ్ ఐస్, కట్టింగ్ అండ్ ఫైర్ లాంటి వీడియోల్లో గంటల కొద్దీ గడుపుతారు. ఛాలెంజింగ్ గేమ్స్ వల్ల వచ్చే నిరర్థక సంతృప్తి వారి దాహాన్ని ఆ విధంగా తీరుస్తుంది. ఇది ***నెగెటివ్.***

వయసుతో పాటూ ఈ ఒంటరితనం మళ్ళీ రెండు రకాలుగా పెరుగుతుంది.

నిరర్థక ఓటమి. నిరర్థక గెలుపు.

పరీక్షల్లో ఫెయిల్, ప్రేమలో విఫలం లాంటి చిన్నచిన్న ఓటములకే ఆత్మహత్య చేసుకోవటం, చిన్న విషయాలకే నిస్సహాయులైన తల్లిదండ్రుల మీదా, అక్కా చెల్లెళ్ళ మీదా కోపంతో విరుచుకుపడటం ***నిరర్థక ఓటమి*** కి ఉదాహరణలు.

చేతులు వదిలేసి బైక్ నడపటం, బాటిల్ చేత్తో పట్టుకోకుండా బీరు తాగటం, ర్యాగింగ్ చెయ్యటం, రోడ్డు మీద అమ్మాయిల్ని ఏడిపించటం; మరింత డబ్బూ హోదా ఉంటే 'రేవ్' ప్రోగ్రాములు, డ్రగ్స్ పార్టీలు; ఇటీవలి కాలంలో కొత్తగా తయారైన 'గర్ల్-ఫ్రెండు' స్వాపింగులు... ఇవన్నీ ***నిరర్థక గెలుపు*** కి ఉదాహరణలు.

మీసాలరాజా జీవితం రెండో విభాగానికి ఉదాహరణ.

రాజకీయ నాయకుల అరాచకాలు, కోటీశ్వరుల కొడుకుల అనైతికాలూ, సమాజానికి కొత్త కాదు. జరుగుతూన్న అన్యాయాల్ని ప్రజలు చూస్తూనే ఉంటారు. హత్యగానీ, రేప్ గానీ జరగ్గానే ఖండన, నేరస్తుడికి శిక్ష ఆలస్యమవుతే ఆవేశం, ఎన్‌కౌంటరు జరిగితే ఆందోళన... మరో కొత్త దారుణం జరిగే వరకూ ఈ ప్రహసనం ఇలా సాగుతూనే ఉంటుంది. అంతకన్నా వారు మాత్రం ఏం చెయ్యగలరు? ప్రేక్షకుల సంతృప్తి కోసం సినిమా చివర్లో దుష్టశిక్షణ జరుగుతుంది. వాస్తవంలో రక్షణ కొనసాగుతుంది.

కానీ ఇక్కడ మాత్రం ఈ కథని విధి వెరైటీగా వ్రాసింది. కథా ప్రారంభంలోనే దుష్ట శిక్షణ జరిగింది.

* * *

పల్లెటూరి పొలిమేర్లు దాటుతూ కారు కీచుమని ఆగటంతో వెనుక కూర్చున్న ప్రభు “ఏమిట్రా... ఏమైంది?” అని అడిగాడు. బిర్రబిగుసుకుపోయినట్టు అంజి మాట్లాడలేదు. మీసాల్రాజా అటు చూశాడు. ‘అంబేద్కర్ నగర్’ అని బోర్డు కనపడతూంది.

అంజి కారు ఆపు చేసింది అందుకు కాదు. రోడ్డుకి అడ్డంగా గ్రామస్తులు నిలబడి ఉన్నారు. వారి మధ్యనున్న వృద్ధుడి చేతుల్లో రక్తసిక్తమైన బట్టలతో స్పృహ తప్పిన ఒక పాప శరీరం వేలాడుతోంది. కొందరి మొహంలో ఆందోళన, మరి కొందరిలో కోపం, ఇంకొందరి యువకుల చేతిలో కర్రలూ ఉన్నాయి. అందులో ఒక యువకుడు ఎత్తుగా బలిష్టంగా ఉన్నాడు.

అతడి పేరు ఎల్లమంద. బేడజంగం ఎల్లమంద.

* * *

సరీగ్గా రెండు గంటల తరువాత కారు నగరం వైపు సాగుతోంది. లోపలున్న నలుగురూ ఏమీ మాట్లాడటం లేదు. ప్రభు ఏదో అనబోయాడు కానీ పక్కన ఉన్న గోవిందు సైగ చేయటంతో ప్రయత్నం విరమించుకున్నాడు. అంజి కూడా అవసరమైన దానికన్నా ఎక్కువ ఏకాగ్రతతో కారు డ్రయివు చేస్తూ మౌనాన్ని ఆశ్రయించాడు. అతడి పక్కన కూర్చున్న మీసాల్రాజా మొహం ఆవేశంతో, ఉక్రోషంతో ఎర్రగా కందిపోయి ఉంది.

కారు కిటికీలోంచి ఏటవాలుగా పడుతూన్న కిరణాలు ఆ నలుగురి నున్నటి గుళ్ళ మీద నాట్యం చేస్తున్నాయి. మంగలి హడావుడిగా గీకటం వల్ల అక్కడక్కడ తెగి, గుండు మంట పెడుతోంది.

దానికన్నా ఎక్కువగా గుండె.

# 3

**“సాయంత్రంలోగా** వాడి చావు కబురు నాకు తెలియాలి” పెనం మీద గింజలా ఎగిరిపడుతూ చాణుక్యకి హుకూం జారీ చేశాడు మీసాల్రాజా. మిత్రులు ముగ్గురూ వారినే చూస్తున్నారు.

“ఎందుకు? అసలేం జరిగింది?” తాపీగా అడిగాడు చాణుక్య.

అతడు ముఖ్యమంత్రికి అనధికార పొలిటికల్ అడ్వైజరు. ప్రభుత్వ పోస్టు కాదు కానీ ఎన్నోసార్లు ముఖ్యమంత్రిని ఇబ్బందుల్లోంచి బయటపడేశాడు. పేరుకి తగినట్టు అతడి మొహంలో విద్వత్తు ప్రస్ఫుటంగా కనబడుతూంది గానీ, అది శకుని, శుక్రాచార్యుడి టైపు ప్రజ్ఞ.

ముఖ్యమంత్రికి బావమరిది మీసాల్రాజా, సలహాదారు చాణుక్య, ఇద్దరూ రెండు చేతులు. ఒకరు రాజకీయ సలహాలు ఇచ్చేవారు. మరొకరు శారీరక అవసరాలు తీర్చేవారు.

ఇద్దరిదీ లవ్–హేట్ రిలేషన్ షిప్.

"చెప్పు. ఏం జరిగింది?" చాణుక్య అడిగాడు.

రాజా కుర్చీ బలంగా వెనక్కి తోసి "అదంతా చెప్తేగానీ చంపరా?" అంటూ ఆవేశంగా అరిచాడు. చాణుక్య మాట్లాడలేదు. మీసాల్రాజాని ఇంత ఇరిటేటింగ్‌గా చూడటం అతడికీ కొత్తగానే ఉంది. అయినా, వయసు వల్ల వచ్చిన అనుభవంతో "ఏం జరిగిందో తెలియకుండా ఏం చేస్తాం?" అన్నాడు.

ఆ మాటలకి మీసాల్రాజా ఎడమ పిడికిలి కుడిచేతిలో కొట్టుకుంటూ, "చంపుతారో, చంపిస్తారో నాకు తెలీదు. వాడిని చంపి, సాయంత్రంలోగా ఆ కబురు నాకు చెప్పండి" అన్నాడు ఆవేశంగా.

చాణుక్య అతడి వైపు తేరిపారా చూస్తూ, "నిన్న సాయంత్రం వరకూ అందరూ బాగానే ఉన్నారు కదా. ఇంతలోనే ఏమి జరిగింది?" అని అడిగాడు.

మీసాల్రాజాతో పాటూ ముగ్గురూ మాట్లాడలేదు.

"నిన్నరాత్రి హోటల్ తాజ్‌లో నలుగురూ సూట్ బుక్ చేసుకుని అర్ధరాత్రి వరకూ పేకాట ఆడారని తెలిసింది" ఓరగా చూస్తూ అన్నాడు చాణుక్య.

"నా మీద డిటెక్టివ్ పని కూడా మొదలు పెట్టావా?"

"నేను పెట్టలేదు. నువ్వే ఫుల్లుగా మందు కొట్టి అర్ధరాత్రి ఫోన్ చేసి 'హ్యాపీ న్యూ ఇయర్ అంకుల్' అన్నావ్. ఉగాదికీ సంక్రాంతికీ తేడా చెప్పాను. మర్చిపోయావా?"

మీసాల్రాజా మొహం చిట్లించి, "రెండూ ఒకటి కాదా" అన్నాడు.

చాణుక్య దానికి సమాధానం చెప్పకుండా, ముగ్గురి వైపూ తేరిపారా చూసి, "ఏవింటీ? నిన్న అర్థరాత్రి ఏదో గ్రామీణాతివల సైట్-సీయింగ్ కి వెళ్ళారని తెలిసింది" అన్నాడు.

"గ్రామీణాతివలా? అంటే?"

అతడా ప్రశ్న దాటవేస్తూ, "వెళ్ళింది బాసర కాదు. ద్వారకా తిరుమల కూడా ఇక్కడ దగ్గర్లో లేదు. ఇంత బిజీ షెడ్యూల్లో ప్రొద్దున్న ప్రొద్దున్నే నలుగురూ మూకుమ్మడిగా గుండు ఎప్పుడు చేయించుకున్నారబ్బా?" అన్నాడు అనుమానంగా.

మీసాల్రాజా చివాలున లేచి, "ముసలోడా. చెప్పింది చెయ్యి. లేకపోతే బావకూ్కడా తెలియకుండా నిన్నిక్కడే మర్డరు చేస్తా" అంటూ మిత్రులతో కలిసి విసురుగా వెళ్ళిపోయాడు.

* * *

"ఏవింటి? మీసాల్రాజా ఏదో సమస్య తెచ్చినట్టున్నాడే" అడిగాడు ఆంజనేయులు.

"అర్ధరాత్రి వరకూ పట్నంలో మందు కొట్టి, పల్లె పడుచులు సంక్రాంతి ముగ్గులు ఎలా వేస్తారో చూద్దామని నలుగురూ బయలుదేరారు. ఆ పల్లెటూర్లో ఇళ్ళ ముందు వేసిన ముగ్గులు తొక్కుతూ రసాభాస చేయటమే కాకుండా ఇళ్ళల్లోకి బాటిల్స్ విసిరే పందెం వేసుకున్నారట"

ఆంజనేయులు మొహం వివర్ణం అయింది. "నాకు వచ్చిన రిపోర్ట్ వేరేగా ఉందే" అన్నాడు.

"నీకు వచ్చిన రిపోర్ట్ ఏమిటి?"

"కారు వెళ్తుండగా ఏదో చిన్న యాక్సిడెంటు అయిందనీ, ఆ పల్లెలో కుర్రోళ్ళు అమాయకుడైన మీసాల్రాజాని కొట్టబోయారనీ... "

"మీ ఇంటలిజెన్సువాళ్లు అంతకన్నా గొప్ప రిపోర్ట్ ఏమిస్తార్లే. 'గెలిస్తే తమ ప్రతిభ. ఓడిపోతే ఇ.వి.ఎం ల తప్పు' అంటారు. వాస్తవంగా జరిగింది అది కాదు. వీళ్ళు విసిరిన బాటిల్ ఒక పాప తలకు తగిలింది. కుర్రోళ్ళు ఊరి బయట కారాపు చేసి, 'పాపని పట్నం ఆస్పత్రికి తీసుకెళ్ళండి' అని అడిగారు. 'టాక్సీలో తీసుకెళ్ళండి. కారు సీట్లు పాడవుతాయి' అన్నారు వీళ్ళు. 'అంత ప్రొద్దున్నే పల్లెటూర్లో టాక్సీలు ఎక్కడ దొరుకుతాయ'ని వాళ్ళూ, 'డబ్బులెంత కావాలో చెప్పండి. ముఖాన కొడతాం' అని వీళ్ళూ... మాట మీద మాట పెరిగింది. కారు కదలనివ్వం అన్నారు వాళ్ళు. వీళ్ళు అసలే తాగి ఉన్నారు. ఆ కుర్రాళ్ళని కొట్టారు. ఆ విషయం తెలిసి మరి కొందరు గ్రామస్తులు పోగయ్యారు. పాప ప్రాణం పోతుందని వేడుకున్నా వీళ్ళు వినలేదు. దాంతో మూకుమ్మడిగా మనవాళ్ళని ఉతికి ఆరేయ్యబోతూ ఉంటే ఎల్లమంద అనే కుర్రాడు ఆపి, 'వద్దు' అన్నాడు. అతడా ఊళ్ళో చిన్న తరహా నాయకుడు. ఎప్పుడో మీ చేతుల మీదుగా బహుమతి కూడా తీసుకున్నాడు. మరేం చేద్దామని అనుకున్నారు. ఆ కుర్రాడు మంగలిని పిలిపించి నలుగురికీ గుండు చేయించాడు" అని ఆగి ముక్తాయింపుగా, "అదీ... పండగరోజు నీ బావమరిది మిత్రసమేత ఉమ్మడి గుండు వ్రతకథ" అన్నాడు.

ఆంజనేయులు అనుమానంగా, "అంతా చూసినట్టు చెపుతున్నావే?" అన్నాడు.

"మీ ఇంటెలిజెంటు డిపార్ట్‌మెంట్ కన్నా నా నెట్-వర్క్ ఎక్కువ. పెదపట్నంలో బాలారిష్ట అనే పోలీసుది ఆదిత్యపురమే. అతన్ని కనుక్కున్నాను. పెదపట్నం ఎస్పై జాక్సన్ మన మనిషి. చాలా... ఇంకా వివరాలు కావాలా?"

"ఇప్పుడు దాని గురించి వాదనలు ఎందుకులే గానీ, ఆ జాక్సనుకు చెప్పు. ఇదంతా పేపర్లో వస్తే బాగోదు. రాకుండా చూడు".

బావమరిదికి జరిగిన అవమానం గురించి కాకుండా, రాబోయే ఎలక్షన్లలో తనకి జరగబోయే నష్టానికి కంగారు పడుతున్న ముఖ్యమంత్రిని అభావంగా చూస్తూ "...అలాగే" అన్నాడు చాణుక్య.

అంతలో ఆంజనేయులు ఫోన్ మోగింది. డైరెక్టుగా ముఖ్యమంత్రితో ఫోనులో మాట్లాడే చనువు అతి కొద్దిమందికే ఉంటుంది. ముఖ్యమంత్రి ముఖకవళికలు చూస్తూ, 'మీసాల్రాజాయే అయ్యుంటాడు' అనుకున్నాడు చాణుక్య. అతడి అనుమానం కరెక్టే. మాట్లాడి ఫోన్ పెట్టేస్తూ "రాజా అవమానంతో ఉడికిపోతున్నాడు. ఆ ఎల్లమందని రేపు సాయంత్రంలోగా ఏదో ఒకటి చేయకపోతే తనే వెళ్లి షూట్ చేస్తాడట" అన్నాడు.

చాణుక్య మాట్లాడలేదు

"వాడు అన్నంత పనీ చేస్తాడు. అసలే ఎలక్షన్స్ దగ్గరకు వస్తున్నాయి".

చాణుక్య కాస్త విసుగ్గా, "ఏం చెపుతున్నావు నువ్వు? మీసాల్రాజా వెళ్లి అక్కడ ఆ ఎల్లమందని షూట్ చెయ్యకముందే, నేను ఏదో ఒకటి చేసి వాడిని చంపాలి. లేదా చంపించాలి. అంతేగా నువ్వు చెప్పేది" అన్నాడు.

ఆంజనేయులు ఇబ్బందిగా తలూపి, "దీని గురించి ఎవరికీ అనుమానం రాకూడదు. ఆ మీసాల్రాజా ఆదిత్యపురం వెళ్లి ఏ అఘాయిత్యం చేసినా జనం అనుమానం మన మీదకే వస్తుంది. వాడి సంగతి నీకు తెలియనిది ఏముంది? ఒకవేళ పోలీసులు వాడిని అరెస్ట్ చేసి స్టేషనుకి తీసుకెళ్తే, 'అవును. నేనే మర్డరు చేశాను. ముఖ్యమంత్రి తాలూకు మనిషిని నేను. ఏం చేస్తావో చేసుకో...' అంటాడు. దీన్ని ఎవడైనా పబ్లిక్ చేస్తే, సి.ఎం పదవి అపోజిషను లీడరుకి అప్పజెప్పి ఏ కాశీనో, రామేశ్వరమో పోయి యజ్ఞాలూ, యాగాలు చేసుకోవాలి. లేదా 'నాయకుడిగా నా నిజాయితీ' అన్న పుస్తకం వ్రాసుకోవాలి. ఏం చేస్తావో నీ ఇష్టం. మూడో కంటికి తెలియకుండా నువ్వే స్వయంగా పూనుకుని ఈ పని పూర్తి చెయ్యాలి" అన్నాడు.

చాణుక్య అతడి వైపు నిర్వికారంగా చూస్తూ 'ఒక బలహీనత మనిషిని ఎంత దిగజారుస్తుందో...' అనుకున్నాడు.

ఆంజనేయులుకి స్త్రీ బలహీనత. మీసాల్రాజాకి కోపం బలహీనత. ధృతరాష్ట్రుడికి దుర్యోధనుడు బలహీనత. ధర్మరాజుకి జూదం బలహీనత. భీష్ముడికి కౌరవ వాగ్దానం బలహీనత. తనకి పలుకుబడి బలహీనత. బలహీనతల వల్లే మీసాల్రాజాలు, ఆంజనేయుళ్ళు, చాణుక్యలు తయారవుతారు. చిత్రమేమిటంటే – ఆ విషయం కూడా అతడికి తెలుసు.

"ఏం? ఏదో ఒకటి చేస్తావుగా" ప్రాధేయపడుతున్నట్టూ అడిగాడు ఆంజనేయులు.

చాణుక్య తలూపాడు. అప్పటికే అతడి మనసులో ఒక ప్రణాళిక రూపు దిద్దుకుంది.

ఎల్లమంద చావుకి చాణుక్య వేయబోతూన్న అ చదరంగపుటెత్తు ఏయే మలుపులు తిరుగుతుందో విధి నిర్ణయించాలి.

# 4

**ట్యూషనుకి** వెళ్ళిన శాస్త్రి మధ్యాహ్నం మూడు అవుతున్నా రాకపోవటంతో రవళి నూట పదహారోసారి బయటకి వచ్చి చూసింది. ఆ కంగారు సాయంత్రం అయ్యేసరికి ఎక్కువైంది. ఆక్సిడెంటు వల్ల వచ్చిన దద ఇంకా ఇప్పటికీ తగ్గలేదు. నిన్నటి ఆక్సిడెంటుకీ,

ఈ రోజు ఆలస్యానికీ సంబంధం లేదు కానీ, కంగారుకు హేతువు ఉండదు కదా. బంధం వల్ల వచ్చిన కంగారది. తండ్రి వస్తాడు. తనని చూసి నవ్వుతాడు. '...ఇంటి ముందు వేసిన ముగ్గుల తడే ఆరలేదు. ఆలస్యమెక్కడ అయిందం'టాడు. తను ఉక్రోషంగా చూస్తుంది. నవ్వి కన్నీళ్ళు తుడుస్తాడు. వంద సందర్భాల్లో ఇదే జరిగింది.

వీధి చివరివరకూ చూస్తూ నిలబడింది.

మధ్యాహ్నం అయ్యేసరికి ఊరు మొత్తం అలసి పోయినట్టుంది.

ఇవే రోడ్ల మీద నిన్నా మొన్నా ఎంత హడావుడి..! కళ్ళాపి జల్లిన వాకిళ్ళు, ముగ్గులేసిన ముంగిళ్ళు, చిగురుబోడులు పెట్టిన గొబ్బిళ్ళు. ముద్దరాళ్ళు అమర్చిన ముద్దబంతులు, గంగిరెద్దు మేళాలు, పగటి వేషగాళ్లు, హరిదాసు ప్రవచనాలు, కొమ్ముదాసర్ల ప్రహసనాలు. ఇప్పుడు... నిర్మానుష్యమైన రోడ్ల మీద వాడిపోయిన చేమంతులూ, వెలిసిపోయిన రంగవల్లులూ..! పాతికేళ్ళు నట్టింట్లో తిరిగిన కూతురు, పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోగానే బోసిపోయిన ఇల్లులా ఉంది వీధి. అప్పగింతల తంతు ముగిసి అప్పుల లెక్కలు వేసుకుంటున్న ఆడపెళ్ళివారి ఇల్లులా నిస్తేజంగా ఉంది ఊరు.

అంతే కదా జీవితం. బాల్యం బొమ్మలకొలువు భోగి. యవ్వనం రంగుముగ్గుల సంక్రాంతి. వృద్ధాప్యం ఎండుటాకుల గ్రీష్మం.

రాబోయే తుఫానుకి సంకేతంలా గాలి ఉధృతంగా వీస్తోంది. ఆమె అక్కడే అరుగు మీద నిలబడి ఉంది. తండ్రి జాడ లేదు. పండగ రోజు ప్రొద్దున్నే ముగ్గులు తొక్కినందుకు ఊరి పొలిమేరల్లో ఏదో గొడవైందనీ, పట్నం నుంచి వచ్చిన కుర్రాళ్ళకి గుండు చేశారనీ జనం చెప్పుకుంటున్నారు. ఆమెకి అర్థం కాలేదు. అంత ఇంటరెస్టు లేదు కూడా.

తండ్రి పరికిణి కట్టుకోమన్నాడు. 'ఇంత వయసొచ్చాక ఓణీ ఏమిటి నాన్నా' అన్నది. వినలేదు. 'నా కంటికి నువ్వింకా చిన్న పిల్లవేనమ్మా' అని బలవంతం చేశాడు. తండ్రి మాటకి ఎదురు చెప్పటానికి మనసొప్పదు. ఇప్పుడే కాదు. ఎప్పుడైనా సరే. వాదించకుండా ఓణీ వేసుకుని, జడ కుచ్చులు పెట్టుకుంది. జడ చివర్ల చిరుగంటల చప్పుడు, కాలి మువ్వల రవళితో కలిసి జంట గాయకుల జుగల్బందీలా ఉంది.

జుగల్బంది అనగానే, క్రితం రోజు ప్రొద్దున్న స్నేహితురాలితో కలిసి 'చామంతి పువ్వంటి చెల్లెల్నియ్యవే... మొగలి పువ్వంటి మొగుణ్ణియ్యవే' అని రంగవల్లి చుట్టూ పాడిన పాట గుర్తొచ్చింది. "మల్లె పువ్వంటి మొగుణ్ణి ఇమ్మనొచ్చుగా. మొగలి పువ్వెందుకు. గుచ్చి గుచ్చి పొడవటానికా?" అని పక్కనున్న అమ్మాయి అడిగింది. తనక్కూడా సమాధానం దొరకలేదు. నిజమే కదా. మొగలిపువ్వు లాంటి మొగుడెందుకు?

"నీకెవరు కావాలక్కా... మల్లెపువ్వా? మొగలిరేకా?" మళ్ళీ ప్రశ్నించింది.

"నేనసలు పెళ్లి చేసుకోను".

"పాతికేళ్ళు వస్తున్నాయి. చేసుకోవా? ఎందుకు?"

రవళి మాట్లాడలేదు. కొన్నేళ్ళ క్రితం క్లాస్‌లో జరిగిన సంఘటన గుర్తొచ్చింది. సోషియాలజీ లెక్చరరు పాఠం బాగా చెపుతారు. దానితో పాటూ ఇంకా ఎన్నో ఇతర విషయాలు కూడా. స్పాంటేనియిటి గురించి చెప్తూ, "...స్పాంటేనియిటీ అంటే క్షణాల్లో నిర్ణయం తీసుకోవటం. తెలుగులో 'సమయస్ఫూర్తి' అంటారు. అవతలివారు మాట్లాడుతూ ఉంటే, ఆ సంభాషణ లోంచి అప్పటికప్పుడు ఒక జోకుగానీ, లేదా దానికి సంబంధించిన విషయంగానీ చెప్పి శ్రోతల్ని రంజింపచేయటాన్ని సంభాషణా చాతుర్యం అంటారు. ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సమయస్ఫూర్తికి పెట్టిన పేరు. భారతరత్న లతామంగేష్కర్ ఆయన్ని కలిసినప్పుడు 'మీరు తిరగబడితే నేను' అన్నాడట. ఇద్దరూ బ్రహ్మచారులే. ఆమె అర్థం కాక 'అంటే' అని ప్రశ్నిస్తే, ATAL తిరగబడితే LATA కదా' అని వివరించాడట. ఇదే వాజపేయి విదేశాలు వెళ్ళినప్పుడు ఒక అందమైన పాకిస్తానీ రిపోర్టరు, "కన్యాశుల్కంగా ఆజాద్ కాశ్మీర్ని మాకు వదిలేస్తే నేను మిమ్మల్ని చేసుకుంటాను" అన్నదట. "కట్నంగా మొత్తం కాశ్మీర్‌ని మాకిస్తే తప్పకుండా చేసుకుంటాను" అన్నాడట. సంభాషణా చాతుర్యమూ, సమయస్ఫూర్తీ అంటే అది" అని ఆగి, "ఇప్పుడు మీ స్పాంటేనియిటి లెవల్స్ చూద్దాం. నేను ఒక ప్రశ్న వేస్తాను. చప్పున ఆలోచించి సమాధానం చెప్పండి" అన్నాడు.

విద్యార్థినులందరూ ఉత్సుకంగా ఎదురు చూస్తూండగా "ఒక రోజు అర్థరాత్రి సడన్‌గా, పెర్మనెంట్‌గా మీ జండర్ మారిపోతే మీరేం చేస్తారు?" అని ప్రశ్నించాడు.

క్షణం నిశ్శబ్దం తరువాత ఒకమ్మాయి లేచి, "కలేమో అనుకుంటాం సార్" అన్నది. ఆ పైన స్టూడెంట్స్ నుంచి 'డాక్టరు దగ్గరికి వెళ్తాను... షాక్ తింటాను...' అన్న రకరకాల సమాధానాలు ప్రవాహంలా వచ్చాయి. ఆయన తల అడ్డంగా ఊపుతూ, "అనుకోవటమూ కాదు. డాక్టరూ కాదు. **శాశ్వతంగా** మారిపోతే ఏమి చేస్తారు? ఏమి చేస్తారో ఒక ఉదాహరణ ద్వారా చెప్పాలి" అని అడిగాడు. అక్కడ సూది పడితే వినపడేటంత నిశ్శబ్దం ఆవరించింది. ఆపై పిల్లలు రెచ్చిపోయి సమాధానాలు చెప్పారు.

"రాత్రి పదింటి లోపు ఇంటికి వెళ్ళకపోతే నాన్న కాళ్ళు విరక్కొడతాడు. అబ్బాయిగా మారితే అర్థరాత్రి వరకూ బయట హాయిగా తిరగొచ్చు" అన్నదో గడుగ్గాయి. "ఐదు లక్షలకి తక్కువ కాకుండా ఖరీదైన మోటరు సైకిల్ కొనుక్కుని ఊరంతా సర్వే చేస్తాను" అన్నది మరో అమ్మాయి. వెనకాల నుంచి చిన్న స్వరంతో ఎవరో అమ్మాయి "...ఉన్న బాయ్ ఫ్రెండ్‌ని వదిలేసి కొత్త గర్ల్-ఫ్రెండ్‌ని చూసుకోవాలి" అన్నది.

క్లాసంతా నవ్వులు.

వేదరవళి చెయ్యి ఎత్తింది. ఆయన 'చెప్ప'మన్నట్టు చూశాడు. ఆమె లేచి నిలబడింది.

"నా చెల్లి అధర్వణ మెదడు ఎదగని పిల్ల. మాకు తల్లి లేదు. ఇల్లంతా నేనే చూసుకుంటాను. నా తండ్రి రిటైర్డ్ స్కూల్ టీచరు. సంవత్సరాల తరబడి నిలబడి పాఠాలు

చెప్పి కాళ్ళు కాయలు కాచాయి. తెల్లవారుఝామునే వేడి చేసిన కొబ్బరినూనె కాళ్ళకు రాస్తే తప్ప ఆయన మంచం దిగలేదు. నేను శాశ్వతంగా అబ్బాయిగా మారిపోతే ఆయన దగ్గరకు వెళ్ళి, 'అత్తారింటికి నే వెళ్ళిపోయాక చెల్లిని ఎవరు చూసుకుంటారు? ఇంత శ్రద్ధతో నీ కాళ్ళకి ఎవరు కొబ్బరి నూనె రాస్తారని బాధపడుతూ నిద్ర పోయుంటాను... నా ప్రార్థన భగవంతుడు విన్నాడేమో... అత్తారింటికి వెళ్ళే అవసరం లేకుండా అబ్బాయిగా మార్చేశాడని చెప్పి సంతోషిస్తాను" అంది. ⁎

అర్థమవటానికి ఆ పిల్లలకి అరక్షణం పట్టింది. ఆ పై అయిదు నిముషాల పాటూ ఆగకుండా చప్పట్లతో క్లాసు మారుమ్రోగింది.

రవళి ఆలోచనలని చెదురుస్తూ, దూరంగా తండ్రి వస్తూ కనిపించాడు. మనసు తెరిపిన పడింది. ఆయనతో కలిసి లోపలికి వెళ్తూండగా అశుభమన్నట్టు కుడి కన్ను అదిరింది. ఒకప్పుడైతే కంగారు పడేదేమో కానీ, తండ్రి నేర్పిన 'తర్కం' హేతురహిత నమ్మకాన్ని అల్లంత దూరంలో ఆపింది.

# 5

**"ఆ ఎల్లమంద** వివరాలు తెచ్చావా?" ఆదిత్యపురం నుంచి వచ్చిన గోవిందుని అడిగాడు చాణుక్య.

"తెచ్చాను. సరిపోతాయో లేదో తెలీదు" అన్నాడు గోవిందు.

అతడు చాలా హుషారుగా ఉన్నాడు. క్రితంరోజు బాటిల్ కరెక్టుగా విసిరి అనూరాధని 'గెలవటం' వలన వచ్చిన సంతోషం అది. నిన్న రాత్రే అతడు 'గది'లోకి వెళ్ళాడు. మొదట్లో ఆ అమ్మాయి వప్పుకోలేదు. ఇలాంటి విషయాల్లో అతడు ప్రాజ్ఞుడు. సామ దాన భేద దండ ప్రక్రియల్లో మొదటి అస్త్రం వాడాడు. "ఎంతకాలం ఇలా బందీగా ఉంటావు?" అని అనునయించాడు. "సినిమా వేషం కోసం ఇంట్లో చెప్పకుండా వచ్చేసి నాల్రోజులైంది. తిరిగి వెళ్తే కాళ్ళు విరగ్గొడతారు. నిన్ను స్టేషను నుంచి తీసుకువచ్చిన అంజి తెలుసుగా. వాడో ప్రొఫెషనల్ రేపిస్ట్. కరాటే క్వీన్‌ని కూడా రేప్ చేసే ప్రావీణ్యం ఉన్నవాడు. ఈ రోజు నాకు వప్పుకోకపోతే రేపు వాడు వస్తాడు. తట్టుకోలేవు. మంచివాడిని కాబట్టి ఇలా నెమ్మదిగా చెపుతున్నా" అన్నాడు.

ఆ అమ్మాయి బెదిరి పోయి చూసింది.

"...నువ్వు వచ్చింది సినిమా చాన్సుల కోసమే కదా. మా మీసాల్రాజా మంచి వేషం ఇప్పిస్తాడు. వాడికి బోలెడుమంది నిర్మాతలూ, దర్శకులూ తెలుసు. ఒకసారి వప్పుకో. ఫ్లాట్

(⁎ From: 'లోయనుంచి శిఖరానికి' by the same author).

ఫాంల మీద నిలబడి బిత్తర చూపులు చూడక్కర్లేదు. ఒ.టి.టి. ప్లాట్ ఫాం మీద నిలబడి జనాలకి చెయ్యి ఊపొచ్చు" అన్నాడు.

"ఓ.టి.టి అంటే?"

"ఓవర్ ది టాప్-లెస్. పై బట్టలు లేకుండా పైకెక్కేది"

"ఛీ. నేనలాంటి సినిమాల్లో నటించను"

"సరే అయితే. శంకరాభరణం 2 లో నటిస్తావా? మగ తులసి పెద్దయ్యాక స్టోరీ"

మొహం విప్పారగా, "ఓ..." అంది .

"మొన్న మిస్సమ్మ, మాయాబజార్, పాతాళభైరవి దర్శకులు ముగ్గురూ ఇదే గెస్ట్ హవుసుకి వచ్చారు. వాళ్ళలో ఒకరికి చెపుతాడు. అంతెందుకు? రాజాయే తొందర్లో కీలుగుర్రం, చంద్రహారం-2 ప్లాన్ చేస్తున్నాడు. ఎల్లుండి వస్తాడుగా. వేషం ఇస్తేనే తాంబూలం అని చెప్పు" అంటూ వప్పించాడు. ఏమయితేనేం, 'ప్లాన్-బి' అవసరం లేకుండానే వప్పుకుంది. అందుకే రాత్రంతా నిద్రలేని హుషారు.

"చెప్పు. ఏం సేకరించావు?" చాణుక్య అడిగాడు.

"చంపాల్సిన ఎల్లమంద గ్రాడ్యుయేటు. పొలాలకి మోటార్లు అద్దెకిస్తూ ఉంటాడు. తండ్రిది చెప్పులు కుట్టే పని. చెల్లెలు పేరు సారమ్మ. తల్లితో సహా ఇంట్లో నలుగురు ఉంటారు. ఆ ఊర్లో యువ సంఘానికి ప్రెసిడెంటు. ఎవరో పెద్ద కులం అమ్మాయిని లవ్ చేశాడట. వన్ సైడ్ లవ్. ఆ ఫోటో జేబులో పెట్టుకుని తిరుగుతూ ఉంటాడు" వివరాలు చెప్పాడు.

"అంతేనా?"

"అంతే"

"చాలా విషయాలు సేకరించావు. నువ్వు వెళ్ళొచ్చు"

"థ్యాంక్స్. అయినా అంకుల్. ఒక్క అనుమానం. ఏ లారీతోనో గుద్దించేస్తే సరిపోద్దిగా. దానికి ఇన్ని వివరాలు కావాలా?"

చాణుక్య అతడిని ఓ క్రిమిని చూసినట్టు చూసి, "నీ స్నేహితుడు రాజా ఏమి అడిగాడు?" అని అడిగాడు.

"ఏం అడిగాడు?" ఎదురుప్రశ్న వేశాడు గోవిందు.

"గౌరవనీయులైన ముఖ్యమంత్రితో ఏమని రికమెండు చేయించాడు?"

"ఏం చేయించాడు?"

"ఈరోజు సాయంత్రానికల్లా ఆ ఎల్లమంద చావాలని".

"అవును"

"ఏ లారీతోనో వాడిని గుద్దించేస్తే సరిపోద్దిగా అని ఇప్పుడు నువ్వు అన్నావ్"

"అవును. సరిపోద్దిగా".

"ఈరోజు సాయంత్రం వరకూ వాడు ఇంట్లోంచి బయటకు రాలేదనుకో. లారీ వాడి ఇంటి మీదకు తోలాలా? లేదా ఏ మీటింగులోనో ఉన్నాడనుకో. మీటింగు మధ్యలోకి బుల్డోజరు తోలి మొత్తం జనాన్ని చంపాలా? సాయంత్రం లోపులో వాడిని ఎలా చంపాలి?"

గోవిందు తెల్లమొహం వేసుకుని చూశాడు.

"చేతిలో లారీలూ, బుల్డోజర్లూ ఉంటే సరిపోదు. మెదడులో తెలివి ఉండాలి. ఆ అమ్మాయి పేరేమిటన్నావ్?"

"సారమ్మ "

"వాడి చెల్లి పేరు కాదు. లవ్వరు పేరు"

"లవ్వరు కాదు. వన్-సైడ్ లవ్"

చాణుక్య చిరాగ్గా "చెప్పావుగా. అదే... ఆ అమ్మాయి పేరు?" అని అడిగాడు.

"రవళి. వేదరవళి"

# 6

**ఎండు** మిరపకాయలు, పేలాలు వేయించటం కోసం పాత కుండని నల్లగా కాల్చి, మొనదేలిన రాయితో కొట్టి చేయి పట్టేంత కన్నం చేస్తారు. ఈ కుండని 'మంగలం' అంటారు. మాడి పగులిచ్చి బలహీనమైన ఈ ఓటి కుండపై అత్యంత శక్తివంతమైన ఉరుము పడటాన్ని (కష్టాల్లో ఉన్న బలహీనుడి మీద విధి తన ప్రతాపాన్ని చూపించటాన్ని) 'ఉరుము ఉరుమి మంగలం మీద పడటం' అంటారు.

గతంలో ద్రౌపతి తాలూకు కోపం మంగలమైన కుక్క మీద అలాగే పడింది. అదో పెద్ద కథ. ద్రౌపతి ఏడాదికో భర్తతో గడిపిన తరువాత పునీతురాలై (?) మరో భర్తతో ఉండాలని శ్రీకృష్ణుడి సూచన. నాలుగు సంవత్సరాల పాటు భార్య నుంచి దూరంగా ఉండాలి కాబట్టి కావాలంటే పాండవులు వేరే వివాహం చేసుకోవచ్చు☺. ఆమెతో ఉన్నప్పుడు, భర్త పడగ్గది బయట గుర్తుగా చెప్పులు వదలాలి. ఏ సోదరుడయినా పొరపాటున ఆ గదిలోకి వెళ్లితే, ఏడాదిపాటు అడవుల్లో అజ్ఞాతవాసం చెయ్యాలి. ఇది ఇలా సాగుతూండగా ఒక రోజు అర్జునుడికి ఆయుధాలు కావలసి వచ్చాయి. గదులన్నీ వెతుక్కుంటూ, ద్రౌపతి గది బయట చెప్పులు లేకపోవటంతో లోపలికి ప్రవేశించి, అక్కడ ధర్మరాజు ఉండటం చూసి అపరాధబావంతో బయటకి వచ్చి, ఆపై అజ్ఞాతవాసానికి వెళ్ళిపోయాడు. శయన మందిరం బయట భర్త వదిలిన చెప్పుల్ని తీసుకుపోయింది కుక్క అని గ్రహించిన ద్రౌపతి,

ఆ రోజు నుంచీ కుక్కలు ఆరు బయటే రతి నిర్వర్తించాలని శాపం ఇచ్చిందట. చెప్పులని లాక్కుపోవటం కుక్కల సహజ గుణం. అయినా శాపానికి గురి అయింది.

ఉరుము ఉరిమి మంగలం మీద పడటం అంటే అది.

ప్రతిభావంతుడైన చాణుక్య పన్నుతున్న ఈ వ్యూహం, ఉరిమి మంగలం మీద పడి సమూలంగా ఒక కుటుంబాన్ని సర్వనాశనం చేస్తుందో, విస్ఫోటించటానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం మీద పడి ఒక భీకర రక్తసిక్త సమాయుక్త కురుక్షేత్ర సంగ్రామానికి దారి తీస్తుందో కాలమే చెపుతుంది.

.........

బయట ఎవరో తలుపు కొట్టిన చప్పుడు వినిపించటంతో రవళి ముందు గదిలోకి వచ్చి తలుపు తీసింది. ఎదురుగా ఇద్దరు ఉన్నారు. నుదుట బొట్టు, పంచ కట్టు, పైకి దువ్విన పొడవాటి జుట్టు... చూడగానే పవిత్రభావం కలిగేలా ఉన్నాడు. "అమ్మా. నా పేరు చాణుక్య. మాస్టారు ఉన్నారా?" అని అడిగాడు.

"లేరండీ. ట్యూషనుకు వెళ్ళారు"

"రావటానికి ఎంతసేపు పడుతుందమ్మా?"

"ఇంకో అరగంట పట్టవచ్చండీ"

వెనుకే పొడుగ్గా బలంగా ఉన్న వ్యక్తి వైపు తిరిగి, "మళ్ళీ ఏమి వెళ్తాం టార్జాన్? వచ్చేవరకూ ఇక్కడే ఉందాం" అన్నాడు. 'అంతేకదా' అన్నట్టు టార్జాను తలూపాడు.

"పట్నం నుంచి వచ్చామమ్మా. మాస్టార్ని కలిసి వెళ్ళిపోతాం."

అతడి మాటల్లో 'లోపలికి వచ్చి కూర్చుంటాం' అన్న అర్థం ధ్వనించటంతో, "రండి" అంటూ ఆహ్వానించింది. పెరట్లోంచి పక్షి అరుపు వికృతంగా వినిపిస్తోంది.

"వీడి పేరు అహ్మద్ ఖాన్. మేము టార్జాన్ అని పిలుస్తాం" లోపలికి వస్తూ అన్నాడాయన. 'టార్జాన్... చాణుక్య... రూపాలకి తగ్గ పేర్లు' అనుకుంది.

వాళ్ళు కూర్చుంటూ ఉండగా హృదయవిదారకంగా మళ్ళీ అదే అరుపు.

"ఏమిటమ్మా అది?"

"పిల్లల్ని పిల్లి తినేసినట్టుందండీ. నిన్నటి నుంచీ ఆగకుండా ఏడుస్తోంది. బాగా ఎండలో వచ్చారు. ఉండండి. మజ్జిగ తీసుకొస్తాను."

"వద్దమ్మా. నీకెందుకు శ్రమ. ఈ లోపులో ఎల్లమంద కూడా వస్తాడు. మాట్లాడి వెళ్ళిపోతాం"

ఆమె అర్థం కానట్టు "ఎల్లమందా?" అన్నది.

"పెళ్ళి సంబంధం మాట్లాడటానికమ్మా"

"పెళ్లి సంబంధమా? మీరు ఎవరింటికి..." అంటూ ఆమె ఏదో అనబోతూ ఉండగా లోపల్నుంచి అధర్వణ వచ్చింది. ఇద్దర్నీ చూసి "భలే ఉన్నారే... మంత్రాల పంతులూ, పక్కనే రౌడీ" అంటూ చప్పట్లు కొడుతూ గెంతులు వేసింది. వేదరవళికి తల తీసేసినట్టయింది. చెల్లిని బలవంతంగా లోపలికి తీసుకెళ్ళి గది తలుపు గడియ వేసి వచ్చి, "క్షమించండి. మతి స్థిమితం సరిగ్గా లేదు. ఒకొక్కప్పుడు బాగానే ఉంటుంది. ఒక్కోసారి ఇలా..." అంది.

"పుట్టినప్పటి నుంచీ ఇలా ఉందా? మధ్యలో వచ్చిందా తల్లీ?"

"పుట్టినప్పటి నుంచీ ఇంతేనండీ. మెంటల్ రిటార్డేషన్. డాక్టర్లకి చూపిస్తే దీనికి మందు లేదన్నారు".

చాణుక్య తలూపుతూ, "అవునమ్మా. దీనికి మందు లేదు. జాగ్రత్తగా పెంచాలంతే. దీన్ని 'ఇడియసీ' అంటారు. ఇడియెట్ అన్న పేరు దాన్లోంచి పుట్టిందే. అంగ వైకల్యాన్ని ఎగతాళి చేసే పేర్లన్నీ ఈ మధ్య మారుస్తున్నారు కదా. ఇడియసీ మార్చి ఐ.డి.డి అని పిలుస్తున్నారు. ఇంటలెక్చువల్ డెవలప్మెంట్ డిజెబిలిటి" అన్నాడు.

సనాతనంగా కనపడుతూన్న శ్రోత్రియుడిలో ఈ ఆధునిక మానసికశాస్త్ర పరిజ్ఞానం ఆమెను అబ్బుర పరిచింది. అంతలో మర్చిపోయిన విషయం గుర్తొచ్చింది. తనకి తెలియకుండా తన పెళ్లి గురించి తండ్రి చేసిన ఏర్పాటేమో అని వ్యాకులపడుతూ "పెళ్లి అన్నారేమిటి?" అంది.

"మా మనవరాలి పెళ్లి అమ్మా. ఈ ఊరి అబ్బాయికి ఇచ్చి చేద్దామనుకుంటున్నాం. అది ఎంక్వయిరీ చెయ్యటానికి వచ్చాం. ఈ ఊళ్ళో ఎవరి గురించి వాకబు చేయాలన్నా ఊరి పెద్ద అయిన మీ తండ్రిగారి వద్దకు వస్తారట కదా"

"మా తండ్రిగారు ఊరి పెద్ద కాదండీ. రిటైర్డ్ టీచరు"

చాణుక్య భ్రుకుటి ముడివడింది. "అప్పలరాజు మాష్టారి ఇల్లు కాదా ఇది?" అని అడిగాడు.

వేదరవళికి ఇప్పుడు విషయం పూర్తిగా అర్థమయింది. "కాదండి. మా నాన్నగారు యజ్ఞవల్క శాస్త్రి మాష్టారు. ఇలా ఊళ్ళో పెళ్లి విషయాలన్నీ భుజాన వేసుకునేది కరణంగారి తండ్రి అప్పలరాజుగారు. ఆయనా మాస్టారే".

"ఓహో. అయితే పొరపాటు జరిగిందమ్మా. మాష్టారి ఇల్లని అడిగితే 'బ్యాంకు ఎదురిల్లు' అన్నారు. ఈ వీధిలో కొచ్చాక అడిగితే మీ ఇల్లు చూపించారు."

"పర్వాలేదండి. మజ్జిగ తాగి వెళ్ళండి"

"వద్దమ్మా. వెళ్తాం. కానీ ఎల్లమందకి బ్యాంకు ఎదురిల్లని చెప్పాం. అతను ఇక్కడికే వస్తాడనుకుంటా. ఇప్పుడెలా?" అని టార్జాను వైపు తిరిగి "ఏం చేద్దాం రా?" అని అడిగాడు.

"వాడు వచ్చేవరకూ ఆగాలి. వాడి ఫోన్ నెంబరు మనకి తెలీదుగా" అన్నాడు టార్జాన్.

ఆ స్వరం వింటూంటే వేదరవళికి ఎందుకో అప్రయత్నంగా వళ్ళు జలదరించినట్టు అయింది. మజ్జిగ తెచ్చే మిష మీద లోపలికి వెళ్ళింది.

మజ్జిగ కలుపుతూ ఉండగా కొత్త స్వరం వినపడటంతో తొంగి చూసింది. చాణుక్య ఎదురుగా నల్లగా బలిష్టంగా ఉన్న వ్యక్తి చేతులు కట్టుకుని నిలబడి ఉన్నాడు. అతడిని గుర్తు పట్టింది. తమ ఊరే. బేడజంగం ఎల్లమంద. గ్రామంలో జరిగే అన్ని ఉత్సవాల్లో, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. అయితే ముసలాయన మనవరాలి పెళ్ళికీ, అంబేద్కర్ నగర్ ఎల్లమందకీ సంబంధం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు.

ఆమె తిరిగి తన పనిలో నిమగ్నమై ఉండగా, బయట సంభాషణ బిగ్గరగా వినిపించటంతో తొంగి చూసింది. ఎల్లమందని బెదిరిస్తున్నట్టు టార్జాను తర్జని చూపిస్తున్నాడు. అదేదో ఘర్షణలా ఉంది. 'పెళ్లి విషయాలు ఇంత గట్టిగా మాట్లాడుకోవాలా?' అనుకుంది.

ఏదో తెలియని ఇబ్బంది. వాళ్ళని వేగంగా పంపించేయాలన్న ఉద్దేశ్యంతో మజ్జిగ తొందరగా కలపసాగింది.

చూస్తూ ఉండగానే వాళ్ళ సంభాషణ తారాస్థాయికి చేరుకుంది. మూడో వ్యక్తి కోసం మరో గ్లాసు తీస్తూ ఉండగా, బయట ఆర్తనాదంలా పెద్ద కేక వినపడింది.

ఎల్లమంద స్వరం.

చేతిలో గ్లాసు వదిలి వేగంగా బయటకు పరుగెత్తుకు వచ్చి అక్కడి దృశ్యం చూసి కెవ్వన అరిచింది.

ఆ అరుపుకి అధర్వణ గది లోపల్నించి తలుపు దబదబా బాదసాగింది.

తుపాకి శబ్దానికి చెట్టుమీద కాకులన్నీ ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరినట్టు నిశ్శబ్దం చెదిరిపోయింది.

ఎల్లమంద శరీరం నేల మీదకు జారిపోయి ఉంది. గచ్చు మీద రక్తం చిన్న మడుగులా తయారైంది. రెండు చేతులతో తల పట్టుకుని విలవిలలాడుతూన్నాడు. బాధ భరించలేక నెల మీద గచ్చుని గోళ్ళతో గీరుతున్నాడు.

టార్జాను చేతిలో కర్ర ఉంది. తండ్రి కూర్చునే పడక కుర్చీ కర్ర..!

ఆమె భీతావహురాలైంది. తూలిపడకుండా తలుపు ఆసరాగా గట్టిగా పట్టుకుని తమాయించుకుంది.

"ఆవేశం తగ్గించుకోమని ఎన్నిసార్లు చెప్పాను" తిడుతున్నాడు చాణుక్య.

"మాటకి మాట ఎదురు చెపుతున్నాడు"

"చెప్తే కొట్టెయ్యటమేనా?" కోపంగా అన్నాడు చాణుక్య.

టార్జాన్ నిర్లక్ష్యంగా తల ఎగరేస్తూ "చంపలేదు. సంతోషించండి" అన్నాడు.

"నోరు అదుపులో పెట్టుకో. మనం ఉన్నది మన ఇంట్లో కాదు" అంటూ చాణుక్య అతడి చేతిలో కర్రని దూరంగా విసిరేసి, ఆమె దగ్గరకు వచ్చి క్షమాపణగా, "ఎవరింటికో వెళ్ళబోయి మీ ఇంటికి రావటం ఒక తప్పు. వచ్చి ఇలా చెయ్యటం ఇంకా పెద్ద తప్పు. క్షమించమనటం చిన్న మాటమ్మా...! ఆవేశం వస్తే మావాడికి వళ్ళూ పై తెలీదు. చిన్న దెబ్బ. వెంటనే హాస్పిటలుకి తీసుకెళ్ళి కట్టు కట్టిస్తాం. అనవసరంగా నీకు ట్రబుల్ ఇచ్చాం. కంగారుపడకు. జరిగింది మర్చిపో. కూతురులాంటి దానివి. మరోసారి క్షమించమని అడుగుతున్నాను" అని టార్జాను వైపు తిరిగి, "చూస్తూ నిలబడ్డావేమిట్రా. పైకి లేపు" అన్నాడు అధికారికంగా.

కాళ్ళలో సత్తువ లేనట్టు వేద ఇంకా అలా అచేతనంగా నిలబడే ఉంది.

టార్జాన్ అతడిని లేపి నిలబెట్టాడు. ఇద్దరూ చెరో భుజం పట్టుకుని నడిపిస్తూ బయటకి తీసుకెళ్ళారు.

నిముషం తరువాత బయట కారు స్టార్ట్ అయిన శబ్దం వినిపించింది.

అప్పటివరకూ స్థాణువులా నిలబడిన వేద కొంచెం సేపటికి తేరుకుంది.

జరిగిందంతా కలలా ఉంది.

సింహద్వారం తలుపు వెయ్యబోతూంటే గచ్చుమీద మడుగులా ఉన్న రక్తం కనపడింది. తలుపు మీద కూడా కొన్ని చుక్కలు పడ్డాయి. అంత రక్తం చూడటం అదే ప్రథమం. కడుపులో తిప్పినట్టు అయింది. నాన్న చూస్తే కంగారుపడతారని బకెట్‌లో నీళ్ళు తీసుకొచ్చి గచ్చు శుభ్రంగా కడిగింది. తలుపు మీద మరకల్ని కూడా కడగసాగింది గానీ, అవి అప్పటికే ఎండిపోయి ఉండటంతో చెరగలేదు. మరిన్ని నీళ్ళతో మరకలు మరింత బలంగా తుడవసాగింది.

అదే ఆమె చేసిన తప్పు

# 7

**రాష్ట్ర** రాజధానికి సుదూరంలో పెదపట్నం అనే ఊరు ఉంది. ఆ ఊరి పోలీసు స్టేషను హౌస్ - ఆఫీసరు ధర్మారావు. పట్నం చుట్టూ చిన్న చిన్న గ్రామాలు చాలా ఉండటంతో ఊపిరి సలపనంత పని ఉంటుంది. ఎన్ని పనులున్నా వచ్చిన వారికి వీలైనంతలో సాయం చెయ్యటం అతడి అలవాటు.

ఆ స్టేషను పరిధిలోకి వస్తుంది ఆదిత్యపురం.

అతడి ఎదురుగా నిలబడి ఉన్నాడు జీవనాదం. డెబ్భై ఏళ్ళు ఉంటాయి. బాల్యం నుంచీ చెప్పులు కుట్టిన శ్రమతో చేతివేళ్ళు వణుకుతూ ఉన్నాయ్. ఏళ్ల తరబడి చెట్టు క్రింద కూర్చోవటం వల్ల చర్మపు పొరల్ని హేమంతం చీలిస్తే, గ్రీష్మం నల్లగా మాడ్చింది. ప్రాణం పోకకి తెరుచుకున్న ద్వారాల్లా కళ్ళు, కాంతిలేని జేగురు రంగులో నిస్తేజంగా ఉన్నాయి.

"నీ పేరు?" అడిగాడు ఇనస్పెక్టరు.

"జీవనాదం బాబూ"

"కూర్చో"

"వద్దండి బాబయ్యా" చేతులు జోడించాడు వృద్ధుడు.

"కూర్చోవయ్యా"

"మీ ఎదురుగా కూర్చోటమా. కళ్ళు పోతాయ్ బాబూ"

"మానుంచి ఏమి సాయం కావాలన్నా నువ్వు కూర్చోవాలి" ప్రేమతో శాసిస్తున్నట్టు అన్నాడు ధర్మారావు.

జీవితంలో ఇలాంటి అనుభవం మొదటిది. అందులోనూ పోలీస్ స్టేషన్లో..! కాస్త తడబడుతూ అతడు కూర్చుంటూ ఉండగా "మీరింకా పాతకాలంలోనే ఉన్నారు జీవనాదం. ప్రపంచం అంతా మారిపోయింది. మీ పిల్లలే ఇప్పుడు డాక్టర్లు, కలెక్టర్లు అవుతున్నారు" అన్నాడు ఇనస్పెక్టరు.

"నా కొడుకు ఇంజనీరే బాబూ"

ధర్మారావు దెబ్బతిన్నట్టు చూసి, పెద్దగా నవ్వేస్తూ, "చూశావా మరి. దేశం మారిపోతోంది కానీ మీలాంటి పెద్దలే ఇంకా బానిసత్వపు భయాల్నుంచి బయటపడటం లేదు. ఎక్కడ పని చేస్తున్నాడు నీ కొడుకు?" అని అడిగాడు.

"మా ఊళ్లోనే సొంత యాపారం బాబూ. పొలాలకి మోటార్లు అద్దెకిస్తూ ఉంటాడు"

"రంగస్థలం సినిమాలో హీరోలా అన్నమాట. ఆ సినిమా చూశావా?" అతడి బెదురు పోగొట్టటానికా అన్నట్టు ప్రశ్నించాడు.

"లేదు బాబూ. ఆ సినిమాలో కూడా అంతేనని నా కొడుకు చెప్పాడు" కొంచెం బెరుకు తగ్గినట్టు సమాధానం ఇచ్చాడు.

"ఎందుకొచ్చావో చెప్పు"

"నిన్నటి నుంచి నా కొడుకు కనిపించటం లేదు బాబూ"

కంప్లయింటు ఇచ్చేటంత మాటరు అందులో ఏముందన్నట్టూ చూశాడు ధర్మారావు.

"ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా లేదు. బయటకు ఎల్లే ముందు ఎప్పుడు వచ్చేదీ చెప్తాడు. ఎల్లాక ఇంటికి రావటం కాస్త ఆలస్యమైనా కబురు చేస్తాడు".

"సెల్ ఫోను ఉంటుంది కదా?'

"మోగటం లేదు సార్. స్నేహితుల్ని అడిగితే తెలీదన్నారు"

"అబ్బాయి పేరు?"

"ఎల్లమంద. బేడజంగం ఎల్లమంద"

అంతలో అక్కడికి జాక్సన్ వచ్చాడు. సెల్యూట్ చేశాడు. సంభాషణ ఇంగ్లీషులో జరిగింది. “ఇప్పుడే న్యూస్ వచ్చింది సర్. ఆదిత్యపురం ఆంధ్రా బ్యాంకు వీధి వెనుక ఒక శవం పడి ఉంది”.

“వీధిలో శవమా?” నుదురు చిట్లించి అన్నాడు ధర్మారావు.

“కాదు సర్. ఇంటి వెనుక పెరట్లో పడి ఉందట. పెరడంటే కరెక్టుగా పెరడు కాదు. అక్కడ ఇళ్ళ వెనుకంతా కొండలు. అడవి”

“ఎవరి ఇల్లు అది”

“ఎవరో శాస్త్రిది. పేరు గమ్మత్తుగా ఉంటుంది. ఏదో... యజ్ఞమో... యాగమో... ఏదో శాస్త్రి”

# 8

**“కాస్త తినమ్మా”** ముద్ద కలిపి చెల్లికి పెట్టబోయింది వేదరవళి.

“నేను తినను”

“ఎందుకు?”

“నాకు బల్లి మాంసం కావాలి”.

“బల్లా? ఇలాంటివన్నీ నీకెవరు నేర్పుతున్నారు?” అన్నది వేద.

“బల్లి మాంసం తింటే తొందరగా పెళ్లవుతుందట. సుదర్శన్ చెప్పాడు.”

సుదర్శన్ పక్కింటి కుర్రాడు. ఇరవయ్యేళ్ళు ఉంటాయ్. అధర్వణతో కబుర్లు చెపుతాడు. బాగా నవ్విస్తాడు. స్కూలు పని పూర్తి చేసుని తను రావటం ఆలస్యం అయితే ఆమెకు భోజనం కూడా పెడతాడు.

“నువ్వూ, మీ నాన్నా ఇంట్లో లేకుండా చూసి వచ్చి చేరతాడు. కాస్త జాగ్రత్తగా చూసుకో. వాడిని రావద్దని చెప్పు” అని హెచ్చరిస్తూ ఉంటుంది ఎదురింటి సావిత్రమ్మ.

“పోన్లే పిన్నీ. అది ఇంట్లో వంటరిగా ఉంటుంది. కాస్త ఎవరో ఒకరు కబుర్లు చెబుతూ ఉంటే బావుంటుంది కదా”

“నీ అంత అమాయకురాలు మరొకరు ఉండరే. కబుర్లు చెబుతూ అక్కడక్కడా తడుముతాడు. నీ చెల్లికేమీ తెలీదు. అదో మాలోకం. చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ఏం లాభం చెప్పు? ఆ సుదర్శన్‌గాడికి నువ్వు చెప్తావా. నన్ను చెప్పమంటావా?”

“వాడు చెల్లికన్నా రెండేళ్ళు చిన్నోడు పిన్నీ. అలా ఆలోచిస్తే కళ్ళు పోతాయ్”

“నీ చెల్లికి మెదడు ఎదగలేదు. నీకు ప్రాపంచిక జ్ఞానం పెరగలేదు. లోకంలో మనుష్యులందరూ మంచోళ్ళు అని నువ్వూ, నువ్వు చెప్పిందే వేదమని మీ నాన్నా నమ్ముతారు.

జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదంలో పడతారు” అంటూండగా దూరంగా గుడి గంట మ్రోగింది. “చూశావా. గంట మ్రోగింది” అంది సావిత్రమ్మ.

“మన మానాన మనం బ్రతికితే ఎవరేం చేస్తారు పిన్నీ. అమాయకత్వాన్ని మించిన అదృష్టం మరొకటి లేదంటాడు నాన్న. ఆయన్ని చూడు, ఎప్పుడూ ఎంత ప్రశాంతంగా ఉంటాడో.”

“ఆయన మొగాడు. సమస్యలన్నీ ఆడాళ్ళకే. సరే. చెప్పాల్సింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం” అంటూ వెళ్ళిపోయింది.

చెల్లికి భోజనం తినిపిస్తూ వేదరవళి ఆలోచనలో పడింది. ప్రపంచంలో అందర్నీ అనుమానిస్తూ బ్రతకాలా? తన మానాన తాను అమాయకంగా బ్రతకటం ప్రమాదమా? నాన్నకి సమస్యలు లేవా? భార్య చనిపోవటం... ఇద్దరు కూతుళ్ళని పెంచటం... రెండో కూతురు మానసిక వైకల్యం... ఇవన్నీ సమస్యలు కావా? మరి ఆయన అంత ప్రశాంతంగా ఎలా బ్రతుకుతున్నాడు? భగవద్గీతని నమ్ముకోవటం వల్లనేగా.

భోజనం చేసి ఆయన వాలుకుర్చీలో తీరుబడిగా కూర్చుని ఉన్నప్పుడు “అమాయకత్వానికీ, అజ్ఞానానికీ తేడా ఏమిటి నాన్నా?” అని అడిగింది.

అకస్మాత్తుగా కూతురు అలా అడిగేసరికి ఆయన ముందు కాస్త తత్తర పడినా, కాస్త అలోచించి “అమాయకత్వంలో ఆనందమూ, అజ్ఞానంలో స్వార్థం ఉంటాయమ్మా. మూడు ముక్కలేసే వాడి కౌశల్యాన్ని సంభ్రమంతో చూడటం అమాయకత్వం. డబ్బులు సంపాదించటం ఇంత సులభమా అని మూడు ముక్కలాడటం అజ్ఞానం” అన్నాడు.

“జ్ఞానం ఉన్నవాళ్ళకి అమాయకత్వం ఉండదా? ఉండకూడదా?”

మరింత ఇబ్బందికరమైన ప్రశ్న. సమాధానం ఏం చెప్పాలో తెలియలేదు. సమాధానం తెలియటం వేరు. తెలిసింది అవతలివారికి అర్థమయ్యేలా చెప్పగలగటం వేరు. చెప్పటానికి ప్రయత్నం చేశాడు: “నష్టంలేని ఆనందం అమాయకత్వం. చందమామలో కుందేలు ఉందన్న భావన ఆనందమే కదా..! అమాయకపు బోసినవ్వుకి మించింది ఏముంది? అమాయకత్వం అయినా, జ్ఞానమయినా... ఆనందం ముఖ్యం. అయితే గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... అవసరమైనప్పుడు అమాయకత్వాన్ని వదిలి జ్ఞానమనే ఆయుధాన్ని వాడాలి. అమాయకత్వం తెల్లవారుఝాము తుషారం లాంటిది. చిన్న వయసులో ఆనందించి వదిలెయ్యకపోతే వయసొచ్చాక ‘అజ్ఞానం’ గా మారి మధ్యాహ్నపు వడగాడ్పులోకి తోస్తుంది. పదేళ్ళ వయసులో అందరూ మంచివాళ్ళనుకోవటం అమాయకత్వం. పదహారేళ్ళ వయసు వచ్చినా అదే అభిప్రాయంతో ఉండటం అజ్ఞానం. చంద్రుడు చల్లగా ఉంటాడు కాబట్టి రాత్రిళ్ళు చల్లగా ఉంటాయనుకోవటం అమాయకత్వం. సూర్యుడు సమీపంలో ఉండడు కాబట్టి రాత్రిళ్ళు చల్లగా ఉంటాయనుకోవటం జ్ఞానం..”

ఆమెకు సత్య గుర్తు వచ్చాడు. ఒకసారి ఎప్పుడో 'మీ మొహం సూర్యబింబంలా ఉన్న'దన్నాడు. కోపం వచ్చింది. వివరించి చెప్పాడు. 'మొహం చంద్రబింబంలా ఉన్నదంటే, అమాయకురాలైన అమ్మాయి సంతోషిస్తుంది. జ్ఞానవంతురాలైన అమ్మాయి సంతోషించదు. చంద్రుడికి సొంత వెలుగు లేదు. స్వంత వ్యక్తిత్వం లేదు. భూమి అటొస్తే అమావాస్య. ఇటొస్తే పౌర్ణమి. సూర్యుడలా కాదు. స్వయం ప్రకాశుడు. అతడు క్షణం మాయమయితే భూమి మీద చరాచరాలు ఉండవు. చంద్రుడి అందం కన్నా సూర్యుడి జ్ఞానం నచ్చి మీ మొహాన్ని సూర్యుడితో పోల్చాను' అన్నాడు.

సత్య గుర్తు రాగానే పెదాలమీద నవ్వు కదలాడింది.

'ఏమిటమ్మా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?' అన్న తండ్రి మాటలకి తెప్పరిల్లి "జ్ఞానంలో ఆనందం లేని పక్షంలో, జ్ఞానాన్ని పక్కన పెట్టి, ప్రాపంచిక విషయాల్ని అమాయకంగా ఆనందించటం తప్పా నాన్నా?" అని అడిగింది.

ఫిలాసఫీని సోషియాలజీతో కలిపి చిన్నవాక్యంలో పొదిగిన కూతురి ప్రశ్నకి అబ్బురపడుతూ "లేదమ్మా లేదు" అన్నాడు. "ఆనందానికి ప్రతీక 'నవ్వు'. నవ్వులు ఏడురకాలు. మిడిమిడిజ్ఞానం ఉన్నవారు అతిహసితం, అపహసితం అనే మొదటి రెండు రకాల రోగాలతో బాధపడతారు. అంటే అతివృష్టి, అనావృష్టి..! జ్ఞానం వస్తూన్న సమయంలో తర్కం జ్వలిస్తుంది. ఆ సమయంలో మొహం మీద నవ్వు తగ్గిపోతుంది. జ్ఞానం పరిపూర్ణం అయ్యాక మందహాసం, స్మితం, హసితం, విహసితం, ఉపహసితం అన్న ఐదురకాల నవ్వులతో వదనం వికసిస్తుంది. అందుకే కదా ఇటు పిల్లలూ, అటు జ్ఞానులూ మాత్రమే ప్రశాంతమైన నవ్వుతో ఉంటారు. ఆ కారణం వల్లనే కదా మిడిమిడి జ్ఞానం ఉన్నవారు ఎప్పుడూ సీరియస్‌గానూ లేదా అతి నవ్వుతోనూ, వెకిలి నవ్వుతోనూ ఉంటారు..!" అని ఆగి, ముక్తాయింపుగా ఆఖరి మాట చెప్పాడు: "జ్ఞానం అంటే అన్నిటి మీదా ప్రేమ వదులుకునే వైరాగ్యం కాదు. అందరినీ ప్రేమించగలిగే మందహాసపు వేదాంతం. ఇంకా చెప్పాలంటే ప్రపంచాన్ని మునుపటి కంటే ఎక్కువగా ప్రేమించగలగడం. మనం మంచిగా ఉంటే ప్రపంచం అంతా మంచిగా ఉంటుంది. ఈ దృక్పథంతో చూడటం మొదలు పెడితే, రోజూ చూసే సూర్యోదయమూ, చుట్టూ ఉన్న ప్రపంచమూ, మనుషులూ ఎంత ఇష్టంగా కనిపిస్తారో" అన్నాడు.

వారి అభిప్రాయాలు తప్పని నిరూపించే సంఘటన ఆ రోజు జరిగింది.

* * *

తుప్పల్లో పడి ఉన్న ఎల్లమంద శవాన్ని ఫోటోలు తీయించాడు ఎస్పై జాక్సన్. పల్లెటూరు కాబట్టి విషయం తెలియగానే సాధారణంగా జనం గుమికూడతారు. కంట్రోలు చెయ్యటం కూడా కష్టం అవుతుంది. కానీ ఇంటి వెనుకంతా అడవి కాబట్టి ఎవరూ రాలేదు. అసలా ఇంటివారికే తమ పెరటి వెనుక కొండ కింద తుప్పల్లో పోలీసులు ఫోటోలు తీసుకుంటున్నారని తెలీదు.

పోస్టుమార్టం కోసం శవాన్ని పెదపట్నం ఆస్పత్రికి పంపి మరణించిన ఎల్లమంద ఇంటికి వెళ్ళాడు. పాకకి పెద్ద – పెంకుటింటికి చిన్న అన్నట్టుంది ఇల్లు. ఇంటి ముందు జనం గుమిగూడి ఉన్నారు. పోలీసు డ్రెస్సు చూసి దారి ఇచ్చారు. శవం దగ్గర ఇద్దరు స్త్రీలు ఏడుస్తున్నారు. చనిపోయిన వ్యక్తి జీవనాదం. ఎల్లమంద తండ్రి. కొడుకు తప్పిపోయాడని కంప్లెయింటు ఇచ్చినవాడు, కొడుకు మరణించాడన్న వార్త తెలిసి తనూ శలవు తీసుకున్నాడు. రెండు రోజుల్లో జీవనాధారమైన ఇద్దరు ఆత్మీయుల మరణవార్తని తట్టుకోలేని తల్లీ కూతుళ్ళు హృదయవిదారకంగా రోదిస్తున్నారు. వారిని దాటుకుని లోపలికి వెళ్ళాడు.

పడగ్గదిలో ఒక మంచం. ముందు ఒక చిన్న గది. వంటిల్లు. అంతే.

మంచం పైన గోడకి ఒక అమ్మాయి ఫోటో తగిలించి ఉంది. దానిని తీసుకుని బయటకు వచ్చాడు. గుంపులో కుర్రాడికి ఆ ఫోటో చూపించి "ఇది ఎవరిది?" అని అడిగాడు.

"మేస్టారి అమ్మాయి. రవళి" అన్నాడా కుర్రాడు.

# 9

**"ఏమిటమ్మా** అదోలా ఉన్నావ్?" భోజనం చేస్తూ కూతుర్ని అడిగాడు యజ్ఞవల్కశాస్త్రి. విశాలమైన హాలులో ఒక మూలగా పీట మీద కూర్చుని తినటం ఆయన అలవాటు.

"అబ్బే ఏం లేదు నాన్నా"

"అబద్ధం చెప్పకు. నిన్నటి నుంచీ చూస్తున్నాను. ఏదో ఆలోచిస్తున్నావు".

జరిగిన గొడవ తండ్రికి చెపుదామా వద్దా అని ఆమె సంశయిస్తూ ఉండగా బయట బూట్ల శబ్దం వినిపించింది. ఇద్దరూ అటు చూశారు.

పోలీసు దుస్తుల్లో ఉన్న ఒక వ్యక్తి లోపలికి వస్తూ కనపడ్డాడు. వాళ్లకి అర్థం కాలేదు. రవళి లేచి నిలబడింది. అతడి ఛాతి దగ్గర ప్లేటు మీద 'జాక్సన్' అని ఉంది. భుజం మీద నక్షత్రాలు సబ్–ఇనస్పెక్టరు హోదాని సూచిస్తున్నాయి. వచ్చీ రావటంతో "మొన్న ఎల్లమంద అనే కుర్రాడు మీ ఇంటికి వచ్చాడా?" అని ఆమెని అడిగాడు.

శాస్త్రి చెయ్యి కూడా కడుక్కోకుండా లేచి నిలబడ్డాడు. జాక్సన్ ఆయన్ని పట్టించుకోలేదు. రవళి వైపే చూస్తున్నాడు. అందం ఆమె చీరె కట్టులో లేదు. కట్టు మధ్యలో తెల్లగా కనపడుతూన్న సన్నటి నడుము పై భాగపు ఎత్తు పల్లాల మధ్య ఇరుక్కుపోతున్న యవ్వనంలో ఉంది.

"అడిగినదానికి చెప్పవేం?"

"ఎల్లమంద ఎవరు" శాస్త్రి కల్పించుకుని అడిగాడు.

"నువ్వు మాట్లాడకు" జాక్సన్ కసిరాడు.

మాస్టారు హర్ట్ అయ్యారు. ఆయన్ని ఎవరూ 'నువ్వు' అని సంబోధించరు.

జాక్సన్ తిరిగి అదే ప్రశ్న అడగబోతూ ఉంటే, రవళి క్లుప్తంగా "వచ్చాడు" అన్నది. మాష్టారు స్థబ్దుడై చూశాడు. సాధారణంగా ఇంట్లో జరిగిన ప్రతి విషయమూ కూతురు తనకి చెపుతుంది.

"ఇద్దరూ ఏమి మాట్లాడుకున్నారు?"



రవళి తెల్లబోయినట్టు, "మేము మాట్లాడుకోవటం ఏమిటి? ముందు ఎవరో ఇద్దరు వచ్చారు. ఆ కుర్రాడిని ఇక్కడికి రమ్మన్నారుట. పొరపాటున మా ఇంటి అడ్రసు ఇచ్చారు. కొంచెంసేపు మాట్లాడుకుని ముగ్గురూ వెళ్ళిపోయారు. వాళ్ళెవరో కూడా నాకు తెలీదు" అంది.

"అంతేనా?"

"అంతే"

"ఎల్లమంద ఎవరో ఇంతకీ నీకు తెలీదంటావు"

"ఇదే ఊళ్ళో ఏదో యువసంఘానికి నాయకుడు"

"మరి ఇప్పుడేగా... ఎవరో తెలీదన్నావ్"

"పేరు తెలుసు. మొదటిసారి చూడటం నిన్నే"

ఫ్రేము కట్టబడిన పోస్ట్ కార్డు సైజు ఫోటో ఒకటి చూపిస్తూ "ఇది నీదేనా? దీన్ని చూడటం కూడా మొదటి సారేనా?" వ్యంగ్యంగా అడిగాడు. ఫోటో చూస్తూంటే ఆమె మొహం పాలిపోయింది.

అది తనదే.

"ఇది ఎక్కడిది?" అని అడిగింది అయోమయంగా.

"ఎల్లమంద పడగ్గదిలోది...! ఫ్రేము కట్టించి పెట్టుకున్నాడు"

భూమి గిర్రున తిరుగుతున్నట్టు అయింది. ఎలాగో నోరు పెగిలించుకొని "ఇదంతా ఏమిటో నాకర్థం కావటం లేదు. ఈ ఫోటో చూడటం ఇదే మొదటి సారి" అన్నది.

ఆమె మాటలు పట్టించుకోకుండా జాక్సన్ చుట్టూ చూశాడు. అతడి దృష్టి గుమ్మం పైన పడింది. అటుగా నడిచి ఆగి వెనక్కి తిరిగి ఆమె వైపు అదోలా చూస్తూ, "ఎవరో ముగ్గురు వచ్చారు. ఓ అయిదు నిముషాలు మాట్లాడుకుని వెళ్ళిపోయారు. అంతేగా నువ్వు చెప్పేది" అని అడిగాడు.

"అవును" అంది.

జాక్సన్ వంగి పరిశీలనగా పరీక్షిస్తూ, "ఇదేమిటి? రక్తమా? తిలకమా?" అన్నాడు.

తెరుచుకున్న మూడో నేత్రపు ప్రళయాగ్నికి నాలుగు దిక్కులూ స్తంభించి ఆరు ఋతువులూ గతి తప్పినట్టుగా ఉన్నది ఆమె స్థితి. ఊహించని దిక్కు నుంచి వచ్చిన బాణం లేత లేడిపిల్ల ఎదని చీల్చినట్టు విలవిలలాడింది.

విషయమేమీ తెలియని శాస్త్రి కత్రాట అయ్యాడు.

ఈ లోపులో అనుకోని మరో సంఘటన జరిగింది. కర్ర సాము చేస్తున్నట్టు చేతిలో కర్ర గిర్రున త్రిప్పుతూ, "చంపేస్తా... తల బ్రద్దలుకొట్టేస్తా..." అంటూ అధర్వణ లోపల్నుంచి పరుగెత్తుకుంటూ వచ్చింది.

ఆమె చేతిలో రక్తపు మరకలు అంటిన పడక్కుర్చీ కర్ర ఉన్నది.

జాక్సన్ వెళ్లి ఆ కర్ర తీసుకున్నాడు... కర్చీఫ్ తో.

# 10

**మధ్య** గదిలో కూర్చుని ఉన్నది వేదరవళి. ఆలోచించటానికి కూడా మనసు సహకరించటం లేదు. తండ్రిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషనుకి తీసుకువెళ్ళారన్న వాస్తవాన్నే మనసు జీర్ణించుకోలేక పోతోంది. ఆలోచనలు గంట క్రితం జరిగిన సంఘటనల గతంలోకి వెళ్ళాయి.

జరిగిందంతా స్వయంగా చూసినట్టుగా "...ఎల్లమంద నిన్ను ప్రేమించాడు. పెళ్ళికి ప్రపోజ్ చేశాడు. నువ్వు కాదన్నావు. అటో ఇటో తేల్చుకుందామని మీ ఇంటికొచ్చాడు.

ఇద్దరికీ గొడవ జరిగింది. నిన్ను బలవంతం చెయ్యబోయాడు. నువ్వు అతన్ని చంపేశావు" చెప్పాడు జాక్సన్.

రవళి తెల్లబోయి, "నేనా? చంపటమా? అసలు అలా జరగలేదు" అన్నది.

"అలా జరగలేదని నాకూ తెలుసు. అలా జరిగిందని చెప్తే శిక్ష పడదని చెప్తున్నానంతే. రేప్ టైములో చంపటం నేరం కాదు".

'రేప్–చంపటం–నేరం' అన్న మాటలకి నోట మాట రానట్టు ఉండిపోయింది రవళి.

"అతను మీ ఇంటికి వచ్చినట్టు సాక్ష్యం ఉంది. గుమ్మం దగ్గర రక్తం ఉంది. దాన్ని నువ్వు తుడిచిన గుర్తులున్నాయి. మీ ఇంటిలో హత్యాయుధం, మీ పెరట్లోనే శవమూ ఉన్నాయి. ఇంకేమి కావాలి?"

భూమి రెండుగా చీలిపోయినట్టు అయింది. తడారిన గొంతుతో "మా... మా పెరట్లో శవమా" అంది. కూతురు అన్యమనస్కంగా ఉండటానికి కారణం శాస్త్రి కి అర్థం అవుతోంది.

"అవును. ఇంటి వెనుక కొండ దగ్గర ఉంది" అన్నాడు పోలీసు అధికారి.

ఎప్పుడో కట్టిన ఇల్లు. ఇంటి ముందు ప్రహరీలా తడికెల సరిహద్దు ఉన్నది. వెనుక వైపు ఏమీ లేదు. అక్కడి నుంచీ దూరంగా కొండ వరకూ చిట్టడివిలా ఉంటుంది. అక్కడ హడావుడిగా ఉంటే, ఎందుకో అనుకుంది. శవం అనుకోలేదు.

"నువ్వు నాతో పాటూ పోలీస్ స్టేషనుకు రావాల్సి ఉంటుంది"

"నేనా?"

"లేదంటే అరెస్టు చేసి తీసుకు వెళ్లాల్సి ఉంటుంది".

అప్పటివరకూ మౌనంగా ఉన్న శాస్త్రి కల్పించుకొంటూ "అమ్మాయి వద్దు. నేను వస్తాను" అన్నాడు.

జాక్సన్ బిగ్గరగా నవ్వి, "పెళ్ళికూతురి తండ్రి 'శోభనం గదిలోకి అమ్మాయి వద్దండీ. నే వస్తాను' అన్నట్టుంది నీ ఆఫరు" అన్నాడు.

రవళి చప్పున తండ్రి వైపు చూసింది. గొప్ప గొప్ప ప్రముఖులూ, ఉన్నతస్థాయి ఉద్యోగులూ తండ్రి ముందు గౌరవంగా నిలబడటం తెలుసు తప్ప, ఇలా మాట్లాడేవారిని చూడటం ఇదే మొదటి సారి. ఒక చిన్న సంఘటన మనిషిని ఎలాంటి స్థితి నుంచి ఎటువంటి స్థాయికి దిగజారుస్తుందో చూస్తుంటే, 'నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే...' అన్న మాట గుర్తొచ్చింది.

"అసలే పల్లెటూరు. పెళ్లి కావలసిన అమ్మాయి బాబూ. పోలీసు స్టేషనుకి వస్తే బావోదు".

సబ్–ఇనస్పెక్టరు చేతులు పట్టుకుంటున్నట్టు బ్రతిమాలుతున్నాడు తండ్రి.

దుఃఖం వచ్చినా బావుండును. కానీ గొంతులో అడ్డుపడుతున్న సంస్కారం దాన్ని ఆపుతోంది. అది దుఃఖం కన్నా భయంకరం. అయితే ఆమె దుఃఖం, తన కష్టం గురించి కాదు. తండ్రికి జరుగుతున్న అవమానం గురించి.

"అమ్మాయి బదులు నువ్వు రావటం, కూతురు నేరం నీమీద వేసుకోవటం... సినిమాలు బాగా చూస్తావా పంతులూ?" నవ్వుతూ అన్నాడు జాక్సను.

శాస్త్రి ఒక నిర్ణయానికి వచ్చినట్టు, "ఆ అబ్బాయిని చంపింది నేనే" అన్నాడు.

జాక్సన్ మొహం మీద నవ్వు మాయమైంది.

ఈ ఆకస్మిక పరిణామానికి రవళి స్థాణువై చూసింది.

"అవును నేనే..." అన్నాడు ఆయన. "ఎల్లమంద వచ్చి తన మనసులో మాట చెప్పాడు. నా ప్రాణంపోయినా ఈపెళ్లి కుదరదని చెప్పాను. గొడవ పెద్దదయింది. నన్ను చంపటానికి ప్రయత్నించాడు. కర్రతో కొట్టాను. నుదుటి మీద తగిలింది".

"శరీరాన్ని ఇంటివెనుక పడేశావ్. అంతేగా"

శాస్త్రి మాట్లాడలేదు.

"చేసిన నేరాన్ని పెపంచంలో అందరూ ఇంత తొందరగా వప్పుకుంటే మా పని ఎంత సులభం అయ్యేది పంతులూ. పద" అన్నాడు జాక్సన్.

ఇద్దరూ కదలబోతూంటే షాక్ నుంచి తేరుకున్నట్టు రవళి, "నాన్నా..." అంటూ ఏదో అనబోయింది. ఆయన తల తిప్పి ఆమె వైపు 'ఇంకేమీ మాట్లాడ వద్దన్నట్టు' చూశాడు. ఆ చూపులో ఆజ్ఞ అర్థమై ఆమె శిలలా ఆగిపోయింది. కనులు తడి అయ్యాయి. వాళ్ళు సాగిపోయారు.

* * *

ఆలోచనల నుంచి తెప్పరిల్లి టైము చూసింది. తండ్రి వెళ్లి అరగంట అయ్యుంటుంది. అక్కడ ఏమి జరుగుతూ ఉండి ఉంటుంది? మేజిస్ట్రేట్ దగ్గరకు తీసుకువెళ్ళి ఉంటారా? లాకప్పులో పెట్టి ఉంటారా? అట్నుంచి అటే జైలుకు పంపే ఏర్పాట్లు జరుగుతూ ఉండి ఉంటాయా?

ఏమిటి తాను చేసిన తప్పు? ఇంటికి వచ్చిన వారెవరో కూడా తనకి తెలీదు. వారి మధ్య ఘర్షణ జరిగింది. 'ఇంత చిన్న విషయం కూడా పోలీసులకి చెప్పాలా' అనుకుంది. అంతేగా. 'వెన్న తిన్న వాణ్ని వదిలేసి చల్ల తాగినవాడిని కొట్టారట' అన్నట్టు, హత్య చేసిన వాణ్ని వదిలేసి...

సరే. అయిందేదో అయిపోయింది. ఆదిపర్వంలో ***'జానన్నపిచ యః పాపం శక్తిమాన్న నియచ్ఛతి'*** అంటాడు వ్యాసుడు. పాపాన్ని ఎదుర్కోకుండా ఉన్నవాడు కూడా పాపం చేసినవాడితో సమానమని అర్థం. ఇప్పుడేమి చెయ్యాలి?

సామాన్యులు సమస్యని భూతద్దంలో చూసి బెంబేలవుతారు. మధ్యములు భవిష్యత్తు ఊహించుకుని కంగారు పడతారు. విజ్ఞులు పరిష్కారాలు ఆలోచిస్తారు. పైకి అమాయకంగా కనపడినా, తండ్రి పెంపకం వల్ల ఆమెకి ఆ మాత్రం విజ్ఞత అలవడింది.

తండ్రి నేర్పిన ప్రజ్ఞకి ఇప్పుడు ఈ పరీక్ష..!

బంగారం మెరవాలంటే కొలిమిలో కరగాలి. విజ్ఞత బయట పడాలంటే కష్టంలో కాలాలి. అయితే, ప్రస్తుత సమస్యకి ఆ విజ్ఞత సరిపోతుందా అన్నది కాలమే నిర్ణయించాలి.

***'రేపటి యుద్ధం గురించిన విచారంతో ఈ రోజు నిద్ర పాడుచేసుకోవటం కంటే, ఈ రోజే యుద్ధం మొదలుపెట్టటం మేలు'*** అన్న 'ఆర్ట్ ఆఫ్ వార్' కొటేషన్ గుర్తొచ్చింది.

మొదటగా స్నేహితుడు సత్యకి ఫోన్ చేసింది. అతడు అట్నుంచి, "ప్రస్తుతం నేను స్నేహితులతో కేరళలో..." అంటూండగా లైను కట్ అయ్యింది. ఆ పై దొరకలేదు. మరో పది నిముషాలు గడిచాయి. ఇక ఇంట్లో ఉండలేక పోయింది. మరో స్నేహితురాలికి ఫోన్ చేసి, "మీ అన్నయ్య ఉన్నారా?" అని అడిగింది. ఉన్నాడంటూ ఫోను అతడికి ఇచ్చిందామె. అతడి పేరు సౌజన్యారావు. రవి అంటారు. లాయరు. రవళికి తెలుసు.

"ఎక్కడున్నావ్ రవీ" అని అడిగింది.

"ఇక్కడే. పెదపట్నం"

"నువ్వు వెంటనే మీ ఊరి పోలీస్ స్టేషనుకి రాగలవా? అన్ని వివరాలూ అక్కడ చెపుతాను".

ఆదిత్యపురానికి పెదపట్నం పది క్రోసుల దూరం. ఆమె అక్కడికి వెళ్ళే సరికి రవి అక్కడే చెట్టు క్రింద నల్లకోటు వేసుకుని నిలబడి ఉన్నాడు.

"ఏం జరిగింది?" అని అడిగాడు. ఆమె క్లుప్తంగా చెప్పింది.

"మై గాడ్. మర్డరు కేసా? అంకుల్ ఎక్కడున్నారు?"

"లోపల. వెళ్దాం పద"

"లోపలకా?" నసిగాడు. ఆమె అతడి వైపు చిత్రంగా చూసి, అతడి మొహంలో భావాలు పసిగట్టి "ఇంత వరకూ పోలీస్ స్టేషను లోపలికి ఎప్పుడూ వెళ్ళలేదా?" అని ప్రశ్నించింది.

"లేదు"

"రెండు సంవత్సరాల నుంచీ ప్రాక్టీస్ చేస్తున్నావ్. ఇంత వరకూ పోలీస్ స్టేషనుకి వెళ్ళలేదా?" ఆశ్చర్యంగా అడిగింది.

"లాయర్లు పోలీస్ స్టేషనుకి వెళ్లరు. కోర్టుకి వెళతారు"

"మరి పోలీస్ స్టేషనులో ఏదైనా పని ఉంటే ఎవరు వెళతారు?"

"బ్రోకర్లు"

ఆమెకు తల తిరిగినట్టయింది. అతడి సమాధానం గురించి కాదు. భయాన్ని కప్పి పుచ్చుకోవటానికి అతడు ఎన్నుకున్న వాదన గురించి. ఒకప్పుడు పోలీస్ స్టేషనుకి ఆడవాళ్ళు వెళ్ళటానికి భయపడేవారు. ఇప్పుడు వాళ్ళే ధైర్యంగా వెళ్తున్నారు. అటువంటిది ఒక మొగవాడు, అందులోనూ ఒక 'లాయరు' పోలీసులతో మాట్లాడటానికి తటపటాయిస్తున్నాడంటే... ఇదే విషయం ఎవరైనా తనకు చెప్తే నమ్మేది కాదు.



అతడు తన వాదన కవరు చేసుకోవటానికా అన్నట్టూ, "లాయర్లు పోలీస్ స్టేషనుకి వెళ్లి బెయిల్ పేపర్లు ఇవ్వటం, ఇనస్పెక్టరుతో వాదించటం వగైరా కేవలం సినిమాల్లోనే చూస్తాం. బెయిల్ పేపర్లు కోర్టు నుంచి డైరెక్టుగా పోలీసులకి రావాలి. లేదా సీల్డ్ కవర్లో తెచ్చివ్వాలి. నేను సీనియరుతో కలిసి కోర్టుకి వెళ్ళటమే తప్పు..." అంటూ ఉండగా, "మనం వెళ్తున్నది నేరం వాదించటానికి కాదు ఇనస్పెక్టరుతో మాట్లాడి, ఏమి జరిగిందో కరెక్టుగా తెలుసుకోవటానికి" అంది.

అంతలో సడెన్ గా అక్కడి దృశ్యాన్ని చూసి ఇద్దరూ ఆగారు. రవళి మొహం రక్తం లేనట్టూ తెల్లబడింది.

వ్యాన్ ముందు సీటు లోంచి జాక్సను, వెనుక వైపు నుంచి తండ్రి, ఆయనతో పాటూ కరణంగారు దిగారు. కరణం కూడా వచ్చారంటే, ఈ పాటికి ఈవార్త ఊరంతా తెలిసిపోయి ఉంటుంది. అయిపోయింది. ఒక్క ఘటనతో పరువంతా మంట కలిసిపోయింది.

వాళ్ళు ముగ్గురూ స్టేషను మెట్లు ఎక్కుతూ ఉండగా, రవళి చెట్టు క్రింది నుంచి కదిలి, టైము వేస్ట్ చెయ్యటం ఇష్టం లేనట్టు రవితో "నేను లోపలికి వెళ్తున్నాను. నువ్వు వస్తావా, ఇంటికి వెళ్లిపోతావా?" అడిగింది.

అతడు కాస్త తటపటాయించి, "వస్తాను పద" అన్నాడు.

ఇద్దరూ బిల్డింగ్ వైపు నడుస్తూండగా, "నేను రమ్మన్నది బెయిల్ కోసం కాదు. నాన్నకి మోరల్ సపోర్ట్ కోసం. అయినా ఇది హత్య కేసు. పోలీస్-బెయిల్ కాదు. బెయిలు కోర్టు ఇవ్వాలి" అన్నది.

"నీకు 'లా' బానే తెలుసే" అన్నాడు. ఆమె ఆ మాటలు పట్టించుకోకుండా మెట్లు ఎక్కింది.

***సమస్య వచ్చినప్పుడు సరైన వ్యక్తిని సంప్రదించకుండా, అందుబాటులో ఉన్న వ్యక్తిని సంప్రదిస్తే వచ్చే నష్టాలేమిటో, అనుభవం నేర్పిన తొలి పాఠం.***

స్టేషను మెట్లెక్కి లోపలికి అడుగు పెట్టిన రవళి, ఊహించని దృశ్యం చూస్తున్నట్టు అక్కడే ఆగిపోయింది.

ఇనస్పెక్టరు వంగి తండ్రి కాళ్ళకి నమస్కారం చేస్తున్నాడు. తండ్రి అతని భుజాలు పట్టుకుని లేపుతున్నాడు. "నేను మీ ఓల్డ్ స్టూడెంటు ధర్మారావుని మాష్టారూ" అంటున్నాడు. పక్కనే జాక్సను మొహం నిర్వికారంగా పెట్టటానికి ప్రయత్నిస్తూ నిలబడి ఉన్నాడు. ఆమెకు ఏదో 'గెలిచిన' భావం కలిగింది. దానికి హేతువేమీ లేదు. ప్రతీ చిన్న ఆనందానికీ హేతువు ఉండనవసరం లేదు. మొదటి నుంచీ ఆమెకు జాక్సన్ ఎందుకో నచ్చలేదు. మాట్లాడుతున్నంత సేపూ అతడి చూపులు ఎక్కడ నిలిచాయో ఆమె గమనించక పోలేదు.

"ఇదేమిటి బాబూ... లే" అని వారిస్తూన్న శాస్త్రి దృష్టి, గుమ్మం దగ్గర నిలబడ్డ కూతురి మీద పడింది. రావద్దన్నా వచ్చినందుకు కోప్పడాలో, ఆపదలో ఆసరాగా ఉండాలన్న ఆమె ఆపన్న హస్తపు అభిలాషకు ఆనందించాలో తెలియని తటపటాయింపుతో ఉండగా, జాక్సన్ ఆమెని "లోపలికి రండి" అంటూ ఆహ్వానించి, ఆమె లోపలికి అడుగిడగానే ఇనస్పెక్టరుతో మాస్టారి'గారి' కూతురు అని పరిచయం చేశాడు. అతడు తన తండ్రిని గౌరవంతో సంబోధించటం ఆమె గమనించక పోలేదు.

"మీ పేరు వేద రవళి కదూ" అన్నాడు ధర్మారావు ఫైలు పరిశీలిస్తూ.

అవునన్నట్టు తలూపింది.

"నేను అప్పుడప్పుడు మీ ఇంటికి వచ్చేవాడిని. అప్పట్లో గౌన్లు వేసుకునే వయసు మీది" అంటూ ముందుకి వంగి "మాష్టారు నాకు దైవంతో సమానం. చేతనైనంత వరకూ సాయం చేస్తాను. ఉన్నదున్నట్టు చెప్పండి. మీకూ ఆ కుర్రాడికీ ఏమిటి సంబంధం?" అని అడిగాడు.

ఆమె బిత్తరపోయి, "నాకా? సంబంధమా? అసలు అతన్ని ఇంత వరకూ చూడనేలేదు" అన్నది.

ఆమె మాటల్లోని నిజాయితీని గుర్తించినట్టు ధర్మారావు చాలాసేపు మౌనంగా ఉండి తనలో తానే ఆలోచించుకుంటున్నట్టు: "ఎల్లమంద మిమ్మల్ని ఆరాధించాడు. ఆ విషయం బయటకి చెప్పలేక ఇంట్లోనూ, జేబులోనూ ఫోటోలు పెట్టుకున్నాడు. అతడిని ఎవరో చంపాలనుకున్నారు. మీ ఇంటికి పిలిపించి, అక్కడ చంపి, మీకు తెలియకుండా శవాన్ని మీ పెరట్లో పడేసి ఆ నేరం మీ మీదకు తోసేశారు" అన్నాడు.

శాస్త్రి తన పూర్వవిద్యార్థి వైపు అభినందన పూర్వకంగా చూశారు. జాక్సన్ అభావంగా వింటున్నాడు.

"అయితే మనం ఇక్కడ ఆలోచించవలసింది... వాళ్ళకేం కావాలని..! ఎల్లమందని చంపటమా? మిమ్మల్ని జైలుకి పంపటమా? వాళ్ళకి కావాల్సింది ఎల్లమందే అయితే, రోడ్డు మీదే చంపొచ్చుగా. మీ ఇంటికి పిలవటం. శవాన్ని దాయటం... ఇదంతా దేనికి?" అని ఆగి, "బై ది బై మీకెవరైనా శత్రువులు ఉన్నారా?" అని అడిగాడు.

"చాలామంది..! కొన్ని వేలల్లో" అన్నది.

ఊహించని ఈ సమాధానానికి శ్రోతలు ముగ్గురూ అవాక్కయ్యారు. శాస్త్రి అయితే నిశ్చేష్టుడే అయ్యాడు.

"అవును. కొన్ని సంవత్సరాల క్రితం 'మి...టూ' అని వచ్చింది చూడండి. అలాగే నేను కూడా 'యు...టూ' అని పెట్టాను, లంచగొండితనం, అధికారులలో అలసత్వం, యువకుల్లో పోకిరీతత్వం పోవటానికి...." అంటూ ఉండగా, ధర్మారావు ఆమె మాటలు మధ్యలో ఆపుచేస్తూ "నాకు తెలుసు. చాలామంది భయపడిపోతున్నారు. ఈ సైటు పెట్టింది మీరే అంటే ఆశ్చర్యంగా ఉంది. మరికొద్ది కాలంలో ఇది ప్రధాన మంత్రి దృష్టికి కూడా వెళ్తుంది. ఐ యం ష్యూర్ అబౌట్ ఇట్. ఈ విధంగా కలుసుకోవటం దురదృష్టమే అయినా, సంతోషంగా ఉంది. మీరు చేస్తున్నది చిన్న పనేమీ కాదు రవళీ. ఒక రివల్యూషన్. మొన్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి కూడా ప్రస్తావించారు" అన్నాడు.

ఆ స్థితిలో కూడా శాస్త్రి సంభ్రమంగా ఈ సంభాషణ వింటున్నాడు. కూతురు ఏదో సైటు నిర్వహిస్తూందని తెలుసు గానీ, అది ఇంత పాపులర్ అని తెలీదు. సంతానం తొలి అడుగు వేసిన సంతోషం. జాక్సన్ కూడా ఆమె వైపు దిగ్భ్రమతో చూశాడు. 'వేదరవళి' అన్న పేరు అతడికి అప్పుడు గుర్తు వచ్చింది. 'యు...టూ' వేద రవళి...! ఎమ్మే సోషియాలజీ...! అమాయకంగా, పల్లెటూరి పిల్లలా కనిపించే ఈ అమ్మాయి... 'ఆ' అమ్మాయా? ఎందుకో తెలీదు కానీ, అప్రయత్నంగా అతడికి భయమేసింది. మీసాల్రాజా, అతడి గ్యాంగు గుర్తొచ్చింది. చిన్న కేసు అనుకున్నది పెద్దదయ్యే సూచనలు కనిపించాయి.

ఈ లోపులో ధర్మారావు రవళితో, "హత్య చేసింది మీ శత్రువులా? ఎల్లమంద శత్రువులా? అన్నది తెలియటానికి చాలా కాలం పడుతుంది. బహుశా తెలియకపోవచ్చు కూడా. ఎవరో చాలా తెలివిగా ప్లాన్ చేసి, అర్ధరాత్రి శవాన్ని తీసుకొచ్చి మీ ఇంటి వెనుక పడేసారు" అని జాక్సను వైపు తిరిగి, "ఏమయ్యా అంతేనా?" అని అడిగాడు.

అతను మాట్లాడలేదు.

"నేను చెపుతున్నదానిలో తప్పు ఉన్నదా? నీ అభిప్రాయం ఏమిటి?"

"బయటవాళ్ళు ఎవరో హత్య చేశారనుకుంటే మీరు చెప్పేదంతా కరెక్ట్ సార్"

ఊహించని ఆ సమాధానానికి ధర్మారావు దెబ్బతిని, వెంటనే తెప్పరిల్లాడు. "అవును కరెక్టే కదా. అన్నీ మనం ఊహించేసుకోకూడదు. నేరస్తులు ఎవరో తేలే వరకూ అందరూ అనుమానితులే."

వేదరవళితో వచ్చిన లాయరు కుర్రాడు మొదటిసారిగా నోరు విప్పి, "బెయిలు..." అన్నాడు.

"మర్డరు కేసు కాబట్టి బెయిలు వెంటనే దొరక్కపోవచ్చు. అదీగాక నేరస్తుడే స్వయంగా నేరాన్ని వప్పుకున్నప్పుడు..." జాక్సన్ మాట పూర్తి కాకుండానే రవళి మధ్యలో కల్పించుకుని కఠినంగా "నాన్న నేరం వప్పుకోలేదు. కూతురి బదులు తను పోలీస్ స్టేషనుకి వస్తానన్నారంతే. అది కూడా మీ కోహేర్సివ్ – ఇన్‌ఫ్లుయెన్సులో" కటువుగా అంది. ఆ లీగల్ పదాలు ఎక్కడో విన్నట్టు అనిపించి లాయరు కుర్రాడు ఆమె వైపు సంభ్రమంగా చూశాడు.

ఏమి చెయ్యాలో తోచనట్టు ధర్మారావు తల పట్టుకున్నాడు. 'మాస్టార్ని సెల్లులో పెట్టటం' అన్న ఊహే భరించలేకపోతున్నాడు. దూరం నుంచి ఈ సంభాషణంతా వింటూన్న ఒక పోలీస్ 'సార్' అన్నాడు. అందరూ అతడి వైపు చూశారు.

ఆ యువకుడి పేరు బాలారిష్ట శ్వేతార్క. బి.టెక్ ర్యాంకు మార్కులతో పాసై, అతి కష్టం మీద పోలీసు ఉద్యోగం సంపాదించాడు.

"మాది ఆ ఊరే సార్. పండగ రోజు అక్కడ పెద్ద గొడవ జరిగింది. పట్నం నుంచి వచ్చినోళ్ళు ఒక పాపని బాటిల్ పెట్టి కొట్టారు. మా ఊరి కుర్రోళ్ళు ఆళ్ళకి గుళ్ళు గీయించి పంపించారు".

జాక్సన్ మొహం చిట్లించి, "దానికీ దీనికీ ఏమిటి సంబంధం?" అన్నాడు.

"ఆ గుండు కొట్టించినవాళ్ళలో ఎల్లమంద ఉన్నాడు సార్. నిజానికి వ్యవహారం అంతా అతనే నడిపించాడు. పాపని హాస్పటల్‌కి తీసుకెళ్ళమంటే వాళ్ళు తీసుకు వెళ్ళలే"

"పాప ఎలా ఉంది?"

"బతికి బయట పడింది. అదృష్టం. ఎల్లమందే మోటారుసైకిలు మీద పట్నం తీసుకెళ్ళాడు"

ధర్మారావు కల్పించుకుని, "కొడుకు మిస్సింగ్ అని అతని తండ్రి నా దగ్గరికి వచ్చాడు. అతడేగా" అన్నాడు.

"అవును. ఎల్లమంద నా క్లాస్‌మేటే సార్. ఇద్దరం పెదపట్నంలోనే ఇంజనీరింగ్ చదివాం" అన్నాడు బాలారిష్ట.

"ఆ నలుగురు కుర్రాళ్ళూ ఎవరో ఎంక్వయిరీ చేశారా?"

'ఇంత చిన్న విషయానికే మర్డరు చేస్తారా' అన్న భావం ధ్వనించేలా, "ఈ మర్డరుకీ వాళ్ళకీ సంబంధం ఉన్నదంటారా?" కాస్త వెటకారంగా అన్నాడు జాక్సను.

"కేసు అన్నివైపులనుంచీ చూడాలిగా" ధర్మారావు అన్నాడు.

"కానీ అదెలా సాధ్యం సార్? ప్రొద్దున్నే గ్రామస్తులు గుళ్ళు గీయటం, అక్కడి నుంచి ఆ మీసాల్రాజా గ్యాంగు పట్నం వెళ్ళటం, మళ్ళీ అక్కణ్నుంచి తమ మనుష్యుల్ని పంపటం, వాళ్ళు వచ్చి మర్డరు చెయ్యటం... ఇదంతా అంత తొందరగా జరిగే పని కాదు సార్. ఒక వేళ వాళ్ళు మర్డరు చెయ్యదల్చుకుంటే ఎల్లమంద ఇంట్లోనో బయటో చేస్తారుగానీ, అతడిని మాష్టారి ఇంటికి పిలిపించి చంపి, శవాన్ని తమతో పాటూ తీసుకెళ్ళి, రాత్రి వరకూ తీరిగ్గా కార్లో దాచి, మళ్ళీ తీసుకొచ్చి వీళ్ళ పెరట్లో ఎందుకు పడేస్తారు?"

రవళి విస్తుబోయి చూసింది. అచ్చు ఇలాగే జరిగి ఉండవచ్చు కదా. నిజంగా ఇలాగే జరిగి ఉంటే, ఈ ప్లాన్ వేసినవారు ఎవరో గాని గొప్ప మేధావి అయి ఉండాలి.

ధర్మారావు జాక్సన్‌తో, "ఆ ఊరివాళ్ళు గుండు గీసింది మీసాల్రాజా గ్యాంగుకి అని ఆ పేరు నీకెలా తెలిసింది?" అని అడిగాడు.

ఊహించని ఈ ప్రశ్నకి అతను తబ్బిబ్బు అయ్యాడు. రవళి అతడిని విస్మయంగా చూసింది. ఈ హత్య చేసినవారు చిన్నవారు కాదనీ, పోలీసుల్లో కూడా పెద్ద పలుకుబడి ఉన్నవారనీ తొలిసారి అర్థమయింది. ఈ లోపులో జాక్సన్ సర్దుకుంటూ, "అన్నీ ఎంక్వయిరీలో తెలిసినవే సర్" అన్నాడు.

ధర్మారావు తల పంకిస్తూ, "వాళ్ళు బాటిల్ విసిరి పాపని గాయపరచటం, వీళ్ళు వాళ్ళకి గుళ్ళు గీయటం, ఇదంతా మన జ్యూరిస్-డిక్షన్లో జరిగినప్పుడు కనీసం నాకు తెలియాలిగా. అసలు ఎవరు వాళ్ళు?" అన్నాడు జాక్సన్ వైపు సూటిగా చూస్తూ.

"వీళ్ళూ వాళ్ళూ కాంప్రమైజయి వెళ్ళిపోయారు సర్. అందుకని ఎఫ్.ఐ.ఆర్. కూడా వ్రాయలేదు" వివరాలు చెప్పటం ఇష్టం లేనట్టు అన్నాడు.

బాలారిష్ట కల్పించుకుని, "వాళ్ళు మన సి.ఎం. కి దగ్గరవాళ్ళు సర్. మీకు గుర్తుండే ఉంటుంది. కొంతకాలం క్రితం ఏదో కిడ్నాప్ కేసు మీరే డీల్ చేశారు. నలుగురూ అరెస్ట్ అయ్యారు కానీ కేసు బయటకు రాలేదు" అన్నాడు.

అసలు టాపిక్కులోకి రమ్మన్నట్టు జాక్సన్, "ఈ అమ్మాయి చెప్పేది కరక్టయితే, మధ్యాహ్నం దాదాపు పావుగంటసేపు వీరి ఇంటి ముందు వాళ్ళ కారు ఆగి ఉండాలి. వాళ్ళు శవాన్ని కారు ఎక్కించి తీసుకెళ్లి, మళ్ళీ రాత్రి వెనక్కి తీసుకొచ్చి పడెయ్యాలి. ఇంత జరిగినా ఒక్కరూ చూడలేదా? అదేమీ పట్నం కాదు. చిన్న పల్లె. మిట్ట మధ్యాహ్నం ఒక ఇంట్లోంచి ఇద్దరు మనుష్యులు శవాన్ని బయటకు ఎత్తుకు వెళ్తూంటే ఎవరూ గమనించ లేదా? అందులోనూ పండగపూట?" అన్నాడు.

"శవం కాదు. అప్పటికి బ్రతికే ఉన్నాడు" అంది రవళి.

"జనం అదన్నా చూడాలిగా" అన్నాడు జాక్సను.

"ఒకవేళ నా తండ్రే మర్డరు చేసి ఉంటే, శవాన్ని ఆయన ఒక్కరే మోసుకెళ్ళి కొండ క్రింద పడేసారంటారా?" అని అడిగింది.

"అది తేల్చాల్సింది కోర్టు" అన్నాడు జాక్సన్.

తాను ఏమీ మాట్లాడకపోతే బావోదన్నట్టు లాయరు కుర్రాడు, "సెక్షను 420 ప్రకారం మెజిస్ట్రేటు..." అంటూ ఏదో చెప్పబోయేడు. కరోనా క్రిమిని మైక్రోస్కోప్‌లో చూసినట్టు చూసి, "420 కాదు. 302" అన్నాడు ధర్మారావు.

టీ తీసుకొచ్చి పెట్టాడు పోలీస్. తనకి వద్దన్నారు మాష్టారు.

ఈ లోపులో స్టేషన్ బయట గొడవ వినిపించింది. చిన్నగా మొదలై క్రమక్రమంగా పెరగటంతో ధర్మారావు బాలారిష్ట వైపు చూశాడు. అతను బయటకు వెళ్లి, రెండు నిమిషాల తర్వాత వచ్చి "చాలామంది స్టూడెంట్సు వచ్చారు. ఛానల్స్ వారు కూడా వచ్చారండి. ఒక దళిత యువకుడిని అగ్రవర్ణం మనిషి పరువు హత్య చేశాడని ఎవరో న్యూస్ వ్రాసినట్టున్నారు. హంతకుడు మన పోలీసు స్టేషనులో ఉన్నాడని తెలిసి గుంపులు గుంపులుగా వచ్చారు" అన్నాడు

ధర్మారావు ఇబ్బందిగా మొహం చిట్లించాడు. బయట జనం గొడవ ఎక్కువైంది. ఎవరో రాయి విసిరి కిటికీ అద్దాన్ని బ్రద్దలు కొట్టారు. నినాదాలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఆ అరిచే వాళ్ళలో కొందరు మాష్టారి విద్యార్థులు కూడా ఉన్నారు. అభిమానుల అభిప్రాయం క్షణాల్లో మారటానికి అభేద్యమైన కారణాలు ఉండవు కాబట్టే జనాల్ని గొర్రెలు అన్నారు.

"ఒకసారి ముద్దాయిని బయటికి తీసుకుపోదాం సార్. చూసి పోతారు" జాక్సన్ అన్నాడు.

"పోరు. మరింత గొడవ చేస్తారు" అన్నాడు ధర్మారావు.

ఈ లోపులో ఆ ఏరియా కౌన్సిలరు వచ్చి కెమెరా ముందు నిలబడి లైటింగ్ సరీగ్గా ఉన్నదో, లేదో చూసుకుని 'దళిత యువకులు – పరువు హత్య'లపై ఉపన్యసించటం ప్రారంభించాడు. నగరంలో ఎల్లమంద శిలావిగ్రహం పెట్టాలని డిమాండ్ చేసాడు. ఇంకో నలుగురైదుగురు ఛానల్స్ వాళ్ళు రావటంతో హడావుడి మరింత ఎక్కువైంది. రాళ్ల వర్షం కూడా శృతి మించుతోంది.

అడిషనల్ పోలీస్ ఫోర్స్ కోసం ధర్మారావు పై అధికారికి ఫోన్ చేశాడు.

"అంతమంది జనం అక్కడికి ఎందుకు వచ్చారు?"

ధర్మారావు వివరించి చెప్పాడు

"ఒకసారి వాడిని తీసుకెళ్ళి చూపించు. నాల్గు ఫోటోలు తీసుకుపోతారు" అవతలి స్వరంలో విసుగు ధ్వనించింది.

తప్పనిసరి పరిస్థితుల్లో శాస్త్రిని తీసుకుని బయటికి వెళ్లారు. శాస్త్రిని చూడగానే, "అగ్రకులాల దౌర్జన్యం నశించాలి. ప్రేమ వర్ధిల్లాలి. ఎల్లమందా జిందాబాద్" అన్న అరుపులు చుట్టుముట్టాయి. మరింత రాళ్ల వర్షం కురిసింది. శాస్త్రిని కవర్ చేస్తూ ధర్మారావు ఆయన్ని తిరిగి లోపలికి తీసుకొచ్చాడు.

రవళి మొహం పాలిపోయింది. చిన్న సంఘటన చిలికి చిలికి 'పరువుహత్య' గా మారుతుందని ఆమె కలలో కూడా ఊహించలేదు. చేయని నేరానికి ఈ అపప్రద ఏమిటో అర్థం కాలేదు. కంఠంలో దుఃఖం సుడులు తిరుగుతోంది. అయితే కొన్ని సంఘటనలకి లాజిక్కులు ఉండవు. అంత క్లిష్టమైన సందర్భంలో రవళికి మెరుపులా ఒక ఆలోచన స్ట్రయిక్ అయింది.

"మా ఇంటి ముందున్న బ్యాంకుకి సి.సి. కెమెరా ఉన్నది సార్. అది రోడ్డు వైపుకే ఉన్నట్టు గుర్తు. బ్రతికున్న మనిషిని భుజాల మీద వేసుకుని ఆ ఇద్దరూ బయటకు తీసుకువెళ్ళటం అక్కడ రికార్డ్ అయి ఉంటుంది. మనం ట్రై చెయ్యవచ్చు" అన్నది.

పోలీసు అధికారులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

# 11

**అధ్యక్షస్థానంలో** ఆంజనేయులు కూర్చుని ఉన్నాడు. నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఎన్నికల కాంపైన్. అంజి తండ్రి హనుమంతరావు అక్కడి సర్పంచ్. ప్రస్తుతం బై-ఎలక్షన్సులో ఎమ్మెల్యేగా నిలబడుతున్నాడు. అతడు ఏర్పాటు చేసిన మీటింగుకి వెయ్యిమంది దాకా జనం వచ్చారు. ముఖ్యమంత్రి ముఖ్య అతిథి. ముందు వరుసలో మీసాల్రాజా, అతని మిత్రబృందం కూర్చుని ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి హనుమంతరావు మాట్లాడుతూ, "...చిన్న కౌన్సిలరుగా జీవితం ప్రారంభించి ఈ స్థాయికి ఎదిగిన మన సి.ఎం. జీవితం మనందరికీ ఆదర్శప్రాయం. ఇంత తక్కువ వ్యవధిలో ఇంతమంది అభిమానం సంపాదించడం ఆయన లాంటి వారికి మాత్రమే సాధ్యం." అన్నాడు.

అంజి లేచి నిలబడి చప్పట్లు కొట్టాడు. అతడి బృందం విజిల్స్ వేసింది. హర్షధ్వానాలు చుట్టు ముట్టాయి. సర్పంచి కొనసాగించాడు: "ఈ రోజు ఆయన ఈ స్థితిలో ఉన్నారంటే, దాని వెనుక ఎంతో అంకితభావం, శ్రమ, నిద్రలేని రాత్రులు, అకుంఠిత కృషి ఉన్నాయని

మీరందరూ అనుకుంటున్నారు. ఆ నాలుగూ కావని నేను అనుకుంటున్నాను. అసలు కారణం నేను చెప్తాను".

ఆఖరి వాక్యానికి అక్కడ ఒక్కసారిగా నిశ్శబ్దం వ్యాపించింది. అతడేమి చెపుతాడా అని జనం ఉత్కంఠగా ఎదురు చూశారు. ముఖ్యమంత్రి కూడా కుర్చీలో కాస్త ఇబ్బందిగా కదిలాడు.

"మన ముఖ్యమంత్రిగారి అత్యంత సన్నిహితుడిగా నేను ఆయనలో గమనించిన విషయం పేదల పట్ల ప్రేమ, ఆప్యాయత...! అవే ఆయన్ని ఈరోజు శిఖరం మీద, రేపు పర్వతం పైనా, ఎల్లుండి మేఘాలలోనా నిలబెడతాయి" చెప్పుకుపోతున్నాడు.

చప్పట్లు.

చివరి వరసలో కూర్చున్న తెలుగు మాష్టారు నవ్వుకున్నాడు. 'ఈయనేమన్నా మేఘ పయనుడా? కలహ భోజనుడా? అవును. నిజమే కదా..! తరచూ విదేశాలకు వెళ్ళే త్రిలోకసంచారి. ప్రతిపక్షంలో ఉన్న రెండు పార్టీల మధ్యా తరచూ గొడవలు పెట్టే కలహ భోజనుడు. ఎవరు వ్రాసారో కానీ ఉపన్యాసం కరెక్టుగా వ్రాసారు."

ముఖ్యమంత్రి కూడా నవ్వుకున్నాడు. మేఘాల పోలికకి కాదు. కార్పోరేషన్ చైర్మన్ పదవి కోసమూ, కాబినెట్‌లో స్థానం కోసమూ ఎమ్మెల్యేలు పడే పాట్లు ఆయనకి కొత్త కాదు.

ఎమ్మెల్యే తిరిగి ఏదో మాట్లాడబోతూంటే, ఊహించని సంఘటన ఒకటి జరిగింది. వెనుక నుంచి ఒక కంఠం "నేను మాట్లాడతాను" అని బిగ్గరగా వినపడింది. అందరూ అటు చూశారు. అక్కడ ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. అతడు ముందుకు రాబోతూంటే, సెక్యూరిటీ అతడిని ఆపుచేస్తున్నారు.

* * *

బ్యాంకు సి.సి కెమెరాల విషయం రవళి చెప్పగానే ధర్మారావు అసిస్టెంట్ వైపు చూశాడు. ఆ సూచన అందుకుని జాక్సన్ ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. అయిదు సుదీర్ఘమైన నిముషాలు గడిచాక వచ్చి "వీధి వైపుకే ఉందట కెమెరా. రమ్మన్నారు" అన్నాడు.

ధర్మారావు రవళి వైపు అభినందన పూర్వకంగా చూసి, శాస్త్రి వైపు తిరిగి, "మాస్టారూ... నా వెహికిల్ లో వెళ్దాం రండి. మీది ఎదురిల్లే కదా. ఆ వీడియో కరెక్టుగా ఉంటే, అట్నుంచి అటే మీరు ఇంటికి వెళ్ళి పోవచ్చు. నేను కూడా మీ ఇల్లు ఒకసారి చూసినట్టు ఉంటుంది. చాలా కాలమైంది" అన్నాడు.

హావభావాలు అంతగా ప్రస్ఫుటించని తండ్రి మొహంలో రిలాక్సేషనుతో కూడిన తేలికదనం కనపడింది. ధర్మారావు లేచి జాక్సనుతో, "మేము వెళ్తాం. ఈ లోపులో అమ్మాయి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుని పంపెయ్యి" అని చెప్పి, కుర్చీలోంచి లేచి "మీ పేరేమిటి లాయరుగారూ" అని అడిగాడు.

"అసలు పేరు సౌజన్యారావు. నోరు తిరగదని 'రవి' అని మార్చుకున్నాను."

"ఓహ్.... కన్యాశుల్కం చదివి పెట్టిన పేరా? గుడ్ నేమ్. పేరుకి తగ్గట్టే లాయరు అయ్యావు. అన్నట్టు కన్యాశుల్కం చదివావా?"

"లేదండీ. కన్నేషుల్కం తెలుగా?"

"కాదోయ్. ఇంగ్లీష్..! షేక్స్-పియర్ వ్రాశాడు?"

"షేక్స్ ఫియరు... పేరు విన్నాను"

"ఫియరు కాదు. పియర్. సరే సరే. అమ్మాయి దగ్గర మా యస్సై స్టేట్‌మెంట్ తీసుకునే వరకూ ఇక్కడే ఉండు" అని శాస్త్రిని తీసుకుని ఆదిత్యపురం బయల్దేరాడు.

ఇద్దరూ వెళ్ళాక జాక్సన్ రవళి స్టేట్‌మెంట్ రికార్డ్ చెయ్యటం ప్రారంభించాడు.

దానికి అరగంట పట్టింది.

పూర్తి చేసి ఆమె లేస్తూ ఉండగా ఫోన్ వచ్చింది.

జాక్సన్ మాట్లాడి పెట్టేస్తూ, "ఆక్సిడెంటు జరిగిందట. మన పోలీస్ వెహికిల్ని లారీ కొట్టిందట. డ్రైవరుతో సహా నలుగురూ ఆస్పత్రిలో ఉన్నారు. ఇద్దరు మరణించారు. మరో ఇద్దరి కండిషన్ సీరియస్ అట" అన్నాడు.

"ఏ ఇద్దరూ?"

"వివరాలు తెలీదు" హడావుడిగా బయటకు వెళ్ళటానికి ఆయత్తమవుతూ అన్నాడు.

* * *

సెక్యూరిటి ఆ యువకుడిని స్టేజి పైకి వెళ్ళనివ్వటం లేదు. ఆంజనేయులు తల వెనక్కి తిప్పి చాణుక్య వైపు చూశాడు. చాణుక్య అంగీకార సూచనగా తల ఊపటంతో ఆ యువకుడిని 'వదలమన్నట్టు' సైగ చేశాడు.

అతడు స్టేజి ఎక్కి మైకు పట్టుకున్నాడు. ప్రెస్సు ఉత్సుకంగా ముందుకు వంగింది.

"నాపేరు రామానాగేశ్వరరావు. పేరు మీకు చిత్రంగా వినిపించవచ్చు. నా తండ్రి నాగేశ్వరరావుకీ, తల్లి రామారావుకీ అభిమానులు. ఇద్దరూ కలిసి ఆ పేరు పెట్టారని గర్వంగా చెప్పుకుంటాను. అయితే ప్రస్తుతం నేను చెప్పే విషయం దాని గురించి కాదు. నా తల్లికి అరవై ఏళ్ళు. కడుపునొప్పితో బాధపడుతూ ఉంటే చూడలేక పోయేవాడిని. ఆస్పత్రిలో అయిదు లక్షలు అవుతుందన్నారు. మా అందరికీ మిగిలేది వల్లకాడే అనుకున్నాను. ఆఖరి ప్రయత్నంగా రాష్ట్ర ఆరోగ్యశాఖకి వ్రాశాను. మూడ్రోజుల్లో 'కుదరద'ని సమాధానం వచ్చింది..."

ప్రతిపక్షం తాలూకు ప్రెస్సు ఉత్సాహంగా ఆ యువకుడి ఫోటోలు తీసుకుంటున్నారు. ఆంజనేయులు కుర్చీలో ఇబ్బందిగా కదులుతూ వెనక్కి తిరిగి చాణుక్య వైపు చూశాడు. అతను వక్త వైపు చూస్తున్నాడు. యువకుడు కొనసాగించాడు: "కానీ అంతలోనే ప్రభుదేవ్ ఆస్పత్రి నుంచి 'రమ్మని' ఫోన్ వచ్చింది.. వెళ్ళాము. అక్కడ నా తల్లికి ఉ..చి..తం..గా ఆపరేషన్ చేశారు"

జనం చప్పట్లు కొట్టాలా వద్దా అన్నట్టూ అయోమయంలో పడ్డారు. ఎందుకంటే, ఆ ఆస్పత్రి ప్రతిపక్ష నాయకుడు ప్రభుదేవ్ పేరు మీద ఉన్నది. జనం చప్పట్ల విషయంలో సందిగ్ధంలో ఉండగా, కుర్రవాడు తిరిగి కొనసాగించాడు: "మీలో చాలా మందికి తెలియని ఒక విషయం చెపుతాను. ఈ ప్రపంచంలో ఏ ప్రభుత్వం కూడా చేయని పని ఇది..! మన ముఖ్యమంత్రిగారు స్వంత నిధులతో కట్టించిన ఆస్పత్రికి, మరణించిన ప్రతిపక్ష నాయకుడి పేరు పెట్టటం...! పైగా మాలాంటి పేదలకి అక్కడ ఉచితంగా వైద్యం చెయ్యటం! చెప్తున్నా వినండి. 'ప్రభుదేవ్ ఆస్పత్రి' మన సి.ఎం. గారిది...."

ఆనకట్ట తెగినట్టు జనం చప్పట్లు..!

ఒకప్పుడు ఆంజనేయులూ, ప్రభుదేవ్ అసెంబ్లీలో సహచరులు. ఒకరు అధికార పక్షంలో, మరొకరు ప్రతిపక్షంలో ఉండేవారు. అక్కడ ఎంత కొట్టుకున్నా బయట మంచి స్నేహితులు. ఏ అసెంబ్లీ చరిత్ర చూసినా, ఏ పార్లమెంట్ హిస్టరీ వెతికినా అదే కదా. అందరి ముందు నిన్ను తిడతాను. లోపల నీతో మందు కొడతాను.

ప్రభుదేవ్ మరణించిన తరువాత అతడి కొడుకు సత్యదేవ్ ప్రతిపక్ష నాయకుడయ్యాడు. తండ్రీ కొడుకులకి చాలా తేడా ఉంది. తండ్రిది సగటు రాజకీయ నాయకుడి మనస్తత్వం. ముఖ్యమంత్రి అయ్యేటంత 'దమ్ము' తనకి లేదని తెలుసు. ప్రతిరోజూ సాయంత్రానికి తన వాటా తనకి వచ్చి, పనులు నెరవేరితే చాలనుకునే లక్షణం. అందుకే సి.ఎం.తో స్నేహం చేస్తూ, ప్రతిపక్ష నాయకుడి కాబినెట్ హోదాతో సరిపెట్టుకున్నాడు. కొడుకు దేవ్ అలా కాదు. నీతీ నిజాయితీ ఉన్న యువకుడు. రోజురోజుకీ ప్రజల్లో పలుకుబడి పెంచుకుంటున్న వాడు. సి.ఎం. భయపడేది అందుకే.

ఈ లోపులో రామానాగేశ్వరరావు తన ఉపన్యాసం కొనసాగించాడు: "కొత్త కిడ్నీ పెట్టాక నా తల్లి ఆరోగ్యంగా ఉన్నది. ఆస్పత్రి వాళ్ళే ఉచితంగా ఇచ్చారు. మేము ఇదే కిడ్నీ బయట కొనుక్కోవాలంటే కొన్ని లక్షలు అవుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారికీ, ఆస్పత్రి యజమాన్యానికీ చేతులెత్తి నమస్కరిస్తున్నాను."

అంజి సైగ చేసేసరికి అతడి మిత్రబృందం విజిల్స్ వేస్తూ చప్పట్లు కొట్టింది. గొర్రెలు ఫాలో అయ్యాయి. కుర్రాడు కొనసాగించాడు. ''ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పదల్చుకున్నాను. మాది చాలా బీద కుటుంబం. ఇంటర్లో నేను స్టేటు ఫస్టు. విద్యాధరి కాలేజివారు ఇంటికి వచ్చి తమ కాలేజీలో 'ఉ..చి..తం..' గా చేరమని ఆహ్వానించారు. ఇంజనీరింగులో మళ్ళీ కాలేజి ఫస్ట్ వచ్చిన సందర్భంగా ప్రిన్సిపాలుగారితో వెళ్లి ముఖ్యమంత్రి గారిని కలుసుకున్నాను. ఆయన నన్ను ఆశీర్వదించి, ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకుండా పదిమందికి ఉద్యోగాలిచ్చే పరిశ్రమ పెట్టమన్నారు. పైగా ప్రభుత్వం తరఫున అప్పు కూడా శాంక్షన్ చేయించారు. ఇప్పుడు నేను ఒక పరిశ్రమకి అధిపతిని. దానికి సభాముఖంగా సి.ఎం గారికి శిరస్సు వంచి నమస్కరించుకుంటున్నాను. చివరగా మరొక్క విషయం. విద్యాధరి ఇంజనీరింగ్ కాలేజి కూడా మన ముఖ్యమంత్రిగారిదే".

హర్షధ్వానాలు ఆ ప్రాంతాన్ని సునామీలా చుట్టుముట్టాయి. సభ ముగిసింది. ముఖ్యమంత్రి కారు వైపు వెళ్తూ చాణుక్య కోసం చూశాడు. అతడు దూరంగా ఆ యువకుడితో మాట్లాడుతూ కనిపించాడు. పి.యేతో "చాణుక్యని వచ్చి నా కారు ఎక్కమని చెప్పు" అన్నాడు. అతడు వచ్చి ఎక్కాక కారు కదిలింది.

"వాడు చెప్పినదంతా నిజమేనా?" చాణుక్యని అడిగాడు.

"మన కాలేజీలో చదవటం వరకూ కరెక్ట్. ఉచిత చదువు, స్టేటు ఫస్టు రావటం, అతని పరిశ్రమకి మనం సాయం చెయ్యటం, ఆస్పత్రిలో కిడ్నీ.... ఓట్ల కోసం."

ఆంజనేయులు డ్రైవరుతో "గెస్ట్ హౌసుకి పోనీ" అన్నాడు. ఆ తరువాత మరేమీ మాట్లాడలేదు. అతడు సీరియస్‌గా ఉండటం చాణుక్య గమనించాడు. గెస్టుహౌసుకి వెళ్ళాక అక్కడ మీసాల్రాజాని చూస్తే విషయం అర్థమయింది. ముగ్గురూ కూర్చున్నాక సి.ఎం. రాజుని, "ఏమిటి జరుగుతోంది?" అని అడిగాడు.

"ఏమిటి – ఏమిటి జరుగుతోంది?" మీసాల్రాజా తిరిగి అదే టోనుతో ప్రశ్నించాడు.

ఆంజనేయులు కుర్చీలోంచి విసురుగా లేచి వెళ్ళి రాజా చెంప మీద ఫెడేల్మని కొట్టాడు. ఒక్క క్షణం అక్కడ రాక్షసమైన నిశ్శబ్దం పేరుకుంది. కోపాన్ని అణుచుకుంటూ, "మాస్టారి అరెస్టు ఏమిటి? వెహికిల్ ఆక్సిడెంటు ఏమిటి? అందులో ఇనస్పెక్టరు గాయపడటం ఏమిటి? ఒకటి తరువాత ఒకటి... ఏమిటీ మర్డర్లు?" అని అరిచాడు.

"ఆక్సిడెంటా? ఇనస్పెక్టరా? ఏం మాట్లాడుతున్నావు నువ్వు? అసలేం జరిగింది బావా?" అన్నాడు మీసాల్రాజా అమాయకంగా.

"ఎల్లమంద డెత్ తెలీదా నీకు?"

"తెలుసు. టార్జాను చంపేశాడు కదా. అంతవరకే తెలుసు." చాణుక్య ప్రసక్తి తీసుకు రాకుండా అన్నాడు.

"ఆ కేసులో ఎవరో శాస్త్రి అనే టీచర్ని అరెస్ట్ చేశారు. ఇన్వెస్టిగేట్ చేస్తున్న సమయంలో పోలీస్ కారు ఆక్సిడెంటయి ఇద్దరు చనిపోయారు. ఇనస్పెక్టరు వెన్నెముక విరిగి, మాస్టారు మెదడు చెడి, ఆసుపత్రి బెడ్ మీద ఉన్నారు. మరో వైపు ప్రతిపక్షం 'ఈ రాష్ట్రంలో అసలు శాంతి భద్రతలు ఉన్నాయా, అసలేమి జరుగుతోందీ' అని అడుగుతోంది" అన్నాడు సి.ఎం.

"ఆ ఎల్లమందకి కాస్త బుద్ధి చెప్పమని చాణుక్యని అడిగాను. అంతే నేను చేసింది. వాడు మా మీద హత్యా ప్రయత్నం చేశాడు." నేరం తనది కాదన్నట్టు మాట్లాడాడు మీసాల్రాజా.

అప్పటివరకూ మవునంగా ఉన్న చాణుక్య మొదటిసారి కల్పించుకుంటూ "ఎల్లమంద హత్యా ప్రయత్నం చెయ్యలేదు. నలుగురికీ గుండు గీసి పంపించాడంతే" అన్నాడు.

సమస్య వచ్చేసరికి మనుష్యులు పరస్పరం ఎలా నిందారోపణలు చేసుకుంటారో చెప్పటానికి ఈ సంభాషణే ఉదాహరణ.

"ఎవర్ని పంపించినా పని అయిపోయేది కదా. నువ్వు అసలా పల్లెటూరు స్వయంగా ఎందుకెళ్లావ్ చాణుక్యా?" అని అడిగాడు ఆంజనేయులు.

కేవలం ఆ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్నట్టు మీసాల్రాజా చప్పున లేచాడు. "...కరెక్టుగా నేనూ అదే అడుగుదామని అనుకుంటున్నాను బావా. నేను కోరింది చిన్న కోరిక. 'ఆ ఎల్లమంద మమ్మల్ని అవమానం చేశాడు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనుక చావటం ఏమిటి? ఏదైనా చేసి వాడికి బుద్ధి చెప్పు' అని రిక్వెస్ట్ చేశాను. ఇంత చిన్నదానికి, కౌటిల్యుడి లెవెల్లో ప్లాన్ చేసి వెళ్లి రచ్చరచ్చ చేశాడు. గోటితో పోయేదాన్ని ఇక్కడి వరకూ తీసుకొచ్చాడు. మన టార్జానుకి ఒక్క మాట చెప్తే ఆ ఇనస్పెక్టర్ని లేపేసినట్టు ఆ ఎల్లమందకీ బుద్ధి చెప్పేవాడు".

'అవును కదా' అన్నట్టు ముఖ్యమంత్రి తలూపాడు.

ఆయన కూడా అతని వైపే ఉన్నాడని చాణుక్యకి అర్థమైంది.

చేతిలోని తమలపాకుల డబ్బా తెరిచి ఆకులకి సున్నం రాసుకుంటూ, "నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. ఇద్దరూ జస్ట్ 'అవును, కాదు' అని చెప్పండి. మీసాల్రాజా, ముందు నువ్వు చెప్పు. ఆరోజు నువ్వు నా దగ్గరకి వచ్చి నాతో 'ఆ ఎల్లమందని చంపుతారో, చంపిస్తారో నాకు తెలీదు. రేపు రాత్రిలోగా వాడి చావు నాకు తెలియాలి' అని పండగరోజు మధ్యాహ్నం అన్నావా లేదా?" అని అడిగాడు.

"చావు కబురూ... "

"అన్నావా లేదా? జస్ట్ 'అవును'... 'కాదు'... చెప్పు"

"అన్నాను"

"రేపు రాత్రిలోగా అన్నావా?"

"అన్నాను. అయితే...?" అన్నాడు మీసాల్రాజా.

"నా భుజాలు పట్టుకుని, 'ముసలోడా... చెప్పింది చెయ్యి..! లేకపోతే బావకూడా తెలియకుండా నిన్ను ఇక్కడే మర్డరు చేస్తా' అన్నావా? లేదా?"

"ఏదో మాట వరసకి..." అంటూ మీసాల్రాజా అనబోతూ ఉంటే, చాణుక్య కఠినంగా, "జస్ట్ 'అవును – కాదు' ఆ రెండిటిలో ఏదో ఒకటి చెప్పు" అన్నాడు.

"అన్నాను"

"రేపు రాత్రిలోగా మర్డరు జరగాలి' అని పట్టుబట్టావా లేదా?" రెట్టించాడు.

"అ.. అ.. అన్నాను"

చాణుక్య ఆంజనేయులి వైపు తిరిగాడు. "నువ్వు నన్ను అర్జెంటుగా పిలిచి, 'మీసాల్రాజా అవమానంతో ఉడికిపోతున్నాడు. ఆ ఎల్లమందని రేపు సాయంత్రంలోగా ఏదో ఒకటి చెయ్యి' అని అన్నావా లేదా?"

ఆంజనేయులు మాట్లాడలేదు.

"మీరిద్దరూ చెప్పిన ప్రతివాక్యం అక్షరం పొల్లుపోకుండా నాకు గుర్తుంది. నువ్వేమన్నావో గుర్తుందా ఆంజనేయులూ? 'మీసాల్రాజా సంగతి నీకు తెలియనిది ఏముంది? వాడు వెళ్లి ఆ ఎల్లమందని చంపేస్తాడు. పోలీసులు అరెస్ట్ చేస్తే, 'అవును. నేనే మర్డరు చేశాను. ముఖ్యమంత్రి తాలూకు మనిషిని నేను. ఏం చేస్తావో చేసుకో' అంటాడు. వాడికి అంత పొగరు. వాడు వెళ్లి చంపక ముందే మూడో కంటికి తెలియకుండా నువ్వే ఈ పని పూర్తి చెయ్యాలి...' అన్నావు".

ఆంజనేయులు ఇబ్బందిగా తల ఊపి, "ఇదంతా దేనికి చెపుతున్నావు" అని అడిగాడు.

"నాకు మీరిద్దరూ ఇచ్చింది 24 గంటల టైము. నీ బావమరిదికి ఊరివాళ్ళతో గొడవ జరిగిందని అందరికీ తెలుసు. గుండు గీయించిన మరుసటి రోజే ఎల్లమంద చస్తే అందరి అనుమానం నీ మీదకు వస్తుంది. అందుకని రౌడీల్ని పంపటానికి లేదు. అనుకోకుండా ఒకవేళ పరిస్థితులు ఎదురుతిరిగినా మానేజ్ చెయ్యగలను కాబట్టి నేనే వెళ్ళాలి. నేరం బయటపడి అరెస్ట్ అయినా నేనే అవుతాను. అయినా రిస్కు తీసుకున్నాను. "

మీసాల్రాజా తలదించుకున్నాడు. చాణుక్య కొనసాగించాడు. "ముందు ఎల్లమంద గురించి ఎంక్వయిరీ చేశాను. అతడు ఎవరో అమ్మాయిని ప్రేమించాడని తెలిసింది. దాంతో అనుమానం ఆ అమ్మాయి మీదకు వచ్చేలా ఈ ప్లాన్ వేశాను".

శ్రోతలిద్దరూ మాట్లాడలేదు.

"ఇక నీ రెండో అనుమానం గురించి చెపుతాను విను. ఎల్లమందని చంపటానికీ, ఇనస్పెక్టర్ని చంపటానికీ చాలా తేడా ఉంది. ఇనస్పెక్టరు మరణం పట్ల ఎవరికీ అనుమానం రాదు. ఇన్వెస్టిగేషన్ కోసం వెళ్తున్నప్పుడు లారీ గుద్దింది. అంతే. ఎల్లమందని లారీతో గుద్దించాలంటే, మన కోసం అతడు ఇంట్లోంచి బయటకి రావాలి కదా..." చివరి వాక్యం చెపుతున్నపుడు కాస్త వెటకారం ధ్వనించింది. "నిన్న నీ ఫ్రెండు కూడా ఇదే చొప్పదంటు ప్రశ్న వేశాడు".

"సర్లే. ప్రస్తుత పరిస్థితి ఏమిటి?" అని అడిగాడు ఆంజనేయులు.

"బ్యాంకు కెమేరా వారం రోజుల క్రితమే పాడయింది.... పోలీస్ వెహికిల్ కి ఆక్సిడెంట్ జరిగింది''

ముఖ్యమంత్రి చప్పున తలెత్తి చూశాడు.

తలదించుకుని "తప్పలేదు మరి" అన్నాడు చాణుక్య.

"ఎవరు? మన జాక్సనా?"

"అవును".

"చినికి చినికి గాలివాన అయ్యింది."

"తప్పలేదు. మొత్తానికి కేస్ క్లోజ్ అయిపోయినట్టే" అన్నాడు చాణుక్య. ఆ మాటలకి రాజా అక్కడి నుంచి హుషారుగా లేచాడు.

# 12

**మీసాల్రాజా** ముఖ్యమంత్రికి సిసలైన 'బావమరిది' కాదు. రెండో భార్య అలివేలు తమ్ముడు. పచ్చిగా చెప్పాలంటే ఉంపుడుగత్తె తమ్ముడు. అయితే, ప్రస్తుతం అతడి 'స్టేటస్' అంతకన్నా ఎక్కువ. అతడు ఆ స్థాయికి రావటం వెనుక పెద్ద చరిత్ర ఉన్నది.

ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో అతడికి అలివేలు పరిచయం అయింది. ముగ్ధ ముకుంద స్నిగ్ధ సుగంధ మనోహర నికుంజ విహారాల్లో కాదు. చేపల మార్కెట్టులో..! అవును అక్కడే..! భారత పరిశుద్ధ కార్యక్రమం (స్వచ్ఛ భారత్) సందర్భంగా ఆయన మార్కెట్ తుడవటానికి వెళ్ళినప్పుడు తొలిసారిగా ఆమెను చూశాడు.

పూవులమ్మే స్త్రీని పుష్పలావిక అంటారు. మధురానగర వాణిజ్య కూడలిలో పూవులు అమ్మే పుష్పలావికల సౌందర్యాన్ని ఆముక్తమాల్యదలో రతీదేవితో పోలుస్తాడు కవి. దానికి గొప్ప రీజనింగ్ కూడా ఇస్తాడు. యుద్ధానికి వెళ్ళే యోధుడికి అతడి భార్య ఆయుధాలు అందించటం ఆచారం. కానీ రతీదేవి మాత్రం మొగుడికి పువ్వులిచ్చి పంపుతుంది. సమరానికి వెళ్తూన్న యోధుడికి పువ్వులేమిటన్న అనుమానం కూడదు. మన్మథుడి ఆయుధాలు పువ్వులే కదా..!

ఆ పూల అంగడిలో స్త్రీలు కూడా అదే విధంగా మన్మధ బాణాలవలె ఉన్న తమ చూపుల తూపులతో, వయ్యార విలాసాలతో, పరిపూర్ణ సౌష్టవ అంగవిన్యాసాలతో పువ్వులు అమ్ముతున్నారనీ, చెప్పిన ధర నచ్చక విటులు వేరే పూలమ్మి దగ్గరకి వెళ్ళబోతే పెదవి విరుపు సౌందర్యంతో, కళ్ళ చిరుకోపంతో, 'ఆ పూవులే కాని మా పువ్వులు నీకు నచ్చవా?' అన్న ద్వంద్వార్థపు పలుకుల అలకలతో, మళ్ళీ వీళ్ళ దగ్గరకే తీసుకువస్తాయన్నది కవి అంతరంగం.

అక్కడ మధురాపురి వీధుల్లో పుష్పలావికలు రతీదేవి అంశ అయితే, ఇక్కడ స్వచ్ఛ భారత్ చేపల మార్కెట్‌లో 'జల'పుష్పలావిక అలివేలు అంతకు మించి అందంగా కనిపించింది ఆంజనేయులికి.

ఆ రోజుల్లో రాజు తలచుకుంటే దెబ్బలకూ, ఈ రోజుల్లో మంత్రి తలచుకుంటే డబ్బులకూ కొదవేమున్నది? అతని కంట్లో పడిన అలివేలు అతి తొందరలోనే అతని వళ్లో పడింది. అతివ పొందులో అంత ఆనందం ఉంటుందని ఆంజనేయులికి తొలిసారి తెలిసింది. అది తాత్కాలిక వ్యవహారంగా కాకుండా, శాశ్వత బంధంగా చేసినవాడు తమ్ముడు మీసాల్రాజా.

ఇక్కడ మీసాల్రాజా గురించి కొంచెం చెప్పాలి.

కన్యాశుల్కం నాటకంలో మధురవాణి గురించి సౌజన్యారావు '...నీవు ఎవరో కాలుజారిన సత్పురుషుడి అంశవై ఉంటావు' అని అంటాడు. అలివేలు పుట్టుక విషయంలో కూడా అదే జరిగి ఉండాలి. అలివేలు తల్లి అంత గొప్ప అందగత్తె కాదు. ఎవడో యూనివర్సల్ అందగాడు జల్లిన విత్తనమది. ఆమెనే నిర్ధారించాలి. తొలి సంతానం అలివేలు విషయంలో అది నిజమైన పక్షంలో, మలి సంతానం మీసాల్రాజా పుట్టుక... గిరీశానికి మించిన లౌక్యుడి వల్ల కలిగినదై ఉండాలి. వేపకాయంత వెర్రి, వెలగ పండంత కామం, గుమ్మడి కాయంత కోపం ఉన్నవాడు. ప్లానింగులో మాత్రం గిరీశాన్ని మించినవాడు.

రొమ్మున అత్తరు, జేబున విత్తము, భుజాన ఉత్తరీయము వేసుకుని చీకటి మాటున ఎమ్మెల్యే ఆంజనేయులు ఆమె ఇంటికి వెళ్ళినప్పుడు, ముందు గదిలో మీసాల్రాజా రెడీగా ఉండేవాడు. దేవుడిచ్చిన బావకి పెద్దనవారు చెప్పినట్టు ఆత్మకింపయిన భోజనము, రమణీ ప్రియ దూతిక కప్పుర విడెము, ఊయల మంచము ఏర్పాటు చేసేవాడు. సోడా నుంచి కిళ్ళీ దాకా, మందు నుంచి కండోమ్ దాకా అన్ని ఏర్పాట్లూ స్వయంగా పర్యవేక్షించేవాడు.

ఆ విధంగా చాలాకాలం వ్యవహారం నడిచింది కానీ... అనుకున్నది అనుకున్నట్టు జరిగితే జీవితం నాటకీయం ఎలా అవుతుంది?

పార్టీ జంప్ చేసి ఆంజనేయులు ముఖ్యమంత్రి అయ్యాడు. అలివేలు స్టేటస్ మారింది. స్టేటస్ మారటం అంటే, మరింత ఆస్థి సమకూరిందంతే. ఎంతైనా అది చీకటి వ్యవహారమే కదా. మరో వైపు, ముఖ్యమంత్రి అయ్యాక అంజూనాయాలు (ఆమె ముద్దుగా పిలిచే పేరు) రాకపోకలు తగ్గాయి. దానికి చాలా కారణాలు ఉన్నాయి. తీరుబాటు లేకపోవటం ఒక కారణం. దానికన్నా ముఖ్యంగా, అతడి పై ప్రతిపక్ష నిఘా ఎక్కువైంది. ప్రతి చిన్న విషయానికీ దేవ్ అసెంబ్లీలో చీల్చి చెండాడుతున్నాడు. వచ్చేసారి ఎన్నికల్లో అతడి పార్టీ నెగ్గే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని నిఘా వర్గాలు తెలిపాయి. ఈ సమయంలో అలివేలు వ్యవహారం బయట పడితే మరో కష్టం కొని తెచ్చుకున్నట్టు అవుతుంది.

ఆ విషయం ముందు గ్రహించింది చాణుక్య. ముఖ్యమంత్రికి సలహా ఇచ్చాడు. "ఉపపత్ని రుచికరమైన బిర్యాని అయితే, భార్య నిత్యావసరమైన భోజనం. బిర్యానీ కోసం భోజనం వదులుకునేవాడు మూర్ఖుడు. తాత్కాలిక సుఖం కోసం కుర్చీనీ, అధికారాన్ని తెలివైనవాడు ఎవడూ వదులుకోడు. అలివేలుని వదిలెయ్యి" అన్నాడు.

'హుఁ... వేలు లేని చెయ్యి, అలివేలు లేని ఆంజనేయులు ఉండలేరు' లాంటి నాటకీయమైన డైలాగులు చెప్పలేదు. ఆలోచనలో పడ్డాడు ఆంజనేయులు.

వంగని ఇనుముని సమ్మెటతోనూ, లొంగని స్త్రీని పొగడ్తతోనూ, సందిగ్ధంలో ఉన్న నాయకుడిని సలహాతోనూ కొట్టాలని చాణుక్యకి తెలుసు.

"పాతికేళ్ళు పెంచిన పార్టీని అధికారం కోసం వదిలేసిన వాడివి, పదేళ్ళ పరిచయమున్న అలివేలుని పదవి కోసం వదిలేయలేవా? కాస్త కలాపోసన తగ్గించు" అన్నాడు.

గురుసూచన పాటించి, అలివేలు ఇంటికి రాకపోకలు తగ్గించాడు ఆంజనేయులు. అలివేలుకి ఇన్–సెక్యూరిటీ మొదలైంది. ప్రియురాలికి అభద్రతాభావం పెరిగినప్పుడు *'మీరు మారి పోయార్లెండి..'* , *'మేమెందుకు ఆనతాం లెండి'* లాంటి ఎత్తిపొడుపులు, *'ఎలాగైనా ఒకప్పుడు...'* అన్న నిష్టూరాలూ మొదలవుతాయి. ప్రేమికులు గానీ, దంపతులు గానీ దూరమవటానికి తొలిసంకేతాలు ఇలాంటి నిష్టూరాలూ, ఎత్తి పొడుపులే కదా.

ఆ విధంగా ఆమె అధికారం చెలాయించటం ప్రారంభించేసరికి అతను మరింత మొహం చాటెయ్యటం మొదలుపెట్టాడు.

ఇంతలో మరో సంఘటన జరిగింది. అలివేలు తిరుపతి వెళ్ళటానికి సంబంధించిన వ్యవహారం అది. భార్యగా వెళ్ళటం వేరు. ముఖ్యమంత్రి ఉంపుడుగత్తెగా వెళ్ళటం వేరు. రాజకీయ చరిత్ర తెలిసినవారికి ఆ విషయం గుర్తుండి ఉంటుంది.

ఆమె పక్కింటివాళ్ళతో కలిసి తిరుపతి వెళ్ళింది. నార్మల్ దర్శనం కాబట్టి గంటల తరబడి క్యూలో నిలబడక తప్పలేదు. వళ్ళు హూనం అయింది. రాజధానిలో ముఖ్యమంత్రి నడుము చుట్టూ పెనవేసిన కాళ్ళు, తిరుపతిలో ఆముదం మసాజ్ కోసం విలవిలలాడాయి.

ఆ తరువాత పదిరోజులకి అక్క కౌసల్య (సవతి) అదే దర్శనానికి వెళ్ళింది. అలిపిరి నుంచి తిరుమల వరకు ఆమెకు జరిగిన మర్యాద, అధికారిక ప్రోటోకాల్, టి.వి.లో చూసి అలివేలు బొడ్డు మీద కారం జల్లినట్టయింది. తనకి ముఖ్యమంత్రి భార్య స్థానం రావాలంటే ఆ స్థానం నుంచి సవతి తప్పుకోక తప్పదనుకుంది. భార్య చనిపోతే ఏ ఫంక్షనులోనో ఆంజనేయులు తనను భార్యగా అనౌన్సు చేస్తాడని ఆశ పడింది.

ప్రియుడి కోసం భర్తని చంపే భార్యలు, ఆస్తికోసం తల్లిని చంపే కొడుకులు, అత్తను చంపే అల్లుళ్ళు ఉన్న లోకంలో, భర్త కోసం సవతిని చంపటంలో ఆశ్చర్యమేముందనుకుంది.

అడ్డు తొలిగించుకోవటానికి తమ్ముడిని సాయం అడిగింది.

అక్కడే ఆమె తప్పు చేసింది.

తమ్ముడిని నమ్మటం.

**ధర్మజ్ఞుడు ఏది మంచిదా అని ఆలోచిస్తాడు. లౌక్యుడు తనకేది లాభమా అని ఆలోచిస్తాడు. నీచుడు తన లాభం కోసం ఏదైనా చేస్తాడు.**

అలివేలు తన మనసులో మాట చెప్పగానే మీసాల్రాజా ఆలోచించాడు.

'ముఖ్యమంత్రి భార్యని ఎలా చంపాలా' అని కాదు.

తనకేది లాభమా అని..!

పెళ్ళాం చచ్చిపోగానే ఆంజనేయులు మరో వివాహం చేసుకుంటాడని నమ్మకం ఏమిటి? ఒకవేళ చేసుకున్నా అలివేలునే చేసుకుంటాడని గ్యారంటీ ఏమిటి?

తన అక్క పట్ల 'బావ'కి ఉన్నది కేవలం కోరికే అని తెలుసుకోలేనంత చిన్నవాడు కాదు రాజా. అదీగాక అక్క ఒకప్పటిలాగా పిటపిటలాడటం లేదు. వయసు పెరుగుతోంది.

నిబద్ధత లేని పురుషుడి పట్ల స్త్రీకీ, ప్రేమ లేని స్త్రీ పట్ల పురుషుడికీ... కాలం గడిచే కొద్దీ ఇష్టం తగ్గి పోతుందనేది నిర్వివాదాంశం కదా. ప్రస్తుతం ముఖ్యమంత్రి అదే స్థితిలో ఉన్నాడని మీసాల్రాజాకి తెలుసు. తోడబుట్టిన చిన్నక్క కోరినట్టు చేయటంకన్నా, దేవుడిచ్చిన పెద్దక్కకి దగ్గరవటంలో ఎక్కువ లాభాలున్నాయనుకున్నాడు.

మరుసటి రోజు వెళ్లి కౌసల్యని కలుసుకుని తెర వెనుక ఆమె పై జరుగుతూన్న హత్యాప్రయత్నంతో సహా అంతా చెప్పాడు.

తన భర్తకో సెకండ్ సెటప్ ఉన్నదని కూడా తెలియనంత అమాయకురాలు కౌసల్య. ఇంత కాలం రాష్ట్రప్రజల కోసం భర్త రాత్రింబవళ్ళు పని చేస్తున్నాడని అనుకుంది. పగలు ప్రజల కోసమూ, రాత్రి వగల కోసమూ అని తెలిసి కలత చెందింది. తనపై జరుగుతూన్న హత్యా ప్రయత్నం గురించి విని వణికిపోయింది.

ఎదురుగా ఉన్న మనిషి తనని రక్షించడానికి వచ్చిన దేవుడులా కనపడ్డాడు. ఏం చేద్దామని అడిగింది. ఆలోచిస్తానన్నాడు. ఆ విధంగా, అక్క హృదయ ప్రాంగణంలో అనుమానం కళ్ళాపి జల్లి, ఆ తరువాత అక్కడి నుంచి వెళ్లి ముఖ్యమంత్రి మనసు ముగ్గులో భయం నిమ్మకాయ పెట్టాడు.

అలివేలు దుష్టాలోచన గురించి చెప్పగానే, రాత్రికి రాత్రి సగం పైగా ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలోకి వెళ్ళిన దానికన్నా ఎక్కువ కంగారు పడ్డాడు ఆంజనేయులు.

"ఇప్పుడు ఏం చేద్దాం?" బేలగా అడిగాడు.

"నా ప్రాణం కావా నువ్వు బావా. ఇదే అవసరం నాకొస్తే నువ్వు రావా. నే నడుపుతాగా నావ" అంటూ కవిత్వం చెప్పి, ఆయన మాట్లాడక పోయేసరికి మళ్ళీ తనే, "ఆడదాని మనసులోకి ఆలోచన రాకూడదు గానీ బావా, వస్తే అది కరోనాలా పెరుగుతూనే ఉంటుంది. మొక్కగా ఉండగానే కత్తిరించెయ్యాలి" అంటూ సుభాషించాడు.

అయితే ఆంజనేయులు ఏనుగు లక్ష్మణకవిని వినే మూడ్‌లో లేడు. ఏడుపు గొంతుతో, "ఒకవైపు కాటి కాడ నక్కల్లా ఛానల్సూ, మరోవైపు దగ్గర కొస్తూన్న ఎలక్షన్సూ..! ఆ ముండ ఎంతకైనా తెగిస్తుంది. ఆరు కోట్ల విలువ చేసే దేవాలయం భూమి అప్పనంగా ఇచ్చినా దానికి సంతృప్తి లేదు. దాని దగ్గర ఏవైనా సాక్ష్యాలు ఉండొచ్చు. అవి రోడ్డున పడితే కష్టం. 'మీ టూ' లాగే ఈమధ్య 'యూ టూ' వచ్చింది. అది మరింత డేంజరు" అంటూ శాపనార్థాలు పెట్టాడు.

మీసాల్రాజా మాట్లాడలేదు. ఇవే పెదవులు గత రాత్రి, 'ఆ పెదాలు దొండ పండ్లు, ఆ బుగ్గలు బత్తాయిలు, ముక్కు క్యారట్, చెవులు క్యాబేజీ' అని కూడా పొగిడి ఉండవచ్చు. అభిప్రాయాలు మారటానికి చిన్న సంఘటన చాలు కదా.

అయితే మీసాల్రాజా అదంతా ఆలోచించటం లేదు. ముఖ్యమంత్రికి దగ్గరవటానికి ఇంతకన్నా గొప్ప అవకాశం మళ్ళీ రాదు. ఈ వ్యవహారంలోకి చాణుక్యని రానివ్వకూడదు. ఖ్యాతి మొత్తం తనకే దక్కాలి.

"చెప్పటం కాదు గానీ బావా. అది అలివేలు కాదు. విరిగిన కీలు. విడిపోయిన సీలు. తెగి పోయిన రీలు. దాని నోరు రాయలసీమ బోరు. అది నా అక్కే. కానీ నా కెప్పుడూ జీర్ణం కాని కక్కే".

బావమరిది వచన కవిత్వం ఆనందించే స్టేజిలో లేడు ఆంజనేయులు.

"ప్రజల కోసం ఎన్ని చేశాను..! సెప్టెంబర్లో ముఖ్యమంత్రి అయ్యాను. అక్టోబర్లో మత గురువుల ఆశీస్సులు తీసుకున్నాను. నవంబరులో తాయెత్తు కట్టుకున్నాను. డిసెంబర్లో నా పేరులో అక్షరం మార్చాను. జనవరిలో ఉంగరంలో రాయి మార్చాను. ఫిబ్రవరిలో యజ్ఞం చేశాను. మార్చిలో వాస్తు చూపించాను. పార్టీలోకి వచ్చిన వారి మీద ఏప్రిల్‌లో కేసులు రద్దు చేశాను. జనం కోసం ఇన్ని చేసినా ఇలా జరిగిందంటే, ఆ పిల్లి బిత్తరి గుంట దిష్టి నాకు తగులుతోందన్న మాట. నా భార్యని చూడు. దేవత. తనకి కొడుకులు లేకపోవటం నాదురదృష్టం..." అంటూ, కొడుకులు ఉండి ఉంటే తాను అలివేలుతో సంబంధం పెట్టుకొని ఉండేవాణ్ణి కాదన్నట్టు మాట్లాడాడు. చర్యల్ని సమర్థించుకోవటానికి మనుష్యులు ఎక్కడెక్కడి డాట్స్ని కనెక్ట్ చేస్తారనటానికి ఇంతకన్నా ఏమి ఉదాహరణ కావాలి?

"కొడుకులు లేకపోవటం ఏమిటి బావా? నే ఉన్నానుగా. అక్క నాకు అమ్మ లాంటిది. ఆమె కౌసల్య అయితే నువ్వు దశరథ మహారాజువి. ఇన్ని యాగాలు చేసిన నువ్వు, అశ్వమేధం కూడా చెయ్యి. అప్పటి వరకూ నేనే మీ రాముడు అనుకో" ఓదార్పుగా అన్నాడు మీసాల్రాజా.

ఆంజనేయులికి ఆవిధంగా ఓదార్పు వింజామరలు వీచి, ఆ సాయంత్రం వెళ్లి చాణుక్యని కలుసుకుని అంతా వివరంగా చెప్పాడు. మొత్తం విని, "మొక్కగా ఉండగానే తీసేయ్యాలి. చెట్టయితే ప్రమాదం" అన్నాడు చాణుక్య.

"మొక్కగా ఉన్నప్పుడు తీయటం మీ ప్రాచీన తత్వం. విత్తనమే తీసెయ్యటం మా ఆధునిక కవిత్వం. బావకి అదే చెప్పాను" అన్నాడు మీసాల్రాజా, 'బావ' అన్న పదాన్ని నొక్కుతూ.

"నీ అక్కని..."

"ఆ ఏర్పాట్లన్నీ గంట క్రితమే చేసేశాను" అన్నాడు 'ఇందులో నీ అవసరం లేదు' – అన్న అర్థం వచ్చేలా.

...

ఆ రాత్రి అలివేలుకి కడుపు నొప్పి వచ్చింది. హుటాహుటిన 'ప్రభుదేవ్' ఆస్పత్రిలో చేర్పించారు. ప్రభుదేవ్ ఆస్పత్రి ముఖ్యమంత్రిదని చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

దాని సూపరెంటెండెంట్ డాక్టరు రామానుజం ముఖ్యమంత్రి వ్యాపార భాగస్వామి. కిడ్నీ విభాగం డాక్టరు. అతడే ఆపరేట్ చేశాడు. గంట తరువాత ఆమె మరణించింది. కడుపు నొప్పికి కిడ్నీ డాక్టరు ఆపరేషనేమిటి అన్న అనుమానం వద్దు. మనిషి కిడ్నీలు ఖరీదైనవే కదా. న్యాచురల్ ఆపరేషన్ అయ్యాక మరణిస్తే పోస్ట్-మార్టం ఉండదు కదా.

ఆవిధంగా ఆంజనేయులికి మీసాల్రాజా ఆపద్బాంధవుడయ్యాడు. అయితే ఇది అక్కడితో ఆగలేదు. అలివేలు మరణించిన కొన్ని రోజులకి మీసాల్రాజా వెళ్లి కౌసల్యని కలుసుకున్నాడు.

ప్రాణాలు రక్షించినందుకు అమలాపురం పాలకోవా పెట్టి ఆదరించింది.

"నీ కన్నా చిన్నవాడిని అక్కయ్యా. నీకు చెప్పేటంత అనుభవం లేదు. అయినా నాలుగు మాటలు చెబుతాను. బావ నీ గురించి ఎప్పుడూ చెపుతూ ఉంటాడు. '... పెళ్ళయిన కొత్తలో పావుకిలో నడుముతో పావురంలా ఉండేది, పాతికేళ్ళ క్రితం ఆపరేషన్ జరిగాక ఈమూ-బర్డ్ లా తయారైంది. దాంపత్యానికి పనికి రావట్లేదు' అని బాధపడ్డాడు. నీకు తెలియనిది ఏముంది? ప్రజల కోసం పని చేసేవారికి కోరికలు ఎక్కువుంటాయన్నది జగమెరిగిన సత్యం కదా. బావకేమో కోరిక ఎక్కువ. మా అక్క మీద మోజు పడ్డాడు. దాని పాపపు కోరికకి భగవంతుడు తగిన విధంగా శిక్షించాడనుకో. ఇప్పుడు ఆ స్థానం ఖాళీ అయింది. ఆ 'స్థానపు' ఆస్థానంలోకి మరో అలివేలు రాకుండా ఉండాలంటే కొన్ని విషయాలు నువ్వు చూసీ చూడకుండా వదిలేయాలి"

"ఏ విషయాలు?" అమాయకంగా అడిగింది.

"నీ ప్రాణానికి ప్రమాదం రాకుండా ఉండేవి"

"నాకేమీ అర్థం కావట్లేదు."

"ఇంత దూరం వచ్చాక ఇక దాచేది ఏముంది అక్కా. 'రాజకీయ నాయకులకి కడుపులో ఆకలి కన్నా కడుపు క్రింద ఆకలి ఎక్కువ' అన్నాడు నాభ్యానంద స్వామి. బావకి శృంగారంపై మక్కువ ఎక్కువ. నువ్వు దానికి పనికిరావు. అందుకని ఆయన మొహం మీద ముసుగేసుకుని చిలక్కొట్టుడు కొట్టాలి. కానీ ఒకప్పట్లా కాదు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రి. మరోవైపు ప్రతిపక్షం బలంగా ఉంది. బయటపడితే కుర్చీకే ప్రమాదం. ఏమి చేసినా రహస్యంగా చేసుకోవాలి. నువ్వు కాస్త చూసీ చూడకుండా ఊరుకుంటే మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటాను. సతీ సుమతి పుట్టిన దేశంలో పుట్టినదానివి. ఇంతకన్నా ఏమి చెప్పను?" అన్నాడు.

అతడు నర్మగర్భంగా చెప్పింది ఆమెకి పూర్తిగా అర్థం కాలేదు కానీ, అలా చేస్తే తన ప్రాణానికి భయం లేదన్న విషయం మాత్రం అవగతమై, 'సరే' అన్నది.

తన భార్యతో మీసాల్రాజా చేసిన రాయబారానికి ఆంజనేయులు అమితంగా సంతోషించాడు. భయపడుతూ బయటకు వెళ్ళటం కన్నా, ఇంట్లోనే మరో పడగ్గది ఏర్పాటు చేసుకోవడం సులభం కదా. రాజభవన్‌లలో ఎంతమంది ఆ ఏర్పాట్లు చేసుకోవటం లేదు?

ఆలోచన బావుంటే, అది చెప్పినవాడు అంతరంగికుడు అవుతాడు. అప్పటి నుంచీ మీసాల్రాజా అతనికి ఆ విధంగా కుడి భుజమూ, ఎడమ చెయ్యీ అయ్యాడు. బావ అమ్మాయిల పిచ్చిని అతడు తీరుస్తూ ఉంటాడు. దానికి ప్రతిగా బావమరిది పనులని ఆయన చూసీ చూడనట్టు వదిలేస్తూ ఉంటాడు.

ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే రక్షించటానికీ, కావలసిన పని చెయ్యటానికీ చాణుక్య ఎలానూ ఉన్నాడు.

ఆరోజు చాణుక్య భుజాలు పట్టుకుని మీసాల్రాజా కోరిన కోరిక అటువంటిదే.

'ఎల్లమంద' చావు వార్త తన చెవిన పడాలని..!

# 13

**ఆస్పత్రి** నిశ్శబ్దంగా ఉంది. ఆమె తండ్రి వైపు చూస్తూ కూర్చుని ఉంది. ఆయన ఈలోకంలో లేడు. కోమాలోంచి ఎప్పుడు బయట పడతాడో తెలీదు. బ్రెయిన్-డెడ్? ఇంకా చెప్పలేం అంటున్నారు డాక్టర్లు. మరో ఆస్పత్రిలో ఇనస్పెక్టర్ ధర్మారావు ఉన్నారు. వెన్నెముక విరిగిందట. ఇక జీవితాంతం పడక మీదేనట.

తండ్రికి బ్రెయిన్ ఆపరేషన్ ప్రమాదమని ఒక డాక్టరూ, ఆపరేషన్ చేస్తే స్పృహలోకి వస్తాడని మరొకరూ అన్నారు. ఆపరేషన్ చెయ్యాలా వద్దా?

చేస్తే బ్రతికి బయటపడే చాన్సు పది శాతం అంటున్నారు డాక్టర్లు.

'స్ట్రాంగ్ మెడిసిన్' నవలలో ఇలాంటి పరిస్థితే ఉంటుంది. ఎదురుగా పేషెంట్. మరో గంటలో ఆపరేషన్. సర్జన్ ఎదురుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఇద్దరు డాక్టర్ల రిపోర్టులు ఉంటాయి. పేషెంట్ కాలు మీద వ్రణం కేన్సరని, కాలు మొత్తం తీసెయ్యకపోతే ప్రాణం పోతుందని ఒక రిపోర్టూ; కేన్సరు కాదనీ, తీసేస్తే అనవసరంగా కాలు పోతుందని మరొకరి రిపోర్టూ ఉంటాయి. ఆపరేషన్ చెయ్యాలా వద్దా నిర్ణయించుకోలేని సందిగ్ధ స్థితి.

ఇక్కడా అలాంటి స్థితే. కానీ... ఆపరేషన్ చేస్తే ప్రాణాలకి ప్రమాదమా? కాదా? అని కాదు. చెయ్యాలా వద్దా అని. ఒకవేళ ఆపరేషన్ జరిగి ప్రమాదం నుంచి తండ్రి బయట పడినా, వెంటనే పోలీసులు తీసుకుపోతారు.

పోలీసు కేసు తేలేవరకూ కోమాలో ఉండటమే మంచిది.

ఎంత దౌర్భాగ్యం.

తండ్రి కోమాలోనే ఉండాలని కోరుకోవటం..!

ఆమెకు దుఃఖం వస్తోంది. తండ్రంటే అంత ఇష్టం. తండ్రి తప్ప ఇంకేమీ అవసరం లేదు. కొన్ని విషయాలు తలుచుకుంటే ఆమెకే ఆశ్చర్యంగా ఉంటుంది. తను ఇప్పటివరకూ ఒక్కసారి కూడా కుర్తా, పైజమా వేసుకోలేదంటే ఎవరూ నమ్మరు. ఎప్పుడూ వంటికి నిండుగా

చీర, చేతులకి మట్టి గాజులు. ఎందుకు? ఎందుకంటే, తండ్రికి తను అలా కనపడటం ఇష్టం కాబట్టి.

చిన్నప్పుడే తల్లి పోవటంతో ప్రతి పనీ తండ్రి మెచ్చుకోలు కోసం చెయ్యటం అలవాటుగా మారింది. ఓణీ కట్టుకున్నా, ముగ్గులేసినా అంతా తండ్రి కోసమే. అవన్నీ తనకి ఇష్టం లేదని కాదు..! ఇష్టమూ లేదు. అయిష్టమూ లేదు. తండ్రికి ఇష్టం కాబట్టి తనకి ఇష్టం. అంతే. దాన్నే ఫిక్సేషన్ అంటారు. తనకి 'ఫాదర్-ఫిక్సేషన్' ఉన్నది. అందులో ఏమీ సందేహం లేదు.

'...నా తండ్రి ఒక నడుస్తున్న లైబ్రరి. అంత జ్ఞానమూ, తెలివీ, క్రమశిక్షణ, నిజాయితీ ఈ ప్రపంచంలో ఇంకెవరికీ ఉండదు' అన్న ఐడియల్-హీ భావంతో; 'భర్త'తో సహా అందర్నీ తండ్రితో పోల్చి చూడటం; తాము ఈ రోజు ఇలా ఉండటానికి కారణం తండ్రి అనుకుంటూ, ప్రతిక్షణం తండ్రినే తలచుకుంటూ ఉండటాన్ని "ఫాదర్ ఫిక్సేషన్" అంటారు. ఇది ఆడపిల్లల్లో ఎక్కువ ఉంటుంది. జీవితాంతం తండ్రితో కలిసి బ్రతకరు కాబట్టి దీనితో ఇబ్బందులు వచ్చే స్కోపు తక్కువ..!

మైకేల్ జాక్సన్‌లాంటి గాయకులూ, ఆటగాళ్ళు, నటులూ మొదలైన బయటి వ్యక్తుల మీద ఉండే ఫిక్సేషను ప్రమాదకరం. వారు దైవాంశ సంభూతులని నమ్మటం. రక్తపు బొట్లు, కటౌట్లు, క్షీరాభిషేకాలూ ఈ విభాగం. ఇదే ఫిక్సేషన్ అపాయకరమైన స్థితిలోకి వెళితే దాన్ని 'ఎరిటోమానియా' అంటారు. ఈ వ్యాధి ఉన్న స్త్రీ, బాగా పేరు ప్రఖ్యాతలున్నవాడూ, లేదా డబ్బున్నవాడూ తనని ప్రేమిస్తున్నాడన్న భావనతో, అతడితో వివాహం జరిగినట్టు, గర్భం దాల్చినట్టు కూడా 'మనస్ఫూర్తిగా' నమ్ముతుంది. జయప్రద, శ్రీదేవిలాంటి వారు తనతో కొంతకాలం కాపురం చేశారన్న భ్రాంతి కూడా ఈ వ్యాధికి ఉదాహరణ. స్వజాతికి సంబంధించినంత వరకూ ఇది మరోరకం ఫిక్సేషన్. అక్కడ అమెరికాలో ట్రంప్‌కి ఒంట్లో బాగు లేకపోతే ఇక్కడ తిండి మానేయటం లాంటివి ఇలాంటి మానసిక రుగ్మతలకి ఉదాహరణలు.

అయితే వేదరవళికి సంబంధించినంత వరకూ ఈ ఫిక్సేషన్ థియరీ పూర్తి నిజం కాదు. ఆమెది స్ప్లిట్ పెర్సనాలిటి. ఇంట్లో ఒకలా, బయట ఒకలా... ఆమె వ్యక్తిత్వం ఇలా రెండు రకాలుగా ఎదిగింది. శాస్త్రి లేశమైనా కోపఛాయ లేనివాడు, అపకారికి కూడా అపకృతి తలపెట్టని వాడు. రవళి అలా కాదు. కోపం, పగ, కసి మిళితమయిన అతివ. దీనికి ఉదాహరణగా ఒక సంఘటన చెప్పుకోవచ్చు.

కాలేజీలో చేరిన రెండో రోజు అది. ర్యాగింగ్ చాలా హారిబుల్‌గా ఉంది. అప్పటికే ఆమె చిరాకు తారాస్థాయిలో ఉంది. చిన్న సంఘటనతో అది అగ్నిపర్వతంలా బ్రద్దలైంది. కాంటిన్లో భోజనం చేస్తుంటే సీనియర్స్ వచ్చారు. రవళి పక్కన కూర్చున్న అమ్మాయిని పేరు అడిగారు. "సారమ్మ" అని చెప్పింది.

"సరమ్మా?" ఐరావతం లాంటి లావుపాటి అమ్మాయి మొహం చిత్రంగా పెట్టి అడిగింది. మరో అమ్మాయి, "సమ్మక్క ఎక్కడ?" అంది. అందరూ గొల్లున నవ్వారు.

"పూర్తి పేరు?" అడిగింది ఐరావతం.

"బేడజంగం సారమ్మ"

"బెదిజమ్మామా? అదేం పేరు? ఏం కులమే నీది?"

ఆ అమ్మాయి మాట్లాడలేదు. తలవంచుకుని కూర్చుని ఉంది.

హాస్టల్లో కూడా మెళ్ళో ఖరీదైన నెక్లెస్ వేసుకున్న నియో-రిచ్ అమ్మాయి "నువ్వు తిన్న కంచంలో రేపు మేము తినాలా?" అన్నది.

ఈ లోపులో మరో పొట్టి జుట్టు అమ్మాయి బ్యాగ్ లోంచి చిన్న సీసా తీసి ఆ అమ్మాయి తింటూన్న అన్నంలో పోసి 'తినవే' అంది. సారమ్మ సందిగ్ధంగా అన్నం కెలుకుతూ ఉండి పోయింది.

రవళి కల్పించుకుని "ఏమిటది?" అని అడిగింది.

"నీకెందుకే? అన్నట్టు నువ్వే కులం?" పొట్టిజుట్టు అమ్మాయి అడిగింది.

"ముందది చెప్పండి. అమ్మాయి కంచంలో పోసింది ఏమిటి?" గద్దించింది రవళి.

"గోమూత్రం. ఏం? నీకూ పోయాలా?" ఎగతాళిగా అన్నది ఐరావతం. భోజనం ముందు కూర్చున్న సారమ్మ ఇబ్బందిగా చూస్తోంది. పొట్టి జుట్టు అమ్మాయి సారమ్మ తల వెనుక చెయ్యి వేసి, "తినవే" అంటూ మొహం ముందుకు నొక్కింది. సారమ్మ కంటి నుంచి నీటి చుక్క అన్నంలో పడటం రవళి కంట పడింది. కుర్చీలోంచి విసురుగా లేస్తూ, "ర్యాగింగ్ అంటే ఇలాగే ఉంటుందా? ఇది ర్యాగింగ్ కాదు. శాడిజం" అంది కోపంగా.

"వచ్చి రెండు రోజులు కాలేదు. రెచ్చి పోతున్నావు. నువ్వెవరే?"

"మూడేళ్ళ క్రితం మీరూ జూనియర్సే. గెలవటానికి ఇంకేం లేనివారే మీలా తయారవుతారు. ఐడెంటిటి క్రైసిస్" అన్నది రవళి కోపంగా.

"అబ్బో. మాకు తెలియని ఇంగ్లీషు మాట్లాడుతున్నావే. ఏమన్నావ్? మళ్ళీ అను" ఐరావతం రవళి భుజం పట్టుకుని ముందుకి లాగుతూ అంది.

"ఐడెంటిటి క్రైసిస్"

"అంటే?"

"భుజం వదులు"

"భుజమేగా పట్టుకున్నాను. ఇంకా పక్కన పట్టుకోవాలా?"

"వదులు - అని చెపుతున్నాను"

"ఏం? పక్కది బాయ్-ఫ్రెండు నొక్కేదా?" అంది ఐరావతం. అందరూ నవ్వేరు. నియో-రిచ్ అమ్మాయి రవళి మెడ క్రింద గీత మీద చూపుడు వేలితో రాయబోయింది.

అప్పుడు కొట్టింది రవళి. ఎంత బలంగా కొట్టిందంటే, ఆ అమ్మాయి చెంప చెళ్ళుమన్న శబ్దం క్యాంటీన్ హాలంతా ప్రతి ధ్వనించి ఒక్కసారిగా హాలు నిశ్శబ్దం అయిపోయింది. రవళి కామ్ గా తిరిగి కుర్చీలో కూర్చుంది.

ఈ హఠాత్ పరిణామానికి సీనియర్లు విస్తుబోయారు. ముందుగా తేరుకున్నది ఐరావతం.

"ఎంత ధైర్యమే నీకు. మా మీదే చెయ్యి చేసుకుంటావా?" అంది.

రవళి మాట్లాడలేదు.

"ప్రిన్సిపాల్‌కి చెప్పి టి.సి. ఇప్పించకపోతే..." అనబోతూ ఉంటే రవళి కుర్చీ వెనక్కి తోస్తూ ఒక్క ఉదుటన లేచి, "టి.సి. ఇప్పిస్తావా? మాకు టి.సి ఇప్పిస్తే, ర్యాగింగ్ చేసినందుకు నీకేమి ఇప్పించాలి?" అని అరిచింది.

ఎదురుచూడని ఈ దాడికి సీనియర్సు స్థబ్దులయ్యారు.

"ఆ అమ్మాయి తల మీద చెయ్యి వేసింది ఎవరు? కులం పేరు చెప్పి అన్నంలోకి నొక్కింది ఎవరు? పద. పోలీస్ స్టేషనుకి వెళ్లి తెలుసుకుందాం".

"మా వాళ్ళతో చెప్పి...." ఐరావతం మాట పూర్తి కాలేదు. రవళి రెచ్చిపోయింది.

"నీకే కాదు. నాకూ ఉన్నారు మా వాళ్ళు. ఒక్కదాన్ని ఉన్నప్పుడు నన్ను కొట్టిస్తే, ఒక్కదానివే ఉన్నప్పుడు నీ మొహం మీద ఆసిడ్ పోయటం నాకూ కష్టం కాదు."

"చూసుకుందాం" అన్నది ఐరావతం.

"తప్పకుండా. కాలేజీలోనా – బయట జంక్షన్లోనా? నీ ఇష్టం"

జూనియర్స్ సంభ్రమంగా చూస్తున్నారు. సీనియర్స్ అవాక్కయ్యారు. ఐరావతం ఏదో అనబోతూ ఉంటే "చేసిన గొడవ చాలు. ఇక ఆపండి" అన్న మాటలు వినపడి తల తిప్పి అందరూ అటు చూశారు.

సన్నగా రివటలా ఉన్న కుర్రాడు అక్కడ నిలబడి ఉన్నాడు. (అతడు పోస్ట్–గ్రాడ్యుయేటు స్టూడెంటు సత్య అనీ, యూనియన్ ఆక్టివిటీస్‌లో ఎక్కువ పాల్గొంటూ ఉంటాడనీ తరువాత తెలిసింది). టేబిల్ దగ్గరకి వచ్చి సారమ్మ తో, "లే పాపా. ఇంకో కంచం తెచ్చుకో. ఇది గోమూత్రమూ, కోడి మూత్రమూ కాదు. మామూలు నీళ్ళు" అని ఐరావతం (ఆమె పేరు మాలతీ లతాంగి అని తరువాత తెలిసింది) వైపు తిరిగి "ఏమి? అంతేగా" అన్నాడు. ఐరావతం మాట్లాడలేదు.

"ప్రిన్సిపాల్‌కి తెలిసిందంటే అందర్నీ సస్పెండ్ చేస్తాడు. రండి పోదాం" అన్నాడు. అతడు వెళ్తూంటే, నలుగురూ అతడిని అనుసరించి వెళ్ళిపోయారు. రవళిని చూసి వాళ్ళు భయపడినట్టు స్పష్టంగా తెలుస్తోంది. అందరూ వెళ్ళిపోయాక రవళి సారమ్మని, "ఏ వూరు మీది" అని అడిగింది.

"ఆదిత్యపురం"

రవళి సంభ్రమంగా "అరె. మాదీ ఆ ఊరే. ఎక్కడ ఉంటారు?" అని అడిగింది.

"అంబేద్కర్ నగర్. మీరు నాకు తెలుసక్కా. మాస్టారిగారి అమ్మాయి కదా. మా అన్నయ్య ఎల్లమంద యూత్ మెన్ అసోసియేషన్ ప్రెసిడెంటు. మీకు తెలుసా?"

"లేదు. పేరు విన్నాను"

"నాదో చిన్న డౌట్. అడగనా"

"తప్పకుండా"

"జంక్షన్లో చూసుకుందాం అన్నారు. ఏ జంక్షన్? మిమ్మల్ని చూస్తే అలా కనపడటం లేదు. నాక్కూడా చెప్పరా. మీకంత ధైర్యం ఎలా వచ్చింది?"

"బాలకృష్ణ సినిమాలు చూస్తే వచ్చింది" నవ్వేసింది రవళి. సారమ్మ కూడా ఆ మూడ్ నుంచి బయటపడ్డట్టు, 'థ్యాంక్స్ అక్కా' అంది రిలాక్సింగ్‌గా. ఆ సంఘటన అలా ముగిసింది.

* * *

ఎన్నికల సమయంలో అతడు రవళిని రెండోసారి కలుసుకున్నాడు. "ఆ రోజు క్యాంటీన్లో మీ పక్షాన మాట్లాడానని సీనియరు అమ్మాయిలందరూ నామీద కక్ష గట్టారు. ప్రెసిడెంటుగా నిలబడుతున్నా. నన్ను గెలిపించే బాధ్యత మీదే" అన్నాడు చిన్న పిల్లాడిలా.

"తప్పకుండా" అంది రవళి. అంతే కాదు. జూనియర్స్ అందర్నీ కూడగట్టి, అన్ని ఓట్లూ అతనికే పడేటట్టు చూసింది కూడా. పెద్ద మెజారిటీతో గెలిచాడు. థ్యాంక్స్ చెప్పటానికి వచ్చినప్పుడు, "నిజంగా మీ వెనుక ఏదైనా రౌడీ బ్యాచి ఉందా అండీ?" అని అమాయకంగా ప్రశ్నించాడు.

ఆమె అర్థం కానట్టు చూసింది.

"అన్న... తమ్ముడు... బాబాయ్.." అని అంటూంటే, అతడు దేని గురించి మాట్లాడుతున్నాడో అర్థమై కంగారు పడి "అబ్బే. అదేం లేదండీ. 'మనిషిని చూసి పులి ఎంత భయపడుతుందో, పులిని చూసి మనిషి కూడా అంతే భయపడతాడు' అని మా నాన్నగారు అంటూ ఉంటారు. ఏదో ఆవేశంలో అలా వచ్చేసిందంతే" అన్నది.

అతడు అనుమానంగా, "మీరు రివర్సులో చెప్పినట్టున్నారు" అన్నాడు.

నాలుక్కర్చుకుని "అదే.. అదే..." అంటూ నవ్వేసింది.

ఆ సంవత్సరం ప్రభుత్వంవారు స్టడీ టూర్ అరేంజ్ చేశారు. విద్యార్థి పది శాతం, గవర్నమెంటు తొంభై శాతం ఖర్చు భరించే ఏర్పాటుతో, ఫిన్లాండ్ వెళ్ళటానికి ప్రతీ క్లాసు నుంచీ ఒక ఫస్టు మార్కు స్టూడెంటుని సెలెక్ట్ చేశారు*. పి.యు మార్కుల ఆధారంగా ఆమె సెలెక్ట్ అయ్యింది. పాస్-పోర్టు విషయంలో అతడు సాయం చేశాడు.

---

* 1965 ప్రాంతంలో కొన్ని సెలెక్టివ్ కాలేజి విద్యార్థులకి ప్రభుత్వం ఇలా భారతదేశ యాత్ర ఏర్పాటు చేయటం జరిగింది.

అక్కడికి వెళ్లే ముందే ఆ దేశం గురించి ఆమె తయారు చేసుకున్న హోమ్-వర్క్ అతడిని అబ్బుర పరిచింది. ప్రతీ చిన్న పనినీ ఆమె నూరుశాతం మనసు పెట్టి చెయ్యటాన్ని గమనించాడు. ఆ దేశపు విద్యార్థులతో జరిగిన ఇంటరాక్టివ్ ఉపన్యాసాలలో వారికి తెలియని వారి దేశం గొప్పతనం చెప్పి వారి మనసులు చూరకొన్నది.

"సోవియట్ యూనియన్, జర్మనీ లాంటి రెండు పెద్ద దేశాల మధ్య అతి చిన్నదేశం మీ ఫిన్లాండ్. ఆ రెండు దేశాల మధ్యా రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న సమయంలో, ఫిన్లాండుకి ఒక చిత్రమైన, దురదృష్టకరమైన స్థితి సంభవించింది. ఏ దేశమైనా, శత్రు భూభాగం మీద యుద్ధం జరగాలని కోరుకుంటుంది. అప్పుడు ధన, ప్రాణ నష్టం తన దేశానికి కాకుండా ఆదేశ ప్రజలకు జరుగుతుంది. రష్యా అలాగే ఆలోచించింది. ఫిన్లాండ్‌ని ఆక్రమించుకుంటే, జర్మనీతో యుద్ధం తమ సరిహద్దులో కాకుండా మీ దేశంలో జరుగుతుందని ఎత్తు వేసి, రష్యా మీ దేశాన్ని ఆక్రమించుకోవాలని చూసింది. మీదేశ సైనికుడు ఒకడికి, రష్యన్ సైనికులు వంద. అదీ నిష్పత్తి. చాలా సులభంగా మీ దేశాన్ని గెలవచ్చనుకుంది. కానీ ఆ యుద్ధంలో మీ సైనికులు పదివేలమంది మరణిస్తే, రష్యన్ సైనికులు దాదాపు లక్షమంది మరణించినట్టు అప్పటి రష్యన్ నేత కృశ్చేవ్ స్వయంగా వప్పుకున్నాడు. అదీ మీ సైనికుల గొప్పతనం." చప్పట్లు.

"ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలు మిమ్మల్ని గౌరవిస్తాయి. మాట మీద నిలబడటం మీ దేశ ప్రజలకు భగవంతుడిచ్చిన గొప్ప వరం. పిల్లల చదువు విషయంలో ఫిన్లాండ్ నెంబర్ వన్..." ఇలా సాగింది ఆమె ఉపన్యాసం. ఆ తరువాత ఆ పిల్లలకి భారతదేశం పట్ల సుహృద్భావ అభిప్రాయం ఏర్పడటం కోసం మన దేశ నాయకుల గురించీ, సైనికుల గురించీ కూడా చెప్పింది.

"మీ లాగే మా సైనికుల అంకిత భావం కూడా గొప్పది. మా ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మిలిటరీ హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు యుద్ధంలో ఒక సైనికుడి పక్కన కూర్చుని తలమీద చెయ్యి వేసి 'బాధపడకు. తొందరలోనే నయమవుతుంది' అన్నారట. "నేను బాధ పడుతున్నది గాయాల గురించి కాదు సర్. భారత ప్రధాని వస్తే లేచి నిలబడి సెల్యూట్ చేయలేక పోతున్నందుకు" అన్నాడట. ఆ మాటలకి ఆయన కదిలిపోయారు. చాలామంది మా నాయకులు నిస్వార్థపరులు. మా మాజీ ప్రధాని శాస్త్రిగారికి స్వంత కారు కూడా లేదు. తన పిల్లల్ని బస్సులో వెళ్ళమని ఆదేశించేవాడు ఆయన. మా ఇంకో ప్రధాని మొరార్జీ దేశాయ్‌కి పదవీ కాలం ముగిసే సమయానికి స్వంత ఇల్లు కూడా లేదు. మా స్వతంత్ర నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రముఖ లాయర్ అయి ఉండీ, మరణించే సమయానికి కనీసం బ్యాంక్ అకౌంట్ కూడా లేదు. స్వతంత్ర ఉద్యమానికి ఇచ్చేసాడు." ఇలా సాగింది ఆమె ఉపన్యాసం.

ముందు వరుసలో కూర్చుని అతడు శ్రద్ధగా విన్నాడు. బహుశా అప్పుడే ఆమె ప్రేమలో పడి ఉంటాడు.

ఆ సంవత్సరం మ్యాగజైనుకి ఇద్దరూ కథలు వ్రాశారు. ప్రొఫెషనల్సుని వదిలేస్తే, కథలు సాధారణంగా రచయిత జీవితానుభవాల నుంచీ, అభిప్రాయాల నుంచీ వస్తాయి. రవళి వ్రాసిన కథలో కుర్రవాడి తండ్రి చిన్నతనంలోనే చనిపోతాడు. అతడే తమ్ముళ్ళని చదివిస్తాడు. అక్క చెల్లెళ్ళ పెళ్లి చేస్తాడు. తల్లిని ప్రాణంగా చూసుకుంటాడు. ప్రేమకి మించింది లేదన్న ప్రవచనానికి ప్రతీకగా ప్రభాతం నుంచీ వృద్ధాప్యం వరకూ అవివాహితుడు గానే ఉండి పోతాడు. దానికి ప్రథమ బహుమతి వచ్చింది.

సత్య కథ గమ్మత్తుగా ఉంటుంది. తమ ప్రేమకి పెద్దలు వప్పుకోకపోవటంతో ఒక అబ్బాయీ అమ్మాయీ ఆత్మహత్య చేసుకుందామనుకుంటారు. హోటల్ రూములో కూల్ డ్రింకులో విషం కలుపుకొని తాగుతారు. గంట గడిచినా ఇద్దరూ బతికే ఉంటారు. అసలు విషయం తెలిసాక అబ్బాయి, "ఏమనుకోకు. ప్రేమ పట్ల నీ నమ్మకాన్ని పాడు చేయటం ఇష్టంలేక నీకు విషం కలిపి ఇచ్చాను" అంటాడు. అమ్మాయి, "నేనూ అంతే. నువ్వు నన్ను నీ ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నానని చాలాసార్లు చెప్పావు కదా. ఆఖరి క్షణం 'ప్రేమపట్ల నమ్మకం'తో చచ్చిపోతావని హోటల్‌కి వచ్చానే తప్ప చావాలని కాదు. కూల్ డ్రింక్ తాగలేదు. క్షమించు" అంటుంది. ఆ పై ఇద్దరూ ఎవరిళ్లకు వాళ్ళు వెళ్ళిపోతారు. బహుమతికి కాదు కదా, సాధారణ ప్రచురణకు కూడా ఈ కథ నోచుకోలేదు.

అతడు ఆమెను అభినందిస్తూ, "అయితే ఒక మాట. మీరు ఒక అందమైన నీటి బుడగ లో ఉన్నారు. కుటుంబం కోసం అంత త్యాగం చేసేవాళ్ళు ఎవరూ లేరు. బయటకొచ్చి ప్రపంచాన్ని చూడండి" అన్నాడు.

ఆమె నవ్వి "అవును. బలమైన అభిప్రాయాలు ఉన్నవాళ్ళకి బయటి ప్రపంచం కనపడదు కదా" అంది. ఆమె తన బలహీనతని వప్పుకుంటోందో, తన మీద జోకు వేస్తోందో అతడికి అర్థం కాలేదు. అయినా అభిప్రాయం మార్చుకోవటం ఇష్టం లేనట్టు, "మనుష్యులు బ్రతికే విధానం వేరు, బ్రతకాలనుకునే విధానం వేరు. అటువంటి సెంటిమెంట్లుతో జడ్జీలని కొట్టి మీరు బహుమతి సంపాదించారు. అవునా కాదా? మీరే చూడండి. ధనిక దేశాలవాళ్ళు పెట్టే నవలల పోటీల్లో బీదలపాట్లకే బహుమతులు వస్తాయి. డబ్బున్నోళ్ళకి బీదోళ్ళ జీవితం ఒక వినోదం. అలా అని అపార్థం చేసుకోకండి. నాకేమీ జెలసీ లేదు" అన్నాడు.

"మీకు జెలసీ ఉన్నదని నేను అనుకోవటం లేదు. నిజం" అంది.

"అంత గట్టిగా ఎలా చెప్పగలుగుతున్నారు?"

"మీరు యూనియన్ ప్రెసిడెంటు. తలచుకుంటే బహుమతి తెప్పించుకోవటం కష్టం కాదు. సాధారణ ప్రచురణకి కూడా మీ పరపతి వాడుకోలేదంటే మీకు జెలసీ ఎందుకు ఉంటుంది?" అంది.

"మనం పెళ్లి చేసుకుందామా?"

ఆమె షాక్ అవలేదు. మాట్లాడలేదు కూడా.

"ఇంత హఠాత్తుగా ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి. ఇంకో ఏడాది స్నేహం చేసి, అప్పుడు అడగటం కన్నా ఇదే బెటరు అనుకుంటున్నాను" అన్నాడు.

"మంచి పని చేశారు" అంది.

"అయితే ఓకేనా?" అన్నాడు అతడు ఆశగా.

"కాదు. వెంటనే అడిగి మంచి పని చేశారంటున్నాను. మీరే ఉద్దేశ్యంతో స్నేహం చేస్తున్నారో అర్థం కాక నేనూ, నా మనసులో ఏముందో తెలియక మీరూ ఏడాది పాటూ దాగుడుమూతలు ఆడుకోవటం కన్నా అడగటం మంచిదయింది కదా. పోతే, నేను మాగ్జయిన్‌కి వ్రాసిన కథే నా జీవితం. నేను నా తండ్రితోనే ఉండాలి. నా చెల్లి నాతోనే ఉండాలి. కాబట్టి ఈ వివాహం జరగదు".

"వాళ్ళిద్దర్నీ మనతోనే ఉంచుకుందాం"

"మానాన్నగారి సంగతి మీకు తెలీదు. ఆ ఊరు దాటి ఆయన రాడు. ఇంకొకరి పంచన బ్రతకటం ఆయనకి ఇష్టం ఉండదు. ఆయన కోసం నేను అదే పల్లెటూర్లో ఏదైనా టీచరు ఉద్యోగం చేస్తూ సెటిల్ అవ్వాలి. మరోవైపు నా చెల్లి... "

"మీరింత బ్రిలియెంట్ అయ్యుండీ ఆ పల్లెలో... "

"ప్లీజ్. ఇక ఈ టాపిక్ వదిలెయ్యండి మాస్టారూ. మనం ఎంతసేపు వాదించుకున్నా ఇది తేలేది కాదు" అన్నది. అంతే. అక్కడితో ఆ సంభాషణ ముగిసిపోయింది. ఆ తరువాత అతడు ఢిల్లీ వెళ్ళాడని తెలిసింది. రెండేళ్ళకి వివాహ పత్రిక వచ్చింది. వధువు మాజీ రాష్ట్రపతి మనవరాలు.

కార్డు మీద చిన్న చిత్తరువు వేసి అభినందన కార్డు పంపింది.

దూరంగా యమునా తీరం. ఇసుక తిన్నెలు. ముందు కృష్ణుడు. వెనుక రాధ. బొమ్మ క్రింద రెండు ముచ్చటైన వాక్యాలు వ్రాసింది.



అందగానే అతను ఫోన్ చేశాడు. "ఇప్పుడైనా చెప్పు. ఆ పెళ్లి కాన్సిల్ చేస్తాను. మనం చేసుకుందాం".

"అంత సీను లేదులే నా దగ్గర".

"నీలో అంత సీను ఉన్నదో లేదో చెప్పాల్సింది నేను కదా"

"ఉంటాను" అని ఆమె ఫోన్ పెట్టేసింది. ఆ అధ్యాయం అక్కడితో ముగిసింది.

* * *

ఆలోచనలనుంచి తెప్పరిల్లి, గతంలోంచి వర్తమానంలోకి వచ్చింది.

ఆస్పత్రి మందుల వాసన. ఎదురుగా శవాకారంలో తండ్రి. ఖాళీ అయిపోతున్న పర్సు. మేఘం కమ్మిన భవిష్యత్తు. అంతా చీకటే.

ఇంతేనా? ఇక తన జీవితం ఇంతేనా?

తండ్రి చెప్పిన కథ గుర్తు వచ్చింది. కొందరు మనుష్యులు ఎందుకు ఆనందంగా జీవించ(లే)రో పాండుచ్చేరి అరవిందులవారు ఒక అద్భుతమైన కథ ద్వారా చెపుతారు.

ప్రాణులన్నిటినీ సృష్టించాక, తన సృష్టి పట్ల అంతగా సంతృప్తి చెందని భగవంతుడు కోతిని పిలిచి "జీవితం ఇంత బాగుంటుందా అనేట్టు నీకు మరింత సుఖాన్ని ప్రసాదించ బోతున్నాను. అడవిలో చలికీ, ఎండకీ బాధ పడనవసరం లేదు. సాటి జంతువుల భయం ఉండదు. ఆకులు పళ్ళూ కాకుండా రకరకాల రుచులు ఆస్వాదించవచ్చు. రెండు కాళ్ళమీద నడవచ్చు." అని తాను చేయ బోయే మార్పులు చెప్పాడట.

అంతా విని, కోతి "నీకు మతి పోయింది స్వామీ. చెట్టు మీద నుంచి ఇంకో చెట్టుకు గెంతుతూ వెళ్ళే మమ్మల్ని నేల మీద నడిచేలా చేస్తావా? నాలుగు కాళ్ళ మీద హాయిగా గెంతే నన్ను రెండు కాళ్ళ మీద నడిపిస్తావా? పడితే నడుము విరుగుతుంది. పైగా సిగ్గు లేకుండా అందరికీ ఛాతి చూపించుకుంటూ తిరగమంటావా?" అంటూ నిరాకరించింది.

అప్పుడు దేవుడికి కోపం వచ్చి చిలక నుంచి పలుకునీ, లేడి నుంచి చురుకునీ, కుందేలు నుంచి కళ్ళనీ, నక్క నుంచి తెలివినీ, సింహం నుంచి బలాన్నీ, నెమలి నుంచి అందాన్నీ, డేగ నుంచి దృష్టినీ కలిపి అద్భుతమైన ఒక కొత్తజీవికి రూపకల్పన చేశాడు. పక్క నుంచి చూస్తున్న సరస్వతి, "ఈ జీవికి మీరు ఏం పేరు పెడుతున్నారు స్వామీ?" అని అడిగింది.

"మనిషి" అన్నాడు.

"కానీ గతంలో రాక్షసులకూ ఇలాగే బలమూ వగైరా ఇచ్చి కొంప మీదకు తెచ్చుకున్నారు. వాళ్ళకన్ని తెలివితేటలు లేవు కాబట్టి, మీరు మోహినీ వేషం వేసి అమృతం పంచినా, భస్మాసురుడిని చంపినా పని సులభంగా అయిపోయింది. ఇప్పుడు మీరు మనిషికి ఇన్ని తెలివితేటలు ఇస్తే, రేప్పొద్దున్న అతడు మీ మీదకు దండెత్తితే కష్టం కదా."

సహేతుకమైన ఈ ప్రశ్నకి భగవంతుడు ఆలోచనలో పడి, "నిజమే కానీ ఇస్తానని వాగ్దానం చేశాను కాబట్టి ఇవ్వాలి. కానీ అందకుండా చేయాలి. ఎక్కడ దాస్తే మంచిదంటావు?" అని అడిగాడు.

"సముద్రగర్భంలోనో, అగ్నిపర్వతాల క్రిందో, ఆకాశంలోనో పెట్టండి"

"లేదు దేవీ. ఎప్పటికైనా అది ప్రమాదమే. ఎవడైనా దుర్మార్గుడు వాటిని అంది పుచ్చుకుంటే నాశనకారకుడు అవుతాడు. అందాలి, అందకుండా ఉండాలి. శోధించినవాడే సర్వ సంపన్నుడవ్వాలి."

భార్యాభర్తలిదరూ కలిసి చాలాసేపు ఆలోచించారు. ఇద్దరికీ ఒకేసారి ఒకే ఆలోచన వచ్చి ఒకరిని ఒకరు చూసి నవ్వుకున్నారు. మేధస్సునీ, ప్రజ్ఞనీ, తెలివితేటలనీ అన్నీ కలిపి మనిషి 'బుర్ర' లోనే దాన్ని పెట్టారు. అది ఎక్కడుందో తెలియనివారు కష్టాలనీ, బాధల్నీ కొనితెచ్చుకుంటారు. కేవలం బాగుపడదామనుకున్నవారు మాత్రమే అది తమ తమలోనే ఉందని తెలుసుకుంటారు."

తండ్రి ఈ కథ చెపుతూంటే. ఎప్పుడూ ఇటువంటి 'ఛాయిస్'ల గురించే చెప్పే సత్య గుర్తు వచ్చాడు. అతడు కూడా "ప్రతీ దానికీ ఛాయిస్ ఉన్నది. మనం ఆలోచించమంతే" అనేవాడు. "...జీవితం ఎలా ఉండాలనేది మన ఛాయిస్. కొంతమంది ఎప్పుడూ ఆనందంగా ఉండటానికీ, మరి కొంతమంది ఎప్పుడూ విషాదంగా ఉండటానికీ కారణం, వారి ఛాయిస్ మాత్రమే. మొగుడు తాగొచ్చి కొడుతున్నాడు. వాడితో ఉంటే ఆనందమా? విడిపోతే ఆనందమా? ఛాయిస్...! కంఫర్ట్-జోన్ అంటే 'ఇది చాల్లే. బావున్నాగా' అనుకోవటం. నిజంగా బావుంటే ఏ ఇబ్బందీ లేదు. ఇబ్బందిగా ఉంటూ, పక్కవాడిని చూసి అసంతృప్తి పడితే అది కంఫర్ట్ జోన్ ఎలా అవుతుంది?" అనేవాడు.

ఆలోచిస్తే నిజమే అనిపిస్తోంది. తాను ఇంతకాలం కంఫర్టుజోనులో ఉన్నదా? నిశ్చయంగా ఉంది. కారణం తండ్రి..! ఇప్పుడిక యుద్ధం చెయ్యవలసిన సమయం ఆసన్నమయింది. తాను స్వయంగా రణరంగంలో దిగక తప్పదు.

***సమస్య చిక్కదనాన్ని నువ్వు మార్చలేవు. కానీ సమస్య పట్ల నీ ప్రతిస్పందనని మార్చగలవు.***

ఆమె మనసు స్వాంతన చెందింది. కష్టాలు వచ్చినప్పుడు ధ్యానం ఎందుకు చేయమంటారో, భగవద్గీత ఎందుకు చదవమంటారో అర్థమైంది. ఆక్షణం నుంచీ దుఃఖాన్ని దూరం పెట్టాలనుకుంది. అలానే ఆలోచిస్తూ నిద్రపోయింది.

లేచేసరికి బాగా తెల్లవారింది. ఆస్పత్రిలోనే ఫ్రెష్ అయింది. ఇంటికి వెళ్లి చేసేది ఏమీ లేదు. చెల్లెల్ని చూసుకోవటానికి అత్తమ్మ వచ్చింది. ఆమెకీ ఎవరూ లేరు. అదొక వెసులుబాటు.

ఎనిమిది అవుతుండగా జాక్సన్ వచ్చాడు. ఆ సమయంలో ఆమె తండ్రి పక్కన కూర్చుని ఉంది. అంత ప్రొద్దున్నే వచ్చిన అతడిని చూసి ఆశ్చర్యపోయింది. ఇద్దరూ బయటకి వచ్చారు.

"క్షమించండి. పొద్దున్నే డిస్టర్బ్ చేస్తున్నాను. పోలీసు ఉద్యోగం కదా" అన్నాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

"నాన్నగారి గురించి డాక్టర్లు ఏమి చెప్పారు?"

"ఒకరు బాగవుతుంది అంటారు. మరొకరు కష్టమంటున్నారు"

"మీరు దగ్గర వారు కాబట్టి డాక్టర్లు అలా చెపుతున్నారు. నేను ఎంక్వయిరీ చేశాను. లాభం లేదన్నారు. మీరు నిబ్బరంగా ఉండాలి. ఆ లారీ వాళ్ళ మీద కేసు పెట్టాము. ఇద్దరికీ చెరో నాలుగైదు లక్షల దాకా వస్తుంది. డబ్బు సంగతి పక్కన పెడితే, మేము ఒక మంచి ఆఫీసర్ని కోల్పోయాము. "

"ఆ కెమెరాలో ఏమైనా దొరికిందా?" టాపిక్ మారుస్తూ అడిగింది.

"కెమెరా ఉంది. కానీ అందులో మీ ఇంటి విషయం ఏమీలేదు"

ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ధర్మారావుగారి తర్వాత కొత్త ఇనస్పెక్టరు ఇంకా చార్జి తీసుకోలేదు. మీ కేసు నేనే డీల్ చేస్తున్నాను" అని ఆగి, "ఏమీ అనుకోకపోతే నేను ఒక సలహా ఇస్తాను. మీ అన్నయ్యలాంటి వాడిని అనుకొని ఇష్టమైతే పాటించండి" అన్నాడు.

ఇంటికి వచ్చినప్పుడు ఈ 'అన్నయ్య' ఎక్కడ చూశాడో ఆమె మర్చిపోలేదు. అతడేమి చెప్పబోతూన్నాడో అర్థంకాక చెప్పమన్నట్టు చూసింది.

"మీ స్టేట్‌మెంట్ ప్రకారం ఎల్లమంద కేసులో మీకూ, మీ తండ్రికీ ఏ సంబంధమూ లేదు."

"అవును"

"దాని ఆధారంగా అయితే, మేము మొదటినుంచీ తిరిగి ఇన్వెస్టిగేషన్ ప్రారంభించాల్సి ఉంటుంది. రుజువులన్నీ మీ వైపే చూపిస్తున్నాయి కాబట్టి మిమ్మల్ని కస్టడీలోకి తీసుకోక తప్పదు"

ఆమె భయపడలేదు. తలెత్తి అతని వైపు చూసి తిరిగి దించుకుంది.

"అయితే దీన్ని తప్పించుకోవటానికి ఒక మార్గం ఉంది. తనే నేరం చేశానని మీ తండ్రి నాముందే ఒప్పుకున్నారు. దానికి నేనే సాక్షి. మీరు మాకిచ్చిన స్టేట్‌మెంట్ వెనక్కి తీసుకొని, మీ తండ్రి చెప్పిన దాన్ని ఓకే చేస్తే, ఫైల్ క్లోజ్ అయి పోతుంది. ఆయన ఎలాగూ కోమాలో ఉన్నారు కాబట్టి కేసు ఇప్పట్లో తేలదు. దాని కన్నా ముఖ్యంగా ఇన్వెస్టిగేషన్ ఇక్కడితో ఆగిపోతుంది".

"రేపో ఎల్లుండో ఆయనకి మెలకువ వస్తే?" మధ్యలో అతడి మాటలు ఆపు చేస్తూ అడిగింది.

అతడు ఇబ్బందిగా, "అది తరువాత. ప్రస్తుతం మిమ్మల్ని అరెస్ట్ చెయ్యక తప్పదు. చేయాలా వద్దా అన్నది మీ మీద ఆధారపడి ఉంటుంది. ధర్మారావుగారి మీద గౌరవంతో, మీ మీద అభిమానంతో నేను ఈ సహాయం చెయ్యగలను. నిర్ణయం మీదే" అన్నాడు.

క్లుప్తంగా "నేను ఎక్కడన్నా సంతకాలు పెట్టాలా?" అంది.

ఆమె అంత తొందరగా వప్పుకుంటుందని ఊహించని జాక్సన్ తబ్బిబ్బయి, "అవును మేడమ్" అంటూ అంతకు ముందే తయారు చేసుకు వచ్చిన స్టేట్‌మెంట్ పేపర్లు బయటకు తీశాడు.

వాటిపై సంతకం పెడుతూ, "అన్నీ ముందే తయారుచేసి తీసుకొచ్చారే. నేనీ నేరం ఎలాగూ నా తండ్రి మీదకు తోసేస్తానని మీకు బాగా నమ్మకం ఉన్నట్టుంది" అన్నది.

జాక్సన్ కంగారు పడి "ఛా. అటువంటిదేమీ లేదు మేడమ్. ఈ హత్య మీరు గానీ, మీ తండ్రి గానీ చేసి ఉండరని మా అందరికీ తెలుసు. కానీ చట్టం తన పని తాను చేసుకుపోవాలి కదా" అంటూ లేచి, "ఆ లాకప్పులూ, అరెస్టులూ మీరు పడలేరు మేడమ్. తెలివైనవారు కాబట్టి తొందరగా ఈ పీడ వదిలించుకున్నారు. సంతోషం. వస్తాను" అని పోలీస్ సెల్యూట్ చేసి వెళ్లి పోయాడు.

అతడు వెళ్ళాక ఆమె ఫోన్ తీసి డయిల్ చేసి, "హలో సత్యా. నేను" అంది.

"తెలుసు. చెప్పు"

"జాక్సన్ వచ్చాడు. మార్చిన స్టేట్‌మెంట్ మీద సంతకాలు పెట్టించుకున్నాడు. రాడని నువ్వు అన్నావ్. వస్తాడని నేను అన్నాను. నేను చెప్పిందే కరెక్ట్ అయ్యింది. చూడు. "

"నీ అంత తెలివితేటలు ఉంటే నేనిలా ఎందుకు ఉంటాను? టచ్ లో ఉండు" అని ఫోన్ పెట్టేశాడు సత్య.

* * *

ఆ సాయంత్రం ధర్మారావు దగ్గరికి వెళ్ళింది. పడుకుని ఉన్నాడు. ఆమెను చూసి ఆహ్వాన పూర్వకంగా నవ్వాడు.

"ఎలా ఉన్నారు?" పక్క కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"బ్రతికి"

ఆ మాటలకి మనసు చెదిరినట్టు చూసేసరికి, బిగ్గరగా నవ్వేస్తూ, "సెల్ఫ్ పిటీ కాదు. ఇక బ్రతికున్నంత కాలం ఇలా పడుకునే ఉండాలి కదా అని సరదాగా అన్నాను".

తనతో పాటూ తీసుకొచ్చిన భగవద్గీత అతడికి ఇచ్చింది.. అతడు దాన్ని అందుకుంటూ "చాలా మంచి గిఫ్ట్. థ్యాంక్స్. ఈ సమయంలో దీని అవసరం నాకు చాలా ఉంది" అన్నాడు.

"వారం రోజుల్నించీ నాకు అదే ధైర్యం చెపుతోంది సార్. కష్టం వచ్చినప్పుడల్లా కృష్ణుడిని తలచుకోమంటారు నాన్న. పుట్టకముందే శత్రువులు ఉన్నవాడు. పుట్టుకతోనే

తల్లిదండ్రులకి దూరమైన వాడు. రాజై ఉండీ గోకులంలో పెరిగినవాడు. అయినా సరే, భారత భాగవతాల్లో ఎక్కడా కృష్ణుడు దిగులుగా ఉన్నట్టు కనపడదు" అన్నది.

"బాగా చెప్పావమ్మా. నాన్నగారు ఎలా ఉన్నారు?" ప్రశ్నించాడు.

"కోమాలోంచి ఎప్పుడు బయటకి వస్తారో చెప్పటం కష్టమంటున్నారు డాక్టర్లు. ఒకవేళ వచ్చినా, అరెస్టు వారెంటు ఉంది. కళ్ళు తెరవగానే ఎదురుగా పోలీసులు కనబడతారు. ఆయన కోమాలో ఉండటమే మంచిది" అని ఆగి, "ఎంత దౌర్భాగ్యమైన స్థితి. ఏ కూతురూ కలలో కూడా ఆలోచించకూడని దుర్మార్గపు ఆలోచన. తండ్రి మరి కొంత కాలం కోమాలోనే ఉండాలనుకోవటం."

ఈ మాట అంటున్నప్పుడు కంఠంలో కాస్త కూడా దుఃఖపు జీర వినిపించలేదు. ఆమెకే చిత్రంగా అనిపించింది.

"ఆ కెమెరాలో ఏమీ లేదు కదా" అని అడిగాడు.

"లేదట"

"అనుకున్నాను" క్లుప్తంగా అన్నాడు.

అతడి భావం అర్థమైనట్టు ఆమె మౌనంగా ఉండిపోయింది.

ధర్మారావు తల కాస్త పైకి లేపి క్రింద దిండు సర్దుకుంటూ "పక్క మీద ఉండే కాస్త పరిశోధన చేశాను" అన్నాడు. "... పండగరోజు మీ ఇంటికొచ్చిన ముసలోడు ముఖ్యమంత్రికి సలహాలు ఇచ్చే చాణుక్య. ఇకపోతే సంక్రాంతి రోజు కార్లో వచ్చింది మొత్తం నలుగురు. అందులో మీసాల్రాజా అనేవాడు సి.ఎం బావమరిది".

"మిగతా ముగ్గురూ అంజి, గోవిందు, ప్రభు..." పూర్తి చేసింది రవళి.

ధర్మారావు అవాక్కై, "మైగాడ్. ఎలా తెలుసు?" అన్నాడు.

"నేనూ కొద్దిగా పరిశోధన చేశాను" అంది ఆమె నవ్వి.

"సస్పెన్సు తట్టుకోలేను. ఎలా తెలిసింది?"

"బాలారిష్ట శ్వేతార్క అని ఒక పోలీసు మీ స్టేషనులో ఉన్నాడు. అతనిది మా ఊరే. అతన్ని కనుక్కున్నాను"

"అతను తెలుసు. బాలారిష్ట. అదేమి పేరు? అప్పుడే అతడిని అడుగుదామనుకున్నాను కాని, ఫీలవుతాడేమో అని సంశయించాను."

"జన్మలగ్నం అష్టమంలో చంద్రుడు, సప్తమంలో కుజుడు ఉంటే దోషాలుగా చెబుతారు. పదమూడో ఏడు వచ్చే వరకూ ఈ బాలారిష్టాలు అనేక రకాలుగా పీడిస్తాయని కొందరి విశ్వాసం. ఈ దోషాలను రూపుమాపే దేవుళ్ళు శ్వేతార్క ఆంజనేయస్వామి. శ్వేతార్క గణపతి. వారి గుడులు కూడా మన దేశంలో చాలా ఉన్నాయి. ఒక స్వామీజీ సలహా మీద ఆ పేరు పెట్టారుట"

'ఈ రోజుల్లో కూడా...' అంటూ ఏదో అనబోయి ధర్మారావు మనసు మార్చుకున్నాడు.

"మరి నేను వెళ్లొస్తాను" లేస్తూ అన్నది.

"ఒక్క నిముషం. యాక్సిడెంటు చేసిన లారీవాళ్ళు కాంప్రమైజుకి వచ్చారట. తప్పు మనదే అని చెపితే పది లక్షల వరకు ఇస్తామన్నారట"

"అవును. జాక్సన్ చెప్పారు"

"నీ అభిప్రాయం ఏమిటి?"

"నిజంగా అది ఆక్సిడెంటేనా?"

"నిశ్చయంగా కాదు. కానీ కోర్టులో ఇలాంటి కేసుల నిరూపణ చాలా కష్టం. బ్రేకులు ఫెయిల్ అయ్యాయనో, స్టీరింగ్ కంట్రోల్ తప్పిందనో అంటారు. చాలా చిన్నశిక్షతో తప్పించుకుంటారు. లేదా నిర్దోషులుగా బయటకి వచ్చేస్తారు"

"ఎలాగో నేరం నిరూపణ కానప్పుడు కాంప్రమైజ్ మంచిది కదా. డబ్బులు తీసుకుందాం".

అతడామె వైపు విస్తుబోయి చూశాడు.

"సెంటిమెంట్ లేకుండా మాట్లాడుతున్నా అనుకోవద్దు సార్. ప్రస్తుతం డబ్బు అవసరం చాలా ఉంది. వాళ్ళు ఎలాగూ తప్పించుకుంటున్నప్పుడు డబ్బు తీసుకోకుండా ఎందుకు వదిలెయ్యాలి?" అని ఆగి, "తండ్రి ప్రాణాలకి ఖరీదు కట్టే మెటీరియలిస్టుగా కనపడినా సరే" అంది.

"లేదు లేదు. చాలా కరెక్టుగా మాట్లాడుతున్నావ్. '..డబ్బుతో ప్రాణాన్ని ఖరీదు కడతారా? మీ పాపిష్టి డబ్బు నాకెందుకు?' లాంటి డైలాగులు సినిమాల్లోనే బావుంటాయి. నేను ఆశ్చర్యపోయింది అందుకు కాదు. అలా మాట్లాడటానికి చాలా అనుభవం ఉండాలి. వయసులో చిన్నదానివి. పైగా నీ ఆలోచనలు కూడా అంత ప్రాక్టికల్‌గా ఉన్నట్టు కూడా కనపడవు. అందుకే ఆశ్చర్యమేసింది"

"అనుభవాలే పాఠాలు నేర్పుతాయి మాస్టారూ. భగవద్గీత చెప్పేది కూడా అదే కదా".

ధర్మారావు కాసేపు మౌనంగా ఉండి, "ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు రవళి. నీ భవిష్యత్తు ప్లాన్స్ ఏమిటి?" అని అడిగాడు.

"నాన్నగారు కోమాలో ఉన్నారు. అందులోంచి ఆయన బయటకు వచ్చి కళ్ళు విప్పిన క్షణం, తనపై 'ఏ కేసూ లేదు' అని చెప్పి ఆయన మనసు తేలిక పర్చాలి. ప్రస్తుతం నా లక్ష్యం అదే".

ధర్మారావు ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. "హత్య చేసిన వాళ్ళు సామాన్యులు కాదు. ఎంతో పవరూ, పలుకుబడీ ఉన్నవారు. ఆ జాక్సను కూడా ముఖ్యమంత్రి మనిషేనని

నా అనుమానం. అతడు వాళ్ళ మనిషి కాకపోతే మేము సి.సి. కెమెరా చూడటానికి వెళ్తున్నామని చాణుక్యకి అంత తొందరగా ఎలా తెలిసింది? చాణుక్య పేరుకు తగ్గ మేధావి. నిన్ను నిరుత్సాహ పరుస్తున్నానని అనుకోకు. మీ తండ్రిగారి మీద కేసు చాలా బలంగా ఉంది. ఆయన్ని వాళ్ళు చాలా పకడ్బందీగా ఇరికించారు. నిర్దోషిగా నిరూపించే సాక్ష్యమూ, బయటపడే మార్గమూ ఒక్కటి కూడా లేదు" సమస్య వివరిస్తున్నట్టూ అన్నాడు.

"ఒక మార్గం ఉంది"

"ఏమిటి?"

"వాళ్ళే స్వయంగా తమ నేరం ఒప్పుకునేలా చెయ్యటం."

ఆమెని చూసి అతడికి జాలి వేసింది. పెద్దయ్యాక ఏమవుతావని పిల్లాడిని అడిగితే చంద్రుడి మీదకు వెళతానని అంటే, పెద్దలకి ఎలా అనిపిస్తుందో అలాంటి భావం కలిగింది.

"అమాయకంగా మాట్లాడుతున్నావో, తెలియకుండా మాట్లాడుతున్నావో అర్థం కావట్లేదు. గతంలో మీసాంరాజా ఇలాగే ఒక ఆక్సిడెంటు చేశాడు. బాగా తాగేసి చక్రధరరావు అనే చాలా పెద్ద పారిశ్రామికవేత్త కారుని కొట్టాడు. ఆక్సిడెంటులో ఆయన భార్య చనిపోయింది. కోటి రూపాయలు ఖరీదు చేసే కారు తుక్కు తుక్కయి పోయింది. ఆ కేసు నేనే డీల్ చేశాను. అంత పెద్దాయన సాక్ష్యం చెప్పినా కోర్టులో గెలవలేకపోయాం. కారు డ్రయివు చేసింది మీసాంరాజా కాదని, ఇంకెవరినో ముసలోడిని డ్రైవరుగా తీసుకొచ్చారు. వాడికి మూడు నెలలు శిక్ష పడింది. మూడు లక్షలు ఇచ్చారు. కళ్ళకద్దుకుని డబ్బు తీసుకుని జైలుకు పోయాడు. కేసు క్లోజ్ అయిపోయింది. అంత క్రిమినల్ బ్రెయిను చాణుక్యది. ఆయనతో పోల్చుకుంటే నీకున్న వనరులు ఏమిటి?"

ఆమె స్థబ్దంగా వింటోంది.

"రవళీ. నా పోలీసు అనుభవంతో చెపుతున్నా. పగలూ, రివెంజిలూ ఊహించు కోవటానికి బావుంటాయి కానీ, జరిగే పనులు కావు. క్రిమినల్స్ వాళ్ళంతట వాళ్ళు ఎందుకు నేరం వప్పుకుంటారు? రాటు తేలిపోయి ఉంటారు. థర్డ్–డిగ్రీ ఉపయోగించి కూడా పోలీసులు వాళ్ళతో నేరం వప్పించలేరు. ఒకవేళ అక్కడ నిజం చెప్పినా, కోర్టుకు వచ్చేసరికి దాన్ని వప్పుకోరు."

"శరీరం మీద ఉపయోగించే థర్డ్ డిగ్రీ, మనసు మీద ఉపయోగిస్తే ఎంతటి వారైనా పునాదులతో సహా కదిలిపోతారని నా అభిప్రాయం సార్ "

"మనసు మీద థర్డ్ డిగ్రీ– ఏదో సినిమా డైలాగ్ లా బావుంది. కానీ పగ తీర్చుకోవటానికి ఇది సినిమా కాదు. ఎక్కువగా ఊహించుకోకు"

"మీరు సినిమా గురించి చెప్పారు. నేను పట్టుదల గురించి చెపుతాను. తెలిసిన కథే. ఒక పిచ్చుక గుడ్డు సముద్రంలో జారిపోతుంది. దాన్ని తీసుకోవాలని ఆ చిన్నారి పిచ్చుక

తన రెక్కలతో సముద్రపు నీటిని పక్కకి తోస్తూ ఉంటుంది. అది చూసి చేపలు నవ్వుకుంటాయి. సముద్రుడికి ఇదంతా ఒక ఆటలా ఉంటుంది. ఆ చిన్ని పిచ్చుకని కెరటాలతో బలంగా కొడుతూ, వెనక్కి తోస్తూ ఆడుకుంటూ ఉంటాడు. ఎలుకకి సంకటం – పిల్లికి చెలగాటంలా ఉంటుంది. క్రమక్రమంగా ఆ చిట్టితల్లి అలసిపోతుంది. మరణం దగ్గర పడుతుంది. అయినా ప్రయత్నిస్తూ ఉంటుంది. ఆ సమయంలో ఆకాశంలో వెళుతున్న గరుత్మంతుడు ఈ దృశ్యం చూసి దివ్యదృష్టితో విషయం తెలుసుకుని క్రుద్ధుడై, రుద్రుడై, వీరభద్రుడై తన రెక్కల్ని ఒక్కసారి బలంగా విదిలిస్తాడు. ***ఖనటత్ పయోబ్ధి వీక్ష్య రసాతలాన్యోన్య పిండీకృతాంగ భీతాండజములు*** అని ఆముక్తమాల్యదలో రాయల గరుత్మంత స్థుతి వర్ణనలా, ఆ రెక్కల గాలి ఇటు మేరు, అటు మందర అనే చెరో రెండు పర్వత గుహాంతర్భాగాల్లో దూరి, ఆ దుందుభుల శబ్దం ఢాంఢ ఢడాంఢ ఢాంఢ నినదమై సముద్రుడి కర్ణభేరి పగిలేలా మ్రోగుతుంది. పంచ భూతములు బెదరగా, దిక్పాలకులదరగా ఆ రెక్కల ఝంఝూ మారుతానికి సముద్రం రెండుగా చీలి, సాగరాంతర్భాగ పాతాళంలో ఉన్న పాములు, తొలిసారి ఆకాశాన్ని చూసి భయంతో ఒకదాన్నొకటి పెనవేసుకుంటాయి. ఆ నిశ్శబ్ద విస్ఫోటనానికి చీలిన సముద్రగర్భంలో మిలమిలా మెరుస్తూ కనపడిన గుడ్డుని తీసుకొని పిచ్చుక ఆనందంతో ఎగిరిపోతుంది".

ఆమె కథకో, కంఠంలో కనపడిన విశ్వాసానికో ధర్మారావు చకితుడై చూస్తుండగా, "నా ప్రయత్నం నేను చేస్తాను. దీవించండి సార్" అని లేచి కదలబోతూ ఆగి, "ఆ చక్రధరరావుగారి అడ్రస్ చెప్తారా?" అని అడిగింది. చెపుతూన్న విషయానికి సంబంధం లేకుండా ఆమె అకస్మాత్తుగా అలా అడిగే సరికి అతడు విస్మయంగా "ఎందుకు?" అని ప్రశ్నించాడు.

ఆమె నవ్వి, "ఉద్యోగం కోసం...! ఇద్దరం మీసాంబ్రాజా బాధితులమే కదా. ఈ కథలో బహుశా ఆయనే గరుత్మంతుడు అవ్వచ్చేమో" అంది.

ఎవరి జీవితానికి ఎవరు గరుత్మంతుడు అవుతాడో కాలమే నిర్ణయించాలి.

# 14

**రాంబాబు** భజరంగీ భాయిజాన్ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దీకి లాంటి జర్నలిస్టు. తెలివైన, హుషారైన కుర్రవాడు. నగరంలో ఏదో ఛానెల్‌కి పని చేస్తున్నాడు. స్వంత ఊరు పెదపట్నం. వీలయినంత వరకూ నిజాయితీ గానే వ్రాస్తాడు గానీ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజానికి ఉప్పూ కారం అద్దటంలో సిద్ధహస్తుడు. ఎవరికీ అందని కోణాన్ని స్పృశించటం అతడిలోని గొప్ప లక్షణం.

ప్రస్తుతం అతను స్పృశిస్తూన్న కోణం హోమ్ మినిస్టరు మనవరాలు గురించి.

ప్రస్తుతం ఆమె వర్జినిటీ పానశాలలో ఉంది.

వర్జినిటీ. గమ్మత్తయిన పేరు.

సామాన్యుల కనీస ప్రవేశానికి కూడా ఊహకందని ఖరీదైన పబ్.

దట్టమైన పొగ. హడావుడి. ఒకరి మాట ఒకరికి వినిపించనంత శబ్దం.

ఈ గొడవకి ఏమాత్రం సంబంధం లేకుండా వరండా అవతల చిన్నగదిలో రెండు మూడు జంటలు డ్రగ్స్ తీసుకుంటున్నాయి. వాటిల్లో ఒక స్త్రీ హోం మినిస్టరు బ్రహ్మానందం మనవరాలు సుగాత్రి. కుర్చీలో కూర్చుని, ఎదుటి కుర్రాడి తొడల మీద కాళ్ళు వేసి పాదంతో పొట్ట క్రింద నొక్కుతోంది.

రెండు పెగ్గులు అయ్యాక, "నువ్వు నా బెస్ట్ ఫ్రెండు. నువ్వు తప్ప నాకీ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. ఐ లవ్యూ" అంది.

"థ్యాంక్స్"

"నా కడుపులో పిల్లాడికి నువ్వే తండ్రివి. నీకేమైనా సందేహమా?"

"లేదు"

"నీ పేరేమిటి?"

"రాజా. మీసాల్రాజా."

"ఇంకొంచెం వక్కపలుకు ఉందా?" అడిగింది. ఇచ్చాడు. వాళ్ళ భాషలో వక్కపలుకు అంటే మీథాంఫిటమైన్. గంజాయి కన్నా పది రెట్లు ఎక్కువ పవరున్నది. వేసుకున్న కొద్ది నిమిషాల్లో ఆమె లేచి డాన్స్ చేయడం మొదలు పెట్టింది. నిముషం పిచ్చి గంతులు వేశాక, "నువ్వూ చెయ్యి" అన్నది. చెయ్యకపోతే జరగబోయే డ్రామా తెలుసు కాబట్టి అతడు లేచి నిరాసక్తంగా స్టెప్స్ వేయసాగాడు.

"షర్ట్ విప్పు" అంది.

"అందరూ ఉన్నారు. ఇప్పుడు వద్దు" అన్నాడు.

"నువ్వు పైది విప్పకపోతే నేను క్రిందది విప్పేస్తా"

అన్నంత పనీ చేస్తుందని తెలుసు. 'చేసిన డాన్సు చాల్లే' అంటూ చేతుల మీద ఎత్తుకొని గదిలోంచి బయటకు తీసుకువెళ్ళాడు. వెనకాల తోటలా ఉంది. అక్కడ ఆమెను గడ్డి మీద పడుకోబెట్టి ఏదో చెయ్యటానికి ప్రయత్నం ప్రారంభించాడు. ఏమి జరుగుతోందో ఇద్దరికీ తెలియటం లేదు గానీ, ఆమె సగం స్పృహలో 'నువ్వే నా హోం మినిస్టరు' అంటూ కొంచెంసేపు గట్టిగా అరిచి, అక్కడే నిద్ర పోయింది.

తెల్లవార్ను ఇద్దరూ తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

వారికి తెలియని విషయం ఏమిటంటే, ఈ డ్రగ్సూ, రాసకేళీ దృశ్యాలని రాంబాబు తన కెమెరాలో బంధించి ఉంచాడని..!

రవళి అతనికిచ్చిన కాంట్రాక్టు పని అక్కడితో అవ్వలేదు. మరికొన్ని రోజులు సుగాత్రినే ఫాలో అయ్యాడు. రెండురోజుల తరువాత ఆమె హాస్పటల్లోకి వెళ్లడం గమనించాడు. దాని

పేరు 'అభయ' క్లినిక్. 'పబ్ లో రాసకేళి' జరిపిన మీసాల్రాజా కూడా అక్కడికి వచ్చాడు. డాక్టరుతో మాట్లాడి, ఇద్దరూ వెళ్ళిపోయారు.

రాంబాబు అక్కడి నర్సుకు లంచం ఇచ్చి వివరాలు ఫోటోలు సేకరించాడు. మొత్తం వివరాలన్నీ పకడ్బందీగా సేకరించిన తర్వాత ఆదిత్యపురం వెళ్లి రవళిని కలుసుకున్నాడు.

ఐదువేలు ఇచ్చింది.

"చాలా తక్కువ మేడమ్. హోమ్ మినిస్టరు మనవరాలు వ్యవహారం. మరో వైపు చీఫ్ మినిస్టరు బావమరిదికి సంబంధించింది" అన్నాడు రాంబాబు.

"నా దగ్గర అంతకన్నా లేవు. ఎలాగో ఒకలాగా భవిష్యత్తులో నీ రుణం తీర్చుకుంటా" అన్నది రవళి. అతడు వెళ్లిపోయాడు. 'అనుకున్న పని నెరవేరాలంటే చాలా డబ్బు ఉండాలి' అన్న విషయం ఆమెకు అర్థమైంది.

ఆ విషయం అలా ఉంచితే – ఆ మరుసటి రోజు ఒక వార్త వైరల్ అయింది.

**వర్షినిటిలో డ్రగ్స్. అభయలో అబార్షన్.**
**హోం మినిస్టరు మనవరాలితో ముఖ్యమంత్రి బామ్మర్ది పబ్లిక్ రొమాన్స్.**

ఎవరు ఎలా రొమాన్స్ చేసుకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఈ వ్యవహారం పబ్లిగ్గా చేసుకుంటే చూడటం మన గ్రహచారం. ఏమీ పని లేకుండా రికామీగా తిరిగే ముఖ్యమంత్రి బావమరిది మీసాల్రాజాకి ఇంత డబ్బు ఎలా వస్తోంది? ఎక్కడి నుంచి వస్తోంది? అంతా టాక్స్–పేయర్స్ డబ్బేగా. మరోవైపు రాష్ట్రాన్ని రక్షించాల్సింది హోం శాఖ. ఆయన మనవరాలికి డ్రగ్స్ ఎవరు సప్లయి చేస్తున్నారు? అబార్షన్ చట్ట రీత్యా నేరం. 'అభయ' లో జరుగుతున్నది ఏమిటి? ఈ అయిదు నిముషాల వీడియో చూడండి.

గంటలో మిలియన్ వ్యూస్. మరుసటి రోజుకి దాన్ని అన్ని భాషల్లో అనువదించి సర్క్యులేట్ చేశారు ప్రజలు.

* * *

సి.ఎం. చాంబర్లో సమావేశం చాలా వేడివేడిగా సాగింది. ముఖ్యమంత్రి, హోం మినిస్టరు బ్రహ్మానందం, సలహాదారు చాణుక్య, ముద్దాయి రాజా ఉన్నారు. సి.ఎం. పెనం మీద ఆవగింజలా ఎగిరెగిరి పడుతున్నాడు "నా ప్రాణానికి శనిలా దాపరించావు. గెటవుట్. నీ మొహం నాకు చూపించకు" అంటూ అరిచి అరిచి, బిపి పెరిగి పెరిగి అలసి ఆయాసపడుతూ కూర్చున్నాడు. ఇదంతా మామూలే అన్నట్టు రాజా పెరిగిన తన మధ్య వేలు గోరు వైపు చూసుకుంటూ మౌనంగా ఉన్నాడు.

తనకి సమాజంలో చాలా గౌరవం ఉందని మనస్ఫూర్తిగా నమ్మే రాజకీయనాయకుల్లో ఒకడయిన హోమ్ మినిస్టరు, "ఈ రోజునుంచీ ఏ మొహం పెట్టుకుని బయట తిరగ్గలను?" అంటూ బాధపడ్డాడు.

"రేపు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు చీల్చి చెండాడతాడు. 'మీసాలరాజాని ముఖ్యమంత్రి ఎందుకు చేరదీశాడు? రాజా సి.ఎం.కి నిజంగా బావమరిదేనా? కౌసల్యకి సోదరులున్నారా? ఈ చీకటి రహస్యం ఏమిటి?' అంటూ అమాయకమైన జింకను వేటగాడు వేటాడినట్టు నన్ను వెంటాడుతాడు" అన్నాడు ఆంజనేయులు తల పట్టుకుని.

"నా మనవరాలికి హాలీవుడ్ నటుడిని తీసుకొచ్చి చేద్దాం అనుకున్నాను. ఇప్పుడు కనీసం టీవీ నటుడు కూడా రాడు" వాపోయాడు బ్రహ్మానందం



"పబ్లిగ్గా చెప్పకు. ఎవరైనా టీవీ నటుడు నీ మీద దావా వేస్తాడు" అన్నాడు చాణుక్య.

రాజా మధ్యలో కల్పించుకుని "టీవీ అంటే గుర్తొచ్చింది. నిన్న రాత్రి టి.వి.లో మా పబ్లిక్ రొమాన్స్ టెలికాస్ట్ చేశారుట. చానల్ వాడు నా ఫ్రెండే. టేమ్ రేటింగ్స్ బాగా పెరిగాయట" అన్నాడు.

పేపరు వెయిట్ నేలకి విసిరి కొట్టి, "చెప్పు తీసుకుని కొడతాను. ఎక్కడో కాలి నేను ఏడుస్తూంటే నీకు పెళ్ళిళ్ళూ, శోభనం రేటింగ్సూ గుర్తు వస్తున్నాయా?" అని అరిచాడు ముఖ్యమంత్రి.

"ఈ సమస్యకు ఒకే ఒక పరిష్కారం ఉంది" చాణుక్య అన్నాడు.

ముగ్గురూ అతడి వైపు ఆసక్తిగా చూశారు.

"వాళ్ళిద్దరికీ పెళ్లి చేయడం"

మీసాల రాజా అదిరిపడి తను విన్నది కరెక్టేనా అన్నట్టు "ఏంటి మీరు చెప్పేది" అని అడిగాడు.

"చెప్పాను కదా. దీనికి అది ఒకటే మార్గం. హోమ్ మినిస్టరు, చీఫ్ మినిస్టరు కలిసి ఈ వార్తని వెంటనే ప్రెస్సుకి ప్రకటించాలి. వార్త ఉధృతం తగ్గుతుంది".

"దాన్ని పెళ్లి చేసుకుంటే ప్రపంచంలో ఎక్కడ లేని జబ్బులూ వస్తాయి"

"పబ్బు గడ్డి మీద పబ్లిక్ రొమాన్స్ చేస్తుండగా ఆ విషయం గుర్తు రాలేదా" ఒక బూతు మాట కలిపి తిట్టాడు సి.ఎం.

"రొమాన్స్ చేసిన ప్రతిదాన్నీ చేసుకుంటే మగాడు, అవుతాడు అయిదు వేలమందికి మొగుడు".

"వెధవ కవిత్వం కట్టి పెట్టకపోతే నీ ముఖ్యాంగాలన్నిటి మీదా ఒట్టు" కసిరాడు చాణుక్య.

"పోయాక అంగం, ఎందుకిక అర్ధాంగం" అన్నాడు రాజా.

వళ్ళు మండిన బ్రహ్మానందం కోపాన్ని అణుచుకుంటూ ముఖ్యమంత్రితో "ఒకడు శ్రీనాధుడు, మరొకడు ఢింఢిమభట్టు లెవెల్లో మాట్లాడుకుంటున్నారు చూడు" అని మీసాల్రాజా వైపు తిరిగి, "అయినా నా మనవరాలికేమి తక్కువ? బంగారం బొమ్మ" అన్నాడు.

"అయితే ఇంట్లోనే ఉంచుకోండి. తొమ్మిది నెలలకో బంగారుగుడ్డు పెడుతూ ఉంటుంది" అన్నాడు మీసాల్రాజా.

"అంత మాట అనటానికి నీకు నోరెలా వచ్చింది రాజా. సుగాత్రి..! పేరుకు తగ్గట్టే అభం శుభం తెలియని అమాయకురాలు".

"కడుపొచ్చే వరకూ ప్రతీ కన్నకూతురూ కన్నెపిల్లే అని ఇంట్లో పెద్దాళ్ళు అనుకుంటార్ట" అన్నాడు రాజా.

బ్రహ్మానందం అతడిని కొట్టబోయి, సి.ఎం.ని చూసి తమాయించుకుని, "ఏమిటి నీ బాధ?" అని అడిగాడు.

"కడుపొస్తే పర్లేదు. 'నా బిడ్డకు తండ్రివి నువ్వేనా' అని అడిగింది. అదీ పర్లేదు. 'నేనే' అని చెప్పాక నా పేరు అడిగింది. అది మరీ దారుణం" అన్నాడు రాజా.

"నువ్వు కాసేపు మాట్లాడకు" అని చాణుక్య మంత్రుల వైపు తిరిగి, "ఆలోచించుకోండి. పబ్లిక్ కి వార్త తెలియటం వేరు, పబ్లిగ్గా సీను చూడటం వేరు. ఈ వార్త దావానలంలా వ్యాపించక ముందే పెద్దలిద్దరూ కలిసి పెళ్లి ప్రకటన చేస్తే వేడి చల్లారిపోతుంది. మొగుడూ పెళ్ళాల మధ్య రొమాన్సు మీద ప్రజలకి ఏమి ఇంటరెస్టు ఉంటుంది? వద్దనుకుంటే మీ ఇష్టం. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న హోమ్మినిస్టరే పిల్లల్ని ఇలా వదిలేస్తే ఇక ఆయన రాష్ట్రాన్ని ఏం కాపాడగలడు? అని ప్రతిపక్షం ఇప్పటికే నెగటివ్ కాన్వాసింగ్ మొదలెట్టింది. తాము కట్టిన 'టాక్సు-మనీ' ని నాయకుల పిల్లలు ఈ విధంగా ఖర్చుపెట్టటం చూసి

ప్రజలు ఇరిటేట్ అవుతున్నారు. మంత్రుల పిల్లలకో న్యాయం, ప్రజలకో న్యాయమా? అంటూ అపోజిషన్ లీడరు దాన్ని మరింత ఎగతోస్తున్నాడు. ఇదంతా రేపు ఎన్నికల్లో రిఫ్లెక్ట్ అవుతుంది. దీనికన్నా ముఖ్యంగా, ఇంత జరిగాక నీ మనవరాలికి ఎలాగూ పెళ్లి అవ్వదు. కాబట్టి ఏదో ఒక నిర్ణయం తీసుకో" అని రాజా వైపు తిరిగి, "అసలు విషయం లేకుండా మృగాల్లా పొర్లిపొర్లి, గడ్డిలో దొర్లి దొర్లి, ఫుట్-పాత్ పక్కన కుండీల్లో గులాబీ మొక్కల్ని విరగ్గొట్టిన మీ నిరర్థక నిరుపయోగ నిరుపమాన రొమాన్సు వీడియో నేను కూడా చూశాను. ***'రొమాన్సు పై డ్రగ్స్ ప్రభావం - మొగతనాన్ని తగ్గించే గంజాయి'*** అంటూ ప్రభుత్వం గానీ మీ వీడియోని అడ్వర్టయిజ్మెంటు కోసం ఉపయోగిస్తే, ఇక జన్మలో ఎవరూ డ్రగ్స్ వాడరు. నా మాట విని, పెద్దవాళ్ళని పెళ్లి ప్రకటన ఇవ్వనీ" అన్నాడు.

ఆ విధంగా సమావేశం ముగిసింది. మరుసటిరోజు విలేఖర్ల సమావేశంలో ముఖ్యమంత్రీ, హోమ్మినిస్టరూ సంయుక్తంగా ప్రకటించిన వివాహవార్త అన్ని పేపర్లలో, చానెల్సులో వచ్చింది.

రవళి నవ్వుకుంది. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా కష్టమైన పని... పడని వ్యక్తితో కలిసి జీవించడం..! భాగస్వాముల్లో ఒకరు మానసిక దరిద్రులయితే అవతలివారి జీవితం నరకం అవుతుంది. ఈ రోజు నుంచీ మీసాల్రాజా 'కుక్కలు చింపిన విస్తరిలో భోజనం ఎలా చెయ్యాలా' అని విచారిస్తూ, మంచినీటిలో ఉప్పునీటి చేపలా కొట్టుకుంటూ ఉంటాడు. చాలు. చిన్న విజయం. చిన్నదయినా విజయం విజయమే కదా. ఇంతకన్నా పెద్ద విజయం సాధించాలంటే డబ్బు కావాలి.

# 15

**పెద్ద** హాలు. అద్దాల వెనుక చిన్న చిన్న క్యూబికల్స్. వాటిలో కొందరు పని చేసుకుంటున్నారు. అక్కడ అంతమంది ఉన్నా కొద్దిగా కూడా శబ్దం రావటం లేదు. గాలిలో పరిమళం హాలంతా పరుచుకుని ఆహ్లాదకరమైన ఫీలింగ్ ఇస్తోంది. సరీగ్గా పది అవుతూ ఉండగా సూటు వేసుకున్న ఒక వ్యక్తి హాల్లోకి వచ్చాడు.

"రవళి?"

"నేనేనండీ"

"నా పేరు అశోక్. రండి" అంటూ బోర్డు రూములోకి తీసుకెళ్ళాడు. విశాలమైన రూమ్. లోపల ఎవరూ లేరు. ఇద్దరూ కూర్చున్నాక, "డైరెక్ట్ గా ఇలా చెపుతున్నానని ఏమీ అనుకోకండి. మీరు ఇక్కడికి పెద్ద రికమెండేషన్ మీద వచ్చారని మాకూ తెలుసు. మీకూ తెలుసు. కానీ చక్రధరరావుగారు అలాంటి వాటికి పూర్తి వ్యతిరేకం. ప్రధాన మంత్రి చెప్పినా వినరు" అన్నాడు.



"నేనూ ఇలా చెపుతున్నానని ఏమీ అనుకోకండి. నేను రికమెండేషన్ చేయించింది ఉద్యోగం కోసం కాదు. ఇంటర్వ్యూ కోసం. ఇక ఉద్యోగం అంటారా? మీరు సంతృప్తి చెందితేనే ఇవ్వండి. నాకు ఉద్యోగం అవసరం మాత్రం చాలా ఉంది"

"ఎంత శాలరీ ఆశిస్తున్నారు మీరు?"

"లక్ష"

అతడి మొహంలో ఆశ్చర్యం స్పష్టంగా కనపడింది. ఫైల్లోకి చూసి తలెత్తి, "మీరు సాధారణ పోస్టు గ్రాడ్యుయేటు. అనుభవం కూడా ఏమీ లేదు. ఈ చదువుతో కేవలం పదివేల జీతానికి వచ్చే వాళ్ళు కూడా ఉన్నారు"

"పది లక్షలు ఇస్తామన్నా రానివాళ్ళు కూడా ఉంటారు అశోక్. మీకు తెలియనిది ఏముంది?"

అతడు అభావంగా, "సరే మీ ఇష్టం. ఈ ఇంటర్వ్యూ రికార్డ్ చేసి చైర్మెన్‌కి పంపిస్తాము. ఫైనల్ డెసిషన్ ఆయనదే. ఏ సబ్జెక్టులో అడగను?" అని ప్రశ్నించాడు

"మీ ఇష్టం. ఏదైనా సరే."

తన తల తిక్క సమాధానాలు అతడికి నచ్చలేదనీ, వెంటనే పంపించి వెయ్యటం ఇష్టంలేక అలా అడుగుతున్నాడని అర్థమైంది. కానీ ఆమె లెక్కలు ఆమెకున్నాయి. అభ్యర్థులు కావాలని కంపెనీ ప్రకటిస్తే అప్లయ్ చేసిన ఉగ్యోగం కాదిది. తనకోసం వాళ్ళు ఏర్పాటు చేసిన ఇంటర్వ్యూ. ఏదో ఒక ప్రత్యేకత లేకపోతే తీసుకోరు. ఈగో దెబ్బ తింటే, తనని ఓడించటానికి అతడు మరింత కఠినమైన ప్రశ్నలు వేస్తాడు. ఛాన్సు తీసుకోవాలి. పరీక్ష కఠినమే. కానీ ఈ ఇంటర్వ్యూ తనకు కాదు. *'...ఏ ఇంట్లో తల్లులు బాగుంటారో ఆ ఇంట్లో*

*మదర్ థెరెస్సాలూ, ఏ ఇంట్లో తండ్రులు బాగుంటారో ఆ ఇంట్లో అబ్దుల్ కలాంలూ పుడతారు'* అన్న కొటేషన్ గుర్తొచ్చింది. 'ఈ ఇంటర్వ్యూ నాకు జ్ఞానమిచ్చిన నా తండ్రికి' అనుకుంది.

"సాధారణంగా ఇంటర్వ్యూల్లో రీజనింగ్, లాజిక్కులకి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. మీ సబ్జెక్ట్ సోషియాలజీ కదా. అందులో అడగనా?"

"చదివిన సబ్జెక్టులో అడిగితే ఎవరైనా చెపుతారు. ఇంకేదైనా అడగండి" అంది.

మళ్ళీ అదే తలతిక్క.

అశోక్ మొదటిసారి నవ్వేడు. "పదో క్లాసులో చదివిన తెలుగు పద్యం బీటెక్కులో మర్చిపోతారు. మీరు మూడు నాలుగు సంవత్సరాల క్రితమే గ్రాడ్యుయేటు అయినట్టు మీ రికార్డులు చెబుతున్నాయి. మీకు మీ సబ్జెక్టు ఎంత గుర్తుందో ఏమిటో?"

"ఇవేమీ పెళ్లి చూపులు కావు కదా. తెలిస్తే చెపుతాను. లేకపోతే ఉద్యోగం రాదు. అంతేగా"

"ఇంటర్వ్యూ చెయ్యటంలో పది సంవత్సరాల అనుభవంతో చెపుతున్నా మేడమ్. ఏళ్ళ తరబడి చదివిన సబ్జెక్టులో ప్రశ్న అడిగినా చాలామంది పిల్లలు చెప్పలేరు. sin^2(x) + cos^2(x) ఎంతంటే చెప్పలేని లెక్కల స్టూడెంట్సు నూటికి తొంభై శాతం ఉన్నారు".

"ఒకటి" అన్నదామె.

అతడికి అర్థం కాక "ఒకటేమిటి?" అన్నాడు.

"మీ ప్రశ్నకి సమాధానం 'ఒకటి' అని చెపుతున్నాను. అంతే కాదు. మీరేమీ అనుకోకపోతే 'నూటికి తొంభై శాతం' అని వాడకూడదు. 'తొంభై శాతం' అనాలి. లేదా, 'నూటికి తొంభై' అనాలి. సారీ. తెలిసీ చెప్పకపోతే మీరు భవిష్యత్తులో కూడా అదే కంటిన్యూ చేస్తారు."

స్పోర్టివ్‌గా తీసుకుంటున్నట్టు, "థ్యాంక్స్ మేడమ్. నాకింత వరకూ తెలీదు. థ్యాంక్యూ..! ఇంటర్వ్యూ మొదలు పెడదామా?" అని అడిగాడు.

కుర్చీలో సర్దుకుని కూర్చుని, "తప్పకుండా" అంది.

"మొదటి ఇంటర్వ్యూ అంటున్నారు కాబట్టి చిన్న ప్రశ్నతో ప్రారంభిద్దాం. మీకూ కాస్త టెన్షన్ తగ్గుతుంది. భారతదేశానికి తూర్పున ఉన్న సముద్రం బంగాళాఖాతం. దాని ఎదురుగా నిలబడితే, మీ వెనుక వైపు ఉన్న సముద్రం ఏది?"

ఆ గదిలో గాఢమైన నిశ్శబ్దం పాదరసంలా వ్యాపించింది. ఆమె చాలాసేపు మౌనంగా ఉండిపోవటం చూసి, "ఇంతసేపు ఆలోచిస్తున్నారేమిటి మేడమ్? తూర్పున బంగాళాఖాతం కాబట్టి, మీ వెనుక ఉండేది అరేబియా మహా సముద్రం" అన్నాడు తేలిగ్గా.

"అరేబియా 'మహా' సముద్రం కాదు. సముద్రం"

అతడు దెబ్బ తిని సర్దుకుంటూ "ఏదో ఒకటి లెండి. కానీ ఇంత సులభమైన ప్రశ్నకి ఎందుకు అంత సేపు ఆలోచించారు?" అతడి స్వరంలో తేలికభావం ధ్వనించింది.

"భారతదేశం అన్నారు కాబట్టి కన్ఫ్యూజ్ అయ్యాను. బంగాళాఖాతం మన దేశానికి కేవలం తూర్పున మాత్రమే కాదు, కలకత్తాకి దక్షిణంగా; అస్సాంకి పడమటగా ఉంటుంది. కలకత్తాలో నిలబడితే వెనుక చైనా, రష్యా, ఆర్కిటిక్ ఓషన్ ఉంటాయి. అస్సాంలో నిలబడితే వెనుక పసిఫిక్ ఓషన్; కన్యాకుమారిలో నిలబడితే ఆ వెనుక మాల్దీవ్స్ కూడా ఉండొచ్చు."

బాంబులా విస్ఫోటించిన ఆ సమాధానాన్ని జీర్ణం చేసుకోవటానికా అన్నట్టు అతడు ఒక క్షణం ఆగి, 'నిజమే' అన్నట్టు తల పంకిస్తూ, "ఒక చిన్న విషయాన్ని కూడా ఇన్ని వైపుల్నించీ ఆలోచించటం మంచి ఎగ్జిక్యూటివ్ లక్షణం. గుడ్. మరో ప్రశ్న. మీరు మీ క్రింద పని చేసే ఎటువంటి ఉద్యోగస్తుల్ని ఇష్టపడరు?" అన్నాడు, 'పడరు' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

"నా క్రింద పని చేస్తూ నన్ను తిట్టేవాళ్ళని..! మరోలా చెప్పాలంటే, పగలంతా కాపిటలిస్టు దగ్గర పని చేసి, సాయంత్రం మందు తాగుతూ విప్లవ కబుర్లు చెప్పే మేధావుల్ని"

"అదేమిటి? వాళ్ళు నమ్మే సిద్ధాంతం గురించి మాట్లాడుకోవటానికి వారికి హక్కు ఉన్నది కదా"

"తాను నమ్మిన సిద్ధాంతానికి వ్యతిరేకంగా పని చేసేవాడు నూరు శాతం రిజల్టు ఎలా ఇవ్వగలడు సార్?" అన్నది. ప్రపంచంలో అందరికన్నా దురదృష్టవంతుడు తనకి నచ్చని వృత్తిలో పని చేసేవాడు – అనేవాడు తన తండ్రి.

"బ్రతకటానికి ఉద్యోగం కావాలి మేడమ్. ఆలోచనలు మనసుకు సంబంధించినవి".

"నేను చెప్పేదీ అదే. చచ్చే వరకూ మనసుకు వ్యతిరేకంగా పని చేసేవాడు నా దగ్గర మనస్ఫూర్తిగా ఎలా పనిచెయ్యగలడూ అని? ప్రొద్దున్న లేచినప్పటి నుంచీ నన్ను తిట్టుకుంటూ నా దగ్గర పని చేసేవాడిని నేను ఎందుకు మెచ్చుకోవాలి? ఒకవేళ అతడు గొప్ప పనిమంతుడైతే అతడిని మెచ్చుకుంటూ గొడ్డుచాకిరీ చేయించుకుంటూ నాలుగు గింజలు రాలుస్తానే తప్ప మనస్ఫూర్తిగా వాడిని ఇష్టపడను".

"అప్పుడు అందరూ మీ గురించి ఏమనుకుంటారు?"

"మనలో ఆనందం తగ్గిపోవటానికి కారణం, మనల్ని విమర్శించే వారి నుంచి పొగడ్తని ఆశిస్తాం. మన మంచికోరే వారిలో తప్పులు వెతుకుతాం. బయటవారి గురించి నాకు సంబంధం లేదు. మీరు అడిగింది... 'నా' దగ్గర' పనివారి గురించి అయితే, దీని గురించి ఎంతసేపు చర్చించినా మన ఇద్దరి అభిప్రాయాలూ మారవు" అంది, ఈ టాపిక్ ఇక్కడితో ఆపు చేద్దామా అన్నట్టు.

తరువాతి ప్రశ్న కోసం అశోక్ కాగితంలోకి చూస్తూ, "భారతదేశంలో బ్లాక్-మనీ తగ్గటానికి ఒక సలహా చెప్పమంటే ఏమి చెపుతారు?" అని అడిగాడు. ఆమె క్షణం కూడా ఆలోచించలేదు. "స్థిరాస్తి అమ్మకాలూ, కొనుగోళ్ళూ మొత్తమంతా ప్రభుత్వం ద్వారా చేయాలి" అంది.

"అర్థం కాలేదు. వివరించండి"

"మీ బిల్డింగ్ మీరు కోటి రూపాయలకి అమ్ముదామని, ముప్ఫై లక్షలు బ్లాక్, డెబ్భై లక్షలు వైట్ అని ఒప్పందం చేసుకుంటారు. ఇది అందరికీ తెలిసిందే కదా. నేను చెప్పిన పద్ధతిలో అలా కుదరదు. ఫ్లాట్సు, స్థలాలు, భవంతులూ... ఏ స్థిరాస్థి అమ్మదల్చుకున్నా ప్రభుత్వానికి తెలియబర్చాలి. ఆపై ప్రభుత్వం వారు 'ఫలానా చోట ఫలానా ఆస్థి అమ్మకానికి ఉన్నది' అని గెజిట్‌లో ప్రచురిస్తారు. కొనదల్చుకున్నవారు వచ్చి చూసి రహస్య బిడ్డింగ్ వేస్తారు. అందర్లోకీ ఎక్కువ ధర ఆఫర్ చేసిన వారికి మీరు 'తప్పనిసరిగా' మీ బిల్డింగ్ అమ్మవలసి ఉంటుంది."

"కొనేవాడు అమ్మకందారుతో లాలూచీ పడవచ్చుగా"

"పోటీదార్లు ఉంటారు కాబట్టి, అదంత సులభం కాదు. దీనివల్ల ప్రభుత్వానికి ఆరు లాభాలు ఉన్నాయి. తనవాళ్ళకి తక్కువ ధరకి అమ్ముకుంటానంటే ప్రభుత్వానికి 'గిఫ్ట్ టాక్స్' వస్తుంది. వేలం పాట కాబట్టి, అమ్మేవారికి ఎక్కువ ధర వస్తుంది. ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ వల్ల లాభం కొన్ని రెట్లు పెరుగుతుంది. లావాదేవీలన్నీ బ్యాంక్ ద్వారా జరుగుతాయి కాబట్టి నల్ల ధనం ప్రసక్తి ఉండదు. బ్రోకరు కమీషన్ ఉండదు. రాజకీయ నాయకులు, సినిమా వాళ్ళు, క్రికెటర్లు కోట్లు కోట్లు నల్లధనం రియల్ ఎస్టేటులోకి పంప్ చేయటానికి వీలుండదు".

"కానీ..." అని అతడు ఇంకా ఏదో చెపుతూ ఉండగా, "నేను చెప్పినదంతా వాటర్-టైట్ కాదు సర్. ఇంకా చాలా ఆలోచించాలి. ఊహ చెపుతున్నానంతే" అంది.

"ఇదంతా వినటానికి బావుంటుంది. ప్రభుత్వం, రాజకీయనాయకులు, పారిశ్రామికవేత్తలు పడనిస్తారా? ప్రాధమిక హక్కుల భంగమని ఎవరో కోర్టుకి వెళ్తారు."

ఏదైనా ఒక పాయింటు చెప్పగానే నెగిటివ్‌గా ఆలోచించే జనాలు ఎప్పుడు మారతారు? విసుగు అణుచుకుని, వీలైనంత మృదువుగా, "మీరు నా అభిప్రాయం అడిగారా? సాధ్యాసాధ్యాలు అడిగారా?" అన్నది.

అశోక్ నవ్వి, "మీకు కోపం వస్తున్నట్టు ఉంది. లక్ష రూపాయలు జీతం తీసుకునేవారు అంత తొందరగా ఇరిటేట్ అవకూడదు. ఇంటర్వ్యూలో అదొక భాగం" అన్నాడు.

ఆమె గిల్టీగా ఫీల్ అవుతూ, "సారీ సర్. ఇదే నా మొదటి ఇంటర్వ్యూ" అంది.

"అన్నట్టు మేడమ్. నాదో చిన్న అనుమానం. ఇన్ని తెలివితేటలుండి ఇంతకాలం ఖాళీగా ఎందుకున్నారు?"

"ఖాళీగా లేను. స్కూల్లో పని చేస్తున్నాను. పల్లెటూర్లో పిల్లలతో గడపటం నాకిష్టం. కానీ ఇప్పుడు డబ్బు అవసరం చాలా ఉంది సార్. అందుకే ఇలా వచ్చాను. పని అయిపోగానే తిరిగి పల్లెకి వెళ్ళిపోతాను."

"ఏ పని?"

"సారీ సర్. అది నా వ్యక్తిగతం."

"ఈ విషయం కూడా చైర్మనుగారికి చెపుతాను" అని కాగితం మీద ఏదో వ్రాసుకుని, "ఆఖరి ప్రశ్న. రీజనింగ్, ఛాయిస్సుల గురించి" అన్నాడు. ఆమెకి వెంటనే సత్య మళ్ళీ గుర్తొచ్చాడు. ప్రతీసారీ 'దుఃఖమా? సంతోషమా? ఏమిటి నీ ఛాయిస్?' అనే సత్య.

"మీరు ఒక గేమ్-షోలో చివరివరకూ వచ్చారు. మూడు గదులున్నాయి. ఒకదాని తలుపు వెనుక ఖరీదైన కారు ఉన్నది. 'ఒక ద్వారం తెరిచి మీ అదృష్టం పరీక్షించుకోండి' అన్నాడు యాంకరు. మీరు మొదటి ద్వారం ఎన్నుకున్నారు. యాంకరు రెండో గది తలుపు తీసి చూపించాడు. దానిలో మేకపిల్ల ఉంది. 'కావాలంటే మీరు గది మార్చుకోవచ్చు' అంటూ మీకు మరో ఛాయిస్ ఇచ్చాడు. మీరు 3వ ద్వారానికి మారతారా? అదృష్టంలో తేడా లేదని మొదటి ద్వారానికే ఫిక్స్ అవుతారా?"

"తెలివైనవాడు అదృష్టం కన్నా అవకాశాన్ని ఎక్కువ నమ్ముతాడు సార్. మొదట ఎన్నుకున్న ద్వారం వదిలి, మూడో ద్వారం ఎన్నుకుంటాను"

"ద్వారాన్ని మార్చటానికి, అవకాశం పెరగటానికి సంబంధం ఏమిటి మేడమ్?"

"మూడు గదుల్లో ఒకటి ఎన్నుకున్నా కాబట్టి, నేను గెలిచే ఛాన్సు మొదట్లో 1/3. కారు ఏ గదిలో ఉందో యాంకరుకి 'నిశ్చయంగా' తెలుసు. రెండో గది తెరిచాడంటే, 3 గదుల్ని 2 చేసి, నేను గెలిచే చాన్సుని 1/3 నుంచి 1/2 కి పెంచాడన్నమాట. ద్వారం మారటం ద్వారా అతడిచ్చిన ఆ అవకాశాన్ని ఉపయోగించుకుంటాను".

అతడు లేచి నిలబడుతూ, "బాగా చెప్పేరు మేడమ్. ఈ ఇంటర్వ్యూ బాసుకి పంపుతాను. ఆయన ఇంకో గంటలో వస్తారు. అంత వరకూ వెయిట్ చెయ్యండి. గుడ్ లక్" అని వెళ్తున్నవాడు ఒక క్షణం ఆగి, "మీగ్గానీ ఈ ఉద్యోగం వస్తే నేను మీ కిందే పని చేయాలి' అన్నాడు.

"అలా ఏమీ లేదండీ. నేను ఎంత పొగరుగా పాండిత్య ప్రకర్ష ప్రదర్శించినా, భాషాదోషాలు సరి దిద్దినా ఓర్పుగా సహించారు. థ్యాంక్యూ సార్. మీలాంటి వాళ్ళు చాలా అరుదు. మనిద్దరం కలిసి పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అఫ్కోర్స్... నాకు ఉద్యోగం వస్తే" అని నవ్వింది.

అతడు వెళ్లిపోయాక తిరిగి వచ్చి హాల్లో కూర్చుంది. పది నిముషాలయింది. ఇంకెంత సేపు ఉండాలో అనుకుంటూ ఉండగా ఫోన్ మోగింది.

"రవళీ?"

"మాట్లాడుతున్నాను"

"నేనమ్మా. చక్రధరరావుని. ఇంటర్వ్యూ అదరగొట్టావుగా "

* * *

సంభ్రమాశ్చర్యాలతో ఒక్కసారిగా ఆమె చెయ్యి వణికింది. ఇంటర్వ్యూ గురించిన అభినందన వల్ల కాదు. ఆయన అంత ఆప్యాయంగా ఏకవచనంలో సంబోధించటం వల్ల..! అంబానీ నో, బిర్లానో సడన్‌గా ఫోన్ చేసి పలకరిస్తే ఎలా ఉంటుందో అటువంటి అనుభూతి.

"నేను రావటానికి మరో అరగంట పడుతుందమ్మా. పైన మా అమ్మాయి కల్పన ఉంటుంది. తనకి చెప్పాను. వెళ్ళు. మంచి కంపెనీ ఇస్తుంది".

ఆమె ఆనందానికి బ్రేక్ పడింది. 'ఆమె తనకి కంపెనీ ఇవ్వటం ఏమిటి?' అని మనసులో విసుగ్గా అనుకుంది. ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకుని, "కింద పదిహేడు ఫ్లోర్లూ మా ఆఫీసులు. పైన రెసిడెన్సు" అన్నాడు.

"ముంబాయిలో అంబానీలా" అంది కాసింత కసితో కూడిన ఇరిటేషనుతో.

ఆయన నవ్వి, "అంత కాదులే. అశోక్ వచ్చి తీసుకు వెళ్తాడు. వెళ్ళు" అన్నాడు.

'వెళ్ళను' అందామనుకుంది గానీ, ఈలోపులో అశోక్ వచ్చాడు. అన్యమనస్కంగా లేచింది. ఇద్దరూ లిఫ్ట్ లోకి ప్రవేశించారు. "కల్పన వయసు ఎంత ఉంటుంది?" అని అడిగింది.

"పదహారు – పదిహేడు"

భ్రుకుటి ముడివడింది. పదహారేళ్ళ పిల్ల. క్రిందికి వచ్చి మాట్లాడాలి. లేదా అంత ఇంటరెస్టుంటే వచ్చి తీసుకెళ్ళాలి. రమ్మని పిలుపేమిటి? అధికార దర్పం..! కళ్ళు మిరిమిట్లు గొలిపే తమ ఐశ్వర్యాన్ని ఎదుటివారికి చూపించుకోవాలనే చాలామంది ధనవంతులకి ఉండే అంతర్లీన కోరిక..!

లిఫ్ట్ పైకి వెళ్తుండగా, "మీ ఇంటర్వ్యూ బాస్ కి పంపాను. మొత్తం విన్నారు. బహుశా దాన్ని కూతురుకి ఫార్వర్డ్ చేసి ఉంటారు. ఆ పాప మిమ్మల్ని అందుకే కలవాలనుకుంటోంది అనుకుంటున్నాను" అన్నాడు.

"అదేమీ వాల్మీకి రామాయణం, పోతన భాగవతం కాదు. ఇంటర్వ్యూ" అంది చిరాగ్గా.

పదిహేడో అంతస్తులో లిఫ్ట్ ఆగింది. ఇద్దరూ పొడవాటి కారిడార్ లోంచి వరండా ఎడమ వైపు హాలులోకి ప్రవేశించారు. చిన్నసైజు పెళ్లి చెయ్యటానికి సరిపోయేటంత ఉంది ఆ హాలు. గోడలకి బంగారం, సీలింగుకి ప్లాటినం తాపడం చేసినట్టు ఉంది. ఆ షాండ్లియర్ల ఖరీదుతో ఒక మధ్య తరగతి కుటుంబం ఏడాది బ్రతకొచ్చు. హాల్లోంచి కల్పన గదిలోకి

ప్రవేశించారు. ముందు ఆమె పెర్సనల్ లివింగ్ రూమ్. దాని వెనుక బెడ్రూమ్ కనపడుతోంది. కుటుంబ సభ్యులందరికీ బెడ్-రూములతో పాటూ విడివిడిగా లివింగ్ రూములు..!

గదిలోకి ప్రవేశిస్తూనే ఆమె నిశ్చేష్టురాలై నిలబడి పోయింది.

"మీరు కూర్చోండి మేడమ్. అమ్మాయి వస్తుంది. నేను వెళ్తున్నాను" అన్న అశోక్ మాటలు కూడా వినపడలేదు.

గోడలకి తైల వర్ణ చిత్రాలు. ఒక దాన్ని మించి ఒకటి. ప్రొఫెషనల్‌గా లేవు. నిజాయితీగా ఉన్నాయి. కళ్ళు విప్పారితం చేసుకుని చూడటంలో తనని తాను మరచిపోయి ఉండగా వెనుక నుంచి, 'హాయ్' అని వినపడి వెనుదిరిగింది.

సెలయేరు జీవనది అవటానికి సమాయుత్తమవుతున్న వయసు. ఆమె తండ్రి కూడా తన తండ్రి లాంటివాడే అనుకుంటా. లంగా, ఓణీలో ఉంది. ఉరకలేసే అల్లరికి మర్యాద కళ్ళెం వేసినట్టు ఉంది.

"నా పేరు కల్పన. నాన్న మీ ఇంటర్వ్యూ పంపారు. 'చూడు ఎంత బాగా చెప్పిందో' అన్నారు. మీరు బాగా పుస్తకాలు చదువుతారా? అయినా పుస్తకాలు చదివితే ఇదంతా రాదు లెండి. గుర్తుండాలి. గుర్తు ఉండాలంటే చదువు మీద ఇష్టం ఉండాలి. ఎందుకో మీతో స్నేహం చేసుకోవాలనిపించింది. నాన్నకి చెప్పాను. ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారట. మీతో ఉంటే మీ తెలివితేటలు కొంచెమైనా వస్తాయేమో అని ఆశ. మీకిష్టమేనా? ఏమీ అనుకోకండి. లొడలొడా మాట్లాడటం నా అలవాటు. మా నాన్నకి నాలో నచ్చని విషయం అదొక్కటే. అవునూ. అస్సాం అన్నారేమిటి? అస్సాం పక్కన సముద్రం లేదుగా. మీ ఉద్దేశ్యం 'సముద్రం ఉన్న వైపు చూస్తూ' అయి ఉంటుంది. అంతేగా. అంతేలెండి."

ఆ అమ్మాయి ఇంకా మాట్లాడేదేమో కానీ అంతలోనే ఇంటర్‌కమ్ మ్రోగింది. మాట్లాడి పెట్టేస్తూ, "నాన్న వచ్చారు. అశోక్ మిమ్మల్ని తీసుకెళ్ళటానికి వస్తున్నాడు. మీకు ఇష్టమైతే అక్కడ అయిపోయాక మళ్ళీ రండి. మాట్లాడుకుందాం. మీకు ఇష్టమైతేనే సుమా"

"ఈ బొమ్మలు ఎవరు వేశారు?"

"నేనే. ఎలా ఉన్నాయి"

రవళి స్థబ్దురాలైంది. ఆ పాప వైపు ఆరాధనా పూర్వకంగా చూస్తూ, "ఇంత చిన్న వయసులో ఇంత అద్భుతంగా" అనబోతూ ఉంటే, "ఇక పనేం ఉంది? చదువు లేదు. బొమ్మలెయ్యటమేగా" అన్నది.

"అదేమిటి? చదువు లేదా?" ఆశ్చర్యం, అనుమానం మిళితమైన స్వరంతో అడిగింది రవళి.

"పదో క్లాసుతో ఆపేశాను"

"అదేమిటి? ఎందుకు ఆపెయ్యటం?"

ఆ అమ్మాయి ఆశ్చర్యంగా "అశోక్ చెప్పలేదా? ఐ యామ్ బ్లయిండ్" అంది.

నిశ్శబ్దం విస్ఫోటనమైన శబ్దం. "బ... బ్లయిండ్?"

"అవును. పదోక్లాసు చదువుతూ ఉండగా కారు ఆక్సిడెంటు జరిగింది"

"మరి ఈ బొమ్మలు?"

"నేను వేసినవే. ఓహ్... నీ డౌటు అర్థమైంది. కళ్ళులేనిది బొమ్మలెలా వేసిందనేగా? చదరంగం ఆటగాడు బ్లయిండ్ ఫోల్డ్ ఆడినట్టే. గుడ్డివాడికి స్పర్శ, మూగవాడికి వినికిడీ పెరిగినట్టు, ఒక జ్ఞానేంద్రియం పోతే మరొకటి స్ట్రాంగ్ అవుతుందట. చూశావా. నాకు కళ్ళు పోయి నోరు పెరిగింది. ఈ లొడలొడా వాగే అలవాటు మాత్రం మానుకోలేకపోతున్నాను. ఆః... ఏం చెపుతున్నాను? కళ్ళు పోవటం గురించి కదూ. మాకు 'పారడైస్ లాస్ట్' పాఠం ఉంది. కళ్ళు పోయినప్పుడు మిల్టన్ ఏడవలేదుట. ప్రజ్ఞ గురించి వ్రాశాడట. 'ప్రజ్ఞ' అంటే తీరని కష్టాల గురించి ఆలోచించటం మానేసి, తీరే పరిష్కారాల గురించి ఆలోచించటమట. 'జ్ఞానం' అంటే ఏవి తీరే కష్టాలో, ఏవి తీరని కష్టాలో తెలుసుకోవటమట. దేవుడు కళ్ళు తీసుకున్నాడు గానీ క్రియేటివిటి తీసుకోలేడుగా. ఉన్నారా? నా వాగుడు భరించలేక వెళ్లిపోయారా? మీరు నిశ్శబ్దంగా వెళ్ళినా నాకు తెలీదు."

స్వరంలో దుఃఖం బయటపడకుండా నిభాయించుకుంటూ "ఉ... ఉన్నాను" అంది రవళి. నందివర్ధనం పువ్వులాంటి పిల్లకి అందం, ఐశ్వర్యం, ఆర్టూ ఇచ్చి దృష్టి అనే అదృష్టాన్ని అర్ధంతరంగా తీసేసుకున్న దేవుడు ఎంత సాడిస్టు..! తను మాత్రం తక్కువా? అమ్మాయికి పొగరనీ, అందుకే క్రిందికి రాలేదనీ, ఆస్థి చూపించుకోవటానికి పైకి పిలుస్తోందనీ, ఎంత నీచంగా ఆలోచించింది.

"ఉన్నావా రవళీ?"

"ఉన్నానమ్మా. అశోక్ వచ్చాడు. నాన్నగారిని కలుసుకుని మళ్ళీ వస్తాను"

"ఏమన్నా బోరు కొట్టానా?"

*లేదు. ఒక పాఠం నేర్పావు. ఇంతకాలం కష్టాలంటే నావే అనుకున్నాను. కష్టమొక రిలేటివ్ టర్మ్ అని అర్థమైంది. ప్రతి చీకటి కష్టం వెనుకా ఒక వెలుగు దీపం ఉంటుందని తెలుసుకున్నాను.*

'మళ్ళీ వస్తాను' అన్నట్టు ఆ అమ్మాయి భుజం తట్టి అక్కణ్నుంచి కదిలింది రవళి.

# 16

**"ముందు** పాతిక వేలు ఇస్తాను. పని నచ్చితే రెండు నెలలు పోయాక యాభై వేలు చేస్తాను. ఆ తరువాత ఆరు నెలలకి లక్ష రూపాయలకి పెంచుతాను" అన్నాడు చక్రధరరావు.

ఆమె మాట్లాడలేదు. "ఏం ఇష్టమేనా?" అని అడిగాడు.

"నాకు డబ్బు అవసరం చాలా ఉంది సార్. నాన్నగారు ఆసుపత్రిలో ఉన్నారు"

అతడు కొంచెం ఆలోచించి "ప్రారంభంలో యాభైవేలిస్తాను. కొంతకాలం పోయాక లక్ష చేస్తాను. అయితే మూడు సంవత్సరాల పాటూ నా దగ్గరే పని చేస్తానని కాంట్రాక్ట్ వ్రాసివ్వాలి" అన్నాడు.

ఆమె మొహం విప్పారింది. "థ్యాంక్స్ సార్" అంది.

"నాన్నగారికి ఏమయింది?" అని అడిగాడు.

"కారు ఆక్సిడెంటు జరిగింది. ఆసుపత్రిలో కోమాలో ఉన్నారు. "

చక్రధరరావు మొహంలో విషాదం తొంగి చూసింది. "నాకూ ఆక్సిడెంటే. రెండు కాళ్ళూ పోయాయి. అప్పటి నుంచీ చక్రాల కుర్చీయే" అన్నాడు.

*రెండు ఆక్సిడెంట్లకీ కారణం ఒకరే...* మనసులో అనుకుంది రవళి.

"మా అమ్మాయి కల్పన చాలా తెలివైనది. పైకి అలా మాట్లాడుతుంది కానీ చాలా ఒంటరితనం ఫీలవుతుంది. ముఖ్యంగా ఆక్సిడెంటులో తల్లి పోయాక ఇది మరీ ఎక్కువైంది. తనకి కంపెనీ ఇవ్వు. నీ సాంగత్యంలో తను బాగుంటుందనిపించింది. నీకీ ఉద్యోగం ఇవ్వటానికి అన్నిటికన్నా ముఖ్యమైన కారణం అదే. నీకూ ఎవరూ లేరంటున్నావు కాబట్టి మాలో ఒకరిగా ఉండొచ్చు."

"ఉద్యోగం కన్నా మీతో ముఖ్యమైన పని ఒకటుంది సార్"

చక్రధరరావు ఆశ్చర్యంగా చూశాడు.

"మీ-టూ' లాగా 'యూ-టూ' అని ఒక కంటెంట్ క్రియేటు చేశాను. దాని మీద పెట్టుబడి పెడితే బాగా పాపులరు అవుతుందని నాకొక గట్టి నమ్మకం. కానీ ఇన్వెస్ట్‌మెంట్ కావాలి. "

"ఎక్కడో విన్నానే ఈ పేరు"

"నాదే. కానీ మధ్యలో ఆపుచెయ్యవలసి వచ్చింది"

"ఎందుకు?"

"దీనికి పెట్టుబడి పెట్టిన ఆయనకి అరవై ఏళ్ళు. అంకుల్ అని పిలిచేదాన్ని. కొంతకాలం తరువాత 'అంకుల్ అనొద్దు. నువ్వు అను' అన్నాడు. ఇక ఆపై ఆయన దగ్గరకు వెళ్ళలేదు."

అర్థమైనట్టు రావు తలూపాడు. "అసలు ఏమిటీ ఈ కాన్సెప్టు? దీనికి అంత పెట్టుబడి దేనికి?"

"స్త్రీకి జరిగిన అన్యాయాన్ని బయట పెట్టేది 'మీ-టూ' అయితే, సమాజ లొసుగుల్ని బయట పెట్టేది యూ-టూ. ఉదాహరణకి రైల్లో వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్టున్నా ఖాళీ లేదని చెప్పి, ఆ బెర్త్‌ని టి.సి. మరెవరికో ఇచ్చాడనుకోండి. మీ టిక్కెట్టూ, లంచం ఇచ్చినవాడు

పడుకున్న బెర్తూ 'యు–టూ' లో పెడతారు. 'బెర్తు ఖాళీ' అని టి.సి. ఆఫీసులో రిపోర్టు షీటు ఇచ్చాక, ఈ పోస్టు బయటకి వస్తుంది. టి.సి. సస్పెండ్ అవుతాడు. అదే విధంగా 'మా దగ్గర ర్యాగింగ్ లేద'న్న కాలేజీ, 'మేము డొనేషన్ తీసుకోము' అని ప్రకటించుకున్న స్కూలు... ఎవరైనా స్టింగ్ ఆపరేషన్ చేసి నేరం నిరూపిస్తే, గిన్నీస్ బుక్ వారు ఇచ్చినట్టు మనం కూడా వారికి డబ్బు ఇస్తాం".

"అనవసరమైన రభస తప్ప, దీని వల్ల లాభం ఏమిటి? మనం ఇవన్నీ బయట పెట్టినంత మాత్రాన లంచగొండితనం తగ్గుతుందా? ర్యాగింగూ, డొనేషన్లూ ఆగిపోతాయా?"

"ఆగవు. నిశ్చయంగా ఆగవు"

"మరి?"

"మన లక్ష్యం సమాజ ఉద్ధరణ కాదు సార్. పాపులారిటీ, వ్యూస్. అవీ ముఖ్యం..! నిర్భయ కేసులో ఆ అమ్మాయిని బస్సులో అందరికన్నా ఎక్కువగా హింసించిన కుర్రాడిని 'మైనర్' అన్న కారణంగా చిన్నశిక్షతో వదిలేశారు. ఇప్పుడు అతడు మారాడా? ఇంకా అలాగే ఉన్నాడా?' ఇలాంటి విషయాలు తెలుసుకోవటంలో ప్రజలకి చాలా ఉత్సాహం ఉంటుంది. అది తెలిసిన వ్యక్తి పోస్ట్ మనం కంటెంటులో పెడితే అమెజాన్ కన్నా ఎక్కువ పాపులరు అవుతుంది. ఒక మైనరు కుర్రాడు తాగి డ్రయివు చేస్తూ, ఒక కుటుంబం మొత్తాన్ని ఆక్సిడెంటులో చంపేశాడనుకుందాం. అన్ని చానల్స్ వాళ్ళూ 'మరణించిన వారి శవాలూ, దగ్గర బంధువుల ఏడుపులూ' పెడతారు. మనం మాత్రం ఆక్సిడెంటు చేసిన కుర్రాడి తల్లిదండ్రుల ఫోటోలు పెడతాం. 'అంత చిన్న కుర్రాడికి బాధ్యతా రహితంగా వెహికిల్ ఎందుకిచ్చారు?' అని పేరెంట్సునీ; వారి గారాబపు పెంపకంపై బంధువుల్నీ, పక్కింటివారినీ ఇంటర్వ్యూ చేస్తాం. ఆ కేసులో కుర్రాడు బెయిల్ మీద బయటకి వచ్చి మళ్ళీ తాగుతూ ఉంటే 'వీడికీ, వీడి పేరెంట్సుకీ ఇంకా బుద్ధి రాలేదు' అని మళ్ళీ పెడతాం. దీనివల్ల సమాజంలో కాస్తయినా మార్పు ఉంటుంది సార్. సమాజం అంటే గుర్తొచ్చింది. ఎమ్మార్వో ఆఫీసు, కమర్షియల్ టాక్స్, మున్సిపాలిటీ... ఎక్కడైనా ఒక వ్యక్తి లంచం తీసుకోకుండా అస్సలు పని చేయటం లేదనుకోండి. సినిమా రిలీజ్ అయ్యాక, నిర్మాత సెన్సారు ఆఫీసరు లంచం గురించి పబ్లిక్ చేసినట్టు... తన పని పూర్తయ్యాక 'ఫలానావాడికి నేనింత డబ్బిచ్చి పని చేయించుకున్నా'నని లంచం ఇచ్చిన వ్యక్తి ఋజువులు పంపుతే, ఆ లంచగొండి ఫోటో పోస్టులో పెడతాం. వీళ్ళెవరూ కోర్టుకి వెళ్లరు. వెళ్తే అభాసుపాలు అవుతామని తెలుసు. ఒకవేళ వెళ్ళినా, మన వైపు ఒక స్ట్రాంగ్ లీగల్ టీమ్ ఉంటుంది. మన కంటెంట్ పాపులరయితే, అదే ఉద్యోగికి లంచాలిచ్చిన మరో పదిమంది కస్టమర్లు, 'మేము కూడా ఇతని బారిన పడిన వారమే' అని పోస్టు పెడతారు. అతని ఫోటో 'మోస్ట్ కరప్టెడ్' కేటగిరీలోకి వెళ్తుంది. ఇంటి చుట్టు పక్కల అమ్మలక్కలకీ, బంధువులకీ అతనో లంచగొండిగా ముద్ర పడిపోతుంది. అతడు ఓ బ్రహ్మాండమైన ఇల్లు కట్టుకుని గృహప్రవేశానికి అందర్నీ పిలిచాడనుకోండి. 'ఎందరి నోళ్ళు

కొట్టి సంపాదించాడో. వీడి ఫోటో ***'యు-ట్యూ'*** లో చూశావా' అని అందరూ చెప్పుకుంటున్నారన్న గిల్ట్ ఫీలింగుతో వాడు ఆ ఫంక్షన్ని ఎంజాయ్ చెయ్యలేదు. ఏ ఫంక్షనుకి వెళ్ళినా 'అందరూ తననే చూస్తున్నారేమో' అన్న ఫీలింగుంటుంది. అతడి కొడుకు కాలేజిలో చదువుతూ ఉన్నాడనుకోండి. అతడి స్నేహితులకి కూడా ఈ విషయం తెలుస్తుంది. ఇంటికొచ్చి తండ్రితో గొడవ వేసుకోవచ్చు. ఒక లంచగొండి ఆఫీసర్ని ఒకరు కిరసనాయిలు పోసి చంపారు. అలా చంపటంకన్నా, మానసికంగా హింసించటం బెటరు కదా. వంద రూపాయల పింఛనుకై బీద ముసలమ్మని ఒక గుమస్తా వేధిస్తున్నాడనుకోండి. మనవల్ల అతడి విషయం పై అధికారుల దృష్టిలో పడి అతడిని ఆ పోస్టు లోంచి తప్పించవచ్చు. యాంటి కరప్షన్ వారు యాక్షన్ తీసుకోవచ్చు. లేదా ఏమీ జరగకపోవచ్చు కూడా. మన ఉద్దేశ్యం తప్పు చేసినవాడిని అన్-పాపులరు చెయ్యటం. ఇంకో గొప్ప ఉదాహరణ చెపుతాను. ఒక ఆఫీసరు కుటుంబంతో సహా వైజాగ్ నుంచి గవర్నమెంట్ కార్లో తిరుపతి వెళ్ళాడనుకోండి. 'విశాఖపట్టణం నుంచి వాటరు సర్వీసింగ్ కోసం పాపనాశనం జలపాతానికి వెళ్ళిన ప్రభుత్వ వాహనం' అన్న హెడ్డింగుతో మన కంటెంట్ వస్తుంది. అలాగే ఒక ప్రభుత్వ డాక్టరు పల్లెటూర్లో ఆస్పత్రికి ఏ ఒక్క రోజూ టైముకి రాకపోతే, గ్రామస్తులతో యథాలాపంగా చర్చిస్తూ ఆ విషయం రికార్డు చేస్తాం. పట్నంలో అతడికి ప్రాక్టీసు ఉన్న విషయం, వారం రోజులుగా అతడి కారు ఆస్పత్రికి వచ్చిన టైమూ రికార్డు చేసి పోస్టు పెడితే, ఆ పల్లెకి మంచి జరుగుతుంది కదా."

చక్రధరరావు దీర్ఘాలోచనలో పడ్డాడు. ఆమె ముక్తాయింపుగా అన్నది: "ఒకసారి ప్రారంభం అంటూ జరిగితే, మిగతాది జనమే చూసుకుంటారు సార్. వ్యక్తిగత కక్షలతో ఫేక్ న్యూస్ రాకుండా మాత్రమే మనం జాగ్రత్త పడాలి. అందుకు మన దగ్గర మంచి స్టాఫ్ ఉండాలి. లీగల్ సెల్ స్ట్రాంగ్గా ఉండాలి. అందుకు చాలా పెట్టుబడి కావాలి".

మొత్తం క్లారిటీ వచ్చినట్టుగా చక్రధరరావు "అర్థమైందమ్మా. అంతా బావుంది కానీ, నువ్వు అడుగుతున్న జీతమే కాస్త ఎక్కువ. నాకు ఒక్క గంట టైము ఇవ్వు" అన్నాడు. ఆమె వచ్చి బయట కూర్చుంది. ఎంత లేదనుకున్నా కాస్త టెన్షన్ గానే ఉంది. కళ్ళు మూసుకుంటే ఆస్పత్రి ఖర్చే కనపడుతూ ఉంది. అయిదు నిముషాల తరువాత ఫోన్ వచ్చింది. తెలియని నెంబరు. ఎవరో అర్థం కాలేదు. ఆన్ చేసి 'హలో' అంది.

"మేము మైక్రో-టెక్నాలజీస్ నుంచి మాట్లాడుతున్నాం. రవళిగారు ఉన్నారా?" ఇంగ్లీషులో అడిగారు.

"నేనే"

"మీరు పెద్ద రికమెండేషన్ మీద చక్రధర గ్రూప్ ఇంటర్వ్యూకి వెళ్ళారని తెలిసింది."

"అయితే?" మొహం చిట్లించింది.

"అక్కడ మీకు రికమెండ్ చేసినవారు మాకు కూడా చేశారు. మీరు వస్తే ఇంటర్వ్యూ లేకుండానే మేము తీసుకుంటాము"

"ఎవరు రికమెండు చేశారు?"

"నాకు తెలీదు మేడమ్ . మా మేనేజ్‌మెంట్ కి తెలుసు"

"ఇక్కడ సెలెక్ట్ కాకపోతే తప్పకుండా వస్తాను'

"అక్కడ జీతం ఎంత కోట్ చేశారో, ఇంకా కొద్దిగా ఎక్కువ ఇస్తాము కూడా".

*'తనని రికమెండ్ చేసినవారితో వీళ్ళకి ఏదో పని ఉంటుంది'* అని అనుకుంది. లేదా ఇనస్పెక్టరు ధర్మారావుగారు చెప్పి ఉండాలి.

"లేదండీ. ఇక్కడ కమిట్ అయ్యాను. వీళ్ళు కాదంటే వస్తాను"

"కానీ..." అని అవతలివారు ఏదో చెప్పబోతూ ఉంటే, "క్షమించండి" అని ఫోన్ పెట్టేసింది. ఈ లోపులో లోపల్నించి పిలుపు వచ్చింది. ఆయనతో పాటూ కాంట్రాక్ట్ పేపర్లతో అశోక్ రెడీగా ఉన్నాడు. ఆమె సంతకం పెడుతూంటే ఆయన, "అదేమిటి? చదవకుండా పెడుతున్నావ్?" అని అడిగాడు.

ఆమె నవ్వేసి, "పైకెళ్ళి మీ అమ్మాయిని పలకరించి వెళ్లి పోతానండీ. మళ్ళీ రేపు వస్తాను" అని కుర్చీ లోంచి లేస్తూ, "మీకు మీసాల్రాజా గుర్తు ఉన్నాడా?" అని అడిగింది.

ఆయన భ్రుకుటి ముడిచి, "మీసాల్రాజా ఎవరు?" అని అడిగాడు.

"తాగి మీ వెహికిల్ ఆక్సిడెంటు చేసినవాడు"

"ఓహ్. అతనా? ఎందుకు"

"అతన్ని ఏమీ చెయ్యాలని మీకు అనిపించటం లేదా?"

"చేయాలని అనిపించటం ఏమిటి? కోర్టులో కేసు జరిగిందిగా "

"డ్రయివు చేస్తున్నది తాను కాదని తప్పించుకున్నాడుగా "

"అవును. ఇంకేం చెయ్యగలం?"

"మీ కాళ్ళు పోయినయ్. మీ అమ్మాయి కళ్ళు పోయాయి. మీ భార్య మరణించారు. అతను హ్యాపీగా తిరుగుతున్నాడు. అయినా అతన్ని ఏమీ చెయ్యాలని అనిపించటం లేదా?"

"రౌడీలని పెట్టి కొట్టించాలనా? గూండాలని పెట్టి చంపించాలనా? ఏమిటి నీ ఉద్దేశ్యం?"

ఆమె మాట్లాడలేదు. అతడు ఆమె వైపు నిర్నిమేషంగా చూసి, "బాగా సినిమాలు చూస్తావా?" అని అడిగాడు.

ఆమె మౌనంగా ఫైలు సర్దుకుని బయటకి వెళ్తూ గుమ్మం దగ్గర ఆగి వెనుతిరిగి, "సినిమాలు చూడనండీ. ఒక అన్యాయాన్ని ఎదుర్కోవటానికి సినిమాలే చూడాల్సి వస్తే, ద్రౌపతికి జరిగిన అన్యాయానికి కృష్ణుడూ, సీతని రక్షించుకోవటానికి రాముడూ ఏ సినిమాలు చూశారు

సార్? ఏ సినిమాలు చూసి యుద్ధం చేశారు?" అని, సమాధానం ఆశించకుండా బయటకు నడిచింది.

లిఫ్టులో పైకి వెళ్లేసరికి కల్పన ఎదురుచూస్తోంది. "రా. నీకోసమే చూస్తున్నా" అంటూ ఆహ్వానించింది. ఆమెతో ఓ అరగంట మాట్లాడి వెళ్తూ, "నిన్నో చిన్న ప్రశ్న అడగనా?" అంది రవళి.

"ప్రశ్న అడగటానికి ముందుగా 'అడగనా' అన్న ప్రశ్న ఎందుకు? అడుగు" నవ్వింది.

"నేను సీరియస్‌గా అడుగుతున్నాను"

"ఓకే. నేనూ సీరియస్‌గానే చెప్తాలే" నవ్వు బిగపట్టి అన్నది.

"మీకు ఆక్సిడెంటు చేసిన మీసాల్రాజాని ఎదురుగా నిలబెడితే ఏమి చేస్తావు?"

కల్పన మొహంలో నవ్వు మాయమైంది. "చంపేస్తాను" అంది.

"చాలు. వెళ్లొస్తాను"

# 17

**ముగ్గురూ** లేచారు. ఆంజనేయులు మీసాల్రాజాతో, "ఈ తాగుడూ, ఫ్రెండ్సు కాస్త తగ్గించు. త్వరలో హోం మినిస్టరు మనవరాలితో పెళ్లి. కనీసం ఒక ఇంటివాడివి అయితే అప్పటికైనా కాస్త ఉధృతం తగ్గుతుందని అనుకుంటున్నాను" అన్నాడు.

"ఎవరు? ఆ త్రినేత్రితోనా?" మీసాల్రాజా అడిగాడు.

"వెటకారం వద్దు. త్రినేత్రి కాదు. సుగాత్రి".

"దాన్ని చచ్చినా చేసుకోను"

"అదేమిటి? ఆ అమ్మాయి తాతా, నేనూ జాయింటు స్టేట్మెంట్ కూడా ఇచ్చేశాము కదా".

"ప్రజలు ఈ పాటికి దాన్ని మర్చిపోయుంటారు కదా"

"ఇంత జరిగాక పెళ్లి కాన్సిల్ అంటే, బ్రహ్మానందం చెప్పుతో కొట్టి పార్టీ వదిలేసిపోతాడు"

"ఎలాగూ పోతాడు. పెళ్లి చేసుకున్నా ఆగడు. ఇప్పటికే అటూ ఇటూ ఊగుతున్నాడు. దాని కోసం ఆ దరిద్రాన్ని పెళ్లి చేసుకోవటం అనవసరం" అన్నాడు రాజా.

అప్పటివరకూ మౌనంగా ఉన్న చాణుక్య కల్పించుకుని, "చట్టా పట్టాలేసుకుని తిరిగారు. అబార్షను కూడా చేయించావు కదా" అన్నాడు.

"అందుకే చేసుకోను. ఇంకేముంది చేసుకోవటానికి?" నర్సింగ్-హోం బిల్లు గుర్తు చేసుకుంటూ అన్నాడు రాజా.

ముఖ్యమంత్రి పెద్దాయన వైపు తిరిగి, “చాణుక్య గారూ. మీ అమ్మాయిని వీడికి ఇస్తారా?” అని అడిగాడు. ఊహించని ఆ హఠాత్ ప్రశ్నకి చాణుక్య విస్తుబోయాడు. “ఇవ్వరు కదా” అని రాజా వైపు తిరిగి, “పరువు నిలబెట్టుకోవటం కోసం బ్రహ్మానందం అడిగాడే తప్ప, నీ గురించి తెలిసిన వాళ్ళెవరూ నీకు పిల్ల నివ్వరు. మంచి అవకాశం. ఆలోచించు” అని బయటకు నడిచాడు.

ఆంజనేయులు వెళ్ళిపోయాక, “నేను మిమ్మల్ని దింపుతాను” అంటూ ఆహ్వానించి, ఇద్దరూ కారు ఎక్కి కొంచెంసేపు నిశ్శబ్దంగా గడిచాక, “నా మీదా, సుగాత్రి మీదా మీ అభిప్రాయం ఏమిటి? మా పెళ్లి విషయం మీరేమి సలహా చెపుతారు?” అని అడిగాడు.

“సలహా చెప్పనా? అభిప్రాయం చెప్పానా?” అన్నాడు చాణుక్య.

“రెండిటికీ తేడా ఏమిటి?”

“సలహా అంటే నీకు మంచి చేసేది. అభిప్రాయం అంటే మీ పట్ల నాకున్నది”

“అభిప్రాయం చెప్పండి”

“ఈ లోకంలో నీ అంత దరిద్రులు తక్కువమంది ఉంటారు. నీ జీవితం ఇంతకన్నా దరిద్రం అవటానికి ఇంకేమీ లేదు. నువ్వు చచ్చావని ఫేసుబుక్కులో పెడితే లక్ష లైకులు వస్తాయి. అలాంటి నీకు వివాహం జరగటం నీ అదృష్టం. అదీ నా అభిప్రాయం”.

రాజా మొహం ఎఱ్ఱబడింది. కోపాన్ని నొక్కిపెట్టి, “అభిప్రాయం వద్దులే. సలహా చెప్పండి” అన్నాడు.

“కోపం తెచ్చుకోనూ అంటే చెపుతాను”

“తెచ్చుకోను. ఒట్టు”

“సరే చెప్తా విను. నువ్వూ ఆ సుగాత్రీ కలిసి చేసిన ఓపెన్ సెక్సు విదేశీ వీడియోల్లో కూడా చక్కర్లు కొడుతోంది. మామూలు అమ్మాయిలు ఎవరూ నిన్ను చేసుకోరు. ఏ డ్రగ్ అడిక్టో, మొగుడుని వదిలేసిందో, ప్రియుడి కోసం మొగుణ్ణి చంపేసిందో నిన్ను చేసుకోవాలి. నీ బావ చెప్పినట్టు పెద్దలెవ్వరూ నీకు పిల్లనివ్వరు. ఎవరైనా ఇస్తేగిస్తే ఆస్తి కోసమో, ముఖ్యమంత్రి వియ్యంకుడి హోదా కోసమో కక్కుర్తి పడాలి. ఇహపోతే, కడుపు ఎవరి వల్ల వచ్చిందో తెలియని ప్రపంచంలోని అతి తక్కువ అతివల్లో నీక్కాబోయే భార్య ఒకత్తి. పెళ్ళికి ముందే కాబోయే పెళ్ళానికి అబార్షన్ చేయించి తన బిడ్డని కడుపులోనే చంపించిన మహోన్నత చారిత్రాత్మక నికృష్ట యువకుల్లో నువ్వు ఒకడివి. అలాంటి మీ ఇద్దరూ వేర్వేరుగా మరో ఇద్దర్ని చేసుకుని వాళ్ళ జీవితాలు నాశనం చెయ్యటం కన్నా, మీరు దంపతులవటమే బెటరని నా సలహా”

మీసాలరాజా సందిగ్ధంగా “కానీ చూస్తూ చూస్తూ ఆ అమ్మాయినీ” అని ఏదో అనబోతూ ఉంటే ఆ మాటలు మధ్యలో కట్ చేస్తూ “అమ్మాయి తాగుతుంది. పైగా డ్రగ్ అడిక్ట్. అంతేగా

నువ్వు చెప్పేది. అయితే ఏమైంది? ఆ అలవాట్లన్నీ నీకూ ఉన్నాయిగా. పెళ్ళాం ఒకలా, గర్ల్ ఫ్రెండు ఒకలా ఉండాలన్న స్వార్థం నుంచి మీలాంటి నీచ్ కమీనే కుత్తే కుర్రాళ్ళు ఎప్పుడు బయటపడతారు?" అన్నాడు చాణుక్య.

మీసాల్రాజాకు కోపం రాలేదు. "కానీ ఆ అమ్మాయిని భరించలేం గురూగారూ. డ్రగ్సయితే గెంతులూ, తాగితే వాంతులూ" అన్నాడు.

"గంజాయా?"

"ఆ స్టేజి ఎప్పుడో దాటిపోయింది. నేనింకా కేనిబీసులోనే ఉన్నాను. తను కోకైను, హిరాయిను దాటి మీథాంఫిటమైనుకి వెళ్ళిపోయింది. ఇంజెక్షన్ తీసుకోగానే గుర్రంలా డాన్సు చేస్తుంది."

"చెయ్యనీ. నీకేం?"

"నన్నూ చెయ్యమంటుంది"

"డాన్సే కదా. చెయ్యి"

"బట్టల్లేకుండా చెయ్యమంటుంది"

"మరి కొత్తలో తెగ తిరిగావు కదా"

"ప్రేమించిన కొత్తలో పంది కూడా పంచకల్యాణిలా ఉంటుంది. మీకు తెలియనిది ఏముంది?"

"త్రినేత్రిలాంటి అమ్మాయిల విషయంలో నీకో సంగతి చెప్పనా? పదేళ్ళ క్రితం అమ్మాయి సిగరెట్ తాగుతోందంటే చిత్రంగా చూసేవారు. విమానాశ్రయపు స్మోకింగ్ రూమ్సులో ఆడాళ్ళు అస్సలు కనపడేవారు కాదు. ఇప్పుడు మొగాళ్ళు స్థలం వెతుక్కోవలసి వస్తోంది. గతంలో బ్రా వేసుకున్న ఆడాళ్ళని, 'సినిమా వాళ్ళలా ఏమిటా వేషాలు' అని పెద్దోళ్ళు తిట్టటం నాకు తెలుసు. ఆడాళ్ళు షాపుల కెళ్ళి 'మందు' కొనటం అప్పట్లో కలలో కూడా ఊహించని విషయం. మీ ఇంజనీరింగు కాలేజి లేడీస్ హాస్టల్ చుట్టూ ఏదో ఒక పని కల్పించుకుని ప్రేతాత్మలా తిరుగుతూ ఉంటావు కాబట్టి, తాగిన బాటిల్స్ హాస్టల్ అమ్మాయిలు ఎలా డిస్పోజు చేస్తారో కూడా నీకు తెలుసు. రాత్రి రెండింటి వరకూ పబ్బుల్లో తాగటం, ప్రొద్దున్న లేవగానే సిగరెట్లు ఊదేయ్యటం, డ్రగ్స్... ఇదే కదా ఈ నియో–కల్చర్ అమ్మాయిల వ్యవహారం. ఈ జనరేషన్ వచ్చి ఎంతకాలం అయ్యుంటుందంటావ్? మహా అయితే పదేళ్ళు. ఆడాళ్ళ లైఫులో ఈ 'ఫేజ్' పదేళ్ళ కన్నా ఎక్కువ ఉండదు. నువ్వే చూడు. పదేళ్ళ క్రితం పబ్బుల్లో కనపడిన బ్యాచ్ ఇప్పుడు కనపడదు. ఎందుకంటే వాళ్ళందరూ ఇప్పుడు 'పెద్దవాళ్ళు' అయిపోయారు కాబట్టి..! తమ శరీరం 'సున్నితం' అనీ, తమ వంటికి మందు పడదనీ పాతికేళ్ళ వయసులో ఈ అమ్మాయిలకి తెలీదు. తాగుడూ, డ్రగ్సూ, సిగరెట్టూ వల్ల ముప్పై ఏళ్లకే కొందరు చీపురు పుల్లల్లా తయారయితే, కొందరు అల్ట్రాటెక్ సిమెంట్ బస్తాల్లా

తయారయ్యారు. నేనేదో మనుధర్మ శాస్త్రపు నీతిసూత్రాలు చెపుతున్నా అనుకోకు. మన డిస్కషను కేవలం 'డ్రగ్సూ, తాగుడు' కి సంబంధించిందే తప్ప ఆడాళ్ళ సమానహక్కుల గురించి కాదు. ఈ తాగి తిరిగే చాలామంది స్త్రీలకి నలభై ఏళ్ళు వచ్చేసరికి కీళ్ళ నొప్పులో, ఊబకాయమో, మరో ట్రబులో వచ్చి బాధ పడతారు. ఇదంతా విని స్త్రీవాదులు నా మీద విరుచుకు పడవచ్చు. 'పురుషులు కీళ్ళ నొప్పులతో బాధ పడరా' అని వాదించవచ్చు. వాళ్ళూ పడతారు. కానీ స్త్రీ శరీరం సున్నితం. సెంటిమెంట్ ఎక్కువ. పిల్లల్ని కన్నాక మందు ముట్టరు. లేదా ఇంట్లోనే ఒకటి రెండు పెగ్గులతో సరిపెడతారు. పిల్లల ఆరోగ్యం కోసం సిగరెట్ తాగరు. అదే పురుషుడయితే బాల్కనీలోకి వెళ్లి కాలుస్తాడు. ఇంతకన్నా ఏమి ఉదాహరణ కావాలి? దానికన్నా ముఖ్యంగా అప్పటికే చాలామంది ఆడాళ్ళు ఈ వైపు జీవితం పట్ల విరక్తి చెంది ఉంటారు. మంచి ప్రేమ దొరికితే చాలనుకుంటారు" అని ఆగి, "ఇదంతా ఎందుకు చెపుతున్నానా అని నీకు అనుమానం రావొచ్చు. నీక్కాబోయే భార్య, ఆ చతుర్నేత్రి..."

"సుగాత్రి"

"ఏదో ఒక కంత్రీ... ఎంతో కాలం తాగకపోవచ్చు. లేదా జీవితాంతం తాగొచ్చు. మానేసినా మంచిదే. తాగి చచ్చినా మంచిదే. ఒకసారి ఆ ఇంటి అల్లుడయ్యాక పెళ్ళాం చచ్చినా, అల్లుడి హోదా అలానే ఉంటుంది కదా. అవకాశం హాలు తలుపు తట్టినప్పుడు బెడ్రూములో గెడ్డం గీసుకుంటూ ఉంటానంటే ఎలా? ఇలా మళ్ళీ చెపుతున్నానని ఏమీ అనుకోకు. సులక్షణమైన అమ్మాయి నీకు చచ్చినా దొరకదు. దొరికినా, నిన్ను చేసుకున్నందుకు జీవితాంతం ఏడుస్తూ ఉంటుంది. లేకుంటే నీలాగే ఇంట్లో విస్తరాకులో, బయట అరిటాకులో భోజనం చేస్తూ ఉంటుంది. నువ్వు సలక్షణమైన అమ్మాయిని చేసుకుని ప్రేమించటం ప్రారంభిస్తే, నీ పట్ల విరక్తి చెంది ఆమె ఒక రాత్రి ఇంటికి రాకపోతే 'ఈ వేళలో నీవూ... ఎవడితో ఉన్నావూ' అని ప్రతి నిముషం నిద్రలేకుండా బాధపడుతూ ఉంటావు. సుగాత్రితో నీకా ప్రోబ్లం లేదు. ఆమె అశ్లీలవతి. తెరిచిన పుస్తకం. ఆమె గురించి కొత్తగా నీవు తెలుసుకో వలసిందేమీ లేదు. మీరు అల్ట్రా-రిచ్ కాబట్టి, మీ పడగ్గదులు వేరుగా ఉంటాయి. ఒకవేళ ఒకే గదిలో ఒకే మంచం మీద పడుకున్నా, ప్రపంచంలో లక్షలాది దంపతుల్లాగా నువ్వు ఉత్తర ధృవపు పెంగ్వినుల గురించి, ఆమె దక్షిణ ధృవపు సీలు చేపల గురించీ ఆలోచిస్తూ నిద్రపోవచ్చు" అని ఆగాడు.

"ఇక నీ కెరియరు వైపు వద్దాం. రాజకీయ నాయకుడి దగ్గర 'తనవాళ్ళు, పరాయి వాళ్ళు' అని రెండు రకాలుంటారు. తన వాళ్ళంటే నమ్మకస్తులైన పెళ్ళాము, కొడుకు, కూతురు, అల్లుడు, తమ్ముడు..! సన్-స్ట్రోకు, సన్-ఇన్-లా స్ట్రోకు వదిలెయ్యి. ఇకపోతే, 'పరాయి వాళ్ళు' అంటే కార్యకర్తలు..! కార్యకర్తలు ఎప్పటికీ తనవాళ్ళు కారు. ఎందుకంటే, ఎప్పుడు ఏ కార్యకర్త ఎటు ఎలా మారతాడో ఎవరికీ తెలీదు. అసలు 'మనం' ఎటుంటామో మనకే తెలీదు కదా. ఒకవేళ మనమే పార్టీ మారితే, అప్పటివరకూ మన కోటరీలో ఉన్న కార్యకర్తల్ని

మనవేఁ మర్డరు చేయించవలసి రావచ్చు. ప్రియుడి కోసం మొగుడినే మర్డరు చేయిస్తున్న రోజులివి. అయినా సవతి సిస్టరు ప్రాపకం కోసం సొంత అక్కని మర్డరు చేసినవాడివి. నీకు నేను చెప్పాలా?" అని ఆగాడు.

"ముఖ్యమంత్రికి నువ్వు మనవాడివా? పరాయివాడివా? ఆలోచించు. ఈ ప్రపంచంలో ఎవరైనా నిన్ను ఇష్టపడటానికి నీలో ఒక్క అంశం కూడా లేదని నీకూ తెలుసు. ముఖ్యమంత్రి నిన్ను ఎందుకు చేరదీశాడు? అమ్మాయిల్ని తారుస్తావు కాబట్టి. స్త్రీ వాంఛ తగ్గగానే నీపట్ల ఉన్న అపారమైన ప్రేమ కూడా తగ్గుద్ది. అది పక్కన పెట్టు. ఆయన దొంగ వ్యవహారాలన్నీ నీకు తెలియనివి కావు. రేపు ఎలక్షన్సులో దేవ్ గెలిచి, మీ బావ ఓడిపోయాడనుకో. మీ బావని వెంటాడి వెంటాడి శంకరగిరి మాన్యాలు పట్టిస్తాడు. పదవి రాగానే ప్రత్యర్థిని వేధించటం రాజకీయ చరిత్రలో కొత్త కాదు కదా. ఇక నీ సంగతి తీసుకో. మొన్న గెస్టుహౌస్ మీద రైడింగ్ జరిగి మిమ్మల్ని పట్టుకున్నారు చూడు. ఆ టైములో సి.ఎం. నీ బావ కాకుండా దేవ్ అనుకో. ఈపాటికి జైల్లో చిప్పకూడు తింటూ ఉండేవాడివి. అందుకే చెపుతున్నాను. దీపం ఉండగానే ఇల్లు కూల్చేసి భవంతి కట్టుకోవాలి. నీకు పిల్లనిచ్చే... ఐ మీన్... మనవరాల్ని ఇచ్చే ఆ హోమ్ మినిస్టరు రేపు ఎలక్షన్సు దగ్గర పడగానే పార్టీ జంప్ చేసి, ఆ దేవ్ పార్టీలో చేరి మినిస్టరు అవుతాడు. అధికారంలో నీ తాతా, అపోజిషనులో మీ బావా ఉంటారు. అలాకాక ఈసారి కూడా మీ బావే గెలిచాడనుకో. అధికారంలో నీ బావా, అపోజిషన్లో అమ్మాయి తాతా ఉంటారు".

మీసాల్రాజా విచలితుడై చూశాడు. తనని కాన్ఫిడెన్సులోకి తీసుకుని తనముందే సి.ఎం గురించి పెద్దాయన అలా మాట్లాడతాడనుకోలేదు. కారు పక్కకి తీసి, స్టీరింగ్ మీద నుంచి చెయ్యితీసి వంగి చాణుక్య మోకాలి క్రింద స్పృశిస్తూ 'థ్యాంక్స్' అన్నాడు. ఆ దృశ్యం చూసినవాళ్ళు 'పావు గంట క్రితం కాట్లకుక్కల్లా కొట్టుకున్నవాళ్ళు వీళ్ళేనా' అని విస్తుబోతారు.

అయిదు నిముషాల తరువాత కారు ఆగింది. మీసాల్రాజా డ్రయివింగ్ సీటులోంచి దిగి, అటుగా వెళ్ళి డోరు తీశాడు. చాణుక్య దిగాక డోరు వేస్తూ ఇంటివైపు చూశాడు. తలుపు చప్పుడుకి చాణుక్య కూతురు బయటకు వచ్చింది. ఆమె పేరు సుమ. నిజంగానే మంచులో తడిసిన ముద్దబంతి పువ్వులా ఉంది. మీసాల్రాజాని చూసి ఆ అమ్మాయి అమాయకంగా నవ్వింది. మీసాల్రాజా కూడా చెయ్యి ఊపుతూ నవ్వాడు. అమాయకంగా కాదు.

ఆమె వెనుకే పెంపుడు కుక్క వంకరగా తోక ఊపుతోంది.

* * *

"నువ్వు ఏదో పెద్ద ప్లాను వేసి మీసాల్రాజాని అన్ పాపులరు చేశానన్నావ్. కానీ ఇప్పుడు చూడు. చాణుక్య వాళ్ళ ఇద్దరి పెళ్ళీ అనౌన్స్ చేసి, ఎగేసిన మంట మీద బిందెడు నీళ్ళు జల్లాడు" అన్నాడు చక్రధరరావు.

రవళి నవ్వి, "పెళ్లి జరిగితే మంచిదే. అప్పటి నుంచీ వాడి జీవితం నరకం. అయినా వాళ్ళ పెళ్లి జరగదు" అంది.

రావుగారు విచలితుడై, "మరి ఆ కెమెరామెన్ రాంబాబుకి డబ్బిచ్చి వీడియో తీయించింది దేనికి?" అని అడిగాడు.

"వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకుని సుఖంగానో, కొట్టుకుని చస్తేనో మనకేం లాభం? వాడి జీవితం నరకం చేయటానికి మరో ట్విస్టు ఉంది. కొంచెం ఓపిక పట్టండి".

ఆయన గాఢంగా నిశ్వసించి, "తోటి వ్యాపారస్తుల ఎత్తులకు పై ఎత్తులు వేయటంలో నాకు గొప్ప నేర్పు ఉన్నదని ఇంత కాలం ఫీల్ అయ్యేవాడిని. దక్షిణ భారతానికి నేనే ఒక ముఖేష్ అంబానీ అనుకునేవాణ్ణి. నిన్ను చూశాక నా అభిప్రాయం మార్చుకోవాలనిపిస్తోంది. నువ్వు మాఫియాలో చేరకపోవడం మాలాంటి పారిశ్రామికవేత్తలూ, పోలీస్ డిపార్ట్‌మెంటూ చేసుకున్న అదృష్టం" అన్నాడు

"మీరు పొగుడుతున్నారో, తిడుతున్నారో తెలియటం లేదు. మీ పోటీదారులకి మీరెవరో తెలుసు. నా శత్రువులకు నేను తెలియదు. ఇదంతా గెరిల్లా వ్యవహారం. మీకూ నాకూ పోలిక ఎక్కడ సార్?" అన్నది.

# 18

**"అబ్బ.** అయిదు నిముషాల్లో భలే వేశావే రంగు. ఇంతకు ముందు పనివాడయితే 'వెనకాల కాస్త తెల్లగా ఉంది. మీసం సరీగ్గా లేదు' అంటూ గంట సేపు వేసేవాడు. చేసే పనికన్నా నన్ను మెప్పించాలన్న ధ్యాసే ఎక్కువ కనిపించేది. నా అనుభవం మీద చెప్తున్నా. రాజకీయాల్లాగానే తలకి రంగెయ్యటం కూడా ఒక ఆర్టు. అందరికీ రాదు. ఎక్కడ నేర్చుకున్నావ్?"

"చదువు పూర్తయ్యాక పార్లరుకి వెళ్లి నేర్చుకున్నానండి. మా ఊళ్ళో ప్రమీలగారనీ, ఆవిడ నేర్పారు".

"ఇది నేర్చుకుంటే వచ్చేది కాదులే. స్వతహాగా రావాలి. ఒక్క తెల్ల వెంట్రుక లేకుండా వేశావే".

"మీకు తెల్ల వెంట్రుకలు ఎక్కువ లేవండి. వెనుక కాస్త నెరిసిందంతే. అదేదో సినిమాలో మహేష్ బాబు ముఖ్యమంత్రి అవుతాడు చూడండి. పదేళ్ళు పోయాక ఆయన ఎలా ఉంటారో ఇప్పుడు మీరలా ఉన్నారు"

"ఆ కుర్రాడి పోలికలు ఉన్నాయని నాకూ కొందరు చెప్పారు. ఏం సినిమా అది? చూడాలంటే టైమే ఉండటం లేదు".

"ఇంట్లో హోం థియేటరు ఉందిగా"

"టైమ్ ఉండాలిగా"

"అబ్బా. మాటకి మాట ఎంత ఫాస్టుగా చెప్పారండీ. అలా ఉంటే గానీ అసెంబ్లీలో నెగ్గుకు రాలేరు గదా. ఒక్కసారి వెళ్లి అసెంబ్లీ చూడాలని కోరిక సారూ. అక్కడ చాలా తెలివైన వాళ్ళు, మేధావులూ ఉంటారు కదా."

"దానిదేముంది. పి. య్యే. కి చెపుతాను. పాస్ తీసుకో"

"రంగు ఇంకటానికి మరో పది నిముషాలు పడుతుంది. ఒక్క నిముషం నిటారుగా కూర్చోండి. కాస్త మెడ నొక్కుతాను" అంటూ మసాజ్ చెయ్యటం మొదలు పెట్టింది.

"అబ్బో. అద్భుతం. మొత్తం ఆస్థి రాసిచ్చినా సరిపోదు. ఇదెక్కడ నేర్చుకున్నావ్?"

"మీరు చదివిన చదువులకి ***'ఈ ప్రభుత్వం'*** లో ఉద్యోగాలెక్కడ వస్తాయి. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా ఉంటుంది. నేర్చుకో' అని ప్రమీలగారే నేర్పారండీ".

ఆమె మాటల్లో సెటైరు గమనించలేదు ఆంజనేయులు. "ఫిజియోథెరపీ స్టూడెంట్స్ అని వస్తారు. అన్ని సంవత్సరాలు ఎందుకు చదువుతారో అర్థం కాదు. ఆ ఆర్టు చేతివేళ్ళలో ఉండాలి. ఎక్కడ-ఎలా-ఎంతసేపు-ఎంత గట్టిగా నొక్కాలో తెలియాలి. అసలు మా ఆవిడకి థ్యాంక్స్ చెప్పుకోవాలి. నీ చెయ్యి పడ్డాక ఆవిడ రెండేళ్ళ నడుము నొప్పి పోయిందటగా. అవునూ... నాకో అనుమానం. నీదేమో పిటపిటలాడే వయసు... మరి...మరి... "

"చెప్పండి. ఆగారేం?"

"మా ఆవిడ నిన్ను నాకు ఎందుకు రికమెండు చేసింది అంటావ్?"

"... ... ..."

"ఏ పెళ్లామైనా అరవై ఏళ్ల మొగుడి దగ్గరకి ఇరవై ఏళ్ల అమ్మాయిని పంపుతుందా?"

"నాకు ఇరవై కాదు. పాతిక దాటినాయ్ సారూ"

"వయసు ఎంతయితేనేమిలే. నేను అడుగుతున్నది పంపటం గురించి"

"నిజం చెప్పనా... "

"చెప్పమనేగా అడిగేది"

"ఇంట్లో సంపాదించేవారు మాకు ఎవరూ లేరు. బాలారిష్ట అని పోలీసు. అతడిది మా ఊరే. తనకి చెప్తే అమ్మగారి దగ్గరకి పంపాడు. రెండు మూడుసార్లు వెళ్లేసరికి ఆమెకి బాగా నచ్చాను. బ్యూటీ పనులకి బయటకి వెళ్ళటం మానెయ్యి. నా దగ్గరే పెర్మనెంటుగా ఉండమన్నారు. మీ తలకు రంగు వెయ్యమంటే ఒకటే చెప్పాను. 'ఆయన నాకు తండ్రిలాంటి వారు. తప్పక వేస్తాను. కానీ కొద్దిగా అటూ ఇటూ అయినా పని మానేసి వెళ్ళిపోతాను' అని చెప్పాను. అటువంటిదేమీ ఉండదని భరోసా ఇచ్చారు. అయ్యగారూ, అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మంచిదంటారు. మీరేం అనుకోకపోతే ఒక విషయం చెపుతాను. ఆ

మీసాంౖరాజాగారి చూపులు నాకేం నచ్చలేదండీ. మీరు పొజిషన్లో ఉన్నారు. ఇక్కడ పని నచ్చక వెళ్ళిపోతే ఆ తరువాత నా మీద కక్ష కట్టకండి. పిపీలికంలాంటి దాన్ని. "

"పీలకమా... అంటే?

"చీమ"

"అయ్యో. ఎల్లుండి తెలుగు భాషోద్ధరణ మీటింగ్ క్యాన్సిల్ చెయ్యమని పి.య్యేకి చెపుదామని మర్చిపోయాను. ఊ... ఇంతకీ ఏం చెపుతున్నావ్? పని మానెయ్యటం గురించి కదూ. మీసాౖరాజాకి నువ్వే డైరెక్టుగా చెప్పు. వినకపోతే నాకు చెప్పు. అయినా వాడి మనస్తత్వం నాకు తెలుసు. ఒక రాయి వేసి చూస్తాడు. పడకపోతే వదిలేస్తాడే తప్ప వెంటపడి వేధించడు. ఇప్పుడు నువ్వు అర్ధంతరంగా పని మానేస్తే, అది నా వల్లే అనుకుంటుంది అమ్మగారు. మంచిగా కబుర్లు చెబుతూ పని చేస్తున్నావు. ఈ మాత్రం చాల్లే. మిగతా పనులకి చాలామంది దొరుకుతారు. మనసులో మాట ధైర్యంగా చెప్పావ్. అన్నట్టు నాది ఇంకో అనుమానం"

"అడగండి సారూ"

"నువ్వు బాగా చదువుకున్నట్టు ఉన్నావ్. ఈ పనుల్లోకి వచ్చావేమిటి?"

"అయ్యో సార్. మీకు అమ్మగారు చెప్పలేదా?"

"ఏమిటి?"

"విశ్వాసపాత్రంగా పని చేస్తే మీరు మంచి ఉద్యోగంలో పెడతారన్న విశ్వాసంతో వచ్చానండి".

"అదెవరు చెప్పారు?"

"పదేళ్ళ క్రితం రాజభవనులో గవర్నరుకి మసాజ్ చేసిన వాళ్ళు చెప్పారండీ"

ఆంజనేయులు ఉలిక్కిపడి, అందులో శ్లేష ఏమీ లేదని నిశ్చయించుకొని అడిగాడు "సర్లే... సర్లే... మా ఆవిడ చెప్పాక తప్పుతుందా? ఇంతకీ నీ పేరు?"

"సారమ్మ "

* * *

గంట తరువాత రవళికి ఫోన్ వచ్చింది. "హాయ్ సమ్మా. ఎలా ఉన్నావ్" అంది రవళి.

"ముఖ్యమంత్రి పెర్సనల్ అంతఃపురంలోకి వెళ్లాను".

"ఏమంటాడు?"

"కొంచెం ముందుకు రాబోయాడు. పెళ్ళాం పేరు చెప్పేసరికి తగ్గాడు"

'నెమ్మదిగా చాణుక్యని పరిచయం చేసుకో. ఇంటికి వెళ్ళు. అతని కూతురు సుమ మంచి అమ్మాయి. వివరాలు కావాలి. ఎక్కడ పని చేస్తుంది? ఎవరినైనా ప్రేమించిందా? స్వభావం ఎలాంటిది వగైరా".

"ఆ అమ్మాయి వివరాలు మనకెందుకు?"

*మీసాల్రాజా చేసే అన్ని వెధవ పనులకీ, తన వెనుక చాణుక్య ఉన్నాడన్న ధైర్యం..! ఆ గ్రూపుని నిర్వీర్యం చెయ్యాలంటే అన్నిటికన్నా ముందు చాణుక్యని ఆ గ్రూపు నించి విడగొట్టాలి.*

ఇదంతా చెప్తే ఆ అమ్మాయికి అర్థమవుతుందా?

***'నీ మనసులో ఏమున్నదో నీ సైనికాధికారికి తెలియనివ్వకు. అర్ధరాత్రి వ్యూహం పన్నుతున్న సమయంలో ఏ గదిలో ఉన్నావో నీ మంత్రులకు తెలియనివ్వకు. ఎవరితో ఉన్నావో భార్యకి కూడా చెప్పకు'*** అంటాడు సంజు.

"వివరాలు ఎందుకో తరువాత చెపుతాను. నువ్వు చాణుక్య ఇంటికి వెళ్ళు. అమ్మాయి వివరాలు కనుక్కుంటున్నట్టు ఎవరికీ అనుమానం రాకూడదు. నీ ఊరు పేరు, ఇంటి పేరూ బయటవారికి ఎవరికీ చెప్పకు. నీ అన్నయ్య ప్రసక్తి ఎక్కడా రానివ్వకు. ఇక రెండో విషయం. వీలైనంత తొందర్లో నాకు మీసాల్రాజా ఫోన్ నెంబరు కావాలి. కానీ వాడినించీ, వాడి ఫ్రెండ్సునించీ దూరంగా ఉండు. ఆడదైతే చాలు, వాళ్ళు భూత ప్రేతాలని కూడా వదలరు".

# 19

**పార్థసారథి** తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు. తనని ఆట పట్టించటానికి ఎవరైనా నాటకం ఆడుతున్నారా అన్న అనుమానం కూడా వచ్చింది. కానీ లెటరు హెడ్ మీదున్న లోగో 'అబద్ధం కాదు' అని చెబుతోంది. చేతిలో ఉన్న కాగితం వైపు మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు. అప్పటికే దాన్ని పదిసార్లు చదివి ఉంటాడు. తాను అప్లయి చేయకుండానే ఉద్యోగం ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

నిన్న ఇదే సమయానికి అతను ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఉద్యోగం పోయినప్పటి నుంచీ రాబడి లేదు. తండ్రి ఆసుపత్రిలో ఉన్నాడు. కిడ్నీ ప్రాబ్లం. ప్రభుదేవ్ ఆస్పత్రి. ఉచితమే కానీ మందుల ఖర్చు రోగిదే కదా. రామానుజం ఆపరేషన్ చేశాక రోగం ఎక్కువైంది. ఏడాది నుంచీ కూడబెట్టినదంతా తండ్రి ఆసుపత్రికే సరిపోయింది. రేపటి నుంచీ తినటానికి తిండి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఆ సమయంలో ఈ అపాయింట్మెంట్ లెటరు.

ఇంటర్‌లో మంచి మార్కులు రావటంతో సారథికి విద్యాధరి ఇంజనీరింగ్ కాలేజిలో డొనేషన్ లేకుండా సీట్ వచ్చింది. అక్కడ సీటు కోసం ఎంత ఖర్చుకైనా పిల్లల తల్లిదండ్రులు సిద్ధంగా ఉంటారు. ఆ కాలేజీకి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, నాలుగో సంవత్సరంలో ఉండగానే పెద్ద పెద్ద కంపెనీల నుంచి ఇంటర్వ్యూలూ, ఆ పై ప్లేస్‌మెంట్లూ గ్యారెంటీ.

దాన్ని నిజం చేస్తూ, విద్యాధరిలో చదువు పూర్తవకుండానే సారథికి 'రామన్నో సొల్యూషన్స్'లో ఉద్యోగం వచ్చింది. లక్ష రూపాయల జీతం. అలా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చిన నలభై మంది తమ కాలేజ్ విద్యార్థులకి ప్రిన్సిపల్ సన్మానం చేశాడు.

ప్రెస్సుని పిలిచి డిన్నరు ఇచ్చారు. పరీక్ష పాసవక ముందే అంతమందికి ఉద్యోగాలు రావటం సామాన్యమైన విషయమేమీ కాదు. రాజకీయనాయకుల కాలేజీ. దానికి తోడూ అద్భుతమైన డిన్నరు. ఆ పై విలేకర్లకి కవర్లు. దాంతో పేపర్లన్నీ పతాక శీర్షికలతో ఆ వార్తని ప్రముఖంగా ప్రచురించాయి. విద్యాధరీ కాలేజి డొనేషన్ ఇరవై లక్షలకి పెరిగింది. తల్లిదండ్రులు తామర తంపరగా క్యూలు గట్టారు.

ఉద్యోగం రాగానే ఇ.ఎం.ఐ ల సాయంతో సౌఖ్యాలు సమకూర్చుకోవటానికి ఉవ్విళ్ళూరే యువకులకి సారథి భిన్నం కాదు. ఫ్లాటుకి అడ్వాన్సు ఇచ్చాడు. కారుకి అప్పు తీసుకున్నాడు. తండ్రిని మంచి ఆస్పత్రిలో జాయిన్ చేశాడు. ప్రేమించిన అమ్మాయితో కొత్త కార్లో షికార్లు, వారానికి ఒకసారి డిన్నరు.

అతడు ప్రేమించిన అమ్మాయి పేరు సుమద్యుతి. ఇంట్లో చెప్పాడు. వాళ్ళు ఆనందంగా ఒప్పుకున్నారు. ఒక ఆడపిల్ల కళకళలాడుతూ ఇంట్లో ఉండటం తమ అదృష్టం అనుకున్నారు. పెళ్లి ఒకటే మిగిలి ఉన్నది.

అయితే ద్యుతికి మాత్రం ఇంట్లో చెప్పటం అంత సులభం కాదు. వేరే కులం వ్యక్తిని అల్లుడిగా చేసుకోవటానికి తండ్రి చచ్చినా ఒప్పుకోడని ఆమెకు ఖచ్చితంగా తెలుసు. కానీ మంచి ఉద్యోగం, చక్కటి నడవడిక ఉంది కాబట్టి ఒప్పించగలనని చిన్న నమ్మకం.

ఇలా ఏడాది గడిచింది. ఆ సమయంలో చాలామంది ఉద్యోగాలు పోయాయి. 'రామన్కో' వాళ్ళు సారథికి కూడా పింక్ స్లిప్ ఇచ్చారు. ఏ కారణమూ చెప్పలేదు. ఆశలకి తూట్లు పొడుస్తూ ఉద్యోగం పోయింది. ఆకాశం విరిగి మీద పడ్డట్టయింది. చూస్తుండగానే ఆర్థిక సమస్యలు చుట్టు ముట్టాయి. సంవత్సరం పాటూ బ్యాంకుకి కట్టినదంతా 'దాని వడ్డీ'కి సరిపోయింది. రెండు మూడు నెలల్లో ఇల్లు వేలం పాటకి రెడీ అవ్వమని బ్యాంకు నోటీసు ఇచ్చింది. గర్ల్ ఫ్రెండుతో తిరిగిన కారు సగం ధరకి కూడా అమ్ముడు పోలేదు. మరోవైపు ఆ అమ్మాయికి ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు. దాంతో డిప్రెషన్. ఈ బాధలన్నీ భరించలేకే అతడు ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. ఛస్తే ముసలి తల్లిదండ్రుల్ని ఎవరు చూస్తారన్న ఒక్క ఆలోచనే అతడిని చావకుండా ఆపుతోంది.

వాడిపోతున్న చెట్టుకి నీళ్ళు పోసినట్టు ఆ సమయంలో ఈ ఉత్తరం..!

అయినా అనుమానం తీరలేదు. తాను అప్లై చేయకుండా ఉద్యోగం ఎలా వస్తుంది? అందుకని ఆ కంపెనీకి ఫోన్ చేశాడు. పేరు చెప్పగానే రిసెప్షనిస్టు ఆ ఫోన్ కాల్ హెచ్.ఆర్.కి బదిలీ చేసింది. తన వివరాలు పూర్తిగా చెప్పక ముందే అటునుంచి "అవును సారథీ. మేమే పంపించాం. మీ బయోడేటా చూశాం. ఇంటర్‌మీడియట్లో బాగా స్కోరు చేశారు. కాలేజిలో ఫ్రీ సీటు సంపాదించారు. తరువాత సంవత్సరం పాటూ మంచి కంపెనీలో పని చేశారు. ఏదో కారణంతో వారు మిమ్మల్ని తొలగించారు. ఇవన్నీ మాకు తెలుసు. అందుకనే ఇంటర్వ్యూ అవసరం లేదు. మీకు ఇష్టమయితే, ఎప్పుడు జాయినవుతారో చెప్పండి" అన్నాడు.

'ఈ రోజే' అందామనుకుని బావోదని, 'రేపే' అన్నాడు.

ఆ మరుసటి రోజు ఆ ఆఫీసుకి వెళ్ళాడు. అక్కడి వాతావరణం చూసి దిగ్భ్రమ చెందేడు. గతంలో పని చేసిన రామన్స్‌కి వందరెట్లు పోష్‌గా ఉంది. రిసెప్షనిస్ట్ ఛాంబర్ పక్కనే జలపాతం. చుటూ వాటర్ పాండ్. నీటిమడుగు మధ్యలో తామర పూలు. సెవెన్–స్టార్ హోటల్లా ఉంది. అంత ఖరీదైన వాతావరణం చూడటం అదే మొదటిసారి.

హెచ్. ఆర్ సర్టిఫికెట్లు తీసుకుని, బాండ్లు సంతకం పెట్టించుకుని "పై ఫ్లోరుకి వెళ్ళండి. చైర్మను ఛాంబరు పక్కన సెక్రటరీ క్యాబిన్ ఉంటుంది. కలుసుకోండి" అని చెప్పారు. సారథి కాస్త తటపటాయించి, "నేను ఏ విభాగంలో పని చెయ్యాలి?" అని అడిగాడు.

"మాకే తెలీదు" అన్నాడు హెచ్.ఆర్.

సారథి మరింత కన్–ఫ్యూజయ్యి, "సారీ సర్. నాకు అర్థం కాలేదు" కాస్త బెదురుతూనే అన్నాడు. ఆయన నవ్వి, "మాకూ అర్థం కాలేదు. మీరు రాగానే తన దగ్గరకి పంపమని వైస్ ప్రెసిడెంటు చెప్పారు. ఇంటర్వ్యూ కూడా లేకుండా తీసుకున్నారంటే మీ రికమెండేషన్..." పూర్తి చెయ్యలేదు.

'అయ్యో... అంత రికమెండేషన్ ఉంటే ఇంత ఖర్మెందుకు?' అనుకున్నాడు మనసులో.

ఒక్క ఫ్లోరు కి లిఫ్ట్ ఎందుకని మెట్లు ఎక్కి పైకి వచ్చాడు. చైర్మెన్ ఉండే ఫ్లోరు మరింత ఖరీదుగా ఉంది. ఆయన రూమ్ పక్కనే వైస్–ప్రెసిడెంటు గది. బయట ఉన్న కుర్రాడు తలుపు తెరిచి, "వెళ్ళండి సార్. మీ కోసమే చూస్తున్నారు" అన్నాడు. సారథి లోపలకి ప్రవేశించి అక్కడి లగ్జరీకి క్షణం పాటూ తబ్బిబ్బై ఆగిపోయాడు. అక్కడి ఫర్నీచరే పాతిక లక్షలు చేస్తుంది. ఇంటీరియర్స్ కోటి ఉంటుంది.

అతడి ఇబ్బంది గమనించినట్టు, "రండి. కూర్చోండి సారథీ" అన్నదామె.

అతను కూర్చున్నాడు.

"మీరు వచ్చేనెల ఇదే తారీఖు నుంచీ పని ప్రారంభించవలసి ఉంటుంది".

పార్థసారథి మొహం వాడిపోయింది. "మేడమ్..." అంటూ ఆగాడు.

"చెప్పండి. "

"నాకు డబ్బు చాలా అవసరం మేడమ్. నిజానికి ఇవన్నీ చెప్పకూడదు. కానీ నా తండ్రి ఆసుపత్రిలో ఉన్నాడు. నా తల్లికి అనారోగ్యం. మందులు కాదు కదా. తినటానికి కూడా తిండిలేని స్థితి. నేను ఈ రోజే జాయినయిపోతే బ్యాంకులో ఏదైనా కొంచెం అప్పు తీసుకోవచ్చు."

ఆమె నవ్వింది. "వచ్చేనెల నుంచి పని అని చెప్పానే తప్ప ఈ రోజు చేరవద్దని అనలేదు".

అర్థం కానట్టు పార్థసారథి అయోమయంగా చూశాడు.

"మీరు కంప్యూటరు స్పెషలిస్ట్ కదా. ఆ విభాగానికి వచ్చే నెల పంపిస్తాము. ఈ నెల రోజులూ మీరు నా దగ్గర పని చేయాల్సి ఉంటుంది"

"ఏం పని?" అని అడిగాడు సారథి. మళ్ళీ వెంటనే నాలుక్కర్చుకుని "సారీ మేడమ్. ఇలా అడగవచ్చో లేదో తెలీదు" అన్నాడు.

"మీరు విద్యాధరి కాలేజీలో చదివారు కదా. మీతో పాటూ మీ క్లాస్‌మేట్సు దాదాపు యాభైమందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఇరవై మందికి చేరిన మూడునెలల్లో, మరి కొందరికి ఆరు నెలల్లో, మీలాంటి బ్రిలియంట్స్‌కి ఏడాది తర్వాతా పింక్ స్లిప్స్ ఇచ్చారు".

సారథి దిగ్భ్రాంతుడై చూశాడు. ఆమె కొనసాగించింది. "మీరు చదివిన కాలేజీకీ, ఈ కంపెనీలకీ ఏదో సంబంధం ఉందని మా అనుమానం. మీ క్లాస్‌మేట్సు ఏయే కంపెనీల్లో పని చేస్తున్నారో మీకు తెలిసే ఉంటుంది. తెలియకపోయినా కనుక్కోవటం పెద్ద కష్టం కాదు. అవునా?"

ఆమె ఏమి చెప్తోందో అర్థం కాలేదు కానీ, సారథి అప్రయత్నంగానే అవునన్నట్టు తలూపాడు.

"మీ సీనియర్సు ఎక్కడ పని చేస్తున్నారు? అవే కంపెనీల్లో కంటిన్యు అవుతున్నారా? మీ కొత్త బ్యాచి జూనియర్సుకి ఉద్యోగాలు ఇవ్వటం కోసం పాతవారికి పింక్-స్లిప్స్ ఇచ్చారా - అన్నీ కనుక్కోవాలి."

"అర్థమైంది మేడమ్. మా కాలేజీ యాజమాన్యం కొన్ని పెద్ద పెద్ద కంపెనీల హెచ్.ఆర్ లని కొనేసి, మాకు ఉద్యోగాలు ఇప్పిస్తోంది. కొత్త బ్యాచ్ రాగానే మమ్మల్ని తొలగిస్తోంది. ఆ విధంగా తన డొనేషన్ రేటు పెంచుకుంటోంది. అదేగా మీరు అడుగుతోంది?"

"కరెక్ట్. మేము అనుకున్న దాని కన్నా మీరు షార్ప్ గా ఉన్నారు. ఉద్యోగాలు పోయిన మీ కాలేజ్-మేట్స్ వందమంది అడ్రస్సులూ, వాళ్ళ అభిప్రాయాలూ కావాలి. దీనికి నెల రోజులు టైమ్ ఇస్తున్నాను. డబ్బు అవసరం ఉందన్నారు కాబట్టి, ఈ పని చేస్తే మీకు బోనసుగా లక్ష రూపాయలు ఇస్తాం. అడ్వాన్సుగా ఇప్పుడే యాభై వేలు మీ ఎకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తాం. లేదూ, ఇలాంటి పనులు ఇష్టం లేదూ... డైరెక్టుగా ఉద్యోగంలో చేరిపోతానంటే మీ ఇష్టం. ఒక విషయం మాత్రం గుర్తు పెట్టుకోండి. మీరు ఈ పని చేసినా చేయకపోయినా మీ ఉద్యోగం ఖాయం" ఆమె చెబుతోంది.

పార్థసారథి తన చెవులని తానే నమ్మలేకపోయాడు. డబ్బు సాయం అంటే ఏదో అనుకున్నాడు. యాభైవేలు...!

"ఇదంతా నేను చేయగలనా మేడమ్?" అని అడిగాడు.

"చేస్తారనే నమ్మకం తోటే మిమ్మల్ని ఈ పనికి నియమిస్తున్నాం. ఇప్పుడు మీరు చేస్తున్న ఈ పనికీ, నెల రోజుల తర్వాత మీరు చేయబోయే ఉద్యోగానికీ ఏ సంబంధమూ లేదు. ఒక రకంగా చెప్పాలంటే ఇది నా పెర్సనల్ పని. మీకు ఇంకా ఏమైనా అనుమానాలు ఉంటే అడగండి"

పార్థసారథి కుర్చీలోంచి లేస్తూ "లేదు మేడమ్. థ్యాంక్యూ వెరీ మచ్" అన్నాడు.

"మీరు విద్యాధరి ఇంజినీరింగ్ కాలేజీకి వ్యతిరేకంగా ఈ సమాచారమంతా సేకరిస్తున్నారని ఇంకెవరికీ తెలియకూడదు."

"అర్థమైంది మేడమ్"

విజిటింగ్ కార్డ్ ఇస్తూ "ఏ విషయం నాతో చెప్పాలనుకున్నా ఫోన్ చేయండి. ఇది నా పర్సనల్ నెంబరు" అంది. అతడు కార్డు తీసుకుని బయటకు వెళ్ళబోయి ఆగాడు.

'ఏమిటన్నట్టు' చూసింది.

"ఇంతకాలం మేము రాష్ట్రంలోకెల్లా ప్రఖ్యాత కాలేజీలో చదువుకుంటున్నామని జబ్బలు చరుచుకున్నాము. ఉద్యోగాలు పోతే మా ఖర్మనుకుని ఏడ్చామే తప్ప ఈ మోసాన్ని తెలుసుకోలేక పోయాము. థ్యాంక్స్ మేడమ్" అని అక్కడ నుంచి కదిలాడు.

పొదుగాటి వరండాలు. పరిమళం నిండిన గాలి. నిశ్శబ్దంగా పని చేసుకునే వ్యక్తులు. అతడు ఆమె ఇచ్చిన విజిటింగ్ కార్డు చూశాడు.

'వేదరవళి. చక్రా గ్రూప్' అని ఉంది.

# 20

**"ఉద్యోగంలో** చేరిన పదిరోజులకే నీ ప్లానింగులో జోక్యం చేసుకుంటున్నా అనుకోకపోతే... ఆ ఇంజినీరింగ్ కాలేజి వ్యవహారం బయటపెట్టటం వల్ల మనకేమిటి లాభం?" అడిగాడు చక్రధరరావు.

"మనకో అన్యాయం జరిగింది. దానికి ప్రతీకారంగా మీసాలరాజానీ, అతని ముగ్గురు మిత్రబృందాన్నీ, ఆ టార్జాన్నీ... అందర్నీ... రౌడీలతో కొట్టించటం, గూండాలతో చంపించటం పెద్ద విషయం కాదు. నేరం బయటపడితే ఓ పదేళ్ళు మన జీవితంలో పోతుందనుకుంటే ఇప్పుడే ఆ పని చెయ్యొచ్చు. కానీ మన గోల్ అది కాదు. మిమ్మల్నీ, మీ కుటుంబాన్నీ, నన్నూ, ఇంత కష్టపెట్టిన వాళ్ళు ఏళ్ల తరబడి కుళ్ళికుళ్ళి చావాలి. అలా చావాలంటే, వాళ్ళ వెనుక ఉన్న మూలస్థంబం ఆంజనేయుల్నీ, చాణుక్యనీ బలహీనపరచాలి".

"పెద్ద పెద్ద కంపెనీ హెచ్.ఆర్.లని తమ కాలేజీకి రప్పించటానికి ప్రతీ ఇంజినీరింగ్ కాలేజీవారూ కాసింత 'ఖర్చు' పెడుతూనే ఉంటారు. ఆంజనేయులిది పెద్ద కాలేజి కాబట్టి,

ఇంటర్వ్యూలకి బదులు, డైరెక్టుగా ఉద్యోగాలకే గేలం వేసింది. ఇది బయట పెట్టి మనం ఏమి సాధిస్తాం?"

రవళి మాట్లాడలేదు.

"అపార్థం చేసుకోకు. నేను ఖర్చు గురించి మాట్లాడటం లేదు. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిదని అడుగుతున్నాను".

రవళి నవ్వి, "నేను ఈ కాలేజి వ్యవహారాలు సేకరిస్తూన్నది వాళ్ళని బెదిరించటానికీ, భయపెట్టటానికీ కాదు. ప్రెస్సుకి ఇవ్వటానికి అసలే కాదు" అన్నది.

చక్రధరరావు ఆశ్చర్యంగా, "మరి?" అని అడిగాడు.

"మరెందుకీ కంచి గరుడ సేవ అంటారా?"

అతను మాట్లాడలేదు.

"యుద్ధంలో పాటించవలసిన వ్యూహాల గురించి 'ఆర్ట్-ఆఫ్-వార్' లో అయిదు సూత్రాలు చెపుతాడు సర్. చదివి చదివీ కంఠంతా వచ్చాయి. ఒకటి- మిత్రుడు ఏం చేస్తున్నాడో పట్టించుకోక పోయినా పర్లేదు కానీ, శత్రువు ఏం చేస్తున్నాడో నిరంతరం గమనిస్తూ ఉండు..! రెండు-యుద్ధక్షేత్రం గురించి పరిచయం పెంచుకో. తెలిసిన ఇంట్లో నువ్వు కళ్ళు మూసుకుని తిరగ్గలవు. కొత్త ప్రదేశంలో దార్లు వెతుక్కుంటావు..! మూడు- రణస్థలాన్ని శత్రువు కన్నా ముందే వెళ్లి చూడు. ఎటు నుంచి వెళ్లి కొడితే శత్రువు తిరిగి లేవలేడో చెప్పే 'క్లూ' నీకు ఎక్కడో ఒక చోట, ఏదో ఒకటి లభిస్తుంది..! నాలుగు- బలహీనంగా ఉన్నప్పుడు బలంగా ఉన్నట్టు నటించు. బలంగా ఉన్నప్పుడు బలహీనంగా కనపడు..! అయిదోది అన్నిటికన్నా ముఖ్యమైనది. ఆయుధాల్నీ, ఆలోచనల్నీ మనసు చీకటి గదుల్లో పెట్టుకో. చుట్టూ నిశ్శబ్దాన్ని పేర్చుకో. ఆ నిశ్శబ్దపు చీకటి రెల్లుగడ్డిలో పాములా స్థబ్దంగా ఉండు. చీకటే కదా అని నీ ప్రత్యర్థి ఆదమరచి ఉన్నప్పుడు మెరుపులా వెళ్ళు. ఉరుములా ఘర్జించు. అవతలి మనిషి కళ్ళు బైర్లు కమ్మాలి. చెవులు దద్దరిల్లాలి. తేరుకునే లోపులో కొట్టు..!"

"ఇవన్నీ ఎప్పుడు చదివావు?"

"నాన్న కోమాలో ఉన్నప్పుడు పక్కన కూర్చుని చదివాను. ఎందుకు అని అడగండి"

చక్రధరరావు నవ్వి "ఎందుకు?" అని అడిగాడు.

"ఒక వ్యక్తి మన అప్పు ఎగ్గొట్టినప్పుడో, సాయం చేస్తానని డబ్బు తీసుకుని మోసం చేసినప్పుడో మనం ఏం చేస్తాం? వాడి పాపమే వాడిని నాశనం చేస్తుందని శాపనార్థాలు పెడతాం. మంచివాడికే కష్టాలు వస్తాయని మన చేతకానితనానికి మంచితనం ముసుగు వేసుకుంటాం. ఫాంటసీ ఆలోచనల్లోకి వెళ్లి మనం ఆ వ్యక్తిని ఓడించినట్టు, చేసిన ద్రోహానికి ఆవ్యక్తి పశ్చాత్తాపంతో మనల్ని క్షమాపణ వేడుకుంటున్నట్టూ ఊహించుకుని సంతృప్తి పడతాం. నా విషయంలో అదే జరిగింది. ఎక్కడో పల్లెటూర్లో పని చేసుకుంటున్న దాన్ని, హత్య

కేసులో ఇరికించారు. నా తండ్రి దానికి ఛిద్రం అయిపోయాడు. ఆ సమయంలో వాళ్ళని యుద్ధంలో ఓడించినట్టు ఊహించుకొనేదాన్ని. వ్యక్తిత్వ వికాస పుస్తకాలు చదివి విజయాన్ని ఊహించుకునే చాలామందిలా... ఆచరణ లేదు. కేవలం ఊహలే"

అర్థమైనట్టు ఆయన తలూపాడు.

"ఆ సమయంలో ఒక పుస్తకం చదివాను. విజయసాధానికి వంద గదులు ఉంటాయనీ, తలుపులు తట్టుకుంటూ వెళ్తే ఎక్కడో ఒకచోట ఏదో ఒక ద్వారం తెరుచుకుంటుందని ఆ రచయిత వ్రాశాడు. నిజమే అనుకుంటాను. చదువులో ఫెయిలయిన వ్యక్తి క్రికెట్టులో విజయం సాధించినట్టూ, ఆక్సిడెంటు వల్ల చదువు మానేసిన మీ అమ్మాయి పెయింటింగ్‌లో ప్రావీణ్యం సాధించినట్టూ, ఇలా ఎన్నో చెప్పొచ్చు. నా విషయంలోనూ అదే జరిగింది సర్. నాకు నా తండ్రి భగవద్గీత ఇచ్చాడు. ఒక ద్వారం తెరుచుకుంది. శత్రువుకు శత్రువైన మీరు పరిచయం అయ్యారు. మరో ద్వారం తెరుచుకుంది. మనం మన పని మనసుపెట్టి చేసుకుంటూ వెళ్తే ప్రకృతీ, పంచ భూతాలూ, దిక్పాలకులూ కూడా మనకి సాయం చేస్తారని మా తండ్రిగారు అనేవారు. విధి కూడా నాలిక్కర్చుకుని స్క్రీన్-ప్లే మారుస్తుందట"

"స్క్రీన్-ప్లే అంటే..?"

వాక్ప్రవాహానికి అడ్డుపడినట్టు, "ఓహ్... ఏదో ఫ్లో లో చెప్పేశాను. నాకూ తెలీదు. ఏదో సినిమాలో 'స్కెచ్' వేశానంటాడు విలన్. అలా అన్నమాట"

"ఇంతకీ నా అనుమానం తీరనేలేదు"

ఆమె నవ్వి "ఏది? ఆ ఇంజనీరింగ్ కాలేజి గురించేనా? చెప్పానుగా. అన్ని తాలుపులూ తట్టుకుంటూ వెళ్తే, ఎక్కడో ఏదో తెరుచుకోవచ్చని. అందులో ఒక ద్వారం పార్థసారథి. అన్నట్టు మీకు చెప్పలేదు. అతడికిచ్చిన నెలరోజుల జీతం డబ్బు కంపెనీది కాదు. నా జీతంలో అడ్వాన్సు"

చక్రధరరావు విస్మయంగా, "అదేమిటి? ఈ వ్యవహారంలో నీదీ నాదీ ఏమిటి? మన ఇద్దరి టార్గెట్ ఒకటే కదా" అన్నాడు.

"మాక్రో లెవల్లో ఒకటే అయ్యుండవచ్చు. మైక్రో లెవల్లో కాదు. మీ శత్రువు మీసాల్రాజా. నా శత్రువు చాణుక్య."

"ఏది ఏమైనా నాకిది నచ్చలేదు. నీకు డబ్బు అవసరం ఉంది. నువ్వు ఖర్చు పెట్టటమేమిటి"

"వ్యాపారం వ్యాపారమే రావుగారూ. మీకు నేను కొత్తగా చెప్పేది ఏముంది? భాగస్వామ్యంలో దిగేటప్పుడు అన్నీ చూసుకునేగా పార్టనర్ని కలుపుకుంటాం. దానికి కాస్త పరీక్ష అవసరం కూడా. మీరు కూడా అలాంటి పరీక్ష పెట్టిన తరువాతే కదా నన్ను ఉద్యోగంలో చేర్చుకున్నది."

"ఉద్యోగానికి ఇంటర్వ్యూ పరీక్ష తప్పదు కదా"

"నేను చెపుతున్నది ఆ ఇంటర్వ్యూ గురించి కాదు. ఉద్యోగం ఇచ్చిన తరువాత పెట్టిన పరీక్ష గురించి"

"ఉద్యోగం తరువాత పరీక్ష ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీ దగ్గర ఉద్యోగంలో చేరటానికి ముందు నాతో కాంట్రాక్టు సంతకం పెట్టించుకున్నారు గుర్తుందా?"

"మూడు సంవత్సరాలు పని చెయ్యాలని ముందే చెప్పాను కదమ్మా"

"నేను చెపుతున్నది ఆ విషయం కాదు సార్. అలా సంతకం పెట్టటానికి అరగంట ముందు నాకు ఒక ఫోన్ వచ్చింది. మీ పోటీదారు ఫోన్ చేసి, మిమ్మల్ని వదిలేసి తన కంపెనీలో చేరితే ఇంకా ఎక్కువ జీతం ఇస్తానన్నారు. నేను వెళ్ళలేదనుకోండి. అది వేరే సంగతి"

"ఇంత జరిగిందా? నాకు తెలీదు. మరి ఇదంతా నాకు ఎందుకు చెప్పలేదు?"

"ఎందుకు చెప్పటం? మీరే కదా ఆ ఫోన్ చేయించింది"

రావు నిశ్చేష్టుడై చూశాడు.

"అయినా అందులో తప్పేం ఉంది. నేను వెళ్తానా లేదా? నమ్మకంగా ఉంటానా? అని ఒక 'ఎర' వేసి చూశారు. మామూలుగా అయితే వెళ్ళిపోయేదాన్నే. కానీ నా టార్గెట్ మీ సాయంతో ఆ చాణుక్య...""

"అదంతా వద్దు. నీకు ఫోన్ చేసింది మేమే అన్న విషయం నీకెలా తెలిసింది? ఆ విషయం చెప్పు".

"ఎందుకు? అతడి మీద చర్య తీసుకోవటానికా?"

"తీసుకోను. చెప్పు"

"ప్రామిస్?"

"నువ్వు నా ఓర్పుని పరీక్షిస్తున్నావ్. నా సంస్థలో పని చేస్తూ ఈ విషయం బయట పెట్టినవారు ఎవరు?" కోపంగా అన్నాడు.

"అశోక్"

ఆయన మొహం పాలిపోయింది. "అశోకా" అన్నాడు నమ్మలేనట్టు.

"ముందీ విషయం చెప్పండి. నాకు ఫోన్ చేసింది మీవాళ్ళా కాదా?"

"అవును. కానీ అశోక్ కాదు"

"అవును. అశోక్ కాదు"

"మరి అశోక్ అన్నావ్?"

"మీతో నిజం వప్పించటానికి అన్నాను. "

ఆయన తెల్లబోయాడు. రవళి నవ్వేసి, "నేను మీ దగ్గర నమ్మకంగా ఉంటానా లేదా అని అప్పుడు మీరు నన్ను టెస్ట్ చేశారు. అలా టెస్ట్ చేసింది మీరా కాదా అని తెలుసుకోవటం గురించి ఇప్పుడు నేను చీకట్లో రాయి వేశాను. ఇక ఈ విషయం వదిలేసేయ్యండి సార్. అయినా మన టాపిక్ అది కాదు. నమ్మకం గురించి..! నా మీద నమ్మకం పెట్టుకోండి. వాళ్ళపై పగ తీర్చుకోవాలన్నంత కోపం, కసి, కాళ్ళు పోగొట్టుకున్న మీకు లేదు కానీ, కళ్ళు పోగొట్టుకున్న మీ అమ్మాయికి ఉంది. తన కోసమన్నా మీరు నాకు సాయం చెయ్యాలి"

రావు రిలాక్సింగ్‌గా నవ్వేడు. "నన్నే బుట్టలో పడేసిన నువ్వు ఏమైనా చెయ్యగలవు. అది సరే గానీ ఆ ఇంజినీరింగ్ కాలేజికీ, చాణుక్యకీ సంబంధం ఏమిటి?" అన్నాడు.

"ఇక ఆ టాపిక్ వదిలిపెట్టరా? సరే. చెప్తా వినండి. నా గోల్ ఆ ఇంజనీరింగ్ కాలేజి కాదు. పార్థసారథి"

చేతిలో కళ్ళద్దాలు చపున జారిపోకుండా పట్టుకుని. "షాకుల మీద షాకులు ఇస్తున్నావు. ఈ పార్థసారథికీ మనకీ ఏమిటి సంబంధం? ఎవరీ పార్థసారథి?" అని అడిగాడు

"సుమద్యుతిని ప్రేమిస్తున్నవాడు. ఏ కుర్రాడి కోసమైతే సుమద్యుతి ప్రాణాలు ఇవ్వటానికి కూడా సిద్ధంగా ఉన్నదో ఆ కుర్రాడు. "

"పిల్లి అంటే మార్జాలం అన్నట్టు ఉంది. సుమద్యుతి ఎవరు?"

"ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు చాణుక్య కూతురు"

# 21

**పార్థసారథి** ఆమె వైపు టెన్షనుతో చూస్తున్నాడు. రవళి లిస్టు పరిశీలించి, 'గుడ్ వర్క్' అంది. అతడి మొహం విప్పారింది. "థ్యాంక్స్ మేడమ్ ' అన్నాడు.

"గత నాలుగు సంవత్సరాల్లో పన్నెండు వందలమందికి ఉద్యోగాలు వచ్చాయి. సంవత్సరం అయ్యాక అందులో వెయ్యిమందికి ఉద్వాసన పలికారు. ఆ స్థానాలని తరువాతి బ్యాచ్ స్టూడెంట్సుతో భర్తీ చేశారు. ప్రతీ సంవత్సరం దాదాపు ఇలాగే జరుగుతోంది. గుడ్"

"ఇవి నాకు దొరికిన పేర్లు మేడమ్. ఇంకా ఉండొచ్చు. వెతకటానికి కొన్ని రోజులు పడుతుంది."

"అవసరం లేదు. ఈ లిస్టు చాలు. ఇంకో పని చెయ్యాలి. వీళ్ళకి ఉద్యోగాలిచ్చిన ఈ అయిదు కంపెనీలకీ గత కొన్ని సంవత్సరాల్లో, అంటే ఆంజనేయులు ముఖ్యమంత్రి అయ్యాక... ప్రభుత్వం ఏం సాయం చేసింది, ఏమేమి సదుపాయాలు కల్పించిందీ... ఆ వివరాలు కావాలి. ఈ మిగిలిన ఇరవై రోజులలో నువ్వు ఆ పని చెయ్యాలి"

"అదెలా సాధ్యం? ఎవరు చెపుతారు?"

"ప్రతిపక్ష నాయకుడిని స్వయంగా కలుసుకునే ఏర్పాటు మేము చేస్తాము. వెళ్లి ఈ విషయం చెప్పు. ఎగిరి గంతేసి నీకు అఫీషియల్‌గా ఆ వివరాలిస్తారు. మరోపక్క సి-గ్రేడు పత్రికలుంటాయి. వాళ్ళిచ్చే ఇన్ఫర్మేషనులో సగం అబద్ధాలు ఉంటాయి. పర్లేదు. తీసుకో. డబ్బుకి చూసుకోకు".

"తప్పకుండా మేడమ్"

ఆమె టాపిక్ మారుస్తూ, "ఇంకా నీ హాబీస్ ఏమిటి? చదువు తప్ప మరేమీ లేదా?" అదిగింది.

అతడు క్షణం ఆగి, "ఎప్పటికైనా ఒక సినిమా డైరెక్షన్ చెయ్యాలని కోరిక మేడమ్" అన్నాడు.

అంతకు ముందే చక్రధరరావుతో జరిగిన సంభాషణ గుర్తొచ్చి, "నాకెప్పటి నుంచో అనుమానం సారథీ. కథకీ, స్క్రీన్-ప్లేకీ తేడా ఏమిటి?" అని అడిగింది.

ఉత్సాహమున్న టాపిక్ వచ్చేసరికి అతను హుషారుగా మొదలుపెట్టాడు. "ముందొక కథ అనుకుంటారు మాడం. 'రాముడూ సీతా వనవాసం. రావణాసురుడు సీతని ఎత్తుకెళ్ళాడు. అతడిని చంపి రాముడు భార్యని తెచ్చుకున్నాడు' అంటూ ఓ కథ ఇస్తాడు రచయత".

"వాల్మీకో... విశ్వనాథ సత్యనారాయణగారో"

"డైరెక్టరు విశ్వనాథ్ తెలుసు. వాల్మీకీ, సత్యనారాయణలు ఎవరు?"

"మోడరన్ దర్శకుడివి కదా. తెలియకపోయినా పర్వాలేదులే. చెప్పు చెప్పు. కథకుడి పని అంత ఈజీ అన్నమాట"

"కాదండీ. అతడిదే ఎక్కువ కష్టం. మహేష్‌బాబుని 'కాస్త నటించి చూపించు. నచ్చితే తీసుకుంటాం' అనరు. ఇళయరాజాని 'ట్యూన్లు వినిపించు. బావుంటే పెట్టుకుంటాం' అని అడగరు. రచయితని మాత్రం 'కథ చెప్పు. నచ్చితే తీసుకుంటాం' అంటారు. పిల్లి పిల్లల్ని పట్టుకుని తిరిగినట్టు, స్క్రిప్టు చంకన పెట్టుకుని రచయిత ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటాడు. కథ తయారు చెయ్యటం కన్నా దర్శక, నిర్మాతలనీ, కోటరీ సమేత హీరో హీరోయిన్లని వప్పించటం కష్టం"

"కోటరీ సమేత హీరో?" అర్థం కానట్టు అడిగింది.

"హీరో స్నేహితులూ, హీరోయిన్ మదరూ"

"సర్లే. సర్లే. కథ ఓ.కే అయిన తరువాత?"

"ఇది చూడండి. బావుంటుంది" అంటూ ఫోనులో రికార్డు చేసుకున్న ఒక దర్శకుడి ఇంటర్వ్యూ చూపించాడు. సినిమాల పట్ల అతడి పాషన్ చూస్తే రవళికి ముచ్చటేసింది. ఫోన్ చేతుల్లోకి తీసుకుంది.

"తన ఆలోచనలను 'తనతో' చెప్పుకోవటం కోసం, దర్శకుడి ప్రయాణం స్క్రీన్-ప్లే రచయితతో మొదలవుతుంది. నిజానికి ఇద్దరూ ఒకరే. కొట్టుకుంటారు. తిట్టుకుంటారు. గొప్ప సృష్టికి నాంది పలుకుతారు. దర్శకులు, ముఖ్యంగా కొత్తవారు ఎన్నో సంవత్సరాలుగా బుర్రలో పేరుకుపోయిన ఆలోచనలూ, విదేశీ సినిమాల్లో సీన్లూ. తన తొలి చిత్రంలోనే పెట్టెయ్యాలని ప్రజ్వలించి పోతూ ఉంటారు. వారి ఉబలాటాన్ని స్క్రీన్-ప్లే రైటరు తగ్గిస్తాడు. దర్శకులు మూడు రకాలు. హాట్ దర్శకులు. సంసార దర్శకులు. సాంప్రదాయ వ్యభిచార దర్శకులు. సాంప్రదాయ వ్యభిచార దర్శకుడంటే హీరోయిన్ స్నానం చేస్తూంటే బ్యాక్ గ్రౌండులో వేద మంత్రాలు వేసేవాడు".

సారథి ఇబ్బంది పడి ఆపుచేశాడు.

"ఇంతకీ నా అనుమానం అలాగే ఉంది. కథకీ స్క్రీన్-ప్లే కి తేడా ఏమిటి?" అడిగింది.

"ఏ సీను తర్వాత ఏది? అనేదాన్ని 'సీన్-ఆర్డర్' అంటారు మేడమ్. అది అయ్యాక స్క్రీన్-ప్లే. సినిమా గ్రాఫు సరీగ్గా ఉందా? ఇంటర్వెల్ ఎక్కడ? ఏ సీను ఎంత ఉండాలి? అలా ముందే అనుకుంటే, సినిమా తీశాక మూడొంతులు కట్ చెయ్యటం ఉండదు. నిర్మాతకి కొన్ని కోట్లు సేవ్ అవుతుంది. దశరథుడు రాముడిని వనవాసానికి వెళ్ళమని చెప్పే సీను చిన్నది చేసి, రావణుడు-జటాయువు మధ్య 'ఫైట్' బావుంటుందా? యుద్ధం గ్రాఫిక్సుకి నిర్మాత దగ్గర బడ్జెట్ ఉన్నదా? అనేది స్క్రీన్-ప్లే రచయిత, దర్శకుడు కలిసి నిర్ణయిస్తారు. దశరథుడు ఒక్కడే రాముడి మందిరానికి వెళ్తే ఇద్దరి మధ్యా హై వోల్టేజ్ డ్రామా బావుంటుందా? లేక తన అంతఃపురానికి పిలిపించుకుని అటు కైక, ఇటు కౌసల్య, తెర వెనుక మంధర, రాముడి పక్క సీత... అలా గ్రాండియర్‌గా పదిమంది అర్టిస్టులని పెట్టి తీస్తే బావుంటుందా? కైకా, కౌసల్యా మాటల యుద్ధంతో క్లాప్స్ పడతాయా? లేక దశరథుడి సోలో ఏడుపు బావుంటుందా? దశరథుడి వేషం వేసే మనిషి ఆ సీను భుజాల మీద వేసుకుని మోయగలడా? ఆ ఏడుపు చూసి ఈ సినిమాకి ఎందుకొచ్చామా అని ప్రేక్షకులు దుఃఖిస్తారా? ఇవన్నీ నిర్ణయించేదే స్క్రీన్-ప్లే".

"ఫిలిమ్ మేకింగ్ పుస్తకాలు చాలా చదువుతావనుకుంటానే" నవ్వుతూ అన్నది రవళి.

సిగ్గుపడి, "సారీ మేడమ్. ఏదో అలా వచ్చేసింది. సినిమా నాకు పాషన్" అన్నాడు.

"నీకో మాట చెప్పనా? ఆ దర్శకుడి ఇంటర్వ్యూ కన్నా నువ్వు చెప్పిందే బావుంది. నిజంగా నువ్వు మంచి రచయితవో, దర్శకుడివో అవుతావు సారథీ. ష్యూర్" అంది.

అతడి కళ్ళలో తడి స్పష్టంగా కనిపించింది.

"నేను చనువుగా 'నువ్వు' అని పిలుస్తున్నాను. నువ్వేమో 'మేడమ్' అంటున్నావు. మానేసి 'అక్కా' అను. చాలు. నాకూ తమ్ముళ్ళు లేరు".

అతడు కొంచెం తటపటాయించి, "సరే మాడ... సారీ... అక్కా" అన్నాడు.

ఆమె నవ్వేసి అతడికి ఒక కవరు అందచేసింది. ఆశ్చర్యంగా "ఏమిటి?' అన్నాడు.

"చక్రా గ్రూపుకి దేశమంతా హోటల్స్ ఉన్నాయి. మన ఊళ్ళో ఉన్నది ప్రశాంతి హైట్సు. అక్కడ మూన్ లైట్ డిన్నరుకి ఫ్రీగా ఇద్దరు వెళ్ళవచ్చు. నువ్వు చేసిన వర్కుకి గిఫ్ట్. ఐ మీన్ గిఫ్ట్ వోచరు. కాక్టయిల్స్ కూడా తీసుకోండి. డ్రింక్ చేస్తావా?"

"లేదు మేడమ్"

"అబద్ధాలు చెప్పకు. మొగ పిల్లలు పుడతారు. నీ గర్ల్-ఫ్రెండ్‌ని తీసుకు వెళ్ళు. 'ఎవరూ లేరు మేడమ్' అని అమాయకత్వం నటించకు. పిల్లలు అసలు పుట్టరు. అన్నట్టు రేపు బోర్డు మీటింగ్ అక్కడేగా. నేనూ అక్కడే ఉంటాను. కలుస్తాను. నీ సెలెక్షన్ చూస్తాను. ఐ మీన్ గర్ల్ ఫ్రెండ్ సెలెక్షన్. ప్రశాంతి హైట్స్. ఏడింటికి".

అతడు వెళ్లి పోయాడు. ఆమె అటే చూస్తూ, "...నా కథకి నిర్మాత చక్రధరరావు, ఇప్పటి వరకూ నటులు పార్థసారథి, కానిస్టేబుల్ బాలారిష్ట, సారమ్మ, ఇక కొత్తగా పరిచయం కాబోయే పాత్ర... రాత్రికి రోజా కాక్టెయిల్ సరోజ. పోతే... దర్శకత్వం మొత్తం నేనే చెయ్యాలేమో అనుకున్నాను. స్క్రీన్-ప్లే కి స్నేహితుడు 'సత్య' సాయం కూడా తీసుకోవచ్చని అర్థమయింది" అనుకుంది.

# 22

**ఆ రోజు** సాయంత్రం మీసాల్రాజాకి ఒక ఫోన్ వచ్చింది.

"ఎవరూ?" అన్నాడు.

"కాక్టెయిల్ సరోజ" అన్నది అట్నుంచి ఓ అమ్మాయి.

"కాక్టెయిల్ ఏమిటి? సరీగ్గా చెప్పు"

"చాలాకాలం క్రితం మీ గెస్ట్-హవుసులో కలుసుకున్నాం. ఆరూ తొమ్మిదీ, ఏడూ ఏడూ కాకుండా 6 కొత్త ఆంగిల్స్ చెప్పాను. అప్పుడే కాక్టెయిల్ అని నాకు పేరు పెట్టావ్. మర్చిపోయావా?"

మీసాల్రాజా హుషారుగా "గుర్తొచ్చింది" అన్నాడు. నిజానికి గుర్తు రాలేదు కానీ అటువంటి సందర్భంలో అబద్ధాలు ఆడటం, యవ్వనపు తొలిదశలోనే కుర్రాళ్ళకి వచ్చే సహజమైన తెలివి. అయితే అతడు చీకట్లో వేసిన బాణం గురికి సరిగ్గా తగల్లేదు. ఎందుకంటే అసలామె ఇంతవరకూ అతన్ని చూడలేదు. తాను చెప్పిన 'అబద్ధాన్ని' అతడు అంత నిజాయితీగా సపోర్ట్ చేసినందుకు నవ్వుకుంది.

"ఏమిటింత కాలానికి ఫోన్ చేశావ్? విషయం చెప్పు" అన్నాడు.

"చూడాలని ఉంది" గారంగా అన్నది.

"ఓ. గెస్టు హవుసుకి వచ్చేయ్యి. ఇప్పుడే"

"కాదులే. ముందు బయట కలుద్దాం. ఈ మధ్య కాస్త లావయ్యాను. నచ్చితే ఆ తర్వాత అక్కడ కలుద్దాం. ముందు ఎక్కడ కలుద్దామో చెప్పు"

"చెప్పు... నువ్ చెప్పాలే గానీ బాలా, వోలా లో నే వచ్చి వాలా" అన్నాడు.

"ఏమిటి. కవిత్వం లక్షణాలు కూడానా. సర్లే. రేపు రాత్రి తొమ్మిదింటికి ప్రశాంతి హైట్సుకి రా. కానీ నన్ను గుర్తుపట్టకపోతే మాత్రం అంతే సంగతులు" అంటూ అతడు ఏదో అనబోతూ ఉండగా ఫోన్ పెట్టేసింది. ఆమె పేరు సరోజ. ఆమెని అందరూ రాత్రికి రోజా సరోజ అంటారు.

తరువాత రవళికి ఫోన్ చేసి, "వాడికి చేశా మేడమ్. రేపు అక్కడికి వస్తాడు" అంది.

"ఏమంటున్నాడు?"

"నేను తెలిసినట్టే మాట్లాడాడు. ఈ క్షణవేఁ హోటలుకెళ్లి కూర్చునేటంత ఆత్రంగా ఉన్నాడు"

"థ్యాంక్స్. ఎల్లుండి వరకూ ఆ సిమ్ కార్డు ఉంచు. వాడితో ఇంకొక్కసారి మాట్లాడ వలసి ఉంటుంది"

"అలాగేనండీ. ఏదో పెళ్ళికి వెళ్లి అక్కడ ఆక్ట్ చెయ్యాలన్నారు?"

"ఇప్పుడు కాదు. ఇంకా టైము ఉంది. చెపుతాను. ఈ రోజే నీ అకౌంటుకి ఐదువేలు ట్రాన్స్‌ఫర్ అయింది. బై" అంటూ ఫోను పెట్టేసింది రవళి.

* * *

ప్రశాంతి హైట్సు. రెస్టారెంట్ మొత్తం జనంతో నిండిపోయి ఉంది. దూరం నుంచి మంద్రమైన మ్యూజిక్ వినపడుతోంది. సారథి, సుమద్యుతి ఒక మూలగా కూర్చుని ఉన్నారు.

'హాయ్' అంటూ టేబిల్ దగ్గరకు వచ్చింది రవళి. సారథి ఎగ్జయిటింగ్‌గా లేచి పక్కన అమ్మాయితో, "మా కంపెనీ వైస్-ప్రెసిడెంట్ మరియు సెక్రెటరీ" అంటూ ఇంగ్లీషులో పరిచయం చేశాడు. లేవబోతూన్న అమ్మాయిని కూర్చోమని చెప్పి, "నీ పేరు సుమద్యుతి కదూ" అంది.

"నాపేరు మీకెలా తెలిసింది?" ఆశ్చర్యంగా అడిగింది ఆ అమ్మాయి.

"మీ తండ్రిగారు ముఖ్యమంత్రికి దగ్గర. ఆ సందర్భంగా ఒకసారి మీ ఇంటికి వచ్చాను. ఆయనకి గుర్తు కూడా ఉండకపోవచ్చు. పోతే, నీకు మూడు విషయాలు చెప్పాలి. సుమం అంటే పువ్వు. ద్యుతి అంటే వెలుగు. పుష్పానికి పరిమళం ఎలాగూ ఉంటుంది. దానికి వెలుగు కూడా కలిపి పేరు పెట్టటంలోనే నీ తండ్రి పాండిత్యమూ, నీ పట్ల ఇష్టమూ బయట పడుతోంది. రెండోది నీకు కూడా తెలియనిది, నీ పేరు పై 'సుమద్యుతి' అన్న ఒక రాగం కూడా ఉన్నది. వేంకటమఖి సంప్రదాయంలో సింహేంద్ర మధ్యమ రాగనామం".

ఇద్దరు శ్రోతలూ దిగ్భ్రాంతులై చూశారు.

సుమకి రవళి అంటే మొదటి నిముషంలోనే అవ్యాజ్యమైన గౌరవంతో కూడిన అభిమానం ఏర్పడిపోయింది. పోతే వాళ్ళకి తెలియనిదల్లా, సుమని ఇంప్రెస్ చెయ్యటానికి రవళి గతరాత్రి ఇంట్లో చాలా హోంవర్క్ చేసిందని..! దానికి కారణం ఆమె ఒక్కదానికే తెలుసు. ఒక మనిషికి షాక్ ట్రీట్-మెంట్ ఇవ్వాలంటే, ముందు ఇంప్రెస్ చెయ్యాలి. లేదంటే చికిత్సకి వప్పుకోరు.

"ఇక మూడో పాయింటు, సారథిని అన్నట్టే నిన్ను కూడా 'నువ్వు' అంటాను. ఏమీ అనుకోకూడదు".

సుమ నొచ్చుకుంటూ, "అయ్యో ఎంత మాట..." అంది.

ఆమె మాటలు పూర్తికాకుండా "తీసుకో... జిన్ అనుకుంటున్నాను. మొహమాట పడకు" అని, ఆ అమ్మాయి గ్లాసు సిప్ చేశాక, "ఏ కాలేజి?" తెలియనట్టు అడిగింది.

"విద్యాధరి"

"ఓ. క్లాస్‌మేట్సా?"

ఇద్దరూ తలూపారు.

"ఉద్యోగం చెయ్యటం లేదా?"

"నాన్నగారివి పాతకాలపు ఆలోచనలు. 'ఉద్యోగం చేసి ఊళ్లు ఏలాలా? కోట్లు సంపాదించాలా? పెళ్ళయ్యాక నీ ఇష్టం. అప్పటి వరకూ ఇంట్లో ఉండు' అన్నారు" అన్నది సుమ గిల్టీగా.

"పాతకాలం ఆలోచన అని ఎందుకనుకోవాలి? 'ఉండేదే కొద్ది కాలం. మా కళ్ళ ముందు ఉండు- తరువాత మీ ఇద్దరి ఇష్టం' అన్నది ఆయన భావం అయ్యుండవచ్చుగా" అంది. సుమ సంభ్రమంగా చూసింది. రవళిమాట మారుస్తూ, "మీరిద్దరూ తలమునకలయ్యే ప్రేమలో ఉన్నారని మీ బాడీ లాంగ్వేజ్ చూస్తేనే తెలుస్తోంది. ఎన్నో సంవత్సరంలో ప్రేమలో పడ్డారు?" అని అడిగింది.

సారథి కాస్త సిగ్గుగా "మొదటి సంవత్సరమే" అన్నాడు.

"డైరెక్టుగా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి. మీరు ప్రేమించుకుంటున్నది థ్రిల్ కోసమా? పెళ్లి కోసమా?".

సుమద్యుతి మొహం ఎర్రగా అయింది. "నాకు అలాంటివి నచ్చవు" అంది కటువుగా.

"ఏది? థ్రిల్లా? పెళ్ళా?"

"పెళ్లి లేకుండా ప్రేమ"

"మరి ఆ విషయం నీ బాయ్-ఫ్రెండ్ తన ఇంట్లో ఎందుకు చెప్పడు? ఉద్యోగం వచ్చే వరకూ ఆగి, 'పెళ్లికి ఒప్పుకోక పోయినట్లయితే ఇంట్లోంచి వెళ్ళిపోతా' అంటూ తల్లిదండ్రుల్ని

బ్లాక్ మెయిల్ చెయ్యటం తప్పుకదా? తల్లిదండ్రులను ఆ విధంగా వదిలెయ్య గలిగినవాడు, రేపు ఇంకా మంచి అమ్మాయి కనపడితే నీకు అన్యాయం చేయడని గ్యారంటీ ఏమిటి?"

సారథి మొహం జేవురించింది. "ఇంట్లో చెప్పాను. వప్పుకున్నారు" అన్నాడు కోపంగా.

అతడి మాటలు పట్టించుకోకుండా ఆమె సుమతో "కొంతకాలం పోయాక నువ్వంటే ఇంటరెస్టు తగ్గిపోవటం చేతనో, లేదా నీకన్నా అందమయిన అమ్మాయి కనపడితేనో, లేక మరింత కట్నం కారణంగానో అతను మొహం చాటేస్తే, ఆ తరువాత పరిణామాలు ఆలోచించావా?" అని అడిగింది.

తను చాలా హార్ష్ గా మాట్లాడుతున్నానని తెలుసు. కానీ ఎమోషనల్‌గా ఛార్జ్ చెయ్యకపోతే తాను అనుకున్న పని అవదు. ఎదురుగా ఉన్న ప్లేటు చూపిస్తూ "నీ బాయ్‌ఫ్రెండ్ ఎదురుగా చికెన్ ముక్కలున్నాయి. నీది పదహారణాల శాకాహారం. నీ తల్లి ఆత్మహత్య చేసుకుంటాననో, నీ తండ్రి నీ బాయ్‌ఫ్రెండ్‌ని కాల్చి చంపేస్తాననో బెదిరించటం వల్లనో ఈ పెళ్లి జరక్కపోతే నష్టపోయేది ఎవరు? నువ్వా? అతనా?" అన్నది.

సుమద్యుతి మొహం వాడిపోయింది. సారథి కోపంగా "అలా జరగదు" అన్నాడు. ఆ సంభాషణ ఎటు వెళ్ళేదో కానీ, సరీగ్గా ఆ సమయానికి మీసాల్రాజా రెస్టారెంట్ లోపలికి ప్రవేశించాడు.

అతడు రావటం ఓరకంట చూసి, రవళి సంభాషణ కొనసాగించింది. "బాయ్-ఫ్రెండ్‌తో కలిసి మందు కొడుతూన్న నీ ఫోటో ఎవడో తీసి, రేపు పెళ్ళయ్యాక 'పదిలక్షలు ఇస్తావా? మీ ఆయనకి ఫోటో పంపనా?' అని బ్లాక్ మెయిల్ చేశాడనుకో. నీ కొత్తమొగుడు అనుమానం మనిషయితే?"



సారథి పిడికిలి బిగించి టేబిల్ మీద బలంగా కొడుతూ "దిస్ ఈజ్ టూ మచ్... " అని ఏదో అనబోతూ ఉంటే, సుమ అతడిని వారిస్తూ, "ఆమె కరెక్టుగానే చెపుతున్నారుగా" అంది విసుగ్గా.

'థ్యాంక్యు' అని ఆమెతో అని, సారథి వైపు తిరిగి "ఒక్క మాటకే నువ్వు ఇంత ఇరిటేట్ అవుతున్నావు. రేపు ఈ విషయం బయటికొస్తే అమ్మాయిని లోకం ఎన్ని మాటలంటుందో ఆలోచించు. మొగుడి పాత గర్ల్-ఫ్రెండ్స్ గురించి అమ్మాయిలు పట్టించుకోరు కానీ, అబ్బాయిలు మాత్రం 'తమకెన్ని మరకలున్నా పర్వాలేదు. వచ్చే అమ్మాయి మాత్రం స్వచ్ఛంగా ఉండాలి' అని కోరుకుంటారు. నేను చెపుతున్నది ఒకటే. ఆరు సంవత్సరాల నుంచీ మీరు మీ ప్రేమ దాచి ఇలా బయట తిరుగుతున్నారు. ఈలోపులో ఎవరైనా..." అంటూ ఉండగా, 'హలో' అని వినిపించింది. అందరూ అటు చూశారు.

"హాయ్ సుమా" అన్నాడు మీసాల్రాజా. అతడిని ఆ సమయంలో చూడగానే సుమ మొహం రక్తం ఇంకినట్టు వివర్ణమైంది. క్షణం క్రితం రవళి చెప్పిన బ్లాక్ మెయిల్ వ్యవహారం గుర్తు వచ్చింది. సంబంధం లేదు గానీ ఏదో తెలియని ఇబ్బంది. సర్దుకుని, "గుడ్ ఈవెనింగ్. ఈమె రవళి. చక్రా గ్రూప్ సెక్రెటరీ. ఈయన సారథి. అదే కంపెనీలోనే పని చేస్తున్నారు" అని పరిచయం చేసింది. మీసాల్రాజా అంత ఇంటరెస్టు చూపకుండా, "తరువాత కలుద్దాం" అని కాక్టెయిల్ సరోజ కోసం వెతుకుతూ వెళ్ళిపోయాడు.

"ఎవరు?"

"మీసాల్రాజా అని, నాన్నగారికి తెలుసు"

రవళి నవ్వింది. "చూశావా. సారథి నీ స్నేహితుడని పరిచయం చెయ్యకుండా, మేమిద్దరం ఒకే ఆఫీసులో పని చేస్తున్నట్టు చెప్పావ్. ఇలా ఎంతకాలం ఆత్మవంచన చేసుకుంటూ బ్రతుకుతారు?" అంది. ఇద్దరి మొహాలూ వాడిపోయాయి. ఆమె చెపుతున్నది నిజమే అన్నట్టు మౌనంగా ఉండిపోయారు.

"వెళ్లి మీ ప్రేమ వ్యవహారం నాన్నగారికి చెప్పి ఆయన ఏమంటారో చూడు".

"వళ్ళు చీరేస్తారు"

"మరి ఆవిషయం తెలిసీ ఎందుకు ప్రేమించావు?"

"ఒకరి మీద అభిమానం కలిగేటప్పుడు ఇన్ని లెక్కలు ఉండవు" అన్నది.

"ప్రేమికులు చెప్పే మొదటి మాట అది"

"సారథి నన్ను బాగా చూసుకుంటాడు"

"అది రెండో మాట".

"నాకు అమ్మా, నాన్నా, సారథీ... అందరూ కావాలి".

"అది మూడో మాట. "

"ఇప్పుడేం చెయ్యాలి?"

"అది చివరి ప్రశ్న"

ఇద్దరూ బేలగా చూశారు.

"పరుగెత్తి పాలు తాగటంకన్నా నిలబడి నీళ్ళు తాగటం మంచిదని ఒకవైపు, ఆలస్యం అమృతం విషమని మరోవైపూ అంటారు. చేతిలో ఉన్నది పాలగ్లాసు అని నమ్మకం ఉన్నప్పుడు, పరుగెత్తటం కన్నా నిలబడే పాలు తాగొచ్చుగా. అన్ని సమస్యలకీ మూలకారణం 'ఛాయిస్ ఎన్నుకోలేకపోవటమే' అంటారు కొందరు. కాదు. వేరే ఛాయిస్సులు లేని సమస్యలకి కూడా మనం బుర్ర బ్రద్దలు కొట్టుకుంటాం."

ఆమె సమస్యని చర్చించే విధానానికి వారు మౌన శ్రోతలై వింటూండగా చెప్పింది. "మీ ప్రేమ విషయం తెలియగానే మీ నాన్న గుండె ఆగిపోతుంది. నీ మనసు కరిగిపోతుంది. 'వద్దులే సారథీ. నన్ను మర్చిపో' అంటావు"

"ప్రాణం పోయినా అనను" పళ్ళు బిగించి అన్నది సుమ.

"సరే. అనవనుకో. మీ ఇద్దరినీ హోటల్లో డ్రింక్ చేస్తూ ఉండగా చూశానంటాడు మీసాల్రాజా. మీ నాన్న కట్టడిలో పెడతారు. అయినా కలుసుకుంటూ ఉన్నారనుకో. సారథి ప్రాణాలకి ప్రమాదం"

సుమ భీతహరిణేక్షణ అయింది. సారథి చేతుల మధ్య ఆమె చెయ్యి వణికింది. "మీరు చెపుతూ ఉంటే అంతా నిజమే కదా అనిపిస్తోంది. ఇప్పుడేమి చేయాలి?" అంది.

"దీనికి ఒకటే మార్గం. మీ ఇద్దరూ వెంటనే వివాహం చేసుకోవటం."

ఇద్దరూ మొహాలు చూసుకున్నారు.

"అవును. పెళ్లి జరిగిందని తెలియగానే మీ నాన్న ఆవేశంతో రగిలిపోతాడు. ఎదురుగా ఉంటే చంపేస్తాడు కూడా"

"మరెలా?"

"పది రోజుల పాటూ కనిపించకుండా పోతే, కోపం తగ్గి టెన్షన్ పెరుగుతుంది. కూతురు కనపడితే చాలనుకుంటాడు."

సుమద్యుతి ఇబ్బందిగా, "కానీ అందరూ ఏమనుకుంటారు మేడమ్. చాణుక్యగారి కూతురు..." అంటూ ఏదో అనబోతూ ఉంటే, రవళి ఖండిస్తూ, "ఎప్పుడూ ఇతరులు ఏమనుకుంటారో అనుకుంటూ బ్రతక్కు. ఇతరులతో మంచి అనిపించుకోవటం కోసం బ్రతికేవాడెవడూ ఆనందంగా బ్రతకలేడు. ఉదాహరణకి... పదిమందికి నువ్వు సంతర్పణ చేస్తూంటే '...ఎంత గొప్పవాడు! ఇంతమందికి అన్నదానం చేస్తున్నాడు" అంటాడు ఒకడు. 'ఆస్తి పదిమందికీ చూపించుకోవాలని భోజనం పెడుతున్నాడు' అంటాడు ఇంకొకడు. ఈ గొడవలన్నీ ఎందుకని గుప్తదానం చేస్తే, 'ఇంత డబ్బున్నా పిల్లికి బిచ్చం పెట్టడు' అంటాడు మరొకడు. కాబట్టి అందరి సంగతీ మానేసి జరగవలసింది ఆలోచించు" అన్నది.

ఏమీ తోచనట్టు సారథి వైపు తిరిగి, "ఏం చేద్దాం?" అని అడిగింది.

"తరువాత నన్ను బ్లేమ్ చెయ్యకుండా, నువ్వేమి చెప్పినా నాకు ఓకే" అన్నాడు.

రవళి నవ్వింది. "చూశావా. నిజమైన సమస్య వచ్చినప్పుడు మొగాళ్ళు ఇలాగే పెళ్ళాల మీద ఆధారపడతారు. నిర్ణయం నువ్వే తీసుకోవాలి."

వాళ్ళిద్దరూ ఆలోచనలో ఉండగా, తన వ్యూహాన్ని జాగ్రత్తగా వాళ్ళ మనసులోకి ఎక్కించింది. "ఆఫీసు పని మీద సారథిని వారం రోజులు ఆగ్రా పంపించాలని అనుకుంటున్నాం. ఈ లోపులో మీరు ఏ ఆర్యసమాజులోనో వివాహం చేసుకుంటామంటే, ఆ ఏర్పాట్లు కూడా నేనే చేస్తాను. సారథి తల్లిదండ్రులు ఎలాగూ ఉంటారు. పెళ్ళవగానే మీరు హనీమూనుకి వెళ్లినట్టు ఉంటుంది. ఆగ్రాలో ఒబెరాయ్ అమర్ విలాస్ అని ఒక హోటల్ ఉంది. అక్కడ హనీమూన్ స్పెషల్ రూమ్ ఉంది. ఆ రూము కిటికీ తీస్తే తాజ్ మహల్ కనపడుతూ ఉంటుంది. ఫస్టు నైటు అక్కడ చేసుకోవచ్చు. ఇప్పటికింకా అవకపోతే". అనాలనే చివరి వాక్యం అన్నది.

సుమద్యుతి మొహం రాగరంజితమైంది. "...ఛీ" అంది.

"ఊరికే జోకు వేశాన్లే. అన్నట్టు ఉద్యోగ ప్రయత్నాలు ఏమీ చెయ్యటంలేదా?" అని మళ్ళీ టాపిక్ మార్చింది.

"చెప్పాగా. నాన్నకి ఇష్టం లేదు"

"పెళ్ళవగానే నువ్వు చక్రా గ్రూప్‌లోనే చేరవచ్చు".

ఒక అద్భుతమైన వార్త వింటున్నట్టు సుమద్యుతి మొహం విప్పారింది. మెరుస్తున్న కళ్ళతో "నిజమా" అంది.

"అవును. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడు" అన్నాడు సారథి.

"వేణ్ణీళ్ళు ఉండవు. ఎందుకంటే, నువ్వు రాజీనామా చేస్తావు కాబట్టి".

ఇద్దరూ తెల్లబోయారు.

సారథి మొహం పాలిపోయింది. "ఎందుకు?" అన్నాడు.

"సినిమా ప్రయత్నాలు చేస్తావు".

సారథి సంభ్రమంగా చూస్తూ ఉండగా కొనసాగించింది: "...ఊరికే కథలు వ్రాసుకుంటే అవకాశాలెలా వస్తాయి? ఈ వయసులో రిస్కు తీసుకోకపోతే ఎప్పుడు తీసుకుంటావు? సంసారం నడవటానికి తను ఉద్యోగం చేస్తుంది. ఏ దర్శకుడి దగ్గరో అసిస్టెంటుగా చేరు. ఫెయిలయితే, చాలామంది వృద్ధ అసిస్టెంటుల్లాగా అక్కడే వ్రేలాడకుండా, మళ్ళీ ఇంజనీరుగా జాయినయి పోవచ్చు. లేదా... కొంత అనుభవం వచ్చాక మంచికథతో వస్తే, చక్రా గ్రూపు తరఫున మనమే తీయొచ్చు. సక్సెస్ అయితే పెద్ద దర్శకుడు అవ్వొచ్చు. అదేమిటి కళ్ళు మూసుకుంటున్నావు? అప్పుడే కలల్లోకి జారుకున్నావా?"

సారథి కాసింత సిగ్గుతో, "ఇదంతా ఒక కలలాగా ఉంది మాడమ్... సారీ... అక్కా... నమ్మలేక పోతున్నాను" అన్నాడు.

"అంతా మీ ఇద్దరి నిర్ణయం మీదే ఆధారపడి ఉంది. అన్నట్టు సారథీ... నీ సినిమా టైటిల్ ఏమిటి?"

అతడు తెల్లబోయి "పేరా? ఇంకా కథే రెడీ అవలేదు. పేరేమిటి?" అన్నాడు.

"కథ ఏదైనా పర్వాలేదు. పేరుమాత్రం నేను చెప్పిందే పెట్టాలి"

"ఏమిటి"

"పగ బట్టిన పరికిణి"

ఇద్దరూ ఒకేసారి ఫక్కున నవ్వారు. "సారి మేడమ్" నవ్వాపుకుంటూ అన్నాడు సారథి.

"నువ్వు సినిమా తీసే సమయానికి అవే పేర్లు వస్తాయి. చూస్తూ ఉండు"

"అంత ఆలస్యం అవుతుందంటారా?"

"చెప్పానుగా. ఎంత తొందరగా అన్నది మీ మీదే ఆధారపడి ఉన్నది. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. కూతురిని వలలో వేసుకున్నవాడి మీద ఆడపిల్ల తండ్రికి చంపెయ్యాలన్నంత కక్ష ఉంటుంది. అదే గానీ పెళ్లయిపోతే, అల్లుడికి హాని చెయ్యటానికి కాస్త సంశయిస్తారు. ముఖ్యంగా రాజకీయాల్లో ఉన్నవారు మరీ ఆలోచిస్తారు. బై. వెళ్లొస్తాను" అంటూ బయటకి నడిచింది.

మొత్తం వ్యవహారాన్ని ఆమె డీల్ చేసిన విధానం కౌటిల్యుడిని తలపిస్తోంది. మొదట సమస్య చెప్పింది. మీసాల్రాజాని రప్పించి భయపెట్టింది. పరిష్కారం చెప్పి ధైర్యమిచ్చింది. ఆ తరువాత టాపిక్ సినిమాల వైపు మరల్చి మనసు తేలిక చేసి ఇంటికి పంపింది.

బ్రహ్మాస్త్రం, వారుణాస్త్రం, నాగాస్త్రం – అన్నీ బాణాలే. పేర్లే వేరు. విష్ణుగుప్తుడు ఒకడే. చెప్పేవి రెండు. అర్థశాస్త్రం, రాజనీతి. హేతువు గురించి చెప్పేటప్పుడు అతడిని కౌటిల్యుడు అంటారు. రాజనీతి గురించి చెప్పేటప్పుడు చాణుక్యుడని పిలుస్తారు. ప్రస్తుతం ఆమె కొట్టాల్సింది రాజనీతిలో ప్రాజ్ఞుడయిన చాణుక్యుడిని. ఈ ప్రపంచంలో చాణుక్యుడిని కొట్టగలిగే వాడు ఒక్కడే.

కౌటిల్యుడు..!

# 23

**ఆ రాత్రి** మీసాల్రాజాకి ఫోన్ వచ్చింది.

"నేనే బంగారం. కాక్టేయిల్ సరోజని" వీణ తీవెలమీద కల్యాణి రాగం పలికినట్టు స్వరం.

నెంబరు కోసం చూశాడు. ఈసారి కూడా కనపడలేదు. "నన్నో వెధవని చేశావు కదూ. నీ అంతు తేలుస్తాను" అన్నాడు.

"కోపం ఎందుకు మిత్రమా. నే వచ్చాను. గుర్తు పట్టకపోతే నాదా తప్పు ప్లాటినమ్?" లాలనగా అన్నది.

మీసాల్రాజా వెనక్కి తగ్గి, "వచ్చావా" అన్నాడు.

"వచ్చాను రోడియం. నిన్ను చూసి నవ్వాను కూడా. పాత స్నేహితురాల్ని గుర్తు పట్టకపోతే ఎలా?" గోముగా అంది.

మీసాల్రాజా ఆలోచనలో పడ్డాడు.

"మనం కలిసి చాలా రోజులైందనుకో. అయినా గుర్తు ఉండాలే. వందలమంది గర్ల్-ఫ్రెండ్స్ ఉంటే అదే చిక్కు ఓస్మియం"

"నిన్న ఏ డ్రెస్‌లోఉన్నావ్?"

"నేను డ్రెస్సులో లేను ఇరీడియం"

"ఏమిటీ?" అతడి కంఠం కీచుమంది.

"మరీ ఎక్కువ ఊహించుకోకు. చీరలో ఉండొచ్చు. చోళీలో ఉండొచ్చు. మోడరన్ గౌనులో ఉండవచ్చు"

"బట్టల్లేని భామా... కట్టల్లేని ప్రేమా... ఈ రాత్రికే హనీమూన్ వెళ్దామా?"

"ఏమిటి? సినిమాకి పాటలు వ్రాస్తున్నావా?"

"నేను తీయబోయే సినిమాకి పాటలు నావే. హీరోయిన్ నీవే"

"ప్రేక్షకులు కూడా మనిద్దరమే. హోం థియేటర్లో బట్టలు లేకుండా కూర్చుని చూద్దాం"

"ఓ... నాకన్నా ఫాస్ట్ గా ఉన్నావే. కడుపులో పెగ్గుండగా కడుపు క్రింద సిగ్గు దండగ. సర్లే. ఈ ఆటలు చాలు గానీ ఎప్పుడు కలుస్తావో చెప్పు"

"ఏమి లాభం మగడా. ఎలాగూ గుర్తు పట్టవుగా. సర్లే. రాత్రికి నిద్రపోకుండా వెల్లకిలా పడుకొని ఆలోచించు. గుర్తొస్తే బోర్లా తిరుగు. కొన్ని గంటల క్రితం కలిశాను. నిన్ను చూసి నవ్వాను. అదే హింటు. కొంచెం తెలివితేటలతో ఆలోచిస్తే, తెల్లారే ఫోను చేస్తాను. గుర్తొస్తే వెంటనే కలుస్తాను".

"సరే గానీ, బంగారం, ప్లాటినం అని పిల్చావ్. అర్థమయింది. రోడియం, ఇరీడియం అన్నావేమిటి?"

"బాగా ఇష్టమయిన వాళ్ళని అలాగే పిలుస్తా. బంగారం అని పిలుపు పాతది. ఇరీడియం కొత్తది. ఖరీదైనది. బై" ఫోన్ కట్టయింది.

తనని హోటల్లో చూసి ఎవరు నవ్వారబ్బా? అని ఆలోచనలో పడ్డాడు. ఎంతసేపు ఆలోచించినా గుర్తు రాలేదు. అర్ధరాత్రి అకస్మాత్తుగా సుమ గుర్తొచ్చింది. ఫోన్ చేశాడు.

రాత్రి రెండవుతూ ఉండగా వచ్చిన ఫోనుకి సుమ కంగారు పడింది.

"నేను మీసాల్రాజాని. రాత్రి నీ ఎదురుగా కూర్చున్న అమ్మాయి ఎవరు?"

అంత సడన్ గా అతను అలా అడిగేసరికి అర్థం అవటానికి ఆమెకి కొంచెంసేపు పట్టింది. 'ఎందుకు?' అంది భయంతో వణికిపోతూ.

''కావాలి''

''తెలీదు''

ఇలాంటివి పట్టుకోవటంలో రాజా ఘటికుడు. "ముగ్గురు వచ్చారు. ఆమె నీకు తెలీదు. అంటే, వాడు నీ ఫ్రెండు. అది వాడితో వచ్చింది" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

మళ్ళీ అతనే "వాడు నీ బాయ్‌ఫ్రెండే కదూ" అన్నాడు.

"అవున్రా. నా బాయ్-ఫ్రెండే. అయితే నీకేమిటీ? అర్ధరాత్రి ఫోన్ చేసి ఇలా అడగటానికి బుద్ధిలేదూ. ఇడియెట్. ఇంకోసారి ఇలా ఫోన్ చేస్తే ఎడమకాలి చెప్పుతో కొడతాను. పెట్టేయ్ ఫోను" అనలేదు. అంత ధైర్యం లేదు. "నా... నా... బాయ్ ఫ్రెండేమిటి?" అన్నది తడబడుతూ.

''ఆ అమ్మాయి బాయ్‌ఫ్రెండా? మరి దాని పక్కన కూర్చోకుండా నీపక్కన కూర్చున్నాడేమిటి?"

సుమ మాట్లాడలేదు. ఆమె చేతిలో ఫోన్ కంపిస్తోంది. వళ్ళంతా చెమటలు పడుతున్నాయ్. మీసాల్రాజాకి విషయం అర్థమై పోయింది. ఇలాంటి విషయాలు పట్టుకోవటానికి పెద్ద నేర్పు అవసరం లేదు. "ఎవరా అమ్మాయి? చెప్పు" అని అడిగాడు కటువుగా.

"ర.. రవళి అని... చక్రా గ్రూపు. సారథి పనిచేసేది కూడా అక్కడే"

"నీ బాయ్‌ఫ్రెండ్ పేరు సారథా? సర్లే... ఎవరైతే నాకెందుకు? నాకు దాని ఫోన్ నెంబరు కావాలి"

"రవళి నెంబరా? ఎందుకు? ప్లీజ్. వదిలేయ్"

"రాత్రి ముగ్గురూ కూర్చుని ఏం బ్రాండు తాగుతున్నారు? జిన్ కదూ"

టాపిక్ మార్చి అతడా ప్రశ్న అడిగేసరికి, ఎందుకు అడుగుతున్నాడో అర్థమై ఏడుపు తన్నుకొచ్చింది.

"ఫోన్ పెట్టేస్తున్నాను. రెండు నిముషాల్లో ఆవిడ నెంబరు నాకు మెసేజ్ చెయ్యి" అని పెట్టేసేడు.

ఫోన్ ఎలా ఆఫ్ చేసిందో తెలియదు. వణుకుతున్న చేతులతో అతికష్టం మీద నీళ్ళు తాగింది. గుండెదడ తగ్గలేదు. రవళి హోటల్లో చెప్పిన మాటలు ఒకటొకటే గుర్తొచ్చాయి. ఇంతకు ముందు ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ రాకపోవటంతో కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఫోన్ నెంబరు ఇస్తే? ఏమవుతుంది? రవళి సారథిని ఉద్యోగం నుంచి తొలగిస్తుందా? రవళినే సలహా అడిగితే? ఇంత అర్ధరాత్రి ఫోన్ చేస్తే బావుంటుందా? మీసాల్రాజాకి నెంబరు చెప్పటం కన్నా తన సలహా తీసుకోవటమే మంచిది కదా.

సంశయిస్తూనే ఫోన్ చేసింది. అటు నుంచి వెంటనే ఎత్తింది రవళి.

"నేనూ సుమని... సారీ... ఇంత అర్ధరాత్రి ..." అంటూ క్షమాపూర్వకంగా చెప్పబోతూ ఉంటే, "పర్లేదు సుమా. అర్ధరాత్రి చేశావంటే ఏదో ముఖ్యమైన విషయమే అయ్యుంటుంది. లేకపోతే చెయ్యవుగా" మృదువుగా అన్నది రవళి. ఆ మాటలకి లోపల్నుంచి మరింత దుఃఖం తన్నుకొచ్చింది. కష్టంలో ఉన్నప్పుడు తడారిన కనులు అశృపూరితాలవటానికి చిన్న ఓదార్పు చాలు కదా. ఆ మాత్రం ఓదార్పు తన ఇంట్లో దొరక్కపోవటం కూడా ఒక కారణం అయ్యుండవచ్చు.

"మీసాల్రాజా ఫోన్ చేశాడు" అంటూ అంతా చెప్పి, "ఇంతకు ముందెప్పుడూ లేదు. ఫస్ట్ టైమ్... అర్ధరాత్రి అని కూడా చూడకుండా... ఎంత ధైర్యం వాడికి... ఇదంతా... నన్ను... నన్ను... హోటల్‌లో చూసినందుకేగా" అంటూ ఆపై మాటలు రానట్టు వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

రవళికి ఇదేమీ అంతగా ఆశ్చర్యం అనిపించ లేదు. సిక్స్త్-సెన్స్ ని ఆమె నమ్మదు కానీ, ఇలాంటిదేదో జరుగుతుందని మనసు చెపుతూనే ఉంది. అయితే, ఇది ఇంత తొందరగా అవుతుందని అనుకోలేదు. సుమద్యుతి దుఃఖం కూడా వింతగా అనిపించలేదు. చిన్న కష్టానికే కళ్ళని కావేరి చేసుకునేవారు కొత్త కాదు. తండ్రి గైడెన్స్ లేకపోతే తను కూడా అచ్చు ఈ అమ్మాయి లాగానే ఉండేది.

"ఏం కావాలట? ఎందుకు ఫోన్ చేశాడు?" అని అడిగింది.

"మీ నెంబరు కావాలట"

"ఇవ్వవలసింది"

ఆమె ఆమాట అనేసరికి సుమ నిరత్తురాలైంది. ఆ సమాధానాన్ని ఊహించలేదు. ఏమి చెప్పాలో తెలియక మౌనం వహించగా రవళి అన్నది: "అవును. ఇస్తే ఏమవుతుంది? ఇవ్వు పర్లేదు. గుడ్ నైట్" అని ఫోన్ పెట్టేయ్యబోతూ ఉంటే, "అక్కా" అని అటునుంచి వినిపించింది.

"చెప్పు"

"థ్యాంక్ యు"

"దేనికి? అనవసరంగా చిన్న విషయానికి మనసు పాడు చేసుకున్నావ్. ఈ మాత్రం ధైర్యం ఎవరన్నా చెపుతారు. అయినా వాడో స్టుపిడ్. అర్ధరాత్రి నీకు ఫోన్ చెయ్యటం ఎందుకు? గూగుల్‌లో 'చక్రా గ్రూప్ సెక్రటరి' అని కొడితే నాదే వస్తుంది కదా. అన్నీ మర్చిపోయి హ్యాపీగా నిద్రపో"

"నేను థ్యాంక్స్ చెప్పింది అందుకు కాదు"

రవళి ఆశ్చర్యంగా "మరి?" అంది.

"ఈ పొజిషనులో నువ్వు కాకుండా ఇంకెవరైనా ఉంటే, 'అప్పుడే చెప్పానా. నువ్వు వినలేదు' అంటూ మొదలు పెట్టేవారు. నువ్వు అలా అనలేదు. అందుకే థ్యాంక్స్"

"అవును. అవకాశం వస్తే తమకు తామే పెద్దరికం ఆపాదించుకుని భగవద్గీత బోధించేవారు తక్కువేమీ కాదు. ముందు ముందు మీ ఇద్దరికీ ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే, నువ్వూ సారథీ కలిసి ఆలోచించుకుని పెళ్ళి విషయం తొందరగా ఒక నిర్ణయానికి రండి" అని ఫోన్ పెట్టేసింది.

సరీగ్గా అయిదు నిముషాల్లో ఆమె ఊహించినట్టే మీసాల్రాజా నుంచి ఫోన్ వచ్చింది.

"సరోజా?"

"ఎవరూ?" కంఠంలో మార్దవం తొణికిసలాడగా వీణ రవళించినట్టు పలికింది రవళి స్వరం.

"గుర్తు పట్టనట్టు ఏమిటా నాటకం. తెరిచి చూడవా నా మనసు కవాటం"

"అర్ధరాత్రి ఫోన్ చేసి ఏమిటా మాటలు? నిద్ర పోనీయరా?'

"నిద్ర ఎందుకే కాక్టెయిలా? మాట్లాడవే కోయిలా"

"ఏమిటీ అర్ధరాత్రి కవిత్వం. ఎవరు మీరు?"

"నాటకాలు చాలు గానీ... నిన్ను పట్టుకున్నా గదా. నా బహుమతి ఏది?"

"పట్టుకోవటం ఏమిటి? ఎక్కడ పట్టుకున్నారు?"

"ఓహ్... నాకన్నా ఫాస్ట్ గా ఉన్నావే" ఇలా అయిదు నిముషాలు సంభాషణ జరిగాక ఆమె ఫోన్ పెట్టేసింది.

ఇంతకీ తనతో మాట్లాడింది సరోజా కాదా? అన్న అనుమానంతో రాత్రంతా కలత నిద్రపోయాడు మీసాల్రాజా.

ప్రొద్దున్న ఏడింటికి కాలింగ్ బెల్ మ్రోగుతూండగా మెలకువ వచ్చింది. తలుపు తీస్తే ఎదురుగా సబ్-ఇనస్పెక్టరు. మొహం చిట్లించి "ఏమిటింత ప్రొద్దున్నే... ఏం కావాలి?" అని అడిగాడు.

"అర్ధరాత్రి ఫోనులో ఆడవాళ్ళని వేధించినందుకు యు ఆర్ అండర్ అరెస్ట్" అన్నాడు బాలారిష్ట.

"అరెస్టా? రేయ్... శ్మశానంలో ఇడ్లీలు అమ్ముకునే మొహమా. నేనెవరో తెలుసా?"

"ఇదిగో వారెంట్. వస్తావా? చేతులకి సంకెళ్ళేసి నడిపిస్తూ తీసుకెళ్ళమంటావా?" ముందుకు అడుగు వేశాడు. మీసాల్రాజా ప్రతిఘటించబోయాడుగానీ బాలారిష్ట పోలీసు పెర్సనాలిటి చూసి వెనక్కి తగ్గాడు.

* * *

మీసాల్రాజాని సెల్లులోకి పంపటం అంత సులభం కాలేదు. యస్సై కుర్చీలో కూర్చుని, "అయిదు నిముషాల్లో సి.ఎం. పేషీ నుంచి ఫోన్ వస్తుంది. సారీ చెప్పి నీ వెహికిల్లో దింపుతావు చూస్తూ ఉండు. అప్పటివరకూ ఇక్కడే కూర్చుంటా" అన్నాడు.

"సెల్లులోకి వెళ్తావా? వెళ్ళవా?"

మెడ పట్టుకుని లోపలికి తోసినా వెళ్ళకుండా, "రేయ్ బాడ్ఖోవ్. తెలుగులో చెప్తే అర్థం కావటం లేదా?" అని అరిచాడు. అప్పుడు కొట్టాడు బాలారిష్ట. ముందు పోలీసు స్టేషను గిర్రున తిరిగినట్టు అనిపించింది. తరువాత ప్రపంచం పంచరంగుల్లో కనపడింది. ఆపై చెంప ఎర్రగా కందిపోయింది.

మీసాల్రాజా మొదట నిశ్చేష్టుడై, ఆపై ఆవేశంతో ఊగిపోతూ "రేపటి కల్లా నిన్ను సస్పెండు చేయించక పోతే నా పేరు మీసాల్రాజా కాదు" అన్నాడు.

"ముందయితే లోపలికి వెళ్ళరా. లేదంటే ఆ ఊళ్ళో గుండు గీయించినట్టు, ఈ జైల్లో మీసాలు గీయిస్తాను. ఎల్లమందని చంపి తప్పించుకున్నట్టు కాదు. ఇది పక్కా కేసు" మెడ పట్టుకుని సెల్లోకి తోసి తాళం వేస్తూ అన్నాడు.

రాజాలో ఇరిటేషను స్థానే ఆశ్చర్యం చోటు చేసుకుంది. "ఎల్లమంద ఎవరు?" అని అడిగాడు.

"ఆదిత్యపురంలో మీకు గుండు గీసినోడు. మీరందరూ కలిసి మూకుమ్మడిగా చంపేసినోడు. నాదీ ఆ ఊరే. చాలా? ఇంకా వివరాలు కావాలా?" అని సమాధానం ఆశించకుండా బాలారిష్ట అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

సెల్ నుంచి మీసాల్రాజా సి.ఎం. పేషీకి ఫోన్ చేశాడు. పి.య్యే ఎత్తాడు. అట్నుంచి మాట్లాడుతున్నది మీసాల్రాజా అని తెలియగానే, గౌరవం మిళితమయిన స్వరంతో "సార్" అన్నాడు.

"యస్పీ రఘునాథ్ కి ఫోన్ చెయ్యి. ఎవత్తో కేసు పెట్టిందట. న్యూసెన్స్ కేస్ క్రింద నన్ను అరెస్ట్ చేశారు. కల్యాణపురం పోలీస్ స్టేషనులో ఉన్నాను. యస్పీతో మాట్లాడు. రెండు నిముషాల్లో ఫోన్ రావాలి" అధికార స్వరంతో అన్నాడు.

రెండు నిముషాలు గడిచాయి. పది నిముషాలు. పదిహేను... లాకప్పులో రాజా రగిలిపోతున్నాడు.

గంట తరువాత వచ్చాడు లాయరు "సారీ సర్. మేజిస్ట్రేట్ దగ్గర ఆలస్యం అయింది. బెయిలు పేపరు తెచ్చాను" అన్నాడు.

"ఇంత చిన్న కేసుకు లాయరూ, బెయిలూ ఏమిటి? యస్పీ చెప్తే సరిపోదా" చిరాకు పడ్డాడు.

"నాకు తెలీదండి" అన్నాడు లాయరు.

మీసాల్రాజా మళ్ళీ పేషీకి ఫోన్ చేశాడు. అట్నుంచి పి.య్యే "...యస్పీగారికి చెప్పాను సార్. 'రాత్రి ఫోనుకి ప్రొద్దున్నకల్లా అరెస్ట్ జరిగిందంటే ఎదుటి పార్టీ కూడా పలుకుబడి ఉన్నవాళ్ళు అయ్యుంటారు. రేపు పత్రికలకి ఎక్కితే కష్టం. చట్ట ప్రకారం పోదాం' అన్నారు సార్" అని చెప్పాడు.

రాజా ఆలోచనలో పడి, "నిజమే. అర్ధరాత్రి ఫోనుకి ప్రొద్దున్నకల్లా వారెంటు ఎలా వచ్చింది? దాని వెనుక ఎవరున్నారో కనుక్కో. వద్దులే. నేను చూసుకుంటాను" అంటూ బెయిల్ పేపర్లు సంతకం పెట్టి, స్టేషన్ నుంచి బయటకి వెళ్ళబోతూ బాలారిష్టతో "కొట్టావు గదా. ట్రాన్స్‌ఫరుకో, సస్పెన్షనుకో రెడీగా ఉండు" అన్నాడు.

బాలారిష్ట అతని వైపు నిమ్మలంగా చూసి, "పొద్దున్న మిమ్మల్ని కొట్టినప్పుడు ఎవరూ సాక్ష్యం లేరుగా సారూ. ఇప్పుడు మీ లాయరు ఉన్నారు" అన్నాడు. అతడా ప్రశ్న ఎందుకడుగుతున్నాడో తెలియక మీసాల్రాజా తలెత్తాడు. పిడికిలి బిగించి మళ్ళీ బలంగా కొట్టి, "లాయరు ముందే కొట్టాను. సస్పెండు చేయించు చూద్దాం" అన్నాడు.

మీసాల్రాజా పక్కకి పడబోయి బల్ల పట్టుకుని తమాయించుకుని తిరగబడబోతూ ఉంటే, లాయరు అతని చెయ్యి పట్టుకుని, "రాజాగారూ. పది లక్షలకి తక్కువ కాకుండా పరువు నష్టం వేద్దాం. ప్రస్తుతానికి ఊరుకోండి. నేనే సాక్ష్యం" అంటూ బయటకు తీసుకెళ్ళబోయాడు.

శ్వేతార్క నవ్వి "నువ్వేం లాయరువి పంతులూ. డిఫెన్సు లాయరు సాక్ష్యం కోర్టులో చెల్లదు" అన్నాడు.

స్టేషను మెట్లు దిగుతూ రాజా వెనక్కి చూశాడు. పై మెట్టు మీద నిలబడి ఉన్న బాలారిష్టతో చూపు కలవగానే తల తిప్పుకుని ముందుకు నడిచాడు.

ఆ చూపులో ఎన్నో అర్థాలున్నాయి.

శ్వేతార్క వెనుక వచ్చిన పోలీసు వీరయ్య, "సార్. మొన్నే ప్రమోషన్ మీద వచ్చారు. మీరు హేండిల్ చేసే మొదటి కేసు ఇదే అనుకుంటాను. వాడు ఎవడో పెద్దవాళ్ళ తాలూకులా కనపడుతున్నాడు. కొంచెం జాగ్రత్తగా ఉండాలి సార్" అన్నాడు.

"వీడు నా క్లాస్మేటుని చంపాడు. ఆక్సిడెంటు చేసి మా మాస్టార్ని, మన ఇనస్పెక్టర్నీ మంచం ఎక్కించాడు"

"అయినా... "

"వీరయ్యా. నా పేరు శ్వేతార్క. ఎవరైనా హనుమంతుడిని కొట్టటం ఎక్కడైనా చూశావా?"

వీరయ్య మాట్లాడలేదు. "వాడో నికృష్టుడు వీరయ్యా. న్యాయం మన వైపు ఉంది. వాడు మనల్ని ఏమీ చెయ్యలేడు" అన్నాడు శ్వేతార్క.

అతని అభిప్రాయం తప్పని తరువాత తెలిసింది.

# 24




**"రోడ్డు వేస్తే** మంచిదంటావా?" టేబిల్ మీదున్న పేపర్ చూపిస్తూ చాణుక్యని అడిగాడు ముఖ్యమంత్రి. చాణుక్య మాట్లాడలేదు.

మళ్ళీ తనే "నిజంగా రోడ్లు వేస్తే బాగానే ఉంటుంది. చాలా గ్రామాల్లో కనీసం ఎడ్లబండి వెళ్ళే దారి కూడా లేదు. వర్షాకాలం వస్తే ఇక అంతే సంగతులు. ఏం చేద్దాం?" అన్నాడు.

"సలహా అడుగుతున్నావా? అభిప్రాయం చెప్పమంటున్నావా?" అన్నాడు చాణుక్య. ఏ విషయం చర్చించబోయే ముందైనా ఆ ప్రశ్న వేయటం అతడికి అలవాటు.

"అభిప్రాయం చెప్పు"

"చాలా మంచి పని. మారుమూల గ్రామాల్లో ఉన్నవాళ్లు ఏ చిన్నపని కోసమయినా పట్నం రావాలంటే అష్టకష్టాలూ అనుభవిస్తున్నారు. ఏ ప్రాంతమయినా, ఏ దేశమయినా అభివృద్ధి సాధించాలంటే మంచి రోడ్లు, రవాణా వ్యవస్థ దానికి మొదటి మెట్టు. అదీ నా ఒపీనియన్".

"చాలా ఖర్చు అవుతుంది"

"ఆ సమస్య నాది కాదు. అభిప్రాయం చెప్పమన్నావ్. చెప్పానంతే. వద్దున కూర్చుని చెప్పటాన్ని అభిప్రాయం అంటారు"

"వద్దు వద్దు. సలహా చెప్పు. నీ సజెషన్ ఏమిటి?" అని అడిగాడు ముఖ్యమంత్రి.

"ఊరికి రోడ్డు వస్తే ఎక్కువ ఓట్లు పడతాయా? జనాలందరికీ తలో పదివేలిస్తే ఎక్కువ పడతాయా?"

ఊహించని ఈ ప్రశ్నకి ముఖ్యమంత్రి మాట్లాడలేదు. చాణుక్య కొనసాగించాడు. "ఎవడూ తన ఊరి కోసం ఆలోచించడు. తన గురించి, తన కుటుంబం గురించి ఆలోచిస్తాడు. రోడ్లు వెయ్యటం, కాలువలు తవ్వటం, పరిశ్రమలు పెట్టటం, ఆనకట్టలు కట్టటం... ఇవన్నీ చేస్తే నీకున్న వనరులన్నీ దానికే సరిపోతాయి. నీకు ఇంకో విషయం తెలుసా? అందర్నీ డబ్బున్నోళ్ళని చేయలేనప్పుడు అందర్నీ బీదోళ్ళని చేయటమే సోషలిజం. రామాపురానికి రోడ్డువేస్తే కృష్ణాపురం వాళ్ళు నీకు ఓట్లు వేయరు. 'ఆ ఊరికి వేశావు. మాకెందుకు వేయలేదు?' అని నిలదీస్తారు. రాష్ట్రంలో అన్ని ఊళ్ళకీ రోడ్లు వేయటం నీకెలాగూ సాధ్యం కాదు. నిద్ర పోయేవారిని లేపి (ఒక బూతు మాట వాడాడు) దేనికి? డబ్బులు పంచుతూ పో. మేధావులు నిన్ను తిట్టుకున్నా పర్వాలేదు. ఒక్క విషయం గుర్తుపెట్టుకో. ఎన్నికల్లో నీకు 51 శాతం ఓట్లు వస్తే చాలు. బరిలో 3 పార్టీలు ఉంటే అంత శాతం కూడా అక్కర్లేదు 'రాష్ట్రసౌభాగ్యం, లోకకల్యాణం'లాంటి పదాలు డిక్షనరీలోంచి తీసేయ్. ఎలక్షన్స్ దగ్గర పడుతున్నాయి. కోడ్ అమలులోకి వసే కష్టం. తొందరగా డబ్బులు పంచు. ఇక ప్రతిపక్షాల అపోజిషన్ అంటావా? నిన్ను తిట్టటానికేగా ప్రజలు వారిని ఎన్నుకున్నది. ప్రతిపక్షంలో ఉంటే, మనమూ అదే పని చేస్తాం" అని చెపుతూ ఉండగా ఫోన్ మ్రోగింది. ఎత్తి 'హలో' అన్నాడు.

అటునుంచి భార్య ఏదో చెప్పింది. మొదట్లో అర్థం కాలేదు. విషయం విం...టూం...టే రక్తం లేనట్టు మొహం వాడిపోయింది.

"ఏమిటీ? ఏం జరిగింది?" అడిగాడు ముఖ్యమంత్రి.

చాణుక్య మాట్లాడలేదు. భార్య చెప్పేది వింటున్నాడు.

"మీరు తెల్లార్నే వెళ్ళిపోయారు. అమ్మాయి పక్కమీద లేదు. ప్రొద్దున్నించీ కనపడటం లేదు"

"ఎవరైనా స్నేహితుల దగ్గరకెళ్ళి ఉంటుంది. ఇప్పుడు పదే కదా అయింది" అన్నాడు.

"పొద్దున్న అయిదింటికే లేదండీ. బట్టలన్నీ అలాగే ఉన్నాయి. బాత్రూములో బ్రష్ కూడా తీసుకెళ్ళలేదు."

"ఫ్రెండ్స్‌ని ఎంక్వైరీ చేశావా?"

"ప్రొద్దున్నించీ చేస్తూనే ఉన్నా. అందరూ తమకి తెలీదంటున్నారు"

"మరి ఇప్పటి వరకూ నాకు..." అని కోపంగా ఏదో అనబోతూ ఉంటే రెండో ఫోన్ మ్రోగింది.

సి.ఎం కి ఏమి జరుగుతోందో అర్థం కాలేదు. చాణుక్య వైపు చూస్తున్నాడు. చాణుక్య 'హలో' అన్నాడు.

"అంకుల్. నా పేరు కమల" అన్నది రవళి. "సుమ క్లాస్‌మేటుని. రాత్రి రెండింటికి సుమ ఫోన్ చేసింది. చాలా భయపడి పోయింది"

చాణుక్య ఆందోళనగా "ఎందుకు" అని అడిగాడు.

"ఎవరో మీసాల్రాజా అనేవాడు అర్ధరాత్రి ఫోన్ చేసి వేధించాడట. బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని చెప్పింది. సగం ఏడుపులో సరీగ్గా అర్థం కాలేదు. 'ప్రొద్దున్న అయిదింటికల్లా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటా' అంటూ ఏదో చెప్పింది. ప్రొద్దున్నే నే వస్తాననీ అప్పటి వరకూ ఓపిక పట్టమనీ చెప్పాను. ప్రొద్దున్న బయల్దేరే ముందు ఫోన్ చేస్తే ఎత్తలేదు. ఆంటీకి చేశాను. సుమ కనపడటం లేదని గాబరా పడుతూ చెప్పింది. ఆ రాజా ఎవడో మీకు తెలుసా అంకుల్?"

చాణుక్య ఆమెతో "మళ్ళీ చేస్తా" అంటూ ఫోన్ పెట్టేసి, సి.ఎం. వైపు తిరిగి ఏదో చెప్పబోతూ ఉంటే ఆంజనేయులుకి పి.య్యే నుంచి ఫోన్ వచ్చింది. అతడితో మాట్లాడుతూ ఉండగా ఆంజనేయులు మొహం వివర్ణం అవటం గమనించాడు చాణుక్య.

ఫోన్ పెట్టేసి, "ప్రొద్దున్న మీసాల్రాజాని అరెస్ట్ చేశారట" అన్నాడు ఆంజనేయులు.

"దేనికి?"

"ఎవరో అమ్మాయికి ఫోన్ చేసి అర్ధరాత్రి ఏదో వాగాడట. ఆమె పోలీస్ రిపోర్ట్ ఇచ్చినట్టుంది"

"నా కూతురే..." అంటూ చెప్పబోయి ఆగాడు.

తన కూతురైతే తనకి చెప్పకుండా పోలీసులకి ఎందుకు రిపోర్ట్ ఇస్తుంది? అసలు ఆమెకి అంత ధైర్యమెక్కడ? ఈ రాజాగాడు తాగి అర్ధరాత్రి చాలామందికి చేసి ఉండవచ్చు. రాత్రి ఫోనుకి ప్రొద్దున్న లోపులో అరెస్ట్ అయ్యాడంటే వాడు చేసింది ఏ మినిస్టరు పెళ్ళానికో, బిజినెస్ మాగ్నెట్ కూతురుకో అయి ఉంటుంది. అయినా ఇప్పుడు ఆలోచించవలసింది అది కాదు. మీసాల్రాజా ఫోన్ సంగతి తనకి చెప్పకుండా స్నేహితురాలి దగ్గర ఎందుకు ఏడ్చింది? చెప్పకుండా ఇంట్లోంచి ఎందుకు వెళ్ళిపోయింది?

వెళ్ళిందా? తీసుకెళ్ళారా?

ఈ ఆలోచన రాగానే వణికిపోయాడు. జరిగినదంతా వరుసగా పేర్చుకుంటూ ఆలోచిస్తే... రాత్రి రెండింటికి మీసాల్రాజా ఎవరో అమ్మాయికి ఫోన్ చేశాడు. పోలీస్ రిపోర్ట్ ఇచ్చేటంత సంభాషణ ఏదో జరిగింది. దానికి ముందో, తరువాతో, వాడి నుంచి తన

కూతురికి ఫోన్ వచ్చింది. ఆ పై కూతురు ఏడుస్తూ స్నేహితురాలికి ఫోన్ చేసింది. ప్రొద్దున్న, లేదా అర్ధరాత్రి... కిడ్నాపో, లేదా బ్లాక్-మెయిలో చేయబడి, కూతురు ఇంట్లోంచి వెళ్ళిపోయింది. లేదా బలవంతంగా తీసుకువెళ్ళబడింది.

ఒక్కతే కూతురు.

లోపల్నుంచి దుఃఖం తన్నుకు వస్తోంది. దగ్గరున్నప్పుడు తెలియని ప్రేమ దూరమైనప్పుడు బయట పడుతోంది.

సరీగ్గా ఆ సమయానికి మీసాల్రాజా లోపలికి వచ్చాడు. చాణుక్యని పలకరిస్తున్నట్టు తల ఎగరేసి, ఆంజనేయులి వైపు తిరిగి, “ఏమిటి బావా అర్జెంటుగా రమ్మన్నావ్?” అని అడిగాడు.

అప్పుడే ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.

చాణుక్య కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి మీసాల్రాజా భుజాలు పట్టుకుని ఊపేస్తూ, “ఏం చేశావురా? నా కూతురుని ఏం చేశావ్?” అని అరిచాడు.

మీసాల్రాజా నిశ్చేష్టుడయ్యాడు. పెద్ద ఉప్పెనలాంటి సమస్య వచ్చినా ఎంతో నిబ్బరంగా ఉండే మనిషి అలా అంత ఆవేశంగా ఊగిపోతున్నందుకు కాదు. తన కాలరు పట్టుకునేటంత సాహసం చేసినందుకు..! పక్కన ఆంజనేయులు లేకపోతే బల్ల మీద ఉన్న పేపర్ వెయిట్‌తో తల బ్రద్దలు కొట్టేవాడే. కష్టం మీద నిభాయించుకుని, “ఏమిటి బాబాయ్? ఏమైంది?” అని అడిగాడు.

“ఏమీ తెలియనట్టు ఏమిట్రా ఆ ప్రశ్న? నిన్న రాత్రి నా కూతురికి ఫోన్ చేశావా లేదా?”

సమాధానం ఏమి చెప్పాలా అని ఒక్క క్షణం సంశయించాడు మీసాల్రాజా. అబద్ధం చెప్పినా అది తన కాల్ రిజిస్టర్లో ఉంటుంది. పట్టుకోవటం చాణుక్యకి క్షణాల్లో పని.

“చేశాను” అన్నాడు.

అంత తొందరగా అతడు వప్పుకుంటాడని ఊహించని చాణుక్య నిర్విణ్ణుడయ్యాడు.

“అంత అర్ధరాత్రి చెయ్యాల్సిన అవసరం ఏమిటి? అయినా మా అమ్మాయి నెంబరు నీకెలా తెలుసు? ప్రొద్దున్నే నిన్ను ఎందుకు అరెస్ట్ చేశారు? అమ్మాయి ఎక్కడుంది?” అని గద్దించాడు.

ఆంజనేయులు కల్పించుకుని, “ఆవేశపడకు చాణుక్యా. అలా కూర్చో. వాడిని నేను అడుగుతా” అని మీసాల్రాజా వైపు తిరిగి, “చెప్పు. అసలేం జరిగింది?” అని అడిగాడు.

ఆ కాస్త సమయంలో మీసాల్రాజా సర్దుకున్నాడు. కథ అల్లటానికి టైము దొరికింది. “...రాత్రి నా స్నేహితుడికి ఆక్సిడెంటై రేర్-గ్రూప్ బ్లడ్ కావలసి వచ్చింది. తన

స్నేహితురాలెవరికో ఆ టైపు రక్తం ఉన్నదని సుమద్యుతి ఎప్పుడో చెప్పినట్టు గుర్తు. ఆ స్నేహితురాలి నెంబరు కోసం ఫోన్ చేశాను. ఇచ్చింది. ఆ నెంబరుకి చేస్తే, వాళ్ళు అపార్థం చేసుకుని పోలీసు రిపోర్ట్ ఇచ్చారు" అన్నాడు.

అక్కడే అతను చాణుక్యని తక్కువ అంచనా వేసి తప్పు చేశాడు.

"నువ్వు ఫోన్ చేసిన ఆ స్నేహితురాలితో ఇప్పుడే మాట్లాడాను" అన్నాడు చాణుక్య.

ఆంజనేయులు ఎంతయినా ముఖ్యమంత్రి కదా. చాణుక్య చీకట్లో బాణం వేస్తున్నాడని అర్థమయింది. మీసాల్రాజా వైపు జాలిగా చూశాడు.

"సరోజతో మీరు మాట్లాడారా?" అన్నాడు మీసాల్రాజా.

"నీ మీద రిపోర్టు ఇచ్చింది సరోజ కాదు"

"మరి ఎవరు?"

"అది నువ్వు చెప్పాలి. నువ్వు ఎవరితో మాట్లాడావో నీకే తెలీదు. ఫోన్ చేసి, 'నా స్నేహితుడికి ఆక్సిడెంటు అయింది. రక్తం కావాలి' అని నువ్వు రిక్వెస్ట్ చేశావ్. ఆ అమ్మాయి నీ మీద పోలీసులకి రిపోర్ట్ ఇచ్చింది. అంతేగా నువ్వు చెప్పేది?"

మీసాల్రాజా మాట్లాడలేదు. తాను అల్లిన కథలో ఎన్ని లొసుగులు ఉన్నాయో అర్థమయింది. కానీ అప్పటికే సమయం మించిపోయింది.

చాణుక్య ముఖ్యమంత్రి వైపు తిరిగాడు. "ఇప్పటివరకూ ఓపిక పట్టాను. ఇక వీడితో వేగలేను. మొన్న ఎవడో కాస్త గుండు గీశాడని వాడిని హత్య చేయించాడు. అది చిలికి చిలికి గాలివాన అయింది. లారీ ఆక్సిడెంటు జరిగి ఇనస్పెక్టరు డెత్–బెడ్ మీద ఉన్నాడు. ఈ రోజు నా కూతురికి ఎందుకు ఫోన్ చేశాడో, ఏమని బెదిరించాడో అది ఎందుకు ఏడ్చిందో, లేక వీడే కిడ్నాప్ చేశాడో తెలీదు. అంతా అయోమయంగా ఉంది. నా కూతురికి ఏమైనా అయితే మాత్రం నాలో ఇంకో మనిషిని చూస్తారు".

"ఏమిటి? బెదిరిస్తున్నావా?" మీసాల్రాజా వెటకారంగా అన్నాడు.

"రాజా. నువ్వు నోర్మూయ్యి" అని కసిరి, చాణుక్య వైపు తిరిగి "కంగారుపడకు. ఇప్పుడే డి.జి.పి కి ఫోన్ చేస్తాను. గంటలో అమ్మాయి ఆచూకి తెలుసుకునే బాధ్యత నాది. ఆ విషయం నాకు వదిలిపెట్టు" అన్నాడు ఆంజనేయులు.

"అది పక్కన పెట్టు. నేను ఇక్కడే, ఇప్పుడే నీతో ఒక విషయం చెప్పదలచుకున్నాను. నీకు నేను కావాలో, వీడు కావాలో తేల్చుకో. నీ బావమరిదే కావాలనుకుంటే ఈ క్షణమే నేను శలవు తీసుకుంటాను."

"చాణుక్యా. ఏమి మాట్లాడుతున్నావు?" అని ఆంజనేయులు ఏదో అనబోతూండగా చాణుక్య అడ్డుపడి "ఎలక్షన్లు దగ్గర పడుతున్నాయి. అమ్మాయిల్ని సప్లయ్ చెయ్యటం తప్ప

వీడి వల్ల నీకు మరే ఉపయోగమూ లేదు. ***'ముఖ్యమంత్రి బావమరిది మీసాల్రాజా రాసలీలలు, అర్థరాత్రి అమ్మాయిలకి ఫోన్లు, ప్రొద్దున్నే అరెస్టులు'*** అని ఇంకో గంటలో అన్ని ఛానల్సూ, పేపర్లూ బాంబులు పేల్చబోతున్నాయి. ఆంజనేయులూ..! వయసు పెరుగుతోంది. ఇంక ఆ యావ తగ్గించుకో. నీ వెనుక మాట్లాడటం నాకు ఇష్టం లేదు. వీడు ఎదురుగా ఉండగానే చెపుతున్నాను. ఇక నీ ఇష్టం" అక్కణ్నుంచి లేస్తూ అన్నాడు.

ఇంకా ఆ గొడవ పెద్దది అయ్యేదేమో కానీ, అదే సమయానికి సారమ్మ కాఫీ కప్పులు పట్టుకుని రావటంతో ముగ్గురూ మౌనం వహించారు. ఆమె కప్పులు బల్ల మీద పెట్టింది. ఆంజనేయులు ఒక గుక్క తాగి 'చల్లగా ఉంది' అన్నాడు.

"అయ్యో. మీరు మాట్లాడుకుంటున్నారని చాలాసేపు బయటే నిలబడ్డాను బాబుగారూ. మళ్ళీ తెస్తాను" అంటూ వాటిని వెనక్కి తీసుకు వెళ్ళింది.

అప్పటివరకూ మౌనంగా ఉన్న మీసాల్రాజా ఆమె వెళ్ళేవరకూ ఆగి, సోఫాలోంచి లేచి చాణుక్య దగ్గరకు వచ్చాడు. "ఏం మాట్లాడుతున్నావు ముసలాడా? ఏం వాగుతున్నావ్? నేనూ నా బావా ఏమి చేస్తే నీకెందుకు? అసలా ఆదిత్యపురం నిన్ను ఎవడు వెళ్ళమన్నాడు? టార్జాన్ని పంపిస్తే నిముషంలో అయిపోయే పనికి నిన్ను నువ్వే మహామంత్రి తిమ్మరుసులా ఊహించేసుకుని పంచె ఎగేసుకుంటూ వెళ్ళావ్. ఇహ నీ కూతురు... దాన్ని నేను కిడ్నాప్ చెయ్యటమేమిటి? అదేమైనా పతిత్తు అనుకుంటున్నావా? నిన్న రాత్రి హోటల్లో ఎవడి వాళ్ళోనో కూర్చుని మందు కొడుతూ ఉంటే చూశాను. ఇంటికొచ్చాక ఫోన్ చేసి, అటువంటి పనులు చెయ్యొద్దని మిత్రుడిగా సలహా చెప్పాను. దానికి అది బెదిరిపోయి ఏడిస్తే నా తప్పా? దానితో పాటూ ఇంకో బోకు ఉన్నాది. నీ కూతురి దగ్గర నంబరు తీసుకుని దానికి వార్నింగు ఇచ్చాను. నా మిత్రుడి కూతుర్ని పాడు చేస్తే ఊరుకునేది లేదని గట్టిగా చెప్పాను. అది పోలీసు రిపోర్టు ఇచ్చింది" అంటూ ఆంజనేయులి వైపు తిరిగి, "అది బావా జరిగింది..! ఈ ముసలోడికి వయసు పెరిగి మెదడు కుళ్ళి పోయింది. న్యాయం నువ్వే ఆలోచించు" అని, ఎదురుగా కాఫీ కప్పులతో వస్తున్న సారమ్మని దాటుకుని విసురుగా వెళ్ళి పోయాడు.

# 25

**రవళి** చక్రధరరావుతో మాట్లాడుతూ ఉండగా సారమ్మ నుంచి ఫోన్ వచ్చింది. రెండు నిముషాలు ఆ అమ్మాయితో మాట్లాడి, "మనం బయల్దేరదామా? ముహూర్తానికి టైము అవుతోంది" అన్నది రవళి.

గుళ్ళో పెళ్లి. ఇద్దరూ కార్లో టెంపుల్ స్ట్రీట్ వైపు వెళుతూ ఉండగా, "సారమ్మ ఫోను. చాణుక్యా, మీసాల్రాజా బాగా గొడవ పడ్డారట. దాదాపు కొట్టుకునే దాకా వెళ్లారట" అంది.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్నటి నుంచీ మీకు తెలియకుండా చాలా విషయాలు జరిగాయి సార్" అంటూ... సరోజ అర్ధరాత్రి మీసాలరాజాకి ఫోన్ చేయటం, అది 'తను' అనుకుని అతను తనకి చెయ్యటం, అతడిని పోలీసులు ప్రొద్దున్నే అరెస్ట్ చేయటం వరకూ జరిగిందంతా చెప్పింది.

రావుగారు స్థబ్దుడై ఆమె వైపు చూస్తూ, "నాకు నమ్మశక్యం కావటం లేదు. అయినా... చాణుక్య, రాజా విడిపోతే మనకేమిటి లాభం?" సాలోచనగా అడిగాడు.

"పూర్వకాలం భవంతులు కూలగొట్టాలంటే పై అంతస్తు నుంచీ కొట్టుకుంటూ వచ్చేవారు సార్. క్రింది స్థంభాలు కూలగొడితే చాలని ఈమధ్యే కనుక్కున్నారు. వంద అంతస్తుల భవంతిని కూడా పునాదుల దగ్గర కొట్టి కూల్చేస్తున్నారు. శత్రువుని శారీరకంగా కొట్టటం కన్నా, మూలాలు కొట్టటమే విజయమని సంజు చెపుతాడు. ఈ రోజునుంచీ చాణుక్యా, మీసాలరాజా ఒకర్నొకరు ఎలా దెబ్బ తియ్యాలా అని ఆలోచిస్తూ ఉంటారు. అదొక లాభం. ఆంజనేయులు నిద్రపోడు. అది మరొక లాభం."

"నువ్వు సామాన్యమైన దానివి కాదు"

ఆమె నవ్వి ఊరుకుంది. గుడి దగ్గర కారు ఆగింది. చక్రాల కుర్చీని గుడి వెనుక వైపు నుంచి పైకి ఎక్కించి కష్టం మీద తీసుకొస్తూ ఉండగా, "అనవసరంగా మిమ్మల్ని కష్టపెడుతున్నాను సార్" అంది.

"ఇదేమి కష్టం? నాకు సంతోషంగా ఉంది. వాళ్ళు మనల్ని పెట్టిన క్షోభకి అంతకు అంతా జరగాల్సిందే."

"ఇదంతా మనకోసం చెయ్యటం లేదు సార్. మనకన్నా సంతోషించేవాళ్ళు ఇంకొకరున్నారు"

"ఎవరు?"

"మీ అమ్మాయి కల్పన"

ఆయన గాఢంగా నిశ్వసించి "నీకిన్ని ఆలోచనలు ఎలా వచ్చాయి రవళీ?" అని అడిగాడు. ఆమెకి తండ్రి గుర్తు వచ్చాడు. ఆయన ఈ ప్రజ్ఞత ఇవ్వకపోతే తనుకూడా తండ్రి మంచం పక్కన 'నా ఖర్మ ఇంతే' అనుకుంటూ ఏడుస్తూ కూర్చుని ఉండేది.

వాళ్ళు గర్భగుడి వైపు వెళ్తూ ఉండగా, సారథి తల్లిదండ్రులు ఎదురొచ్చి నమస్కారం పెట్టి లోపలికి తీసుకు వెళ్ళారు. ఉద్యోగంలో కొత్తగా చేరిన మనిషి పెళ్ళికి అంత పెద్దాయన ఆ స్థితిలో చక్రాల కుర్చీలో రావటం వాళ్లని అబ్బుర పరుస్తోంది.

సూత్రధారణ అయ్యాక వధూవరులు వచ్చి కాళ్ళకి దణ్ణం పెట్టారు. సారథికి ఉంగరం ఇచ్చి, సుమద్యుతి వేలికి తొడిగించాడు. ద్యుతి కళ్ళు తడి అయ్యాయి. "అమ్మా నాన్నా లేకుండా పెళ్లి ఏమిటి అనుకున్నాను సార్. మీరు వచ్చారు. సంతోషంగా ఉందండి" అన్నది.



రవళి సారథికి గిఫ్ట్ ఇస్తూ "మన రావుగారి కూతురు కల్పన వేసింది" అంది.

పెళ్ళికూతురికి గిల్టీగా అనిపించింది. తను బిటెక్ ప్యాసయి ఖాళీగా కబుర్లు చెబుతోంది. ఓ పదహారేళ్ళ అమ్మాయి తన అంధత్వాన్ని అధిగమించటానికి అందమైన వ్యాపకం కల్పించుకుంటోంది.

రవళి వాచీ చూసుకుని, "మీకు ఫ్లయిటు టైమ్ అవుతోందనుకుంటాను" అన్నది.

వీలైనంత త్వరగా వాళ్ళని ఆ ఊరి నుంచి పంపించాలని ఆమె ఉద్దేశ్యం. కూతురి వివాహం తెలిస్తే చాణుక్య తరఫువాళ్ళు చాలా 'వేడిగా' ఉంటారు. పోలీసు రిపోర్టు కూడా ఇవ్వొచ్చు. వారికున్న పలుకుబడితో విమానాశ్రయాలు కూడా వెతకొచ్చు. అందుకే తొందర.

"పెళ్ళికూతురుని మా ఇంటికి తీసుకువెళ్ళి, అక్కడి నుంచి పంపుతామండీ. మరీ ఇట్నుంచి ఇటే..." పెళ్ళికొడుకు తల్లి సందిగ్ధంలో ఆగింది.

"అమ్మాయి మీకూతురే. మీదే పుట్టిల్లు. అంపకాలవగానే పెళ్ళికూతురు అత్తారింటికి వెళ్తుందనుకోండి" అన్నాడు రావు. ఆయన సమయస్ఫూర్తికి రవళి అభినందనపూర్వకంగా చూసింది.

ఇద్దరూ తిరిగి వెనక్కి వస్తూండగా "పొద్దున్నించీ చాలా కష్టపడ్డట్టున్నావు" అన్నాడు.

"ప్రొద్దున్నించీ కాదు. నిన్నటి నుంచీ..." నవ్వింది రవళి. "మీసాల్రాజా మీద పోలీసు రిపోర్టు, తెల్లారేసరికి వాడు అరెస్ట్ అయ్యేటట్టు చూడటం. ఇదంతా ఒక ఎత్తయితే, సుమని వాళ్ళ ఇంటినుంచి తప్పించి పెళ్లయ్యే వరకూ దాయటం మరో ఎత్తు"

"పలుకుబడి అన్నావు. అంత ఇన్-ఫ్లూయెన్సు చేసేవారు నీకెవరున్నారు?"

రవళి నవ్వి ఊరుకుంది.

"మొత్తానికి సాధించావు. నీ తండ్రిని అతను దూరం చేశాడు. అతని కూతుర్ని నువ్వు దూరం చేశావు" అన్నాడు.

"అంతవరకూ నిజమే కానీ, అతను నా తండ్రిని లారీతో కొట్టించి మృత్యుముఖంలోకి తోశాడు. నేను అతని కూతుర్ని పూలపల్లకీ ఎక్కించి పంపుతున్నాను. అదీ తేడా"

"నిజమే కదా. అన్నట్టు రాత్రికి రాత్రి ఇంట్లోంచి వచ్చేయమంటే సుమ బాధపడిందా?"

"నేనూ అలాగే అనుకున్నాను. కానీ తనలా ఫీలవ్వలేదు. 'ఇప్పుడు మనసు బాగా తేలిగ్గా ఉందక్కా. ఇంట్లో ఉంటే సారథికి దూరంగా ఉన్నాననీ, సారథితో ఉంటే తల్లిదండ్రులని మోసం చేస్తున్నాననీ, ప్రతిక్షణం భయపడుతూ గిల్టీగా బ్రతకటం కన్నా ఏదో ఒకటి ఎన్నుకోవటం బావుంది' అని, థ్యాంక్స్ చెప్పింది. హోటల్లో సారథితో ఉన్నప్పుడు మీసాల్రాజా చూడటం, అర్ధరాత్రి అతడు ఫోన్ చెయ్యటం... దాంతో బాగా బెదిరిపోయింది"

"ఒకటి తరువాత ఒకటి అలా వరసగా జరగాలని నువ్వే కదా అరేంజ్ చేసింది"

ఆమె మాట్లాడలేదు.

"మొత్తానికి పెళ్లి పెద్దవై ఒక పెళ్లి జరిపించావు"

"అన్నట్టు పెళ్లంటే గుర్తొచ్చింది. మనం తొందర్లో ఇంకో పెళ్లికి వెళ్ళాలి" అంది .

"ఎవరిది?"

"ఎల్లమంద చెల్లెలు సారమ్మ . నా కాలేజి మేట్. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఇంట్లో మన తరఫు గూఢచారిణి"

"పెళ్లి కొడుకు?"

"బాలారిష్ట శ్వేతార్క. మనకి సాయం చేస్తున్న సబ్-ఇనస్పెక్టరు. ఎల్లమంద క్లాసుమేటు"

"మీసాల్రాజాకి పాఠం చెప్పటం కష్టం కాదు కానీ, చాణుక్య హత్యానేరం వప్పుకునేలా చెయ్యటం మాత్రం అంత సులభం కాదనుకుంటాను"

"చెప్పానుగా. వాళ్ళని మానసికంగా బలహీనం చెయ్యాలి. పోతే కల్పన కళ్ళు పోగొట్టిన ఆ మీసాల్రాజాని మాత్రం అంత చిన్న పాఠంతో వదిలిపెట్టను".

# 26

**"ఆ పోలీసు** పేరు బాలారిష్ట" అన్నాడు మీసాల్రాజా. "పేరులాగే వాడూ దరిద్రుడు. వాడికి పాఠం చెప్పాలి. ఎవరు చెపుతారు?"

"వాడి మీద ఎందుకంత కసి? పై నుంచి ఆర్డర్లు వస్తే వాడేమి చెయ్యగలడు?" అన్నాడు ప్రభు.

పోలీసు స్టేషనులో అతడు తన చెంప పగలుగొట్టిన సంగతి మీసాల్రాజా చెప్పలేదు. "ఎదురు ప్రశ్నలు వెయ్యటం ఎప్పటినుంచీ నేర్చుకున్నావురా ప్రభూ?" అన్నాడు.

"అది కాదు బాసూ. నేను చెప్పేది... "

"చేస్తే చెయ్యి. లేకపోతే నోర్మూసుకుని కూర్చో" కఠినంగా అన్నాడు.

అంజి కల్పించుకుని, "నేను చేస్తాను. ఏమి చెయ్యాలో చెప్పు" అన్నాడు.

"వాడి గురించి వివరాలు కనుక్కోవాలి. చంపకూడదు. కాలో చెయ్యో తీసేయ్యాలి. లేదా తల్లినో చెల్లినో ఏదో చెయ్యలి. అది మనమే చేశామని వాడికి తెలియాలి. జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావాలి".

"చేస్తాను" అన్నాడు అంజి. "ముందు ఆ ఊరెళ్లి వాడి తాలూకు వివరాలన్నీ తెలుసుకుంటాను"

"నేను కూడా వస్తాను" లేస్తూ అన్నాడు ప్రభు. వాళ్ళతో పాటూ గోవిందు కూడా లేచాడు.

"అక్కడికి వెళ్ళాక ఏమి చేశామో ఫోన్ చేస్తాం."

"జాగ్రత్త. బాంబులు వేసి వాడి ఇల్లు పేల్చేస్తారో, వాడి కాలో చెయ్యో తీసేస్తారో మీ ఇష్టం. నా మీదకి కేసు రాకూడదు. కానీ నేనే ఇదంతా చేశానని వాడికి తెలియాలి"

ముగ్గురూ అతని దగ్గర శలవు తీసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయారు.

* * *

"బావున్నాయి కార్డులు" అంది రవళి పెళ్లి శుభలేఖలు చూస్తూ. సారమ్మ మొహం విప్పారింది. "నేనే సెలెక్ట్ చేశా" కాసింత గర్వంగా అన్నది.



"గొప్ప టేస్టు నీది. ఇంతకీ మీది ప్రేమ వివాహమా? పెద్దలు కుదిర్చిందా?"

"సగం సగం. నాన్నా, అన్నయ్యా పోయిన తరువాత అమ్మా నేనూ... ఇద్దరమే ఉన్నాం. మా బాగోగులన్నీ తనే చూసుకునేవాడు. అలా.. అలా.." నవ్వేసింది. "...ముందు వాళ్ళమ్మ వప్పుకోలేదు. ఇంతలో సబ్–ఇనస్పెక్టరుగా ప్రమోషన్ వచ్చింది. నావల్లే అనుకున్నారు. ముహూర్తాలు పెట్టేసుకున్నాం"

'నిర్హేతుక నమ్మకాలు కూడా మనకి సాయం చేస్తాయన్నమాట' మనసులో అనుకుని "ఆదిత్యపురం ఎప్పుడు వెళ్తున్నావు?" అని అడిగింది.

"ఇపుడే. ఇంకో గంటలో.."

"అధర్వణ అక్కడే ఉంది. మా అత్త ఊరు వెళ్ళిపోతానంటోంది. నీ పెళ్ళికి వచ్చినప్పుడు తనని నాతో పాటూ ఇక్కడికి తెచ్చేసుకుందామని అనుకుంటున్నాను. ఈ లోపులో ఒకసారి మా ఇంటికి వెళ్లి చూడు"

"తప్పకుండా అక్కా. తనకి ఆంజనేయస్వామి విగ్రహం అంటే ఇంటరెస్టు. మన కోవెల పక్కన కొత్తగా కడుతున్నారు చూడు. దాన్ని చూపించమని ఎప్పటి నుంచో అడుగుతోంది."

"దేశంలో అన్నిటికన్నా ఎత్తయిన విగ్రహం ఎక్కడుంది?"

"విజయవాడలో. ఇప్పుడు శ్రీకాకుళం పక్కన మండపం దగ్గర ఇంకా పెద్దది కడుతున్నారనుకుంటా. ఎందుకు అడుగుతున్నావు ఇవన్నీ?"

"మీ ఆయన పేరు శ్వేతార్క. అంటే ఆంజనేయస్వామి కదా. విగ్రహాల్తో సహా అన్ని వివరాలూ తెలుసుకున్నావా లేదా – అని"

సారమ్మ అందంగా సిగ్గు పడి, శలవు తీసుకుని వెళ్ళిపోయింది. అంతలో రవళికి ఆగ్రా నుంచి ఫోన్ వచ్చింది. "ఎలా ఉన్నావ్ సుమా?" అడిగింది రవళి.

"ఫస్ట్ క్లాస్"

"హోటల్ బావుందా?"

"బావుంది. ఇంత ఖరీదైన హోటల్లో ఉండటం మా ఇద్దరికీ ఇదే మొదటిసారి"

"కిటికీలోంచి తాజ్‌మహల్ కనపడుతోందా?"

"కనపడుతోంది. కానీ.... "

"కానీ ఏమిటి? తలుపు తీయటానికే తీరిక దొరకటం లేదా?"

"ఛా. అది కాదక్కా నేను చెప్పదల్చుకున్నది" అంటూ మాటలు దొరక్క ఆగింది. మది భావం మాటగా మారాలంటే మనోసాగర మధనం అవసరం. ఆపై ఒక్కొక్క వాక్యమే కూడగట్టుకుని చెప్పటం ప్రారంభించింది.

"ఇది చెప్పటానికి నేనేమీ సిగ్గు పడటం లేదు. కానీ నీకు చెప్పాలి. నీకు కాకపోతే ఎవరికి చెప్పను? జీవితం ఇంత బావుంటుందని నాకు ఇంత కాలం తెలీదక్కా. మా ఇంట్లో అమ్మా, నాన్న, నేనూ ముగ్గురమే. నాన్న ఇంట్లోంచి ఎప్పుడు వెళ్తాడో, ఎప్పుడొస్తాడో తెలీదు. ఇంట్లో ఉన్నా అసలు మాతో మాట్లాడేవాడే కాదు. ఇక అమ్మ. మనిషికి కొన్ని ఇష్టాలు, అయిష్టాలూ ఉంటాయన్న విషయమే తనకి తెలీదు. ఒకరి భాష ఒకరికి రాని ముగ్గురు మనుష్యులు ఒక దీవిలో చిక్కుపడి పోయినట్టు ఆ ఇంట్లో ముగ్గురమూ బ్రతికాం. ఎవరూ చెడ్డవాళ్ళు కాదు. గొడవలు లేవు. కానీ తలుపులు మూసుకున్న ఫీల్. ప్రేమ చెప్పటానికి దార్లు తెలియకో, ప్రదర్శించటానికి ఈగో అడ్డు వచ్చో, ఒక స్పర్శ, ఒక మాట లేకుండా రోజులు గడిచిపోయాయి. ప్రమిద ఉంటే ఏం లాభం? అందులో నూనె లేకపోతే? ఏదో కావాలి. ఏం కావాలో తెలీదు. సరీగ్గా ఆ సమయంలో సారథి పరిచయం అయ్యాడు. ఆకలితో ఉన్న విస్తరాకులోకి అన్నం దొరికినట్టు, దాహంతో ఉన్న ఎడారిని నీటి చుక్క తడిపినట్టు. అతడితో ఉన్నప్పుడు జీవితం ఇంత బావుంటుందా అని ప్రతిక్షణం అనిపించేది. కానీ... కానీ... ఎక్కడో ఏదో వెలితి. అది ఎందుకో ఇప్పుడు అర్థమైంది. అప్పుడు గుండెల్లో గిల్ట్ ఫీలింగ్. ఇప్పుడు దాన్ని పోగొట్టింది గుండెల మీద మంగళ సూత్రం" అని ఆగి, "నేను అనుకున్నది సరీగ్గా చెప్పానా అక్కా?" అని అడిగింది.

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా, "నేనొక మెసేజ్ పంపుతాను. అది చదివి అర్థం చేసుకున్నాక మళ్ళీ ఫోన్ చెయ్యి" అన్నది రవళి.

"ఏమిటక్కా అది?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఎప్పటి నుంచో నేను దాచుకున్నది. ప్రతిసారీ నేను చదువుకునేది. చదువు. నీకూ ఉపయోగపడుతుంది" క్లుప్తంగా అని ఫోన్ పెట్టేసి, మెసేజ్ ఫార్వార్డ్ చేసింది. ఎవరో రచయిత ఎక్కడో వ్రాసిన చాలా పెద్ద మెసేజ్..!

* * *

*'నేను ముక్కు సూటి మనిషిని. కుండ బ్రద్దలు కొట్టినట్టు మాట్లాడతాను' అంటారు కొందరు. ఎదుటివ్యక్తి ప్యాంటు గుండీలు పెట్టుకోకపోతే చెప్పటం వేరు. నీ మొహం దరిద్రంగా ఉన్నదని కుండ బ్రద్దలు కొట్టటం వేరు.*

*మనిషికి లౌక్యం, ధైర్యం రెండూ కావాలి. యుద్ధమెందుకని కృష్ణుడు రాయబారమూ చేశాడు. అవసరమైతే యుద్ధసారథ్యమూ చేశాడు. అదీ ధైర్యం. దుర్యోధనుడు ఎలాగూ సైన్యాన్ని అడుగుతాడని తెలుసు. 'నే కావాలా? సైన్యం కావాలా?' అని అడగటం లౌక్యం. లౌక్యం ప్రజ్ఞలో ఒక భాగం.*

*గిరిజాకల్యాణ యక్షగానంలో పర్వత రాజపుత్రి పార్వతి, శివుడు లభించక ఆత్మహత్యకు పాల్పడబోతూంటే సూత్రధారుడు, 'తగదిది తగదిది ధరణీధర వర సుకుమారీ. అందగా మదనుడుండగా, మన విరిశరముల పదనుండగా, కోరిన వాడెవడైనా నీ దాసు చేయనా'*

అంటాడు. చిన్నబాణంతో పోయేదానికి బ్రహ్మాస్త్రం వాడకపోవటం; ఎదుటివాళ్ళని నష్టపరచకుండా మనక్కావాల్సింది పొందటం లౌక్యం.

దురదృష్టవశాత్తూ 'లౌక్యం' అన్న పదాన్ని మనం నెగెటివ్ సెన్స్‌లోనే ఎక్కువ వాడతాం. మెటీరియలిజం, ఇండివిడ్యువాలిటీ, మొండితనం, లౌక్యం, డబుల్ స్టాండర్డ్... అన్నీ వేరు వేరు పదాలు. ఇద్దరి మధ్య తగవులు పెట్టేవాడిని 'లిటిగెంట్' అంటారు. లిటిగేషన్ వేరు. లౌక్యం వేరు. కన్యాశుల్కం నాటకంలో "అది మోసం కాదు. నా లౌక్య ప్రజ్ఞ" అంటాడు రామప్ప పంతులు. "ఔరా! తాము చేస్తే లౌక్యమూ, మరొకరు చేస్తే మోసమూనా?" అని మధురవాణి ఆశ్చర్యపోతుంది. 'నమ్మిన చోట చేస్తే మోసమూ, నమ్మని చోట చేస్తే లౌక్యము' అనే నానుడిని ఎంతో గొప్పగా చెప్పాడు గురజాడ అప్పారావు మాస్టారు.

స్త్రీ సమస్యని పరిష్కరించటానికి ఉత్తమమార్గం ఆమె చెప్పేది చివరివరకూ వినడం. పురుషుడి సమస్యని పరిష్కరించటానికి ఉత్తమమార్గం, అతడికి సలహా చెప్పకపోవటం.

ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో చెప్పి భాగస్వామికి రహస్యాలన్నీ చెప్పేసినట్టు భ్రమ కలిగించటం దాంపత్యంలో లౌక్యం.

లౌక్యులకి అవతలివారి ఇష్టాయిష్టాలూ, బలహీనతలూ క్షుణ్ణంగా తెలిసుంటాయి. పొగడ్త అని అనుమానం రాకుండా పొగడటం, తెగడాల్సిన చోట కంట్రోల్‌లో ఉండటం, లౌక్యుడి కళ. పొగడ్త వేరు. అభినందన వేరు. లేని మునగచెట్టు ఎక్కించటం పొగడ్త. అది భట్రాజుల పని. అభినందన అంటే ఉన్నదానికి విశేషణాలు అద్దటం. అభినందన అభిలషణీయం. అది బంధాన్ని కాపాడుతుంది. "మొన్నెప్పుడో చిక్కుడుకాయ కూర చేశావు చూడు. చాలా బాగుందోయ్. మళ్ళీ ఒక్కసారి చెయ్యి ప్లీజ్" అని భార్యతోనూ, "ఈ మధ్య ప్రొద్దున్నే లేస్తున్నావ్. బాగా డిసిప్లిన్డ్ అయ్యావురా. ప్రౌడ్ ఆఫ్ యు మై సన్" అని కొడుకుతోనూ, "డ్రైవింగ్ చాలా బాగా చేశావయ్యా గుడ్..." అని డ్రైవరుతోనూ అనటంలో నష్టం లేదు కదా.

"మీ జీవితంలో బాగా గుర్తుండిపోయిన ఒక మధుర సంఘటన చెప్పండి మాలక్ష్మిగారూ" అని పక్కింటావిడ అడిగింది. మాలక్ష్మి క్షణం కూడా ఆలోచించకుండా, '...నలభై ఏళ్ళ క్రితం ఓ రోజు మా ఆయన 'పాతికేళ్ళ నుంచీ నన్నెలా భరిస్తున్నావే సీతామాలక్ష్మీ. నీకు పద్మశ్రీ ఇవ్వాలే' అన్నాడు. ఇన్నేళ్ళయినా ఆ మాట గుర్తుండి పోయింది" అన్నది. ఎంత గొప్ప ఉదాహరణ ఇది. అభినందన అవతలి వారికి ఆవిధంగా బోలెడంత పాజిటివ్ ఎనర్జీ ఇస్తుంది. ఒక ఇంట్లో పిండి రుబ్బటం నుంచి, ప్రొద్దున్నే ఇంటిల్లపాదికీ దోసెలు వెయ్యటం వరకూ ఒక వితంతు బామ్మ పని. పెద్ద కుటుంబం. దాదాపు పదిమంది పిల్లలు ఆవిడ చుట్టూ చేరి, "ప్లీజ్ ఇంకొకటి వెయ్యవా అమ్మమ్మా, ప్లీజ్ ఇంకొకటి నానమ్మా, ఇంకోటి బామ్మా" అంటూ వేపుకు తినేవారు. ఆ వయసులో అరవై డెబ్బై దోసెలు వేయటానికి ఆ మాటలు పాజిటివ్ టాబ్లెట్సు లాగా పని చేసేవి అనుకుంటా.

* * *

అరగంట తరువాత సుమ నుంచి ఫోన్ వచ్చింది.

"మెస్సేజ్ చదివావా?" ప్రశ్నించింది రవళి.

"ప్రజ్ఞ, లౌక్యం గురించి కదా. బావుంది. కానీ ఎందుకు పంపావో అర్థం కాలేదు"

"ఎప్పుడో చాలాకాలం క్రితం సేవ్ చేసి పెట్టుకున్న మెసేజ్ అది. మళ్ళీ ఇంకొకసారి చదువు"

"దేనికి?"

"మీ ఇంటి గురించి చెప్తూ, ఒకే దీవిలో భాష తెలియని ముగ్గురు వ్యక్తులు... అన్నావు కదా"

"అన్నాను"

"నీ భాష ఇంట్లోవాళ్ళకి రాకపోతే, వాళ్ల భాష నువ్వే నేర్చుకోవచ్చుగా?"

"అర్థం కాలేదు"

"ప్రమిద ఉంది. నూనె లేదు – అన్నావు"

"అవును. అన్నాను"

"నూనె పోసి ప్రమిదని నువ్వే వెలిగించవచ్చుగా. ఆ మెసేజి చెప్పేది అదే."

అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నట్టు సుమ మౌనం వహించింది.

"నీకు పంపిన మెసేజిలో వంట ప్రసక్తి కూడా ఉంది చదివావుగా" అన్నది రవళి.

"అవును."

"మీ అమ్మతో ఎప్పుడైనా, 'భలే వండుతావే నువ్వు' అన్నావా? మీ నాన్న మేధావి. మేధావికీ, కళాకారుడికీ అభినందన గొప్ప స్ఫూర్తి. ఆయన్ని ఒకసారైనా పొగిడావా? ఆలోచించు." అని, క్షణం ఆగి అన్నది– "నీ తరఫు నుంచి ప్రయత్నం చెయ్యకుండా అవతలి వారిని నిందిస్తే ఏం లాభం? చాలా ఇళ్ళలో ఖాళీ ప్రమిదలుంటాయి. ఎవరూ ప్రేమ నూనె పొయ్యరు. పక్కవాళ్ళు పొయ్యాలని చూస్తూ ఉంటారు."

"ఏం చెయ్యను?"

"మీ ఇంటి గురించి నీకున్న ఫీలింగ్స్, ఏ పరిస్థితుల్లో సారథిని ప్రేమించావో, ఇంట్లో చెప్పడానికి ఎందుకు భయపడ్డావో అన్నీ యథాతథంగా మీ నాన్నకి ఉత్తరం వ్రాయి. అదీ ప్రజ్ఞ..! అర్ధరాత్రి మీసాల్రాజా ఫోన్ చేసి ఎలా బెదరగొట్టాడో, ఆ భయంతో రాత్రికి రాత్రి ఇంట్లోంచి ఎలా వెళ్లిపోయావో నీ మీద జాలి కలిగేలా చెప్పు. నీ మీద మీ నాన్నకున్న కోపం వాడి మీదకు పోతుంది. అదే లౌక్యం..! ఇంత చెప్పినా వాళ్ళు అర్థం చేసుకోలేదనుకో. బంతి వాళ్ళ కోర్టులో ఉంటుంది. ఆ తర్వాత నీకు ఏ రకమైన గిల్ట్ ఫీలింగూ ఉండదు.

నాకు తెలిసినంతలో మీ తల్లిదండ్రులు నిన్ను వదులుకోరు. ముఖ్యంగా సారథిని చూసిన తర్వాత" అని ఫోన్ పెట్టేసింది.

పక్కనే ఉండి అంతా విన్న సారమ్మ, "ఇద్దర్నీ మళ్ళీ కలుపుతున్నావేమిటి? ఆ ముసలాడి నుంచి కూతుర్ని దూరం చెయ్యటమేగా నీక్కావలసింది" అని అడిగింది.

"తండ్రి నుంచి కూతుర్ని దూరం చెయ్యాలి కానీ, కూతురుకి ఇల్లు దూరం చెయ్యటం కాదు".

సారమ్మ ఆమెవైపు అయోమయంగా చూసి "నువ్వు నాకు ఎప్పుడూ అర్థం కావు రవళీ" అన్నది.

"ఇందులో అర్థం కానంత పెద్ద విషయం ఏముంది సమ్మూ? ఇవ్వవలసిన షాక్ ఇచ్చేసాం. ఇప్పుడిక మా గొడవలతో ఆ అమ్మాయిని తల్లి నుంచి దూరం చెయ్యటం భావ్యం కాదు కదా. ఆ మాటకొస్తే, నా వ్యతిరేకత చాణుక్య మీద కాదు. అతడి విధానాల పట్ల..! బ్యాంకుల్ని మోసం చేసే వ్యాపారవేత్తలు, తమ ఆఫీస్ పొజిషన్ వాడుకునే ప్రభుత్వాధికారులూ, కోట్లు వెనకేసే రాజకీయ నాయకులూ... ఈ మేధావులకి ఎక్కడో ఒక చోట 'చెక్' పెట్టకపోతే, వీళ్ళని చూసిన తరువాతి తరం జనాల్ని బుట్టలో వెయ్యటం ఇంత సులభమా అనుకుంటారు. జీవితంలో పైకి రావాలంటే లంచం, బ్రోకరేజి లాంటి క్షుద్ర ఆలోచనలతో చీకటి వ్యాపారమో, చౌకబారు రాజకీయమో చెయ్యాలనే అభిప్రాయానికి వస్తారు". సారమ్మ స్థబ్దురాలై వింటూండగా ఆప్తవాక్యం చెప్పింది: "సమాజం బావుండాలంటే మేధావులు 'మంచి' వైపు ఉండాలి. చెడు వైపు కాదు. ప్రస్తుతం దానికి వ్యతిరేకంగా జరుగుతోంది".

సారమ్మ ఆమె చేతి మీద చెయ్యి వేసి, "నాకు నీలా ఉండాలని ఉంటుంది అక్కా. పుస్తకాలు చదవాలని, జ్ఞానం సంపాదించుకోవాలని ఉంటుంది. ఉండలేను. బద్ధకం" అంది దిగులుగా.

"ఈ ప్రపంచంలో బద్ధకం అనే పదం లేదని నేనేదైనా చెప్తే అది మళ్ళీ ఒక లెక్చరులా ఉంటుంది. జ్ఞానం గురించి ఎక్కువ ఆలోచిస్తూ అమాయకత్వాన్ని పోగొట్టుకోకుండా, హ్యాపీగా మొగుడితో ఎంజాయ్ చెయ్యి. బాలారిష్ట గురించి నాకు బాగా తెలుసు. అతను నీకు దొరికిన అదృష్టం" అన్నది.

సారమ్మ ఆకాశానికి దణ్ణం పెట్టుకుంటూ "థ్యాంక్స్ అక్కా. అన్నా, నాన్నా పోయారు. ఇంకెవ్వరూ లేరు. నీ మాట నిజమైతే అంతకన్నా ఏమి కావాలి?" అంది. అయిదు నిముషాల తరువాత ఆదిత్యపురం బయల్దేరింది.

సరీగ్గా ఆ సమయానికి మీసాల్రాజా స్నేహితులు అంజి, గోవిందు, ప్రభూ ముగ్గురూ ఆదిత్యపురంలో బస్సు దిగారు.

# 27

**అంజి చేసిన** మొదటి హత్య స్వంత సోదరిని.

తల్లిదండ్రుల పెంపకం ప్రభావం ఆడ-మొగ పిల్లల మీద ఎలా వేర్వేరుగా ఉంటుందో చెప్పటానికి ఆ అక్కా తమ్ముళ్ళ జీవితాలే ఉదాహరణ.

అంజి సోదరి పేరు తిలోత్తమ. తిలము అంటే నువ్వులు. సుందోపసుందులనే రాక్షసులను చంపటానికి తిలోత్తమ అనే అప్సరసని బ్రహ్మ సృష్టించాడు. మూడు లోకాల్లో ఉన్న సమస్త అందాలన్నిటినీ నువ్వు గింజ పరిమాణంలో కాస్త కాస్త తీసుకుని సృష్టించాడు కాబట్టి ఆమెకు తిలోత్తమ అనే పేరు వచ్చింది.

ఆ దేవలోకపు తిలోత్తమ లాగే ఆమె కూడా భూలోకపు అప్సరస. కానీ ఆ ఇంట్లో ప్రతి రోజూ గొడవే. తండ్రి తల్లిని కొట్టేవాడు. అంజి ఆమెని కొట్టేవాడు. నరకం భరించలేక బెంగుళూరు వెళ్లి సత్యానంద ఆశ్రమంలో చేరింది. ఆ విషయం తెలిసి హనుమంతరావు కిడ్నాప్ రిపోర్ట్ ఇచ్చాడు. అతడు కాబోయే ఎమ్మెల్యే, మరియు ముఖ్యమంత్రికి దగ్గరా అవటంతో పోలీసులు చకచకా ఇన్వెస్టిగేట్ చేసి, ఆ అమ్మాయి సత్యానంద ఆశ్రమంలో ఉన్నదని తెలిసి బాబాని అరెస్ట్ చేసి, అమ్మాయిని పట్టుకుని వెనక్కి తీసుకొచ్చారు. కొంత కాలానికి స్వామి బెయిల్ మీద విడుదలయ్యాడు. తిలోత్తమ తిరిగి గురువు 'దగ్గరికి' వెళ్ళిపోవటానికి ఆయుత్తమవుతూ ఉండగా ఇంట్లో పెద్ద గొడవ జరిగింది.

సత్యానంద శిష్యులు అదోరకం. రెండు రెళ్ళు అయిదు అని గురువు బోధిస్తే, అది కరెక్టని మనస్ఫూర్తిగా నమ్ముతారు. 'మనసు చెప్పిన భాష మాట్లాడటం' వారి ముఖ్య క్వాలిటీ. మరోలా చెప్పాలంటే, అవతలివారు తిట్టినా, నవ్వుకున్నా, హేళన చేసినా, నమ్మినా, నమ్మకున్నా, తాము అనుకున్నది ధైర్యంగా చెప్పటం, చెయ్యటం వారికి గురువు పెట్టిన విద్య. వాదనలో వారితో గెలవటం కష్టం.

అంజి పెద్ద గొడవ చేశాడు. "వాడో చీట్ అని నీకు తెలీదా? వాడి చుట్టూ భజనలు చేస్తావా? నువ్వు నా తోడబుట్టినదానివని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉందే" అన్నాడు.

"మీసాల్రాజా చీట్ అని నీకు తెలీదా? వాడి చుట్టూ నువ్వు భజన చెయ్యటం లేదా? నువ్వు నా బ్రదర్‌వని చెప్పుకోవటానికి సిగ్గుగా ఉందని నేను అన్లేదే" అన్నది తిలోత్తమ.

"వాడు కిడ్నాప్ కేసులో అరెస్ట్ అయి జైల్లో కూర్చొని వచ్చాడు."

"క్రితం ఏడాది బ్రోతల్ కేసులో నువ్వూ జైల్లో చిప్పకూడు తిన్నావుగా."

"వాడి మొగ స్నేహితుల్ని నువ్వు ఎంటర్టెయిన్ చెయ్యటం ఏమిటి? మరీ వందల్లోనా. ఛీ. అదేమి బ్రతుకు"

"పెళ్ళి కాకుండానే వందమంది ఆడాళ్ళని చెరిచావు. అదేమి బ్రతుకు? అన్నకో న్యాయం. చెల్లికో న్యాయమా?"

"ఇంత మూర్ఖంగా వాదిస్తావేమిటి?"

"మూర్ఖంగా ఉంటే ఆనందం వస్తుందో, జ్ఞానంగా ఉంటే ఆనందం వస్తుందో చెప్పడానికి నువ్వెవరు? బాబా... బాబా... అంటూ మేము భజనలు చేస్తాం. గోవిందా గోవిందా... అయ్యప్పా అయ్యప్పా.... అని నువ్వు భజనలు చేస్తావు. మమ్మల్ని చూసి నువ్వెంత జాలి పడతావో, నిన్ను చూసి మేమూ అంతే జాలి పడతాం. నీ వాదనతో నువ్వు ఆనందంగా ఉన్నావు. మా నమ్మకంలో మేము సంతోషంగా ఉన్నాము. నీ కళ్ళజోడుతో మమ్మల్ని ఎందుకు చూస్తావు? అక్కడ ఆశ్రమంలో నాలాంటి వయసున్న అమ్మాయిలు బోల్డుమంది ఉన్నారు. ఇంట్లో సాధింపులూ, బయట గోకుళ్ళు లేకుండా రోజంతా ఆడుతూ పాడుతూ హాయిగా గడిపేస్తాం. ఈర్ష్యాసూయలు ఏమీ ఉండవు. ఆయన చెప్పే మాటలకి అప్పుడప్పుడు చప్పట్లు కొడితే చాలు. అంతకన్నా ఎంజాయ్మెంట్ ఏముంది? ఆయన ఆత్మలింగాన్ని తీస్తాడో, బోడి లింగం తీస్తాడో మాకు అనవసరం. ఆయన సూర్యోదయాన్ని ఆలస్యం చేస్తానంటే నమ్మే భక్తులు బోలెడుమంది ఉన్నారు. వాళ్ళు చందాలు ఇస్తారు. వాటితో ఆయన మమ్మల్ని ఆనందంగా ఉంచుతాడు. మంచి పడక, గొప్ప భోజనం, జనం భజనలు, హడావుడి, హెలికాప్టరులో ఊటీ ట్రిప్పు. బయట ప్రపంచంతో మాకు సంబంధం లేదు".

"వాడితో ఒకేసారి ఇద్దరిద్దరు ఆడాళ్ళు పడుకుంటారటగా. అదేమి ఆనందమే?"

"నీవు బ్యాంకాక్ వెళ్ళినప్పుడు ఇద్దరాడాళ్ళతో పడుకోలేదా? ఫోటోలు కూడా దిగి వెనుక సాండ్విచ్ అని వ్రాసుకున్నావు. అదేమి ఆనందం?"

తండ్రి కల్పించుకున్నాడు. "జనం మూర్ఖులే. ఇసింతయినా జ్ఞానం లేకుండా నువ్వూ ఓ గొర్రెలా వారితో చేరతావా?"

"జనం మూర్ఖంగా ఉంటేనే కాదా నాన్నా మీరు ఎలక్షన్లలో గెలిచేది".

"తన కరెన్సీ తనే ముద్రిస్తాడా? దీవిలో దేశం స్థాపిస్తాడా? ఆ మూర్ఖుడి మోచేతి నీళ్ళు నువ్వు తాగుతావా?"

"ఏం? నువ్వు మన మూర్ఖ ముఖ్యమంత్రి మోచేతి నీళ్ళు నువ్వు తాగటం లేదా?"

అప్పుడు కొట్టాడు అంజి. కర్రతో తల మీద ఎంత గట్టిగా మోదాడంటే ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. అక్కడ పురాణాల్లో తిలోత్తమ వల్ల సుందోపసుందులు చచ్చారు. ఇక్కడ వాస్తవంలో సుందోపసుందుల్లాంటి తండ్రీ కొడుకులు తిలోత్తమని చంపారు. కాస్త కంగారు పడ్డా, ఆ తరువాత శవాన్ని కార్లో వేసుకెళ్ళి అడవిలో పాతిపెట్టారు. అలా తిలోత్తమ చరిత్ర సమాప్తమయింది.

ఇక అంజి విషయానికొస్తే చిన్న వయసులోనే అతను అలా తయారవటానికి కారణం తండ్రి.

పెంపకంలో చాలా రకాలున్నాయి. పిల్లలు వీసమెత్తు కష్టపడకుండా వాళ్ళు నడిచే దారిలో ముళ్ళనీ, అడ్డంకుల్నీ తీసేసి శుభ్రం చెయ్యటాన్నీ, అడిగిందల్లా ఇవ్వటాన్నీ ***'బుల్డోజర్'*** పేరెంటింగ్ అంటారు. పిల్లల గురించి అనుక్షణం కంగారుపడుతూ క్షణానికో సారి 'అలా

వెళ్ళకు, ఇలా చెయ్యకు' అని నాన్-స్టాప్ సలహాలు ఇవ్వటాన్ని ***'హెలికాప్టర్'*** పేరెంటింగ్ అంటారు. గారాబం వల్ల మొదటి రకం పిల్లలు మొండివాళ్ళు అవుతారు. అతి జాగ్రత్త వల్ల రెండో రకం పిల్లలు ఆత్మన్యూనత (కాంప్లెక్స్) తో పెరుగుతారు.

ఇరవై నాలుగ్గంటలూ తండ్రి చేతకానితనాన్ని తల్లి ఎత్తి పొడుస్తూన్నా, తల్లిని తండ్రి తిడుతూ/ కొడుతూ ఉన్నా, అటువంటి ఇళ్ళల్లో పెరిగిన పిల్లలు మూడో రకం. వీరు శాడిజంతో కూడిన అభద్రతాభావంతో పెరుగుతారు. వీళ్ళు తిరిగి 3 రకాలుగా తయారయ్యే అవకాశం ఉందని ప్రముఖ మానసిక శాస్త్రవేత్త ఎరిక్సన్ అంటాడు. 'కొట్టటం' ద్వారా బలహీనులపై అధికారం చెలాయించవచ్చన్న అభిప్రాయం చిన్న వయసులోనే ఏర్పడటం వల్ల, ఈ వ్యక్తులు పెద్దయ్యాక పెళ్ళాన్ని తిట్టటం, పిల్లల్ని కొట్టటం చేస్తారు. ఇది మొదటి రకం. దీనికి వ్యతిరేకంగా, తమ కాంప్లెక్స్ నించి బయటపడటానికి కసిగా కృషి చేసి రెండో రకం వ్యక్తులు జీవితంలో పైకి వస్తారు. మూడో రకం వ్యక్తులు స్త్రీలయితే, సంభాషణల్లో తరచు 'నేను-నేను-నేను' అన్న పదం ఉపయోగిస్తారు. 'తమ గురించి' ఎక్కువ చెప్పుకుంటూ తమ అభద్రతాభావాన్ని కప్పిపుచ్చుకుంటారు. మొగవాళ్ళయితే అమ్మాయిల్ని లైనులో పెట్టటం ద్వారా, తమలో ఏదో గొప్పతనం ఉన్నది కాబట్టే ఇంతమంది స్త్రీలు తనని ఇష్టపడుతున్నారన్న భావంతో తమ న్యూనత నించి బయటపడటానికి ప్రయత్నిస్తారు. తమ గర్ల్-ఫ్రెండ్స్ 'లిస్టు'ని తమ గొప్పతనానికి ఇండికేటరుగా భావిస్తూ, స్నేహితుల దగ్గర తరచూ తమ అనుభవాల గురించి ప్రస్తావిస్తూ తమ కాంప్లెక్సుని తగ్గించుకుంటారు. ఒకరితో ప్రేమలో ఉండగానే వేరొకరి కోసం వెతుకుతారు. దీన్నే మనస్తత్వ శాస్త్రంలో 'లవ్ అడిక్షన్' అంటారు.

మూడో వర్గానికి చెందినవాడు అంజి. తండ్రి సర్పంచ్. అసలు ఇంట్లో ఉండేవాడు కాదు. ఉన్నప్పుడు అతని ఏకైక పని భార్యని కొట్టటం. అటువంటి బాల్యం వల్ల ఏర్పడిన అభద్రతాభావాన్ని, 'అమ్మాయిని గెలవటం' అనే విద్యతో బ్యాలెన్స్ చేస్తాడు.

ఎటువంటి స్త్రీ నైనా తన సంభాషణా చాతుర్యంతో కట్టి పడేయటం అంజికి వచ్చిన ఏకైక విద్య అని ప్రారంభంలోనే చెప్పటం జరిగింది. మానసిక ఒంటరితనంతో బాధపడే ఆడవాళ్ళని ఫేసుబుక్కు వాల్ చూసి అంచనా వేయగలడు. గుర్తింపు కోసం తహతహలాడే స్త్రీలని తన మృదుమధుర భాషణ, వారిలో లేని క్వాలిటీస్ కేలీడియోస్కోప్ లో వర్ణించటం, ఉన్న క్వాలిటీస్ భూతద్దంలో చూపించటం, మెచ్చుకోలు, పొగడ్తలతో మునగచెట్టు ఎక్కించటం, వారి కష్టాలు వినటం, సానుభూతి చూపించటం, జ్యోతిష్యం, న్యూమరాలజీ, ఆపై అంతర్గత సమస్యల చర్చ, మరికొంచెం పరిచయం పెరిగాక పోర్నో జోకులు... ఇలా స్నేహం పెంచుకుంటాడు.

కేవలం ఆ ఒక్క క్వాలిటీ వల్లనే మీసాల్రాజా కంపెనీలో చెలామణి అవుతున్నాడు.

తండ్రి ప్రస్తుతం ఎలక్షన్సులో నిలబడుతున్నాడు. ఆ ప్రచారంలో ఉండగా ఆదిత్యపురం వెళ్లి బాలారిష్ట వివరాలు కనుక్కునే పని మీసాల్రాజా అప్పచెప్పాడు. తండ్రికన్నా స్నేహితుడు ముఖ్యం కదా. స్నేహితులతో కలిసి ఆదిత్యపురం వచ్చాడు. ముగ్గురూ బస్-స్టాండులో దిగి

మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. ఫేసుబుక్కులో ఎంతో మర్యాదగా మాట్లాడే మొగాళ్ళు పరోక్షంలో ఆ స్త్రీల గురించి ఎలా మాట్లాడుకుంటారో వాళ్ళ సంభాషణే ఉదాహరణ.

"అమ్ములుతో స్నేహం ఎంతవరకూ వచ్చిందిరా" గోవిందు అడిగాడు.

"ఛాటింగ్ మాత్రమే చేద్దాం. కలవొద్దు అంటోంది"

"ఇక్కడ కాళ్ళు సాచుకుని ఖాళీగా కూర్చున్నామని ఆ '...' అనుకుంటుందా" ఓ బూతు మాట వాడాడు ప్రభు.

"పవిత్ర స్నేహం చేద్దామంటుంది"

"ఛాటింగ్ చేస్తే పవిత్రత పోదా?"

"వర్షంలో మొక్కజొన్న పొత్తులు తింటూ కబుర్లు చెప్పుకోవటం ఇష్టం అంది. 'నా బుర్రలో ఉన్న మొత్తం కబుర్లన్నీ చెప్పినా అరగంటలో అయిపోతాయే. ఆ పైన ఏమి మాట్లాడుకుంటాం?' అని అడిగా. మటన్ కర్రీ నుంచి మహేష్ బాబు వరకూ ఏమైనా మాట్లాడుకోవచ్చంది. ఏమిటి లాభమన్నా. అన్నీ లాభం కోసం కాదు. మనసు విప్పి మాట్లాడుకోవటానికి మంచి స్నేహితుడు ఉండటం అదృష్టం' అంది. అయితే నేను మహేష్ బాబుతోనే స్నేహం చేసుకుంటాలే అని ఫోన్ పెట్టేశా"

చెప్తూ సడన్‌గా మాటలు ఆపుచేశాడు అంజి. అతని దృష్టి వరండా స్థంభానికి ఆనుకుని నిలబడి ఉన్న అమ్మాయి మీద పడింది. ఎత్తు అరుగుల ఇల్లు.

క్రాపు సర్దుకుంటున్నట్టు చెయ్యి ఎత్తి వేళ్ళతో సైగ చేశాడు. ఆ అమ్మాయి మొహం తిప్పుకోలేదు. అతడినే చూస్తూ నిలబడింది.

"మీరు నడుస్తూ ఉండండి. నే వస్తా" అన్నాడు.

విషయం అర్థమై వాళ్ళు ముందుకు సాగిపోయారు. ఆ అమ్మాయి నిలబడిన ఇంటి ఎదురుగా బ్యాంకు ముందున్న చెట్టు నీడలో నిలబడి మళ్ళీ సైగ చేశాడు. ఆ అమ్మాయి మొహంలో ఏ భావమూ లేదు. అలాగే చూస్తూ ఉంది. దగ్గరకి వెళ్లి నవ్వి 'హాయ్' అన్నాడు.

అమ్మాయి నవ్వలేదు గానీ 'హాయ్' అంది అభావంగా.

"పట్నం నుంచి వస్తున్నా. కొంచెం మంచి నీళ్ళు ఇస్తారా?" అని అడిగాడు.

"మంచి నీళ్ళు లేవు. చెడ్డ నీళ్ళు ఉన్నాయ్"

"భలే మాట్లాడుతావే. ఇంట్లో ఎవరూ లేరా"

"అత్తమ్మ పక్కింటికి వెళ్ళింది. ఇప్పుడే వస్తుంది"

"అలా వెళ్దాం వస్తావా?"

"ఎక్కడికి? ఆంజనేయ విగ్రహం దగ్గరకా? తీసుకువెళ్ళటానికి సమ్మూ వదిన వస్తానంది. అందుకే చూస్తున్నాను".

"మరి నాకు చూపించవా? నాకీ ఊరు కొత్త"

"పద" అంటూ మెట్లు దిగుతూ "ఊరు చివరకు వెళ్ళాలి" అంది.

"మరీ మంచిది. నీ పేరు?"

"అధర్వణ"

# 28

**"గుడ్ న్యూస్.** సుమద్యుతి దంపతుల్ని ఆ అమ్మాయి నాన్న ఇంటికి పిలిచాడట" అంది రవళి.

"ఉత్తరం చదివి కూతుర్ని అర్థం చేసుకుని ఉంటాడు" అన్నాడు రావు.

"నాకు సంతోషంగా ఉంది సార్. తల్లీ కూతుళ్ళని విడగొట్టానన్న గిల్ట్ మనసులో ఏమూలో ఉండేది. పోయింది."

"ఇందులో గిల్ట్ ఏముంది రవళీ" అన్నాడు రావు. "నిజానికి 'ఆమె' జీవితాంతం నీకు కృతజ్ఞురాలై ఉండాలి. ప్రేమించిన విషయం ఇంట్లో చెప్పలేక బాధపడేవాళ్ళని ఎంతమందినో చూస్తున్నాం కదా. నువ్వు పూనుకొని ఉండకపోతే, ఇంకెవర్నో చేసుకునేది. లేదా ఆత్మహత్య చేసుకునేది. అదీ కాకపోతే, వాళ్ళ నాన్న ఇంకొకడికి ఇచ్చి చేసేవరకూ సారథిని చీకట్లో కలుసుకుంటూ, మరోవైపు ఏ మీసాల్రాజా చూస్తాడో అని భయపడుతూ బ్రతికేది. ఇప్పుడు అలాంటి బాధలూ, భయాలూ లేవు కదా".

"ఇంట్లో వప్పుకున్నారు కాబట్టి సుఖాంతం అయింది. లేకపోతే... "

"లేకపోతే ఏమై ఉండేది? సారథితో చక్కగా సంసారం చేస్తూ పిల్లల్ని కనేది. ఏమీ చెయ్యకుండా బాధ పడటం కంటే, ఏదో ఒకటి చెయ్యటం బెటరని నువ్వే చెప్పినట్టు గుర్తు"

ఆమె టాపిక్ మారుస్తూ, "సారథి తొందర్లో ఉద్యోగానికి రిజైన్ చేస్తున్నాడు. అతడి స్థానంలో సుమకి ఉద్యోగం ఇస్తామని ప్రామిస్ చేశాను" అన్నది.

"ఎందుకు రాజీనామా?"

"సినిమా ఫీల్డులోకి వెళ్తాడట. సరే అన్నాను"

"అదేం పోయేకాలం?"

రవళి నవ్వింది. "అందరూ అనే మాటే మీరూ అంటున్నారు. రేపు అతను పెద్ద డైరెక్టరయితే ఆ సినిమా వందరోజుల ఫంక్షనులో 'ఈ అబ్బాయి మా సంస్థలో పని చేసేవాడు' అని మీరే చెపుతారు. ఇప్పుడు విషయం అది కాదు. మీకు తెలియకుండా నేనే నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఉద్యోగాలు వాగ్దానం చేసేస్తున్నాను. ఖర్చు పెట్టిస్తున్నాను. మీరేం అనుకుంటారో అని... "

"నువ్వు చెప్పటం అయింది కదా. ఇక నేను చెప్పేది విను. ఒక దొంగ దొరికినప్పుడూ, ఒక దుర్మార్గుడిని జనం కొట్టినప్పుడూ, ఆ వార్త వింటే సంతోషం కలుగుతుంది. మొన్న మా తప్పేమీ లేకపోయినా ఒక ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసరు పాతిక లక్షలు లంచం అడిగాడు. ఇవ్వక తప్పలేదు. ఆ తరువాత ఊటీలో కారు ఆక్సిడెంటు జరిగి ఆర్నెల్లు మంచం మీద ఉన్నాడు. ఎందుకో సంతోషం అనిపించింది. అలా అనిపించటం తప్పే అనుకో. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, మొన్న పోలీస్ స్టేషన్లో ఆ ఇనస్పెక్టరు మీసాల్రాజాగాడి చెంప పగలగొట్టాడని తెలిసి హ్యాపీగా అనిపించింది. గుర్తొచ్చినప్పుడల్లా బావుంది. నా కాళ్ళు విరగ్గొట్టిన వాడు కాలరెత్తుకుని తిరుగుతూంటే, ఖర్మనుకుని ఇంతకాలం సర్దుకున్నాను. కానీ 'లోకంలో ఇంకా కొద్దిగా న్యాయం నడుస్తోందని' తెలియటం చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఇప్పుడిక అసలు విషయం చెపుతాను విను. నేను చాలా పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టాను. ఎన్నో సంస్థల్లో ఇన్వెస్ట్ చేశాను. నా కూతురి కళ్ళు పోగొట్టిన వాడికి పాఠం చెప్పటం కూడా ఒక ప్రాజెక్టే. డబ్బుకన్నా సంతోషం ముఖ్యం కదా. ఆ సంతోషానికే లక్షలు ఇవ్వొచ్చు. ఎంత ఖర్చైనా పర్వాలేదు. ఇక దానిగురించి మన మధ్య చర్చలు వద్దు"

"అర్థమయింది" అంటూ ఆమె లేచింది. "మనం సారమ్మ పెళ్ళికి వెళ్ళాలి. గుర్తుంది కదా. మళ్ళీ ఆఖరి నిముషంలో టైము లేదనకుండా ప్రోగ్రాం షీటులో వ్రాసుకోండి".

# 29

**ఆదిత్యపురంలో** గోవిందు, ప్రభులకి పెద్దగా కష్టపడకుండానే బాలారిష్ట గురించి వివరాలు దొరికాయి. మీసాల్రాజాకి ఫోన్ చేసి "వాడికి కొద్ది రోజుల్లో పెళ్లి బాస్. ఇంట్లో తల్లి ఒక్కత్తే ఉంటుంది. కాబోయే పెళ్ళాంది కూడా ఈ ఊరే. సమ్మక్కో సారక్కో ఏదో అక్క. అంతా పెళ్లి హడావుడిలో ఉన్నారు" అని చెప్పాడు.

"సరే వచ్చేయండి. పెళ్ళయ్యాక వాడి సంగతి చూసుకుందాం" అన్నాడు రాజా.

"సాయంత్రం వస్తాం. అంజిగాడు దేన్నో పట్టి తోపుల్లోకి పోయాడు. అది చూసుకుని వస్తాం"

"నేను లేకుండా మీ ముగ్గురూ ఎంజాయ్ చేస్తార్రా? సర్లే.. సర్లే.. చెయ్యండి"

గోవిందు నవ్వి ఫోన్ పెట్టేసి అంజికి చేశాడు. అదే టైముకి అంజి ఊరి బయట ఆంజనేయ విగ్రహం దగ్గర అధర్వణతో "నీ నడుము బావుంది" అని అంటున్నాడు.

"నిజమా. ఈ మధ్య లావయ్యా. మా అత్తమ్మకి వంట సరీగ్గా రాదు. అందుకని తేనె ఎక్కువ వేస్తుంది. ఎక్కువ తింటున్నాను" అంది అధర్వణ.

"తేనె కాదు. నూనె".

"ఆ. కరక్ట్. నూనె"

"వంటరానివాళ్ళు ఎక్కువ నూనె వాడతారా"

సంభాషణా చాతుర్యం అంటే అదే. అవతలి వారికి ఇంటరెస్ట్ ఉన్న సబ్జెక్ట్ మాట్లాడటం.

"అవును. మా అక్క చెప్పింది. బల్లి మాంసం తను భలే వండుతుంది."

"ఇక్కడ కూర్చుందామా?"

"కూర్చోవటం ఎందుకు? విగ్రహం చూశాం కదా. వెళ్దాం"

"నాకు ఇంకా చూడాలని అనిపిస్తూంది" అన్నాడు.

"విగ్రహం ఇంకా పూర్తి కాలేదుగా. ఏమి చూస్తావ్? అన్నీ రాళ్ళే. ఎండగా ఉంది. పోదాం"

"ఇలా చెట్టు క్రింద కూర్చో" అంటూ అంజి బలవంతంగా ఆమె చెయ్యి పట్టుకుని లాగి కూర్చోబెట్టాడు. ఆలోచించటానికి అవకాశం ఇవ్వకుండా, "నువ్వు ఎప్పుడూ లంగా ఓణీలే కడతావా?" అని అడిగాడు.

"ఉహూ. ఇది మా అక్కది. అక్క ఎప్పుడూ చీరెలే కడుతుంది. నేను కమీజులు వేసుకుంటాను"

"ఈ కాళ్ళ పట్టీలు బావున్నాయి. బంగారమా?"

"కాదు. వద్దు. పైకెత్తకు. దింపు. తప్పు"

"కాళ్ళు చూస్తున్నా. ఎంత తెల్లగా ఉన్నాయో"

"అవునా. మా అక్క కాళ్ళు ఇంకా తెల్లగా ఉంటాయి."

"పేరు?"

"రవళి. నీకు తెలుసా? కాకుల కాళ్ళు ఇంక తెల్లగా ఉంటాయ్."

"ఓణీ బావుంది. సిల్కా? కాటనా? ఏదీ... చూడనీ..." అని మెడ పక్కన చెయ్యి వేసి, "సిల్కే... కానీ దానికన్నా నీ చర్మమే మెత్తగా ఉంది" చెయ్యి కాస్త క్రిందికి దించుతూ అన్నాడు.

గుట్టగా పడిఉన్న రాళ్ళ కేసి చూస్తూ "విగ్రహం ఇంకో ఏడాది పడుతుందా?" అన్నది.

రాళ్ళు. వేల లక్షల వత్సరాల వయసున్న రాళ్ళు. వందడుగుల విగ్రహాన్ని నిలబెట్టటానికి సరిపడా శక్తివంతమైన పెద్ద పెద్ద రాళ్ళు. మరికొద్ది సేపటిలో ఈ కథలో ఒక ముఖ్యమైన మలుపుకి కారణభూతమవబోతున్న రాళ్ళు.

"చూడు, ఇక్కడ ఇంకా మెత్తగా ఉంది. బావుందా?" అని అంజి ఆమె మెడ క్రిందుగా చెయ్యి పోనిస్తూ, 'అరె... ఇక్కడ ఎత్తుగా ఉంది చూడు' అంటూ ఉండగా ఫోన్ మ్రోగింది. అటు నుంచి గోవిందు. "ఏం బాసూ... ఎంతవరకూ వచ్చింది?" అని అడిగాడు.

"ఇంకా మొదలే కాలే. కాస్త డిఫరెంటు టైపు. మీరు తొందరగా వచ్చెయ్యండి. విగ్రహం వెనుక ఉన్నాం" అని పెట్టేశాడు.

"ఎవరు" అడిగింది అధర్వణ.

"మా స్నేహితులు. వస్తున్నారు. వాళ్ళు వచ్చాక ఇంకా బావుంటుంది"

"నాకేమీ బాలేదు"

"తరువాత్తరువాత బావుండేవి ఏవీ మొదట్లో బాగోవు. పెగ్గుతో సహా..." అంటూ చెయ్యి ఇంకొంచెం లోపలికి జరిపి నెమ్మదిగా రాస్తూ "బావుందా?" అని అడిగాడు.

"సారమ్మకి ఫోన్ చెయ్యి. వస్తానంది."

"సారమ్మ ఎవరు?"

"నాకు ఈ విగ్రహం చూపిస్తానంది. మా అన్నయ్య బాలారిష్టకి కాబోయే పెళ్ళాం. మూడ్రోజుల్లో పెళ్లి."

* * *

"అధర్వణ ఏది అత్తయ్యా?" అడిగింది సారమ్మ .

"గంటనుంచీ చూస్తున్నా. ఎక్కడా కనబడలేదమ్మా. పక్కింటి సుదర్శనాన్ని అడిగితే తెలీదన్నాడు" కంగారుగా చెప్పింది ఆవిడ.

సారమ్మ బయటకు వచ్చింది. మనసేదో కీడు శంకిస్తోంది. ఎదురింటావిడని అడిగింది. "ఎవరో పొడుగ్గా ఉన్నాడమ్మా. అతనితో కలిసి వెళ్ళటం చూశాను. ఎవరో తెలీదు" అన్నది.

బయట బాగా ఎండగా ఉంది. తుఫానులో చిక్కుకున్న ఓడలా కాళ్ళు ఎటు తీసుకు వెళ్తే అటు వెళ్తోంది ఆమె. అదే సమయానికి అంజి అధర్వణని వెల్లకిలా పడుకోమంటున్నాడు.

"వెల్లకిలానా? అంటే?"

అతడికిది ఆటలా ఉంది. గతంలో ఇటువంటి అనుభవం లేదు. వప్పుకున్నవాళ్ళతో పది నిముషాల్లో పని అయిపోయేది. వప్పుకోనివాళ్ళతో భయపెట్టో, పస్తు బెట్టో నాల్రోజులు పట్టేది. ఈ వెర్రి బాగుల్దానితో చెలగాటం బావుంది.

"వెల్లకిలా అంటే... పొట్టకి ఆకాశం కనపడేలా" అన్నాడు.

"వీపు ఆకాశానికి కనపడేలా పడుకుంటే?"

"బోర్లా... బ్రెస్టు దిండుకి ఆనిస్తే బోర్లా. దిండు గుండెలమీద పెట్టుకుంటే వెల్లకిలా. ముందు వెల్లకిలా పడుకో. తరువాత బోర్లా"

"ఎందుకు?"

"నీకు చెక్కలి గింతలు ఎక్కడున్నాయో చూస్తా"

"నడుము దగ్గర ఉన్నాయ్. ఇంకా... ఆఁ... అరికాలులో కూడా... "

"పడుకో... నేను నడుము దగ్గర వేళ్ళతో రాస్తాను. నిముషం నవ్వకుండా ఉంటే పందెం"

"ఏమిటి పందెం?"

"నేను ఓడిపోతే నీకో ముద్దు ఇస్తాను. నువ్వు ఓడిపోతే నాకివ్వాలి."

"నవ్వను. పందెం."

అతడు ఆమె పక్కన పడుకుని, నడుము మీద చెయ్యి వేసి, క్రమక్రమంగా బొడ్డు దగ్గరకి జరిపి వేలిని అక్కడ బొంగరంలా తిప్పుతూ, "నే ఓడిపోయాను. నువ్వు నవ్వలేదు" అని ఆమె మొహం దగ్గరగా మొహం జరుపుతూ 'తీసుకో ముద్దు' అన్నాడు.

మొహానికి వేడిగా ఊపిరి తగిలేసరికి స్త్రీ సహజమైన ఇన్-స్టింక్ట్ తో "నే వెళ్తాను" అన్నది లేస్తూ.

'అప్పుడేనా' అన్నాడు. ఆమె వినలేదు.

"ఒక్క క్షణం" అంటూ అతడామెని బలవంతంగా వెనక్కి తోసి పైకి జరిగాడు. ఆమె గింజుకోసాగింది. ఓణీ చెదిరిపోయింది. లంగా అంచు మీద చెయ్యి వేసి పైకి తోస్తూ, చెరో వైపూ కాళ్ళు వేసి మరింత గట్టిగా నొక్కిపట్టి ఆక్రమించుకోబోతూ ఉండగా వెనుక నుంచి, "రేయ్ వదలరా" అని ఓ కంఠం గట్టిగా వినపడింది.

చప్పున వెనుదిరిగాడు. వెనుక ఒక స్త్రీ నిలబడి ఉంది.

ఇది ఊహించని అతను క్షణం పాటూ నిర్విణ్ణుడయ్యాడు. ఆమె గాలికన్నా వేగంగా వచ్చి అతడి చొక్కా పట్టుకుని ఒక్క ఉదుటున అధర్వణ మీద నుంచి అతడిని పైకి లేపి పక్కకి తోసింది. అతడు పక్కకి పడగానే "లే...లే..." అంది.

అధర్వణకి ఏమీ అర్థం కాలేదు. వెల్లకిలా పడుకుని ఆమె వైపు అభావంగా చూసింది.

సారమ్మ ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని పైకి లాగుతూ, "పరుగెత్తు" అని అరిచింది. అధర్వణ అలాగే నిలబడి ఉండిపోయే సరికి, వీపు భుజం పట్టి తోస్తూ, "ఇడియెట్. పరుగెత్తు" అని మళ్ళీ అరిచింది.

"ఎందుకు సమ్మా అక్కా" అయోమయంగా ప్రశ్నించింది అధర్వణ.

వచ్చింది సారమ్మ అని అంజికి అర్థం అయింది. ఎప్పుడో జరగాల్సిన పని ఇప్పుడే జరగబోతున్నట్టు సంభ్రమంగా చూశాడు. పావురం కనబడగానే గ్రద్దకి కలిగే సంతోషం లాంటిది.

ఈ లోపులో సారమ్మ ఆమె వీపు మీద గట్టిగా చరిచి "ఫో.." అంటూ అరిచింది.

అప్పుడే స్పృహలోకి వచ్చినదానిలా అధర్వణ పరుగెత్తటం ప్రారంభించింది. ఆమె సరీగ్గా వెళ్తుందా లేదా అని చూడటం కోసం సారమ్మ ఒకక్షణం ఆగింది. అదే ఆమె చేసిన

తప్పు. ఏమి జరిగిందో గ్రహించిన అంజి ఆమె జఘనాన్ని పట్టుకుని వెనక్కి లాగాడు. ఊహించని చర్యకి ఆమె వెనక్కి పడిపోయింది. రాయి తగిలి నడుము దగ్గర కలుక్కుమంది.

అధర్వణ సన్నగా, పీలగా బలహీనంగా ఉంటుంది. సారమ్మ చక్కగా సౌష్టవంగా ఉంటుంది. ఊహించని అదృష్టానికి పొంగిపోయాడు. గడ్డిమేటులోంచి గులాబీల బుట్టలో పడ్డట్టయింది.

ఆమె కాళ్ళతో తన్నుతోంది. చేతులతో తోస్తోంది.

కానీ అంజి ప్రొఫెషనల్. ప్రతిఘటించే స్త్రీని ఎలా లోబరుచుకోవాలో తెలుసు. చెంప మీద ఫెడీల్మని కొట్టాడు. ప్రతిఘటన ఆపేవరకూ చేతులూ కాళ్ళతో కొడుతూనే ఉన్నాడు.

ఒక విదేశీ వ్యాసం ప్రకారం 'రేప్' 80 శాతం కేసుల్లో తెలిసినవారి వల్ల, 17 శాతం అపరిచితుల వల్ల, 3 శాతం ప్రొఫెషనల్స్ వల్ల జరుగుతుందట. సినిమాల్లో చూపించినట్టు మంచం చుట్టూ వెంటాడీ, చేతులు నొక్కిపట్టుకొనీ, వాళ్ళు గింజుకుంటూ ఉండగా బలవంతం చేస్తూ రేపిస్టులు సమయాన్నీ, శక్తినీ వృధా చేసుకోరుట. బలంగా కొట్టి విక్టిమ్ ని నిస్సహాయురాలిని చేస్తారట. మొదట్లో ప్రతిఘటించిన స్త్రీలు ఆ తర్వాత నిస్సత్తువుగా లొంగిపోతారు. కొందరు అప్రయత్నంగా సహకరిస్తారట కానీ, తక్కువ శాతం. ప్రొఫెషనల్ రేపిస్టుల్లో కామం కన్నా శాడిజం ఎక్కువ ఉంటుందట. అవతలి వ్యక్తి క్రమక్రమంగా ఓడిపోవటం వల్ల కలిగే 'గెలుపు ఫీల్' తో మరింత గిల్లటం, కొరకటం లాంటి పైశాచిక చర్యలతో శాడిజాన్ని సంతృప్తి పరచుకుంటారని చెపుతారు.

ఆ విధంగా కొట్టి ఆమెకు దాదాపు స్పృహ తప్పుతూన్న స్థితిలో అతడామెని పూర్తిగా ఆక్రమించుకున్నాడు.

శరీరం లయబద్ధంగా కదులుతున్నది. ఆలోచనలు మాత్రం తుఫానులో కల్లోల కెరటాల్లా ఎగిసి పడుతున్నాయి. సంబంధం లేని ఆలోచనలు. వాటికి గమ్యం లేదు. అసలు అర్థమే లేదు. 'ఆ పరిస్థితిలో ఆలోచనలేమిటి?' అన్న అనుమానం రాని ఆలోచనలు.

ముందు గుర్తు వచ్చింది అన్నయ్య. ఒక దుర్మార్గాన్ని ఎదుర్కొన్నందుకు భవిష్యత్తుని కోల్పోయినవాడు. మంచి కోసం నిలబడినవాడు. చెడు వల్ల హతమైనవాడు. ఎల్లమంద.

ఆ తరువాత గుర్తు వచ్చినది ఇంటిముందు ముగ్గులేసుకునే పల్లెటూరి అమ్మాయి. కులం పేరుతో ర్యాగింగ్ చేసిన వారిని కొట్టిన యువతి. తలుపులన్నీ వేసి కొడితే పిల్లయినా తిరగబడుతుందని రాజకీయ మాఫియాతో చదరంగం ఆడుతూన్న టీచర్. రవళి.

ఆపై గుర్తు వచ్చింది అన్నయ్య స్నేహితుడు. స్నేహాన్ని ప్రేమగా మార్చుకుని తోడుగా నిలబడతానన్నవాడు. కొద్ది రోజుల్లో జరగబోయే పెళ్ళి గురించి మృదు మధురంగా ఊహించుకుంటున్న వాడు. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న కరాళ వికృతం తెలియనివాడు బాలారిష్ట శ్వేతార్క.

ఆలోచనలతో ఆమెకి నెమ్మదిగా మైకం కమ్మింది. మెలకువ వచ్చేసరికి పైన వాడు లేడు. ఇంకెవడో ఉన్నాడు. చేతుల్లోకి సత్తువ తీసుకుని బలంగా పక్కకి తొయ్యటానికి ప్రయత్నం చేసింది. కానీ చేతకాలేదు. వెనక్కి పడినప్పుడు నడుముకి రాయి తగలటం వలన నరాలు పట్టేసాయి.

ఆమెకు లీలగా మాటలు వినపడతున్నాయి.

"ప్రభూ ఎక్కడ్రా?"

"విగ్రహానికి అవతల సిగరెట్టు కాల్చుకుంటున్నాడు"

తన నుంచి ఎవరో దూరంగా వెళుతూన్న అడుగుల చప్పుడు. "సరే. నేనూ పోయి కాల్చుకుంటా. నువ్వు కంటిన్యూ చెయ్యి. గుంట బావుంది. పది నిముషాల్లో వచ్చీ. లేకపోతే ప్రభుగాడు ఆగలేడు. సగంలో నిన్ను లేపేస్తాడు"

కదిలే కండరాల వేదన. శబ్దం లేని మనసు రోదన.

మరో రెండు క్షణాలు గడిచాయి. వాడు చెరో వైపూ కాళ్ళు వేసి కూర్చుని మొహం వైపు వంగబోతున్నాడు.

అప్పుడు జరిగిందా సంఘటన.

ఏదో పతేలున పగిలిన సౌండు.

శ్మశానంలో కపాలం పగిలినప్పుడు వచ్చే శబ్దం లాంటిది.

పైన ఉన్న శరీరం ఒక్కసారిగా పక్కకి జరిగింది. శబ్దం వచ్చాక శరీరం పక్కకి పడిందా? శరీరం పక్కకి జరిగాక శబ్దం వచ్చిందా?

ఆమె కళ్ళు విప్పింది. చేతికి చల్లగా తగిలింది. వ్రేళ్ళు తడిమి చూసుకుంది. జిగటగా... ఎర్రగా... రక్తం...!

క్షణం క్రితం పైనున్న శరీరం ప్రస్తుతం పక్కనుంది. మూలుగు కూడా లేదు.

తల పక్కకి తిప్పి చూసింది.

అక్కడి దృశ్యాన్ని చూసి కడుపులో తిప్పినట్టయింది. కెవ్వున అరవబోయింది. కొండల్నీ కోనల్నీ కదిల్చే కేక సత్తువ లేక గుండెల్లోనే నిక్షిప్తమై పోయింది.

మళ్ళీ చూడటానికి ప్రయత్నించింది. పక్కనే శరీరం వెల్లకిలా ఉంది కానీ...

కానీ...

దానికి...

మొ...

హం

లేదు.

మెడకీ జుట్టుకీ మధ్య పచ్చడయిపోయిన మాంసపు ముద్ద ఉంది. గంపెడు గోరింటాకు నూరి చేసిన ముద్ద లాంటిది.

సారమ్మ లేచి కూర్చుంది. క్రిందికి చూడటానికి భయం వేసింది. తల తిప్పి పైకి చూసి, తన కళ్ళని తానే నమ్మలేనట్టు నిశ్చేష్టురాలైంది. వాడి తల వైపున అథర్వణ..!

కొండ రాయి ఎత్తి పడెయ్యటం వలన వచ్చిన ఆయాసంతో రొప్పుతోంది.

మానవ మాత్రులు ఎత్తలేనంత పెద్ద రాయి అది. కోట గోడలు కట్టటానికి ఉపయోగించేది.

తనకి ఇష్టమైనవారికి ఇష్టంలేని పనేదో జరుగుతోందన్న అనుమానంతో వచ్చిన కోపం; కోపం వలన వచ్చిన సత్తువ; ఆ సత్తువకి తానే సాక్షి అన్నట్టు ఆమె వెనుక ఉన్న త్రిశిర నికుంభ రాక్షససంహార, పవిత్ర ప్రకీర్తి ప్రదాయ, ప్రభాత బ్రహ్మతేజ వాలగాత్ర, రుద్రరూప ధూమ్రాక్ష సూర్యమిత్ర వాయుపుత్ర విగ్రహం. ఆంజనేయస్వామి..!

సారమ్మ చుట్టూ చూసింది. ఎవరూ లేరు. ఆలస్యం చేయదల్చుకోలేదు. అథర్వణ చెయ్యి పట్టుకుని "పద" అంటూ అక్కణ్నుంచి వేగంగా కదిలింది. విగ్రహానికి వెనుక వైపుగా ఉన్న రాళ్ళ మధ్య నుంచి వాళ్ళు గేటు వైపు పరుగెత్తారు. అదే సమయానికి విగ్రహానికి ముందు వైపు కూర్చున్న ప్రభు అంజితో "ఫోటో దిగుదామా" అన్నాడు. ఇద్దరూ విగ్రహం ముందు ఫోటో దిగారు. "గోవిందుగాడు వచ్చాక ముగ్గురం మళ్ళీ దిగుదాం. మంచి అనుభవం. ఫేసుబుక్కులో పెట్టొచ్చు"

"వాడి దగ్గరకు వెళ్దాం. నలుగురం కలిసి దిగొచ్చు" అన్నాడు.

"అవును. ఇద్దరు బట్టలు లేకుండా, ఇద్దరం బట్టలతో".

"నువ్వు వచ్చేముందే మేమిద్దరం దిగాము. అప్పుడే ఫేసు బుక్కులో పెట్టేశా కూడా".

అలా పెట్టటమే ఈ కథ మరోమలుపు తిరగటానికి కారణ భూతమవబోతోందని తెలియని ఇద్దరూ జోకులు వేసుకుంటున్నారు.

అంతలో దూరంగా ఇద్దరు స్త్రీలు పరుగెత్తుకు వెళ్తూ కనపడ్డారు.

అంజి సిగరెట్టు వెలిగిస్తూ, "పని పూర్తి చేసుకుని ఏమీ ఎరగనట్టు ఎలా వెళ్ళిపోతున్నారో చూడరా" అన్నాడు అంజి.

"మీ ఇద్దరిదీ అయ్యింది. నాదవలేదురా" అంటూ వాళ్ళ వెనుక పడబోయాడు ప్రభు.

"వద్దు. ఎవరైనా చూస్తే రిస్కు. వదిలేయ్. గోవిందు వచ్చాక వెళ్లి పోదాం" వారించాడు అంజి.

మరో పది నిముషాలు చూసి, "వీడు ఇంకా రావటం లేదేమిటి?" అన్నాడు ప్రభు.

"వెల్లకిలా పడుకుని '...' ఎత్తులు తల్చుకుంటున్నాడేమో" బూతు కలుపుతూ జోకు వేశాడు.

"పక్కగుంటని కూడా ఏసేయ్యవలసింది బాసూ. అనవసరంగా వదిలేశావు"

"ఆళ్ళిద్దరు. నేను ఒక్కణ్ణి. మీరు కాస్త ముందొొచ్చినా బావుండేది"

"సర్లే. దక్కినోడికి దక్కిందే అమృతం".

ఇద్దరూ విగ్రహానికి అటు వెళ్ళారు. వాళ్ళు జోకు వేసినట్టే గోవిందు వెల్లకిలా పడుకుని ఉన్నాడు. అయితే ముఖం లేదు. తల స్థానంలో రక్తంతో తడిసిన మాంసపు ముద్ద ఉంది. అది 'తల' అని చెప్పటానికి మెడ మీద మాంసపు ముద్ద అంచున జుట్టు కనపడుతోంది. వెంట్రుకల చివరల నుంచి చిక్కనైన రక్తం చుక్కలుగా పడుతోంది.

ప్రభు అక్కడికక్కడే వాంతి చేసుకున్నాడు.

# 30

**రవళి** పర్సులోంచి ఒక పేపర్ కట్టింగ్ తీసి "కొన్ని నెలల క్రితం రామానాగేశ్వరరావు అనే కుర్రాడి ఉపన్యాసం ఇది" అంది.

"పేరు గమ్మత్తుగా ఉందే" అన్నాడు చక్రధరరావు.

"ఇద్దరు నటుల అభిమానులు ఇతడి పెద్దలు. రెండు పేర్లూ కలిపి కొడుక్కి పెట్టుకున్నారు. విషయం అది కాదు. ఈ కుర్రాడు తన క్లాస్మేట్ అని పార్థసారథి చెప్పాడు. చాలా నార్మల్ స్టూడెంటట. మీ చేతిలో ఉన్న పేపర్ కట్టింగ్ మళ్ళీ చదవండి. తన ర్యాంకు చూసి ముఖ్యమంత్రి ఉచితంగా చదువు చెప్పించాడనీ, ఇండస్ట్రీ పెట్టించాడనీ, తల్లికి కిడ్నీ ఆపరేషన్ కూడా చేయించాడనీ ఎమ్మెల్యే మీటింగులో ఈ కుర్రాడు చెప్పాడు. అనుమానం వచ్చి పార్థసారథితో ఎంక్వయిరీ చేయిస్తే, అసలా సంవత్సరం ఆ కాలేజికి ఒక్క ర్యాంకూ రాలేదని తెలిసింది. బాలారిష్ట వాడిని లాకప్‌లో పెట్టి నాలుగు పీకితే, ఎలక్షన్ కాంపెయిన్ కోసం అదంతా చాణుక్య చెప్పించాడని అన్నాడు. ర్యాంకూ లేదు. పరిశ్రమా లేదు".

"కిడ్నీ కూడా బోగస్సేనా?"

"అదొొక్కటే కరెక్టు. కానీ అందులో కూడా ఒక ట్విస్టు ఉంది. పోలీసులు ఉతికి ఆరేస్తున్నప్పుడు నమ్మలేని విషయం ఒకటి బైట పడింది. వాడి తల్లికి అసలు కిడ్నీ ప్రోబ్లం లేదు. ఆపరేషన్ చేశాక ఆవిడ మరణించింది. ఆ విషయంలో కొడుకు కూడా చాలా బాధపడుతున్నాడు".

"నాకేమీ అర్థం కావటం లేదు"

"మరో పది రోజులు ఆగండి. ప్రభుదేవ్ ఆస్పత్రిలో డాక్టరు సుబ్బారావుగారని ఉన్నారు. చాలా నిజాయితీ పరుడు. ఆయనకీ ఒక పని అప్ప చెప్పాను. పనయ్యాక మీకు పూర్తి వివరాలు చెపుతాను" అంటూ ఆమె లేవబోతూ ఉండగా ఫోన్ వచ్చింది.

అవతలి వైపు మాటలు వింటూంటే ఆమె మొహం వాడిపోయింది. స్థబ్దుగా ఫోన్ పెట్టేసి, వంట్లో సత్తువ లేనట్టు చేతుల్లో మొహం దాచుకుంది. రావు కంగారు పడి "ఏమైంది రవళీ" అని అడిగాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఎవరి దగ్గర నుంచి ఫోను?" .

"ఆదిత్యపురంలో సారమ్మని ఎవరో రేప్ చేశారట".

చక్రధరరావు షాక్ తగిలినట్టు నిశ్చేష్టుడయ్యాడు. కొంచెంసేపటికి తేరుకుని, "ఈ విషయం బాలారిష్టకు తెలుసా?" అని అడిగాడు.

"ఇప్పుడు ఫోన్ చేసింది తనే"

* * *

గెస్టు హవుసులో గాఢమైన నిశ్శబ్దం.

రాజా ఇంకా రాలేదు. అంజి, ప్రభు నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. గోవిందు మరణం అంజికి అంతగా 'ఎఫెక్ట్' అవలేదు కానీ, ప్రభు డిస్టర్బ్ అయ్యాడు. అతడికి గోవిందు చాలా దగ్గర. వాళ్ళిద్దరికీ 'చనువైన సంబంధం' ఉందని రాజా జోకులు వేస్తూ ఉంటాడు కూడా.

అయిదు నిముషాల తరువాత రాజా వచ్చాడు. అంజి ఫోన్ చేసి చెప్పటం వల్ల అతడికి గోవిందు హత్య విషయం ముందే తెలిసింది. రాగానే, "కంగ్రాచ్యులేషన్స్. వాడు చచ్చి మిమ్మల్ని సేవ్ చేశాడన్నమాట" అన్నాడు. అతడేమి మాట్లాడుతున్నాడో అర్థం కాక ఇద్దరూ అతడి వైపు అయోమయంగా చూశారు.

"హత్యకన్నా మానభంగానికే పెద్ద శిక్ష. మరోవైపు జనం గోల పడలేక కేసు కన్నా ముందే పోలీసులు ఎన్-కౌంటర్ చేసేస్తున్నారు. అందుకే మీ రేప్ సంగతి తెలియగానే భయపడ్డాను. కానీ మనం ఇప్పుడు సేఫ్"

"ఎందుకు? ఎలా?" అడిగాడు ప్రభు.

"రేప్ జరిగినట్టు వాళ్ళు కంప్లెయింటు ఇవ్వలేదు. ఇవ్వరు కూడా. ఇస్తే, హత్య కేసు వాళ్ళ మెడకి చుట్టుకుంటుంది. వాళ్ళని అరెస్టు చేస్తారు".

ఇద్దరి మొహాలూ విప్పారాయి.

"ఇప్పుడే చాణుక్యతో మాట్లాడాను. జనం గోల చేస్తే తప్ప రేప్ కేసుల్ని కోర్టులు సుమోటోగా తీసుకోరని చెప్పాడు. అసలు ఫిర్యాదే లేకపోతే గోలా లేదు, ఎంక్వయిరీ లేదు. అందుకే కంగ్రాట్స్".

అప్పటి వరకూ ఉన్న టెన్షన్ తగ్గింది. తరువాత బీరు తాగుతూ కబుర్లలో పడ్డారు.

విజ్ఞుల మధ్య పరిచయం మొదట్లో పలుచగా ఉండి- ఎదుటివారి గుణగణాలు క్షుణ్ణంగా తెలిశాక, వారి స్నేహం సాయంత్రం నీడలా క్రమక్రమంగా పెరుగుతుందనీ;

దుర్జనుల మధ్య స్నేహం ఉదయపు నీడలా పొడుగ్గా ప్రారంభమై, మొదటిక్షణం లోనే గాఢంగా అల్లుకుపోయి, మధ్యాహ్నానికి క్షీణిస్తుందనీ నానుడి. పేకాట, తాగుడూ లాంటి వ్యసనపరుల స్నేహానికి గానీ, యువతీ యువకుల పబ్బుల ప్రేమకి గానీ ఈ నానుడి వర్తిస్తుంది. ఈ క్షణం పరిచయం, మరుక్షణం స్నేహం, పది రోజుల పాటూ ప్రేమ, ఆపై మాట పట్టింపు, అభిప్రాయ బేధం, గొడవ...అన్ఫ్రెండ్... ఫోన్ నెంబరు డిలీట్. అంతే కదా.

ప్రస్తుతం ఆ ముగ్గుర్నీ చూసేవారికి అదే అనిపిస్తుంది. నిన్నటి వరకూ ఒకరికొకరు ప్రాణానికి ప్రాణం అనుకున్నవారు, ప్రాణస్నేహితుడి ప్రాణం పోయిన క్షణం, ఆ విషయం మర్చిపోయి తమ ప్రాణాలు సేవ్ అయినందుకు సంతోషిస్తున్నారు.

"లేవరా" అన్నాడు రాజా.


అంజి అర్థం కాక, "ఎందుకు?" అని అడిగాడు.

"ఒక్కసారి లే. చెప్తాను"

అంజికి అర్థం కాలేదు. లేచాడు. రాజా అతడిని కౌగిలించుకుని "చూసి రమ్మంటే కాల్చి వచ్చినట్టూ, చెంప మీద కొట్టినోడి కాబోయే పెళ్ళాం కడుపు కింద కొట్టి వచ్చావు. థ్యాంక్స్" అంటూ చెంప మీద ముద్దు పెట్టుకున్నాడు.

* * *

ముందు రాధ. వెనుక కృష్ణుడు. దూరంగా యమునా తీరం. ఇసుక తిన్నెలు. బొమ్మ క్రింద ముచ్చటైన రెండు వాక్యాలు.




అప్పుడెప్పుడో సత్య పెళ్లి సందర్భంగా తయారు చేసినది. మళ్ళీ ఇప్పుడు బాలారిష్ట పెళ్ళికి బహుమతిగా ఇద్దామనుకున్నది.

చిత్రాన్ని ఎదురుగా పెట్టుకుని చూస్తూన్నది రవళి.

*"మీ ఏడడుగుల అనుబంధం ఏడు జన్మల వరకూ కొనసాగాలని... "*

రెండు రోజుల్లో పెళ్లి ఉన్నదనగా జరిగిన ఈ అరిష్టం, తన పద్మవ్యూహాన్ని ఛేదించి తనని పరిహసిస్తున్నట్టు ఉన్నది..!

ఎలా అవుతుందనుకున్నది ఎలా అయింది?

జరిగినదంతా తన పగా, పంతం వల్లనే..! 'ముని మంత్రమ్ము నొసంగనేల? ఇడెబో మున్ముందు మార్తాండు రమ్మని నే కోరగనేల?' అని కుంతీ విలపించినట్టు... రాజాని టెలిఫోన్ ఉచ్చు లోకి లాగటం... అర్ధరాత్రి ఫోను... ఆపై పోలీసు కంప్లెయింటు ఇవ్వటం... అంతా తన అత్యుత్సాహపు అనాలోచిత చర్య. తను కంప్లెయింటు ఇవ్వకపోతే బాలారిష్ట అరెస్టు చేసి ఉండేవాడు కాదు. పోలీసుస్టేషనులో రాజాని కొట్టి ఉండేవాడు కాదు. రాజా అనుచరులు ఆదిత్యపురం వెళ్ళేవారు కాదు. చెల్లిని రక్షించటానికి వెళ్ళిన సారమ్మ, తనని తాను కోల్పోయేది కాదు.

సత్య ప్రపోజల్ వప్పుకుని అతడిని వివాహం చేసుకుని ఉంటే ఈ రోజు ఇది జరిగి ఉండేది కాదు.

చేపల కదలికల మల్లె సంబంధం లేని ఆలోచనలు. పొంతన లేని ప్రవల్లికలు.

ఆమె ఆలోచనల్ని చెదురుస్తూ రావుగారు, "బాలారిష్ట ఇప్పుడు ఇక్కడికి వస్తానన్నాడన్నావ్" అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. మళ్ళీ ఆయనే, "ఏమి చేస్తే బావుంటుందని అడగటానికేమో. ఏం సలహా చెప్తాం?" అన్నాడు.

ఆమె దానికీ సమాధానం చెప్పలేదు.

"ఏమి ఆలోచిస్తున్నావు రవళీ?"

"అమాయకత్వానికీ, అజ్ఞానానికీ తేడా ఏమిటని నేనూ, నాన్నా ఒక రోజు చర్చించుకున్నాము. నష్టం జరిగితే అజ్ఞానమనీ, ఆనందం పొందితే అమాయకత్వమనీ అనుకున్నాము. అది తప్పని తెలిసింది. ఏ అజ్ఞానంతో నా చెల్లి అథర్వణ హత్యానేరంలో ఇరుక్కుంది? ఏ కారణంగా సారమ్మ ... ..." అని ఏదో చెప్పబోతూ ఉంటే హడావుడిగా లోపలికి ప్రవేశించాడు బాలారిష్ట

"కార్డులు పంచటానికి ఆదిత్యపురం వెళ్లాను రవళీ. మా స్నేహితులందరూ అక్కడి వాళ్ళే కదా. అందరికీ ఇచ్చి వచ్చేసరికి ఆలస్యమైంది" చాలా తొందరలో ఉన్నట్టు ఒక కార్డు ఆమె చేతిలో పెట్టి, చక్రధరరావు వైపు తిరిగి, "సారీ సర్. ఎల్లుండి పెళ్లి పెట్టుకుని ఈ రోజు కార్డులు ఇస్తున్నాను. మీరు రాకపోతే పెళ్లి జరగదంతే" అంటూ కాళ్ళకి నమస్కారం చేశాడు.

ఇద్దరూ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. అతడు అంత హుషారుగా ఉల్లాసంగా ఉంటాడని వాళ్ళు ఊహించలేదు. జరిగిన సంఘటన కాబోయే దంపతులిద్దరినీ సమూలంగా కుదిపేస్తుందనీ, పెళ్లి విషయంలో పునరాలోచించుకోవాల్సి వస్తుందనీ అనుకున్నారు.

బాలారిష్ట ఆమెతో, "రవళీ. అమ్మాయి తరఫున అమ్మ తప్ప ఎవరూ లేరు. నాకూ మా అమ్మ ఒక్కతే" అంటూ రావు వైపు తిరిగి, "మీ ఇద్దరూ చెరో వైపూ ఉండి మా పెళ్లి జరిపిస్తే మాకు అంతకన్నా ఇంకేమీ అక్కర్లేదు సార్" అన్నాడు.

రవళి కళ్ళు అప్రయత్నంగా తడి అయ్యాయి.

అతడు వాచీ చూసుకుని "అమ్మో. ఇంకా ధర్మారావుగారి దగ్గరకు వెళ్లి కార్డు ఇవ్వాలి. టైమ్ లేదు" అంటూ బయల్దేరబోయాడు.

"బాలా" పిలవబోయి అర్ధంతరంగా ఆగింది. ఆ పై ఏమి మాట్లాడాలో ఆమెకు తెలియలేదు. ఏదో సందిగ్ధం. అతడు ఆమె వైపూ, రావుగారి వైపూ చూశాడు. ఆయన కూడా సందేహంగా చూస్తూ ఉండటంతో అడుగు ముందుకి వేసి "మీ అనుమానం అర్థమయింది" అన్నాడు.

అతడేమి చెప్పబోతున్నాడా అని ఉత్సుకంగా చూశారు.

"ఊరి నుంచి వెనక్కి నిన్నే రావాలి. అక్కడ సారమ్మని సముదాయించటానికి ఇంత టైముపట్టింది" అని ఓ క్షణం ఆగి, "ఇంత చిన్నవిషయానికి మీరందరూ ఎందుకింత సీరియస్‌గా ఫీలవుతూ ఉన్నారో అర్థం కావటం లేదు. తనకి ఒకటే చెప్పాను. 'అధర్వణ అభం శుభం తెలియని అమాయకప్పిల్ల. తెలియక నిప్పు పట్టుకోబోయింది. దాన్ని అడ్డుకునే క్రమంలో నీ చెయ్యి కాలింది. తలారా స్నానం చేసి, నిన్ను నువ్వు అభినందించుకోవాల్సింది పోయి, శీలం పోయిందని ఏడుస్తావేమిటి అన్నాను."

శ్రోతలిద్దరూ విభ్రాంతులై వింటూండగా అతడు ముక్తాయింపు వాక్యం చెప్పాడు. "వంట చేసేటప్పుడు బట్టల మీద మరక పడకుండా ఆప్రాన్ వేసుకుంటాం. ఎందుకు? మొత్తం బట్టలు ఉతకటం కన్నా ఆప్రాన్ ఉతకటం తేలిక కాబట్టి. మనసుకి శరీరం ఆప్రాన్. శరీరం మరక మనసు వరకూ వెళ్ళకపోతే అది స్వచ్ఛంగా ఉంటుంది."

ఉపమానానికి చక్రధరరావు మనసు ఉప్పొంగింది. ఉద్వేగం ఆర్ణవమైనప్పుడు, ఆనంద భాష్పాల సునామీని కనురెప్ప చెలియలి కట్ట ఆపగలదా?

# 31

**"మంచివార్త** రవళీ" అన్నాడు ధర్మారావు. "...ఇంకొద్ది రోజుల్లో పక్కమీద నుంచి లేచి చిన్నచిన్న పనులు చేసుకోవచ్చన్నారు డాక్టర్లు".

"కంగ్రాట్సు సర్"

"పరిస్థితి బాగా ఇంప్రూవ్ అయ్యిందట"

"మళ్ళీ ఉద్యోగంలో ఎప్పుడు చేరతారు?"

"అబ్బే. ఇప్పట్లో కాదు. ఒకవేళ చేరినా ఆ పెదపట్నంలో కంటిన్యూ చెయ్యరు. లాంగ్ లీవ్ కదా. మరో చోటుకు వేస్తారు. నువ్వు అడుగుతున్నది ఆ ఎల్లమంద కేసు కోసమే కదా?"

"నాన్నగారికి స్పృహ వచ్చే సమయానికి ఆ కేసు క్లోజు చేస్తానన్న నమ్మకం నాకున్నది సార్. అన్నట్టు నాన్నగారంటే గుర్తొచ్చింది. మరొక వార్త..! చక్రధరరావుగారు స్వీడన్లో ఒక డాక్టర్ని సంప్రదించారు. మెదడుకు సంబంధించిన ట్రీట్మెంట్సులో ఆయన నిపుణుడట. నాన్నగారి రిపోర్టులు అన్నీ చూసి, 'ఆపరేషన్ చేస్తే స్పృహలోకి రావటానికి చాన్స్ ఉన్నదన్నారట. రెండు మూడు నెలల్లో ఆయన ఇండియా వస్తున్నారు" అంది.

"చాలా మంచివార్త చెప్పావమ్మా"

"లేదండీ. చాలా చెడ్డ వార్త"

ఆయన విస్మయంతో "అదేమిటి?" అని అడిగాడు.

"జీవితంలో ఎంత ట్రాజిడీ ఉంటుందో తలుచుకుంటే ఒక్కోసారి చాలా నిస్పృహగానూ, విషాదంగానూ ఉంటుంది సార్. నా మీద పడిన నేరం నాన్న తన మీద వేసుకున్నాడు. ఆయన కోమాలో  ఉన్నంత కాలం పోలీస్ కేస్ ఉండదు. కానీ ఇప్పుడు ఆపరేషన్ చేస్తే ఆయనకి స్పృహ వస్తుంది. వెంటనే పోలీసులు అరెస్ట్ చేస్తారు. ఆయన కోమాలోకి ఉండటం మంచిదా, బయట పడటం మంచిదా? ఎంత చిత్రమైన స్థితి..! ఆ విదేశీ డాక్టర్ రావటం మరి కొంత ఆలస్యం చేయమని భగవంతుని ప్రార్థిస్తున్నానంటే నాకన్నా నికృష్టమైన కూతురు మరెవరూ ఉండరు".

ఆమె మనోస్థితి అర్థమైనట్టు ధర్మారావు మాట్లాడలేదు.

"మీకు ఆక్సిడెంటు జరిగింది కూడా మా వల్లే. అదృష్టవశాత్తు అందులోంచి బయటకు వస్తున్నారు. అదొక్కటే సంతోషం. భగవంతుడు మంచి వాళ్లకి మంచి చేస్తాడంటారు"

"మంచివాళ్లకు మంచి చేస్తాడంటారు కానీ చెడ్డవాళ్లకు చెడు చేస్తాడనరు. అందుకే ప్రపంచం ఇలా తగలడుతోంది"

"లేదు సార్. యథాయథాహి ధర్మస్య గ్లా నిర్భవతి. మాలాంటి వాళ్ళ కోసం మీలాంటి వారు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు"

"నేను అనవలసిన మాట నువ్వు అంటున్నావు" వాతావరణాన్ని తేలిక చేస్తూ నవ్వాడు.

"బాలారిష్ట వచ్చి పెళ్లి శుభలేఖలు ఇచ్చాడా సార్?" పరస్పర పొగడ్తల నుంచి టాపిక్ మార్చింది.

"గంట క్రితమే వచ్చి వెళ్లాడమ్మా. పెళ్లి రేపే అటగా. అమ్మాయిది కూడా ఆ ఊరే. ఎల్లమంద చెల్లెలంట. పోన్లే. అదృష్టవంతురాలు. అతడు నా కింద పని చేశాడుగా. చాలా మంచివాడు".

"నాకో చిన్న సాయం చేస్తారా సార్"

"ఏమిటమ్మా?"

"అతడిని తిరిగి పెదపట్నం ట్రాన్స్‌ఫర్ చేయించాలి"

"పెళ్ళవగానే అత్తారి ఊరికి ట్రాన్స్‌ఫర్ ఏమిటమ్మా? సారమ్మ అడిగిందా" నవ్వాడు.

"లేదండీ. ఈ రెండ్రోజుల్లో మీకు తెలియకుండా చాలా జరిగాయి" అంటూ అధర్వణ అంజితో ఆంజనేయ ఆలయం దగ్గరకి వెళ్ళటం నుంచీ, విగ్రహం వెనుక రేప్ వరకూ వివరించి చెప్పింది.

తన చెవులని తానే నమ్మలేనట్టు నిశ్చేష్టుడై విన్నాడు ధర్మారావు.

"పాము చిన్నదే కదా అని అనుకున్నాను. దానిక్కూడా విషం ఉంటుందని తెలుసుకోలేక పోయాను. ఆ విషం నా మీద కాకుండా సారమ్మ మీద చిమ్మింది. మా చదరంగం ఆటలో తాను బలి అయింది" బాధగా అన్నది.

షాక్ నుంచి ఇంకా తేరుకోనట్టు ధర్మారావు స్థబ్దంగా ఉండిపోయాడు.

"అక్కడ పోలీసాఫీసరు జాక్సను ముఖ్యమంత్రి మనిషి. అందుకే అక్కడి నుంచి అతడిని ట్రాన్స్‌ఫర్ చేయించి ఆ పోస్టులో బాలారిష్టని వేయించాలి. రేప్ విషయం బయటకు రాకూడదు కానీ, దోషులకు శిక్ష పడాలి".

"రేప్ బయటకి రాకుండా దోషులకు శిక్షా? ఎలా?"

"మన మనిషి అక్కడుంటే, మిగతా విషయాలు నేను చూసుకుంటాను సార్".

"కష్టమమ్మా. ప్రమోషన్ వచ్చి కొద్ది కాలమే అయ్యింది. వెంటనే బదిలీ అంటే కష్టం. అందులోనూ, అప్పటి వరకూ చేసిన ప్రదేశానికి అంటే మరీ కష్టం. ఎంతో పెద్ద ఇన్-ఫ్లూయెన్సు ఉంటే తప్ప లాభం లేదు".

"పెద్ద ఇనుఫ్లూయెన్సా?"

"అవును"

రవళి ఆలోచనలో పడింది.

ఇంటికొచ్చిన తరువాత ఒక ఆలోచన తట్టినట్టు సత్యకి మెస్సేజి పంపింది:

***"నీ స్నేహితుడి ప్రయారిటీ లిస్టులో నీ నెంబరెంత? తనకి నువ్వు తరచూ గుర్తురానివాడు, వచ్చినా ఆ విషయం నీకు తెలుపటానికి సమయం లేనివాడు, అవసరమైతే తప్ప నిన్ను పలకరించని వాడు, నువ్వు ఆ విషయం ఎప్పుడయినా గుర్తుచేస్తే 'ఫోను చేస్తేనే గుర్తున్నట్టా' అని సర్దుకునేవాడూ, నీ ఆత్మీయుడు కాదు. కేవలం పరిచితుడు మాత్రమే..! నీ ఫ్రెండ్‌కి నీకన్నా ముందు 100 ముఖ్యమైన పనులు ఉంటే, నీ కన్నా దగ్గరవాళ్ళు 10 మంది ఉంటే, అతడి ప్రయారిటీ లిస్టులో నీ నెంబరు 111 అన్నమాట. :-) నువ్వూ నన్ను ఇదే ప్రశ్న***

*అడుగుతున్నావా? లేదు మిత్రమా. నీవు నాకెప్పుడూ గుర్తు ఉంటావు. ఇది సమర్థన కాదు. నీకు ఎందరో ఉన్నారు. నాకు ఎవరూ లేరు. నీవు తప్ప."*

రెండు నిముషాల్లో సమాధానం వచ్చింది. "ఇడియట్. బిస్కెట్ వెయ్యొద్దు. ఏం కావాలో చెప్పు"

# 32

**రావుగారు** కన్యాదానం చేస్తున్నారు. పక్కనే కూతురు కల్పన ఉంది. రవళి అటే చూస్తోంది గానీ ఆలోచనలు ఎటో తిరుగుతున్నాయి. ఒకదానికి ఒకటి సంబంధం లేని ఆలోచనలు.

బాలారిష్ట శ్వేతార్క..! ఎంత చక్కటి పేరు..! ఎవరు పెట్టారో గానీ ఎంత విశిష్టమైన పేరు. చిన్న పోలీసు స్టేషన్లో చిన్న ఆఫీసరు. కానీ ఎంత ఉన్నతమైన వ్యక్తిత్వం..! సీతాన్వేషణలో హిమాలయంలా పెరిగిన హనుమంతుడి శరీరం అక్కడ, హిమాలయాల కన్నా ఎత్తుగా ఎదిగిన మానవత్వం ఇక్కడ.

హనుమంతుడి పేరు గుర్తురాగానే ఆమెకి సుందరకాండ గుర్తొచ్చింది. సీత కోసం రాముని అన్వేషణతో సుందరకాండ ప్రారంభం అవుతుంది. 'తన నీడ సైతము తనలాగే శోభిల్ల' నరుడై నారాయణుడు కిష్కింద వైపు వస్తున్నాడు. వస్తున్నది ఎవరో తెలుసుకుని రమ్మని సుగ్రీవుడు ఆంజనేయుడిని పంపాడు. రామాయణంలో హనుమంతుడి తొలి పరిచయం ఇక్కడే. హనుమంతుడి మరో పేరు సుందరుడు. సుందరకాండ నిజంగా సుందరమే. ***అడవుల అందం తిలకం దిద్ది, కోతుల అల్లరి కాటుక పెట్టి, రామాయణ ఇతిహాస కావ్య కన్నియని శోభాయమానం చేస్తుంది సుందరకాండ.*** అది పారాయణ చేస్తే చాలు విఘ్నములు తొలగి విజయాలు చేకూరుతాయని కొందరి విశ్వాసం. అనేక శ్లోకాలు ప్రార్థనా గీతాలుగా వాడుతారు.

జీలకర్ర బెల్లం తంతు జరుగుతోంది. ఒకరి తలపై ఒకరు చేతులు పెట్టుకుంటున్నారు. వధూవరులిద్దరూ ఒకరినొకరు తలపై స్పర్శించిన చోట సహస్రారచక్రం ఉంటుందనీ, తొలిస్పర్శ ద్వారా ఈ రెండు చక్రాలనీ మేల్కొలిపే ప్రయత్నం జరుగుతుందనీ, దానితో సగం వివాహం జరిగినట్టనీ చెపుతారు.

ఆ తరువాత ఇద్దరి మధ్యనున్న తెరని తొలగిస్తారు. ఈ ఘట్టాన్ని 'సమీక్షణం' అంటారు. ఒకరి భృకుటి మధ్య భాగాన్ని మరొకరు చూడాలి. కనుబొమ్మల మధ్యలో ఆజ్ఞాచక్రం ఉంటుందనీ, ఒకరినొకరు తొలిసారి అబ్బురంగా చూసినప్పుడూ, వణికే వేళ్ళతో మొదటిసారి సంభ్రమంగా తాకినప్పుడూ... చూపూ, స్పర్శా రెండూ పవిత్రంగా, శుభప్రదంగా ఉండేందుకే ఈ నియమమనీ చెపుతారు. ఫీలింగ్ కి హేతువు అవసరం లేదు కదా.

తొలిచూపు పలకరింపు పులకరింపు. తొలిస్పర్శ పలకరింపు జలదరింపు.

వివాహత్పూర్వమే అబ్బాయీ, అమ్మాయిల తొలి స్పర్శ, ముద్దు, వస్త్ర రహిత అనాఛ్ఛాద కౌగిలింత, ఇంకా అంతకన్నా లోతుగా వెళ్లినవారికి ఈ తొలి అనుభవపు అందం, ఆనందం అర్థం కావు. ఏకశయ్యా వరకూ అనుభవించి, శీలం కోల్పోలేదనే ఆత్మవంచనతో ఏమీ తెలియనట్టు పెళ్లి పీటల మీద అమాయకంగా కూర్చునే అమ్మాయిల కన్నా, తన ప్రమేయం లేకుండా శీలం కోల్పోయిన సారమ్మ శీలవతి కాదా? అసలు శీలం కోల్పోవటం అంటే ఏమిటి? "పెళ్లికి ముందు అత్యంత అపురూపవతి అయిన భార్య, వివాహం తరువాత మశూచి పోసి అందం కోల్పోతే భర్త వదిలేస్తాడా?" అంటాడు ఓ రచయిత. కండరాల మధ్య కందరం బలవంతపు రాపిడి మశూచి కన్నా భయంకరమైనది కాదే.

ఒకదానికొకటి సంబంధం లేని ఆలోచనలు. సారమ్మ ఫీలింగ్ ఎలా ఉన్నది ఇప్పుడు? ప్రతీ క్షణమూ ఆస్వాదిస్తూ ఉన్నదా? బాలారిష్ట లాంటి మనీషి దొరికాక ఆనందించకుండా ఉంటుందా?

పెళ్లికొడుకు మంగళ సూత్రం కడుతున్నాడు. ఆకర్షణ అంతమవ్వటానికి మలుపు 'పెళ్లి'. అక్కడినుంచీ అది తగ్గిపోవచ్చు. లేదా ప్రేమగా మారి కొత్త చిగుర్లు వెయ్యొచ్చు. చిన్న చిన్న ఆక్సిడెంట్లు ఉండొచ్చుగాక. కాని దానితోనే బంధం తెగిపోదు.

తొలి చూపులో ఎవరూ ప్రేమలో పడరు. ఆకర్షణలో పడతారు. 'ఎగిరిపడే నీ గుండెల్ని చూసి... ఎగసి పడదా(!) నా సమస్తం' అని పాడే హీరోనీ, 'నీ ఊపిరికి చెరిగిపోవాలి నా మేకప్పు... నా జీవితం కూరలోకి నువ్వే కదా ఉప్పు' అనే హీరోయిన్నీ సృష్టించే రచయితలూ, దర్శకులూ ఎవరూ కూడా తమ స్వీయజీవితంలో అంత గాఢంగా, శాశ్వతంగా ఎవర్నీ ప్రేమించరు. 'తమకి అలాంటివారు ఉంటే బావుణ్ణు' అనుకునే వారికోసం ఒక స్వాప్నిక జగత్తుని సృష్టిస్తారు. ఎందుకంటే ఊహ బావుంటుంది. వాస్తవం భయపెడుతుంది. 'పదో క్లాసులో నా ప్రేమానుభవం' అని ఒకరు పోస్టు పెడితే వందమంది లైక్ చేస్తారు. అది ఊహ. 'చదువుకునే వయసులో– అందులోనూ పదో క్లాసులో ప్రేమ ఏమిటి?' అని అందులో ఒకరు ఖండిస్తే అతడి పై విరుచుకుపడతారు. 'లేత వయసులో అదొక అద్భుతమైన అనుభవం. అటువంటి అనుభవం ఒక్కటి కూడా లేని లైఫు వేస్టు' అంటారు. అందులో కొందరికి తొమ్మిదోక్లాసు చదివే కూతుళ్ళు ఉండి, అందులో ఒకరు గర్భవతి అయితే ఏమి సమాధానం చెపుతారు? ప్రేమ వేరు, సెక్సు వేరు అంటారా? మారుతున్న పోర్నో వ్యవస్థలో పిల్లలు ప్లేటానిక్కు లవ్వుతో ఆగగలరా? పదో క్లాసు పిల్లలకి ఆకర్షణకీ, అనుభవానికీ తేడా తెలుస్తుందా? అది వాస్తవం.

దంపతులు తలంబ్రాలు పోసుకుంటున్నారు. ఎంత హాయిగా ఉంది సారమ్మ. ఎంత స్వచ్ఛంగా నవ్వుతోంది..!

బాలారిష్ట అన్నట్టు, ఒక చిన్న విషయానికి తను అనవసరంగా ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూన్నదా? లేదేమో. అనవసరమైన విషయాల వైపు సాగకపోతే అది ఆలోచన ఎలా

అవుతుంది? సందేహమే కదా బీజం. ఆలోచనే కదా దాహం. 'ఆలోచన' కి ఫుల్-స్టాపు ఉంటే అది 'జ్ఞానం'గా ఎలా రూపు దిద్దుకుంటుంది? ఆలోచనా బీజం లేకుండా జ్ఞానవృక్షం ఎలా పెరుగుతుంది?

వధూవరులకి అరుంధతిని చూపించటం కోసం పురోహితుడు తీసుకువెళ్తున్నాడు. అరుంధతి..! కులం పరిధిని అధిగమించి ఋషిని వివాహమాడిన పతివ్రత.

రవళి దృష్టి తాను అందించబోయే బహుమతి మీద పడింది.

ఏడడుగుల ప్రయాణం. 'ఎక్కడికని' అడిగింది వెనుక అడుగు. 'ముందువారు ఎటు వెళ్తే అటే' అన్నది ముందడుగు.

సందర్భానికి 'తగిన' బహుమతి. వివాహం అంటే అదేగా. నాతిచరామి..!

ఆలోచనల్లోనే అప్పగింతలు కూడా అయ్యాయి. మండపం నుంచి కార్లో ఇంటికి వస్తూంటే "పెళ్లి పెద్దగా పదిరోజుల్లో రెండు పెళ్ళిళ్ళు చేసేశారు నాన్నా" అని ఏడిపించింది కల్పన.

"అవును. కూతురి పెళ్లి చెయ్యకముందే పెళ్లి పెద్దనయ్యాను. ఇక మూడో పెళ్లి రవళిది. నాలుగోది నీది" అన్నారు రావు.

'అవునా' అన్నట్టు కల్పన రవళి వైపు మొహం తిప్పింది.

టాపిక్ మార్చటం కోసం రవళి "మీరు ఎంత బిజీయో తెలిసీ మీకు శ్రమ ఇచ్చాను" అంది.

రావు నవ్వి, "ఈ రెండు పెళ్ళిళ్ళ సమయంలో నాకు రెండు కాళ్ళు లేవన్న విషయమే మర్చి పోయానమ్మా" అన్నాడు.

# 33

**పెదపట్నం** ట్రాన్స్‌ఫరయిన సందర్భంగా పెళ్లి సందర్భం కూడా కలిసి వస్తుందని స్టాఫ్ కి పార్టీ ఇస్తున్నాడు బాలారిష్ట.

"పెళ్లికూతురు అడుగు పెట్టిన ముహూర్తం మంచిదయ్యా. స్వంత ఊరికి ట్రాన్స్‌ఫరయి వెళ్లి పోతున్నారు" అన్నాడు పోలీసు వీరయ్య.

"పెద్దవాళ్ళు ఎవరైనా తెలిస్తే నాకూ చెప్పవయ్యా" పార్టీ కాస్త చిక్కనయ్యాక, రెండు పెగ్గులు తాగిన ఆ ఊరి డి.యస్పీ బ్రతిమాలాడు.

"పెద్దవాళ్ళు నాకు తెలియటం ఏమిటి సార్?" కంగారుపడ్డాడు బాలారిష్ట.

"చెవిలో పూలు పెట్టకు. ప్రమోషన్ మీద ఈ ఊరు వచ్చి పది రోజులు కాలేదు. మళ్ళీ సొంతూరికి ట్రాన్స్‌ఫర్. ఎంత పలుకుబడి ఉంటే ఇది సాధ్యమవుతుంది చెప్పు."

"నిజంగా నాకు అంత సీను లేదు సారూ. అక్కడ ఒక మర్డరు జరిగింది. ఆ విషయంలో ఇంటరెస్టున్న వాళ్ళు అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించారంతే".

ఆ సంభాషణ అక్కడితో ముగిసింది.

ఆ సాయంత్రం అతడికి ఫోన్ వచ్చింది. "కంగ్రాట్స్. పెదపట్నం ట్రాన్స్ఫర్ అయిందటగా" అన్నది రవళి.

"ఏమీ తెలియనట్టు మాట్లాడకు. ఇంతకీ ఓ అనుమానం. నా కోసం అంత పెద్ద రికమెండేషన్ ఎవరు చేశారు?"

"ఆ సంగతి వదిలి పెట్టు. నిన్ను అక్కడికి ట్రాన్స్ఫర్ చేయించింది కేవలం ఒకే ఒక పని కోసం. ఆ ముగ్గురిలో ఒకడు చచ్చేడు. రేప్ కేసు బయటకి రాకుండా మిగతా ఇద్దరికీ శిక్ష పడాలి"

"అర్థం కావటం లేదు. రేప్ కేసు లేకపోతే ఇక వారి మీద ఏ నేరం ఉంటుంది? గోవిందుని మర్డరు చేసింది మన అమ్మాయి కదా"

"రేప్ విషయం బయటకి తెలియకూడదు."

"నేను చెప్పేదీ అదే. రేప్ జరిగిందని చెప్పకుండా శిక్ష ఏమి ఉంటుంది?"

"రేప్ సంగతి బయటకి వస్తే సారమ్మ తట్టుకోలేదు. కానీ మర్డరు జరిగింది కదా. దానికి ఎవరో ఒకరికి శిక్ష పడాలి కదా".

"నాకర్థం కావటం లేదు"

"రావుగారి కాళ్లు విరగ్గొట్టి దొంగ సాక్ష్యాలతో మీసాల్రాజా శిక్ష తప్పించుకున్నాడు. చేసిన నేరానికి ఒక మనిషి శిక్ష తప్పించుకున్నప్పుడు, చేయని నేరానికి మరో నేరస్థుడికి శిక్ష పడేలా చేయలేమా?"

తల మునకలయ్యేటంత విస్మయం చెందాడు బాలారిష్ట. ఆదిత్యపురంలో అష్టాచెమ్మా ఆడుకునే అమ్మాయేనా ఈమె?

"ఆంజనేయ విగ్రహం దగ్గర హత్య జరిగిన సమయంలో వాళ్ళు ఇద్దరూ అక్కడే ఉన్నారన్న సాక్ష్యం ఒక్కటి కూడా లేదా?" అడిగింది.

"హత్య జరిగిన సమయంలో అనుమానితుల లోకేషనూ, ఫోన్ రికార్డూ పరిశీలిస్తాం. కానీ చంపింది మన అమ్మాయే కాబట్టి ఆ కోణంలో పరిశోధన చెయ్యలేదు".

"పక్కా సాక్ష్యం అవసరం లేదు. ఏ చిన్నసాక్ష్యం దొరికినా చాలు. కోర్టులో నిరూపించటానికి కాదు. కేవలం బెదిరించటానికి. అలాంటిది దొరికితే ఫోన్ చేసి చెప్పు"

"బెదిరించటం ఏమిటి? ఎవర్ని బెదిరిస్తాం? ఏమని బెదిరిస్తాం?"

రవళి నవ్వి, "ఆత్రపు పెళ్లి కొడుకు అత్త మెడలో తాళి కట్టాడన్నట్టూ ఎందుకంత తొందర? ముందు సాక్ష్యం గురించి ఆలోచించు. తరువాత ఏమి చెయ్యాలో చెపుతాను" అంది.

ఆ తరువాత గంటకి అతడి నుంచి ఫోన్.

"విగ్రహం ముందు దిగిన ఫోటోలు ఫేస్బుక్‌లో పెట్టారు. ముగ్గురూ ఒకేచోట ఉన్నారన్న కీలకమైన పాయింటు" అని చెప్పాడు.

ఆమె రాంబాబుకి ఫోన్ చేసింది. అతడు ఏదో తమిళనాడు బ్రోతల్ హవుసుకి సంబంధించిన సంచలన వార్తని ప్రజల్లోకి వదలాలని ఆయత్తమవుతూ ఉండగా ప్రొద్దున్నే ఫోన్.

"రవళిని. మీతో కాస్త మాట్లాడాలి. రాగలరా?"

అతడామె పేరు గుర్తు పట్టలేదు. జర్నలిస్టులని అమ్మాయిల అందమైన వాయిస్సులు ఆకట్టు కోవు. వాళ్ళు కదలాలి అంటే డబ్బయినా ఉండాలి. సంచలనం కలిగించే వార్తయినా కావాలి. "దేనికి? ఏం పని" అని అడిగాడు అనాసక్తంగా.

"నేను చక్ర ఇండస్ట్రీస్ సెక్రెటరీని. ఆదిత్యపురం మర్డరు కేసులో కొంత ఇన్ఫర్మేషను ఇద్దామని"

మొదటి వాక్యం కన్నా రెండోది ఇంటరెస్టింగ్‌గా అనిపించి, "అయిదు నిముషాల్లో వస్తున్నాను. అడ్రసు చెప్పండి" అన్నాడు.

అరగంటలో అతడు చక్ర ఆఫీసు దగ్గర ఉన్నాడు. ఇంద్ర భవనంలాంటి ఆఫీసు చూసి చకితుడయ్యాడు. రవళి పేరు చెప్పగానే రిసెప్షనిస్టు అతడిని పై అంతస్తు గదికి పంపింది. జీవితంలో ఎన్నో అనూహ్యమైన సంఘటనలు చూసి ఉంటారు కాబట్టి, జర్నలిస్టులు ఆశ్చర్యపడటం చాలా తక్కువ. అటువంటి రాంబాబు, సెక్రటరీ స్థానంలో ఉన్న రవళిని చూసి తల మునకలయ్యే ఆశ్చర్యంతో "మీరా? రవళి కదూ. ఇక్కడున్నారేమిటి? అంతకు ముందు ఆదిత్యపురంలో టీచరుగా ఉండేవారు కదూ. ఇంతకీ అది మీరేనా?" అని అడిగాడు.

రవళి నవ్వి, "మొత్తానికి జర్నలిస్టు అనిపించారు. ఒక్క పాయింటు తెలుసుకోవటానికి ఇన్ని ప్రశ్నలు అడగాలా? సరే. అసలు విషయానికి వస్తాను" అంటూ రేప్ విషయం తప్పించి మొత్తం జరిగిందంతా చెప్పి, చివరగా "...గతంలో మీకు నేను కొంత డబ్బు బాకీ. అదీ ప్లస్ ఇదీ కలిపి ఇప్పుడు ఇస్తున్నాను. మీ శైలిలో మరింత మసాలా జోడించి వ్రాయండి. నాకు ఈ వార్త అర్జెంటుగా బయటకు రావాలి" అని కవరు అందజేసింది.

డబ్బు తీసుకొని బయటకు వెళుతూ గుమ్మం దగ్గర ఆగి, "మీకో విషయం చెప్పవచ్చా మేడమ్" అన్నాడు. గతంలో లేని గౌరవం అతడి సంబోధనలో ధ్వనించటం గమనించినా, మొహంలో ఆ భావం కనపడకుండా తలెత్తి చూసింది.

"ముఖ్యమంత్రి బావమరిది, గృహమంత్రి మనవరాలు... ఇద్దరి మీదా వీడియో కావాలని మీరు అడిగినప్పుడు, బ్లాక్-మెయిల్ చేయడానికి అడుగుతున్నారని అనుకున్నాను. ఎందుకు చేస్తున్నారో అప్పుడు తెలీదు కానీ, ఇప్పుడు మీరు మొదటి నించీ ఇదంతా ఏదో

మంచి ఉద్దేశ్యంతోనే చేస్తున్నారని అర్థం అవుతోంది. కంగ్రాట్స్ మేడమ్" అని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత అతడు 'కథ' ప్రిపేర్ చేశాడు.

ఆకర్షణీయమైన పేరు పెట్టి పదిమందితో చదివించటం ఒక ఆర్టు. 'ఐశ్వర్యా రాయ్ చీకటి రాత్రి కథ' అని పెడితే జనం ఆవురావురుమంటూ చదువుతారని అతడికి తెలుసు. గతంలో అలాగే హెడ్డింగ్ పెట్టి ఒక వార్త రిలీజ్ చేశాడు.

<u>**బయటపడిన ఐశ్వర్యా రాయ్ పడగ్గది రహస్యం**</u>

<u>**బెదిరిపోతున్న బాలీవుడ్ నటులు**</u>

నలభై ఏళ్ల వయసులో కూడా నలగని అందంతో ప్రేక్షకులని ఉర్రూతలూగించిన జగదేకసుందరి ఐశ్వర్యారాయ్ ఇప్పటివరకూ దాచిన దాంపత్యేతర రహస్యాలు కూడా ఉన్నాయా? మాఫియాకి భయపడి ఇప్పటివరకూ చెప్పలేదా? ఉన్నాయని ఆమెనే స్వయంగా వెల్లడించింది. భారతదేశపు నెంబర్-వన్ నటుడు అమితాబ్ బచ్చన్ కొడుకు అభిషేక్ బచ్చనుని వివాహమాడి, ఒక పాపకి జన్మనిచ్చిన ఐశ్వర్యారాయ్ చీకటి రహస్యం ఏమిటి? 'నా పడగ్గది రహస్యం రేపు చెప్తాను' అని ఆమె నిన్న పత్రికా విలేఖరుల సమావేశంలో అనటంతో, ఇరవై నాలుగ్గంటల పాటూ సినీవర్గాల్లో కలకలం రేగింది. ఆమె వెల్లడించబోయే విషయమై ఎంతోమంది టాలీవుడ్, కోలీవుడ్, హాలీవుడ్, బాలీవుడ్ నటులు భయపడిపోతున్నారు. ఈ రహస్యం చెప్పటానికి తాను ఏమాత్రం వెనుకాడననీ, ఆ బాధ్యత తనమీద ఉన్నదనీ ఆమె వెల్లడించింది. ఆమె రహస్యం ఈ రోజు ప్రపంచానికి బట్టబయలైంది. ఈ విషయం బయటపడటంతో సాటి నటుల భయాలు నిజమయ్యాయి. భయపడినవారు తమ పేర్లు బయటకు చెప్పటానికి ఇష్టపడలేదు. తన అందానికీ, సౌందర్యానికీ కారణం కలతల్లేని నిద్ర అనీ, దానికి కారణం తాను పడుకునే మాట్రెస్ అనీ, సాఫ్ట్-స్లీప్ పరుపుల ప్రమోషన్ సందర్భంగా హర్షధ్వానాల మధ్య ఐశ్వర్య తెలిపారు. మనిషికీ పరుపుకీ మధ్య సంబంధాన్ని ఆనందభాష్పాల మధ్య ఆమె వెల్లడించారు. ముఖ్యంగా పెళ్లి కాని యువతకి ఈ పరుపులు, దిళ్ళు చాలా ఉపయోగకారి అని ఆ అతిలోక సుందరి చెప్పారు. ఆమె చెప్పినది విన్న తరువాత, సాటి నటుల ఆందోళనకి కారణం అదే. ***సాఫ్ట్-స్లీప్*** పరుపుల మీద పడుకోక పోవడం వల్ల తమ భవిష్యత్తు దెబ్బతింటుందేమో అని హాలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్ నటీనటులందరూ భయపడిపోతున్నారు. 'అయితే ఇందులో భయపడవలసిన అవసరం లేదనీ, అదే నిజమైతే ఆ పరుపు మీద పడుకుంటున్న అభిషేక్ బచ్చన్ కూడా జగదేకవీరుడు అవ్వాలి కదా. అతడు నిజంగా అంత అందంగా తయారవుతున్నాడా?' అని కొందరు అంటున్నారు. ఈ చర్చ ఇటీవల సినీ వర్గాల్లో చాలా లోతుగా సాగుతోంది. నెటిజేన్లు చెరోవైపు విడిపోయి చర్చించుకుంటున్నారు..." అని ఉంటుంది.

శవాల మీద పేలాలు ఏరుకునే వారు ఈ టైపు ఛానెల్ జర్నలిస్టులయితే, ఆ పేలాలు శవాల మీదవి అని తెలిసి కూడా కొందరు అడ్రినలిన్ రిలీజ్ కోసం ఈ వార్తలు చదువుతారు. చివరి వరకూ చదివి, వినాయకుడి బొడ్లో వేలుపెట్టినట్టు నాలుక్కర్చుకుంటారు. అనుభవం నేర్పిన పాఠాలు నేర్చుకోకుండా, మరో దరిద్ర హెడ్డింగ్ ఉన్న సెన్సేషనల్ వార్త వైపు వెళ్తారు.

రవళి కోరిన విధంగా రాంబాబు ప్రొద్దున్నే ఈ వార్త రిలీజ్ చేశాడు. అయితే కేవలం గాలి పోగు చేయకుండా, హనుమంతుడి విగ్రహం, గోవిందు మరణించిన చోటు, ఫేస్బుక్కులో వారు పెట్టిన ఫోటోలు, మరికొన్ని వాస్తవాలూ చేర్చి "గోవిందు హత్య వెనుక అసలు రహస్యం" అన్న ఆసక్తికరమైన హెడ్డింగుతో న్యూస్ వ్రాశాడు.

**గోవిందు హత్య వెనుక అసలు రహస్యం**

**ఇద్దరు మిత్రుల ముద్దుల సంబంధం**

*పెదపట్నం పోలీస్ స్టేషను పరిధిలోని ఆదిత్యపురంలో జరిగిన హత్య వెనుక ఎవరున్నారు? ఈ విషయమై పెదపట్నం మాజీ ఇనస్పెక్టరు ధర్మారావుని మా ఛానెల్ సంప్రదించింది. ఆక్సిడెంటు జరిగి ప్రస్తుతం బెడ్-రెస్టులో ఉన్నా, ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.*

*హత్య జరిగిన రోజు ప్రొద్దున్న ముగ్గురు వ్యక్తులు ఆదిత్యపురం వచ్చారు. నగరంలో వీరికి ఒక గెస్టు హవుసు ఉన్నదనీ, చాలాకాలం క్రితం తానే దానిని రైడ్ చేసి వీరిని అరెస్ట్ చేశాననీ ధర్మారావు చెప్పారు. వీరు ముఖ్యమంత్రికి దగ్గరవారని తెలిసింది. స్వతంత్ర భారతదేశంలో ఎవ్వరైనా ఎక్కడికైనా వెళ్ళవచ్చు. ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ అందులో ఒకరు హత్య గావింపబడ్డారు. వీరు ఆదిత్యపురం ఎందుకు వచ్చారు? కొత్తగా కడుతున్న హనుమంతుడి విగ్రహం వద్దకు ఎందుకు వెళ్ళారు? ఈ విషయమై శోధించే కొద్దీ ఆసక్తికరమైన విషయాలు బయటపడుతున్నాయి.*

*ఈ వ్యక్తులు ఆదిత్యపురానికి కొత్త కాదు. గతంలో సంక్రాంతి రోజు ఉదయాన్నే ఆ గ్రామానికి వచ్చి రోడ్లపై నానా భీభత్సం సృష్టించారు. ఇంట్లోకి బాటిల్స్ విసిరి ఒక పాపకి ప్రమాదకరమైన గాయం చేశారు. దానికి ప్రతీకారంగా ఆ గ్రామస్తులు వారికి గుండు గీసి పంపించారు. ఆ సంఘటనలో గ్రామంలో ఎల్లమంద అనే యువకుడు మరుసటి రోజు దారుణహత్యకు గురయ్యాడు. "ఆ కక్షతో గ్రామస్తులే వీరిలో ఒకరిని చంపారా?" అన్న అనుమానం వచ్చినా, దానికి సరయిన కారణాలు కనపడటం లేదు. ఎందుకంటే ఒకవేళ గ్రామస్తులే గోవిందుని చంపి ఉంటే, ఆ హత్య గురించి మృతుడి మిగతా స్నేహితులు వెంటనే పోలీసులకి*

*చెప్పాలి కదా. తమలో ఒక మనిషి చనిపోతే అలా ఏమీ పట్టనట్టు ఎలా వెళ్ళిపోయారు? ఈ ముగ్గురికీ డబ్బు విషయంలోనో, స్త్రీ విషయంలోనో, లేదా ఒక పురుషుడికి మరో పురుషుడితో ఉన్న సంబంధం వల్లనో గొడవ జరిగి ఉంటుందని, మరింత లోతుగా శోధిస్తే తప్పు అసలు నేరస్తులు బయటపడరని జనం భావిస్తున్నారు.*

*దానికన్నా ముఖ్య విషయం ఏమిటంటే, పోస్ట్ మార్టం రిపోర్ట్ ప్రకారం హత్య జరిగిన సమయం మధ్యాహ్నం 12.30. విగ్రహం వెనుక మరణించిన గోవిందు ఫోనులో 12.25 కి విగ్రహం ముందు నిలబడి దిగిన ఇద్దరు స్నేహితుల ఫోటో ఉంది. కేవలం అయిదు నిముషాల క్రితమే దాన్ని వారు అతనికి వాట్సప్పులో పంపారని 'టైము' చెపుతోంది. దీని బట్టి హత్య జరిగే సమయానికి ఈ ఇద్దరూ కూడా అక్కడే ఉన్నారని తెలుస్తోంది. వీరు విగ్రహం ముందు, అతడు విగ్రహం వెనుకా ఎందుకు ఉన్నారు? ఇంకోలా చెప్పాలంటే హత్య జరిగాక, ఏమీ తెలియనట్టు అక్కడి నుంచి ఇద్దరూ హడావుడిగా నగరానికి ఎందుకు వెళ్ళిపోయారు?*

వింటున్న రాజా ఉలిక్కి పడ్డాడు. మిగతా ఇద్దరి మొహాలూ రక్తం లేనట్టు పాలిపోయాయి. రేప్ సంగతి బయటకి రాదని సంబరపడ్డారే తప్ప, హత్య కేసు ఈ విధంగా తిరుగుతుందని అనుకోలేదు. ఏం చేద్దాం అన్నట్టు రాజా వైపు చూశారు.

రాజా లేచి ప్రభు దగ్గరగా వచ్చి చెంప మీద ఫెడేల్మని కొట్టి, "ఫోటోలు దిగటానికి అదిరా టైమూ ప్లేసూ?" అన్నాడు.

ప్రభు మాట్లాడలేదు. చెంప సర్దుకుంటూ మౌనం వహించాడు. రాజా అంజి వైపు తిరిగి, "చాణుక్య ఎక్కడ ఉన్నాడో కనుక్కో" అన్నాడు. అంజి ఫోన్ చేసి, "కొత్త అల్లుడూ, కూతుర్ని తీసుకుని తిరుపతి వెళ్ళి, ఈ రోజే వచ్చాడట" అని చెప్పాడు.

గతంలో ఒక మర్డర్ చేశాడు కాబట్టి అంజి ధైర్యంగానే ఉన్నాడు. మొట్ట మొదటిసారి రాజా కాస్త డిస్టర్బ్ అయినట్టు కనపడ్డాడు. నిజానికి అందరికన్నా ఎక్కువ భయపడుతూన్నది ప్రభు. మీసాల్రాజా గ్రూపు అందరిలోనూ అతడే పిరికివాడు. ప్రతి స్నేహ బృందంలోనూ ఇలాంటివారు ఒకరిద్దరు ఉంటారు. మందుపార్టీల్లో సోడాలు ఓపెన్ చేస్తూ, స్నేహితులు తమపై వేస్తున్న సెటైర్లకి నవ్వుతూ, టూర్లూ, పిక్నిక్కుల్లో జోకులు భరిస్తూ, వారి శాడిజానికి బలి అవుతూ బ్రతికే వీరిని, 'సెటైర్ టార్గెట్స్' అంటారు. మీసాల్రాజా గ్రూపులో ప్రభు అలాంటి వాడు.

అంజి కూడా భయపడుతున్నాడు కానీ, అతడి భయం మర్డరు గురించి కాదు. ప్రభు గురించి..! పోలీసులు గట్టిగా బెదిరిస్తే మానభంగం గురించి కూడా చెప్పేస్తాడు. అదీ భయం.

ఆ మరుసటి రోజు వాళ్ళు ముగ్గురూ వెళ్లి చాణుక్యని కలుసుకున్నారు. అతడు ధైర్యం చెపుతూ, "రేప్ గురించి ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదు కాబట్టి, మీరు ఆ విషయం మర్చిపోవచ్చు. మీ కేసు పెదపట్నం జ్యూరిస్ డిక్షనులోకి వస్తుంది. అక్కడ ఇనస్పెక్టరు ధర్మారావు ఇంకా శలవులోనే ఉన్నాడు. ప్రస్తుతం అక్కడ స్టేషను ఇన్చార్జి జాక్సన్. మనవాడే. వాడితో మాట్లాడాను. ఆ హత్య కేసు ఇంకో పదేళ్ళయినా తేలదు. మీరు సంతోషంగా వెళ్ళొచ్చు" అన్నాడు.

నిజానికి పోలీసులు ఆ ముగ్గుర్నీ ఎన్‌కౌంటర్ చేస్తే సంతోషించే వాళ్ళలో అతనొకడు. అతడికి భీష్ముడు గుర్తు వచ్చాడు. దుర్యోధనుడితో ఉండటాన్ని భీష్ముడు మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాడా అనే విషయమై రకాల కథనాలున్నాయి. అతడి పరిస్థితి కూడా అదే. ముఖ్యమంత్రి దగ్గర దొరికే డబ్బూ పరపతి ఒక వైపు, మీసాల్రాజా బురద వ్యవహారాన్ని భరించటం మరోవైపు. ఇష్టం లేని చోట పని చెయ్యటంలో బాధ, ఇష్టం లేని భాగస్వామితో సంసారం చెయ్యటంలో కష్టం అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది.

చాణుక్యతో మాట్లాడాక, ముగ్గురూ గెస్టు హవుసుకి తిరిగి వచ్చారు.

"మంచి వార్త తెలిసింది కదా. మందేద్దాం" అన్నాడు అంజి. ఫ్రిజ్ లోంచి ప్రభు సోడాలు తీస్తూ ఉండగా బయట జీపు ఆగిన శబ్దం వినిపించింది.

బాలారిష్ట లోపలికి ప్రవేశిస్తూ, "గోవిందు అనే వ్యక్తిని చంపినందుకు మిమ్మల్నిద్దర్నీ అరెస్టు చేస్తున్నాను" అని అంజి, ప్రభులతో అన్నాడు.



# 34

**"మా స్నేహితుడిని** మేమే ఎందుకు చంపుకుంటాంరా దొంగ నాకొడకా. వదిలేస్తావా? ఐ.జీ తో చెప్పించమంటావా?" అంజి సెల్ లోపల్నుంచి పిచ్చెక్కినవాడిలా అరుస్తున్నాడు. బాలారిష్ట కుర్చీలోంచి కదల్లేదు. ఒకసారి సెల్ వైపు చూసి తల తిప్పుకున్నాడు.

"సి.ఎం. పేషీకి ఫోన్ చెయ్యమంటావా? బై ఎలక్షన్స్ ముందు పార్టీని ఇబ్బంది పెట్టడానికి అరెస్టులు చేస్తున్నావని ఉద్యమం లేవదీయమంటావా?" అంటూ అరుస్తూంటే బాలారిష్ట కుర్చీలోంచి లేచి సెల్ వైపు వచ్చాడు.

"ఏమిటి... కొడతావా? కొట్టు. కొట్టి సస్పెండ్ అవడానికి రెడీగా ఉండు."

బాలారిష్ట అతడి మాటలు పట్టించుకోకుండా సెల్ తాళం తీసి తనతో పాటు ప్రభుని బయటికి తీసుకెళ్ళాడు. దాంతో అంజి మరింత ఇరిటేట్ అయ్యాడు. వెనక నుంచి ప్రభుతో, "ఒరేయ్. ఈ పోలీసు నా కొడుకులు ఎంతడిగినా ఏమీ చెప్పకు. రేప్ సంగతి వాళ్ళు బయటపెట్టనంత కాలం, మర్డరు చేసింది వాళ్ళమ్మాయని మనం బయటికి చెప్పము. మనల్ని వాళ్ళు రక్షిస్తే, వాళ్ళ అమ్మాయిని మనం రక్షిస్తాం. అది డీల్. గుర్తుంచుకో" అంటూ అరిచాడు.

అరగంట తర్వాత ప్రభు తిరిగి సెల్లులోకి వచ్చాడు.

"ఏం జరిగిందిరా? పోలీసులు ఏం అడిగారు? ఆ సబినస్పెక్టరుగాడు ఏమైనా పిచ్చి పిచ్చి వేషాలు వేశాడా?"

ప్రభు సమాధానం చెప్పలేదు.

"మీసాలరాజా గురించి చెప్పి నువ్వు వాడికి వార్నింగ్ ఇవ్వలేదా?"

ప్రభు మాట్లాడలేదు. మొహం అంతా చెమటలు పట్టి మనిషి గజగజా వణికిపోతున్నాడు. ఏం జరిగిందో తెలుసుకునే లోపులో పోలీసులు వచ్చి తరువాతి ఇంటరాగేషనుకి అంజిని తీసుకెళ్లారు.

అక్కడ తన తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు అంజి. బాలారిష్ట ఎదురుగా కూర్చుని ఉన్నాడు హనుమంతరావు. తనకిక ఏమీ కాదన్న సంతోషం అంజి మొహంలో కనబడింది. కొడుకుని పక్క కుర్చీలో కూర్చోబెట్టుకుని హనుమంతరావు సంభాషణ కొనసాగించాడు. "ఆ గోవిందుని వీళ్ళే చంపారనటానికి నీ దగ్గర సాక్ష్యాలేమున్నాయి? బెయిలుతో బయటకు రావటానికి పదినిముషాలు పట్టదు. కానీ చెప్పానుగా. బై ఎలక్షన్సులో ఎమ్మెల్యేగా నిలబడుతున్నాను. ఎలక్షన్స్ ముందు ఈ విషయం బయటకు వస్తే నాకు దెబ్బ. ఇక్కడితో దీన్ని వదిలేయడానికి ఎంత కావాలో చెప్పు"

"పది లక్షలు" అన్నాడు బాలారిష్ట. తండ్రీ కొడుకులు చప్పున తలెత్తారు.

"ప... పది లక్షలా? డబ్బులు మా ఇంటి వెనుక పెరట్లో కాస్తున్నాయనుకుంటున్నావా?"

"ప్రజల కష్టంతో కాస్తున్నాయి. మీ ఇనప్పెట్టెల్లోకి వెళ్తున్నాయి" క్లుప్తంగా సమీకరించాడు.

"ఆధారాల్లేకుండా అరెస్టు చేసినందుకు నిన్ను శంకరగిరి మాన్యాలు పట్టించగలను తెలుసా"

బాలారిష్ట ముందుకు వంగి "శంకరగిరి మాన్యాలు ఎక్కడున్నాయి సార్?" కుతూహలంగా అడిగాడు. ఏం చెప్పాలో తోచక హనుమంతరావు తడబడ్డాడు.

"చూశారా. మీకే తెలీదు. మీకు తెలియని ప్లేసుకి నన్నుఎలా పంపిస్తారు చెప్పండి. శంకరగిరి అనే శ్మశానం ఒక రచయిత కల్పన. తరువాత పాపులర్ అయింది. సరే. ఆ విషయం వదిలి పెట్టండి. సాక్ష్యాలేమీ లేవు అన్నారుగా. తప్పు. మీవాడి మీద కేసు చాలా బలంగా ఉంది. ఇదిగో. ఇది వినండి" అంటూ టేప్ ఆన్ చేశాడు. ప్రభు కంఠం స్పష్టంగా వినిపిస్తోంది.

***"ముగ్గురం ఆంజనేయ విగ్రహం చూద్దామని వెళ్ళాము. అక్కడ ఒక స్త్రీ కనబడింది. తాను ముందు అంటే తాను ముందని అంజి, గోవిందూ దెబ్బలాడుకున్నారు. మాట మీద మాట పెరిగింది. పూర్తిగా తాగి ఉన్న అంజి, ఆవేశంలో బండ రాయి ఎత్తి గోవిందు తల బద్దలు కొట్టాడు".***

ఊహించని ఈ పరిణామానికి హనుమంతరావు ఒంట్లో సత్తువ లేనట్టు కుర్చీ వెనక్కి వాలిపోయాడు. అంజి మొహం రక్తం లేనట్టు తెల్లగా పాలిపోయింది. అంతలోనే అతనిలో క్రమక్రమంగా ఆవేశం చోటుచేసుకుని, కుర్చీలోంచి విసురుగా లేచి పిడికిలి బిగించి బల్ల మీద బలంగా కొడుతూ "వాడిని చంపేస్తాను. ఇప్పుడే... ఇక్కడే చంపేస్తాను" అంటూ లాకప్ రూమ్ వైపు వెళ్లబోతూంటే పోలీసులు గట్టిగా పట్టుకున్నారు.

"కూర్చో అంజి. కూర్చో. ఆవేశపడకు. ఆవేశంతో పనులు జరగవు" అంటూ అనునయించి, రావు వైపు తిరిగి, "మీరు అనుభవం ఉన్నవారు. అసలు జరిగిందేమిటో, ఈ కేసు నుంచి మీ అబ్బాయిని ఎలా బయట పడేయవచ్చో తర్వాత చెప్తాను. ముందు నా సంగతి తేల్చండి" అన్నాడు.

"సాయంత్రానికి పంపిస్తా" అన్నాడు హనుమంతరావు. నూతిలోంచి వచ్చినట్లు ఉంది స్వరం.

"సాయంత్రం లోపు కేసు మరికొన్ని మలుపులు తిరగవచ్చు. రేటు పెరగొచ్చు. ఆలస్యం అమృతం విషం అన్నారు. హనుమంతరావుగారూ. మీరు తొందరగా వెళ్ళి డబ్బు తీసుకురండి. ఈ లోపు ఈ కేసు నుంచి ఎలా బయట పడవచ్చో మీ అబ్బాయికి కోచింగ్ ఇస్తాను".

హనుమంతరావు హడావుడిగా బయటికి నడిచాడు. అంజికి ఇంకా ఆవేశం తగ్గలేదు.

"వాడు ఇంత ద్రోహం ఎలా చేశాడు? ఇన్ని అబద్ధాలు ఎలా ఆడాడు? అసలిదంతా ఎందుకు చేశాడు?"

"అప్రూవరుగా మారితే శిక్ష ఉండదని చెప్పాను. ట్రాపులో పడ్డాడు."

అంజి మొహం వివర్ణమైంది. "వాడిని చంపేస్తాను. ఇది మాత్రం ఖాయం"

"ఇప్పటికి ఆ మాట పదిసార్లు అన్నావ్. నీకు ఉరి పడకపోతే ఆ పని చెయ్యొచ్చు కానీ, ఆ అవసరం లేదు. కోర్టులోనే వాడికి ఉరిశిక్ష పడేలా చెయ్యవచ్చు. నువ్వు బయటపడే మార్గం కూడా ఉంది. ఒకే దెబ్బకి రెండు పిట్టలు"

"ఏమిటది?"

"మీ నాన్న డబ్బు తెచ్చాక చెపుతాను. "

గంట తర్వాత హనుమంతరావు క్యాష్ తీసుకుని వచ్చే సమయానికి బాలారిష్ట విలేకరుల సమావేశం ఏర్పాటు చేశాడు. విలేఖరులకి ఏమిచెప్పాలో అంజికి అయిదు నిముషాల ముందు కౌన్సిలింగ్ ఇచ్చాడు. తండ్రీ కొడుకులు ఇద్దరూ విలేకరుల ఎదురుగా కూర్చున్నాక మైకు అందచేశాడు. అంజి చెప్పడం మొదలు పెట్టాడు.

***"నేను చేసింది తప్పే. స్నేహితుడిని రక్షించుకోవటం కోసం ఇంతకాలం మౌనంగా ఉన్నాను. ఈ హత్య చేసింది ప్రభు. గోవిందుకీ అతడికీ 'దగ్గర' సంబంధం ఉందన్న విషయం మా సర్కిల్‌లో అందరికీ తెలుసు. నేను ఫోటోలు తీస్తుండగా ఇద్దరూ విగ్రహం వెనక్కి వెళ్లారు. ఏం జరిగిందో తెలీదు. పెద్ద గొడవ వినిపించింది. నేను వెళ్లే సరికి గోవిందు రక్తపుమడుగులో ఉన్నాడు. ఎవరి బలవంతం లేకుండా ప్రత్యక్షసాక్షిగా ఇదంతా చెబుతున్నాను. "***

ఈ సెన్సేషన్ వార్త తీసుకుని అందరి కన్నా ముందు జర్నలిస్టు రాంబాబు బయటకు పరిగెత్తాడు. విలేకరుల బుర్రలో అప్పటికే రకరకాల హెడ్డింగులు చోటు చేసుకున్నాయి. ***'హత్యకు దారి తీసిన సంపర్కం... పక్కమీదకి రావటానికి ఒప్పుకోనందుకు హత్య... హనుమంతుడి విగ్రహం పక్కన మొగాడి మానభంగం'*** మొదలైన శీర్షికలతో కొందరు పోలీసుస్టేషన్ నుంచే తమ ఆఫీసుకి వార్తలు పంపసాగారు.

"ఇక మీరు వెళ్లొచ్చు. మీ అబ్బాయి మీద ఏ కేసూ లేదు. అప్రూవరుగా మారి మా వర్కు తగ్గించినందుకు కృతజ్ఞతలు" అన్నాడు బాలారిష్ట.

"నేను ఒకసారి ప్రభుని కలవాలి"

"నీకు ఆవేశం ఎక్కువ. కలిస్తే అతని మీద చేయిచేసుకుని అరెస్ట్ అవుతావు. ముద్దాయి ఉన్న గదిలోకి నిన్ను పంపించినందుకు నేను సస్పెండ్ అవుతాను" అన్నాడు బాలారిష్ట.

"నేను ఉరికంబం ఎక్కినా పర్లేదు. వాడిని ఒకసారి కలవాలి" నిశ్చయంగా చెప్పాడు అంజి.

"ఇతడిని లాకప్పు రూముకి తీసుకువెళ్ళు. మధ్య తలుపు తీయకు" అని పోలీసుతో చెప్పి పంపించాడు. లాకప్ గదిలో ఒక మూల మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చుని ఉన్నాడు ప్రభు. అడుగుల చప్పుడుకి తలెత్తి, అంజిని చూసి ఎడారిలో ఒయాసిస్సు కనపడినట్టు

తలుపు దగ్గరకు పరుగెత్తుకుని వచ్చాడు. అతడేదో మాట్లాడ బోయేటంతలో, ఇనుప చువ్వల మధ్య నుంచి రెండు చేతులూ లోపల పెట్టి అతడి మెడ పట్టుకుని, "ఎందుకురా? ఎందుకీ పని చేశావ్?" తలుపులు కదిలేలా ఊపేస్తూ అరిచాడు అంజి.

ఊహించని ఈ సంఘటనకి "నేనేమి చేశాను" అయోమయంగా అడిగాడు ప్రభు.

"పోలీసులకి తప్పుడు స్టేట్‌మెంట్ ఎందుకు ఇచ్చావు?"

వెనుక నుంచి బాలారిష్ట తాపీగా "అతనివ్వలేదు అంజీ. మేమే ఆ స్టేట్‌మెంట్ తయారు చేశాము" అన్నాడు.

ఎర్రగా కాలుతున్న ఇనుపరాడ్ పట్టుకున్నవాడిలా అంజి చివాలున వెనక్కి తిరిగాడు.

"ఇంత పెద్ద ఊళ్ళో ప్రభు కంఠాన్ని మిమిక్రీ చేసే ఆర్టిస్ట్ దొరకటం అంత కష్టమేమీ కాదుగా."

విషయం అర్థమైన అంజి నోట, రెక్క విరిగిన పక్షి అరుపులాటి సన్నటి కేక బయల్వెడలింది.

"చిన్న ట్రిక్కు ప్లే చేసేసరికి ట్రాపులో పడ్డావు. నీ స్నేహితుడు నీ కొంప ముంచాడనుకొని అతడి కొంప నువ్వు తగలెట్టావు. అండర్-ట్రయిల్‌గా నీ స్నేహితుడిని జీవితాంతం జైల్లో పెట్టటానికి నీ స్టేట్‌మెంట్ చాలు" అన్నాడు బాలారిష్ట.

అంజి అతడి మీదకి ఆవేశంతో దూకబోతూంటే వెనక నుంచి తండ్రి పట్టుకొని అతికష్టం మీద పోలీస్ స్టేషన్ బయటకి తీసుకువెళ్ళాడు. స్టేషను మెట్ల మీద ఆగాడు అంజి. బాలారిష్ట వైపు తర్జని చూపిస్తూ, "నీ పెళ్ళాం కన్నెపిల్ల కాదు. దాన్ని రేప్ చేసింది నేనేరా. పత్రికలవాళ్ళని మళ్ళీ పిలువు. ఆ విషయం అందరి ముందూ చెపుతాను. నువ్వూ, నీ పెళ్లాం కుళ్ళి కుళ్ళి చావాలి" అన్నాడు.

బాలారిష్ట మాట్లాడలేదు. దాంతో అంజి మరింత ఇరిటేట్ అయ్యాడు. "విగ్రహం వెనుక నీ పెళ్ళానికి జరిగింది బయటపెట్టమంటావా?" పోలీసులందరూ వింటూ ఉండగా అరిచాడు. బాలారిష్ట దానికి కూడా సమాధానం చెప్పలేదు.

"ఒరేయ్ ఇనస్పెక్టరూ. ఇది ఇంతటితో ఆగదు. నా స్నేహితుడు కోర్టుకు వెళ్లే లోపులో ఇంతకు ఇంతా పగ తీర్చుకుంటాను. నీకే తెలివితేటలు ఉన్నాయనుకుంటున్నావేమో. ఇంతకన్నా పెద్ద ఎత్తు వేసి నిన్ను మట్టి కరిపించక పోతే నా పేరు అంజి కాదు. చూసుకుందాం".

బాలారిష్ట తాపీగా మెట్లు దిగి అతడి దగ్గరగా వెళ్ళాడు. "ఏమిటీ? నా అంతు తేలుస్తావా? నా పెళ్ళాన్ని రేప్ చేసినట్టు ప్రపంచమంతా చాటింపు వేస్తావా? అంతకాలం నువ్వు బ్రతికి ఉంటే కదా అంజీ. పది లక్షలు ఇచ్చాడని నీ తండ్రి ఎలక్షన్స్ పూర్తయ్యే వరకూ నీకు స్వేచ్ఛ ఇద్దామనుకున్నాను. శిశుపాలుడి లెవెల్లో తప్పులు చేశావ్. ఇప్పుడు చెప్తున్నా

విను. రెండు రోజుల్లో అందరూ చూస్తూ ఉండగా నిన్ను చంపుతాను. పది మంది సాక్ష్యం ఉన్నా, శిక్ష పడకుండా తప్పించుకుంటాను" అంటూ హనుమంతరావు వైపు తిరిగి, "నీకు మహా భారతం కథ తెలుసో లేదో. దుర్యోధనుడు సైంధవుడిని దాచినట్టు కొడుకుని ఎక్కడైనా దాచుకో. లేదా ఎలక్షన్ క్యాంపెయినులో నీతో పాటు తిప్పుకో. వాడు ఎక్కడున్నా సరే, రెండు రోజుల్లో చంపుతాను" అన్నాడు.

అంజి దానికి ఏదో సమాధానం చెప్పబోతుంటే హనుమంతరావు అతడిని బలవంతంగా తీసుకెళ్ళి కారు ఎక్కించాడు.

కారు వెళ్ళేవరకూ ఆగి, బాలారిష్ట లోపలికి వచ్చి రవళికి ఫోన్ చేశాడు. "అంతా అనుకున్నట్టే జరిగింది. అయితే చివర్లో చిన్న తప్పు చేశాను."

"ఏమిటి?"

"ఆ అంజిగాడిని రెండ్రోజుల్లో అందరి ముందూ చంపుతానని అర్జునుడి లెవెల్లో శపథం చేశాను. వాడిని చంపాక నన్ను బయటికి తీసుకొచ్చే బాధ్యత మాత్రం నీదే" అని ఫోన్ పెట్టేశాడు.

* * *

"వీలైనంత తొందరగా వచ్చి కలుసుకో" అని ధర్మారావు నుంచి ఫోన్ రాగానే రవళి కంగారుపడుతూ వెళ్ళింది. "రేపు ప్రొద్దున్నే నన్ను డిశ్చార్జి చేస్తున్నారు" అన్నాడు.

మనసు తేలికపడి, "కంగ్రాచ్యులేషన్స్ సర్" అంది.

"అర్జెంటుగా నిన్ను పిలిచింది అందుకు కాదు. నా హాస్పిటల్ బిల్లు నువ్వెందుకు కట్టావ్?"

ఆమె తెల్లమొహం వేసి, "నాకేం అర్థం కావట్లేదు. మీ బిల్లు నేను కట్టడం ఏమిటి?" అంది.

"కొద్దిగా ఇన్సూరెన్స్ డబ్బు వచ్చింది. యాక్సిడెంటు చేసిన ఆ లారీ వాళ్ళు మరి కొంచెం డబ్బులు ఇచ్చారు. నా సేవింగ్స్ కొంత ఉన్నాయనుకున్నా. ఈలోపు హాస్పిటల్ గుమస్తా వచ్చి, క్యాష్ కౌంటర్లో ఎవరో పదిలక్షలు కట్టారని చెప్పాడు. నువ్వే అనుకున్నాను."

"నేను కాదు సర్. మీరు చెప్పే వరకు నాకీ విషయం అసలు తెలియదు."

# 35

**రాజా, చాణుక్యల** వ్యవహారం ముఖ్యమంత్రి ఆంజనేయులుకి తలనొప్పి వ్యవహారంలా తయారైంది. పరనాతి సుఖానికి ఒకరు, రాజనీతి సలహాకి ఒకరు, ఇద్దరి అవసరమూ ఉంది. ఇద్దర్లో ఎవరినీ వదులుకోలేడు. ఏం చెయ్యాలి? ఇకనుంచీ ఇద్దరినీ

ఒకచోట కలపకుండా ఉంచటం మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు. ఒకరు ఉన్నప్పుడు ఇంకొకరికి అప్పాయింట్మెంట్ ఇవ్వొద్దని పి.యేకి చెపుతూ ఉండగా, ప్రభుదేవ్ హాస్పిటల్ నుంచి వచ్చిన డాక్టరు వేచి ఉన్నాడని అతను చెప్పాడు.

"అర్జెంటా?"

"మొన్న వచ్చారు సార్. ఈ రోజు పదింటికి రమ్మన్నాం"

"అలాంటివాళ్ళని ఆఫీసుకు రమ్మనండయ్యా. ఇంటికెందుకు? సర్లే. పంపించు" చిరాగ్గా అన్నాడు.

ప్రస్తుతం ఆ ఆస్పత్రితో ముఖ్యమంత్రికి ఏమీ సంబంధం లేదు. రాజకీయాల్లో ప్రవేశిస్తున్న కొత్తలో రామానుజం అనే డాక్టరుతో కలిసి భాగస్వామ్యం పెట్టాడు. ఆ రోజుల్లోనే లాభం లక్షల్లో వచ్చేది. అయితే మంత్రి అయ్యాక సంపాదన కోట్లలో ఉండటంతో ఇక ఆ ఆస్పత్రి గురించి పట్టించుకోలేదు. దాన్ని రామానుజమే చూసుకుంటున్నాడు. పార్టనర్షిప్ డబ్బులు ఏడాది కొకసారి పంపుతాడు. కొత్త భవనానికి ప్రతిపక్ష నాయకుడు ప్రభుదేవ్ పేరు పెట్టినప్పుడు మాత్రం ముఖ్యమంత్రి హోదాలో రిబ్బను కట్టింగ్ కి వెళ్ళాడు. ఆ అపురూప చర్యకి ప్రజలు వేనోళ్ళ పొగిడారు. ఆ ఆలోచన చాణుక్యదే. దానికి తోడు 'ఉచిత కిడ్నీ స్కీమ్' వల్ల మరింత పేరు వచ్చింది. అదీ ఆ ఆస్పత్రి కథ.

ఓ ముప్పై ఏళ్ల యువకుడు లోపలికి వచ్చాడు. కూర్చోమని, "చెప్పండి డాక్టర్" అన్నాడు.

"నా పేరు కొట్నీస్. ముఖ్యమైన విషయం ఒకటి మాట్లాడుదామని వచ్చాను"

"కొట్నీస్. పేరు గమ్మత్తుగా ఉంది"

"నా తండ్రిగారు పుట్టినప్పుడు 'డాక్టర్ కొట్నీస్ కి అమర్ కహానీ' అని ఒక సినిమా రిలీజ్ అయ్యింది సార్. మా తండ్రిగారికి ఎంతో నచ్చిన ఒక త్యాగశీలి కథ అది. నాకా పేరు పెట్టి నిజాయితీగా పెంచారు. మెడిసిన్ చదివించారు. మన ఆసుపత్రిలో ఎప్పటి నుంచో జరుగుతున్న దారుణం మీకు తెలియ చేద్దామని వచ్చాను సార్. ఈ విషయాలు మీ వరకూ వచ్చి ఉండవు" అంటూ ఉండగా సారమ్మ కాఫీ తీసుకుని వచ్చింది.

"ఒక్క నిముషం" అంటూ ఒక కప్పు అతనికి ఇచ్చి, మరొకటి తాను తీసుకుంటూ సారమ్మ తో "రాఘవుడు ఏమయ్యాడు?" అని అడిగాడు.

"రాలేదు. తండ్రికి కరోనా అట. నెల రోజులు రాడు" అంది.

"సరే. ఈసారి నుంచీ లోపలికి వచ్చేటప్పుడు గుమ్మం దగ్గర నిలబడి తలుపు కొట్టి నేను రమ్మన్నాక రావాలి. అయినా ఈ పనులన్నీ నీకెందుకు. టెంపరరీగా ఎవర్నైనా పెట్టమని పి.య్యేకి చెప్పు" అని ఆమె వెళ్లి పోయాక, "చెప్పండి. ఏమి దారుణం జరుగుతోంది?" అని అడిగాడు.

"అక్కడ పేదలకు ఉచితంగా కిడ్నీ అమరుస్తారని మీకు తెలుసు కదా"

"అవును. దానికి ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇస్తుంది. నా హాస్పిటల్‌కి నేనే సబ్సిడీ ఇప్పించుకుంటున్నానని ఎవరైనా పత్రికలవాళ్ళు వ్రాశారా?

"అది చిన్న విషయం సార్. ఇక్కడ జరిగేది మనం సినిమాల్లో చూసే దానికన్నా దారుణం."

"ఏం జరుగుతోంది? విషయం సూటిగా చెప్పండి"

"కిడ్నీ రాకెట్ గురించి మీకు తెలుసు కదా. పేదల కిడ్నీలు దళారీలు కొనడం ఒక పద్ధతి. రోగులకు తెలియకుండా కిడ్నీలు తీసి అమ్మటం ఒక పద్ధతి. మనం సినిమాల్లో చూసేది అదే."

ఆంజనేయులు విసుగ్గా "ఆసుపత్రి గురించి అపాయింట్మెంట్ ఇచ్చాను. మీరు సినిమాల్లో కిడ్నీల గురించి చెప్తున్నారు. తొందరగా విషయానికి రండి" అన్నాడు. రాష్ట్రపతి, ముఖ్యమంత్రి మొదలైనవారి దగ్గరకి వచ్చే విజిటర్సు, అసలు విషయం మానేసి ఆ ఉద్వేగంలో ఉపోద్ఘాతాలు మాట్లాడటం మామూలే.

"వస్తున్నాను సార్. వస్తున్నాను. మీ ఆసుపత్రిలో దాదాపు సంవత్సరం నుంచి పని చేస్తున్నాను. నాది కిడ్నీ విభాగం కాదు కానీ ఇటీవలే ఒక విషయం తెలిసింది. సాధారణ కడుపు నొప్పితో వచ్చిన పేషెంటుకి టెస్టులు చేసినట్టు నాటకం ఆడి, రెండు కిడ్నీలూ పాడయ్యాయని చెబుతున్నారు. గవర్నమెంట్ ఉచితంగా ఒక కిడ్నీ ఇస్తుందని ఆపరేషన్ చేస్తున్నారు. ఒక కిడ్నీ దగ్గర నాలుగు కుట్లు వేసి, రెండో కిడ్నీ తీసి అమ్ముకుంటున్నారు. నిజానికి రెండూ ఆరోగ్యవంతమైన కిడ్నీలే. కొత్త కిడ్నీ ఉచితంగా వచ్చిందన్న సంతోషమే తప్ప, ఒకటి పోయింది అన్న అనుమానం రాదు. ఇంతవరకూ ఎవరికీ రాని ఈ ఆలోచన ఎన్నో సంవత్సరాల క్రితమే రామానుజానికి వచ్చింది. కొత్త రకం మాఫియా సార్. బయట పడితే అరెస్టులు తప్పవు. మీకు కూడా ప్రమాదమే అని చెబుదామని వచ్చాను"

అతడు చెప్పిన న్యూస్ కి ఆంజనేయులు షాక్ అయ్యాడు. కుర్చీలోంచి లేచి కొట్నిస్ దగ్గరగా వెళ్లి అతని చేతులు తన చేతుల్లోకి తీసుకుని, "గొప్ప సాయం చేశారు డాక్టరుగారూ" అన్నాడు నిజాయితీగా. "రాజకీయాల్లో పడి ఆసుపత్రి విషయాలేమీ పట్టించుకోలేదు. అక్కడ ఇన్ని దారుణాలు జరుగుతున్నాయని తెలియదు. వెంటనే చర్యలు తీసుకుంటాను. బయటపడి ఉంటే, ఇన్నాళ్ళూ రాష్ట్రానికి చేసిన సేవ అంతా సునామీలో కొట్టుకుపోయినట్టు పోయేది. సంతోషంగా ఉంది. ఈ విషయం ఎవరికైనా చెప్పారా?" అని అడిగాడు.

"లేదండీ. విషయం తెలియగానే మీ దగ్గరికే వచ్చాను"

"సరే. మిగతాది నేను చూసుకుంటాను. మీరు వెళ్లిరండి. ఈ విషయం ఎక్కడా చెప్పకండి. నేను ఎంక్వయిరీ వేసే వరకూ మూడో కంటికి తెలియనివ్వకండి. రామానుజం

సామాన్యుడు కాదు. ఈ విషయం మీ ద్వారా బయట పడిందని తెలిస్తే మీకే ప్రమాదం. జరుగుతున్న అన్యాయం నుంచి ప్రజల్ని రక్షించారు. మీరు చేసిన దానికి ఏదో రూపేణా బదులు తీర్చుకుంటాము" అన్నాడు.

కొట్నిస్ వెళ్ళిపోయాక చాణుక్యకి ఫోన్ చేసి అర్జెంటుగా రమ్మని, అతను వచ్చాక విషయం చెప్పాడు.

అంతా విని, "నీకు నాలుగే దార్లు" అన్నాడు చాణుక్య. "ఒకటి... ఇక ముందు ఇలాంటి కార్యక్రమాలు మానెయ్యమని రామానుజానికి సలహా ఇవ్వటం."

"బంగారు బాతుని వదులుకోడు"

"రెండు... అతనితో తెగతెంపులు చేసుకోవటం."

"అది చాలా ప్రతిష్టాత్మక ఆస్పత్రి. దానితో నాకు సంబంధం లేదంటే ఎలక్షన్ల ముందు చాలా నష్టం"

"మూడు... అతడిని అరెస్ట్ చేయించటం"

"మనకి తెలియకుండానే ఆ ఆసుపత్రిలో అన్ని ఘోరాలు జరిగాయంటే ప్రజలు ఎవరూ నమ్మరు. 'కిడ్నీల విషయం ముఖ్యమంత్రికి కూడా తెలుసు' అని అతనొక్కమాట బయటకి చెప్తే, 'జైల్లో నా జీవితం' అని ఆత్మకథ వ్రాసుకోవాలి".

"ఇక చివరి మార్గం. అతడిని లేపేసి, ఈ వ్యవహారాలకి ఫుల్-స్టాపు పెట్టటం"

"అదే మంచిదనిపిస్తోంది".

"టార్జానుకు చెపుతా".

"వారంలో పని జరిగిపోవాలి. ఈలోపులో ఆ డాక్టరు కొట్నీసుగాడు ఏ ప్రెస్ దగ్గరో నోరు జారితే కష్టం. పెనంలోంచి జారి కుంపట్లో పడతాం. వీలైతే వాడిని కూడా..."

"అలాగే" అంటూ చాణుక్య లేచాడు.

వాళ్ళకి తెలియని విషయం ఏమిటంటే, ముఖ్యమంత్రితో మాట్లాడాక, డాక్టర్ కొట్నీస్ హోమ్ మినిస్టరు దగ్గరకి వెళ్ళాడు. విషయం అంతా విని ఆయన అతడిని ప్రతిపక్ష నాయకుడి దగ్గరకి తీసుకువెళ్ళాడు.

దేవ్ షాకయ్యాడు. "నా తండ్రి పేరు మీదున్న ఆస్పత్రిలో ఇన్ని దారుణాలా? ఆ పేరు పెట్టటంలో వాళ్ళ ఉద్దేశ్యం కూడా అదే అనుకుంటాను. ఇదంతా ఆ చాణుక్య తెలివి. ఏ చెడ్డపేరు వచ్చినా, ఆ పాపం నా తండ్రికి తగులుతుందని వాళ్ళ ఉద్దేశ్యం" అని కొట్నిస్ వైపు తిరిగి, "మీ పెద్దలు మంచి పేరు పెట్టారు డాక్టర్. దాన్ని మీరు సార్థకం చేసుకున్నారు. మిగతా విషయాలు మాకు వదిలి పెట్టండి" అన్నాడు.

కొట్నీస్ నమస్కారం చేసి లేస్తూ, "సార్... మీరేమీ అనుకోనంటే ఒక అనుమానం. అడగొచ్చా?" అన్నాడు.

దేవ్ నవ్వి, "అడగండి" అన్నాడు.

"నేనీ విషయం చెప్పగానే మీరు ఆనందిస్తారనీ, అసెంబ్లీలో ఈ విషయం లేవనెత్తుతా అంటారనీ, దుమారం రేగుతుందనీ అనుకున్నాను. ప్రపంచంలో ఎవరికీ రానంత దారుణమైన ఆలోచన సార్ ఇది. ఈ విషయం బయటకి వస్తే దేశం గగ్గోలు పెడుతుంది. బి.బి.సిలో కూడా వస్తుంది. ప్రభుత్వాల్ని కూల్చేటంత బలమైనది. ఈ అవకాశాన్ని మీరు ఎందుకు వాడుకోలేదు?"

"అసెంబ్లీలో లేవనెత్తుతే ఏమవుతుంది? ఆ ఆస్పత్రితో తనకి సంబంధం లేదంటాడు ముఖ్యమంత్రి. పైగా ఆ ఆస్పత్రి నా తండ్రి పేరు మీద ఉంది. మహా అయితే రామానుజాన్ని అరెస్ట్ చేస్తారు. అతడు రెండు వారాల్లో బయటకి వస్తాడు. చర్చలు, అసెంబ్లీలో గొడవలు. పది రోజుల్లో ప్రజలు ఆ విషయం మర్చిపోతారు. ఇంకా గొడవ చేస్తే సి.బి.ఐ ఎంక్వయిరీ వేస్తాడు. అదో అయిదేళ్ళు పడుతుంది. ఈ లోపులో రెండుసార్లు ఎన్నికలు వస్తాయి."

ఇదేమీ చెప్పలేదు దేవ్. "ట్యూమర్ పెద్దదయితే మీరు ఏమి చేస్తారు డాక్టర్?" అని అడిగాడు.

తను అడిగిన ప్రశ్నకీ, పొంతన లేని అతడి మాటకీ అయోమయం చెందిన డాక్టరు, "ఆపరేషన్ చేసి తీసేస్తాను" అన్నాడు.

"మంచి సమాజం కోసం అలాంటి ఆపరేషన్లు చాలా చెయ్యాలి డాక్టరుగారూ. అది కేవలం రాజకీయాల వల్లా, అసెంబ్లీల వల్లా అవదు. మరో కొద్ది రోజుల్లో ఎలక్షన్స్ వస్తున్నాయి. అంతవరకూ ఓపిక పట్టండి. ఈ విషయం ఏమి చెయ్యాలా ఆలోచిస్తాను. మీకు కృతజ్ఞతలు. పోతే... వాళ్ళు చాలా అపాయకరమైన మనుష్యులు. మీ పేరు కూడా వాళ్లకి చెప్పానన్నారు. కాస్త జాగ్రత్తగా ఉండండి".

వాళ్ళ ఇద్దరి దగ్గరా శలవు తీసుకుని డాక్టరు బయటకి వచ్చి రవళికి ఫోన్ చేశాడు. "మీరు వెళ్ళమన్నట్టే ముందు ముఖ్యమంత్రి దగ్గరకి, ఆపై హోం మినిస్టరు దగ్గరకి వెళ్లాను. ఆయన ప్రతిపక్ష నాయకుడు దేవ్ వద్దకు తీసుకెళ్ళారు".

"అయ్యో. చాలా చోట్ల తిరిగారన్న మాట"

"ఒక మంచి పని కోసమే కదా మేడమ్. పోతే... "

"చెప్పండి"

"మళ్ళీ నా మీదకు రాకుండా, మీరు సలహా ఇచ్చినట్టే, నా పేరు కొట్నీస్ అని చెప్పాను" అన్నాడు డాక్టర్ సుబ్బారావు.

* * *

"ఇంత డొంక తిరుగుడు వ్యవహారం దేనికి? పత్రికల వాళ్ళని పిలిచి మొత్తం అంతా చెప్తే అయిపోతుంది కదా. డాక్టర్ సుబ్బారావు ఎలాగో సాక్ష్యం చెప్తాడు. దానికన్నా ముఖ్యంగా... నష్టపోయిన పేషెంట్స్ బోలెడుమంది ఉన్నారు. ఎవరి శరీరాన్ని పరీక్షించినా ఆ విషయం తెలుస్తుంది. వెంటనే ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తారు" అన్నాడు చక్రధరరావు.

"మన గమ్యం ముఖ్యమంత్రిని అరెస్టు చేయించడం కాదు. ఆయనకి నిద్ర పట్టకుండా చెయ్యటం. ఆస్పత్రి రహస్యం మనకి తెలిసిందన్న విషయం తెలిస్తే ముఖ్యమంత్రి షేక్ అవుతాడు. ఈ విషయం ఎప్పుడు బయటకొస్తుందా అని ప్రతి క్షణం టెన్షన్ పడతాడు. కిడ్నీ వ్యవహారంలో అతడికీ రామానుజానికీ గొడవ జరుగుతుంది. మన శత్రువు మనతో కాకుండా వేరొకరితో యుద్ధానికి వెళ్తే, అతడి శక్తి అక్కడే సగం తగ్గి పోతుంది. అది మనకి లాభం కదా".

"ఇది కూడా 'సంజూ'యే చెప్పాడా?" అన్నాడు.

రవళి నవ్వింది. "కాదు. **'అభియుక్తం బలవతా... చోరమ్ అవిశన్తి ప్రజాగరాః...'** అని అయిదుగురు నిద్రపట్టనివారి గురించి భారతంలో విదురుడు చెపుతాడు. బలవంతునితో విరోధం పెట్టుకున్నవాడు, సమస్యని పరిష్కరించుకోలేనివాడు, సంపద పోగొట్టుకున్నవాడు, తీరని కోరికలున్న వాడు, దొంగతనం చేసినవాడు... ఈ ఐదుగురికీ నిద్ర పట్టదని అంటాడు".

"అయితే నాకొక అనుమానం. ముఖ్యమంత్రికీ, రామానుజానికీ ప్రస్తుతం డబ్బు సమస్య లేదు. కిడ్నీ వ్యవహారం బయటపడితే ఎప్పటికైనా ప్రమాదమే కదా. ఈ నల్లబజారు వ్యవహారం మానేయమని ముఖ్యమంత్రి రామానుజంతో ఎందుకు చెప్పటం లేదు?"

"వీళ్ళకు డబ్బు సమస్య లేదు. కానీ ప్రజలకు కిడ్నీ సమస్య ఉంది"

"కాస్త అర్థం అయ్యేలా చెప్పు"

"అది అర్థం కావాలంటే మీకు 'ట్రయాడ్' గురించి తెలియాలి. రామానుజం ట్రయాడ్ మెంబరు".

"ట్రయాడ్ ఏమిటి?"

"ఇది మాఫియా సంస్థ. చైనాలో మొదలై, ఆ పై హాంకాంగ్, సింగపూరు, అమెరికా, ఇటలీ మొదలైన దాదాపు అన్ని దేశాలకీ చాప కింద నీరులా విస్తరిస్తోంది. ఈ మాఫియా బ్రాంచీలు ప్రతీ దేశంలోనూ స్థాపించబడ్డాయి. గతంలో చిన్నచిన్న మాఫియా ముఠాలు ఎవరికి వారే అన్నట్టు నేరాలు చేసేవి. ఇప్పుడలా కాదు. అన్నిటినీ 'ట్రయాడ్' తనలో కలిపేసుకుంటోంది".

"మన చుట్టూ ఇంత క్రిమినల్ ప్రపంచం ఉన్నదని ఇంతవరకూ నాకు తెలీదు" ఆశ్చర్యంగా అన్నాడు రావు.

"మీకే కాదు. చాలామందికి తెలీదు. 'ఆర్గనైజ్డ్ క్రైమ్' అని గూగుల్ వెతికితే దీని గురించి వస్తుంది సార్. ఈ ఇల్లీగల్ వ్యవస్థ ప్రభుత్వానికి సమాంతరంగా నడుస్తుంది. ప్రొటెక్షన్ డబ్బు తీసుకుని ఆన్-లైన్ ఛీటర్స్ కీ, అన్-ఎథికల్ హేకర్స్ కీ రక్షణ కల్పించటం; రౌడీల నుంచి వ్యాపారస్తులనీ, పోలీసుల నుంచి వ్యభిచారులనీ కవర్ చేయటం, పోలీసులకూ క్రిమినల్సుకీ మధ్య 'సత్సంబంధాలు' కుదర్చటం; టెర్రరిస్టులకీ, రౌడీలకీ ఆయుధ సప్లయి, కిడ్నాపులు, బ్లాక్ మెయిల్, డ్రగ్ ట్రాఫికింగ్... ఇలా ట్రయాడ్ చెయ్యని వ్యాపారం అంటూ లేదు. పోతే దీని కార్యకలాపాలన్నీ ఒక సిస్టమేటిక్ పద్ధతిలో జరుగుతాయి. ప్రతీ దేశానికీ ఒక ***డ్రాగన్-హెడ్*** ఉంటాడు. పోలీసులతో రేట్లు మాట్లాడేవారిని 'గ్రీన్-పోల్' అనీ, రోజువారీ వ్యవహారాలు చూసుకునేవారిని 'ఆపరేషనల్ ఆఫీసర్' అనీ, క్రిమినల్స్ ను సంస్థలో చేర్చుకునే వారిని 'వైట్-పోల్' అనీ పిలుస్తారు. ఇలా రకరకాల పోస్టులు ఉంటాయి.".

తన చెవులని తానే నమ్మలేనట్టు ఆయన వింటూ ఉండగా ఆమె కొనసాగించింది.

"వీరు రౌడీలని ఎంపిక చేసుకునే విధానం వెరైటీగా ఉంటుంది. తెలంగాణా నయీం, కర్ణాటక సుదీప్ సింగ్, మాంగళూర్ రౌడీ సురేంద్ర బంట్వాల్, యు.పి వికాస్ దూబేలు తమ అనుచరుల్ని ఎంపిక చేసుకునే విధానం కూడా ఇలాంటిదే. మొదటగా 'వైట్-పోల్' ఏదో చిన్న నేరం చేసి రెండు మూడు నెలలు జైలుకు వెళతాడు. అక్కడ లావుగా, బలంగా, అన్నిటికన్నా ముఖ్యంగా... బెయిల్ సంపాదించటానికి కూడా తన వారంటూ ఎవరూ లేని యువఖైదీల్ని అక్కడ గుర్తిస్తాడు. వీళ్ళు ఎక్కువగా బీహారీలూ, ఒరియావాళ్ళూ అయి ఉంటారు. ఏళ్ల తరబడి జైళ్ళల్లో మగ్గి, ప్రపంచం మీదా, మనుష్యుల మీదా చాలా కసితో, ఫ్రస్ట్రేషన్ తో ఉంటారు. వీళ్ళతో స్నేహం చేసి, గ్యాంగులో చేరటానికి వీరు ఒప్పుకుంటే, తనవారికి వీరి వివరాలు అందచేసి బెయిల్ ఇప్పిస్తాడు. అక్కడితో అతడి పని అయిపోతుంది. వారు బయటకి వచ్చాక ట్రయాడ్ వారికి రోటీ, కపడా, మకాన్ తో పాటూ స్త్రీలని, లేదా పురుషుల్ని కూడా అరేంజ్ చేస్తుంది. కుటుంబసభ్యుల్లా ఆదరిస్తుంది. దాంతో వాళ్ళు ఆ సంస్థ కోసం దేనికైనా తెగించేటంత కృతజ్ఞులై ఉంటారు. తరువాతి స్టెప్ ట్రెయినింగ్..! జైలు నుంచి ఇలా తీసుకుచ్చిన ఖైదీలకి మర్డర్, టార్చర్, కిడ్నాప్, షూటింగ్ మొదలైన వాటిల్లో ట్రయనింగ్ ఇచ్చేవారిని 'రెడ్-పోల్స్' అంటారు. ఇకపోతే... వీళ్ళని కలుసుకోవటం ఎలా? మనకి లాండ్-సెటిల్మెంట్స్, పరువు హత్యలు మొదలైన వాటికి మనుష్యులు కావాలంటే జైల్లో జీవిత ఖైదీలని సంప్రదించాలి. ఆ ఖైదీలతో వైట్-పోల్స్ రెగ్యులర్ టచ్ లో ఉంటారు. వారు అడ్రసు ఇస్తారు. సుపారీ తీసుకొని హత్యలు చేయటం, అప్పులు వసూలు చెయ్యటం, పరువు హత్యలు, మనీ లాండరింగ్, హత్య కేసుల్లో శత్రువుల నుంచి రక్షణ, బ్యాంకు అప్పులు ఎగ్గొట్టిన వారిని విదేశాలకు పంపటం, దొంగ పాస్-పోర్టులు, వీసాలు... ఏ అవసరం వచ్చినా సరే, ఈ సంస్థలో మెంబర్ని పట్టుకొని తగిన రుసుము చెల్లించి ఆశ్రయిస్తే, మిగతా వ్యవహారం అంతా వారే చూసుకుంటారు. ఇదీ సిస్టం..!"

"మైగాడ్... దీనికీ రామానుజానికీ ఏమిటి సంబంధం?"

"చట్టరహితమైన ప్రతీదీ 'ట్రయాడ్' లో దొరుకుతుంది సర్. లివరు నుంచి గుండె వరకూ, గర్భం నుంచి కిడ్నీ వరకూ వీరు అమ్మనిది లేదు. 'ఆరోగ్యంగా ఉన్నవారి రెండు కిడ్నీలు తీసి, తిరిగి ఒక కిడ్నీ అమర్చి ప్రజాసేవ చేయడం' అన్న ఎవరికీ రాని ఆలోచన బహుశా వీరిదే అయి ఉంటుంది. దాని కోసం దేవ్ హాస్పిటల్స్‌ని తమ మాఫియా లిస్టులో చేర్చుకున్నారు. అప్పట్లో రామానుజం చాలా చిన్న డాక్టరు. అందుకే ఈ చీకటి వ్యవహారానికి వప్పుకున్నాడు. ఇప్పుడు సడెన్‌గా '..నేను మంచివాణ్ని అయిపోయాను. మీతో సంబంధాలు తెంచుకుందామనుకుంటున్నాను' అని చెప్పటం అంత సులభం కాదు. తమ సంస్థలో పని మానేసి బయటికెళ్లిన వాళ్ళని ఏ చీకటి సంస్థా వదిలి పెట్టదు. కాబట్టి రామానుజం ఆ సంస్థతో తెగదెంపులు చేసుకోవటం కలలో మాట"

"మరిప్పుడు ఆంజనేయులు ఏం చేస్తాడు?

"ఏమి చెయ్యాలో తెలియక, వేసవికాలం వేడి రేకు మీద పిల్లిలా తిరుగుతూ ఉంటాడు. అందుకేగా మనం ప్రెస్ దగ్గరకు వెళ్ళకుండా, కేవలం అతడికి మాత్రమే ఈ విషయం తెలిసేలా చేసింది. ఇంత పెద్ద మాఫియాతో సంబంధమున్న రామానుజాన్ని ఎదుర్కోవటమంటే కొండతో పొట్టేలు ఢీకొనడం లాంటిది. మన ముఖ్యమంత్రి ఏమి చేస్తాడో చూద్దాం."

"కానీ నీకు ముఖ్యమంత్రి మీద వ్యక్తిగతమైన పగా, ద్వేషం లేవుగా రవళీ"

"మనిషి పట్ల ద్వేషం ఏమీ లేదు సార్. ద్వేషం వ్యవస్థ మీద..! ఏ వ్యవస్థలో నాయకుడు పనికిరానివాడూ, వ్యసనపరుడూ, లంచగొండీ అవుతాడో ఆ వ్యవస్థలో చాలామంది చాణుక్యలాంటి సూడో మేధావులూ, టార్జాన్‌లాంటి రౌడీలు, దౌర్భాగ్యులైన మీసాంత్రాజాలూ, కుక్కగొడుగుల్లాంటి అతడి స్నేహితులూ పెరుగుతారు. బిల్డింగ్ శిథిలమైనప్పుడు అందులో తేలూ, పామూ, జెర్ర లాంటి విషప్పురుగులు చేరటం సహజం. తొలగించడానికి రెండే మార్గాలు. పెస్టిసైడ్స్ చల్లడం. లేదా బిల్డింగు మొత్తం కూలగొట్టటం..! చూద్దాం ఏం జరుగుతుందో. ప్రస్తుతం చాణుక్యా, ముఖ్యమంత్రీ కలిసి రామానుజాన్ని ఎలా తొలగించుకోవాలా అని ఆలోచిస్తున్నారు. దానికి టార్జాన్ని పురమాయించారు. టార్జన్ రామానుజాన్ని చంపినా, తనని అతడు చంపబోతున్నాడని రామానుజానికి ముందే తెలిసినా, ట్రయాడ్ వాళ్లు టార్జాన్ ని వదలరు. అదే వాడికి ఆఖరి రోజు. ఎల్లమంద ఆత్మ శాంతించే రోజు..! మా ఇంట్లో అతడి తల బ్రద్దలు కొట్టిన దృశ్యం నేనింకా మర్చిపోలేదు సార్..! ఆ ఆర్తనాదం ఇంకా నాకు వినిపిస్తూనే ఉంది". ఆమె కళ్ళు తడి అయ్యాయి.

ఆ మూడ్ నుంచి ఆమెని బయటకు తీసుకురావటం కోసం, "ఇన్ని వివరాలు నీకు ఎలా తెలిసాయి రవళీ?" అని అడిగాడు.

"మన మనిషి సారమ్మ అక్కడ ఉన్నదనే విషయాన్ని మరిచిపోతున్నారు."

చక్రధరరావు విభ్రాంతుడై "నిన్ను చూస్తుంటే నాకు శకుని గుర్తొస్తున్నాడు" అన్నాడు. ఆమె అర్థం కానట్టు చూసింది.

"శకుని కథ తెలీదా?"

తెలీదన్నట్టు తల ఊపింది.

"మొన్నటి వరకూ నాకూ తెలీదు. మొన్న కేరళ వెళ్ళినప్పుడు చూశాము. కొల్లాం దగ్గర పవిత్రేశ్వరంలో శకుని గుడి ఉంది. కురువార్ తెగవారు కొలుస్తారు. శకుని అనగానే మనకి విలన్ గుర్తొస్తాడు. కాదు. నా దృష్టిలో అతడు హీరో. అతడి అక్క గాంధారి. సుబల మహారాజు పిల్లలు వీళ్ళు. మొత్తం నూటొక్క మంది. గాంధారి వివాహం జరగ్గానే భర్త చనిపోతాడని జ్యోతిష్కులు చెప్పినప్పుడు, ముందుగా ఒక మేకతో వివాహం జరిపించి, దాన్ని వధించి ఆ విషయం చెప్పకుండా ధృతరాష్ట్రుడికిచ్చి చేస్తారు. తనని మోసం చేశారని ధృతరాష్ట్రుడు సుబలరాజునీ, అతని వందమంది కొడుకుల్నీ కారాగారంలో బంధిస్తాడు. రోజూ గింజ మాత్రపు అన్నం ఇస్తారు. మరణం తప్పదని తెలిశాక, అందరూ తమ తిండి త్యాగం చేసి చిన్నవాడిని బ్రతికించి, ఆకలితో ఒకరొక్కరే చనిపోతారు. మరణించే ముందు తండ్రి కొడుకు కాలి మీద తన ఎముకతో పొడిచి, పగ తీరేవరకూ ఆ గాయాన్నీ, పగనీ, బాధనీ మర్చిపోవద్దని మాట తీసుకుని మరణిస్తాడు. భర్తని బ్రతిమాలి చివరగా మిగిలి ఉన్న ఆ ఒక్క తమ్ముడినీ కారాగారం నుండి విడిపిస్తుంది గాంధారి. అతడే శకుని. దుర్యోధనుడితో చేరి పాండవుల మీద ద్వేషం నూరిపోస్తాడు. యుద్ధం జరిగితే కౌరవ నాశనం తప్పదని అతడికి తెలుసు. తండ్రి ఎముకతో చేసిన పాచికలతో జూదం ఆడించి, కురుక్షేత్ర యుద్ధానికి తొలి బీజం వేస్తాడు. ఆ విధంగా కౌరవజాతిని నాశనం చేసి, పగ సాధిస్తాడు."

"మొత్తానికి నన్ను శకునితో పోలుస్తున్నారు" నవ్వుతూ అన్నది.

"జరిగిన అన్యాయానికి ఎన్నాళ్ళు వేచి ఉండాలి? ఏ రకంగా పగ తీర్చుకోవాలి? అన్న చదరంగపు ఎత్తుల విషయంలో శకునికి మించినవారు లేరు. ఒక్కడే వందమంది కౌరవులని చంపి పగ తీర్చుకున్నాడు. ధృతరాష్ట్రుడిని చంపకుండా పుత్రశోకంతో వదిలిపెట్టాడు. అది మరీ బాధ"

"మీసాల్రాజా, అతని స్నేహితులు, ఇనస్పెక్టరు జాక్సన్, చాణుక్య, ముఖ్యమంత్రి... మన లిస్టు కూడా చాలా ఉంది" స్వగతంగా అనుకుంది. మానభంగానికి ముందు అంజి సారమ్మని ఎంత దారుణంగా కొట్టాడో చెల్లి చెప్పింది ఆమెకు గుర్తుంది.

# 36

**ప్రొద్దున** పదింటికి దేవ్ హాస్పిటల్లో ప్రవేశించాడు టార్జాన్. ముందే అపాయింట్మెంట్ తీసుకోబట్టి సరాసరి రామానుజం ఛాంబరులోకి వెళ్ళాడు.

"కూర్చో. నీ పేరు అహ్మద్ ఖాన్ కదూ. ఏమిటి నీ ప్రాబ్లమ్?"

"అజీర్తి. కీళ్ల నొప్పులు. భుజాల నొప్పులు. రాత్రి సరిగా నిద్ర పట్టడంలేదు"

“ఒక దానికి ఒకటి సంబంధం లేని రుగ్మతలు. చాలా టెస్టులు చేయాలి. నాలుగైదు సార్లు ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. వస్తావా?”

“అదేమిటి సార్. ఆరోగ్యానికి మించింది ఏం ఉంటుంది? రాకుండా ఎలా ఉంటాను?”

“రావాలంటే నువ్వు బ్రతికి ఉండాలి. నిన్ను ట్రీట్ చెయ్యటానికి నేను బ్రతికి ఉండాలి. భూకంపం వచ్చి ఈ ఆసుపత్రి కూలిపోకుండా ఉండాలి. ఎలా ఉంది జోకు” అని నవ్వేసి, “ఊరికనే అన్నాలే. ముందు ఒక ఇంజక్షన్ ఇస్తాను. రేప్పొద్దున్నించీ పరీక్షలు మొదలుపెడదాం” అంటూ నర్సుని పిలిచాడు. ఆమె ఇంజెక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాక టార్జన్ డాక్టరుతో “తాజ్‌మహల్ బొమ్మ. మా తమ్ముడు ఆగ్రా నుంచి పంపించాడు సార్. పెట్టుకోండి” అంటూ ఒక ప్యాకెట్ ఇచ్చి శలవు తీసుకున్నాడు.

ఆ పై ఐదు నిమిషాలకి రామానుజానికి ఫోన్ వచ్చింది. “డాక్టరుగారూ. మీకు వచ్చిన బహుమతిలో బాంబు ఉంది జాగ్రత్త” అని ఒక స్త్రీ స్వరం వినిపించింది.

“కిడ్నీ రాకెట్ గురించి జాగ్రత్తగా ఉండమని నిన్న ఫోన్ చేసింది కూడా నువ్వే కదా.”

“అవును డాక్టరుగారూ”

“ఎవరు నువ్వు”

“అది అంత అవసరమా సార్?”

“సరే వద్దులే. నువ్వు చెప్పినట్టే పేషెంట్ ఒకతను వచ్చాడు. నువ్వు వర్ణించినట్లు టార్జాను లాగానే ఉన్నాడు. ఆగ్రా నుంచి వచ్చిందని తాజ్‌మహల్ పార్సిల్ ఇచ్చాడు. మా వాళ్ళు ఇప్పుడే అతి జాగ్రత్తగా దాన్ని విప్పారు. నువ్వు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ తప్పు. ఆ విగ్రహంలో ఏ బాంబూ లేదు. అనవసరంగా మమ్మల్ని భయపెట్టావు”.

“మీ మీద హత్యా ప్రయత్నం జరుగుతుంది. కొద్దిగా జాగ్రత్తగా ఉండండని చెప్పాను. అలా చెప్పడం తప్పా డాక్టరు గారూ”

“ఇదంతా చూస్తుంటే నా సమయం వృధా చేయడానికీ, నన్ను టెన్షనులో పెట్టడానికి నువ్వు ఆడిన నాటకంలా కనబడుతోంది. “

ఈ సంభాషణ ఇక్కడ ఇలా జరుగుతూ ఉండగా, ఆసుపత్రి వరండాలో నడుస్తూన్న టార్జాన్‌కి అకస్మాత్తుగా కడుపులో తిప్పినట్లు అయింది. ఒక మూలగా ఉన్న బెంచి మీద కూర్చున్నాడు.

“క్షమించండి డాక్టరు గారూ. పొరపాట్లు ఎప్పుడైనా జరగొచ్చు. ఇక పై మిమ్మల్ని విసిగించను”.

“నీ పొరపాటు ఖరీదు ఎంతో నీకు తెలుసా? ఒక ప్రాణం”

“ఖరీదైన వస్తువు పొందాలంటే ఎంత ఖర్చైనా పెట్టాలి కదా డాక్టరుగారూ”

టార్జాను స్పృహ తప్పి కూర్చున్న బల్ల మీదే పక్కకి వాలి పోయాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు నా ప్రాణాల మీద నీకింత ప్రేమ?"

"అది అంత అవసరం లేదని చెప్పానుగా సార్. ఈసారి ఆ టార్జన్ వస్తే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండండి. మీ గదిలోకి వచ్చే ముందు మెటల్ డిటెక్టరుతో పరీక్షించిన తర్వాతే లోపలికి రానివ్వండి"

టార్జాను పక్కకి వాలిపోగానే, దాని కోసమే వేచి ఉన్నట్టు ఇద్దరు మనుష్యులు అతడి శరీరాన్ని ఎత్తి స్ట్రెచర్ మీద పడుకోబెట్టి ఆసుపత్రి వెనక ఉన్న గదికి తీసుకెళ్లారు.

"అతనిక రాడు"

"అదేమిటి డాక్టరు గారూ. ఎందుకు రాడు?"

"మా ఆసుపత్రి మార్చురీలో ఉన్నాడు కాబట్టి"

ట్విస్టు ఊహించిందే గానీ, ఇంత తొందరగా ఊహించలేదు. రవళి మౌనంగా ఉండి పోయింది.

"చూశావా. నీ తప్పుడు ఇన్ఫర్మేషన్ వల్ల అనవసరంగా ఒక మనిషి ప్రాణాలు పోయాయి. ఎందుకీ నాటకం ఆడావు? నాకూ ముఖ్యమంత్రికీ మధ్య సంబంధాలు చెడగొట్టటం నీ ఉద్దేశ్యమా? ఇప్పుడైనా చెప్పు. ఎవరు నువ్వు?"


అవతల నుంచి ఫోన్ కట్ అయింది.

అతడు టేబుల్ మీదున్న గిఫ్ట్ వైపు చూశాడు. అప్పటికే బాంబు స్క్వాడు దాన్ని విప్పి అందులో ఏమీ లేదని నిశ్చయించింది. 'ఇందులోగానీ బాంబు ఉండుంటే ఈ పాటికి నీ శరీరం కూడా మార్చురీలో ఉండేది కదా ఆంజనేయులూ' అని ముఖ్యమంత్రి గురించి మనసులో అనుకున్నాడు. ప్రాణాలు కోల్పోయిన అహ్మద్ ఖాన్ గుర్తొచ్చాడు. 'పాపం నిజంగానే కడుపు నొప్పితో వచ్చాడేమో' అనుకున్నాడు.

అదే సమయానికి ఆస్పత్రి వెనుక ఉన్న దట్టమైన చెట్ల మధ్యనున్న మార్చురీ గది దగ్గరకి ఒక అంబులెన్స్ వచ్చి ఆగింది. టార్జన్ శరీరాన్ని అందులోకి చేర్చాక, అక్కడి నుంచి బయల్దేరి ఊరి చివర ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్ళింది. గంట తర్వాత మరణ రిజిస్టరులో కూడా నమోదు కాకుండా అహ్మద్ ఖాన్ శరీరం చేపల ఫీడ్ గా మారిపోయింది.

పని పూర్తయిందని తెలిసాక డాక్టర్ రామానుజం తన కన్సల్టేషన్ ఛాంబర్ వెనక రెస్ట్ రూముకి వెళ్లి చేతులు కడుక్కొని, క్యారియరు విప్పి ప్లేటులో చపాతీలు సర్దుకున్నాడు. భోజనానికి ముందు షుగరు టాబ్లెట్ వేసుకోవటానికి ముందు గదిలోకి వచ్చాడు. అతడి దృష్టి క్యారియరు పక్కనే ఉన్న తాజ్‌మహల్ మీద పడింది. బాంబు పరీక్ష కోసం 'ట్రయాడ్' నుంచి వచ్చిన బాంబు స్క్వాడు బొమ్మ పైనున్న పార్సిలు విప్పటంతో తాజ్ మీద కాస్త చెక్క రజను రాలిందంతే. దాన్ని దులిపి, పార్సిల్ తాలూకు ముక్కలు బుట్టలో వేసి, గిఫ్ట్ అల్మారాలో పెట్టి తిరిగి వచ్చి తినడానికి కూర్చున్నాడు.

ఏమాటకి ఆమాటే చెప్పుకోవాలి. బొమ్మ చాలా అందంగా ఉంది.



చపాతీ తాలుకు మొదటి ముక్క నోట్లో పెట్టుకోగానే వాంతి వచ్చినట్టు అనిపించింది. రొట్టె బాలేదేమో అనుకున్నాడు. అంతలో శరీరమంతా కుదించుకుపోతున్న ఫీలింగ్ కలిగింది. క్షణాల్లో బీపీ డౌన్ అయింది. తల తిరుగుతున్నట్లు అనిపించింది. గుండె వేగం పెరగటం తెలుస్తోంది. డాక్టరు కాబట్టి విషయం తెలిసిపోయింది. టేబుల్ మీదకు వాలిపోతూ గిఫ్ట్ వైపు చూశాడు. ఫోన్ చేసిన అమ్మాయి గుర్తొచ్చింది. బెల్ నొక్కబోయాడు. చేయి సహకరించ లేదు. క్షణాల్లో తల క్రిందికి జారిపోయింది. బొమ్మ తాలూకు సైనైడు పొడి చేతికి ఇంకా అంటుకునే ఉంది.

* * *

“మొత్తానికి అనుకున్నది సాధించాం. మూడో కంటికి తెలియకుండా రామానుజాన్ని రాజమండ్రి పంపించేశాం” అన్నాడు ఆంజనేయులు.

మీసా్రాజా సందేహంగా “రాజమండ్రి పంపటం ఏమిటి?” అని అడిగాడు.

“ఇప్పుడంటే పర్లేదు కానీ అరవై సంవత్సరాల క్రితం రాష్ట్రంలో కెల్లా అతి చెత్త మునిసిపాలిటీ రాజమండ్రి. రోడ్డు పక్కనే మురిక్కాలువలు, రోడ్డంతా గుంతలు. నరకంతో పోల్చవలసి వచ్చినప్పుడు ఆ మాట అనేవారు”

“జోకు వేశావా బావా” మనసులో అనుకున్నాడు మీసా్రాజా.

ఆంజనేయులు చాణుక్యతో “ఎంతో పెద్ద సమస్య ఇంత సులభంగా పోయినందుకు సంతోషించాల్సింది పోయి మీరేమిటి చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?” అడిగాడు.

"తొందర్లో తాత కాబోతున్నారు కదా. ముసలివాడయి పోతున్నానని విచారిస్తున్నారు కాబోలు" అన్నాడు రాజా.

చాణుక్య అతడి వైపు అభావంగా చూసి, ఆంజనేయులు వైపు తిరిగి "నిన్నే నాకో విషయం తెలిసింది. ఆ హనుమంతరావు ఎన్నికల మీటింగ్ కి నువ్వూ వచ్చావు. గుర్తుందా?"

"ఉంది"

"రామానాగేశ్వరరావు అనే కుర్రాడితో ఉపన్యాసం ఇప్పించాము. తనకి ర్యాంక్ వచ్చినట్టూ, మన కాలేజీ లో 'ఫ్రీ సీట్' ఇచ్చినట్టు చెప్పించాం. గుర్తుందా?" అని అడిగాడు.

"అయితే? ఇప్పుడు దాని సంగతి ఎందుకు?"

"బాలారిష్ట లాకప్పులో చితకబాదితే, వాడు నిజాలన్నీ కక్కేసాడట. మన పోలీసు ఇన్ఫార్మరు చెప్పాడు"

ముందు చిన్నగా షాక్ తిన్న ముఖ్యమంత్రి సర్దుకుని, "అందువల్ల ఏం జరుగుతుంది? హనుమంతు ఎలక్షన్సులో ఓడిపోతాడా? పబ్లిక్ మీటింగులో బోలెడు అబద్ధాలు చెప్తాం. అయినా బాలారిష్టగాడు... వాడికి ఏం పని లేదా? వాడి ఫైల్ నా దగ్గరికి పంపించమను" అన్నాడు కోపంగా.

"ఇప్పుడు విషయం అది కాదు. ఈ కిడ్నీ రాకెట్ విషయం చెప్పటానికి ఎవరో డాక్టరు నీ దగ్గరకు రావటం, రామానుజాన్ని చంపటం కోసం మనం టార్జాన్ని పంపించటం... ఇదంతా మన వెనుక ఎవరో వేసిన చదరంగపు ఎత్తులా కనపడుతోంది. బాలారిష్ట అంత తెలివైనవాడు కాదు. దీని వెనుక ఎవరో ఉన్నారు. ఎవరు?"

"అనవసరంగా చాలా ఎక్కువ ఊహించుకుంటున్నావు బాబాయ్" అన్నాడు రాజా.

చాణుక్య అతడి మాటలు పట్టించుకోకుండా, "మీ వరకూ ఇన్ఫర్మేషన్ రానట్టుంది. రెండురోజుల నుంచి టార్జాన్ కనబడటం లేదు. ఆస్పత్రి నుంచి బయటికి వచ్చాక ఏమయ్యాడో తెలియటం లేదు"

ఒక క్షణం అక్కడ ఇబ్బందికరమైన నిశ్శబ్దం పేరుకుంది.

"ఏదైనా సొంత పని మీద వెళ్ళాడేమో" అన్నాడు ఆంజనేయులు.

చాణుక్య అతని వైపు జాలిగా చూశాడు. సమస్య నెత్తి మీదకి వచ్చే ఆఖరి నిముషం వరకూ 'అది మన వరకూ రాదులే. మధ్యలోనే ఏదో జరిగి ఆగిపోతుందిలే' అనే తేలిక ధోరణి నుంచి ఈ మనుష్యులు బయటపడరు కదా అనుకున్నాడు.

"కిడ్నీ రాకెట్ గురించి మనకి చెప్పిన డాక్టరు, తన పేరు కొట్నిస్ అని చెప్పాడు కదూ".

"అవును" అన్నాడు ముఖ్యమంత్రి.

"దేవ్ హాస్పిటల్సులో ఆ పేరు ఉన్న డాక్టరు ఎవరూ లేరు"

ఆంజనేయులు విభ్రాంతుడయ్యాడు.

"నాకు ఎందుకో అనుమానం వచ్చింది. ఎంక్వయిరీ చేశాను. ఆ పేరు గలవాళ్ళు ఎవరూ లేరని తెలిశాక నా అనుమానం బలపడింది" అన్నాడు చాణుక్య.

"మనని బ్లాక్ మెయిల్ చెయ్యటం కోసం ఎవరన్నా నాటకం ఆడారా?"

"లేదు. అతని అసలు పేరు సుబ్బారావు. అక్కడే డాక్టర్. "

"మరి మనకి తన పేరు ఎందుకు అబద్ధం చెప్పాడు?"

"రామానుజంతో శత్రుత్వం పెట్టుకోవటానికి ఎవరన్నా భయపడతారు. అందులోనూ సుబ్బారావు పని చేసేది కూడా దేవ్ హాస్పిటల్సులోనే. అందుకే అతను తప్పుడు పేరుతో వచ్చి మనకి ఉప్పు అందించాడు."

"అతని పేరు సుబ్బారావు అని నీకెలా తెలిసింది?"

"మన ఆఫీసు సీ.సీ కెమెరాల్లోంచి అతని ఫోటో సేకరించి, ఆ ఆస్పత్రికి పంపాను. అతడక్కడ డాక్టరు. అంతవరకూ కరెక్టే. ఇంకేమైనా రహస్యాలు ఉన్నాయేమోనని కాల్ డీటెయిల్స్ చెక్ చేశాను. అతడు హోమ్ మినిస్టరుకి ఫోన్ చేసినట్టు ఉన్నది. ఇప్పుడు నాకో అనుమానం. అపోజిషన్ లీడర్ దేవ్ కి కూడా ఈ రహస్యం తెలిసిందా? తెలిస్తే, అంత బలమైన పాయింటు దొరికినప్పుడు రామానుజాన్ని అరెస్ట్ చేయించి, నీ మీద అసెంబ్లీలో రచ్చ చేయకుండా ఎందుకు ఊరుకున్నాడు?"

శ్రోతలు ఇద్దరూ మాట్లాడలేదు.

"రామానుజం సామాన్యుడు కాదు. పెద్ద మాఫియాతో సంబంధం ఉంది. నిన్ను రంగం నుంచి తొలగించడానికి దేవ్ ఈ ఎత్తు వేశాడా? ఏదైనా ఉంటే అతడు ఎన్నికల్లో తేల్చుకుంటాడే తప్ప, నిన్ను హత్య చేయాలనుకునేటంత దుర్మార్గుడు కాదే"

ఊహకందని ఏదో భయోత్పాదకమైన కథ వింటున్నట్టు ఇద్దరూ చాణుక్యని చూస్తూ ఉండిపోయారు.

"నీ చుట్టూ ఏదో ఉచ్చు బిగుసుకుంటోంది ఆంజనేయులూ. ఇది నా అభిప్రాయం మాత్రమే. కరెక్ట్ కావచ్చు, కాకపోవచ్చు. కానీ ఇదంతా చూస్తుంటే అంత తేలిగ్గా తీసి పడేయాల్సిన వ్యవహారం కాదనిపిస్తోంది. కాస్త జాగ్రత్తగా ఉండు" అంటూ మీసాల్రాజా వైపు ఒక అసహ్యమైన చూపు విసిరి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఉచ్చు బిగుస్తోంది తన చుట్టూనే అని అతడికి ఆ క్షణం తెలీదు.

* * *

"వయసు పెరుగుతున్న కొద్దీ చాణుక్యకి చాదస్తం బాగా పెరుగుతోంది బావా. ఆ డాక్టరు పేరు సుబ్బారావే అనుకో. రామానుజానికి భయపడి నీ దగ్గర కొట్నీస్ అని తప్పు

పేరు చెప్పి ఉంటాడు. పత్తేదారు పని చేసి పట్టుకోవలసినంత గొప్ప విషయమా ఇది?" అన్నాడు.

ఆంజనేయులు మాట్లాడలేదు.

"రామానుజం పోయాడు కాబట్టి మనం ఈరోజు ఎంతో సంతోషంగా ఉండాలి. అలా ఉండనివ్వకుండా, నీ దగ్గర తన ప్రాముఖ్యత తగ్గిపోకుండా ఏవేవో కథలు చెబుతున్నాడు".

"అంతేనంటావా" అన్నాడు ఆంజనేయులు సగం వప్పుకుంటున్నట్టు.

మనిషి సందిగ్ధంలో ఉన్నప్పుడు, తనకన్నా బలంగా 'కనపడే' వాడి మీద ఆధారపడతాడు. అప్పుడు అవతలి వ్యక్తి తన అభిప్రాయాలతో ఎదుటి మనిషిని ప్రభావితం చేసి తన కోటరీలోకి లాక్కుంటాడు. ***మూఢ నమ్మకాల ప్రచారం నుంచీ బాబాల ప్రవచనాల వరకూ; విప్లవోద్యమ ఉపన్యాసాల నుంచీ ఆన్-లైన్ మోసాల వరకూ దీనిలోకే వస్తాయి.*** నమ్మకం ఉన్న చోట వినటమూ, ఆచరించటమూ తప్ప వాదనలు, ఎదురు ప్రశ్నలు ఉండవు కదా. మంచి జరిగితే అందులో తప్పేమీ లేదు కూడా..! దీన్నే ***పెర్సుయేషన్ థియరీ*** అంటారు. ఒక రియల్ ఎస్టేటు కంపెనీ దీనికి ఉదాహరణ. స్థాపించిన సంవత్సరంలోనే లాభాల్లోకి దూసుకుపోయింది. దాని ఎదుగుదలకి కారణమేమిటా అని చాలామంది తల బద్దలు కొట్టుకున్నారు. తరువాత ఆ టెక్నిక్ అర్థమై ఆశ్చర్యపోయారు. "ఫలానాచోట నాకు స్థలం కావాలి. తక్కువ ధరలో సూచించగలరా?" అని ఎవరైనా ఫోన్ చేసినప్పుడు ఏజెంటు రామారావు "సార్. చిన్నప్రశ్న. మీరు స్థలం కొంటున్నది ఇల్లు గురించా? తిరిగి అమ్మటం గురించా? ఓ... ఇన్వెస్టుమెంట్ గురించా? అయితే, నాకన్నా సంధ్య అనే ఏజెంటు మీకు బాగా వివరిస్తుంది సార్. ఇప్పుడే ఆ అమ్మాయికి కనెక్షన్ ఇప్పిస్తాను. రేట్లు ఎక్కడ బాగా పెరుగుతాయో ఆమెకు బాగా తెలుసు. మీరు చెప్పిన ఏరియాలో తను ఎక్స్పర్ట్." అంటాడు. నమ్మకం అనే విత్తనాన్ని వేయటం గురించిన ఒక గొప్ప ఉదాహరణ ఇది. ఫెయిత్ – బిల్డప్..! అదే సంధ్య ఫోన్ ఎత్తితే రామారావు గురించి ఇవే మాటలు చెపుతుంది. పెద్ద పెద్ద కంపెనీలు బ్రాండ్ ఇమేజ్ కోసం లక్షలు ఖర్చుపెట్టటం కూడా వినియోగదారుల్లో ఇటువంటి నమ్మకం పెంచటం కోసమే.

కుటుంబంలో ఒకరి సహేతుకమైన సలహాలు మిగతావారు 'అంగీకరిస్తే' ఆ ఇల్లు శాంతివనం అవుతుంది. అదే 'పెర్సుయేషన్ థియరీ'. కానీ అదంత సులభం కాదు. వాదనలు మొదలవుతాయి. ఎదుటి మనిషి అభిప్రాయాన్ని ఖండించడం కోసం వ్యక్తులు ఎన్నుకునే పద్ధతుల్ని 'వాటెబౌటిజం' అంటారు. ఇవి చాలా గమ్మత్తుగా, ఏడెనిమిది రకాలుగా ఉంటాయి.

"ఆడపిల్లల స్కూల్ టాయిలెట్ల విషయంలో ఫలానా వ్యక్తి గొప్ప సేవ చేస్తున్నాడు" అంటారు ఒకరు. "కానీ అతనికి ఇద్దరు భార్యలు" అంటాడు ఎదుటి వ్యక్తి. "ఇద్దరు కాదు. మొదటి భార్యకి విడాకులిచ్చి రెండో భార్యను చేసుకున్నాడు" అంటాడు మొదటివాడు. "రెండో

భార్యని చేసుకోలేదు. కేవలం కలిసి ఉంటున్నాడు” అంటాడు మొదటివాడు. సదరు వ్యక్తి స్కూళ్ళకు చేస్తున్న సేవ గురించి మానేసి, అతని పెళ్ళిళ్ళ గురించి వాదించుకుంటారు. ఇది మొదటి రకం..! ‘ఎదురుదాడి’ రెండో రకం. “అదేమిటమ్మా కాలేజీనుంచి ఎనిమిదింటికి వచ్చావు. కనీసం ఫోన్ చేసి చెప్పాలి కదా. మేమెంత టెన్షన్ పడ్డామో తెలుసా?” అని తండ్రి అంటే, “అంత టెన్షన్ పడే బదులు నువ్వే ఫోన్ చేసి ఉంటే సరిపోయేది కదా నాన్నా” అంటుంది కూతురు. అంతే. ఇక దానికి ఆర్గ్యుమెంట్ లేదు. టీవీ డిబేట్లలో, అసెంబ్లీ చర్చల్లో ఇటువంటి వాటెబౌటిజం ఎక్కువ కనబడుతుంది. “ఫలానా మంత్రి కొన్ని కోట్లు తినేశాడు” అని ఒకరు అనగానే, “అధికారంలో ఉన్నప్పుడు మీ మంత్రి తినేయ్య లేదా” అని అవతలివారు వాదిస్తారు. ‘కోట్లు తినటం తప్పా కాదా?’ అన్న విషయం పక్కకి పోయి, పరస్పర నిందారోపణతో వాదన కొనసాగుతుంది..! మూడో విభాగం మనుష్యుల లక్షణం: కాదనలేని వాస్తవం చెప్పి ఎదుటివారి నోరు మూయించటం. ‘జంతు సంరక్షణకై సేవ చేస్తున్నా’ అని మీరంటే, ‘ఎంతోమంది అనాథ పిల్లలున్న దేశంలో జంతుసంరక్షణ కావాల్సి వచ్చిందా’ అంటారు. ‘అనాథ పిల్లల్ని సంరక్షిస్తున్నా’ అంటే, ‘వృద్ధుల సంగతేమిటి’ అంటారు..! నాలుగో రకం సాడిస్టుల లక్షణం: అవతలివారి వాదనని జోక్ ద్వారా అపహాస్యం చేయటం. బుద్ధుడి ఫిలాసఫీ చెప్తూ, “జీవితసారం తెలుసుకోవడానికి గౌతమ బుద్ధుడు అరణ్యానికి వెళ్లే సమయానికి అతడి భార్య యశోధర నిండు గర్భవతా? వెళ్లిన రోజే ఆమె గర్భవతి అయిందా? ఆమె గర్భంలో రాహుల్ ఆరు సంవత్సరాల పాటు ఉన్నాడా?” అని వక్త గంభీరంగా చెప్పుకుపోతూ ఉంటే, ‘మొగుడు లేకుండా కొడుకు పుట్టాడు. చాలు’ అని సభికుల్లోంచి ఒకడు జోక్ వేశాడనుకోండి. శ్రోతలు గొల్లుమంటారు. ఆ పై సభికుల మూడ్ సరి చేయడానికి ఉపన్యాసకుడికి చాలా సమయం పడుతుంది..! అయిదోరకం వ్యక్తులది నెగిటివ్–థింకింగ్. తమలాంటి వికృత ఆలోచనలే ఎదుటివారికి కూడా ఉంటాయని నమ్మేవారు వీరు. “అతడు చాలా దానధర్మాలు చేస్తున్నాడు” అనగానే “గతంలో చేసిన పాపాలు పోగొట్టుకోవటానికి’ అంటారు..! ఆరోరకం మనుష్యులు సర్వజ్ఞులు. ‘అంతా నాకు తెలుసు’ అన్నట్టు వాదిస్తారు. తమ అభిప్రాయాన్ని విశ్వపు అభిప్రాయంగా నమ్ముతారు. “ఆమెకి కారు ఆక్సిడెంటు జరిగింది” అని మీరంటే, క్షణం కూడా ఆలోచించకుండా, “సెల్–ఫోనులో మెసేజులు ఇస్తూ డ్రైవ్ చేయటం ఆవిడ హాబీ. అందుకే జరిగి ఉంటుంది” అంటారు. “ఆక్సిడెంటయిన సమయంలో మెసేజిలిస్తూ డ్రైవ్ చేస్తున్నానని ఆమె మీకు చెప్పిందా” అని అడిగితే, “లేదు” అంటారు. “తప్పు ఎదుటివారిదై ఉండొచ్చు కదా” అని మీరంటే, “కానీ బండి నడుపుతూ మెసేజెస్ ఇవ్వటం ఆమె అలవాటు” అంటారు..! ఏడవ రకం వ్యక్తులు ‘తివిరి ఇసుమున’ టైపు. “సెల్–ఫోన్ హాల్లో పెట్టి బాత్రూంలో స్నానం చేస్తున్నా నన్ను రహస్య కెమెరాల్లో చూస్తున్నారు. ఏం చెయ్యాలో తోచటం లేదు” అంటుందామె. “అదెలా సాధ్యం? నువ్వు చెప్పే దానిలో ఏమైనా లాజిక్ ఉందా?” అంటారు మీరు. “నీకు తెలీదులే. టెక్నాలజీ బాగా డెవలప్ అయింది” అంటుంది..! ఇక ఆఖరి ఎనిమిదో రకం వ్యక్తులు మౌనచిదానంద స్వాములు.

మనం వాదిస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉంటారు. ఆ నవ్వుకి అర్థం, "నాతో మాట్లాడటమే నీ అదృష్టం" లాంటి హేళన.

వాద ప్రతివాదనలు ఇన్ని రకాలుగా ఉంటాయి. విభేద సమయంలో మౌనంగా ఉండటం 'మెచ్యూరిటీ'. ఎదుటివారి మాట సహేతుకమైనప్పుడు విభేదాన్ని అంగీకారంగా మార్చుకోవటం 'జ్ఞానం'. "ఫలానా నవల 86వ పేజీలో సీత భర్త దశరథుడని వ్రాశావు. దశరథుడు సీత తండ్రి. భర్త రాముడు" అని ఒకరు ఉత్తరం వ్రాస్తారు. దానికి సమాధానంగా "అంత పెద్ద పుస్తకంలో కేవలం అంత చిన్న తప్పు నీకు కనబడిందా? సీత తండ్రి దశరథుడు కాదురా. అది కూడా తెలియని నువ్వు నన్ను విమర్శిస్తావా?" అంటారు మీరు. "తప్పుల్లో చిన్నవి పెద్దవి అని రెండు రకాలు ఉండవురా. వంద రూపాయలు పెట్టి పుస్తకం కొనుక్కున్న నాకు విమర్శించే హక్కు లేదంటావా? రచనలు చేయటం మానేసి ఉల్లిపాయల షాప్ పెట్టుకో" అంటాడు వాడు. అలా కాకుండా "అవును తప్పే. క్షమించండి. వచ్చే ఎడిషన్లో సరి దిద్దుకుంటాను" అని చిన్న మాటంటే, "అయ్యో. మీ తప్పులు ఎత్తి చూపించడం నా ఉద్దేశ్యం కాదు. మీరంటే నాకు ఎంతో గౌరవం" అని సమాధానం వస్తుంది.

వ్యక్తుల మధ్య వాదన మూడ్ పాడుచేస్తుంది. ముఖ్యంగా దంపతుల మధ్య..! 'అంగీకారం' పెరిగే కొద్దీ మనసు ప్రశాంతంగా ఉంటుంది. సంబంధాలు బావుంటాయి. ఇక్కడితో విశ్వనాథవారిని వదిలి తిరిగి కథలోకి వెళ్తే...

మీసాల్రాజా తాను చెప్పిన దానిని సమర్థించుకుంటూ, "ఆ చాణుక్య నిజంగా అంత తెలివైనవాడైతే, అంజిని మర్డరు కేసు నుంచి ఎందుకు బయటకు తీసుకురాలేకపోయాడు? అంత పెద్ద డిటెక్టివ్వే అయితే కూతురు ఎవడితోనో లేచిపోయే వరకూ ఎందుకు తెలుసుకో లేకపోయాడు? నువ్వే చెప్పు బావా. స్వంత ఇంట గెలవ లేనివాడు మనకు జాగ్రత్తలు చెపుతున్నాడు. రామానుజాన్ని చంపాలనుకుంటే ఏ కన్సల్టేషన్ బల్లకో, కారు స్టీరింగుకో సైనేడ్ రాయొచ్చుగా. అతడు మాఫియా అని తెలిసీ టార్జాన్ని అతడి దగ్గరకు పంపటం దేనికీ, ఇప్పుడు ఆ టార్జాన్ ఏమయ్యాడో అని కంగారు పడటం దేనికి? ఆ ఎల్లమంద కేసూ అంతే. గొప్ప ప్లాను వేసి చంపినట్టు బిల్డప్పు ఇచ్చి, పోలీసులతో శత్రుత్వం పెట్టుకున్నాడు. ఆ ఇనస్పెక్టరు ధర్మారావు లేచి తిరుగుతున్నాడట. మరోవైపు ఆ సబ్-ఇనస్పెక్టరు బాలారిష్ట సవాళ్ల మీద సవాళ్లు విసురుతున్నాడు." అన్నాడు.

ఆంజనేయులు మొహం చిట్లించి, "సవాళ్లు ఏమిటి?" అన్నాడు.

"పెద్ద సవాళ్లు కావనుకో. తనేదో గోప్ప సినిమా హీరో అనుకుంటున్నాడు. అందరూ చూస్తూ ఉండగా మూడ్రోజుల్లో అంజిని పబ్లిగ్గా చంపుతానన్నాట్ట. ఐ.జి.కి చెప్పి వాడిని ఏ అండమాన్సుకో ట్రాన్స్‌ఫర్ చెయ్యి బావా" అంటూండగా ఫోన్ వచ్చింది.

మాట్లాడుతూండగా ఆంజనేయులి మొహం వివర్ణమైంది. కొంచెం సేపు మాట్లాడి ఫోను పెట్టేస్తూ, "పబ్లిక్ మీటింగ్‌లో అందరిమధ్యా బాలారిష్ట అంజిని చంపేశాడట" అన్నాడు.

# 37

**సుమద్యుతి** అందించిన స్వీట్ తీసుకుంటూ "ఏమిటి విశేషం? తొందర్లో ప్రమోషన్ రాబోతోందా?" నవ్వుతూ అడిగింది రవళి. సుమ రవ్వంత సిగ్గుతో తలవంచుకుంది.

"నిన్న రాత్రి నుంచి మా ఇద్దరికీ గొడవ అక్కా" అన్నాడు సారథి. "మీ పేరు పెడదామని నేనూ, తన తండ్రి పేరు కూడా కలిసొచ్చేలా పెడదామని సుమా."

రవళి మొహంలో నవ్వు మాయమై, వారి వైపు నిర్నిమేషంగా చూసింది.

మనసులో అస్పష్టమైన విరుద్ధ భావాలు.

ఎంత గమ్మత్తైన పరిస్థితి..! ఇద్దరు విరోధుల పేర్లు కలిపి ఒక పేరు.

ఇంత 'గౌరవం' తను భరించగలదా?

ఏమీ తెలియనట్టు ఉంటే మంచిదా? మొత్తమంతా చెప్పేస్తే మంచిదా?

ఆమె అటువంటి సందిగ్ధంలో ఉండగా, "సినిమా విషయం కూడా చర్చించుకున్నాం. పిల్లలు పుట్టాక ఇక ఆ ఫీల్డ్ వైపు వెళ్లడం అసంభవం. నేను రిజైన్ చేసి సినిమా ప్రయత్నం మొదలు పెడదామని అనుకుంటున్నాను. మీరు ప్రామిస్ చేసినట్టే నా ఉద్యోగం సుమకి ఇస్తారా మేడమ్ ?" అని అడిగాడు.

రవళి మాట్లాడలేదు. సుమద్యుతి ఇబ్బందిగా "నేను సారథి అంత ఇంటెలిజెంట్ కాను. పర్లేదా" అంది. దానికి కూడా ఆమె సమాధానం చెప్పలేదు. అవే ఆలోచనలు.

చె..ప్పే..స్తే.. మంచిదా?

ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకొని "మీకు ఇబ్బంది అయితే వద్దు మేడమ్ . ఇప్పటికే మీరు చాలా చేశారు" అన్నాడు సారథి.

ఇక చెప్పెయ్యాలన్న నిర్ణయానికి వచ్చింది. చెప్పటం రిస్కే..! సుమ వెళ్ళి తండ్రికి మొత్తం చెప్పొచ్చు. అతడు తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఇప్పటివరకూ పేర్చుకుంటూ వచ్చిన ఎత్తులన్నీ చాణుక్య వేయబోయే ఒక్క 'షా' తో నిర్వీర్యం అయిపోవచ్చు.

అయినా

... ... ...

ఒక నిర్ణయానికి వచ్చినట్టు గుండెల్నిండా గాలి పీల్చుకుని, "నీ భర్తకి మంచి మార్కులు వచ్చాయనీ, అందువల్లే మేము పిలిచి ఉద్యోగం ఇచ్చామనీ అనుకుంటున్నావు కదూ" అంది.

ఎప్పుడూ సరదాగా, ఆప్యాయంగా ఉండే రవళి, అంత రూడ్ గా మాట్లాడేసరికి ఇద్దరూ షాకయ్యారు. సారథి సర్దుకుని, "కాదు. విద్యాధరి కాలేజీ గురించి వివరాలు కావలసి పిలిచారని అనుకుంటున్నాను" అన్నాడు

"మా రాంబాబుకి చెప్తే ఆ వివరాలు రెండు రోజుల్లో సంపాదించి పెడతాడు".

సారథి మొహం వాడిపోయింది. ఏదో చెప్పబోయి ఊరుకున్నాడు.

"కొన్ని నిజాలు చేదుగా ఉంటాయి సారథీ. నేను చెప్పబోయే నిజాన్ని మీరు జీర్ణించుకోవటం కోసం మొదటగా ఒక కథ చెపుతాను. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఒక బిచ్చగత్తె చంటిపిల్లని ఎత్తుకొని అడుక్కుంటూ ఉంటుంది. దుస్తులు బీదగా ఉన్నా మనిషి అందంగా ఉంటుంది. కారు అద్దం దింపిన సేటు ఆమె చేతిలో చిల్లర వేస్తూ, "బిడ్డకి తండ్రి లేడా?" అని అడుగుతాడు. సమాధానం చెప్పదు. "వాడి పేరు కూడా తెలీదా? సర్లే. నా ఫ్యాక్టరీకి రా. ఇలా ఎండలో అడుక్కోవలసిన పనిలేకుండా ఏదో ఒక పని ఇస్తా" అంటాడు. "మీ




పేరేమిటి బాబూ?" అని అడుగుతుంది. పర్సులోంచి విజిటింగ్ కార్డు తీస్తున్న సేటు ఆశ్చర్యపోతూ "ఎందుకు?" అంటాడు. 'తొమ్మిది నెలల తరువాత నా రెండో బిడ్డకి తండ్రి ఎవరని అడుగుతారు కదా. చెప్పటానికి' అంటుంది" ఆగి అన్నది రవళి. "ఎదుటి వ్యక్తిపై చూపించే ప్రేమ, పగ, జాలి, పశ్చాత్తాపమూ ఏదైనా సరే... లాభాపేక్ష లేకుండా మనుష్యులు ఏ పనీ చేయరన్నది ఈ కథలో నీతి. నేను కూడా దానికి మినహాయింపు కాదు".

ఈ అప్రస్తుత కథా ప్రస్తావన ఎందుకా అన్న సందిగ్ధంలో వారుండగా ఆమె కొనసాగించింది. చాణుక్య తన ఇంటిలో చేయించిన హత్య నుంచీ, యాక్సిడెంట్లో తన

తండ్రి కోమాలోకి వెళ్ళటం వరకూ మొత్తం చెప్పింది. ఒకసారి ప్రారంభించిన తర్వాత మాటలు ప్రవాహంలా వచ్చాయి. ఏదీ దాచుకోలేదు. పార్థసారథిని ఎందుకు చేరదీసిందీ... తండ్రి నుంచి కూతుర్ని ఎందుకు విడతీసిందీ... అర్ధరాత్రి మీసాల్రాజాకి తనకి ఎందుకు ఫోన్ చేసిందీ... మొత్తం అంతా చెప్పి "హత్య చేసిన టార్జన్ చచ్చిపోయాడు. మిగిలింది నీ తండ్రి ఒక్కరే. నా తండ్రి రక్షింపబడాలంటే నీ తండ్రి శిక్షింపబడాలి" అన్నది.

సారథి దిగ్భ్రాంతుడై విన్నాడు. సుమద్యుతి మాట్లాడలేదు. ఆమె మొహంలో ఏ మార్పూ లేదు. లేచి, హ్యాండ్ బ్యాగ్ తీసుకుని అక్కడి నుంచి మౌనంగా వెళ్ళిపోయింది. అప్పటి వరకూ షాక్ లో ఉన్న పార్థసారథి తేరుకుని 'సుమా... సుమా...' అని పిలుస్తూ ఆమె వెనకే పరిగెత్తాడు.

రవళి చుట్టూ దట్టమైన నిశ్శబ్దం పేరుకుంది.

అంతా చెప్పి తప్పు చేశానా అని ఆమె అనుకోలేదు. అమాయకమైన ఈ పిల్లలిద్దర్నీ ఇక మోసం చేయనవసరం లేదన్న ఫీలింగ్ వల్ల తేలికైన మనసుతో తను కూడా అక్కడి నుంచి లేచింది.

విషయం తెలిసిన చక్రధరరావు మాత్రం అంత హ్యాపీగా ఫీల్ అవ్వలేదు. "కష్టపడి ఓ అద్దాల మేడ కట్టి, పూర్తవబోతున్న టైములో రాయి విసిరి బద్దలుకొట్టినట్టు ఉంది నీ వ్యవహారం" అన్నాడు.

ఆ మాటలతో ఏకీభవించనట్టు, "మీకు గుర్తుందా సార్? మనిద్దరి మధ్యా కొంతకాలం క్రితం ఒక చర్చ జరిగింది. 'నాది గెరిల్లా యుద్ధం' అన్నాను. అన్నానే గానీ అప్పటి నుంచీ నాకు గిల్ట్ ఫీలింగ్ ప్రారంభమైంది. 'అక్కా అక్కా' అంటూ నా చుట్టూ తిరుగుతూన్న వాళ్ళిద్దరినీ నా స్వార్థం కోసం వాడుకోవటం ఇష్టం లేకపోయింది. అందుకే మొత్తం చెప్పేశాను. ఇప్పుడు మనసు తేలిగ్గా ఉంది. చూద్దాం ఏం జరుగుతుందో" అంది.

*   *   *

అంజి హత్య విషయం తెలియగానే చాణుక్యా, మీసాల్రాజా హుటాహుటిన పోలీస్ స్టేషనుకు వచ్చారు. జాక్సన్ సకల మర్యాదలు చేస్తూ అంజి మర్డర్ ఎలా జరిగిందో వివరించాడు.

"సభలో ఓ నాలుగొందల మంది దాకా ఉంటారు సార్. మీటింగ్ జరిగే మైదానం చుట్టూ సరుగుడు చెట్లున్నాయ్. ఎమ్మెల్యే కాండేటు హనుమంతరావు మాట్లాడుతున్నారు. మీటింగ్ అయ్యాక కార్యకర్తలకి పార్టీ ఏర్పాటు చెయ్యమని అంజి చెప్పాడు. ఎవడో కాంట్రాక్టరుకి ఆ పని పురమాయించి, హెడ్-కానిస్టేబుల్ని వైన్ షాపుకి పంపుతున్నా. పోలీస్ డ్రెస్‌లో వచ్చాడు బాలారిష్ట. ఎవరికీ అనుమానం రాలేదు. అంజి ముందు వరుసలో కూర్చుని ఉన్నాడు. సరాసరి దగ్గరికి వచ్చి పాయింట్ బ్లాంక్ లో కాల్చేశాడు."

"చుట్టూ అందరూ..."

"అందరూ సర్పంచి మనుష్యులేనండి. ఒక్కసారిగా వాడి మీద పడ్డారు. పోలీసులు లేకపోతే వాడిని అక్కడే చంపేసేవారు."

"అలా జరిగుంటే బావుండేది" అన్నాడు మీసాలరాజా.

"వాడి చేతిలో పిస్టల్ ఉందండి. అందుకే అందరూ భయపడ్డారు. లేకపోతే అక్కడే అయిపోయేది. చాలామంది వీడియో తీసుకుంటూ ఉండగా అంజి ప్రాణం పోయింది. అంబులెన్స్ పిలవటానికి కూడా టైమ్ లేదు. చస్తూ కూడా 'రాజా' అని అరిచాడు".

మీసాల్రాజా ఆవేశంతో ఊగిపోతూ, "ఎక్కడున్నాడు ఆ ఇనస్పెక్టరు?" అని అరిచాడు.

"లాకప్ లోనే. ఇంకా మెజిస్ట్రేట్ దగ్గరకి తీసుకు వెళ్ళలేదు" అంటూ లాకప్ గది చూపించాడు.

"వాణ్ని ఇక్కడే చంపేస్తా. ఎన్‌కౌంటర్ అని వ్రాసుకో..." అంటూ లేచాడు రాజా.

చాణుక్య "కంట్రోల్ రాజా. కంట్రోల్" అని వారించి, జాక్సనుతో "నువ్వు పక్కన ఉండగానే ఇదంతా జరిగిందా?" అని అడిగాడు.

"అవును సార్. అంజిని కాల్చాక నా దగ్గరికి వచ్చి పిస్టల్ సరెండర్ చేసి లొంగి పోయాడు".

"వాడు నా కళ్ళ ముందే ఉరికంబం ఎక్కాలి" మీసాల్రాజా అన్నాడు.

"ఉరి పడక పోవచ్చు. యావజ్జీవం మాత్రం గ్యారంటీ" అన్నాడు జాక్సను.

"సాక్ష్యాలు బలంగా ఉన్నాయా?" చాణుక్య అడిగాడు.

"చాలా పకడ్బందీగా ఉన్నాయండి. అందరూ ప్రత్యక్షంగా చూశారు కదా. వాడిని పట్టుకున్న ఓ ఐదుగురి దగ్గరా పంచనామా చేసి స్టేట్మెంట్ తీసుకున్నాను. సాక్షి సంతకాలు చేశారు. ఓపెన్ అండ్ షట్ కేసు".

"చంపేవాడు రహస్యంగా చంపొచ్చు కదా. అందరి ముందూ పబ్లిగ్గా చంపి కోరి కోరి ప్రాణాల మీదకు ఎందుకు తెచ్చుకున్నాడు?" సాలోచనగా అన్నాడు చాణక్య.

"ఏదో కసీ, కారణమూ ఉందండి. నాకు తెలియదు" అన్నాడు జాక్సను.

తెలిసిన మీసాల్రాజా మాట్లాడలేదు.

అంతలో బయట కలకలం వినిపించింది. బాడీగార్డులు వెంటరాగా చక్రధరరావు లోపలికి వచ్చాడు. జాక్సను కంగారుగా కుర్చీలు వేయించాడు.

"మీ కస్టడీలో ఉన్న సబ్-ఇనస్పెక్టర్ బాలారిష్ట బర్త్-డే ఈ రోజు. అతడి భార్య మా దగ్గర పని చేస్తుంది. ఆమె వస్తే మీరు అనుమతి ఇస్తారో లేదో అని స్వీట్లు పంపింది. వెళ్లి ఇవ్వచ్చా?"

జాక్సన్ చక్రధరరావు వైపు ఇబ్బందిగా చూశాడు. "పెద్దవారు. మీకు తెలియనిదేముంది? కస్టడీలో ఉన్న వ్యక్తికి బయట నుంచి ఏదీ తీసుకొచ్చి ఇవ్వటానికి ఒప్పుకోము".

"కారణం తెలుసుకోవచ్చా?"

జాక్సన్ మాట్లాడలేదు. పక్కనే ఉన్న చాణుక్య కల్పించుకొని, "తమ రహస్యాలు బయట పడతాయని బయటవారు విషం పెట్టి ముద్దాయిని చంపేయవచ్చు. లేదా రహస్యంగా మారణాయుధాలు అందించవచ్చు. అందువల్ల చట్టం ఇటువంటివి ఒప్పుకోదు" అన్నాడు.

మీసాల్రాజా తన పాండిత్య ప్రకర్ష ప్రదర్శిస్తూ, "అవును. 'మ్యాచెస్' సినిమాలో జైల్లో హీరోకి టాబూ లిప్-కిస్ ఇచ్చి వాడి నోట్లో సైనేడ్ పెడుతుంది. దాంతో ఆత్మహత్య చేసుకుంటాడు" అన్నాడు. అధిక ప్రసంగం చేయొద్దన్నట్టు టేబుల్ కింద నుంచి మీసాల రాజా కాలు నొక్కాడు చాణుక్య.

"నా ఆఫీసులో పని చేసే అమ్మాయి మొగుణ్ణి నేను ఎందుకు చంపుకుంటాను?" అడిగాడు రావుగారు.

"లాకప్పులో బయటి వస్తువులు ఎందుకు వప్పుకోరో చెప్తున్నానంతే" అన్నాడు చాణుక్య.

ఆయన లేస్తూ "ఇన్ని స్వీట్లు ఏం చేయను? పోనీ అతనికి ఇవ్వవద్దు లేండి. మీ స్టాఫ్ కి ఇవ్వండి" అంటూ ప్యాకెట్లు అక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు.

"స్వీట్ తిని మనందరం స్పృహ తప్పి పడిపోతే, వాడిని విడిపించుకుని వెళ్ళటం కోసమేమో" అన్నాడు రాజా.

"సినిమాలు చూసి కథలు ఊహించుకోవటం కాస్త తగ్గించు" చాణుక్య చిరాగ్గా అని, జాక్సన్ వైపు తిరిగి "ఇప్పుడు వచ్చింది ఎవరో తెలుసా" అని అడిగాడు.

"పారిశ్రామికవేత్త చక్రధరరావు"

మీసాల్రాజా వైపు తిరిగి "నీకు తెలుసా?" అని అడిగాడు.

రాజా చిరాగ్గా "వచ్చిన మనిషి చక్రధరరావు అని జాక్సను చెప్పాడు కదా" అన్నాడు.

"ఆ విషయం కాదు. కొన్నాళ్ళ క్రితం నువ్వు ఆక్సిడెంటు చేసిన మనిషి. అప్పట్లో చక్రాల కుర్చీలో కోర్టుకు వచ్చాడు. ఈ మధ్య కృత్రిమ కాళ్ళు పెట్టించుకున్నట్టున్నాడు. గుర్తు రాలేదా?"

క్షణ కాలం ఆలోచించి, గుర్తొచ్చినట్టు తలూపాడు రాజా. చాణుక్య అన్నాడు: "ఆక్సిడెంటు జరిగినప్పుడు కార్లో మీ నలుగురే ఉన్నారు. తప్పుడు సాక్ష్యం చెప్పిన గోవింద్ మరణించాడు. ప్రభు జైల్లో ఉన్నాడు. అంజిని ఈ రోజు బాలారిష్ట చంపేశాడు. పైగా స్వీట్లు పంచుకుంటున్నారు. ఇదంతా చూస్తూ ఉంటే నాకేదో అనుమానంగా ఉంది".

"తాతగారూ. సినిమాలు చూసి ఊహించుకుంటున్నది నేను కాదు. మీరు..! వయసు పెరిగే కొద్దీ మీకు అనుమానాలు ఎక్కువవుతున్నాయి. మొన్న బావ దగ్గర కూడా ఇలాగే రకరకాల డౌట్స్ చెప్పి ఆయన మనసు పాడుచేశారు. ఈ బాలారిష్టగాడు అంజిని చంపటానికి వేరే కారణాలు ఉన్నాయి. మీకు తెలీదులెండి. వాడి పెళ్ళాన్ని వీడు..... 'A' సర్టిఫికేటు బ్లూఫిల్మ్ అది. ఆ రోజు కారు ఆక్సిడెంటులో ఆయన కాలు విరగటానికీ, ఈ మర్డరుకీ ఏ సంబంధమూ లేదు. మా గురించి అనవసరంగా ఆలోచించి మీరు నిద్ర పాడు చేసుకోకండి..." అంటూ జాక్సను వైపు తిరిగి, "నేను ఒకసారి వాడిని చూడొచ్చా? సర్లే వద్దులే. నువ్వన్నట్టు మళ్ళీ గొడవ జరిగితే కష్టం" అంటూ ఒక స్వీటు జేబులోనూ, మరొకటి నోట్లోనూ వేసుకుని, "రండి పోదాం" అని చాణుక్యతో అంటూ అక్కడి నుంచి కదిలాడు.

ఇద్దరూ పోలీస్ స్టేషన్ మెట్లు దిగుతుండగా చాణుక్యకి ఫోన్ వచ్చింది. మాట్లాడి పెట్టేస్తూ "కొన్నాళ్ళ క్రితం అర్ధరాత్రి ఒకమ్మాయితో ఫోన్లో మాట్లాడావు గుర్తుందా" అని అడిగాడు.

"చాలామందితో మాట్లాడతాను. అర్ధరాత్రులు నేను చేసే పనే అది" అన్నాడు రాజా.

"రాత్రి మాట్లాడి పొద్దున్నే అరెస్టు అయ్యావు చూడూ. అది" విసుగ్గా అన్నాడు చాణుక్య.

మీసాలరాజా మొహం చిట్లించి, "ఇప్పుడా విషయం ఎందుకు గుర్తొచ్చింది?" అన్నాడు.

"ఇప్పుడొచ్చింది చక్రా గ్రూప్ యజమాని. ఆ రాత్రి నువ్వు ఫోన్ చేసిందీ, నిన్ను అరెస్టు చేయించిందీ చక్ర ఇండస్ట్రీస్ సెక్రెటరీ. నా అనుమానంలో నిజం ఉందని ఇప్పటికైనా అర్థమైందా?"

"ఇప్పుడు ఈ విషయం మీకు ఎలా తెలిసింది?"

"నీ సెల్-ఫోను కాల్ డైరీ".

"ఓరి ముసలాడా. నాకు తెలియకుండా నా ఫోన్ కాల్స్ చెక్ చేయించావా?" కోపంగా అరిచాడు మీసాల్రాజా.

"అవును. నీ మంచి కోసమే..! నీ గుండె ఆగిపోయే ఇంకో వార్త కూడా చెప్తా విను. ఆ రోజు తెల్లవారుజామున నిన్ను అరెస్ట్ చేసింది కూడా ఇప్పుడు లాకప్పులో ఉన్న బాలారిష్టే."

"ఇందులో గుండె ఆగిపోయే వార్త ఏముంది? నన్ను అరెస్ట్ చేయటానికి వచ్చినప్పుడు వాడేమీ మొహానికి ముసుగు వేసుకొని రాలేదు కదా"

"చెప్పటం నా ధర్మం. వినకపోతే నీ ఖర్మం" ముక్తాయించాడు చాణుక్య.

"ఆ సెక్రట్రీ ఎవత్తో... దాని విషయం రేపే తేలుస్తాను" అన్నాడు మీసాల్రాజా.

* * *

వేదరవళి తన ఛాంబర్లో పని చేసుకుంటూ ఉండగా రిసెప్షనిస్ట్ కంగారుగా "మీ కోసం ఎవరో వచ్చారు మేడమ్ " అంటూ ఫోన్ చేసింది.

ఆమె కంఠంలో ఆందోళన గుర్తించి, “ఎవరు?” అని ప్రశ్నించింది రవళి.

“తెలీదు. మేము అడుగుతూ ఉండగానే ‘మీకనవసరం’ అంటూ లిఫ్ట్ ఎక్కేసి పైకి వచ్చేసాడు. సెక్యూరిటీని పంపిస్తున్నాను మేడమ్” రిసెప్షనిస్ట్ భయంగా అన్నది.

రవళి ఏదో చెప్పబోతూంటే మీసమ్రాజా విసురుగా క్యాబిన్ తలుపు తీసుకుని లోపలికి వచ్చాడు. అతడిని చూసి రవళి రిసెప్షనిస్ట్ తో తాపీగా, “అవసరం లేదు. నేను మాట్లాడతాలే” అంటూ ఫోన్ పెట్టేసింది.

వస్తూ వస్తూనే, “నువ్వే కదా ఆరోజు హోటల్లో సుమద్యుతితో పాటూ ఉన్నది” ఉపోద్ఘాతం లేకుండా ఏకవచనంలో సంబోధించాడు.

“అవును సార్. నేనే” అంది.

“నా మీద పోలీసు రిపోర్టు ఇచ్చింది కూడా నువ్వేగా” ఎదుటి కుర్చీ విసురుగా లాక్కుని కూర్చుంటూ అన్నాడు.

విస్మయంగా చూసి “ఓ... ఆ రోజు అర్ధరాత్రి ఫోన్ చేసి మాట్లాడింది మీరేనా” అంది.

“మాటకు మాట ఎదురు ప్రశ్న వెయ్యకు. అడిగిందానికి సమాధానం చెప్పు” కరుగ్గా అన్నాడు.

“నే...నే... నేనే సర్.”

“నేనెవరో తెలుసా? రాజా. అందరూ మీసాంరాజా అంటారు. చీఫ్ మినిస్టర్ బావమరిదిని”.

ఆమె కంగారుపడి చప్పున లేచి నిలబడి, “మై గాడ్. మీరా సార్. సారీ సార్. మీరు ఇంత పెద్దవారనుకోలేదు. ఎవరో ఆకతాయి అనుకున్నాను” అంది.

“నీ మీద పది లక్షలకు తక్కువ కాకుండా పరువు నష్టం వేయమన్నాడు మా లాయరు”

“అయ్యో పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ఏమిటి సార్. మీరెవరో చెప్పి ఉంటే ఆ రాత్రే మాట్లాడి ఉండేదాన్ని” నాజూగ్గా అన్నది.

ఆ మాటలకు నెమ్మదించినట్టు, “ఆరోజు నన్ను అరెస్టు చేసిన ఇనస్పెక్టర్ ఇప్పుడెక్కడ ఉన్నాడో తెలుసా? పోలీస్ లాకప్ లో. అదీ నా పవర్ అంటే” అన్నాడు.

“నన్ను కూడా అరెస్ట్ చేయించకుండా స్వయంగా వచ్చారు. చాలా సంతోషం సార్. కూల్ డ్రింక్ తాగుతారా? కాఫీయా? మీలాంటి పెద్దవారు మా ఆఫీసుకి రావటం, ఇలా కలుసుకోవటం నాకే గిల్టీ గా ఉంది. అనవసరంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. మీ పలుకుబడి ఉపయోగించి ఆ ఇన్స్పెక్టర్ మీద కేసు లేకుండా చేయండి ప్లీజ్. అతని తరపున మీ చేతులు పట్టుకుని వేడుకుంటున్నాను”.

అంతే. అయిదు నిముషాలయ్యేసరికి స్నేహితులకన్నా దగ్గరయినట్టు మాట్లాడుకో సాగారు.

"వయసు వచ్చింది. అందం, హోదా ఉంది. ఇంకా ఎందుకు పెళ్లి చేసుకోలేదు?" చనువుగా అడిగాడు.

పెద్ద కళ్ళు పైకెత్తి "మంచి కుర్రాడు దొరకాలి కద సార్. మీకు వివాహం జరిగిందా?" అంది.

"లేదు. తొందర్లోనే జరుగుతుంది. పెళ్లికూతురు హోమ్ మినిస్టర్ మనవరాలు" గర్వంగా చెప్పాడు.

"అదృష్టవంతురాలు సర్"

"...కార్డు పంపిస్తాను. గవర్నరూ, ఇంకా చాలా పెద్దవాళ్లు ఉంటారు. పర్లేదులే. నా కార్డుతో వస్తే అక్కడ వి.ఐ.పి ట్రీట్మెంట్ దొరుకుతుంది. ఈ లోపులో ఏదైనా ఒక రాత్రి మాట్లాడుతాలే. నీ నెంబర్ నా దగ్గర ఉందిగా" అంటూ అక్కడి నుంచి వెళ్లి పోయాడు.

'అన్నమంతా పట్టి చూడక్కరలేదు. మనిషి సంస్కారం అతడి తొలి ప్రవర్తనలోనే బయట పడుతుందంటారు. పరిచయమైన కొద్ది నిమిషాలకే అవతలివారిని ఏకవచనంలో సంబోధించడం అత్యంత నికృష్టమైన సంస్కృతి అన్న విషయాన్ని మనుష్యులు ఎప్పుడు తెలుసుకుంటారో' అని మనసులో అనుకుంది.

# 38

**కోర్టు** హాలు కిటకిటలాడుతోంది. హనుమంతరావు, అతని మనుషులు, మీసాల్రాజా, చాణుక్య ముందు వరుసలో కూర్చున్నారు. రవళి రాలేదు. బాలారిష్ట తన మనిషి అనీ, అతడి భార్య ముఖ్యమంత్రి దగ్గర పని చేస్తోందనీ అప్పుడే బయటపడటం ఇష్టంలేదు. అందుకే సారమ్మను కూడా కోర్టుకు రావద్దని చెప్పింది.

బాలారిష్ట తరఫున కేసు వాదిస్తున్న డిఫెన్స్ లాయర్ రవి ఉరఫ్ సౌజన్యారావు. ఆ కుర్రవాడి శక్తి సామర్థ్యాల మీద చక్రధరరావుకి అంతగా నమ్మకం లేదు కానీ, రవళి అతడినే నియమించింది. పెద్ద మొత్తంలో అడ్వాన్స్ ఇచ్చింది. తీసుకుంటున్నప్పుడు రవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "నాకేమీ సబ్జెక్టు తెలియదని నీకు తెలుసు. అయినా ఈ కేసులో, అందులోనూ హత్య కేసులో నియమించుకున్నావు. నీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో మాటలు రావడం లేదు" ఉన్నాడు.

"ఈ విషవలయంలో చిక్కుకుపోక ముందు నాకూ ఏమీ తెలియదు రవీ. అనుభవాలే పాఠాలు నేర్పుతాయి. దాన్నే బ్రేక్–త్రూ అంటారు. చూద్దాం ఏమవుతుందో. బెస్ట్ ఆఫ్ లక్" అని ప్రోత్సాహించింది.

మరోవైపు ప్రాసిక్యూటర్ చాలా ధీమాగా ఉన్నాడు. అతడి పాతికేళ్ళ అనుభవంలో ఇంత సులభమైన కేసు ఎప్పుడూ రాలేదు. హత్య జరగటం 400 మంది ప్రత్యక్షంగా

చూశారు. అయిదుగురు సాక్ష్యులు హంతకుడిని పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. మారణాయుధం హంతకుడి దగ్గరే దొరికింది. ఇంతకన్నా సులభమైన కేసు ఏముంటుంది? జాక్సన్ చెప్పినట్టు 'ఓపెన్ అండ్ షట్ కేస్' .

ట్రయల్ మొదలైంది. చాలామందికి తెలియని ప్రొసీజర్ ఏమిటంటే, సినిమాల్లో చూపినట్టు హీరోని జడ్జి "నువ్వు చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా" అని అడగటం, హీరో సాక్ష్యుల్ని ఎడా పెడా ప్రశ్నించటం, చివర్లో సమాజం గురించి పేజీలకి పేజీలు డైలాగులు చెప్పడం... ఇవేమీ ఉండవు. 'నేరం చేశావా?' అని మొదట్లో ఒకే ఒక ప్రశ్న వేస్తారు. ముద్దాయి చెయ్యలేదంటే, చేశాడని ప్రభుత్వ ప్లీడరు నిరూపించాలి. చెయ్యలేదని డిఫెన్స్ లాయర్ ప్రూవ్ చేయాలి. అంతే. మొదటి ప్రశ్న తరువాత ఇక ముద్దాయిని మాట్లాడనివ్వరు. అతడు మౌనంగా ఉండాలి. వినాలి. నేరం నిరూపణ అయితే జైలుకి, కాకపోతే ఇంటికి.

సాక్షుల ప్రమాణాలు పూర్తయ్యాక ఎగ్జామినేషన్–ఇన్–చీఫ్ ప్రారంభం అయింది. ప్రాసిక్యూటర్ ముందు హనుమంతరావుని ప్రవేశపెట్టాడు. జరిగిందంతా పూసగుచ్చినట్టు చెపుతూ, "నేను ఉపన్యాసం ఇస్తున్నాను. ముందు వరుసలో నా కొడుకు కూర్చున్నాడు. ముద్దాయి వచ్చి అతన్ని కాల్చాడు".

ఆ తర్వాత డిఫెన్స్ లాయర్ హమంతరావుని క్రాస్ చేశాడు.

"అతడికీ, మీ కొడుకుకీ గతంలో ఏమైనా మనస్పర్థలు ఉన్నాయా?"

"ఉన్నాయి. నా కళ్ళ ఎదురుగానే నా కొడుకుని చంపుతానని సవాల్ విసిరాడు"

"ఎందుకు?"

సారమ్మ రేప్ సంగతి చెప్పటం ఇష్టం లేని హనుమంతరావు మాట్లాడలేదు.

"ఎందుకు? తెలుసా? తెలీదా?" రవి రెట్టించాడు.

"నాకు తెలియదు. మూడు రోజుల్లో నా కొడుకుని చంపుతానని పోలీస్ స్టేషన్ మెట్ల మీద అంటుండగా నేను స్వయంగా విన్నాను"

"మీ కొడుకు లాకప్పులో ఉన్నప్పుడు వాళ్ళిద్దరికీ ఏదైనా గొడవ జరిగి ఉండొచ్చుగా. ఎప్పటి నుంచో వాళ్ళిద్దరికీ శత్రుత్వం ఉన్నట్టు, మీ కొడుకుని మర్డర్ చేసే అంత పెద్ద గొడవ జరిగినట్టు మీరెలా చెప్పగలరు?"

"ఎప్పుడు జరిగినా, గొడవ గొడవేగా"

"నేను మీ అభిప్రాయం అడగలేదు. అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పండి చాలు. మీరు రాజకీయంగా ఈ స్థానానికి రావటానికి కొడుకు పాత్ర ఉన్నదా?"

"చాలా ఉంది"

"మీ కొడుకుని అడ్డు తొలగించుకుంటే రాజకీయంగా మిమ్మల్ని దెబ్బకొట్టవచ్చని ప్రత్యర్థులు భావించే ఛాన్స్ ఉందా?"

"అబ్జెక్షన్" లేచాడు ప్రాసిక్యూటర్. "ఈ ప్రశ్నలకూ అంజి హత్యకీ ఏ సంబంధమూ లేదు."

రవి తన ప్రశ్నని సమర్థించుకుంటూ, "గతంలో కూడా అంజి ఒక కేసులో అరెస్టయ్యాడు. 'ఆ విధంగా కూడా అతడికి చాలామంది శత్రువులు ఉండొచ్చు' అని చెప్పటం నా ఉద్దేశ్యం సర్" అన్నాడు. అభ్యంతరాన్ని త్రోసిపుచ్చాడు జడ్జీ. మరో రెండు ప్రశ్నలు వేసి సాక్షిని పంపించి వేశాడు రవి.

ఆ పై ఐదుగురు ప్రత్యక్ష సాక్షులనీ ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టింది. వరుసగా అందరూ బాలారిష్టే హంతకుడని వాంగ్మూలం ఇచ్చారు. తర్వాత రవి లేచి నిలబడ్డాడు. క్రాస్ ఎగ్జామినేషన్ మొదలైంది.

మొదటి సాక్షి పేరు శర్మ. కరెంట్ ఆఫీసులో పని చేస్తాడు. అందరూ అతన్ని విద్యుత్ శర్మ అంటారు. రాజకీయాల్లో హనుమంతరావు కుడి భుజం.

"మీది ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంటు కదూ" ప్రశ్నించాడు రావు. అవునన్నాడు విద్యుత్ శర్మ.

"ఆఫీసు పనికన్నా మీరు రాజకీయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారని విన్నాను. కరెక్టేనా?"

"అబద్ధం"

"ఆ రోజు మీకు ఆఫీసు ఉన్నది కదా. అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం కూడా పెట్టారు. మరి మీటింగ్ కి ఎలా వచ్చారు?

"ఆఫీసర్ అనుమతి తీసుకుని వెళ్లాను".

"అనుమతి పత్రం కోర్టుకి ఇచ్చారా?"

"ఓరల్ పర్మిషన్"

"మీరు పదింటికి ఆఫీసుకి వెళ్లారు. 10:05 కి సంతకం పెట్టారు. 11:00 కు మీటింగ్. గంటలో వంద కిలోమీటర్లు ఎలా ప్రయాణం చేశారు?"

విద్యుత్ శర్మ మాట్లాడలేదు. ఇది ఉద్యోగానికి ఎసరు పెట్టే వ్యవహారమని అర్థమైంది.

"దట్సాల్ యువరానర్" అన్నాడు రవి.

ఒకే విషయమై అయిదుగురు వేరు వేరు సాక్షుల్ని విచారించవలసి వచ్చినప్పుడు, ఒకరు చెప్పింది మరొకరు వినకుండా, మిగతా నలుగుర్నీ విడివిడిగా ఉంచుతారు.

"ముద్దాయి కాలుస్తున్నప్పుడు మీరు ఎంత దూరంలో ఉన్నారు?" రెండో సాక్షిని ప్రశ్నించాడు రవి.

"200 గజాలు" అన్నాడు.

"మీది షార్ట్ సైటా? లాంగ్ సైటా?"

"రెండూ"

"ఆ రోజు కళ్ళజోడు పెట్టుకున్నారా?"

"గుర్తులేదు"

తరువాత మూడో సాక్షిని కూడా అదే ప్రశ్న వేశాడు. అతడు కూడా అదే సమాధానం చెప్పాడు. రవి జడ్జీ వైపు తిరిగి "50 గజాల దూరం కన్నా ఎక్కువ ఉంటే ఎదుటి మనిషిని నూరు శాతం గుర్తుపట్టడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఉంది కాబట్టి ఈ ఇద్దరి సాక్ష్యాలూ చెల్లవు సర్" అన్నాడు.

"అబ్జెక్షన్" అన్నాడు ప్రాసిక్యూటర్. జడ్జి అతడి అభ్యంతరాన్ని వప్పుకున్నాడు.

ప్రాసిక్యూటర్ గర్వంగా రవి వైపూ, ప్రేక్షకుల వైపూ చూసి తన సీట్లో వెళ్ళి కూర్చున్నాడు.

రవి జడ్జీని ఉద్దేశించి, "మీ అనుమతితో రెండోసాక్షిని మళ్ళీ ఒకసారి విచారిస్తాను" అని కోరాడు. జడ్జి వప్పుకున్న తరువాత తిరిగి ఆ సాక్షి వచ్చి బోనులో నిలబడ్డాడు. "మీరు చూసినప్పుడు ముద్దాయికి గెడ్డం ఉందా?"

"ఉంది" అన్నాడు సాక్షి.

అదే ప్రశ్న మూడో సాక్షిని వేశాడు "మీరు చూసినప్పుడు ముద్దాయికి గెడ్డం ఉందా?".

"లేదు" అన్నాడు సాక్షి.

రవి మెజిస్ట్రేట్ వైపు చూసి నమ్రతగా "దట్సాల్ సర్" అన్నాడు.

ప్రాసిక్యూటర్ మొహం రక్తంలేనట్టు తెల్లబడింది. పక్కనున్న జాక్సన్‌తో "బ్రీఫింగ్ ఇవ్వటం కూడా సరిగా చేతకాదు. ఏమి డిపార్ట్‌మెంటయ్యా మీది" అని విసుక్కున్నాడు. జాక్సను ఎదురుతిరిగి, '...సాక్ష్యులకు బ్రీఫింగ్ ఇవ్వాల్సింది నువ్వు. నేను కాదు. అయినా మర్డర్ జరిగినప్పుడు పక్కనే ఉన్నవాళ్ళకి బ్రీఫింగ్ ఏమిటి?' అందామనుకొన్నాడు కానీ, ప్రాసిక్యూటరుతో పోలీసులు గొడవ పెట్టుకోరు. అందుకని మౌనంగా ఉండిపోయాడు.

ఇంకో ఇద్దరు సాక్షులు మిగిలారు. నాలుగో సాక్షిని ప్రశ్నించటం ప్రారంభించాడు సౌజన్యారావు. "ముందు వరుసలో అంజి కూర్చొని ఉండగా, ముద్దాయి అతడిని కాల్చాడు. ఆ తర్వాత అతడు ఆయుధాన్ని పోలీస్ ఆఫీసర్ జాక్సన్‌కి ఇచ్చాడు. మీరు అయిదుగురూ కలిసి ముద్దాయిని బంధించారు. అదేగా జరిగింది".

"అబ్జెక్షన్ యువరానర్. ప్రశ్నించడం మానేసి, డిఫెన్స్ లాయర్ సాక్షిని గైడ్ చేస్తున్నాడు."

ఈ సారి అభ్యంతరాన్ని తోసిపుచ్చాడు జడ్జి.

"అవును అలాగే జరిగింది" అన్నాడు సాక్షి.

"అప్పుడు స్టేజ్ మీద ఎవరు మాట్లాడుతున్నారు?"

"హనుమంతరావు"

"ఆ సమయానికి మీరు ఆయన ఉపన్యాసం వింటున్నారా? ముద్దాయిని చూస్తున్నారా?"

"అబ్జెక్షన్" అంటూ లేచాడు ప్రాసిక్యూటర్

"ఓవర్ రూల్డ్" అన్నాడు జడ్జి.

"ఉపన్యాసం వింటున్నాను" చెప్పాడు సాక్షి.

"మరి ముద్దాయే హతుడిని కాల్చాడని మీరు ఎలా చెప్పగలరు?"

ప్రాసిక్యూటర్ లేచి, "చెవులు వేరు. కళ్ళు వేరు. ఉపన్యాసం వింటున్నవాడు, పిస్టల్ శబ్దం విని అటు చూసి ఉండవచ్చు. డిఫెన్స్ లాయర్ ఏం చెప్పాలనుకున్నారో అర్థం కావట్లేదు."

"నేను సరీగ్గా అదే చెప్పాలనుకుంటున్నాను సర్. కాల్చిన తర్వాత ఆ శబ్దం విని, సాక్షి ముద్దాయిని చూశాడు. కాలుస్తూ ఉండగా చూడలేదు"

"రెండిటికీ తేడా ఏమిటి?" అడిగాడు జడ్జి

"చెప్తాను. మీరు అనుమతి ఇస్తే ఈ ఇద్దరు సాక్షుల్నీ చివరిలో తిరిగి ప్రశ్నిస్తాను" అని పర్మిషన్ తీసుకుని, ఆ పై జాక్సన్‌ని బోను ఎక్కించాడు.

"ముద్దాయి అంజిని కాల్చింది పిస్టల్ తోనా? రివాల్వర్‌తోనా?"

ఇంత చిన్న విషయం తెలియదా అన్నట్టు జాక్సన్ నవ్వి, "రివాల్వర్‌తో. తన సర్వీస్ రివాల్వర్‌తో" అన్నాడు.

"రివాల్వర్ పేల్చాక దాన్ని ఇవ్వటానికి అతను మీ దగ్గరికి వచ్చాడా? మీరే వెళ్లి అతడి నుంచి లాక్కున్నారా?"

"తమ నాయకుడి కొడుకు హత్య జరిగిందన్న విషయం అర్థమయ్యేసరికి జనం ముద్దాయి మీద పడ్డారు. రివాల్వర్తో వాళ్ళని బెదిరిస్తూ అతడు నా దగ్గరికి వచ్చాడు. సంకెళ్ళు వేసి అతడిని వ్యాన్ ఎక్కించాను" అన్నాడు జాక్సను.

"మీరు సంకెళ్ళు వేసి వ్యాను ఎక్కించానంటున్నారు. తామందరం కలిసి ముద్దాయిని బంధించాము అని సాక్ష్యులు అంటున్నారు. ఏది కరెక్టు?"

"ముద్దాయి నాకు రివాల్వర్ అందించగానే జనం అతడి మీద పడ్డారు"

"రివాల్వర్‌కి పిస్టల్‌కి తేడా ఏమిటి?"

ఇంత చిన్న విషయం తెలియని నువ్వు క్రిమినల్ లాయరువి ఎలా అయ్యావన్నట్టుగా చూసి, "రివాల్వర్ అంటే ఒకేసారి వరుసగా బుల్లెట్స్ పేల్చవచ్చు. పిస్టల్ అంటే ఒకసారి పేల్చిన తర్వాత మళ్లీ మ్యాగ్ వెనక్కి లాగాలి".

"దానికి ఎంతసేపు పడుతుంది?"

"కనీసం అయిదు సెకన్లు పడుతుంది"

"ముద్దాయి అంజిని ఆగి ఆగి కాల్చాడా? వరుసగా కాల్చాడా? ఎన్నిసార్లు?"

"వరుసగా మూడు సార్లు కాల్చాడు."

"థ్యాంక్స్. మీరు వెళ్ళవచ్చు" అన్నాడు రవి. తరువాత పోస్ట్-మార్టమ్ చేసిన డాక్టరుని ప్రశ్నించాడు. "హంతకుడు దగ్గర నుంచి కాల్చాడా? దూరం నించి కాల్చాడా? చెప్పడం వీలవుతుందా డాక్టర్?"

"మరీ దగ్గరనుంచి గానీ, లేదా దూరంనుంచి గానీ అయితే చెప్పవచ్చు. లేకపోతే కష్టం"

"రివాల్వర్ కీ పిస్టల్ కీ బుల్లెట్ లో తేడా ఉంటుందా?"

"అది నా సబ్జెక్ట్ కాదు. అయినా రివాల్వర్లోనే చాలా రకాలు ఉంటాయి. .38, .32, ౦.5... అలాగే పిస్టల్ బులెట్స్ కూడా".

"హతుడి శరీరంలో ఉన్నవి పిస్టల్ బుల్లెట్సా? రివాల్వర్ బుల్లెట్సా?"

"నాకు ఆ టెక్నికాలిటీస్ తెలీదు"

"మరి అవి ఎవరికి తెలుస్తాయి?"

"పోలీసువారికి"

దూరం నుంచి ఏదో వాసన వస్తున్నట్టు అనిపించింది జాక్సనుకి.

"థ్యాంక్స్ డాక్టర్" అని అతడిని పంపించేసి, ఆ తర్వాత పపట్ లాల్ అనే వ్యక్తిని డిఫెన్స్ సాక్షిగా ప్రవేశపెట్టాడు రవి.

"హత్య జరిగినప్పుడు మీరు అక్కడ ఎందుకున్నారు?"

"దాని పక్క స్థలం మాది. అక్కడ పార్టీ చేసుకుంటున్నాము. నేను నే... నేచర్.."

"నేచర్ కాల్..."

"ఆఁ. నేచర్ కాల్ కోసం దూరంగా వచ్చాను. మా స్థలానికీ, అవతలి స్థలానికీ మధ్య సరుగుడు చెట్లు ఉన్నాయి. ఆ చెట్ల అవతల వైపు గ్రౌండ్లో రాజకీయ ఉప్... ఉప్"

"ఉపన్యాసం"

"ఆఁ...ఉపన్యాసం జరుగుతోంది. అంతలో పిస్టల్ సౌండ్లు వినబడ్డాయి. చెట్ల మధ్య నుంచి పిస్తోలు కాల్చిన వ్యక్తి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. నేను కుతూహలంగా చూశాను. కొంతమంది వ్యక్తులు..." అంటూ ముద్దాయి బాలారిష్టని చూపించాడు. "ఈ ఇనస్పెక్టర్ మీదకు రాబోతున్నారు. మరో ఇనస్పెక్టర్ అతని చేతికి సంకెళ్ళు వేశాడు" అక్కడక్కడ అందిస్తోంటే కంఠతా పట్టినట్టు చెప్పాడు.

కోర్టు బంట్రోతుకి ఒక ప్యాకెట్ అందిస్తూ "సరుగుడు చెట్లకి తగిలిన రివాల్వర్ బుల్లెట్స్ ఇవి" 'రివాల్వర్' అన్న పదం నొక్కి పలుకుతూ అన్నాడు రవి.

ముందు సాక్ష్యం ఇచ్చిన నాలుగు-అయిదు సాక్ష్యుల్ని కోర్టు అనుమతితో మళ్ళీ పిలిపించాడు.

"ముద్దాయి వరుసగా టపటపా కాల్చాడా? మ్యాగ్ వెనక్కి లాగి మళ్ళీ పేల్చాడా?"

అంత కరెక్టుగా చూడలేదన్నారు వాళ్ళు.

"చప్పుళ్ళు ఆగి ఆగి వినిపించాయా? వరుసగానా?"

"ముందు ఆగి ఆగి, ఆ తరువాత వరుసగా..."

"మొత్తం ఎన్నిసార్లు?"

"ఆరు సార్లు"

కోర్టులో ఒక్కసారిగా కలకలం రేగింది. సౌజన్యారావు ప్రాసిక్యూటర్ వైపు తిరిగి "మీరేమన్నా ప్రశ్నిస్తారా?" అని అడిగాడు. కేసు ఎటు వెళుతుందో ప్రాసిక్యూటర్‌కి అర్థం కాలేదు. అడగనన్నట్టు తల అడ్డంగా ఊపాడు

ప్రాసిక్యూటర్ తన వాదన చెప్పటం ముగిసాక, రవి తన ముగింపు వాదన వినిపించాడు: "అయిదుగురిలో విద్యుత్ శర్మ అనే మొదటి సాక్షి అసలు హత్యాస్థలంలో లేరు. మరో ఇద్దరికి దృష్టి లోపం. చివరి ఇద్దరి సాక్ష్యాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. కాల్చటం వారు చూడలేదు. కేవలం ముద్దాయిని బంధించారంతే. వ్యక్తిగతంగా, రాజకీయంగా అంజికి చాలామంది శత్రువులున్నారు. ముందు వరుసలో కూర్చున్న అతడిని, సరుగుడు చెట్ల మధ్య నుంచి హంతకుడు పిస్టల్ తో మూడుసార్లు కాల్చాడు. నోట్ ది పాయింట్ సర్..! హంతకుడు కాల్చింది రివాల్వర్ కాదు. పిస్టల్ తో. చెట్ల వెనుక నుంచి ఎవరో అంజిని కాల్చటం చూసిన బాలారిష్ట తన రివాల్వర్‌తో అటువైపు షూట్ చేశాడు. అందుకే మొదటి మూడూ అట్నుంచి ఆగి ఆగి, తరువాతి మూడూ ఇట్నుంచి వెంట వెంటనే, మొత్తం ఆరు చప్పుళ్ళు వినిపించాయి. బాలారిష్ట రివాల్వర్ తాలూకు బుల్లెట్స్ సరుగుడు చెట్ల మధ్యలో దొరికాయి. అవి పోలీసు బుల్లెట్స్ అని రికార్డు ద్వారా పరిశీలించుకోవచ్చు. బాలారిష్టే అంజిని చంపాడనుకుని హన్మంతరావు అనుచరులు అతడిపై దాడి చేశారు. అసలు హంతకుడు ఈ లోపులో సరుగుడు చెట్ల వెనుక నుంచి పారిపోయాడు. అంజి శరీరంలో ఉన్నవి రివాల్వర్ బుల్లెట్స్ కాదు. పిస్టల్ బులెట్స్. ముద్దాయే గానీ పిస్టలు పేల్చి ఉంటే ఒకసారి పేల్చి మ్యాగ్ వెనక్కి లాగి మళ్ళీ కాల్చాలి. దానికి పదిహేను సెకన్లు పడుతుంది. ముద్దాయి అంతసేపు కాలుస్తోంటే పోలీసులూ, జనమూ చూస్తూ ఉన్నారా? మర్డరు జరిగింది పోలీసు రివాల్వరుతో కాదు. సరుగుడు చెట్ల మధ్య నుంచి పిస్టల్ తో..! పిస్టల్ చప్పుడుకీ రివాల్వర్ ధ్వనికీ తేడా తెలియని పోలీసాఫీసరు, బాలారిష్ట చేతిలోంచి రివాల్వర్ లాక్కుని అతడి పై కేసు బుక్ చేశాడు".

కోర్టులో సూది పడితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది.

ఆ తరువాత జడ్జిమెంట్ వచ్చింది. బాలారిష్టని విడుదల చేస్తూ, నిర్లక్ష్యంగా ఇన్వెస్టిగేట్ చేసినందుకు జాక్సన్ మీద చర్య తీసుకోవలసిందిగా డిపార్ట్‌మెంటుకి సూచనలిస్తూ జడ్జి తీర్పు ఇచ్చాడు.

* * *

"జాక్సన్ సస్పెండ్ అయ్యాడట" అన్నాడు ముఖ్యమంత్రి.

"అందులో విశేషమేముంది? అయినా వాడేమి ఇన్స్పెక్టర్? బాడీలో బుల్లెట్స్‌కీ, పేల్చిన బుల్లెట్స్‌కీ తేడా తెలియదా? పోస్టుమార్టం రిపోర్టు చదవలేదా? కళ్ళు మూసుకొని ఎలా కేసు బుక్ చేశాడు?" పెనం మీద ఆవగింజలా ఎగిరిపడ్డాడు మీసాల రాజా.

"తన కళ్ళముందే బాలారిష్ట పిస్టల్ పేల్చటం, ఆయుధం సరెండర్ చెయ్యటం, కన్ఫెషన్ స్టేట్మెంట్ ఇవ్వటం, మరోపక్క అంతమంది సాక్ష్యులూ... ఇక ఇనస్పెక్టర్‌కి అనుమానం ఎందుకొస్తుంది?" అన్నాడు హనుమంతరావు.

ఆ ముగ్గురి మధ్యా సంభాషణ మౌనంగా వింటున్నాడు చాణుక్య.

"చంపింది తను కాదన్న విషయం అరెస్ట్ చేసినప్పుడే చెప్తే పోలీసులు అసలు హంతకుడి కోసం వెతికేవారు కదా..! అసలేం జరిగిందో చెప్పకుండా ఎందుకంత కాలం లాకప్పులో ఉన్నాడు?"



"తనే హంతకుడు కాబట్టి" అప్పటివరకూ మౌనంగా ఉన్న చాణుక్య అన్నాడు.

బాంబు పేలినట్టు ముగ్గురూ ఉలిక్కిపడ్డారు.

"ముందే చెప్తే ఇనస్పెక్టరు మరింత లోతుగా ఇన్వెస్టిగేట్ చేస్తాడు. ఒకసారి కేసు కోర్టులో కొట్టేశాక ముద్దాయి మీద మళ్ళీ ఛార్జెస్ ఫ్రేం చెయ్యటానికి ఉండదు. అందుకే అంతకాలం ఆగాడు."

నమ్మలేని నిజాన్ని వింటున్నట్టూ అతడి వైపు చూశారు.

ఏమి జరిగి ఉంటుందో చాణుక్య చెప్పాడు. "మీటింగు ప్రారంభానికి ముందే వెళ్లి బాలారిష్ట తన సర్వీస్ రివాల్వరుతో మూడుసార్లు చెట్ల మధ్య పేల్చాడు. ఆ తరువాత అందరి ముందూ పిస్టల్ తో అంజిని కాల్చాడు. జనం అతడి మీద పడినప్పుడు జరిగిన గొడవలో పిస్టల్ దాచేసి, లోపల్నుంచి రివాల్వర్ తీసి జాక్సనుకి అందించాడు. రెడ్-హాండెడ్ గా దొంగ దొరికాడన్న సంబరంలో మన గౌరవనీయులైన ఇనస్పెక్టరుగారు మరేమీ ఆలోచించకుండా కేసు బుక్ చేశాడు".

"కానీ మా వాళ్లకి కూడా బులెట్ శబ్దాలు ఆరు సార్లు వినపడ్డాయి"

"వాళ్ళు మీ వాళ్ళు కాదు. అతని మనుష్యులు".

శ్రోతలు ముగ్గురూ స్థాణువులై వింటూ ఉండగా కొనసాగించాడు. "విద్యుత్ శర్మ తప్ప అందరూ వాడి మనుష్యులే. అందుకే ఒకడు ముద్దాయి గెడ్డం చూశాడు. ఇంకొకడికి అది కనపడలేదు. ఒకడు మూడుసార్లు, మరొకడు ఆరుసార్లూ పిస్టల్ శబ్దం విన్నారు. నలుగురూ ముద్దాయి మీద పడి పట్టుకునేసరికి, వాళ్ళు మీ కార్యకర్తలే అనుకున్నారు. పంచనామా చేసేటప్పుడూ, ఎఫ్.ఐ.ఆర్ వ్రాసేటప్పుడూ వాళ్ళే ముందుకొచ్చి సాక్ష్యం ఇచ్చారు. ఆ పపట్ లాల్ గురించి కూడా ఎంక్వయిరీ చేశాను. వాడు కూడా దొంగ సాక్షే. వాడసలు మన రాష్ట్రం మనిషి కాదు".

"దొంగ సాక్షుల్ని అంతలా మానేజ్ చేశాడా?"

"నువ్వు కారు ఆక్సిడెంట్ చేసినప్పుడు మనం మానేజ్ చెయ్యలా. అలాగే".

చాలా సేపు నిశ్శబ్దం.

"అసలు ఆ బాలారిష్ట అంజిని ఎందుకు చంపాడు?" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగాడు సి.ఎం.

"అతడి పెళ్ళాన్ని వాడు రేప్ చేశాడు కాబట్టి" అన్నాడు చాణుక్య.

ముఖ్యమంత్రి మీసాల్రాజా వైపు 'నిజమా' అన్నట్టు చూశాడు. అతడు తలదించుకున్నాడు. జరిగినదంతా చాణుక్య చెప్పాడు. వింటూంటే సి.ఎం మొహం జేగురు రంగుకి మారింది. కోపంతో ఊగిపోతూ, "రేప్ జరిగినట్టు నాకెందుకు చెప్పలేదు?" అని ప్రశ్నించాడు. మీసాల్రాజా సమాధానం చెప్పలేదు.

"ఈ విషయం బయటకి వచ్చుంటే..." అని, ఆపై మరేమీ మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

కోపం వచ్చినప్పుడు భయంకరంగా తిట్టటం ఆంజనేయులికి అలవాటు. మొట్టమొదటిసారి అలా నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు. మీసాల్రాజాకి ఎందుకో భయం వేసింది.

# 39

**"అమ్మగారితో** కలిసి పెళ్ళికి వస్తున్నాను. తెలుసుగా. పెళ్లి కొడుకు మీసాల్రాజా అమ్మగారి వేలు విడిచిన తమ్ముడు" అన్నది సారమ్మ .

"వేలు విడిచిన మేనమావల్నీ, మేనత్తల్నీ చూశాను గానీ, తమ్ముడిని చూడటం ఇదే మొదటిసారి. సర్లే. పెళ్ళికి నేను కూడా వస్తున్నా" అన్నది రవళి.

"ఏమిటీ..?" విస్మయంతో సారమ్మ కంఠం కీచుమంది. "నువ్వూ వస్తావా?"

"నేను రాకపోతే పెళ్లి ఎలా ఆగుతుంది... సారీ... ఎలా సాగుతుంది. నేనూ వస్తున్నాను"

"ఇటు చీఫ్ మినిస్టరు. అటు హోమ్ మినిస్టరు. చాలా రష్ గా ఉంటుందేమో. ఎలా వస్తావ్?"

"ఆహ్వానపత్రిక తీసుకుని" నవ్వింది రవళి.

సారమ్మ కొద్దిగా తటపటాయించి, "నేను అమ్మగారితో కలిసి పెళ్లి మండపం మీదే ఉండి హెల్ప్ చెయ్యాలి. ప్రతి వరసకీ సీట్ల నెంబర్లు ఉంటాయట. పెద్దోళ్ళ పెళ్లి కదా. ముందు వరసలో గవర్నరూ... వెనుక మంత్రులూ- అలా అక్కడ ఏవో చాలా గ్రేడ్స్ ఉంటాయట. మామూలోళ్ళు చివర్లో వెనక కూర్చోవాలి. కలవటం కష్టమేమో" అన్నది మొహమాట పడుతున్నట్టు.

"నేనూ ముందే ఉంటాను"

"ఎలా?"

"వచ్చాక చూస్తావుగా. అన్నట్టు చెప్పటం మర్చిపోయాను. మనిద్దరం అక్కడ కలిసినా, ఒకరికి ఒకరం తెలియనట్టే ఉండాలి" అని ఫోన్ పెట్టేసింది.

పెళ్ళి ప్రాంగణమంతా చాలా హడావిడిగా ఉంది. అలాంటి వి.వి.ఐ.పి. పెళ్ళిళ్ళు చూడటం రవళికి అదే ప్రథమం. సారమ్మ చెప్పింది నిజమే. గేట్ దగ్గర చెక్ చేస్తున్నారు. ఎవరి స్టేటస్ని బట్టి వాళ్ళని ఆయా ప్రదేశాలకి పంపిస్తున్నారు. ముందు వరుస గవర్నరూ, ప్రతిపక్ష నాయకుడూ, మంత్రులూ... రెండో వరుసలో బంధువులు, ఆశ్రిత కోటరీ. ఆ వెనుక కార్యకర్తలు. ఇంకా వెనుక సాధారణ జనం, అలా ఎలాట్ చేశారు. దాదాపు అయిదు వేలమంది దాకా ఉంటారు. లోపలికి వెళ్ళటానికే చాలా కష్టపడవలసి వచ్చింది.

చేతిలో కార్డు ద్వారం దగ్గర చూపించింది. నిజానికి ఆమె దగ్గర రెండు కార్డులు ఉన్నాయి. అందులో ఒకటి మీసాల్రాజా ఇచ్చింది. నాలుగో వరుసలో సీటు. ఇంకోటి సత్య ఇచ్చింది. మొదటి వరుసలోది. అది చూసి ఇన్స్పెక్టరు మొహంలో విస్మయం కొట్టొచ్చినట్టు కనపడింది. "సార్ రాలేదా మేడమ్?" అని అడిగాడు.

"వస్తున్నారు" అంది.

స్వయంగా తీసుకెళ్ళి మొదటి వరుస సోఫాలో కూర్చోబెట్టాడు. చుట్టూ పరికించి చూసింది. తరచు టీ.వీ.ల్లో కనబడే మినిస్టర్లూ, ప్రభుత్వాధికారులూ, ప్రెస్సు, వంది మాగధులు... అంతా హడావుడిగా ఉంది.

పెళ్లి పీటలపై ఉన్న మీసాల్రాజా మొదటి వరుసలో ఉన్న ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు. తను నాలుగో వరుసలో సీట్ ఇస్తే ఆమె మినిస్టర్స్ 'రో' లో కూర్చుని ఉండటం చూసి, తెలియక అలా కూర్చుందేమో, పోలీసులు తీసుకెళ్ళి సీటు చూపిస్తారని సరి పెట్టుకున్నాడు.

మగపెళ్ళివారి తరపు సారమ్మ స్టేజి పక్క వింగ్లో ఉంది. రవళిని చూసి సన్నగా నవ్వింది. రవళి కళ్ళతోనే ఆ అమ్మాయిని పలకరించి, తల తిప్పి వెనక్కి చూసింది. రెండో వరుసలో సరిగ్గా తన వెనకే ఉన్నాడు చాణుక్య.

"నన్ను గుర్తుపట్టారా బాబాయ్?" అని అడిగింది.

అతడు గుర్తుపట్టలేదు కానీ, ముందు వరుసలో కూర్చున్నదంటే చాలా ఉన్నతస్థాయిలో ఉన్నదైనా కావాలి, లేదా ఏ ప్రముఖుడి భార్యో, కూతురో అయి ఉండాలి అనుకున్నాడు. ఎవరని అడగటానికి లేదు. ఇబ్బందిగా చూస్తూ, "ఎక్కడో చూశానమ్మా మిమ్మల్ని" అన్నాడు.

"అదేమిటి బాబాయ్! నన్ను గుర్తుపట్టలేదా? ఆదిత్యపురం. మా ఇంటికి వచ్చారు మీరు"

చాణుక్య షాక్ తగిలినట్టు చూశాడు. అతనేదో అనబోతూ ఉంటే, "మీరు వెళ్ళిన తరువాత మా ఊళ్ళో పెద్ద గొడవ జరిగింది బాబాయ్. మీరు పెళ్లి సంబంధం కోసం వచ్చారు చూడండి. ఎల్లమంద అని. ఆ అబ్బాయిని ఎవరో చంపేశారు. శవం మా ఇంటి వెనుక దొరకటంతో కేసు మా మీదకి వచ్చింది. పోలీసులు మా ఇంటికి కూడా వచ్చారు. ఏవో పల్లెలో ముఠా గొడవలు అనుకుంటా. తరువాత కేసు తీసేశారు అనుకోండి"

చాణుక్య మొహంలో అలజడి మాయమైంది. రిలాక్సింగ్గా ఊపిరి పీల్చుకుని, "ఎల్లమందా... చంపేశారా... పాపం మంచి కుర్రాడు. నాన్నగారు బావున్నారా?" అన్నాడు.

కూతురు ఆయనకి ఏమీ చెప్పలేదని రవళికి అర్థమయింది. సుమద్యుతి మీద గౌరవం పెరిగింది. మనసులోనే కృతజ్ఞతలు అర్పించుకుంది.

"ఆస్పత్రిలో ఉన్నారండీ. ఆక్సిడెంటు అయ్యింది. ఏదో సామెత చెప్పినట్టు అన్ని కష్టాలూ మాకే వచ్చినట్టు ఉన్నాయి. "

"అయ్యో పాపం"

"సానుభూతి వద్దండీ. మా తండ్రిగారికి సానుభూతి అసలు ఇష్టం ఉండదు. అన్ని కష్టాల్లో కూడా, 'ఎప్పుడో ఏదో పాపం చేసి ఉంటామమ్మా. దానికి ఇప్పుడు అనుభవిస్తున్నాం' అంటారాయన. ఆ ఎల్లమందని చంపిన పాపిష్టోళ్ళు కూడా ఊరికేపోరండి. ధనం కోసం, అధికారం కోసం ఇతరుల్ని బాధపెట్టినవాడు రౌరవ నరకానికి పోతాడట. అది ఎలా ఉంటుందో తెలుసా బాబాయ్? మా నాన్నగారు ఎప్పుడూ చెపుతూ ఉంటారు. మొదటగా పాపి శరీరాన్ని 'రురు' అన్న ముళ్ళపంది చీలుస్తుందట. అలా చీలిన శరీరంతో కేకలు పెడుతున్నవాడిని భగభగ మండే నిప్పు కణికలపై, వెయ్యి యోజనాల దూరం పరుగు పెట్టిస్తారట. అన్నట్టు టార్జాన్ కనపడటం లేదేం బాబాయ్. ఆ రోజు మా ఇంటికి వచ్చాడు కదూ. అవునూ ఏం చెపుతున్నాను? నరకాల గురించి కదూ. సత్పురుషులకు ద్రోహం తలపెట్టిన వాడిని అసిపత్రవనంలోకి, ఆ పై కాలసూత్ర నరకంలోకి తోస్తారుట. అక్కడ సర్వాంగాలూ కోసి, పైన కారం చల్లుతూ, గానుగలో చెరకుగడ పెట్టి తిప్పినట్టు తిప్పుతూ ఉంటారుట. ఛా..! గుడ్డొచ్చి పిల్లకి చెప్పినట్టు ఇదంతా మీకు చెపుతున్నానేమిటి?"

చాణుక్య ఏదో అనబోతూ ఉండగా ఆడిటోరియంలో కలకలం రేగింది. విజిల్సూ, చప్పట్లూ వినిపించాయి. ఎవరన్నా సూపర్ స్టార్ వస్తున్నాడేమో అనుకుంది.

వందిమాగధులు వెనుక రాగా ప్రతిపక్షనాయకుడు సత్యదేవ్ ని తోడ్కొని ముఖ్యమంత్రి వస్తున్నాడు. లోపల ఎన్ని గొడవలున్నా పైకి స్నేహపూరిత మందహాసం రాజకీయ లక్షణం కదా.

ప్రతిపక్ష నాయకుడు వస్తూంటే కరతాళ ధ్వనులు ఆశ్చర్యమే. వచ్చిన అతిథులందరూ ముఖ్యమంత్రి ఆహ్వానితులు. అయినా ప్రతిపక్ష నాయకుడికి చప్పట్లు కొట్టటం అరుదైన విషయం. చిన్నవయసులోనే అంత పాపులారిటి వచ్చిందంటే, అది అతడి నిజాయితీకి ప్రజలిచ్చే అభివాదాభినందనం. అందులో ఎందరు ఓట్లు వేస్తారన్నది వేరే విషయం. ప్రజలు బ్రతకాలనుకునే విధానం వేరు. బ్రతికే విధానం వేరు కదా.

సత్యదేవ్ వచ్చి అదే సోఫాలో ఆమె పక్కన కూర్చున్నాడు.

ఉప్పెన లాంటి ఉపద్రవం వచ్చినా చాణుక్య తొణకడు. అటువంటిది అతడా దృశ్యం చూసి, స్థాణువయ్యాడు. ఏదో తెలియని అలజడితో మనసు కీడు శంకించింది.

ఈ లోపులో ఇంకెవరో నటుడు వచ్చేసరికి ఆంజనేయులు అటు వెళ్ళాడు. పెళ్ళికి ఎందరు గొప్పవాళ్ళు వచ్చారో చూపించుకోవటమే కదా పటాటోప ఆహ్వానపు ఉద్దేశ్యం.

"ఎలా ఉన్నావ్?" ఆమె వైపు వంగి చిన్నగొంతుతో అడిగాడు. రవళి నవ్వింది. చాణుక్య వారి మాటలు వినటానికి ప్రయత్నించాడు గానీ నటుడిని చూస్తోన్న జనం హడావుడి, కేరింతల మధ్య వినపడలేదు.

"గేటు దగ్గర గార్డ్స్ కార్డు చూసి కన్ఫ్యూజ్ అయ్యారా?"

"అయ్యారేమో తెలీదు. బయటపడలేదు. తీసుకొచ్చి నీ ఎలాటెడ్ సోఫాలో కూర్చోబెట్టారు. బహుశా ఏ చెల్లో అనుకుని ఉంటారు"

"మిసెస్ అనుకోవచ్చుగా"

"మెళ్ళో మంగళసూత్రం లేదుగా"

"పైట నిండుగా కప్పుకున్నావ్‌గా"

"ఇక ఈ టాపిక్ ఆపుదామా? ఇప్పటికే అందరూ..." అంటూ ఉండగా, "వాళ్ళ మొహం. అనుకోనీ. ఎన్ని సంవత్సరాలైంది నిన్ను చూసి..! ఆ రోజు గానీ నువ్వు ఓకే చేసి ఉంటే, అధికారికంగా ఈ రోజు ఇక్కడే ఉండేదానివి తెలుసా?" అన్నాడు.

"మా నాన్నగారికి ఆపరేషన్ చేసే డాక్టరు స్వీడన్ నుంచి ఎప్పుడు వస్తున్నారు?"

సత్యదేవ్ గాఢంగా నిశ్వసించి, "అర్థమైందిలే" అన్నాడు.

నవ్వాపుకుని "ఏమి అర్థమైంది?" అంది.

"నీ అంత కాకపోయినా నాకూ కాస్త తెలివితేటలు ఉన్నాయి తల్లీ. నీ అంత ఉంటే ఈ రాజకీయాల్లోకి ఎందుకొస్తాను? 'పాలిటిక్స్ ఈజ్ ద లాస్ట్ రిసార్ట్ ఆఫ్ డంబ్ అండ్ డల్' అన్నాడు మహాత్మా గాంధి".

"ఆ మాట అన్నది గాంధి కాదు. బెర్నార్డ్ షా"

"పొలిటీషియన్ని కదా. మనోళ్ళ పేరు చెప్తే దేశభక్తి బయటపడుతుందని అలా చెప్పాన్లే. అదిగో. హోం మినిస్టరు వస్తున్నారు. తరువాత మాట్లాడతా" అని సోఫాలోంచి లేవబోతూ ఉంటే ఆమె "సత్యా. ఒక్క నిముషం" అంది. అతడు ఆగి చూశాడు.

"కాలేజి వదిలిన చాలా సంవత్సరాలకి ఇదేగా మనం కలుసుకోవటం. పాత చనువుతో ఫోన్ చేశాను. అడిగిన ప్రతి పనీ చేసిపెట్టావ్. 'పని పడింది కాబట్టి ఫోన్ చేశా' అనుకోకు ప్లీజ్. ఉద్యోగం చాలా అవసరమై చక్రధరరావుగారి దగ్గర రికమెండేషన్ చెయ్యవలసి వచ్చింది. బాలారిష్ట ట్రాన్స్ఫర్ విషయంలో కూడా సాయం చేశావ్. ఇక నిన్ను ఇబ్బంది పెట్టను. అన్నీ నేను చూసుకోగలనని నమ్మకం వస్తోంది.".

"అదొక సాయమా? మీ నాన్నగారిని పోలీసు స్టేషనుకి తీసుకెళ్లినప్పుడే ఫోన్ చెయ్యాల్సింది. ఇంత వరకూ వచ్చేది కాదు"

"నీ పెర్సనల్ ఫోన్ నెంబరు లేదు. వెతికి చేసేసరికి 'కేరళలో ఉన్నా' నని చెప్పావు. ఈ లోపులో లైన్ కట్ అయ్యింది. అప్పటికే నాన్నని పోలీసులు తీసుకెళ్ళారు"

"పోలీసులంటే గుర్తొచ్చింది. ఆ జాక్సన్ సస్పెండ్ అయ్యాడటగా. ఏదైనా చర్య తీసుకోమని కోర్టు ఆర్డరు ఇవ్వగానే కమీషనరు మాట్లాడాను. అద్సరే గానీ నీ భవిష్యత్తు ప్రణాళికలేమిటి?"

"నాకు ఒకటే కోరిక సత్యా. నాన్న 'కోమా'నించి బయట పడే సమయానికి ఆయన మీద కేసు క్లోజ్ అవ్వాలి. స్పృహ రాగానే ఆ విషయం ఆయనకి చెప్పాలి. అదే నా గమ్యం".

"...సర్లే సర్లే. ఎప్పుడు అవసరమైనా ఫోన్ చెయ్యి. అర్ధరాత్రి అయినా సరే..." అని నవ్వి "మళ్ళీ ఇందులో ఏదైనా డబుల్ మీనింగ్ ఉన్నదేమో అని క్లాసు పీకకు. ఉంటాను బై" అనేసి సినిమా నటులు కూర్చున్న వైపుకి వెళ్ళాడు. 'నిజానికి ఆ స్టార్స్ కన్నా సత్యాయే బావున్నాడు' అనుకుంది.

"నీకు ఆయన తెలుసా?" అన్న చాణుక్య ప్రశ్నకు వెనక్కి తిరిగి, "అవును బాబాయ్. కాలేజీలో మా సీనియరు. మళ్ళీ ఇదే కలవటం" అన్నది.

'నీకు కార్డు ఆయనే పంపాడా?' అని అడుగుదామనుకుని మానేశాడు చాణుక్య.

ఈ లోపులో రాంబాబు దాదాపు పరిగెత్తుకుంటూ ఆమె దగ్గరకు వచ్చాడు. "మేడం. మీ చేతులు పట్టుకుంటాను. అయిదంటే అయిదు... ఒక్క ఐదు నిమిషాలు దేవ్‌గారితో ఇంటర్వ్యూ ఇప్పించాలి" బతిమాలుతున్నట్టు అడిగాడు.

"మీరు జర్నలిస్టు. ఆయన రాజకీయ నాయకుడు. మధ్యలో నేనేమిటి?" అంది.

"గ్రూప్ ఇంటర్వ్యూలు తప్ప ఆయన విడిగా ఇవ్వరు మేడం. ప్లీజ్. ప్లీజ్. ప్లీజ్."

"ఆయన నాకు అంతగా తెలీదు"

"మాడమ్. నేను జర్నలిస్టుని. అబద్ధం చెప్పొద్దు. బాలరిష్టని సొంతూరికి ట్రాన్స్‌ఫర్ చేయించిందీ, మీసాల్రాజాని పొద్దున్న పొద్దున్నే అరెస్ట్ చేయించిందీ ఆయనే. ఇప్పుడు నాకు పూర్తిగా అర్థం అయింది".

ఆమె అతడి వైపు ఇబ్బందిగా చూసింది.

"అయిదంటే అయిదే ప్రశ్నలు మాడమ్. ఎక్కువ టైం తీసుకోను. ఇక్కడే పూర్తి చేస్తాను"

తనకి చాలా సాయం చేసినవాడు. అడక్క అడక్క అడుగుతున్నాడు. కాదనలేక సత్యతో ఒక నిమిషం మాట్లాడి ఫోన్ ఆపు చేస్తూ, "సరే వెళ్ళు. ఇప్పుడే మాట్లాడతాడట" అంది.

ఆ ఇంటర్వ్యూనే ఈ కథకి ముగింపు పలికింది.

* * *

పెళ్లికొడుకు, పెళ్లికూతురు పీటల మీద కూర్చున్నారు. చాలా అపురూపమైన దృశ్యం అది. రాత్రంతా తాగినట్టు పెళ్లికొడుకు మొహం ఉబ్బి ఉంది. రోజంతా డ్రగ్ లేనందువల్ల పెళ్లి కూతురు మొహం పీక్కుపోయిఉంది. పెళ్లి పీటలపై ఇలాంటి జంట అపురూపమే కదా.

పెళ్లిని వదిలేసి మీడియావారు కెమెరాలు నటుల మీద పెట్టటంతో హోమ్ మినిస్టరు పి.య్యేని పిలిచి చిరాగ్గా, "రెండు మూడు రోజులకో పెళ్ళికి వెళ్ళటం, రెండు మూడు

పెళ్ళిళ్ళు చేసుకోవటం అక్కడున్న నటులకి కొత్త కాదు. మీడియావాళ్ళకి చెప్పు. వాళ్ళని వదిలేసి, నా మనవరాల్ని షూట్ చెయ్యమను" అని చెప్పాడు.

పి.య్యే. వెళ్లి ఛానెల్స్ వాళ్ళని బ్రతిమాలుతున్నాడు. పురోహితులు ముగ్గురూ మైక్‌లో క్షుద్రపూజ చేస్తున్న లెవెల్లో భయంకరంగా మంత్రాలు చదువుతూ ఉన్నారు. పెళ్లి ప్రారంభం కాకముందే కొంతమంది హాలు వెనుక వైపు వెళ్లి, పిల్లల నెపంతో ఫ్రీ ఐస్-క్రీం ఆబగా తింటున్నారు.

పెళ్లికూతుర్ని తల్లి లోపలికి తీసుకెళ్ళింది.

సారమ్మ మీసాల్రాజా వెనుక నిలబడి భుజం మీది కండువా సరీగ్గా సర్దుతోంది.

ఆ సమయంలో జరిగింది ఓ సంఘటన.

కర్ణుడిని నదిలో వదలటానికి వెళ్తున్న కుంతిని వర్ణిస్తూ ***"పదునైదేండ్ల ఈడు గల బాలిక... పోలిక రాచపిల్ల... జంకొదవెడు కాళ్ళ తోడ దిగుచున్నది"*** అంటారు జంధ్యాల శాస్త్రిగారు. కొద్ది మార్పులతో సరీగ్గా అక్కడ అలాగే జరిగింది. పోలిక రాచపిల్ల కాదు. సాధారణ స్త్రీ. జంకొదవెడి కాళ్ళతో రాలేదు. నెమ్మదిగా... కానీ ధీమాగా... వచ్చింది. ***"కన్నియలాగే వాలకము కన్పట్టుచున్నది... కాదు కాదు. ఆ చిన్నిగులాబి లేత అరచేతులలో పసిబిడ్డడు ఉన్నయట్లున్నది. అచ్చుగ్రుద్దినట్లున్నవి రూపురేఖలు. ఎవరో అనరాదు. అతడామె బిడ్డయే!"*** అంటాడు కవి. ఇక్కడ లోపలికి వస్తూన్న కన్నెపిల్ల(?) చేతిలోని బిడ్డ రూపురేఖలు అచ్చుగుద్దినట్టు ఆమెలా లేవు. తండ్రి పోలికలు ఉన్నాయేమో భవిష్యత్తు చెప్పాలి. ***"గాలితాకున జలతారు మేలిముసుగు జాఱె నొక్కింత - కుంతి భోజ పుత్రి స్నిగ్ధ సుకుమారి - ఆమె కుంతీ కుమారి".*** ప్రస్తుతం లోపలకి అడుగుపెట్టిన జవరాలి మోము పై ముసుగు (కావాలనే చెవుల పైకి బిగించి కట్టటం వలన) జారే ప్రసక్తి లేదు. అందువల్ల మొహం కనపడటం లేదు.

ఆ విధంగా ఆమె వచ్చి సన్నాయి వాయించే వారి పక్కగా పైకి నడిచి, వివాహ మండపం మెట్లెక్కి పెళ్లి కూతురు ఖాళీ చేసిన పీటల మీద మీసాల్రాజా ఎదురుగా కూర్చుంది.

ముందు చూసింది పురోహితుడు. అతడికి అర్థం కాలేదు. పెళ్ళికి ముందు తోడి పెళ్లికూతుర్ని అలా కూర్చోబెట్టటం ఆడపెళ్లివారి సాంప్రదాయమేమో అనుకున్నాడు.

తరువాత చూసింది మీసాల్రాజా. గత రాత్రి తాలూకు మందు ప్రభావమేమో అనుకున్నాడు.

ఆపై చూసింది పెళ్లి కూతురు సుగాత్రి. ఏదో సినిమాలోలా ఒకే మండపంలో ఇద్దరు హీరోయిన్ల జంట పెళ్లి అనుకుంది.

తొలిగా తేరుకున్నది పెళ్ళికూతురు తల్లి. కంగారుతో కూడిన కోపంతో "ఏమిటమ్మాయ్. ఎవర్నువ్వు? లేలే..." అంది.

ఆ మాటలు పట్టించుకోకుండా, పురోహితుడి ముందున్న మైకు తీసుకుని ఆ అమ్మాయి చెప్పటం మొదలు పెట్టింది.

“అందరికీ నమస్కారం. నాపేరు సరోజ. ఇలా వచ్చి పెళ్లి డిస్టర్బ్ చెయ్యటం తప్పే. కానీ నాకు ఇంకొక మార్గం లేదు. దయచేసి మీకున్న బలంతో, బలగంతో నన్ను ఇక్కడి నుంచి తోసెయ్యకండి. నాలుగు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోతాను.”

వేద రవళి తాపీగా సోఫా వెనక్కి జారబడి ఆ దృశ్యాన్ని చూస్తోంది.

ముందే బాగా రిహార్సల్స్ వేసుకుని వచ్చినట్టు, చెప్పదలచుకున్న విషయాన్ని ఆ అమ్మాయి స్పష్టంగా చెబుతోంది. “నా ఎదురుగా కూర్చున్న మీసాల్రాజా నాకు ఏడాది క్రితం నుంచీ పరిచయం. వీరికి ఊరి శివారుల్లో ఒక గెస్టు హవుస్ ఉంది. వారం రోజుల పాటూ నేను అక్కడే ఉన్నాను. తరువాత ఎవరో అంజి అనే కుర్రాడు వచ్చి, ‘ఇల్లు ఖాళీ చేస్తున్నాము. వెళ్ళిపో’ అని చెప్పాడు. పెళ్లి చేసుకుంటానని తీసుకొచ్చినవాడు పొమ్మంటే ఎక్కడికి పోవాలో అర్థం కాలేదు. మనిషి పేరు మీసాల్రాజా అని తెలుసు. మిగతా వివరాలన్నీ అబద్ధాలు చెప్పాడు. అతను ఎవరో తెలుసుకోవటానికే నెల పట్టింది. తెలిసాక తనని కలుసుకున్నాను. ఇప్పుడు చూస్తున్నట్టే అప్పుడూ ఏమీ ఎరగనట్టు చూసి, ‘ఎవరూ?’ అన్నాడు. నా పేరు చెప్పాను. ‘చెప్పు చెల్లీ’ అన్నాడు. పోలీసు స్టేషనుకి వెళ్లాను. ముందు ‘మూడు వేలు ఇవ్వు. కేసు పెడతాం’ అన్నారు. ముఖ్యమంత్రి బావమరిది అని తెలిసాక సాక్ష్యాలు లేవని బయటకు గెంటేశారు. వీడు కడుపులో పడ్డాడు. ఆర్నెల్లు ఆగాను. ఈ లోపులో మీసాల్రాజా డి.ఎన్.ఏ. సంపాదించాను. రెండు డి.ఎన్.ఏలూ ఒకటే. బాబు మీసాల్రాజా కొడుకే అన్న ఈ రిపోర్టు చూడండి. నేను డబ్బున్న దాన్ని కాదు. ఇక ఓపిక లేదు కూడా. మీరు కాదంటే బిడ్డతో సహా బావిలో దూకుతాను. మీరంతా పెద్దవాళ్ళు. ఏమి చెయ్యాలో ఆలోచించండి” అని ఆపింది.

లైవ్ కవరేజ్ వ్యాన్ లేనందుకు బాధ పడ్డారు కొందరు. మారేజ్ బ్రేక్ విషయమై హడావుడిగా బ్రేకింగ్ న్యూసు పంపుతున్నారు కొందరు. ***‘పెళ్లి పీటలమీద భోగిమంటలు’*** టైటిల్ ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాడు రాంబాబు.

బ్రహ్మానందం ఆంజనేయులి వైపు తిరిగి కోపమూ, విసుగూ మిళితమైన స్వరంతో “ఏమిటయ్యా ఇది? అల్లుడు నీచుడనుకున్నాను. మరీ ఇంతనా” అన్నాడు.

జరుగుతున్నది కొద్దికొద్దిగా మీసాల్రాజాకి అర్థమవుతున్నది కానీ ఇంకా ‘ఆ అమ్మాయిని ఎక్కడ చూశానబ్బా?’ అన్న అయోమయంలోనే ఉన్నాడు. ‘…ఏడాది క్రితం అంటున్నది. గెస్ట్ హవుస్ లో వారం ఉన్నానంటున్నది. తెలిసిన మొహం లాగానే ఉంది కానీ, ఒక స్త్రీతో వారం రోజులు ఒకే చోట గడపటం ఇంటా-వంటా, హోటల్లో-కిచెన్లో ఎక్కడా లేదే. ఎలా మర్చిపోయానబ్బా? రాత్రి తాగిన బ్రాండ్ ఏమిటి…’ అని ఆలోచిస్తున్నాడు.

ఈ లోపులో ఆ అమ్మాయి వేదిక దిగి క్రిందికి వచ్చి, ముందు వరుస కుర్చీలో కూర్చున్న గవర్నరు కాళ్ళ ముందు బిడ్డని పెట్టి, నేల మీద కూర్చుంది. “ఇవిగో సార్.

కడుపులో బిడ్డకి అతనే తండ్రి అన్న రిపోర్టులు ఇవే. కావాలంటే వాళ్ళని మళ్ళీ చెక్ చేయించుకోమనండి. పెద్దవారు. నాకు న్యాయం చెయ్యవలసింది మీరే" అన్నది.

'టు బి – ఆర్ నాట్ టు బి' అన్న లెవెల్లో పెద్దాయన కంగారు పడ్డాడు. స్వంతంగా నిర్ణయాలు తీసుకునే అలవాటు గవర్నరు అవగానే పోయింది కదా. ఇదేమైనా అసెంబ్లీ రద్దా? దానిక్కూడా డిల్లీ నుంచే సూచనలు వస్తాయి కదా.

'ఏమి చెయ్యాలి' అన్నట్టు ముఖ్యమంత్రి వైపు చూశాడు.

ముఖ్యమంత్రి చాణుక్య వైపు చూశాడు.

చాణుక్య తన సీట్లోంచి లేచి ముందు వరుసలోకి వచ్చి "రామ్మా. మనం పక్కకు వెళ్లి మాట్లాడుకుందాం" అన్నాడు.

గవర్నరు వైపు బేలగా చూసింది.

ఫ్లోర్–టెస్టులో అధికార పార్టీ నెగ్గినంత రిలీఫ్ తో, "వెళ్ళమ్మా" అన్నాడాయన.

వివాహవేదిక మెట్లు ఎక్కి, పక్క వింగులో ఉన్న వరుడి గది వైపు వెళ్లారు ఇద్దరూ.

బయట పానీ–పూరీలు, ఐస్–క్రీములు తింటున్నవారికి లోపల జరుగుతున్నది ఇంకా తెలిసినట్టు లేదు.

***'రాజీ చేసిన చాణుక్య నీతి'*** అన్న హెడ్డింగ్ క్రింద వాళ్ళిద్దరి సంభాషణా చూపిద్దామనుకున్న వారిని, వరుడి గది వైపు వెళ్ళనివ్వకుండా సెక్యూరిటీవారు ఆపుచేసి సామాజిక ద్రోహం చేశారు.

వరుడి గదిలో సరోజ, చాణుక్యల మధ్య సంభాషణ ఇలా జరిగింది. ముందు చాణుక్య ప్రారంభించాడు: "నీకు అన్యాయమే జరిగింది తల్లీ. కానీ పెద్దవాళ్ళ పెళ్లి మధ్యలో ఇలా రభస చెయ్యటం మంచిది కాదు కదా" అని అనునయంగా అన్నాడు.

"అవును సార్. నిజమే కదా. చిన్నవాళ్ళ పెళ్లి ఆపుతే పర్లేదు కానీ ఇది పెద్దవాళ్ళది కదా. కానీ ఏం చెయ్యమంటారు? నేనే మీ కూతుర్ని అనుకుని చెప్పండి"

"నా కూతురైతే ఉరైనా వేసుకోమంటాను కానీ అతగాడిని పెళ్లి చేసుకోమని చచ్చినా చెప్పనమ్మా. మీసాంబ్రాజా గురించి నీకు తెలీదు"

"నాకెందుకు తెలీదూ? వారం రోజులు కలిసి కాపరం చేశాముగా. తాగుడూ, కొట్టుడూ, ఆ పై చావకొట్టుడూ. మరో నాల్రోజులుంటే నేనే వదిలేసి పోదును. ఈ లోపులో వీడు కడుపున పడ్డాడు. ఇప్పుడు నేను ఆలోచిస్తున్నది పిల్లాడి గురించి సారూ. నా వెనుక ఎవరూ లేరు. వీడిని ఎలా పెంచటం?"

సమస్యకి అంత సులభంగా పరిష్కారం దొరకటంతో సంతోషం బయటకు కనపడనివ్వకుండా, "అయిదో, పదో తీసుకో అమ్మా" అన్నాడు.

"అయిదు రూపాయలకి అర్ధపావు ఉల్లిపాయలు కూడా రావు సార్"

ఇంత అమాయకమైనదా అన్నట్టు చూసి, "అయిదు లక్షలమ్మా" అన్నాడు.

స్పృహ తప్పి పడిపోకుండా కుర్చీ పట్టుకుని నిలదొక్కుకుంటూ "అయిదు లక్షలా?" ఊపిరి గట్టిగా పీల్చుకుంటూ సంభ్రమంగా అన్నది.

"అయిదు నిముషాల్లో ఏర్పాటు చేస్తాను. పద లోపలికి వెళ్దాం"

ఆమె లోపలికి నడవబోయి ఆగి, "డబ్బుకు అమ్ముడు పోయానన్న బాధ జీవితాంతం బాధ పెట్టదా సారూ" అంది.

"మరేం చెయ్యమంటావ్? వాడిని చేసుకుంటే ఎయిడ్స్ తో చస్తావ్. నీ ఇష్టం" అన్నాడు భయపెడుతున్నట్టు.

"అమ్మో వద్దు సార్. ఏ జలుబో తలనొప్పో అయితే సర్దుకోవచ్చు గానీ మరీ ఎయిడ్సా?".

"నువ్వు కూడా లేకపోతే పిల్లాడు అనాథ అయిపోతాడు. వాడి భవిష్యత్తు ముఖ్యం కదా" అన్నాడు మరింత బెదిరిస్తున్నట్టు.

"నిజమే. వాడి భవిష్యత్తు ముఖ్యం"

"అంతే కదా" అన్నాడు చాణుక్య చర్చ ముగిసినట్టు.

"మరి కుర్రాడిని స్కూల్లో చేరిస్తేనే రెండు మూడు లక్షలు అయిపోతాయే. ఆ తరువాత జీవితాంతం వీడిని సాకాలి కదా. అయిదు లక్షలతో ఎలా సారూ?" అన్నది.

పెంట మీద రాయి వేసినట్టు అయింది. అనవసరంగా కెలికానా అనుకున్నాడు. "అయితే ఏం చేద్దాం అంటావ్?" అన్నాడు విసుగ్గా.

"ఏదైనా మంచి పోస్టు ఇప్పించండి సారూ. ముఖ్యమంత్రిగారు తల్చుకుంటే పెద్ద కష్టం కాదు"

చాణుక్య తేలిగ్గా ఊపిరి పీల్చుకుని "తప్పకుండా. ఏమి చదువుకున్నావు? ఏ పని చెయ్యగలవు?" అన్నాడు.

"చైర్మన్ పోస్టుకి చదువు ఎందుకండీ?"

చాణుక్యకి పొలమారింది. "చై... చైర్మన్నా?" అన్నాడు.

"వీడు పెద్దయ్యాక 'నా తల్లి కార్పోరేషన్ చైర్మన్' అని చెప్పుకుంటే కాస్త మర్యాదగా ఉంటుంది కదా. ఎంతయినా వీడు సీఎం బామ్మర్ది మీసాల్రాజాగారి అబ్బాయి కదండీ".

'నువ్వు మామూలు దానివి కావే' చాణుక్య మనసులో అనుకున్నాడు. మరో వైపు మెదడు పాదరసంలా పని చేసింది.

*ప్రస్తుతం ఈ పెళ్లి జరిగిపోతే తరువాత చూసుకోవచ్చు. ప్రస్తుతం అయిదు లక్షలు మిగులుతాయి. ఈ అయిదులో ఒకటి 'అక్కడ' ఖర్చు పెడితే డి.ఎన్.ఏ రిపోర్టులు మార్చటం ఎంతసేపు? బ్లాక్ మెయిల్ కేసు క్రింద దీన్ని అరెస్టు చేయించవచ్చు కూడా.*

ఆ విధంగా ఆలోచించి, "తప్పకుండా చూద్దాం. పద" అంటూ హడావుడి పెట్టి తిరిగి మెయిన్ హాల్ లోపలికి తీసుకువెళ్ళాడు.

అప్పటికే సత్యదేవ్ తో అయిదు ప్రశ్నల ఇంటర్వ్యూ పూర్తి చేసుకున్న రాంబాబు కెమెరా ఆమె మీదకు తిప్పాడు. అతడితో పాటే కెమేరాలన్నీ వాళ్ళ మీద ఫోకస్ అయ్యాయి. బ్రహ్మానందం టెన్షను తోటీ, ఆంజనేయులు నమ్మకం తోటీ చాణుక్య వైపు చూశారు. 'అంతా సవ్యమే' అన్నట్టు చాణుక్య బొటనవేలు ఎత్తి సైగ చెయ్యటంతో ఆంజనేయులు తేలిగ్గా ఊపిరి పీల్చున్నాడు.

సరోజ గవర్నరు దగ్గరికి వచ్చి, వెనుక నిలబడిన బాడీగార్డు చేతుల్లోంచి తన పిల్లాడిని తీసుకుంటూ, "పెద్దవారు. మీరు ఉండబట్టి అంతా సవ్యంగా జరిగింది సార్" అని చెప్పి మళ్ళీ వేదిక పైకి వెళ్ళింది. బయటకి పోతూందనుకున్నామె మళ్ళీ పైకి ఎందుకు వెళ్తోందన్న అనుమానం నుంచి చాణుక్య తేరుకునే లోపులో మైకు దగ్గర చెప్పటం ప్రారంభించింది.

"చాణుక్యగారు అంతా క్లియర్ గా మాట్లాడారు. పెళ్లి ప్రసక్తి వదిలేసుకుంటే ముందు అయిదు లక్షలు ఇస్తామన్నారు. లేదంటే కార్పోరేషన్ ఛైర్మన్ పదవి ఇప్పిస్తామన్నారు. కాదంటే ఎయిడ్స్ తో ఛస్తానన్నారు" అన్నది.

తల మీద పిడుగు పడ్డట్టు చాణుక్య స్థాణువయ్యాడు. సంభాషణని కాస్త మార్చి తనకనుగుణంగా చెపుతున్న ఆమె చాతుర్యాన్ని చూసి, ఎన్నో వ్యూహాలు పన్నినవాడూ, సార్థక నామధేయుడు కూడా ఝంఝూమారుతంలో చిగురుటాకులా వణికిపోయాడు. ఆమె చేతిలో సెల్ ఫోన్ పరిహసిస్తున్నట్టూ ఉన్నది. గోటితో పోయేదే కదా అని చిటికిన వేలితో తోసెయ్యబోతే, వేలితో పాటూ చెయ్యీ పోయేటట్టు ఉంది.

"నేను గంగా లాడ్జిలో ఉంటాను. రేపు సాయంత్రం ఆరింటికి ప్రెస్ క్లబ్ కి వస్తాను. ఇప్పుడు వీరు తీసుకునే నిర్ణయం బట్టి, అక్కడ నా భవిష్యత్ కార్యక్రమం చెపుతాను. శలవు" అని మైకు ముందు నుంచి లేచి స్టేజి వెనగ్గా వెళ్ళి, కెమేరావాళ్ళు చేరుకునే లోపే అక్కడ రెడీగా ఉన్న ఆటో ఎక్కేసి వెళ్ళిపోయింది.

చాణుక్య చేతులు వళ్ళో పెట్టుకుని చేష్టలుడుగి కూర్చున్నాడు. ముందు సోఫాలో కూర్చున్న రవళి వెనక్కి తిరిగి, "ఏం జరుగుతోంది బాబాయ్‌గారూ" అని అమాయకంగా అడిగింది. మాట్లాడకుండా తల దించుకున్నాడు.

మహిషాసురుడి ఆగడాలు విని, క్రోధ విధూత రుధిర జజ్వలిత వర్ణంతో విష్ణువదనం రగిలిపోగా; ఆ రౌద్రము ముఖముగా, ఈశ్వరశక్తి మధ్య భాగముగా, బ్రహ్మతేజస్సు

పాదములుగా, యముడు కేశముల్లో, చంద్రుడు కుచముల్లో, అగ్ని కళ్ళుగా, సంధ్య కనుబొమ్మలుగా, వాయువు చెవులుగా సృష్టింపబడిన సురవరవర్షిణి దుర్ధరధర్షిణి దుర్ముఖమర్షిణి అయిన దుర్గాదేవి కాలి క్రింద మహిషాసురుడు ఏ విధంగా శక్తిహీనుడయ్యాడో ఆ విధంగా కనబడుతున్నాడు చాణుక్య.

బ్రహ్మానందం అధికారపక్షం వియ్యంకుడి దగ్గరకు వెళ్ళి 'ఏమి చేద్దాం' అని అడగలేదు. ప్రతిపక్ష లీడర్ సత్య వైపు నడిచాడు. వచ్చిన తుఫానుని కూడా ఓట్లలోకి మార్చుకో గలవాడే రాజకీయ నాయకుడు కదా. త్వరలో తాను ఎలాగూ పార్టీ మారబోతున్నాడు. ఇక్కడ కన్నా 'అక్కడ' సలహా తీసుకోవటం మంచిది. రేప్రొద్దున్న '...చూశావా. ఇంత ముఖ్య నిర్ణయం కూడా నీవు చెప్పినట్టే తీసుకున్నాను. నీ మీద నాకు అంత నమ్మకం' అని ప్రతిపక్షపార్టీ నాయకుడితో అనవచ్చు.

"ఏమి చెయ్యను?" అని సత్యని అడిగాడు.

"అసలే ఎలక్షన్స్ దగ్గర పడుతున్నాయి. ఇప్పుడీ పెళ్లి జరిగితే ప్రజలకి ఒక తప్పు సంకేతం పంపినట్టు అవుతుంది. ఈ వార్త మనకి... సారీ– మీకు... ఎన్నికల్లో వ్యతిరేకంగా పని చేస్తుంది. ముందొక విషయం చెప్పండి. వాడికి మీ మనవరాలిని ఇచ్చి ఎందుకు పెళ్లి చేస్తున్నారు? వాళ్ళిద్దరి గురించీ ప్రపంచమంతా తెలిసిందనే కదా. ఇప్పుడు వాడిని వదిలించుకోవటానికి ఇంతకంటే మంచి రీజన్ ఏమి దొరుకుతుంది? మీరుగానీ ఇప్పుడు ఈ పెళ్లి ఆపుతే బాలింతరాలైన ఓ అమాయకురాలికి న్యాయం జరిగిందని అందరికీ అర్థం అవుతుంది. మీ పాపులారిటీ మరింత పెరుగుతుంది. ఇదీ నా అభిప్రాయం"

"కరెక్ట్. కరెక్ట్" అంటూ ఆ విషయం ప్రకటించటానికి హడావుడిగా వెళ్లి మైకు అందుకున్నాడు. "మావల్ల ఒకమ్మాయి జీవితం నాశనం అవటం ఇష్టం లేదు. అందువల్ల ఈ వివాహాన్ని వాయిదా వేస్తున్నాము" అంటూ మొదలుపెట్టాడు.

"వాయిదానా? రద్దా?" ఎవరో విలేఖరి అడిగాడు.

"విషయం తేలే వరకూ వాయిదా. ఆ పై నిర్ణయం" అని, వాళ్ళు మళ్ళీ ప్రశ్నించటానికి అవకాశం ఇవ్వకుండా, పురోహితుడికి సైగ చేసి వధువు రూము వైపు వెళ్ళాడు.

లోపల మనవరాలు ఫోనులో ఎవరికో మెసేజ్ చేసే పనిలో బిజీగా ఉండటం చూసి, "అక్కడ కొంపలు తగలబడుతూ ఉంటే నీకేమీ పట్టలేదా?" అన్నాడు కోపంగా.

'ఇక్కడ నా కొంప తగలబడుతోంది' అన్నట్టు చూసింది సుగాత్రి.

"డ్రగ్ కోసమేగా"

కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి, "భలే కనుక్కున్నావు తాతయ్యా. యు ఆరే జీనియస్" అని బుగ్గ కొరికింది.



నెల రోజుల్లో ఎన్నికలనగా పార్టీ మారుతున్నానని చెప్పిన ఎమ్మెల్యే వైపు అధిష్టానవర్గం చూసినట్టు, మనవరాలి వైపు చీత్కారంతో చూసి, బ్రహ్మానందం అక్కడ నుంచి బయటకి నడిచాడు.

మారేజీ హాలు దాదాపు ఖాళీగా ఉంది.

పెళ్లి ఆగిపోయిందని తెలియగానే జనం డైనింగ్ హాల్ వైపు పరుగెత్తారు. ఒక్కరిలో కూడా విషాదంగానీ, సానుభూతిగానీ లేదు. ముఖ్యమంత్రి ఇంట పెళ్లి ఆగిపోవటాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులుగా... రేపు బంధువులతో, స్నేహితులతో, టమోటా సాస్ మీద కారం జల్లి కథలుగా చెప్పుకునే అవకాశం దొరికిన ఉత్సాహంతో... ఆకలి మరింత ఎక్కువ కాగా... మళ్ళీ చోటు దొరకదేమో అన్నట్టు... కరోనాతో వలస కూలీలు చచ్చిపోతూ ఉంటే ఏ.సి రూముల్లో కజ్జికాయలు తింటూ సానుభూతి కామెంట్లు పెట్టే నెటిజెన్లలా... భోజనాలకి ఎగబడ్డారు. సానుభూతి తప్పు కాదు కానీ, చెయ్యగలిగే సాయం కూడా చెయ్యకుండా ప్రవచనాలు చెప్పటం... భార్య ప్రసవవేదన పడుతూంటే, ఫేసుబుక్‌లో లైకుల కోసం ఆ అరుపులు పోస్ట్ చెయ్యటం లాంటిది.

తన ప్రమేయం ఏమీ లేకుండా సాగిపోతున్న సంఘటనలు చూస్తూ ప్రేక్షకుడిలా నిలబడి పోయాడు ముఖ్యమంత్రి ఆంజనేయులు.

చాణుక్య ఎక్కడ మొహం చాటేసాడో తెలియలేదు.

సరోజ 'గంగా లాడ్జి' అనగానే, ఆమె సంభాషణ ఇంకా పూర్తి కాకముందే రాంబాబు గంగా లాడ్జి వద్దకు పరుగెత్తుకు వెళ్లి ఆమె కోసం అక్కడ కాపు కాశాడు. పది నిముషాలకి ఆమె ఆటో దిగింది. కెమెరా ఆన్ చేసి, పిల్లాడితో కలిసి ఆమె ఆటో దిగటం నుంచీ షూట్ చేయటం ప్రారంభించాడు.

మట్టగుడిస కోసం వలేస్తే పొలస పడినట్టు, అక్కడ ఒక ఇంటరెస్టింగ్ సంఘటన జరిగింది.

గది తాళం కోసం రిసెప్షన్ దగ్గర సరోజ ఆగినప్పుడు, ముగ్గురు వ్యక్తులు ఆమెని ఆపి ఏదో మాట్లాడటం మొదలుపెట్టారు. కరోనా రక్షణ కోసం మాస్కులు కట్టుకున్నారు. ఎవరో తెలియటం లేదు కానీ ఏదో గొడవ జరుగుతున్నట్టూ మాత్రం అర్థమవుతోంది. కొన్ని నిముషాలు వాగ్వివాదం జరిగాక ఆమె వారితో పాటూ వెళ్లి కారు ఎక్కింది.

అదంతా రికార్డు చేశాడు.

* * *

ముఖ్యమంత్రి ఇంట్లో పీటల మీద ఆగిపోవటమే సంచలనం అనుకుంటే, పెళ్లి మధ్యలో పెళ్ళికొడుకు బిడ్డని ఎత్తుకుని తల్లి రావటం అంతకన్నా పెద్ద సంచలనం. మరోవైపు హోం మినిస్టర్ గారి మనవరాలి పెళ్లి.

తెల్లవారక ముందే ఒక ఛానెల్ "వివాహం ఆగిపోవటానికి అసలు కారణం" అంటూ చర్చా కార్యక్రమం ప్రారంభించింది. ఉదరకుంభానంద స్వామి, పేర్ల ప్రవీణ్, దైవజ్ఞ వాస్తు మొదలైనవారు పాల్గొన్నారు. వేదిక వాస్తు బావోలేదనీ, పదేళ్ళ క్రితం అదే మండపంలో పెళ్లి చేసుకున్న ఒక జంట, ఏడాదికే విడాకులు తీసుకున్నారని దైవజ్ఞ వాస్తు చెప్పాడు. అదే మండపంలో ఆ తరువాత వెయ్యి పెళ్లిళ్ళు అయ్యాయన్న విషయం కన్వీనియెంట్ గా మర్చిపోయాడు. పెళ్ళికొడుకు పేరు 'ఆర్' తోనూ, పెళ్లి కూతురు పేరు 'యస్' తోనూ మొదలవకూడదనీ, అందువల్లే ఇలా జరిగిందనీ పేర్ల ప్రవీణ్ అన్నాడు. రాముడూ సీతా ఉదాహరణ కూడా చెప్పాడు. రాముడూ సీత టైములో ఇంగ్లీషు లేదన్న ప్రస్తావన తీసుకు రాలేదు. గతంలో తాను గ్రహకూటమి మార్చి కరోనాని తగ్గించినట్టుగా, మళ్ళీ గ్రహాల్ని శాసించి త్వరలో ఈ పెళ్లి జరిపిస్తానని ఉదరకుంభానంద ప్రవచించారు.

ముఖ్యమంత్రి ఇంట్లో వివాహం ఆగిపోతే ప్రధానమంత్రి ఏమి చేస్తున్నాడని ఎవరో పోస్టు పెడితే, దాని మీద ప్రొద్దున్నుంచీ రభస జరుగుతోంది. 'ఆగిపోయిన ముఖ్యమంత్రి ఇంట్లో వివాహం' అని మరొక ఛానెల్ హెడ్డింగ్ పెడితే, 'ఆగినది ముఖ్యమంత్రి ఇంట్లోనా? ఫంక్షన్ హాల్లోనా?' అన్న విషయంపై ఆరింటి నుంచీ నెటిజెన్లు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్నారు.

ప్రొద్దున్న ఆరింటికే నవాజుద్దీన్ సిద్దీకీ గంగాలాడ్జికి వెళ్ళాడు. రాత్రంతా సరోజ గదికి రాలేదని చెప్పారు.

సాయంత్రం ప్రెస్ క్లబ్ దగ్గర జర్నలిస్టులు గుంపులుగా ఎదురు చూశారు. అక్కడికి కూడా ఆమె రాలేదు. ఆలస్యం చెయ్యకుండా వెళ్లి హోటల్ గది తలుపులు బలవంతంగా తెరిపించాడు రాంబాబు.

లోపల కొన్ని బట్టలు, పిల్లాడి డయిపర్లు ఉన్నాయి.

అతడు ఆగమేఘాల మీద స్టూడియోకి వెళ్ళాడు.

పెళ్ళికి పిల్లాడిని ఎత్తుకుని సరోజ రావటం నుంచీ... రిసెప్షను దగ్గర ముగ్గురు వ్యక్తులు ఆమెని బెదిరించి కారు ఎక్కించి తీసుకువెళ్ళటం వరకూ నీట్ గా ఎడిట్ చేసి, ***'రభస చేసిన పెళ్లికూతురు ఏమైంది?'*** అన్న కాప్షన్ పెట్టి "పెద్దల పెళ్లి ఆపిన సరోజని ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక టోటల్ గా అడ్డు తొలగించారా?" అన్న వాయిస్-ఓవర్ తో ప్రసారం చేశాడు.

బాంబు పేలింది.

రాష్ట్రం గగ్గోలు పెట్టింది.

అన్యాయానికి బలి అయిపోయిన అభాగినికి తోడుగా ఉంటామని వివిధ స్త్రీ రక్షణ సంస్థలూ ప్రతిన పూనాయి. సరోజ అదృశ్యం గురించి ఎవరో కోర్టులో పిల్ కూడా వేశారు. అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా నడవగలిగే రోజు కోసం కలలుగన్న గాంధీ పుట్టినదేశంలో, కాబోయే మొగుడితో వారం రోజులు ఉన్న స్త్రీకి రక్షణ లేకుండా పోయిందని ఒకరెవరో ఆర్టికల్ వ్రాసారు.

# 40

**"నీకేమైనా** బుద్ధుందా? ఏమిటీ ఇంటర్వ్యూ?" కోపంగా అన్నది రవళి.

సత్య మాట్లాడలేదు.

"రాంబాబు అడిగితే అనవసరంగా రికమెండు చేశాను. రాజకీయాల్లో పైకి రావాలనే జ్ఞానం ఉన్నవాడెవడూ ఇలాంటి ఇంటర్వ్యూ ఇవ్వడు" అంటూ అతడి మొహం చూసి చప్పున ఆగి, "ఎందుకు నవ్వుతున్నావ్?" అని అడిగింది రవళి.

"సొంత భార్య కూడా మొగుడి మీద ఇంత అజమాయిషీ చేయదు"

"జోకులు చాల్లే. అయినా భార్య గురించి ఎవరైనా ఇలా చెప్తారా?"

"ఏమి చెప్పాను?"

"నువ్వే చూడు" లాప్-టాప్ ఓపెన్ చేసి ఇంటర్వ్యూ చూపించింది.

రాంబాబు అడుగుతున్నాడు: "మీ భార్య సులోచన భారత మాజీ రాష్ట్రపతి ప్రభవాభారతి గారి మనవరాలు. ఒక యువనాయకుడికి రాష్ట్రపతితో వియ్యం అంటే ఎంతో గొప్ప అదృష్టం.

మీకు రాజకీయాల్లో ఇంత తొందరగా పేరు రావటానికి అది కూడా ఒక కారణం అంటారు. అయినా మీరు మీ భార్యకి విడాకులు ఇచ్చారు."

"అది మా స్వవిషయం"

"పబ్లిక్ ఫిగరుకి స్వవిషయాలు అంటూ ఉండవు సార్. ఒక సంస్కారవంతమైన కుటుంబంలో పుట్టిన స్త్రీ భవిష్యత్తు పాడు చేశారు. సరైన కారణం కూడా చెప్పకుండా విడాకులు ఇచ్చారు. ఇది తప్పు కదా"

"తప్పే"

"మీకు కోపం చాలా ఎక్కువనీ, ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడుతూ ఉంటారనీ, మిమ్మల్ని భరించలేక మీ భార్య మీకు విడాకులు ఇచ్చిందని సమాచారం. దీనికి మీరేమంటారు?"

"నిజమే"

రాంబాబుకి ఇక ఏం మాట్లాడాలో తెలియలేదు. ఏదైనా ఒక విషయాన్ని ఖండిస్తే ఆ వ్యక్తిని చీల్చి చెండాడి ఎన్-కౌంటర్ చేయవచ్చు. ప్రతిదానికీ 'అవును' 'నిజమే' 'ఒప్పుకుంటున్నాను' అంటూ సమాధానం ఇస్తే ఇక మాట్లాడటానికి ఏముంది?

"రాజకీయాల్లో ఉండి మీకు ఇంత కోపం మైనస్ పాయింట్ కాదా"

"తగ్గించుకుంటాను. కానీ అది కోపం కాదు. చిరాకు.."

"రెంటికీ తేడా ఏమిటి?"

"ఎదుటి వ్యక్తిని శిక్షించాలనుకోవటం కోపం. ఎదుటివ్యక్తి విధానాలపై అసహనం చిరాకు"

"ఇలాంటి పనులవల్ల మీరు ప్రజలకు దూరం అవుతున్నారు కదా. ఆ విషయం మీకు తెలుస్తోందా?"

"నాలో ఉన్న బలహీనతలు చెప్పుకుంటే అందులో తప్పేముంది? బయటపడటానికి ప్రయత్నిస్తా అంటున్నానుగా"

"కానీ మీ భార్య మీ గురించి..."

"మీ అయిదు ప్రశ్నలూ అయిపోయాయి. థ్యాంక్యూ వెరీమచ్."

* * *

అంతా విని సత్యదేవ్ లేచి లాప్-టాప్ ఆపుచేస్తూ, "ఏమిటి రవళీ నువ్వు నన్ను అడగదల్చుకున్నది?" అని ప్రశ్నించాడు.

"నీ పెళ్లి సందర్భంగా నేను పంపిన కార్డు గుర్తుందా?"

"కంతతా వచ్చు. ముందు పాదం... వెనుక అడుగు. దాంపత్యం అంటే ఇద్దరు వ్యక్తులు కలిసి ఒకటిగా నడవటం".

"మరి విడాకులు ఎందుకిచ్చావ్?

"రాష్ట్రపతిగా ప్రభవాభారతి పదవిలోకి వచ్చిన ఆరునెలల్లో ఇరవైసార్లు విదేశీయాత్రలకు వెళ్ళింది. ఆమెపై ప్రభుత్వం ఖర్చు దాదాపు 30 శాతం పెరిగింది".

ఆ సమాధానానికి విస్తుబోయి, "దానికీ నీ విడాకులకీ ఏమిటి సంబంధం?" అంది.

"నాయనమ్మతో కలిసి నా భార్య పన్నెండుసార్లు వెళ్ళింది."

"నాయనమ్మతో వెళ్తే తప్పేమిటి?"

"పదవిలో ఉండగా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా విహార యాత్రల కోసం మన దేశానికయిన ఖర్చు మొత్తం రెండువందల కోట్ల రూపాయలు. కావాలంటే ఆర్.టి.ఏ సమాచారం పరిశీలించు కోవచ్చు"

"ఒక దేశ ప్రెసిడెంట్ సుహృద్భావ ప్రతినిధిగా వివిధదేశాలకి వెళ్ళటంలో తప్పేముంది?"

"అమెరికాతో సుహృద్భావ యాత్ర కోసం, ఆ దేశానికి 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న టూరిస్ట్ ఐ-లాండ్ హనలులూ ద్వీపాలకి వెళ్ళనవసరం లేదు. అక్కడ ఆమెని కలుసుకోవటానికి కనీసం అమెరికన్ వైస్-ప్రెసిడెంట్ కూడా రాలేదు".

ఆమె షాకై, "నాయనమ్మతో కలిసి విదేశాలకి వెళ్ళిందన్న కారణంగా భార్యకి విడాకులు ఇస్తావా?" అని అడిగింది.

"ఆ పెద్దావిడ పదవీ విరమణ చేసినప్పుడు పది లారీల సామాను ఇంటికి తీసుకెళ్లింది. నా భార్య కూడా దాదాపు కోటి రూపాయల విలువగల బహుమతులు రెండు లారీల నిండా తెచ్చుకుంది"

"మన రాష్ట్రపతి విదేశాలకి వెళ్ళినప్పుడూ, విదేశీ ప్రతినిధులు ఇండియా వచ్చినప్పుడూ బహుమతులు ఇస్తారు కదా. అవి ఇంటికి తెచ్చుకుంటే తప్పేమిటి?"

"మరి అబ్దుల్ కలాం రెండు సూట్ కేసులతో వెళ్ళిపోయినప్పుడు మీరంతా అద్భుతం అన్నారు కదా" చెర్నాకోలాతో కొట్టినట్టు అన్నాడు. "అవతలి వారు చేస్తే అద్భుతం. మనం మాత్రం చెయ్యం"

ఆమెకేం సమాధానం చెప్పాలో తెలియలేదు. "పెళ్లయిన కొత్తలో అభిప్రాయ బేధాలు సహజం. దానికి పరిష్కారం విడాకులేనా? కొంతకాలం చూడాల్సింది" అన్నది.

"ఎంతకాలం? ఇద్దరు పిల్లలు పుట్టేవరకా? అప్పుడు విడాకులిస్తే మీలాంటి జనం ఇంకా తిడతారుగా"

"అలా ఎందుకనుకోవాలి? కొంతకాలం అయితే సర్దుకుపోతారు".

"పోదు. సర్దుకుపోనని ఖచ్చితంగా చెప్పింది. అధికారం, హోదా, కళ్ళు మిరిమిట్లు కొలిపే ఐశ్వర్యం తనకి ఇష్టం. మనిషి 'ఆబ'గా బ్రతకటం నాకసలు నచ్చనిది. నీతి నిజాయితీ నేను గర్వపడే నా లక్షణాలు. తనని నేను తప్పు పట్టటం లేదు. ఏ మనిషికైనా అభిప్రాయాలు మార్చుకోవటం తేలికేమో గానీ, సిద్ధాంతాలు మార్చుకోవటం కష్టం. విడిపోవాలని అనుకున్నప్పుడు తొందరగా విడిపోతే మంచిదిగా. కలిసుంటే జీవితాంతం ఘర్షణే"

"లంచాలు తీసుకోకుండా, బహుమతులు ఆశించకుండా నువ్వు రాజకీయాలు నడుపుతావా?"

"నీవు ఎప్పుడూ చెప్పే పిచ్చుక కథే. చిన్న ప్రయత్నం చేస్తే తప్పు లేదుగా. సంపన్నుల నుంచి పన్నులు వసూలు చేసి, బీదలను పైకి తీసుకురావటం సోషలిజం. కానీ బీదలు కష్టంతో పైకి రావటానికి బదులు అన్నీ ఉ..చి..తంగా పొందటానికి అలవాటు పడుతున్నారు. మరోవైపు సంపన్నులు ఆస్తులు పెంచుకోవటానికి 'ఉత్పత్తి' అవసరం లేదన్న విషయం తెలుసుకున్నారు. పరిశ్రమల ద్వారా 'సంపద సృష్టించటం' మానేసి, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారం చాలనుకుంటున్నారు. ప్రమాదం చాప క్రింద నీరులా వస్తోంది. ఇంకో దశాబ్దం అయ్యేసరికి 95 శాతం ప్రజలు పని పూర్తిగా మానేసి, ప్రభుత్వంపై ఆధారపడతారు. ఉత్పాదన లేనప్పుడు వారినీ తప్పు పట్టలేం. అధికారం నిలుపు కోవటానికి పార్టీలు వేసే మెతుకులకి బలి అయ్యేది మనమే. రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభించాలని నా ఉద్దేశం. దానికి చాలా మార్పులు రావాలి. ముఖ్యంగా లంచగొండితనం తగ్గాలి"

"ఈ దేశంలో లం..చ..గొం..డి..తనం తగ్గిస్తావా?"

"చాలా చిన్నచిన్న చర్యల ద్వారా ఈ పనులు చెయ్యవచ్చు. రెండువేల మంది యువకులకి, వివిధ డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగం ఇస్తాను. అక్కడ స్లీపర్స్ గా ఉంటూ, తమ డిపార్ట్‌మెంటులో లంచగొండుల గురించి వీరు అవినీతిశాఖకి రహస్య నివేదిక పంపిస్తూ ఉంటారు. ఇంకా చాలా చేస్తా. విద్యుత్ శాఖలో పనిచేసే ఇంజనీరుని వి.ఆర్వో.గా ఇంటర్-డిపార్ట్‌మెంట్ బదిలీ చేసే వెసులుబాటు కల్పిస్తే, సంవత్సరాల తరబడి ఒకేచోట పాతుకుపోయి డబ్బు చేదుకునే వీలు ఉండదు. ఇలాంటి ఆలోచనలు నాకు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ అమలు చేయాలంటే ఎంతో ధైర్యం, కొంత త్యాగం అవసరం. అయినా మన చర్చ నాకూ, సులోచనకూ మధ్య విడాకుల గురించా? దేశం గురించా? సులోచనకి ఇదంతా ఇష్టం ఉండదు. బ్రతికినంతకాలం నా జీవితభాగస్వామే నాకు వ్యతిరేకమైతే నేనేం చేయగలను? అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మంచిది కదా. అందుకే విడిపోయాం. ఇక దీని గురించి చర్చ వద్దు".

# 41

**రవళి** వెళ్ళే సమయానికి ముఖ్యమంత్రి ఛాంబర్ లో చాణుక్య ఒక్కడే కూర్చుని ఉన్నాడు. "ఏమ్మా ఇలా వచ్చావు? సి.ఎం.తో పనేమైనా ఉందా?" అడిగాడు.

"అవును బాబాయిగారూ. చిన్న పనుండి వచ్చాను. మీ కూతురూ అల్లుడూ బాగున్నారా?" అని అడిగింది.

చాణుక్య మొహంలో ఆశ్చర్యం స్పష్టంగా కనిపించింది. "వాళ్ళు నీకు తెలుసా?"

"తెలియకపోవటం ఏమిటండీ. పార్థసారథి పని చేసేది మా కంపెనీలోనే. మీ అమ్మాయికి కూడా అక్కడ ఉద్యోగం ఇస్తానని మాట కూడా ఇచ్చాను."

"నువ్వు ఆదిత్యపురంలో స్కూల్ టీచర్‌వి కదూ..."

"ఎప్పుడూ బళ్ళు బళ్ళుగానే ఉండవు కదండీ. అప్పుడప్పుడు ఓడలు కూడా అవుతూ ఉంటాయి".

"అక్కడ నువ్వు కంపెనీ సెక్రటరీవా?"

"అవును బాబాయ్"

"మీసాల్రాజాని అర్ధరాత్రి అరెస్టు చేయించింది?"

"నేనే బాబాయ్"

"వాడికి నీ ఫోన్ నంబర్ ఇచ్చింది..."

"మీ కూతురే అంకుల్"

తల తిరుగుతూన్నట్టు అనిపించింది. తమాయించుకుని, "నా కూతురూ అల్లుడూ నీకు ఎప్పటి నుంచీ తెలుసు?" అని అడిగాడు.

"వాళ్ళకి పెళ్ళి చేసింది మేమేనండీ. నేనూ చక్రధరరావుగారూ కలిసి చేశాము. మీకు రావుగారు గుర్తున్నారు కదా".

"చక్రా గ్రూప్"

"అవును. ఆయన కాళ్ళు పోయిన ఆక్సిడెంట్లో దొంగసాక్ష్యాలు పెట్టి మీ వాడిని విడిపించారు. ఆయనేమో మీ కూతురు ప్రేమించిన కుర్రాడితో స్వయంగా వివాహం జరిపించారు".

చివరి పదాలు నొక్కి చెప్పింది.

చాణుక్య నిస్తేజంగా చూస్తూ ఉండిపోయాడు. ఆమె మాటలు పూర్తిగా అర్థం కాలేదు కానీ తన వెనుక చాలా కథ జరిగినట్లు మాత్రం లీలగా తెలుస్తోంది. ఈలోపులో ఆంజనేయులు చాంబర్లోకి వచ్చాడు. సీట్లో కూర్చుంటూ, "మిమ్మల్ని దేవ్ పంపాడు కదా. చెప్పండి. మీకేం సహాయం చేయగలను?" అని అడిగాడు.

"మీరు నాకేమీ సాయం చెయ్యనవసరం లేదు. నేనే మీకు సాయం చెయ్యటానికి వచ్చాను".

షాక్ తగిలినట్టయ్యింది. మొహం చిట్లించి "నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థం అవుతోందా?" అని అడిగాడు.

"నేను చెప్పేది పూర్తిగా వింటే మీకే అర్థం అవుతుంది."

చాణుక్య ఆమె వైపు కన్నార్పకుండా చూస్తున్నాడు.

ఎక్కడో ఏదో అపశృతి ధ్వనిస్తోంది.

నాలుగు వైపుల నుంచీ చీకట్లు కమ్ముకొస్తున్న భావన.

దూరం నుంచి వస్తున్న సునామీకి ప్రమాదసూచనగా సముద్రపు ప్రశాంతత.

ఎక్కడో ఏదో తెలియని అలజడి.

"నేను మాట్లాడబోయేది సరోజ గురించి" అన్నది రవళి.

ఆంజనేయులు గర్వంగా, "అభాగ్యురాలైన స్త్రీకి న్యాయం చేయటానికి మా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. అందుకే కదా పీటల మీద పెళ్ళిని కూడా ఆపు చేశాం" అన్నాడు.

"కానీ నిన్నటి నుంచీ సరోజ కనబడటం లేదనీ, మీరే ఆమెని ఏదో చేశారనీ పేపర్సూ, చానల్సూ గొడవ పెడుతున్నాయి. కొన్ని 'సి' గ్రేడ్ పత్రికలయితే మీరు చంపేశారని కూడా వ్రాశాయి. రేపు ఎలక్షన్స్‌లో అది మీకు చాలా పెద్ద దెబ్బ. ఆ విషయం మాట్లాడుదామనే వచ్చాను."

"బెదిరించటానికి వచ్చావా?"

"కాదు. సాయం చేద్దామని వచ్చాను"

ఆంజనేయులు ఆమె వైపు అర్థం కానట్టు చూశాడు. ఆమెను పంపింది ప్రతిపక్ష నాయకుడు. ఎలక్షన్స్‌లో సహాయం చేయటానికి ఆమె రావటం ఏమిటి?

"సరోజ ఎక్కడుందో నీకు తెలుసా?"

"తెలుసు" అన్నది రవళి.

ఇద్దరూ చప్పున తలెత్తి ఆమె వైపు చూశారు.

"ఎక్కడ?" అడిగాడు సి.ఎం.

"నా దగ్గరే"

"ఏమిటీ?" కీచుమంది ముఖ్యమంత్రి కంఠం.

"సరోజ నా మనిషి. రంగస్థల నటి. ఆమెకీ మీసాల్రాజాకి ఏ సంబంధమూ లేదు. ఆమె తీసుకొచ్చినది పిల్లాడి బోగస్ డి.ఎన్.ఎ. రిపోర్ట్"

సి.ఎం. అప్రతిభుడయ్యాడు. కుర్చీలో సర్దుకుంటూ "సత్యదేవ్ అడిగాడని గౌరవంతో నీకు అపాయింట్‌మెంట్ ఇచ్చాను. బ్లాక్ మెయిల్ చెయ్యటానికి వస్తే మాత్రం ఇక్కడి నుంచి ఇంటికి తిరిగి వెళ్ళవ్. నీకు ఏం కావాలో రెండు నిముషాల్లో చెప్పేసి పో" అన్నాడు.

అతడింకా ఏదో అనబోతూ ఉంటే ఈలోపు సారమ్మ ట్రేతో కాఫీలు తీసుకువచ్చింది. ఆమె చేతిలో కప్పు అందుకుంటూ రవళి, "ఈమె సారమ్మ. మీ క్రింద పని చేస్తోంది కాబట్టి ఈమె పేరు మీకు తెలిసే ఉంటుంది. మీకు తెలియని విషయం ఏమిటంటే ఈమె సబినస్పెక్టరు బాలారిష్ట భార్య" అన్నది.

"బాలారిష్ట ఎవరు?" గుర్తు రానట్టు అడిగాడు ఆంజనేయులు.

"ఎమ్మెల్యే కొడుకు అంజిని నిండుసభలో కాల్చి చంపినవాడు"

"అంజిని చంపిన ఇనస్పెక్టరు పెళ్ళానివా నువ్వు!" విస్తుపోయాడు చాణుక్య.

సారమ్మ కప్పులు తీస్తూ, "ఎందుకంత ఆశ్చర్యం? మా అన్నయ్య ఎల్లమందని చంపిన ముసలాడివి నువ్వేనా అని నేను అడగలేదే" అంది వెళ్ళిపోతూ.

ఫెడీల్మని చెంప మీద కొట్టినట్టయింది. తేరుకోవటానికి కొంచెంసేపు పట్టింది. కొద్ది కొద్దిగా విషయం అర్ధమవుతూంది.



ముఖ్యమంత్రిని ఉద్దేశించి రవళి చెప్పటం కొనసాగించింది.

“సార్. నేను వచ్చిన విషయం క్లుప్తంగా చెబుతాను. మీ విద్యాధరి కాలేజిలో చదివినవాళ్ళకి పరీక్షల ముందే పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయి. ఏడాది తరువాత పోతాయి. మళ్ళీ ఆ ఉద్యోగాలు కొత్త బ్యాచ్‌కి ఇస్తారు. ఆ విధంగా డొనేషను రేటు బాగా పెంచుకుంటారు. ఆ రికార్డ్స్ అన్నీ నా దగ్గర ఉన్నాయ్. ఆగండి... నన్ను పూర్తిగా మాట్లాడనివ్వండి. మీరు నాకిచ్చిన టైము రెండు నిముషాలే కదా..! మీరు మీ రెండో భార్యకి వ్రాసిచ్చిన, ప్రస్తుతం మీసాల్రాజా అధీనంలో ఉన్న దేవాలయం భూముల వివరాలన్నీ ప్రెస్‌కి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా రామానుజాన్ని అడ్డు తొలగించుకోవటానికి మీరూ, మీ గురుశ్రేష్టులు చాణుక్యా మాట్లాడుకున్న రికార్డంతా కూడా నా దగ్గరుంది. అది ఎలా వచ్చిందో మీకీ పాటికి అర్థమై ఉంటుంది. చౌకబారు సినిమా కథలా ఉన్నా సారమ్మ ద్వారా జరిగింది అదే. దేవ్ హాస్పిటల్లో కిడ్నీ కుంభకోణం, రామానుజం మరణం, టార్జాన్ మాయమైపోవటం, విద్యాధరి కాలేజీ, దాని కన్నా ముఖ్యంగా సరోజ ఎక్కడుందీ... అన్నీ నేను చూసుకుంటాను. అయితే ఇవన్నీ చేయటానికి నాకు మీరు రెండు సహాయాలు చేయవలసి ఉంటుంది” అన్నది.

చాణుక్య మధ్యలో కల్పించుకుని ఏదో మాట్లాడబోతూంటే తర్జని చూపిస్తూ “దయచేసి మీరిందులోకి రాకండి. ఈ చర్చ మా ఇద్దరి మధ్య” అని కటువుగా అన్నది.

అతడి మొహం వాడిపోయింది.

రవళి తిరిగి చెప్పటం మొదలుపెట్టింది “మీ చుట్టూ మీసాల్రాజాలాంటి నికృష్టులు, ఈ చాణుక్య లాంటి సూడో-మేధావులూ చాలామంది ఉన్నారు. వారిని మీరు వదిలించుకోవాలి. ఇంత జరిగిందని తెలిసాక, సరోజ బయటికి వస్తే మీసాల్రాజా ఆమెని వదిలిపెట్టడు. అతడిని శంకరగిరి మాన్యాలు పంపాలి. శంకరగిరి అంటే ఏమిటో మీ గురువు మీకు వివరిస్తారు. ఇది నా మొదటి కండిషను. అతడు మాయమయిన మరుక్షణం సరోజ ప్రెస్‌మీట్‌లో మిమ్మల్ని సపోర్ట్ చేస్తున్నట్టు మాట్లాడి, మిమ్మల్ని ఈ గొడవ నుంచి బయట పడేస్తుంది. దాంతో మీకు కొన్ని ఓట్లు ఎక్కువ పడతాయి కూడా. ఇక రెండో పాయింటు... నా తండ్రి ప్రస్తుతం కోమాలో ఉన్నాడు. ఎల్లమంద హత్య కేసు ఆయన మీద ఉంది. నిజానికి ఎల్లమందని చంపించింది మీ పక్కన అమాయకంగా కూర్చున్న మీ ముఖ్య సలహాదారు..! ఆ మర్డరు టార్జాను చేశాడనీ, ఆ సమయంలో తను పక్కనే ఉన్నాననీ ఆయన నుంచి ఒక స్టేట్‌మెంటు కావాలి. అప్పుడిక మీ రామానుజం కిడ్నీ కేసు బయటకు రాదు. ఇది నా రెండో కండిషను. మీరేం చేస్తారో నాకు తెలీదు. రేపు సాయంత్రం వరకూ టైము ఇస్తున్నాను”.

ఆమె కాన్ఫిడెన్స్ చూసి ఆంజనేయులే తొట్రుపడ్డాడు. అయినా బింకంగా “చెయ్యకపోతే?” అన్నాడు.

"ఎన్నికల ముందు మీరు అలాంటి రిస్కు తీసుకుంటారని నేను అనుకోను. అయినా నాకూ, చక్రధరరావుగారి కుటుంబానికి జరిగిన అన్యాయంతో పోల్చుకుంటే, నేను మిమ్మల్ని అడిగింది పెద్ద విషయం కాదు. టార్జాను ఎల్లమందని కొట్టినప్పుడు తను పక్కనున్నానని చాణుక్య చెప్పాలంతే. అలా చెప్తే పెద్దగా శిక్ష పడదు. శవాన్ని దాయటం ఒకటే అబెట్మెంట్–టు–క్రైమ్. ఇక మీసాంబ్రాజా చేసిన పనుల గురించి మీకు తెలియనిదేముంది? వాడి స్నేహితులు సారమ్మని రేప్ చేశారు. నా చెల్లెల్ని చెరచబోయారు. మీకు అలాంటి వాడు కావాలా? ఎన్నికల్లో నెగ్గటం కావాలా? నిర్ణయించుకోండి"

"ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమయింది. ఇదంతా ఆ సత్యదేవ్ ఆడిస్తున్న నాటకం"

"నన్ను సత్యదేవ్ మీ దగ్గరకి పంపించింది అపాయింట్మెంట్ కోసమే తప్ప, నేను మీతో ఏ విషయం మాట్లాడబోతున్నాననేది ఆయనక్కూడా తెలియదు. ఆయనే గానీ ఈ విషయాలన్నీ ఎలక్షన్స్ కోసం ఉపయోగించదల్చుకుంటే నన్ను మీ దగ్గరకి ఎందుకు పంపుతాడు? ప్రెస్ మీట్ పెట్టి ఋజువులతో సహా వెల్లడిస్తే మరుక్షణం మీ ప్రభుత్వం కూలిపోతుంది. జైల్లో అలివేలు భజన చేసుకుంటూ మీరు ప్రేమకోటి వ్రాసుకోవాలి. మీకు పదవి కావాలా? ఎన్నికల ముందు అగ్నిపర్వతం బ్రద్దలవటం కావాలా? మీ గురువు చాణుక్యని సలహా అడగండి. ఇద్దరూ కలిసి నిర్ణయించుకొని ఏ విషయమూ చెప్పండి" అని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

చాలాసేపు అక్కడ నిశ్శబ్దం భయంకరంగా రవళించింది.

ఆంజనేయులు ఇంటర్–కమ్ లో "సారమ్మని పంపు" అని చెప్పాడు.

"వెళ్ళిపోయి ఉంటుంది. ఉండదు" అన్నాడు చాణుక్య.

అట్నుంచి పి.య్యే చెప్పింది విని ఫోన్ పెట్టేస్తూ "నిజమే. లేదు" అని నిట్టూర్చాడు.

మళ్ళీ నిశ్శబ్దం.

రవళి వదిలి వెళ్ళిన సెంటు పరిమళం గదంతా వ్యాపించి ఉంది.

"దాన్ని వదలను" స్వగతంగా అన్నాడు ఆంజనేయులు.

"ఎంతమందిని వదలవు?" విసుగ్గా అన్నాడు చాణుక్య.

"మీసాంబ్రాజాని వదిలెయ్యాలని మొన్నే డిసైడ్ అయ్యాను"

"ఆవిడ నిన్ను అడిగింది వదిలెయ్యటం గురించి కాదు. శంకరగిరి పంపటం గురించి. శంకరగిరి అంటే శ్మశానం"

"ఏమి చేద్దాం"

"అభిప్రాయం అడుగుతున్నావా? సలహా అడుగుతున్నావా?"

"అభిపాయం చెప్పు"

"ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పాను. సరోజ రేపు బయటకి రాకపోతే చాలా కష్టం. ఓటర్ల సెంటిమెంటు క్షణాల్లో మారిపోతుంది".

"మరి ఆ లం... తో అంత దరిద్రంగా డీల్ చేసింది నువ్వేగా" ఒక బూతు మాట వాడాడు.

చాణుక్య షాక్ అయ్యాడు. ముఖ్యమంత్రి తనతో అలా మాట్లాడటం అదే మొదటిసారి. మొహం జేగురురంగుకి మారింది.

"సర్లే. అభిప్రాయం కాదు. సలహా చెప్పు" అన్నాడు ఆంజనేయులు.

"నువ్వు అడుగుతోంది రవళి గురించా?"

"లేకపోతే నా పెళ్ళాం గురించి ఎందుకు అడుగుతాను. అవును"

"ఆమెతో గొడవ పెట్టుకుంటే కష్టమనిపిస్తోంది. ప్రభుని జైల్లో పెట్టించింది. అంజిని చంపించింది. బాలారిష్టని బయటకు తెచ్చుకుంది. రామానుజాన్ని ఇరికించింది. టార్జాన్ మీద పగ తీర్చుకుంది. ఒక మనిషికి ఇన్ని తెలివితేటలు ఉంటాయని ఎవరైనా చెప్తే నమ్మేవాడిని కాను. ఇన్ని చేసిన ఆమెకి మీసాల్రాజాతో ఆడుకోవటం పెద్ద కష్టం కాదు. కానీ ఆ పని నీతో చేయించాలని అనుకున్నది. ఆవిడతో పెట్టుకోవటం కన్నా అడిగింది చెయ్యటం బెటరని నా సలహా"

"మొత్తం అంతా అలాగే చెయ్యమంటావా?"

"అదే మంచిది"

"నేను అడుగుతోంది – 'మొత్తం' అంతా అలాగే చెయ్యమంటావా? అని"

"అంటే?"

"ఆమె రెండో కండిషను... అదే... నీ గురించి..."

నిశ్శబ్దం విస్ఫోటించినట్టు చాణుక్య తలెత్తాడు.

"సలహా వద్దు. అభిప్రాయం వద్దు. నిర్ణయం నీదే కాబట్టి నువ్వే ఆలోచించుకో" అని అక్కడినుంచి లేచాడు ఆంజనేయులు.

# 42

**విలేఖర్లు** ప్యాడ్లూ కలాలతో ఉత్సుకంగా ఉన్నారు. కెమెరామెన్లు ఫోకస్ సరిగ్గా ఉందా అని చూసుకుంటున్నారు. హాలు కిటకిటలాడుతోంది. అంతకు గంట క్రితమే సరోజ ప్రెస్-మీట్ ప్రకటించింది.. ఈ మధ్యకాలంలో ఇంత సెన్సేషనల్ న్యూస్ లేకపోవటంతో కెమేరాలకి హాలు సరిపోవటం లేదు.

"ముఖ్యమంత్రిగారు నిజంగా దేవుడు" సరోజ ప్రారంభించింది. "చిన్నదాన్నైనా చేతులెత్తి కాళ్ళకి నమస్కారం చేస్తున్నాను".

రాంబాబు చప్పున తలెత్తి చూశాడు. వయసులో చిన్నది కాళ్ళకి నమస్కారం చెయ్యటంలో చిత్రమేమున్నదని కాదు. కాళ్ళకి నమస్కారం చెయ్యటానికి చేతులెత్తటం ఏమిటా అని..! కానీ ఎంతోమంది హీరోలూ, మంత్రులూ, వారి కొడుకులూ ఇంతకన్నా దరిద్రంగా మాట్లాడే సంక్లిష్ట నారికేళ, గ్రాంధిక అపభ్రంశ భాషా ప్రయోగాలు చూసినవాడవటం చేత తిరిగి ఫోకస్ మీద ఏకాగ్రత నిలిపాడు.

"మిమ్మల్ని ముఖ్యమంత్రి మనుష్యులు కిడ్నాప్ చేశారని, మీసాల్రాజా మిమ్మల్ని అడ్డు తొలగించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడనీ రకరకాల రూమర్లు వచ్చాయి"

"రూమర్లు అని మీరే అంటున్నారు కదా. నిజానికి జరిగింది అది కాదు. హోటల్ గంగాకి ఆ రాత్రే మనుష్యుల్ని పంపి ముఖ్యమంత్రి నన్ను పిలిపించారు. కానీ రాజాని పట్టుకోవటానికి ఇంత ఆలస్యమైంది. పాప పరిహారార్థం రాజా ఎవరికీ చెప్పకుండా కాణీపాకం వెళ్లి వచ్చాడు. నా ఎదుటే సి.ఎం.గారు రాజాని మందలించారు. అప్పటికప్పుడు దండల మార్పిడి చేశారు. అప్పుడే నా రాజాకి ఖలిస్తాన్ వీసా వచ్చిందని తెలిసింది".

"ఖలిస్తాన్ అనే దేశం లేదు మేడం"

"ఖలిస్తాన్ కాదా? సారీ. కజకిస్తాన్ అనుకుంటా. ఏది ఏమైతేనేం? నా రాజా రేపే కబరిస్తాన్... సారీ.. అదీ.."

"కజకిస్తాన్"

"ఆ... అదే... ఆ దేశానికి వెళ్లి పోతున్నాడు. వీసా రాగానే నేను కూడా వెళ్తాను. ఈ కథని సుఖాంతం చేసినందుకు మానవరూపంలో ఉన్న దేవతామూర్తి ఆంజనేయులుగారికి నడుమెత్తి సాష్టాంగ పడి నమస్కరిస్తున్నా" అని చేతులు జోడించింది.

'నడుమెత్తి నమస్కరించిన సరోజ' అంటూ హెడ్డింగుతో ఈ సంచలన వార్త వ్రాయటానికి విలేఖర్లు బయటకు పరుగెత్తారు.

సరీగ్గా అదే సమయానికి... రాజధానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ...

"రేయ్. ఆ పెవాహంలో చూడు. తుప్పల మధ్య చొక్కా చిక్కుకుని ఉంది. ఎవడిదో శవంలా ఉందిరా"

"వదిలెయ్యహే. నీళ్లు పోటు మీద ఉన్నాయి. ప్రవాహం ఆటు మీదకు వస్తే అదే కొట్టుకుపోద్ది. పోలీసులకు చెప్తే ఐదారు గంటలపాటూ ఆళ్ళతోనే ఉండాలి. చేపలు పట్టుకునేటోల్లం. శవాల సంగతి మనకెందుకు రా..." అన్నాడు రెండోవాడు.

# 43

**బార్బరీకుడు అనే యోధుడు యుద్ధాన్ని చూద్దామన్న ఉత్సాహంతో కురుక్షేత్రం వెళ్తాడు. సమర ప్రారంభానికి ముందు కృష్ణుడు అక్కడున్న యోధులందరినీ "మొత్తం బాధ్యతలు మీకే అప్పగిస్తే, యుద్ధాన్ని ఎన్నిరోజులలో ముగించగలరు?' అని ఒక్కొక్కరినే అడిగినప్పుడు, భీష్ముడు 20 రోజులనీ, అర్జునుడు 24 అనీ, కర్ణుడు 20 అనీ సమాధానాలు ఇస్తారు. దూరం నుంచి ఇవన్నీ చూస్తూ నవ్వుకుంటూన్న బార్బరీకుడిని బ్రాహ్మణవేషంలో సమీపించి "ఎందుకు నవ్వుతున్నావు యోధుడా? నీకూ ఆ ప్రశ్న వేస్తే ఏం చెబుతావు?" అని అడుగుతాడు కృష్ణుడు. "నేను బరిలోకి దిగితే ఒకే నిమిషంలో యుద్ధం ముగిసిపోతుంది" అంటాడు అతడు. ఆ విషయం నమ్మని కృష్ణుడు, ఒక రావిచెట్టు పై బాణం ఎక్కుపెట్టమని, ఒక ఆకును తన పాదం కింద దాస్తాడు. బార్బరీకుడు వదిలిన బాణం చెట్టుకున్న ప్రతి ఆకునూ వృత్తం చేసి, చివరకు శ్రీకృష్ణుడి పాదం దగ్గరకు వచ్చి ఆగుతుంది. "ఆకు మీద పాదం తీసివేయి. లేకపోతే నీ కాలు కూడా మసైపోతుంది" అంటాడు బర్బరీకుడు. నమ్మకం కుదిరిన కృష్ణుడు 'నువ్వు ఎవరి పక్షమ'ని అడుగుతాడు. 'బలహీనుల పక్షం' అని సమాధానమిస్తాడు అతడు. అప్పుడు కృష్ణుడు, "కౌరవుల పక్షాన పెద్ద సైన్యం ఉంది కాబట్టి పాండవులే బలహీనులు. కానీ నీవు వారితో కూడితే వారు బలోపేతమవుతారు. అప్పుడు తిరిగి నువ్వు కౌరవుల పక్షాన చేరాల్సుంటుంది" అంటాడు. తన వైఖరిలో లోపమేమిటో బార్బరీకుడికి అర్థమవుతుంది.**

'ఇప్పుడీ సమయంలో తనకీ కథ ఎందుకు గుర్తొచ్చింది?' అనుకున్నాడు చాణుక్య. ఎందుకు గుర్తొచ్చిందో అర్థం అయింది. తను ఎవరి పక్షం?

ఏ రాజ్యంలో మేధావులు రాజుకి సన్మార్గం బోధిస్తారో ఆ రాజ్యం సుభిక్షమవుతుంది. ఏ రాష్ట్రంలో మేధావులు దుర్మార్గుడైన నాయకుడి వెనుక ఉంటారో ఆ రాష్ట్రం భ్రష్టు పట్టిపోతుంది. అందుకే ఆ కథ గుర్తొచ్చింది.

గ్లాసులో ఉన్న ద్రవం ఒక గుక్క తాగాడు.

**తన వైఖరిలో లోపం ఏమిటో గుర్తించిన బార్బరీకుడికి కృష్ణుడు తన నిజరూపాన్ని చూపించి, "భారీజన యుద్ధం ఒక సాహసవీరుడి బలితో ప్రారంభించాలనేది సంప్రదాయం. నిన్ను మించిన యోధుడు ఇక్కడెవరూ లేరు. ఆత్మార్పణం చేసుకో" అంటాడు. "ఇది అన్యాయం. యుద్ధంలో ప్రాణాలు వదలటానికి సిద్ధపడి వచ్చిన ఇంతమంది ఉండగా, చూడటానికి వచ్చిన నన్ను ఇలా ఎందుకు అడుగుతున్నావు?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు కృష్ణుడు, "ధర్మానికీ, అధర్మానికీ నడుమ జరిగే యుద్ధంలో మొట్టమొదట బలయ్యేది నువ్వే అని ఒక శాపం ఉన్నది" అంటూ అతడి శాపం గురించి చెపుతాడు.**

ధర్మానికీ అధర్మానికీ మధ్య బలి అయ్యింది తనే. అవసరమున్నంత వరకూ పొగిడారు. అదంతా తన విద్వత్తు అనుకున్నాడు. చివరికి మీసాల్రాజా లాంటి బ్రోకరుకు కూడా సాయం చేయవలసి వచ్చింది. చివరికొచ్చేసరికి తన వాళ్ళే 'ఛీ' కొట్టారు.

ఆ రోజు ప్రొద్దున్న జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

ముఖ్యమంత్రితో సమావేశం జరిగాక కలత చెందిన మనసుతో ఇంటికి చేరాడు. కూతురు కనపడింది. నొక్కి పట్టిన బాధ ఒక్కసారిగా బయటపడింది. మనసు రగిలి పోతూండగా, "ఆ రవళి మేక తోలు కప్పుకున్న తోడేలు. పార్థసారథికి ఉద్యోగం ఇచ్చినా, మీ పెళ్ళి చేసినా ఇదంతా నీ మీద ప్రేమతో కాదు. నిన్ను నా నుంచి దూరం చేయాలని" ఆవేశంతో రగిలిపోతూ అన్నాడు.

"తెలుసు నాన్నా" అంది సుమ.

శరాఘాతం తగిలినట్టయింది. ఆశ్చర్యంతో "ఎలా... ఎలా తెలుసు?" అని అడిగాడు.

"తనే చెప్పింది".

"తను... తను నీకు చెప్పిందా? ఏమి చెప్పింది?"

"నువ్వు తనింటికి వెళ్లి హత్య చేయటం నుంచీ, తన తండ్రికి ఆక్సిడెంటు చేయించటం వరకూ"

అతడు ఆవేశంతో కదిలిపోతూ, "ఇంత జరిగినా నువ్వు నాకు చెప్పలేదేమే ముదనష్టపు దానా?" అంటూ అరిచాడు.

"ఏమి చెప్పను నాన్నా? ఆమెని హత్యానేరంలో ఇరికించటానికి నువ్వు ప్రయత్నించావు. ప్రేమ వ్యవహారంలో ఇరుక్కుపోయిన నన్ను ఆమె రక్షించింది. ఇది చెప్పనా? నువ్వు ఆమెని తండ్రికి దూరం చేశావు. కానీ తను నన్ను నీకు దగ్గర చేసింది. ఎలా చేసిందో చెప్పనా?" అంటూ లోపలికి వెళ్ళి, ఫోన్ తీసుకువచ్చి ఒక మెసేజ్ ఓపెన్ చేసి చదవమన్నట్టు ఇచ్చి "మొన్నటి వరకూ శ్మశానంలా ఉన్న మన ఇల్లు కొద్దిగా మారటానికి కారణం ఈ ఆర్టికల్. ప్రేమ ప్రకటన గురించి ఇంత గొప్ప ఆర్టికల్ నేను ఎక్కడా చదవలేదు నాన్నా. ఇది చదివాకే నాలో గొప్ప మార్పు వచ్చింది" అన్నది.

"కానీ ఇదంతా ఆవిడ నా మీద కక్ష తీర్చుకోవటం కోసం చేసింది".

"అవును నాన్నా. అది కూడా నాకు తెలుసు. నువ్వు చేసిన పనులు మాత్రం మంచివా? ఆలోచించు. రాష్ట్రంలో కాలేజీలూ, ఆసుపత్రులూ, రవణా, ఆర్థిక వ్యవస్థా మొత్తం అంతా అస్తవ్యస్తం అయిపోయింది. దానికి చాలా వరకూ నువ్వూ నీ సలహాలూ కారణం కదా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పు..! నీకు తెలుసా? మీ కాలేజీ స్కాములవల్ల ఉద్యోగం పోయి సారథి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. మనం వర్తమానంలో పడే బాధలకి మూలాలు ఎక్కడో ఉండవు నాన్నా. గతంలో చేసిన పనులే తిప్పి కొడతాయి. నీ వియ్యంకుడు ప్రస్తుతం ఒక కిడ్నీతోనే ఉన్నాడు. మామూలు కడుపునొప్పితో ఆసుపత్రికి వెళితే, ఒక కిడ్నీ తీసి దాచుకుని, ఇంకో కిడ్నీ ఉచితంగా ఇచ్చినట్టు చర్మం మీద మార్కు పెట్టారు. ఇంతకన్నా దారుణం ఇంకేమైనా ఉంటుందా?"

"దేవ్ హాస్పటల్లోనా?"

"అవును. 'మీ' దేవ్ ఆస్పత్రిలోనే. నీకు తెలియకుండానే ఇదంతా జరిగిందా నాన్నా? ఎందుకంత అమాయకత్వం నటిస్తావ్? నీకూ రవళిగారికీ ఎంత తేడానో చూడు. నన్ను మోసం చేయ్యటానికి ఇష్టంలేక... ఇదంతా నాకు చెప్తే తనకి నష్టం జరిగే అవకాశం ఉందని తెలిసి కూడా... రిస్కు తీసుకుంది. మొత్తమంతా చెప్పింది. ఆమె తలచుకుంటే ఇవన్నీ సారథికి ముందే చెప్పి నీ మీదకు ఉసికొల్పవచ్చు. అదేమీ చేయలేదు. కానీ నువ్వు? ఇప్పటిక్కూడా ఏమీ తెలియనట్టు నాటకం ఆడుతున్నావు. అదీ తేడా. అలాంటి అమ్మాయిపై హత్యానేరం మోపాలనే ఆలోచన నీకెలా వచ్చింది నాన్నా? ఇప్పటివరకూ ఎవరికీ తెలియని, ఎవరికీ చెప్పుకోలేనీ ఒక విషయం చెప్తాను విను. ఆ రాత్రి హోటల్లో మమ్మల్ని చూసిన మీసాల్రాజా ఆ రాత్రి ఫోన్ చేశాడు. మరుసటి రోజు తన గెస్ట్–హౌస్ కి రమ్మన్నాడు. రాకపోతే మా ఇద్దరి విషయం నీకు చెప్తా అని బ్లాక్ మెయిల్ చేశాడు" చెపుతూ ఉండగానే దుఃఖం వచ్చింది. వెక్కిళ్ళ మధ్య చెప్పింది. "అందుకే తొందరపడి పెళ్లి చేసుకున్నాను. అలాంటివాడిని నాన్నా నువ్వు రక్షిస్తోంది..! ఎవడో ముఖ్యమంత్రి, వాడికి ఒక తార్పుడుగాడు. వాడి వెనుక ముగ్గురు బ్రోకర్లు. వీళ్ళ చుట్టూ తిరుగుతూ, వాళ్ళు చేసే దౌర్భాగ్యపు పనులకు శిక్ష పడకుండా నీ తెలివితేటలు ఉపయోగిస్తూ, వాళ్ళ మోచేతి నీళ్ళు తాగుతూ ఉన్నావు."

మరో గుక్క తాగాడు చాణుక్య. విషప్రభావం మొదలైంది.

**బర్బరీకుడు తల నరుక్కున్నాక, అతడి ఆఖరి కోరిక తీర్చటం కోసం కృష్ణుడు ఆ తలను ఓ గుట్టపైకి తీసుకెళ్లి యుద్ధం కనిపించే ప్రదేశంలో పెడతాడు. అక్కడినుంచి మొత్తం యుద్ధాన్ని చూస్తాడు బార్బరీకుడు. యుద్ధం ముగిసింది. 'ఈ విజయానికి కారణం నేనంటే నేనే' అని వాదించుకుంటూ విజయగర్వంతో ఉరకలేస్తున్న పాండవుల్ని మార్గమధ్యంలో బర్బరీకుడి దగ్గరకు తీసుకెళ్తాడు. "వత్సా! మొత్తం యుద్ధం చూసింది నువ్వే. ఏ క్షణం ఏం జరిగిందో... ఏం గమనించావో చెప్పు?" అని ప్రశ్నిస్తాడు. "నీకు తెలియనిది ఏముంది కృష్ణా. శత్రునాశనం సంతోషం. స్వపక్ష నాశనం విషాదం. రెండూ మనిషి కొని తెచ్చుకున్నవే. వికటాట్టహాసాలు ఒక వైపు, ఆర్తనాద రోదనలు మరో వైపు. అంతా చూసి నేను తెలుసుకున్న సత్యం ఏమిటంటే, మరణంతో పోల్చుకుంటే ఏదీ సమస్య కాదు. అంతర్ముఖంతో ఆలోచిస్తే ఏదీ ఆనందం కాదు. బంధం లేకపోతే విషాదం లేదు. నా పట్లా, నావాళ్ళ పట్లా, డబ్బు పట్లా, కీర్తి పట్లా, వస్తువు పట్లా నా బంధమే నా దుఃఖకారణం. ఇది తెలుసుకున్నవాడు యోగి" అని సమాధానమిచ్చి, శాపం ముగిసి ఊర్ధ్వలోకాలకు వెళ్లిపోతాడు. ఇదీ మహాభారతంలోని బర్బరీకుడి కథ.**

ఎదురుగా ఉన్న గ్లాసు వైపూ, అందులోని ద్రవం వైపూ నిర్వేదంగా చూశాడు చాణుక్య. తన తల ఇప్పుడు అలాగే నరకబడింది. అవసరం తీరాక కూరలో కరివేపాకు తీసేసినట్టు ఆంజనేయులు తనని తీసేశాడు. మరి తను తెలుసుకున్నది ఏమిటి? బలహీనతలు మనిషిని

ఒక్కసారిగా చంపవు. వైరస్ లాగా నిశ్శబ్దంగా పీల్చి పిప్పి చేస్తాయి. కామం వల్ల కీచకుడు, క్రోధం వల్ల అశ్వత్థామ, మదం వల్ల శిశుపాలుడు, అసూయ వల్ల దుర్యోధనుడు, మోహం వల్ల ధృతరాష్ట్రుడు, వ్యసనం వల్ల ధర్మరాజు నాశనం అయ్యారు. తను మాత్రం 'తన'వల్లే నాశనం అయ్యాడు.

గ్లాసు తీసుకుని మరోగుక్క తాగి టేప్ లో చెప్పటం ప్రారంభించాడు.

ఎల్లమందను ఎలా చంపిందీ, మీసాల్రాజాని దొంగ సాక్ష్యాలతో ఎలా రక్షించిందీ వివరంగా చెప్పి చివరగా మంగళ వాక్యం పలికాడు: "నేను బ్రతికుండి లాభం ఏమిటి అనుకున్నాను. నేను ఇపుడు ఇస్తున్న ఈ మరణ వాంగ్మూలం నా ఇంటిని ఆనందనందనంగా మార్చిన వేదరవళికి స్వాంతమునకు ఏ మాత్రం సాంత్వనము కలిగించినా నా మరణానికో సార్థకత ఉంటుంది. తెలివితేటలు ఉన్నవాడు మంచి వైపు ఉంటాడా? చెడు వైపు ఉంటాడా అనే దానిమీదే సమాజం ఎటువైపు నడుస్తుందన్నది ఆధారపడి ఉంటుంది. ఇదంతా పశ్చాత్తాపం కాదు. పునర్నిర్మాణం. వచ్చే జన్మలోనైనా నన్ను మంచి చాణుక్యుడిలా పుట్టించాలని భగవంతుడిని కోరుకుంటూ ఈ జీవితం ముగిస్తున్నాను".

# ఉపసంహారం :

**ఆసుపత్రి** వరండాలో కూర్చుని ఉంది రవళి. ఆమె గుండె చప్పుడు ఆమెకే వినిపిస్తోంది. లోపల తండ్రికి ఆపరేషన్ జరుగుతోంది. దాదాపు నాలుగు గంటలయింది. ఇంకొంచెం సేపట్లో డాక్టరు బయటకు వస్తారు.

ఏం చెపుతారు?

ఆమె టెన్షన్ భరించలేక పోతోంది.

అదే సమయానికి బయట కలకలం వినిపించింది. సెక్యూరిటీ వెంట రాగా సత్యదేవ్ హడావుడిగా లోపలికి వస్తున్నాడు. ఆమెకెందుకో సంతోషంగా అనిపించింది. అప్పటి వరకూ ఒక్కతే కూర్చోవటం వల్ల వచ్చిన లోన్లీనెస్ దూరమైన భావన.

"థ్యాంక్స్. ఈ సమయంలో నువ్వు రావటం నాకెంతో ధైర్యంగా ఉంది సత్యా" అన్నది.

"మాస్టారు థియేటర్ నుంచి ఆరోగ్యంగా బయటకు వస్తారు. కంగారు పడే అవసరం ఏమాత్రం లేదని డాక్టర్లు చెప్పారు"

"చాణుక్య ఇదే హాస్పిటల్లో ఉన్నాడు తెలుసా?"

"అవునా?"

"చావు బ్రతుకుల మధ్య..."

"మీ నాన్న బయటకి రావటం. ఇతను లోపలికి వెళ్ళటం... మెలోడ్రామా ఎక్కడో లేదు. మన జీవితాల్లోనే ఉంది".

"నిజమే కదా. నాకూ అలానే అనిపిస్తోంది. అన్నట్టు డ్రామా అంటే గుర్తొచ్చింది. మీసాల్రాజా గ్యాంగులో ప్రభు అనేవాడు జైల్లో ఉన్నాడు కదా. వాడి సంగతి ఏమైందో నీకేమైనా తెలుసా?"

"ఇప్పుడు వాడు ఎందుకు గుర్తొచ్చాడు?"

"నలుగుర్లో వాడొక్కడే బ్రతికి ఉన్నాడు"

"అండర్-ట్రయిల్‌గానే ఉన్నాడు. బెయిల్ ఇచ్చేవాడు కూడా లేడు"

ఆమె మౌనం వహించింది.

ముఖ్యమంత్రి ప్రాపకంలో చాణుక్య, చాణుక్య అండ చూసుకుని మీసాల్రాజా, మీసాల్రాజా దన్ను చూసుకుని రౌడీలూ రెచ్చిపోయారు. పునాది కాస్త కదిలేసరికి కోటరీ మొత్తం పేకమేడలా కూలిపోయింది. ప్రస్తుతం బెయిల్ ఇచ్చే నాథుడు కూడా లేడు. బలహీనమైన వ్యక్తిత్వం ఉన్న వారి మధ్య బాంధవ్యాలు ఎంత పెళుసుగా ఉంటాయో, వాపు చూసి బలుపు అనుకునేవారి జీవితాలు చివరికి ఎలా అవుతాయో... ప్రభు, అంజి, గోవిందు, మీసాల్రాజాల జీవితాలే ఉదాహరణ.

తమకు లేని శక్తి మీద నమ్మకమున్నవారు ఏవిధంగా నాశనం అయిపోతారో భారతంలో భీష్ముడు ధర్మరాజుకి చెపుతాడు. హిమాలయ పర్వత శిఖరాగ్రాల మీద ఒక బూరుగు చెట్టు విశాలంగా విస్తరించి ఉంటుంది. దాన్ని చూసి నారదుడు,"వాయుదేవుడి దయ వల్లనే కదా నీ ఉనికి సాధ్యమయింది. నువ్వు సదా అతడికి కృతజ్ఞురాలివై ఉండాలి" అంటాడు. "వాయుదేవుడు నన్నేమి చేయగలడు? ఈ పర్వతాల్నే ఊపేసినా నన్నేమీ చేయలేకపోయాడు" గర్వంగా అంటుంది ఆ చెట్టు. ఆ విషయం వెళ్లి వాయుదేవుడుకి చెపుతాడు కలహభోజనుడు. పవనుడు నవ్వి, "రేపు నే వస్తున్నానని చెప్పు" అని కబురు పంపిస్తాడు. '...నేను దట్టంగా ఉంటేనే కదా అతడు నన్ను నాశనం చేయగలడు' అనుకుని, ఆకుల్ని పూర్తిగా రాల్చేసి, కొమ్మల్ని విరిచేసుకుని మోడుగా నిలబడి "ఇప్పుడేం చేస్తాడో చూద్దాం" అనుకుంటుంది. మరుసటి రోజు వచ్చిన వాయుదేవుడు ఆ చెట్టుని చూసి ఆశ్చర్యపోయి, 'నేను నిన్ను ఎలా చేద్దామని అనుకున్నానో... నేను రాకుండానే అలా అయిపోయావు కదా' అంటాడు.

అవినీతిని నమ్ముకున్నవారి తృప్తి ఇలా గాలికి రాలిపోయే బూరుగదూది లాంటిది కదా. మొన్న ఎవడో ఉద్యోగి పై అవినీతి శాఖ దాడి చేస్తే వందకోట్లు దొరికాయట. ఎందుకంత డబ్బు? ఎందుకంత యావ? ఇంకేమీ సాధించలేని వారికే కదా ఈ తాపత్రయం. ఉన్న భార్యతో సుఖపడలేని రావణుడూ, ఉన్న తిండితో సంతృప్తి పడని బకాసురుడూ, పరాయి రాజ్యాన్ని ఆశించిన దుర్యోధనుడూ ఎక్కడా సుఖపడిన దాఖలాలు లేవు.

ఆమె ఆవిధంగా ఆలోచిస్తూ ఉండగా వాటిని భంగపరుస్తూ "ఇది కాస్త విను" అంటూ జేబులోంచి ఓ కాగితం తీశాడు సత్య. ఆమె ఆమె కంగారు పడింది.

"ప్రేమ లేఖ కాదులే. కంగారు పడకు. నీకో అభినందన పత్రం స్వయంగా వ్రాయాలని రాత్రంతా పుస్తకాలు వెతికాను" అంటూ చదవటానికి ప్రయత్నించాడు.

"నాభి... నాభి..."

ఆమె మొహం చిట్లించి, "అభినందన పత్రంలో బొడ్డు ప్రసక్తి దేనికి? అభినందన బొడ్డుతో మొదలెట్టావా?" అని అడిగింది.

అతడు కంగారుపడి "అది కాదులే... నీ కోసం..." అంటూ తడువుఁ కుంటూ ***"నా... నాభి... నాభిషేకో న సంస్కారః ..."*** అని చదవసాగేడు.

***"...సింహస్య క్రియతే మరుగైః ...*** సింహానికి పట్టాభిషేకం అడవిలో జంతువులన్నీ కలిసి చెయ్యలేదు. తన పరాక్రమం వల్లనే అది మృగరాజైంది. తలమీద కిరీటం పెట్టటానికి జనం అవసరం లేదు. ప్రయత్నిస్తూ పోతే తనంతట అదే వచ్చి తల మీద చేరుతుంది" అని ఆమె పూర్తి చేసింది.

"అవును. అదే నేను చెప్పదల్చుకున్నది" అన్నాడతను. "సమస్య అనే వేడికి పొయ్యిలో ఊక తనలో తానే మగ్గిపోతుంది. అదే వేడిని స్వీకరించి పొనుగకర్ర దివిటీగా మారుతుంది... అని తరువాతి పద్యం. నీకు కరెక్టుగా సరిపోతుందని, రాత్రంతా పుస్తకం వెతికి వ్రాసి తెచ్చాను".

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

అది చూసి, "ఏయ్. ఎందుకంత సెంటిమెంటల్ అవుతున్నావ్" అని అడిగాడు.

"నేను ఫీల్ అయింది నీ పద్యానికి కాదు లేవోయ్. భాష తెలియని భారతాన్ని నాకోసం రాత్రంతా వెతికినందుకు" అంది.

"భారతం అంటే గుర్తొచ్చింది. మీ నాన్నగారి ఆరోగ్యం బాగుపడ్డాక చక్రా ఇండస్ట్రీస్ లో ఉంటావా? భారతం చదువుకోవటానికి ఆదిత్యపురం వెళ్ళిపోతావా?"

"నాన్న డాక్టర్లకి దగ్గరగా ఉంటే మంచిది అంటున్నారు. నాన్నే నిర్ణయం తీసుకోవాలి. అద్సరే గానీ సత్యా... మనస్ఫూర్తి గా చెబుతున్నా. పనులు మానుకుని పరామర్శకి వచ్చినందుకు థ్యాంక్స్" అంది.

అతడు అయోమయంగా "నేను నిన్ను పరామర్శించటానికి రాలేదే" అన్నాడు.

"మరి?" అంది ఆశ్చర్యంగా.

అతడు నవ్వి ఊరుకున్నాడు.

చిరుకోపంతో "చాణుక్యని పరామర్శించటానికి వచ్చావా?" అంది ఉక్రోషంగా.

"నిజం చెప్పాలంటే... మీ నాన్నగారిని స్పృహ రాగానే ఒక ప్రశ్న అడగటానికి వచ్చాను".

అర్థం కాక, "నాన్నగారినా? ఏమిటి?" అని అడిగింది

"మీరూ, మీ చిన్నమ్మాయీ నాతోపాటూ నగరంలో ఉండటానికి ఇష్టమేనా మాస్టారూ? అని అడగటానికి వచ్చాను" అన్నాడు.

ఆమె ఏదో చెప్పబోయి మనసు మార్చుకుని, "అంతా వాళ్ళ ఇష్టమేనా? నా అంగీకారం అవసరం లేదా?" అంది.

"నువ్వు నాన్నకూచివి కదా"

ఆమె రోషంగా ఏదో అనబోతూ ఉంటే తలుపు దగ్గర చప్పుడయింది.

ఆపరేషన్ థియేటర్ నుంచి డాక్టర్ బయటకి వస్తున్నాడు.

అతడి మొహం మీద చిరునవ్వు కదలాడుతోంది.



**NISSABDA VISPHOTANAM**
**Yandamoori Veerendranath**

కిడ్నాపులు, బ్లాక్ మెయిలింగ్, డ్రగ్ ట్రాఫికింగ్, పరువు హత్యలు, బ్యాంకు అప్పులు ఎగ్గొట్టినవారిని విదేశాలకు పంపటం – ఇలా ప్రభుత్వానికి సమాంతరంగా నడిచే ఈ మాఫియా పేరు 'ట్రయాడ్'..! ఇదొక బలమైన కోటరీ. రాజకీయంగా వారి వెనుక చాణుక్యని మించిన మేధావులు ఉన్నారు. రక్తం తాగే రౌడీలున్నారు. నువ్వొక చిన్న స్కూల్ టీచర్‌వి. ఇంత పెద్ద మాఫియాని ఎలా ఎదుర్కొంటావ్? నిన్ను నువ్వు ఎలా రక్షించుకుంటావ్?"

"నన్ను రక్షించుకోవటానికి డాలూ; నేను ఎదుర్కోవటానికి కత్తీ ఉన్నాయండీ."

"కత్తీ, డాలూనా?"

"అవునండీ. ఎదుర్కోవటానికి 'భారతం', రక్షించుకోవటానికి 'భగవద్గీత'"

* * *

A unique story never told before in such an absorbing style.
Yandamuri Veerendranath, a three decade sensation... at his best.

బోల్డెంత సస్పెన్సూ, కాసింత రొమాన్సూ, అక్కడక్కడ పురాణాలూ, కొండకచో ప్రబంధ వర్ణనలూ... భారతంలోని లౌక్యం, భాగవతంలోని ఆర్ద్రం కలగలిపి...

# నిశ్శబ్ద విస్ఫోటనం

Inspired by the book... THE ART OF WAR,